వేదాంతభేరి

జనవరి 2015 రూ. 6/-



జాగరుకులై యుండుడు

పెద్దల యెడల, సద్గురువుల యెడల వినయ విధేయతలు గలిగి యుండుడు. పరప్రాణికి మేలు చేయుడు. ఎవరికిని అపకారము చేయకుడు. సర్వభూత దయ, అహింస, సత్యము మొదలగు ఉదాత్త ధర్మములను కార్యాన్వితమొనర్చుడు. బాహ్యాభ్యంతర శుచిత్వమును అలవాటు చేసుకొనుడు. మిక్కుటమగు ఓర్పు గల్గి ధర్మములన్నిటిని క్రమ క్రమముగ సాధించివేయుడు. అట్లు సాధించనిచో జీవితము నిరుపయోగమై పోవును. కావున జాగరూకులై యుండుడు.

– మహర్షుల ప్రబోధ

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 47 జనవరి 2015 సంచిక : 1

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju at Aruna Graphics Press , Rayaji Street, Nellore-524 001, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 47 జనవరి 2015 సంచిక : 1

విషయ సూచిక

01. ప్రార్థన - 03

02. ఆనందానుభూతియే జీవిత లక్ష్యము
- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 04

03. ఆచరణ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 08

04. భజగోవిందం - శ్రీ చిన్మయానంద స్వాములవారు - 11

05. శ్రీనారాయణ గురుబోధనల ప్రాధాన్యం–డా॥ సముద్రాల లక్ష్మణయ్య- 16

06. పరంపరా ప్రాప్త యోగ దార్శనికులు - స్వామి అమృతానంద - 21

07. జ్ఞానసుధ - సర్వభూషణ శివయోగి - 25

08. కథాత్మక గీతాసూక్తులు - డా ॥ కె. సర్వోత్తమ రావు - 29

09. జ్యోతి రామలింగస్వామి - డా ॥ జె.మునిరత్నం - 32

10. ఆశీస్సులు - అనుగ్రహము - వెల్లండపూరిబాలస్వామిగుప్త - 37

11. వార్తలు - 40

ముఖచిత్రం :

భగవాన్ రమణ మహర్షి

05 -01-2015 శ్రీ రమణ జయన్తి

అట్ట వెనుక చిత్రం : మహాత్మాగాంధీ

30-01-2015 గాంధీవర్ధన్తి

ప్రార్థన

01. ఓం సురగణ పితృయక్షసేవితం
హ్యసుర నిశాచర సిద్ధవందితమ్ ।
వరకనక హుతాశన ప్రభం
ప్రణిపతితో2స్మి హితాయ భాస్కరమ్ ॥
02. వేదిమధ్యే లలితకమలే కర్ణికాయాం రథస్థః ।
సప్తాశ్వోర్కోరుణరుచివపు స్సప్తరజ్జు ర్ద్విబాహుః ॥
03. గోత్రే రమ్యే బహువిధగణేకాశ్యపాఖ్యే ప్రసూతః ॥
కాళింగాఖ్యే విషయజనితః ప్రాఙ్ముఖః పద్మహస్తః ॥
04. పద్మాసనః పద్మకరోద్విబాహుః పద్మజ్యోతి స్సప్తతురంగ వాహః ।
దివాకరో లోకగురుః కిరీటీ మయి ప్రసాదం విదధాతు దేవః ॥

తా ॥ దేవగణము, పితృదేవతలు, యక్షులచేత సేవింపబడుచున్నవాడును, అసురులు, రాత్రించరులు, సిద్ధులచేత నమస్కరింపబడుచున్నవాడును, శ్రేష్ఠమైన బంగారు వన్నెగల వాడును, హుతాశనుని (అగ్నిని) కాన్తివంతి కాన్తిగలవాడును అగు భాస్కరుని (సూర్యుని) లోకహితంకొఱకు ప్రణామం చేయుచున్నాను. ఏడుగుఱ్ఱాల రథంయొక్క వేదిమధ్యలో లలితమైన కమలం యొక్క కర్ణికయందు ఉంటున్నవాడును, ఎరుపు (అరుణ) రంగుగల శరీరం గలవాడును, ఏడు పగ్గాలు చేతబట్టిన వాడును, రెండు బాహువులు చాలా గణాలు గల వాడును, రమ్యమైన కాశ్యపగోత్రంలో పుట్టినవాడును, తూర్పు ముఖం గలవాడును, పద్మాన్ని చేతబట్టిన వాడును, పద్మాసనుడును, ఏడు గుఱ్ఱాలు రథానికి గలవాడును, లోకానికి గురువు, కిరీటం గలవాడగు దివాకరుడు నాయందు (నాపై) ప్రసన్నుడగు గాక !

సంక్రాన్తి శుభాకాంక్షలు

వేదాన్తభేరి పాఠకులకు, చందాదారులకు, పోషకులకు, రచయితలకు, ప్రకటన దాతలకు ప్రపంచములోని సమస్త చరాచరములకు సంక్రాన్తి శుభాకాంక్షలు. పరమేశ్వరుడు అందరికి సుఖశాన్తుల నొసంగుగాక!



ఆనందానుభూతియే జీవిత లక్ష్యము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఆనందమే పరబ్రహ్మము. ఆనందమే జీవుని నిజ స్వరూపము. ఆనందపరిపూర్ణుడగు జీవుడు తన స్వరూపమగు నిత్యానందమును మఱచి దుఃఖించుట హాస్యాస్పదమే యగును. భ్రాంతివలననే అట్టి వైపరీత్యము సంభవించినది. కావున సద్గురూపదేశముచే తిరిగి తన యథార్థ స్వరూపమును గుర్తెఱింగి, అట్టి అవిచ్ఛిన్న బ్రహ్మానందమునందే స్థితిగలిగి 'చిదానందరూపః శివో2హం శివో2హమ్ ' అని ఎలుగెత్తి చాటుచు పవిత్రమగు మానవ జీవితమును సార్థకము చేసికొనవలెను. అట్టి మహోన్నత **ఆనందానుభూతియే జీవితలక్ష్యము** .

ప్రతివారును తమధ్యేయము అట్టి అవిచ్ఛిన్న. అక్షయ బ్రహ్మానందమేయని బాగుగ తెలిసికొని, అద్దాని ప్రాప్తికొఱకై అనవరత కృషి సలుపవలయును. ఆ యానందము నశించునది కాదు. తొలగిపోవునది కాదు. తొలగింపబడుటకు వీలు లేనిది. అది సర్వులయొక్క నిజస్వరూపము. అందఱియొక్క ఆత్మయే ఆ ఆనందము. అది అవిచ్ఛిన్నమైనది. త్రెంపులేనిది. అవ్యయమైనది.

వినాశ మవ్యయస్యాస్య న కశ్చిత్కర్తుమర్హతి.

అని గీతాచార్యుడు పేర్కొనిన చందమున ఆ ఆనందమునకు నాశము లేదు. అద్దాని వినాశనమును ఎవరును చేయలేరు. తెలిసియో, తెలియకనో సర్వజీవులును ఆ ఆనందమునే అపేక్షించుచున్నవి. అట్టిఆనందోన్ముఖముగనే ప్రయాణము సల్పుచున్నవి. కాని తమ తమ హృదయాంతరాళమున వెలుగుచున్న ఆత్మ ఘనీభూతమైన ఆనంద స్వరూపమని తెలియక, ఆనంద

మహాసాగరమని యెరుంగక చిన్న చిన్న అల్ప సుఖములకొఱకై, విషయానందముకొఱకై బయట అఱ్ఱులు చాచుచున్నారు.

యస్త్వాత్మసుఖ ముత్సృజ్య సుఖం బాహ్య మపేక్షతే
కరస్థం పాయసం త్యక్త్వా మూఢో లేఢి కూర్పరం.

'ఏవరు ఆత్మసుఖమును వదలి బాహ్య మందలి విషయ సుఖమును అపేక్షించుచున్నాడో అట్టివాడు అరచేతియందున్న పాయసమును వదలివైచి మోచేతిమీదుగా కారిన ఒకింత పాయసలేశమును నాకువాడే యగును'అని శ్రీ శంకరభగవత్పాదులు మహావాక్యదర్పణమునందు సెలవిచ్చి యున్నారు.

ఆనందమును అపేక్షింపనివాడెవడును ఈ ప్రపంచమున లేడు. పిపిలీకాది బ్రహ్మ పర్యంతము ప్రతిప్రాణియు ఆనందమునే వాంఛించు చున్నది. తన స్వరూపము ఆనందము. కాబట్టియే అట్టి వాంఛ సర్వజీవులకును కలుగుచున్నది. పోగొట్టుకొనిన తన ఆనందానుభూతిని తిరిగి సంపాదింపవలెనని ప్రతి ప్రాణియు ఉబలాటపడుచున్నది. మరచిన తన స్వరూపమును ఏనాటికైనను తిరిగి పొందవలెనని అభిలాష గలిగి యుండు చున్నది. ప్రాణికోట్లయొక్క ఆనందాన్వేషణమునకు కారణ మిదియే అయియున్నది.

పరిపూర్ణ సుఖము బయట వస్తువులందు లేదు. ఆత్మయందు కలదు. కనుకనే సమాధి స్థితియందు జీవుడు బాహ్య పదార్థములన్నిటిని వదలివైచి తనలో అవిచ్ఛిన్న సుఖానుభూతిని బడయుచున్నాడు. ధ్యాననిష్ఠయందు నిలుకడ కలిగినవాడు తన ఆత్మయందు పొందు సుఖము చెప్పనలవి కాదు. అద్దానిని మహాత్ములు వర్ణింపజాలరైరి. అది అనుభవైక వేద్యమగు సుఖము.

వాచా వక్తుమశక్యమేవ మనసా మన్తుం న వా శక్యతే
స్వానన్దామృత పూరపూరిత పరబ్రహ్మాంబుధేర్వైభవమ్

అంభోరాశి విశీర్ణవార్షికశిలాభావం భజన్మేమనో
యస్యాంశాంశలవే విలీన మధునా 22 నన్దాత్మనానిర్వృతమ్.

'వాక్కుచేత చెప్పుటకుగాని, మనస్సుచేత తలంచుటకుగాని వీలుపడనిది ఆ ఆత్మానందానుభూతి. ఆ ఆనందము అవధులు లేని సముద్రము వంటిది. మనస్సను వడగండ్ల వంటిది. అది ఆత్మయను సముద్రములో పడి విలీనమై ఆత్మాకారమై పఱగుచు మహదానంద మనుభవించుచున్నది.'అని శ్రీ శంకర భగవత్పాదులు వివేకచూడామణి యందు ఆత్మసుఖమును గూర్చి వర్ణించియున్నారు. సామాన్యమైన నిద్రలోనే మనుజుడు గొప్ప సుఖమును బడయుచున్నపుడు ఇక సమాధి స్థితియందు వేరుగ చెప్పవలయునా ? నిద్రయందు మనస్సు లయించినను అది జడస్థితి, తమోమయస్థితి. కాబట్టి అది అంతగొప్పస్థితి కాదు. పశువులుకూడ నిద్రపోవుచున్నవి కదా. మేలుకొని మనస్సును లయింపజేయవలెను. అదియే మహోన్నత సమాధిస్థితి. అదియే ఆత్మస్థితి. బహుకాల ప్రయత్నము చేతను, సాధనాభ్యాసముచేతను, వైరాగ్యభావనచేతను అట్టి తురీయస్థితి తప్పక చేకూరగలదు.

అది గొప్ప మహిమాన్విత స్థితి కాబట్టియే శ్రీ కృష్ణపరమాత్మ అద్దానిని పరమలాభమని గీతలో వర్ణించెను.

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః
యస్మింస్థితో న దుఃఖేన గురుణా2పి విచాల్యతే

'దేనిని పొందినచో అన్నిటికంటే గొప్ప లాభమును పొందినట్లగునో, దేనియందు నిలుకడ కలిగియున్నచో ఎట్టి భయంకర దుఃఖమున్ను చలింపజేయజాలదో అదియే ఆత్మస్థితి '. కావున విజ్ఞుడు అట్టి ఆత్మస్థితి కొఱకై ఇతోధికముగ యత్నమును సలుపవలయును.

ఒకింత విషయసుఖముకొఱకై దూరదూరముగ పోయి అవస్థలు పడుటకంటే నశ్వరములగు దృశ్యవిషయము లెపుడు లభించునాయని దేబరించుటకంటె తనకు అతిసమీపమున నున్నదై, తన స్వరూపమే అయి వెలయుచున్నట్టి పరిపూర్ణ ఆత్మసుఖముకొఱకై ఏల అన్వేషించరాదు ? చేతిలోనున్న పండును వదలి నీటిలో ప్రతిబింబించిన పండుకై ఆశించుట విజ్ఞత యగునా ?

బాహ్యవస్తువులు ఒకింత సుఖమును కలుగజేసినను, మరల కొంతకాలమునకు దుఃఖదాయకములై పరిణమించును. విషయ సుఖము దుఃఖమునుగూడ తనవెంట గొనివచ్చుచుండును. అది దుఃఖమిశ్రితమైన సుఖమనియే చెప్పవలసి యుండును. పైగా అది పరిచ్ఛిన్నమైనది. మొదలు, తుది కలిగియున్నది. తెలివి కలవారు అద్దానిని ఆశింపరని భగవానులు నుడివి యున్నారు.

విజ్ఞుడగువాడు త్రెంపులేని ఆనందమునే ఆపేక్షింపవలెను. అవిచ్ఛిన్నమగు ఆనందమునే కాంక్షించవలెను. అట్టి అంతులేని ఆనందము ఆత్మయందే కలదు. దృశ్యవిషయములందు లేదు. అందువలన ముముక్షువగువాడు ఇంద్రియార్థముల యెడల విరాగము గలిగి అంతర్ముఖుడై, ఆనందసాగరమగు ఆత్మయొక్క దరికి జేరి, అందు నిమగ్నుడై, పరమానంద మనుభవించుచు జీవితమును చరితార్థము చేసికొనవలెను.

పాశబద్ధుడు, జీవుడు, పాశముక్తుడు శివుడు

అష్టపాశాలు "ఘృణా, లజ్జా, భయం చింతా జుగుప్సా చేతి పంచమీ, కులం, శీలంచ మానంచ అష్టపాశాః ప్రకీర్తితాః " (కాళీతంత్రం) రోత, లజ్జ (సిగ్గు), భయము, చింత, జుగుప్స (అవమానము), కులము, శీలము, మానము అను ఎనిమిది పాశములు.

ఆచరణ

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ఆచారాద్విచ్యుతో విప్రో న వేదఫలమశ్నుతే ।

ఆచారేణ తు సంయుక్తస్సంపూర్ణఫలభాగ్భవేత్ ॥

వేదాధ్యయన తత్పరుడై యుండినను **ఆచరణయందు** జాగ్రత్త లేకపోయిన (ఆచరణ లేనివాడు) వేదాధ్యయన తపస్సుల ఫలము ననుభవింపజాలడు. ఆచరణయందు జాగ్రత్తగలవాడు తపస్స్వాధ్యాయేశ్వర ప్రణిధానములకు ఎంతఫలము శాస్త్రములో చెప్పబడి యున్నదో దానిని తప్పక పొందగల్గును. కావున మనకు ఇప్పుడు కావలసినది ఆచరణపరులే. మఱియు భారతదేశము స్వాతన్త్ర్యముతో నుండి నప్పుడు బ్రహ్మనిష్ఠులు ఎక్కువమంది యుండిరనియు, అట్టికాలమున విదేశములకుగూడ ధర్మోపదేశము ఈ భారతదేశమే చేయుచుండినటుల చరిత్ర మనకు సాక్ష్యమునిచ్చుచున్నది. దేశము అస్వాతన్త్ర్య దీనస్థితికి వచ్చినప్పటినుండియే బ్రహ్మవిద్య పతనమైనదనికూడ చెప్పు చుందురు. దైవకృప చేతను, మహాఋషుల కరుణచేతను మనకు స్వరాజ్యము వచ్చినందుచే ఇక ఆ ప్రతిబంధముకూడ లేదు. కావున పూర్వపు మన వేదకాలము ననుసరించి స్వాత్మరాజ్యమును పొందుటలో జనులు ప్రవర్తించవలయును. ఈ విషయములలో ముముక్షువులు, బ్రహ్మనిష్ఠులు, సాధువులు, సన్న్యాసులు, భక్తులు ముఖ్యముగా ప్రవర్తించవలయును. స్వరాజ్యముతో కూడా ఆత్మరాజ్యము కూడ గలుగునప్పుడే వేదకాలమున వలె భారతరాజ్యము శోభించగల్గును. అట్లుగానిచో దృఢమైన ఇంజన్ మాత్రము లభించి అది సరిగా నడుపుటకు సరియైన స్టీము లోపల లేనట్లే స్వరాజ్యము ఉండునని మరువకూడదు. లేనిచో ఒంటికన్ను, ఒంటిచెవి, ఒంటిచేయి, ఒంటికాలు

గలవానివలెనె మనముండగలము.

అయితే వేదకాలమున కొన్ని వర్గములకు మాత్రమే బ్రహ్మవిద్యయందు అర్హత గల్గియున్నట్లు కొందఱు తలంచవచ్చును. అది ఈ మధ్యకాలమున ఏర్పడినదే కాని వేదకాల మందుండలేదు. ఏలననగా స్త్రీలలో బ్రహ్మచారిణి యగు గార్గియు, సన్న్యాసినియగు సులభయు, బ్రహ్మవాదినియగు మైత్రేయియు సాక్ష్యములు. ఆలాగున గృహస్థాశ్రమములో నుండిన చూడాల, మదాలస మొదలగువారే తార్కాణము. ఆలాగున వసిష్ఠ విశ్వామిత్ర తులాధార సూతాది మహాఋషులున్ను తార్కాణము.

ఇక ఈ జనులయొక్క యోగ్యత ననుసరించియే అన్ని విషయముల లోను అర్హత యేర్పడును. నిజముగా అదే సత్యయుగ మగును. ఇప్పుడు రాజకీయములో ఏలాగున వారి వారి యోగ్యత ననుసరించి అన్నిటిలోను అందఱికిని ప్రవేశ మేర్పడుచున్నదో, ఆలాగున ఆధ్యాత్మికవిద్యలోను నుండును. అయితే ఎవరెవరు దేనికి అర్హులో దానికి తగిన యోగ్యతనున్ను అందఱు సంపాదించుకొనవలయును. సోమరులు ఏ కాలమందును ఉన్నతస్థితిలోనికి రాజాలరు. అలాగున వాచావేదాంతులును బ్రహ్మపదమును పొందియుండ లేదు. ఉండుట లేదు. ఉండబోరు. ఇది మాత్రము జ్ఞాపకములో నుంచ దగియున్నది.

చిత్రామృతం నామృతమేవ విద్ధి చిత్రానలం నానలమేవ విద్ధి।
చిత్రాంగనా నూనమనంగనేతి వాచావివేకస్త్వవివేక ఏవ ॥

చిత్రములో కనిపించెడు అమృతము ఎట్లు అమృతము గాదో, జరానెరలను నివృత్తి చేయజాలదో, చిత్తరువులో చిత్రించిన అగ్నిజ్వాల యేలాగున అగ్ని కానేరదో, దేనిని దహింపజాలదో, చిత్తరువులో కనిపించెడు అంగనామణియు యథార్థముగా నేలాగున నారీమణి కాదో, సంసారము చేయజాలదో ఆలాగున వాచావివేకముతో చెప్పెడు వేదాంతవాక్యమున్ను అజ్ఞానమును పోగొట్టజాలదు. అది వివేకము కాదు. అవివేకమే యగును.

ఆచారాల్లభతే హ్యాయురాచారాదీప్సితాః ప్రజాః ।
ఆచారాద్ధనమక్షయ్యమాచారో హ్యంత్యలక్షణమ్ ॥

మంచి ఆచరణవలననే దీర్ఘాయుస్సు గల్గును. ఆచరణవల్లనే జనులు తమ యభీష్టమును పొందగలరు. ఆచరణవల్లనే అక్షయమగు ధనము చేకూరును. కట్టకడకు ఆచరణ యొక్కటియే మానవుని యుత్తమ లక్షణ మగును.

ఫలం కతకవృక్షస్య యద్యప్యంబుప్రసాదకమ్ ।
న నామగ్రహణాదేవ తస్య వారి ప్రసీదతి ॥

కతకరేణువు పంకిలజలమును శుద్ధపరచుశక్తి గల్గియుండినను, అట్టి చిల్లగింజ నూరిన గంధమును జలభాండములో కలపక మట్టినీటికుండ దగ్గఱ నుంచి చిల్లగింజపేరును మాత్రము చెప్పుచుండిన ఆ నీరేలాగున నిర్మలము గాదో ఆలాగున, ఆచరణము లేని వేదాంతము యొక్క స్థితియని గూడ విజ్ఞులు తెలిసికొనవలయును.

వీరు ఆశ్రమ శివాలయ నిర్మాణానికి పైకం పంపినారు

(01).	శ్రీ.ఎల్.పి.నరసింహులురెడ్డి (షెనాయ్‌నగర్, చైన్నె)	రూ.100001/-
(02).	ఎ.వసంతమ్మ (కీల్పాక్,చెన్నై)	రూ.30,000/-
(03).	పేట.కాత్యాయనమ్మ (రాచకండ్రిగ)	రూ.20,000/-
(04).	ఎల్.సౌందర్యమ్మ (రామారెడ్డిపాళెం,మీంజూరు)	రూ.11,000/-
(05).	శ్రీ గెల్లి చంద్రశేఖర్ గుప్త (అడ్వకేట్, హైద్రాబాద్)	రూ. 10001/-
(06).	పి.లక్ష్మణమూర్తి (విశాఖపట్నం)	రూ.10,116/-
(07).	వి.శ్రీహరి (హైద్రాబాద్)	రూ.10,116/-



భజగోవిందం

వ్యాఖ్యానం - శ్రీ చిన్మయానంద స్వాములవారు
అనువాదం - కామరాజుగడ్డ రామచంద్రరావు

శ్లో ॥ సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తిః ॥
భజగోవిందం భజగోవిందం, గోవిందం భజమూఢమతే ॥

మంచివాళ్ళ సాంగత్యంద్వారా అసంగత్వం అలవాటవుతుంది. అసంగత్వము వల్ల మోహభ్రాంతి అనేది రాదు. దానినుండి విముక్తులవుతాము. మోహం ఎప్పుడయితే దూరమయిందో సత్యపదార్థ దృష్టి నిలుస్తుంది. ఆ దృష్ట్యా అనుభవం గడించినపుడు ఈ జీవితంలోనే ముక్తి లభిస్తుంది.

ముందు చెప్పిన శ్లోకాలను బట్టి ఒక విషయం విదితమయింది. ప్రపంచంలో బ్రతకటానికిగాను సంపాదించటం, కూడ బెట్టడం మాత్రమే లక్ష్యంకాదు. అది నిజమైన హితమే కాదు రాగమనేదాన్ని పెంచుకోవటం మమత్వాన్ని వృద్ధిపరచుకోవటం అనేవి కించిన్మాత్ర ఫలితం కోసం వేసిన జీవిత కార్యక్రమం మాత్రమే. జీవితాన్ని మోహ విభ్రాంతిలో రసోన్మాదంలో వెచ్చించుట మనకున్న యోగ్యతలనన్నిటిని వ్యర్థంగా బూడిదలో పోయటమె. అందుకనె ఆదోవల్లో మనకు నడవకుండా ప్రతిపక్ష భావన ద్వారా మనసును వాటినుంచి వెనక్కు మళ్ళించాలి. అలా చేస్తే శక్తి ఖర్చుకాక కూడబెట్ట బడుతుంది. ఆ కూడబెట్టబడ్డ శక్తిని గోవిందుని అన్వేషణంలో - అతడి

సేవనంలో వినియోగించాలి.

వేదాంతం చెప్పే ఈ తర్కం తెలిసికోవటం తేలికయినదె కాని దాని ప్రకారం నడవడమనేది అన్ని వేళలా సాధ్యమయేదికాదు. అది చెప్పిన విధంగా జీవితాన్ని నడపాలంటే క్రొత్తగా ఆరంభించిన సాధకుడికి ఎంతో కష్టమవుతుంది. ఈ చిక్కు ఏ కాలంలోగాని విద్యార్థులకు అడ్డుతగిలి చికాకు పెట్టడం మానలేదు. ఈ చిన్న వాస్తవం ప్రతి వేదాంతీ కూడ ఒప్పుకు తీరాలి. అందుకనె అతడు తన శిష్యులకు ఈ దోవను నడిచే ఉపాయం యేదో వెతికిచూసి మరీ చెప్పాలి. నిజానికి శిష్యుడి మనసులోనున్న ఆధ్యాత్మిక బలమే చాలకొద్దీ, అతడికి అడ్డంకుల నుంచి తప్పుకొని దోవనడవటంలో సహాయం ఇవ్వటం చాలా అవసరం.

అలా కాకపోయినట్లయితే వేదాంతము అనేది ఆచరణయోగ్యము కానట్టి అరణ్య వాసమయిపోయేది. శ్రీ శంకరులు ఎప్పుడు యేది చెప్పినా సాధకులకు ముఖాముఖీ వ్యక్తం చేసి చెప్పారు. ఆయన బోధనాపద్ధతి పూర్వపు ఋషులపద్ధతి వంటిది కాదు. పూర్వులు అసంభవమనుకొనదగినట్టి అనంతానందాన్ని సంభవం చేసికొని దానిచేత ఉత్తేజితుడై కండ్లు మూసికొని కూర్చొని తాము ధ్యానంలో దర్శించిన సత్యాన్ని గూర్చి ప్రపంచానికంతటికీ వినగలిగిన ఉచ్చ స్వరంతో గుంభనతోకూడుకొన్న కొన్నిమాటలు వినిపించేవారు. ఆ సూత్ర మూలాన్ని పరిపాలించకపోతే కలిగే దుఃఖమును ఆదేశిస్తూ కటువుగా బోధలు వినపడేవి. ఈ మాటలే శాంతియుతులైన బోధకుల హృదయకమలాల్లోంచి వెడలినవై ఉపనిషత్తులయినాయి. శ్రీ శంకరులు దేశంలో సాంస్కృతిక పునరుద్ధరణం నెలకొల్పటానికి సన్నద్ధుడైన మత ప్రచారకులు. ఆ ప్రకారముగనే తన శిష్యులు యెంతటి యెలాంటి గ్రహణ శక్తి కలిగి వున్నవారో ఆయన యేనాడూ కూడ మరిచినట్లు కనిపించదు.

ఈ శ్లోకంలో శ్రీ శంకరులు సాధకులకు ఒక నిచ్చెనవంటి మెట్ల మార్గాన్ని ప్రసాదించారు. అదే వారిని అభివృద్ధికి తీసుకొని పోగలుగుతుంది. పరిపూర్ణత అనే దాని అత్యంత మహోన్నత శిఖరాల నందేవరకూ ఈ నిచ్చెన ఎంతో సహాయకారిగా సాధకునికి పనిచేస్తుంది.

వేదాంతానికి ఆదరణగా నున్న వెనుక చర్చించిన ప్రాతిపదికను అర్థం చేసికొన్నప్పటికి, క్షణక్షణమూ మనం జీవితంలోని మనోవికార హేతువుల మధ్య – కామినీ కాంచనాల కుహనాకర్షణముల కూడలిలో బ్రతుకుతున్నామన్నది వాస్తవమైన విషయము. నాకున్న రసోన్మాద భావనలకు నాకున్న మోహపూర్ణమైన ఆలోచనలకు కళాత్మకంగా కొన్ని అడ్డుగోడలను జ్ఞానయుతం చేసి కట్టుకొంటానేమోగాక, అలా గోడలుకట్టి వాటి మామూలు ప్రవాహాన్ని కొంతకాలం ఆపుతానేమోగాక, కాని మరులు కొల్పే వస్తుసముదాయం మన చుట్టూరా అనంతమై వుండుటవలన కలిగే భ్రమ మహాబలవత్తరమైన దవటం వల్లనూ సాధకుడు వాటికి వ్యతిరేకంగా నిలిచి నిరంతరం వాటిని ఆపగలగటం అతడికి చేతకాని పని అనిపిస్తుంది.

సాధకుడు మొదటి రోజుల్లో ఎంతో కష్టపడి ఆధ్యాత్మ సంబంధమైన ఉన్నతికి ప్రయత్నాలు చేస్తూవుంటాడు. అతడికి మద్దతుగా కొంత ధైర్యం తగిన శక్తి యివ్వటానికిగాను శ్రీ శంకరులు ఒక మార్గం సూచించారు. అది సత్సంగము – అనగా మంచితో సంబంధమని అర్థము. ప్రతిపక్ష భావనను ఆచరించి మనస్సులో మంచి ఆలోచనలను పెంపొందించు కొంటూనే వుంటాడతడు. ఇవెందుకంటె లోనుంచి పెల్లుబికే ఉద్రేకాలను అణచుకోటానికి ఉపయోగపడుతవి. కాని బాహ్య ప్రపంచంనుంచి కొన్ని ప్రేరణలు వచ్చిపడతవి. వాటినుంచి తనను కాపాడుకోవటానికి ఒక కోట కట్టుకోవాల్సి వుంటుంది. ఆకోటే శ్రీ శంకరులు చెప్పే సత్ సాంగత్యము. మంచివారితో స్నేహము సదాలోచనలు చేసే వారితో స్నేహము. సజీవులైన గురువులతో విద్వతులతో, సభ్యత కలిగిన వారితో మన స్ఫూర్తిగా సత్

పదార్థాన్ని అన్వేషించే సాధకులతో సహవాసం చెయ్యాలి. ఇవేవీ కుదరని సమయంలో మంచి పుస్తకాల ద్వారా సత్ పదార్థ విషయంతో పరిచయం వుంచుకోవటం చెయ్యాలి.

మనం మనచుట్టూ చేర్చిన సాంగత్యం చాలా ముఖ్యమైనది. ప్రపంచములో సాధకులు తమ స్నేహితులను యెంచుకోవటంలో చాలా అజాగ్రత్తను కలిగి వుంటున్నారు. దాని ఫలితం ఆ సాధకుడికి కొంత విషయ పరిజ్ఞానం నిశ్చయాత్మకమైన మనసూ వుండి కూడా దుస్సాంగత్య దోషం వల్లనూ గుడ్డిగా పాటించే రసోద్రేకాలవల్లనూ అతడికున్న జ్ఞానం కాస్తా లాగివేయబడగా చెడిపోతున్నాడు. మంచి వారితో స్నేహం అంటే అర్థమేమిటంటే పరమేశ్వరుని భక్తులెవరో వారితోనూ పరమేశ్వరుని అన్వేషించే సాధకులతోనూ స్నేహమని అర్థం, అలాంటి సంఘంలో ఒకానొక శక్తి ఉద్భవిస్తుంది. ఆ సమావేశం వల్ల ఆ శక్తి ఒక బలవత్తరమైన కోట నిర్మిస్తుంది. అదే ఈ బాహ్య ప్రపంచములోని మాంత్రికమైన తమాషాలనే – వీటినుంచి నిన్ను రక్షించేది.

ఈ సత్సాంగత్యమనే దాని ఫలితంగా మనుష్యుని మనస్సు క్రమంగా ఒక స్థితిని సంతరించుకొంటుంది. ఇంద్రియ విషయాల ఆకర్షణలో పడకుండావుండే స్థితి అది. ఆ స్థితిలో తన కొఱకు కాని పనులు మాత్రమే కర్తవ్యంగా చేస్తాడు. దానివలన అసంగత్వమనే దాని రహస్యం మనస్సుకు అర్థమవుతుంది. దీన్నే నిస్సంగత్వమనేది. ఈనిస్సంగత్వమనేది హృదయాంతరాళాలలో సుస్థిరమై నిలిచే పరిస్థితిలో మోహమనేది హృదయం నుంచి విసర్జింపబడుతుంది. అనగా మనం రంగుటద్దాల్లోంచి చూచి వస్తువులకు అబద్దపు విలువలుగట్టి వాటిని ప్రేమించటం ద్వేషించటమనే విభ్రాంతి నుంచి బయటపడతామని అర్థం. ఇదే నిర్మోహత్వమనేస్థితి.

ఈ నిర్మోహత్వ స్థితిలో వస్తువులను యథాతథంగా చూసి అర్థం

చేసికోగలం. ఎందుకంటే వాసనలనే రంగు అద్దాలు మనసుకు లేవు కదా! వస్తువులకు మెరుగులవల్ల కలిగిన విలువలు మనసు కెక్కవు, వాటి నిజమైన సత్యమైన పరిణామం పరిస్థితి మనసుకు వాస్తవంగా అర్థమయే సూచన కలుగుతుంది. అదే ఆయచ్యుతుని తెలిసికోవటానికిచ్చే సూచన. ఈ సూచన అలా నిలిచి మనోబుద్ధిచిత్తాహంకారాల్లో కూడ అలా నిలిచిపోతే, సుస్థిరమైతే, భగవంతుని మనం చూచిన వాళ్ళమే అవుతాము. కాదు – గుర్తించిన వాళ్ళమే అవుతాము, ఎక్కడ గుర్తించటం ? మనం దేన్ని సమ్యగ్విధాన చూస్తున్నామో దానిలోనల్లో భగవంతుడిని గుర్తించిన వాళ్ళమవుతాము. అది జీవన్ముక్త స్థితి. ఈ శ్లోకంలో ఉత్కృష్ట స్థితికి ఎక్కటానికిగాను చెప్పబడ్డ ఈ నిచ్చెన గీతలో చెప్పబడ్డ మరోరకమైన నిచ్చెనను జ్ఞాపకానికి తెస్తుంది. అది పతనాని కయినట్టి దిగేందుకయిన నిచ్చెన “సంగాత్ సంజాయతే కామః –కామాత్క్రోధోభిజాయితే క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి.......

ఈ రెండు శ్లోకాలనూ చూస్తే గీత పతనమయేందుకయిన నిచ్చెనను వర్ణించగా శ్రీ శంకరులు పైకి ఎక్కేటందుకయిన నిచ్చెనను వర్ణించినారని తెలుస్తుంది. ఈ శ్లోకంలో “నిశ్చలతత్వం ” అనే పదానికి బదులు “ నిశ్చలత్త్వం” అనే పదంతో అర్థం చెప్పుకోవటం కూడా కద్దు. మనసులోని భ్రాంతి ఎప్పుడయితే పోయిందో మనసు ధ్యానంలో ఏకాగ్రతనిస్తుంది. ఈ ఏకాగ్రతతోనే ఆ మహోన్నత పదార్థాన్ని మనం అనుభూతిలోకి తెచ్చుకోగలం. ఆ తరువాత జీవన్ముక్త స్థితిని పొందగలుగుతాము.

(చిన్మయ మిషన్ సౌజన్యంతో)

1.కృష్ణ తులసి – వైరల్ ఫీవర్‌ని (కృమి జ్వరాలు) నివారిస్తుంది.
2. లక్ష్మీతులసి – దీని వాసనకు దోమలు దరిజేరవు.
3. రామతులసి – కడుపులోని నులిపురుగులను సంహరిస్తుంది.

శ్రీనారాయణ గురుబోధనల ప్రాధాన్యం

– మహామహోపాధ్యాయ
– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

ఓం బ్రహ్మణే మూర్తిమతే శ్రుతానాం శుద్ధిహేతవే ।
నారాయణయతీన్ద్రాయ తస్మై శ్రీగురవే నమః ॥
శ్రీనారాయణగుర్వాద్యాం శివలింగార్యమధ్యమామ్ ।
అనంగానందపర్యంతాం వందే గురుపరంపరామ్ ॥

భారతావని కర్మభూమిగా, పుణ్యభూమిగా, ఆర్షభూమిగా, వేద భూమిగా ప్రసిద్ధ వహించింది. మంత్రద్రష్టలైన పరమర్షులు పూర్వం ఎందరో ఈ పవిత్రభూమిపై వర్ధిల్లారు. ఆ ఋషిపరంపర పూర్వయుగాలతోనే సమాప్త మయిందని భావించరాదు. నేటి యుగంలో గూడా నాటి మహర్షులను పోలిన మహానుభావులనేకులు జన్మించారు.

తీర్ణాః స్వయం భీమభవార్ణవం జనాన్ అహేతునా 2 న్యానపి తారయన్తః॥

అని శంకరభగవత్పాదు లన్నట్లు వారు తాము భవసాగరం తరించి అవ్యాజమైన కృపతో ఇతరులను గూడా తరింపజేశారు. బుద్ధుడు, బసవేశ్వరుడు, శ్రీరామకృష్ణపరమహంస, స్వామివివేకానంద మున్నగు వారు ఈయుగానికి చెందినవారే. అట్టి మహనీయులలో అగ్రశ్రేణికి చెందినవారు శ్రీ నారాయణ గురుస్వాములు.

‘ జయంతీ నామ సా ప్రోక్తా జయత్యశుభమిత్యసౌ ’అన్నట్లు మహనీయుల జయంత్యుత్సవాలు అశుభాలను తొలగిస్తాయి. శ్రీ నారాయణగురువువంటి మహామహనీయుల జయంతులు అశుభాలను తొలగించటంతోపాటు శుభపరంపరను గూడా చేకూరుస్తాయి.

పరివర్తిని సంసారే మృతః కో వా న జాయతే ।
స జాతో యేన జాతేన యాతి వంశః సమున్నతిమ్ ॥

నిరంతరం మార్పు జెందే సృష్టిలో మరణించినవాడెవడు మరల జన్మించడం లేదు ? కాని అందరి జన్మలూ జన్మలు కావు. ఏ మహితాత్ముని జన్మవల్ల మానవజాతికి చెందినవారందరూ సమున్నతిని పొందుతారో, అట్టివాడే నిజంగా జన్మించినవాడు. అట్టి జన్మతో లోకాన్ని పావనం కావించిన శ్రీ నారాయణ గురుస్వామి జయంత్యుత్సవాలు జయప్రదములగు గాక !

భగవంతుడు వైకుంఠంలో హాయిగా శ్రీదేవిసమేతుడై కాలం గడపవచ్చు. కాని అలా గడపక భూలోకంలో అనేకావతారా లెత్తి శ్రమపడడ మెందుకు ? ఆ దేవుడే చెప్పినట్లు ధర్మసంస్థాపన కొరకే ఆయన అలా చేస్తున్నాడు. ధర్మరక్షణ ఒక్క భగవంతుని కర్తవ్యం మాత్రమే కాదు. భగవదంశతో లోకంలో అవతరించిన మహాపురుషుల కర్తవ్యం గూడా అదే. అట్టి కర్తవ్యాన్ని త్రికరణశుద్ధిగా నిర్వహించి ఇతరులకు బోధించి తన జీవితకాలంలోనే ఆ కృషి ఫలప్రదం కావడం చూచి ఆనందించిన లోకోత్తరచరిత్రుడు శ్రీనారాయణగురుస్వామి.

‘ యల్లాభాన్నాపరో లాభః ’ అన్నట్లు ఆత్మ లబ్ధి పొందిన మహనీయులు మరొక లాభాన్ని ఆపేక్షించవలసిన పని లేదు. అయినా సోదర మానవసముద్ధరణకై పాటుపడడం తమ కర్తవ్యంగా మహాత్ములు భావిస్తారు. తన డెబ్భైమూడేండ్ల జీవితాన్ని అలా సద్వినియోగం చేసిన పూతాత్ములు శ్రీనారాయణగురుదేవులు.

ఒకసారి జీవన్ముక్తులైన ఋషులు కొందరు కైలాసానికి వెళ్ళి శివుని దర్శించారు. తాము తపోధ్యానాదులాచరించి జీవన్ముక్తుల మయ్యామని చెప్పారు. ఇక శేషించిన జీవితకాలంలో తమకేదైనా కర్తవ్యమున్నదా ?

అని ఆ దేవుణ్ణి ప్రశ్నించారు. అందుకు శివుడు చిరునవ్వు నవ్వి “ ఇంకనే మీకు కర్తవ్యం అధికంగా ఉన్నది. మీరు ఏ అనుష్ఠానంతో జీవన్ముక్తస్థితిని పొందారో, ఆ అనుష్ఠానాన్ని జనులందరికీ బోధించండి ! వారిని గూడా తరింపజేయండి ! అదే మీ ముఖ్య కర్తవ్య ” మని చెప్పాడట !

కారణజన్ములు తమముక్తితో తృప్తి చెందరు. ‘ సర్వే 2 త్ర సుఖినః సన్తు ’ అన్నట్లు భౌతికంగానూ, ఆధ్యాతికంగానూ లోకంలోని జనులందరూ ఉన్నతిని సాధించాలని భావించి అందుకై పాటుపడతారు. అలా శ్రమించిన వారిలో నేటియుగంలో అగ్రతాంబూలాని కర్హులు శ్రీనారాయణ గురుదేవులే.

మన మొకచోట నివసించాలనుకొంటే అక్కడి పరిసరాలు శుభ్రంగా ఉన్నవో లేవో చూచుకొంటాం. అట్లే లోకంలో జన్మించిన ఒక మహాపురుషుడు తానున్న సమాజం సువ్యవస్థితంగా ఉన్నదా, లేక అవ్యవస్థితంగా ఉన్నదా అని పరిశీలిస్తాడు. అవ్యవస్థితంగా వుంటే దాన్ని సువ్యవస్థితం చేయడానికి ఉద్యమిస్తాడు. శ్రీనారాయణగురువు చేసిన పని ఇదే. కల్తీ లేని అసలుసిసలైన ధర్మాన్ని వారు బోధించారు.

స్వామి పందొమ్మిదవ శతాబ్దిలో (1856) జన్మించారు. ఆకాలంలో ఎట్టి హక్కులకూ నోచుకోని ఒక సామాజిక వర్గంలో ఆయన అవతరించడం జరిగింది. కొన్ని శతాబ్దాలపాటు అణచివేతకు గురిఅయిన సామాజిక వర్గమది. అట్టి వర్గంలోని జనులు సహజంగా ఆత్మవిశ్వాసం కోల్పోతారు. ఆత్మోన్నతి పొందాలంటే ఆత్మవిశ్వాసం ఉండాలి. పూర్వం దేవునిపై విశ్వాసం లేనివారిని నాస్తికు లనేవారనీ, నేడు తనపై తనకు విశ్వాసం లేనివాడే నాస్తికుడని నవీనమతం చెబుతున్నదనీ శ్రీవివేకానందులు ప్రబోధించారు.

ఆత్మవిశ్వాసంలేక పశుప్రాయమైన జీవితం గడిపేవారిని చూచి చలించిపోయిన శ్రీనారాయణగురుస్వామి ఈ దుఃస్థితిని చక్క జేయడం

ఎలాగా ? అని సుదీర్ఘంగా ఆలోచించారు. ఈ విషయం **" అముమర్థం చింతయతః కాలో భూయానగాన్మమ "** (నారాయణస్మృతి, 1–26) అన్న వారి మాటలనుండే స్పష్టమవుతున్నది. ఇలా ఆలోచించి స్వామి తన కర్తవ్యం నిర్ణయించుకొని గొప్ప సంఘసంస్కరణోద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమం అటు భౌతికంగానూ, ఇటు ఆధ్యాత్మికంగానూ ఉభయవిధాలా అప్రతిహతమై కొనసాగింది. ఆధునిక సమాజానికి అది మార్గదర్శకమయింది.

ఒక మహాసంస్కరణ నిర్విఘ్నంగా కొనసాగాలంటే అది ఋషుల నుండే ప్రారంభం కావాలి. శ్రీనారాయణగురువు సామాన్యఋషి కాదు, ఆయన బ్రహ్మర్షి, గురువులకే గురువు. అంతటి మహిమాన్వితుడు కావడంవల్ల ఆయన సంకల్పం ఫలించింది.

ధర్మాణా మనరూపాణాం స్థాపనాశిష్యయతే2ధునా ।
నిర్వోఢుం కృత్యమేతత్త్వ మవతీర్ణో మహీతలే ॥ (నారాయణవిజయః 7–53) అన్నట్లు నేటి సమాజసుస్థితికి అనుగుణమైన ధర్మాలను స్థాపించి బోధించడానికే ఆయన అవతరించారు. ధర్మమనే పేరుతో చలామణీ అయ్యే అధర్మాలను రూపుమాపడానికీ, వక్రమార్గం పట్టిన విశ్వాసాలను సక్రమ మార్గంలోకి మళ్ళించడానికీ ఆయన అవతారం అవసరమయింది.

హిందూసమాజంలో వర్ణవ్యవస్థ సంస్కరణపరులకు కొరకరాని కొయ్యగా తయారయింది. ప్రాచీన శాస్త్రాలూ, పురాణాలు అన్నీ ఈ వ్యవస్థను సమర్థించేవే. దీనివల్ల సమాజంలో ఇంచుమించు 80శాతం ప్రజలు ఆత్మోన్నతిని సాధించలేని హీనస్థితికి వచ్చారు. నాటి చట్టాలు, అప్పటి రాజుల పరిపాలనావిధానాలు వారిని జీవచ్ఛవాలుగా మార్చివేశాయి. ప్రజల్లో విరివిగా వ్యాపించిన మూఢవిశ్వాసాలనూ, అస్తవ్యస్తమైన స్థితిగతులనూ చూచి వివేకానందుడు కేరళ రాష్ట్రాన్ని పిచ్చివాళ్ల నిలయమని పేర్కొన్నాడు

గదా ! దురాచారాలు, అవినీతి, అనవసరమైన కర్మకాండలు, మూఢవిశ్వాసాలు ఇత్యాదులవల్ల సమాజం సరిఅయిన మార్గంలో నడవడం లేదని గుర్తించిన స్వామి ప్రగతిని అడ్డుకొనే పరిస్థితులను తొలగించడానికి తీవ్రప్రయత్నం చేశారు. విద్యావ్యాప్తితో అనేక మూఢవిశ్వాసాలు, దురాచారాలు నశిస్తాయి. కాన స్వామి సరిఅయిన విద్య వ్యాపించడానికి కృషి చేశారు.

' విద్యాతపోభ్యాం పూతాత్మా' అని శ్రుతి వచనం. ' విద్యావిహీనః పశుః ' అనిభర్తృహరి మాట. అటు భౌతికంగా కానీ, ఇటు ఆధ్యాత్మికంగా కానీ ఉన్నతి పొందడానికి పరాపరవిద్యల అధ్యయనం ప్రతిమానవునికీ అవసరమే. ప్రాచీన జ్ఞానవిజ్ఞానాలకు నిలయమైన భాష సంస్కృతం. అట్టి సంస్కృతాభ్యాసం కూడా అందరికీ ఆవశ్యకమే. కాని వర్ణవ్యవస్థ వల్ల, కులభేదాలవల్లా అందరికీ ఈ భాష, ఈ విద్యలు అందుబాటులో లేకుండా పోయాయి. కొన్ని స్మృతులు స్త్రీ శూద్రులకు వేదవిద్యాధ్యయనాన్ని నిషేధించాయి. ఈ దుఃస్థితి తరతరాలుగా కొనసాగడం విచారకరం.

స్వామి సంస్కృతంలో నిష్ణాతుడు, గొప్ప కవి, మంచి విమర్శకుడు. పరాపర విద్యలు రెండింటిలోనూ పారంగతుడు. వాటి ప్రయోజన మెట్టిదో తెలిసిన మహనీయుడు. అందువల్ల వివిధ విద్యల పరిజ్ఞానం జనులందరికీ అవసరమనీ, లేనిపోని నిషేధాలు తగవనీ స్వామి ఉద్ఘాటించారు. **(సశేషం)**

వీచీ తరంగ న్యాయము

గాలికి ఒక అలలేస్తుంది. దాని తాకిడికి మరో అలపుడుతుంది. దాని వలన మరొకటి ఇలా ఒడ్డు చేరే వరకు ఒక అల తరువాత మరో అల వరుసగా పుట్టొంటాయి. దీనిని వీచీ తరంగ న్యాయమంటారు. అట్లే శబ్దం పుట్టి ఒక స్పందన తరువాత మరో స్పందన ఇలా చెవిని తగిలేంత వరకు శబ్దతరంగాలు పుడుతూంటాయి.

పరంపరా ప్రాప్త యోగ దార్శనికులు

స్వామి అమృతానంద (శ్రీరామకృష్ణ మఠం)

- అనువాదం ఎ.తారాలక్ష్మి

యోగం అనుపదము 'యుజ్' అను ధాతువునుండి ఉద్భవించింది. ఈ పదమునకు 'కూడిక ' మరియు 'ఏకాగ్రత' అను రెండు అర్థములు కలవు. పతంజలిమహర్షి 'యోగ సూత్రములను ' రాజయోగమను పేర గ్రంథస్థం కావించిరి. యోగము లన్నింటిలోనూ మకుటాయమానమైనది ' రాజయోగము'

పతంజలి మహర్షులవారు తమ గ్రంథంలో 'యోగ' పదమును 'ఏకాగ్రత' అనే అర్థంతో వాడారు. గ్రంథాన్ని 'అథ యోగానుశాసనమ్' అను సూత్రముతో ప్రారంభించారు. ఇందు ప్రయోగింపబడిన ' అథ ' శబ్దము బ్రహ్మసూత్రములలోని అథ శబ్దమునకు బేధం కలదు.. బ్రహ్మ సూత్రములలో సూచించిన అథ శబ్దమునకు ముముక్షువు సాధన చతుష్టయ సంపత్తిని పొందిన పిమ్మట బ్రహ్మజిజ్ఞాసకు అధికారి అవుతాడన్న అర్థం వస్తుంది. అదేవిధంగా పతంజలి యోగశాస్త్రములోని 'అథ' శబ్దమునకు 'పూనుకొనుట ' అను అర్థం వస్తుంది. అంటే అత్యంత క్లిష్టమైన యోగసిద్ధాంతములను అర్థం చేసికొనుటకు పూనుకొనవలెనని భావము.

వేదర్షులచే హిరణ్యగర్భుని ద్వారా యోగశాస్త్రము పతంజలి మహర్షికి అనుగ్రహించబడింది. ఆ యోగశాస్త్ర జ్ఞానాన్ని మహర్షులవారు రాజయోగమను పేర గ్రంథస్థంచేసి సాధకులకు ప్రసాదించినట్లుగ శాస్త్రాధారం. రాజయోగ గ్రంథం అనుష్ఠాన గ్రంథం.

ఈ పవిత్ర గ్రంథాన్ని శ్రీరామకృష్ణులవారి శిష్యాగ్రగణ్యులైన వివేకానందస్వామి అద్భుతమైన వాఖ్యానంతో ఆంగ్ల భాషలోనికి

అనువదించారు. అందు శ్రీ స్వామివారు రాజయోగ సిద్ధాంతములను విశ్లేషించి వాఖ్యానించుటతోపాటు, మతమును గూర్చి సరియైన అవగాహన కల్పించుటకు రాజయోగము ఏవిధంగా సహాయకారి కాగలదో కూడా బహు చక్కగా వివరించారు. వేదాంతతత్త్వ రహస్యాలను యోగశాస్త్రము మరియు సాంఖ్యశాస్త్రము ఇంచుమించుగా ఒకేవిధంగా వివరిస్తున్నట్లు అనిపించినప్పటికీ, ఒక్క విషయంలో మాత్రము యోగశాస్త్రం సాంఖ్యశాస్త్రముతో విభేదిస్తుంది. అదియే మనస్సు. యోగసాధనలో మనస్సు ప్రముఖపాత్ర వహిస్తుంది. సాధకుని మనస్సును కూలంకషంగా అధ్యయనం చేయుటకు తద్వారా అతని ఆంతరిక స్వభావాన్ని విశ్లేషించుటకు ఉపయుక్తమైన ఒక సర్వసామాన్య విధానాన్ని రూపొందించుటకు యోగసాధన విధానం తోడ్పడుతుంది. సాంఖ్య విధానంలో ఇట్టి సౌలభ్యము లేదు. అంతియే గాక రాజయోగము మనస్సును అధ్యయనం చేసే వివిధ పద్ధతులను, వ్యక్తుల ఆంతరిక ప్రకృతులను అర్థం చేసుకునే వివిధ విధానాలను కూడా వివరిస్తుంది.

భౌతికజగత్తును విజ్ఞానశాస్త్రం ద్వారా మయు వ్యక్తియొక్క ఆంతరిక స్థితిని యోగాభ్యాసం ద్వారా అధ్యయనం చేస్తాం. ఈ తరహా అధ్యయనం ప్రకృతిని స్పష్టంగా అర్థం చేసికొనుటకు దోహదపడుతుంది. ఈ అంశమే మతమునకు పునాది. పూజ్య శ్రీ వివేకానందస్వామి దీనినే " వైజ్ఞానిక మతం"గా అభివర్ణించారు.

శ్రీ స్వామివారు మతమును సమగ్రంగా అధ్యయనం చేసి తత్త్వాన్ని ఏవిధంగా నిర్వచించారో క్రింది ఉదాహరణద్వారా మనం అవగాహన చేసికొనవచ్చును. రాజయోగగ్రంథం ఆంగ్లానువాద రచనలో అవిద్యను నశింపజేయు విధానమును గూర్చి జీవాత్మ లక్షణములను గూర్చి స్వామివారు క్రింది విధంగా వివరించారు.

యోగశాస్త్ర ప్రకారము జీవాత్మ అవిద్యావశుడై జడమైన ప్రకృతితో బంధింపబడి ఉంటుంది. ఈ బంధంనుండి విడివడి పరమపదాన్ని చేరుటయే జీవుని గమ్యమై యున్నది. అన్ని మతముల సారాంశము ఇదియే అయి ఉన్నది. సచ్చిదానంద పరమాత్మయొక్క అంశయే జీవాత్మ. బాహ్య మరియు ఆంతరిక జడప్రకృతిని నియంత్రించడం ద్వారా అంతర్యామిగా ఉన్న పరమాత్మను గుర్తించడమే ఆత్మజ్ఞానము. ఇట్టి జ్ఞానమును పొందుటకు జీవుడు కర్మమార్గమును గానీ, జ్ఞానమార్గమును గానీ, భక్తి మార్గమును గానీ లేక ధ్యానమార్గమును గానీ ఆశ్రయించవచ్చును. వీటిలో ఏదో ఒక మార్గమును గానీ, అంతకంటే ఎక్కువ మార్గములుగానీ లేదా మార్గములన్నిటినీ గానీ ఆశ్రయించి, అనుసరించి మోక్షమును పొందవచ్చును. ఇదియే సర్వమతముల సారమై యున్నది. వివిధ మత సిద్ధాంతాలు, కర్మకాండలు, శాస్త్రవచనాలు, ఆలయ సందర్శనాలు, పలుదేవతారాధనలు మొదలైనవన్నీ అప్రధానాంశాలు. యోగి తన చిత్త వృత్తులను యోగసాధనద్వారా చక్కగా నియంత్రించి తన గమ్యమును చేరుకుంటాడు.

సాధకుని ఆంతరిక ప్రవృత్తిని క్రమబద్ధీకరించి సాధనలో అభివృద్ధిని పెంపొందించుటకు రాజయోగము ఎంతగానో సహాయకారిగా ఉంటుంది. వివిధ మతాలకు, వివిధ మార్గాలకు చెందిన పలువురు జిజ్ఞాసువులు ఈ యోగాన్ని సాధన చేయుచున్నారు. ఫలితంగా ఎందరో జ్ఞానయోగులు, కర్మయోగులు, భక్తియోగులు సమాజంలో మెండుగా నున్నారు. మరియు రాజయోగాన్ని శంకరమతావలంబకులు మరియు రామానుజ మతావలంబకులు భిన్న సాంప్రదాయాలతో అనుసరించుచున్నారు.

క్లిష్టమైన యోగాభ్యాసములను అనుసరించుటలో శ్రీ వివేకానంద స్వామివారి యోగదర్శనము తమకు గొప్ప మార్గదర్శకత్వము వహించినట్లుగా శ్రీ అరవిందులవారు పేర్కొని యున్నారు.

శ్రీ రామకృష్ణులవారి 'కథామృతమును' పఠించిన వారికి భగవద్గీతపై శ్రీరామకృష్ణులవారికి గల పట్టు మరియు సమగ్ర అవగాహన అర్థమవుతుంది. వారి బోధ ఇలాసాగుతుంది. " గీత అనే పదాన్ని పలుమార్లు ఉచ్చరిస్తే అది 'త్యాగి' అనే పదంలా వినిపిస్తుంది. అంటే " ఓ మానవా ! భగవంతుని కొరకు సర్వమూ అర్పించు " అని అర్థం. జ్ఞాన మార్గంలో దీనిని సన్యాసయోగం గానూ, శ్రీరామకృష్ణుల వారి మాటలలో దీనిని వ్యాకులత యోగంగానూ పేర్కొనవచ్చును. శ్రీ మద్భగవద్గీతలోని చివరి అధ్యాయంలోని క్రింది శ్లోకం ఈ భావాన్నే స్ఫురింపజేస్తుంది.

మచ్చిత్త స్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।
అథచేత్త్వ మహఙ్కారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి ॥

వేదాన్తభేరికి ఈక్రిందివారు పోషక చందా పంపినారు

(01).	పులిపాటి వెంకటసుబ్బయ్య (టీచర్, నంద్యాల)	రూ.1200/-
(02).	పులిపాటి వెంకటసుబ్బయ్య (పూజారి, బిజిన వేముల)	రూ.1200/-
(03).	జక్కుల వెంకన్న (తండ్రి సోమయ్య, పెదవలిగూడెం)	రూ.1200/-
(04).	అడపా పాపారావు (బాక్సరా, హౌరా)	రూ.1,116/-
(05).	గెల్లి చంద్రశేఖర్ గుప్త (అడ్వకేట్, హైద్రాబాద్)	రూ.1200/-
(06).	డా॥ ఎం. విజయకుమార్ (నేవి, బొంబాయి)	రూ.1000/-

జ్ఞాన సుధ

అనువాదం :

శ్రీ శంకరానందగిరి స్వాములవారు,

మూలం

ఉమామహేశ్వర పీఠాధిపతులు

శ్రీ సర్వభూషణ శివయోగి వారు

(నవంబరు సంచిక తరువాయి)

ముముక్షులక్షణము

అవ : దయ మొదలైన ఉత్తమగుణములు గలిగియుండుటయే ముముక్షువునకు లక్షణమని తెలుపుచున్నారు.

ఆర్తప్రీతి ర్విషయవిరతి ర్నిర్విషాదో విపత్తౌ
కర్మానాస్థా తనుపరిభవః పుత్రదారాద్యమోహః,
ప్రాప్తే తుష్టి స్సకల సమతా తత్త్వవిద్యా విమర్శః
తజ్జ్ఞై స్సంగో గురుకులరతి ర్లక్షణం స్యా న్ముముక్షోః 9

ఆర్తప్రీతిః = అర్తులయందు ప్రేమ, విషయవిరతిః = విషయముల యందు వైరాగ్యము, విపత్తౌ = ఆపదయందు, నిర్విషాదః = శోకింపమి (గుండెనిబ్బరము గలిగియుండుట), కర్మానాస్థా = కర్మలయందనాసక్తి, తనుపరిభవః = శరీరమునందు ఆదరబుద్ధి లేకుండుట, పుత్రదారాది అమోహః = పుత్రమిత్ర కళత్రాదులయందు వ్యామోహము లేకుండుట, ప్రాప్తే తుష్టిః= కలిగిన దానియందే తృప్తి, సకల సమతా = సర్వత్ర సమత్వము, ఎవరి యెడను రాగద్వేషములు లేక వర్తించుట, తత్త్వ విద్యా విమర్శః = తత్త్వజ్ఞాన విచారణ, తజ్జ్ఞై సంగః = బ్రహ్మవిదుల సాంగత్యము, గురుకుల రతిః = గురుస్థానమునందు పరమ ప్రేమ, (ఈ మొదలైన ఉత్తమగుణములు గలిగియుండుట) ముముక్షోః = ముముక్షువునకు, లక్షణం = లక్షణము, స్యాత్ = అగును.

ఆర్తులయందు (ఆధివ్యాధిబాధలు మొదలైనవానిచే దుఃఖపడెడి కష్టపడెడి ప్రాణులయందు) దయ, స్రక్చందనాది భోగ్య పదార్థములయందు (విషయ సౌఖ్యములయందు) విరక్తి, కష్ట సమయములయందు ధైర్యము, అనగా గుండెనిబ్బరము, కర్మలయందు నిమగ్నతనొందకుండుట (ఔదాసీన్యము – ఉపరతి) శరీరమును లక్ష్యపెట్టకుండుట, పుత్రమిత్ర కళత్రాదులయందు వ్యామోహము లేకుండుట (అప్రియబుద్ధి), ఈశ్వర ప్రేరితములై లభించిన భోగములచే పరితృప్తి, రాగద్వేషములు లేని సమత్వ బుద్ధి, ముక్తిప్రదమగు తత్త్వవిచారణమునందభిలాష, బ్రహ్మవిదుల సాంగత్యము, గురుస్థానమునందు పరమపూజ్యబుద్ధి, అనగా గురుసంప్రదాయముయొక్క పూర్ణవిశ్వాసము ఇత్యాది సద్గుణములు ముముక్షువుయొక్క లక్షణములగును. అర్థాత్ " సత్త్వాత్ సంజాయతే జ్ఞానం " అన్నట్టు సత్త్వగుణముగలవారికే ధైర్యాది దైవీ సంపద్విశిష్టులకే జ్ఞానము సిద్ధించునని తాత్పర్యము.

అధికారి నిర్ణయ మనెడి ప్రథమాధ్యాయము **సమాప్తము**

జగదధ్యారోపాపవాదనామక – ద్వితీయాధ్యాయము

అవ : బ్రహ్మజ్ఞానమునకు అధికారము అత్యావశ్యకమని ఇంతవఱకు నిరూపింపబడినది. బ్రహ్మము అవాఙ్మానసగోచరము. అందువలన అధికారులకుగూడ అది అవేద్యమే కదా ? యను శంక కలుగగా పరబ్రహ్మము అగోచరమైనప్పటికి జగదధ్యారోపాపవాద మూలమున అనుభవయోగ్యమేయని సృష్టి ఉపక్రమోపసంహారక్రమమున బోధింపబడుచున్నది. గురుశరణాగతి పొంది, నేను ఎవరు ? ఈ భవదుఃఖము ఏ కారణమున గలిగెను ? ఇది ఎట్లు నివృత్తి నొందును? అను మొదలగు ప్రశ్నలచే ఒప్పు శిష్యునకు శుక్తి – అజ్ఞానముచే రజతప్రతీతివలె త్రాటిని మఱచినందున పామువలె బ్రహ్మభిన్నమైన సచ్చిదానంద ఆత్మస్వరూపముయొక్క మఱపుచేతనే ఈ దేహాది సకల

నామరూపాత్మక సంసృతిరూప బంధము గోచరించుచున్నదే కాని ఇది సత్యము గాదని, నీవు శుద్ధచిన్మాత్రస్వరూపుడనే యని ఈ జగదధ్యారోపాపవాద క్రమమును తెలుపుచున్నారు.

పరం వస్త్వస్త్యేకం కృతక పర వాక్యై రపి శతై
రనిర్వాచ్యం తస్మిన్ సతత మవినాభావకలితా,
మృషాస్త్యేకా మాయా సదసదితరా ఖేసిత మివ
తయో ర్విశ్వం మధ్యేభినయతి యయో ర్విస్మయ ఇవ. **10**

శతైః = వందలకొలది, కృతక పరవాక్యైః ఆపి = కృత్రిమములు భేదముగలవియు (దివ్యములు) నైన వాక్యముల చేతగూడ, అనిర్వాచ్యం = (ఇట్టిదని) చెప్పుటకు శక్యము గాని, ఏకం = ఒక్కటియైన, పరంవస్తు = పర వస్తువు, పరబ్రహ్మము, అస్తి = కలదు, తస్మిన్ = ఆ పరబ్రహ్మమునందు, సతతం = అనవరతము, అవినాభావ కలితా = అవినాభావ సంబంధముగల, మృషా = అసత్యమైన, సదసదితరా = సదసద్విలక్షణము అనిర్వచనీయమునగు, ఏకా = ఒక, మాయా = గుణ సామ్యావస్థా రూపమగు ప్రకృతి, అస్తి = కలదు, యయోః = (వెనుక చెప్పబడిన) ఏ బ్రహ్మము, మాయ కలవో, తయోః = ఆ బ్రహ్మము, మాయ అనువాని, మధ్యే = నడుమ, ఖే= ఆకాశమునందు, అసితం ఇవ = నీలిమ (నీలవర్ణము) వలె, విశ్వం = (ఈ) జగత్తు, విస్మయఃఇవ = ఆశ్చర్యము (గలిగించునది)గా, అభినయతి= నటించుచున్నది. (అగపడుచున్నది).

తటస్థ లక్షణముచేత బ్రహ్మజ్ఞానము కలుగజాలదు. సృష్టి (ఉత్పత్తి) ప్రసంగమును సంభవింపదు. ఎందుకన, పరబ్రహ్మము స్వగతాది భేదత్రయ రహితమై నిర్వికల్పమైయున్న పరవస్తువు. అట్టి దానియందు వికల్పరూపమైన ఈ సృష్టియొక్క ఉత్పత్తి చెప్పుట పొసగదు. లేక మాయా మూలముననే సృష్టి యన్నను అది వంధ్యాపుత్రునివలె లేనిది. ఇక బ్రహ్మము, మఱియు

మాయ యీ రెంటి సంబంధమువలన సృష్టి యయినదని చెప్పినను ఒప్పదు. తేజ స్తిమిరములకు వలె మాయా బ్రహ్మములకు పరస్పర వైలక్షణ్యము (వైరుధ్యము) గలదు. అన్యముచే అయినదని చెప్పిన తదితరపదార్థము ఏదియు లేదు. కాబట్టి యీ సృష్టి సమ్యగ్రూపమున సంభవింపనందున తటస్థలక్షణము పొసగదు అను మొదలగు పూర్వపక్షములు ఏర్పడగా ఔపచారికముగా అధ్యాసనుగ్రహించి ఇట్లు వర్ణించుచున్నారు. నిజమే. నిర్వికారబ్రహ్మమునుండి సృష్టి కాలేదు. కేవలము అసత్తైన మాయనుండియు కాలేదు. మఱియు బ్రహ్మ మాయలకు నిజమగు సంబంధమునులేదు. కాని కల్పిత సంబంధమువలన సృష్టి నంగీకరింపవలెను. "అసంగో నహి సజ్జతే " అను వాక్యముచేత ఏ సంబంధమును సంబంధింపదని యాశంకించుకొని సామాన్యాంశమగు సద్రూప బ్రహ్మాధారమందు కల్పిత సంబంధమును చెప్పుచున్నారు. సత్ సామాన్యమును ఆశ్రయించి అనిర్వచనీయమగు మాయ యున్నదని అంగీకరింపబడినది. ఇట్లు ఆధార ఆధేయములైన బ్రహ్మ - మాయల సంబంధము వలన జగదుత్పత్తి అయి యున్నది. " సత్తాయస్య" అను ముందు శ్లోకముచే ఈ యర్థమునే చెప్పెదరు.

అన్నదానానికి ఈక్రిందివారు పైకం పంపినారు

(01). ఎల్లూరు విశ్వనాథం (గద్వాల్) రూ. 15,116/-
శ్రీరంగానందగిరి స్వాముల వారిపేర భాద్రపద త్రయోదశినాడు
(02). దేవల్ల సుందరరావు (సౌదిఅరేబియా) రూ. 10000/-
(03). కె.హనుమంతరావు (హైద్రాబాద్) రూ. 11116/-
(04). ఆర్.సుజాత (హైద్రాబాద్) రూ. 10,000/-
(జ్యోతిర్మయి పేరిట)
(05). బావులూరి మాధవయ్య (హైద్రాబాద్) రూ. 15,000/-
(భార్య రాజేశ్వరి పేరిట)

కథాత్మక గీతాసూక్తులు

– డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

సుశర్మ అనే బ్రాహ్మణుడు తాను పెరిగిన వాతావరణం కారణంగా విషాదవినిర్ముక్తుడయిన మరో కథను అనుసంధానం చేసుకొందాం.

సుశర్మ ఒక బ్రాహ్మణుడు. పేరులో 'సు' ఉంది గాని జీవనవిధానంలో 'సు ' లేదు. నేతిబీరకాయలాంటి పేరు. అతని పేరులోనే కాదు అతడు పుట్టిన కుటుంబంలో కూడా 'మంచి' మందుకయినా దొరకదు. ఆ రోజుల్లో బ్రాహ్మణ కులోచితమయిన వృత్తి చేబట్టక అతడు 'నాగలి' పట్టాడు. అంతేకాదు అడవుల్లో తిరుగుతూ 'ఆకులు' తెచ్చి అమ్మేవాడు. కాలం గడచిపోతూవుంది. ముసలితనం ముంచుకు వచ్చింది. ఒకరోజు అడవికి వెళ్ళి తిరిగి వస్తుండగా ఒక పాము కాటేసింది. సుశర్మ అక్కడే చనిపోయాడు.

సుశర్మ మరుజన్మలో 'ఎద్దు'గా పుట్టాడు. బరువు మోయడం తప్పలేదు. బాధ భరించక తప్పలేదు. ఆ ఎద్దు ఎందరి చేతులో మారింది. చివరకు ఒక కుంటివాడు ఎద్దును కొన్నాడు. తాను ఎద్దుపై కూర్చొనేవాడు. ఆ కుంటివాణ్ణి మోయడం ఎద్దుకు అలవాటయిపోయింది. ఒకసారి కుంటివాడు ఎత్తయిన దారిలో వెళ్ళవలసి వచ్చింది. ఎద్దు ఎక్కలేకపోయేది. వగర్చేది. చివరకు ఆయాసంతో నేలపై పడిపోయింది. చచ్చిపోయింది.

ఎద్దు మోయలేకపోవడం, కుంటివాడు అదలించడం, ఎద్దు కూలబడడం అన్నీ చూచిన జనం పాపమన్నారు. వారిలో ఒక పుణ్యాత్ముడున్నాడు. అతనిది జాలిగుండె. ఎద్దుకు పుణ్యలోకం దక్కాలని తన ధర్మం ధారవోశాడు. ఎద్దు నేలమీద పడగానే చేరిన గుంపులో ఒక వేశ్య కూడా ఉంది. ఆమె 'అయ్యో' అంది. 'నేనూ ఏదయినా పుణ్యం చేసి వుంటే ఆ పుణ్యం ఎద్దుకు ధారవోస్తా' నంది. యమదూతలు ఎద్దు 'ఆత్మ'ను యమలోకానికి తీసికెళ్ళారు. వేశ్య అయాచితంగా చేసిన దానంవల్ల ఎద్దుకు పుణ్యలోకమని యముడు నిర్ధారించి తీర్పు ఇచ్చాడు. ఎద్దు పుణ్యలోకం చేరింది. ఆ పుణ్యమున్నంతవరకు అక్కడ కాలం గడిపింది. ఆపై మరల బ్రాహ్మణ వంశంలో సుశర్మ పుట్టాడు. జన్మలు మారినా అతనిలో పూర్వ స్మృతి మిగిలివుంది.తనకు పుణ్యలోక ప్రాప్తి కలిగించిన వేశ్యాగృహానికి బ్రాహ్మణుడు వెళ్ళాడు.

'అమ్మా ! నీవు ఏ పుణ్యం చేశావో చెప్పమ్మా ' అన్నాడు. వేశ్య ఏ మాట చెప్పకుండా పంజరంలోని చిలుకను చూపింది. బ్రాహ్మణుడు బిత్తరపోయాడు.

'అయ్యా ! నాకు ఈ చిలుక అంటే ఇష్టం. ఈ చిలుక పలుకులు వినడంతో నాకెంతో ఆనందం కలిగేది. అంతకంటే నేను చేసిందేమీలేదు. ఆ ఆనంద అనుభవాన్నే ధారాదత్తం చేశా' అంది. సుశర్మ, వేశ్య ఇద్దరూ చిలుక దగ్గరకి వెళ్ళారు. ' నిన్ను చూస్తుంటే నాకూ ఆనందం. కారణమేమిటి?' అని ప్రశ్నించారు. చిలుక తన ఆత్మకథ చెప్పింది.

'అయ్యా ! నేను నీలాంటి బ్రాహ్మణుణ్ణి. బాగా చదువుకొన్నవాణ్ణి. విద్వాంసుణ్ణి. గర్విష్ఠిని. ఇతరుల్ని హేళన చేసేవాణ్ణి. ఎన్నో జన్మలెత్తాను. చివరకు చిలుక జన్మ ఎత్తాను. నేను ఒకసారి తిరుగుతుంటే ఎండ తాకిడికి తట్టుకోలేక క్రిందపడిపోయాను. నేను పడిపోవడాన్ని ఒక ముని చూచాడు. నాపై నీళ్ళు పోశాడు. కాసంత ఊరట. నాకు ఊపిరాడింది.

ముని నన్ను జాగ్రత్తగా చేతబట్టుకొని తన ఆశ్రమం తీసికెళ్ళాడు. అక్కడే చాలా కాలం గడిపాను. వేదాలు, పురాణాలు, గీత అన్నీ అక్కడ విన్నాను. ఆ ఆనందమే వేరు. అయితేనేం? ఒక బోయవాడు ముని లేని

సమయం చూసి నన్ను దొంగలించాడు. ఈ వేశ్య కొన్నది. అప్పటి నుండి ఇక్కడే ఉన్నా.

ఆశ్రమ వాతావరణం వల్ల నా మిథ్యాగర్వం పోయింది. విషాదమూ పోయింది. వివేకం కలిగింది. నా అంతఃకరణంలో ఇపుడు మాలిన్యం లేదు. నా దర్శనం వల్ల వేశ్య, వేశ్య వల్ల నీవు బాగుపడ్డావు' అంది.

ఈ కథలో అనేక జన్మలెత్తడం విషాదం. ఎద్దు బతుకు, వేశ్య బతుకు రెండూ ఏవగింపబడేవి. జాతి సహజమయిన స్వభావం మరో విషాదం. ఈ విషాదాలన్నీ సత్పురుషదర్శనం వల్ల, సంతుష్టుడయిన వారి పలుకులవల్ల తీరడం విశేషం. ఆత్మవిశ్వాసమే కవచం.

ఎవరి కెఱుక ?

- ఆచార్య కె.సర్వోత్తమరావు (తిరుపతి)

... విషాదం' సమరావనిలో మాత్రం బహిర్గతం ... ్యాప్రావీణ్యం చూచి విషాదం. కుమారాస్త్ర ... ఉజ్జీగా కర్ణుడు నిలబడినపుడు విషాదం. ఇంద్రకీలాద్రి మీద వరాహాన్ని గురిపెట్టి బాణం వేసిన కిరాతునితో వాగ్వివాదం మరో విషాదం. పుట్టిన బిడ్డలంతా చనిపోతున్నారని బ్రాహ్మణుడు యాచిస్తే యముని బారినుండి బిడ్డలను కాపాడలేనివేళ ఆ బ్రాహ్మణుడు నానామాటలంటే విషాదం. విరాటుని నగరంలో బృహన్నలగా జీవించడం మరో విషాదం. అభిమన్యుని మరణం విని పుత్రదుఃఖం, శ్రీకృష్ణ నిర్యాణానంతరం తన పరాక్రమమంతా బూడిద పాలుకావడం విషాదాంతనాటకంలో చివరి సన్నివేశం. అయితే ప్రతి విషాదసన్నివేశం లోనూ 'అధైర్యపడక' కర్తవ్యోన్ముఖుడుగా గుండె నిబ్బరం చేసుకొన్నవాడిగా మెలగడం అర్జునుని ప్రత్యేకత.

"క్లైబ్యం మా స్మ గమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే !
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప !

శ్రీ జ్యోతి రామలింగస్వామి

- ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం

(నవంబరు తరువాయి)

చెన్నపట్టణంలో ఒక బాడుగ ఇల్లు కుదుర్చుకున్నారు. చిన్నమ్మ ధనికుల ఇళ్ళలో పాత్రలు కడగడం, బట్టలుతకడం, ఇల్లు శుభ్రం చేయడం వంటి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించసాగింది. పెద్ద కుమారుడైన సభాపతి పురుషవాక్కంలో నివసించే అష్టావధాని సభాపతి మొదలియార్ దగ్గరకు వెళ్ళి విద్యనభ్యసించాడు. వ్యాకరణము ఛందస్సు నేర్చుకున్నాడు. తిరువిళయాడల్ పురాణం, కందపురాణం, పెరియపురాణం వంటి దైవ సంబంధ గ్రంథాలమీద పట్టుసాధించాడు. ధనికుల ఇళ్ళకు వెళ్ళి పురాణాలు చెప్తూ పొట్టపోసుకోవడం వృత్తిగా పెట్టుకున్నాడు. చిన్నమ్మ తన కుమార్తెలిద్దరికీ వివాహం చేసి అత్తవారింటికి పంపివేసింది. రెండువ కుమారుడు పరశు రామన్ పూర్వం తండ్రి చేస్తున్న కరణీకాన్ని నిర్వహించేందుకు కరుంగుళి గ్రామానికి వెళ్ళిపోయాడు.

సభాపతికి పాపాతి అనే ఒక ఉత్తమ స్త్రీతో వివాహమైంది. కరుంగుళిలో కరణీకం నిర్వహిస్తున్న రెండవ కుమారుడు పరశురామన్‌కు సహాయంగా ఉండేందుకు తల్లి చిన్నమ్మ వెళ్ళిపోయింది. ఇప్పుడు చెన్నైలో మిగిలింది సభాపతి, ఆయన భార్య పాపాతి, రామలింగం మాత్రమే. చాలా చిన్న వయస్సులోనే అన్న ఇంట్లో లేనప్పుడు వదిన పాపాతికి రామలింగం దైవసంబంధమైన అనేక విషయాలు చెబుతుండేవాడు. అన్న సభాపతి అతనికి విద్య నేర్పించాలనుకొన్నాడు. సభాపతి మొదలియార్ దగ్గర చేర్చాడు. రామలింగం ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు.

ఏడుసంవత్సరాల వయస్సులో రామలింగం చెన్నపురిలో ఉన్న కందస్వామి ఆలయానికి వెళ్ళాడు. కందస్వామిని దర్శించాడు. తనకేమికావాలో కోరుకొన్నాడు. ధర్మంలో అలరారే చెన్న పట్టణంలో స్కందకోటలో వెలసిన కందస్వామీ ! షణ్ముఖా ! నాకు ఏకాగ్రచిత్తంతో పువ్వుల వంటి నీ పాదాలను స్మరించే ఉత్తముల సాంగత్యం కావాలి. లోపల ఒకటి పెట్టుకొని బయట వేరొకటి మాట్లాడే వారితో సంబంధం ఉండకూడదు. ఘనతను కలిగించే నీ కీర్తిని కొనియాడాలి. అబద్ధం చెప్పకూడదు. గొప్ప సిద్ధాంతాన్ని అనుసరించాలి. మదమనే దయ్యం పట్టకుండా ఉండాలి. స్త్రీ ఆశను మరచిపోవాలి. నిన్నెప్పుడూ మరవకూడదు. మతికావాలి. నీ కరుణానిధి కావాలి. రోగమూ రొష్టూలేని జీవితంలో నేను జీవించాలి అనే భావం వచ్చేలా చక్కని పద్యం చెప్పాడు. రామలింగం కోరుకున్నవన్నీ ఆయనకు మాత్రమే వర్తించేవి కావు. అందరికీ వర్తించేవే. ఈ కోరికలనే మనం కూడా స్వామిముందు పెట్టాలి. అంతటితో ఆగిపోకూడదు. వాటిని ఆచరణలో పెట్టే అభ్యాసాన్ని ప్రారంభించాలి.

రామలింగానికి చదువుమీద శ్రద్ధ లేకపోవడం, ఆలయాలకు వెళుతూ కాలం గడపడం, ఏదో ఆలోచించుకుంటూ స్తబ్దంగా ఉండిపోవడం వాళ్ళ అన్న సభాపతికి నచ్చలేదు. చెప్పి చూశాడు. ఫలితం లేకపోయింది. అతనిమీద కోపంతో ఇంటి నుంచి వెళ్ళగొట్టాడు. రామలింగానికి కందస్వామి గుడే శరణ్యమైంది. తల్లిలా పెంచిన వదిన పాపాతికి సభాపతి చేసిన పని నచ్చలేదు. అతన్ని ఎంతగానో ప్రాధేయపడింది. అతికష్టంమీద భర్తను ఒప్పించింది. రామలింగానికి మేడమీది గదిలో బస ఏర్పాటు చేసింది. రామలింగం ఆ గదిలో ఒక అద్దాన్ని, ఒక దీపాన్ని ఉంచుకొన్నాడు. అద్దంలో అతడు చూసేటప్పుడు ఆ దీప ప్రతిబింబం కనిపించిందే కాని తన ప్రతిబింబం కనిపించేది కాదు. రామలింగం ఈవిధంగానే ఆ మేడమీది గదిలో

ఏకాంతంగా శివయోగాన్ని అభ్యసించాడు. రామలింగానికి తొమ్మిదవ యేట సుబ్రమణ్యస్వామి ఆ అద్దంలో దర్శనమిచ్చాడు.

ఒకరోజు అన్న సభాపతికి జ్వరం వచ్చింది. రోజూ చేసే ప్రసంగానికి వెళ్ళడం కుదరలేదు. తన పరిస్థితి తెలియజేసి రమ్మని తమ్ముణ్ణి ప్రసంగం ఏర్పాటు చేసిన వాళ్ళ ఇంటికి పంపాడు. రామలింగం అక్కడికి వెళ్ళాడు. ఆరోజు తిరుజ్ఞాన సంబంధర్ పుట్టినరోజు. తిరుజ్ఞాన సంబంధర్ పురాణాన్ని ప్రసంగించవలసి ఉంది. భక్తులు కోరినమీదట రామలింగం తిరుజ్ఞాన సంబంధర్ మీద మంచి ప్రసంగం చేశాడు. అన్నకంటె కూడా అద్భుతంగా ప్రసంగించాడని అక్కడ గుమికూడినవాళ్ళు అతన్ని మెచ్చుకున్నారు. తమ తమ శక్తి కొద్దీ ద్రవ్యాన్ని కానుకలుగా ఇచ్చారు. రామలింగం ఆ కానుకలను ఇంటికి తీసుకువెళ్ళలేదు. దారిలో తారసపడిన ఒక గుంటలో వేసి ఇంటికి వెళ్ళాడు. ఆయనే తరువాత ఎప్పుడో ఒక పద్యంలో ఈ విషయాన్ని తెలియజేశాడు. ' తండ్రీ ! నాకు డబ్బు మీద ఆశ కొంచెం కూడా లేదు. నాకు వచ్చిన కానుకలన్నింటినీ బావుల్లోనూ గుంటల్లోనూ పడవేశాను !.

రామలింగానికి దైవభక్తి అధికం. ఎప్పుడూ దైవచింతనే. చెన్నపురిలోని తిరువత్రియూర్‌కు రామలింగం తరచూ వెళ్ళేవాడు. అక్కడ అమ్మవారు వడివాంబికను, స్వామి ఎళుత్తరియుమ్ పెరుమాన్ (త్యాగరాజస్వామి)ను స్తోత్రం చేసి ఆనందం పొందేవాడు. తిరువత్రియూర్‌లో నెల్లికాయ్‌పండారం వీధి అని ఒక వీధి ఉండేది. ఆ వీధిలో ఒక అరుగు మీద ఒక పరదేశి దిగంబరుడుగా కూర్చుని ఉండేవాడు. ఆ దారిలో వెళ్ళేవారిని చూసి వాళ్ళ గుణాల్నిబట్టి నక్క పోతూ ఉంది. కుక్కపోతూ ఉంది అని సణుక్కొంటూ ఉండేవాడు. రామలింగం పోతూ ఉండడం చూసి వెంటనే మొలకు బట్ట చుట్టుకునేవాడు. మనిషి

పోతున్నాడే ! అనేవాడు. దీన్నిబట్టి ఒక అవధూత మనస్సులో కూడా రామలింగస్వామికి ఎంత గొప్పస్థానం ఉండేదో బోధపడుతుంది. స్వచ్ఛమైన ఆయన వ్యక్తిత్వం అవగతమౌతుంది.

ఒకరోజు రాత్రి తిరువట్రియూర్‌లో ఆలయ మండపంలో రామలింగస్వామి పడుకోవడం తటస్థించింది. ఆ కాలంలో పురుషులు కూడా కర్ణాభరణాలు ధరించేవారు. వాటిని కుండలాలు అని వ్యవహరిస్తారు. రామలింగస్వామి మంచినిద్రలో ఉన్నప్పుడు ఒక దొంగ వచ్చి ఒక చెవికున్న కుండలాన్ని లాఘవంగా ఊడదీశాడు. స్వామి మరోవైపు పొర్లి మరో కుండలాన్ని కూడా తీసుకువెళ్ళేందుకు దొంగకు సహాయం చేశారు.

రామలింగస్వామి ఒకరాత్రి అక్కగారి ఇంటి అరుగుమీద పడుకోవలసి వచ్చింది. అర్ధరాత్రి అతనికి భరింపరాని ఆకలి. పార్వతీదేవి అక్కగారి రూపంలో అక్కడికి వచ్చి పాలన్నం పెట్టిందట. ఈ విషయాన్ని ఆయనే తర్వాతకాలంలో ఒక పద్యంలో చెప్పారు.

రామలింగస్వామి వద్దని ఎంత బ్రతిమిలాడినా వినకుండా ఇంట్లో వాళ్ళు అక్క కుమార్తెతో అతని పెళ్ళి జరిపించారు. అయితే రామలింగస్వామి మాత్రం మొదటిరాత్రంతా మాణిక్యవాసగర్ రచించిన తిరువాచకం చదువుతూనే పొద్దుపుచ్చారు. ఆ వివాహ బంధం అంతటితోనే వీడిపోయింది.

చెన్నైలో ఉన్నప్పుడే శివనేశవెన్బ, మనుముఱై కండవాసగమ్ అనే రెండు గ్రంథాలను వళ్ళలార్ రచించారు. రామలింగస్వామి తిరుక్కడియ క్షేత్రంలో ఈశ్వరుణ్ణి ఆరాధించారు. చిదంబరానికి వెళ్ళి చాలాకాలం అక్కడ నివసించారు. రామలింగస్వామికి చిదంబరనాథుని పట్ల భక్తి అధికం. సదా సభేశునిమీదే ఆయన చింతన. కాబట్టి చాలాకాలం అక్కడ ఉండిపోయారు. చిదంబరస్వామి అంటే రామలింగస్వామికి ఎంత ఇష్టం అంటే సంతకం చేసేటప్పుడు చిదంబర రామలింగం అనే సంతకం చేసేవారు.

తన రెండవ అన్న కరణీకం చేస్తున్న కరుంగుళి గ్రామంలో రామలింగస్వామి కొంతకాలం నివసించారు. కరుంగుళి గ్రామంలో రామలింగస్వామి రాత్రిపూట కూడా వ్రాస్తూనో, చదువుతూనో కాలం గడిపేవారు. ఒకరోజు రాత్రి ఆ ఇంటి యజమానురాలు వేరే గ్రామానికి వెళ్ళవలసి వచ్చింది. స్వామి చదువుకొనే దీపానికి చమురు పొయ్యడం మరచిపోయింది. కాని స్వామి ఆరోజు నీళ్ళుపోసి దీపాన్ని వెలిగించి తన కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించారు. ఈ మహిమకు ఆ గ్రామస్థులంతా ఎంతో ఆశ్చర్యపడ్డారు. కరుంగుళి గ్రామంలో ఉన్నప్పుడే రామలింగస్వామి తిరువరుప్పా రచించారు. (**సశేషం**)

అఖిలాంధ్ర సాధు పరిషత్ స్వర్ణోత్సవములు

అఖిలాంధ్ర సాధు పరిషత్ స్వర్ణోత్సవములు 2015 జనవరి తేది 9, 10,11, శుక్ర, శని, ఆదివారములలో హైదరాబాద్ కూకట్‌పల్లి మెట్రో షాపింగ్ మాల్ వెనక ఉన్న ఎన్.గార్డెన్ నందు పరిషత్ అధ్యక్షులు ఆచార్య శ్రీ శంకరానందగిరిస్వాములవారి అధ్యక్షతన జరుగును.

జగద్గురువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మహాత్ములు, పండితులు పాల్గొని తమ దివ్య సందేశాత్మక ఆశీర్వాదముల నొసంగెదరు. కావున జిజ్ఞాసువులు పాల్గొని పరాత్పరుని కృపకు పాత్రులగుదురు గాక !

ఇట్లు

ఆచార్య శ్రీహరితీర్థస్వాములవారు

అఖిలాంధ్ర సాధు పరిషత్ ప్రధానకార్యదర్శి

" ఆశీస్సులు - అనుగ్రహము "

– వెల్దండ పూరిబాలస్వామిగుప్త, M.A,. B.Ed., కల్వకుర్తి,

జీవితంలో ప్రతి వ్యక్తి రెండు విషయములకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. మొదటిది మహనీయులు, మహర్షులు, సద్గురుమూర్తులు, మాతాపితరులు మొదలగు పెద్దల ఆశీస్సులను పొందగలగుట. రెండవది దైవానుగ్రహప్రాప్తి.

పెద్దలు ఏది చెప్పినా అనుభవించి చెబుతారు. అనుభవంతో కూడిన సందేశములు, వ్యక్తులను బాగా ప్రభావితం చేస్తాయి. అనుభవం లేని బోధలు మానవాళిని పెద్దగా ప్రభావితం చేయలేవు. అందులకే మన పూర్వీకులు చెబుతూ వుంటారు. " పెద్దల మాట సద్దిమూట " అని వారి మాటలు మనల్ని ధర్మ మార్గమున పయనింప జేస్తాయి.

సద్గురుమూర్తు లు గొప్ప జ్ఞాన సంపన్నులు అట్టి సంపదను అందరికీ పంచుతూ జ్ఞానదానం చేస్తూ వుంటారు. అజ్ఞాన చీకటిలో పయనించుట ద్వారా విలువైన జీవితం నిరర్థకం అవుతుంది. గురుమూర్తుల సందేశములు. వెలుగు దివ్వెలై జీవనయానమునకు చక్కటి మార్గదర్శనం చేస్తాయి. నిరంతరం పరమాత్మ చింతన ద్వారా వారు గొప్ప దైవశక్తిని పొందియుంటారు. వారి బోధలే గాకుండా వారి జీవిత సంఘటనలన్నీ మనకు సందేశాత్మకమై మార్గదర్శనం చేస్తూ వుంటాయి. అందులకే వారి సన్నిధిలో వుంటూ, వారి సందేశములు అదేశములుగా భావించి ఆచరించిన వారు ధన్యులు. పునీతులు.

నవమాసాలు మోసి జన్మనిస్తుంది తల్లి. అష్టకష్టముల భరిస్తూ పెంచి పెద్ద చేస్తాడు తండ్రి. తమ సంతానము యొక్క ఉజ్జ్వల భవిష్యత్తుకై రకరకముల ప్రయత్నములు కొనసాగిస్తూ వుంటారు. వీరి ఋణం ఏ విధంగాను తీర్చుకో లేనిది. తల్లి, తండ్రి, బ్రహ్మ, విష్ణుమూర్తి వంటివారు. నడవడిలో వారు ఎలాంటి వారైనప్పటికీ వారిని గౌరవించాలి, సేవించాలి. వారు అ ధర్మపరులైనచో వారిలో మార్పును తేగలగాలి.

వీరందరు ప్రత్యక్ష దైవములు వంటి వారు. వీరి ఆశీస్సులు అద్భుత శక్తి వంతములు. వారి సన్నిధిని కోరుకోవాలి. వారి సాంగత్యమును కాంక్షించాలి. వారిని గౌరవించాలి. సేవించాలి. వారి ఆశీస్సులు మనమంతా పొందగలగాలి వారి ఆశీస్సుల ద్వారా మనలో ఒక దివ్య శక్తి ప్రవేశిస్తుంది. అట్టి శక్తి మనల్ని సత్పథమున పయనింపజేస్తుంది.

లోకంలో ఎన్నింటినో, ఎందరినో ప్రేమిస్తూ వుంటారు. కాని దైవాన్ని ప్రేమించే వారు చాలా అరుదు. కనిపించేదంతా ఒకనాడు నశించక తప్పదు. నశించే దానిని అమితంగా ప్రేమించడం అవివేకమే అవుతుంది. జన్మదాత అయిన జగదీశ్వరుని మనం అమితంగా ప్రేమిస్తూ వుండాలి. ఫలితంగా తిరిగి ఆయన మనల్ని ప్రేమిస్తాడు. ఆయన అనుగ్రహమును మనపై అమృతంలా కురిపిస్తాడు. దైవానుగ్రహ ప్రాప్తికై సదాచార సంపన్నులమై సదా పరమాత్మ చింతనలో నిత్యకృత్యములు నిర్వహిస్తూ ముందుకు సాగాలి.

దైవానుగ్రహం వల్లనే పాండవులు అసంఖ్యాకకురు సైన్యమును జయించారు. ద్రౌపతి మానసంరక్షణ జరుపబడింది. మీరాబాయి శ్రీకృష్ణుని తన భర్త వలె ప్రేమించి, పండరిలో కృష్ణపరమాత్మలో లీనం అయ్యింది. భక్త శబరి రేయింబవళ్లు రాముని స్మరిస్తూ ఆయనలో లీనం అయ్యింది. పుడమిలో శబరి నదిగా వెలిసింది. భక్త ప్రహ్లాదుడు మార్కండేయుడు పరమాత్మను అమితంగా ప్రేమిస్తూ స్మరిస్తూ మృత్యువును జయించగలిగారు. వీభీషణుడు రామానుగ్రహప్రాప్తికై, స్వంత సోదరులను సైతం త్యజించాడు. శ్రీకృష్ణుని గాఢంగా ప్రేమిస్తూబొందితో వైకుంఠమునకు వెళ్ళగలిగాడు. భక్తతుకారాం ఈవిధంగా ఏ భక్తుని జీవితమును శోధించినా, వీరంతా సాధన ద్వారా భగవదనుగ్రహమును పొంది ధృవ తారలుగా నిలిచిపోయారు.

ఆడంబర పూజలతో పరమాత్మను సంతృప్తి పరచలేము. పవిత్ర హృదయాన్ని స్వామికి సమర్పించాలి. మన సుగుణసంపదయే స్వామికి గొప్ప నైవేద్యం వంటిది.

మిత్రులారా ! జీవితంలో మీరంతా మీయొక్క మంచి నడవడిక ద్వారా, పెద్దల ఆశీస్సులు పొందండి. సదాచార సంపన్నులై సాధన ద్వారా దైవానుగ్రహమును పొందగలిగి జీవితాలను ధన్యం చేసుకోండి.

ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

" దివ్య జీవన సంఘము"నకు చెందిన "యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ " 79వ యోగ వేదాంత తరగతులను మార్చి 2వ 2015 నుండి ఏప్రిల్ 2015 29వ తేది వరకు రెండు మాసముల కొఱకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్లభాష యందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలయును. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ 20 – 01– 2015. ఈక్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. అంతేకాకుండా www. swananda online. org. website నుండి కూడా పొందవచ్చును. e - mail : yvfa @ dlshq. org మరియు e- mail : yvfacedemy @ gmail. com.

Address :
The Registrar,
The Yoga Vedanta.
Forest Academy,
Swanandanagar - 249192
Tehri Gerhwam District

ఇట్లు
Swami yogadanand\
రిజిస్ట్రార్ – యోగ
వేదాంత ఫారెస్టు అకాడమీ

విజ్ఞప్తి

వేదాన్తబేరి సంవత్సర చందాదారులు తమ తమ చందాలను వెంటనే ఎం.ఓ. చేయగోరుచున్నాము. ఎం.ఓ.లో తమ చందా నెంబరును తప్పక వ్రాయవలయును.

వార్తలు

(01). 2-12-2014 తేది శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో గీతాజయన్తి జరిగినది. ఆనాడుదయం భగవద్గీతకు పూజ చేసి 18 అధ్యాయాలు అఖండపారాయణ జరిగినది. సాయంకాలం భగవద్గీత విశిష్టత గురించి ఉపన్యాసాలు జరిగాయి.

(02). శ్రీకాళహస్తి వరదరాజులగుడిలో స్థానిక శ్రీ చిన్మయమిషన్ వారు జరిపిన గీతాజయన్త్యుత్సవాలలో చివరిరోజు 10-12-2014 తేది పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని 17,18 అధ్యాయాలపై ప్రవచన చేశారు.

(03). 13-12-2014 తేది శనివారంనాడు తిరుపతి శ్రీరామకృష్ణ సేవాసమితివారు వినాయకనగర్ శ్రీరామకృష్ణ మందిరంలో జరిపిన దివ్య జనని శ్రీ శారదామాత 161 వ జన్మదినోత్సవంలో శ్రీ విద్యాస్వరూపానంద స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(04). తూ.గోదావరి జిల్లా రాచపల్లి శ్రీరమణాశ్రమ రజతోత్సవాలలో 2014 డిశంబర్ 28,29,30 తేదీలలో పూజ్యశ్రీ స్వాములవారు పాల్గొని ప్రవచనలు చేశారు.

(05). 2015 సం॥ జనవరి 24,25,26 తేదీలలో విజయవాడలో జరుగు అఖిలాంధ్రప్రదేశ్ దివ్యజీవన సభలలో (శివానందాశ్రమం హృషీకేశ్ వారి సమావేశాలు) శ్రీ స్వాములవారు పాల్గొని ప్రవచన చేస్తారు.

(06). 6-12-2014తేది పౌర్ణమినాడు ఆశ్రమంలో పాదుకాపూజ జరిగినది. డిశంబర్ 5న కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో శ్రీ సుబ్రమణ్యస్వామి పూజ జరిగినది. 20 తేది మాసశివరాత్రి సందర్భంగా ప్రదోష కాలంలో ఆశ్రమ నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(07). ఆశ్రమ కంటిఆసుపత్రిలో నవంబరు నెలలో **ఓ.పి.లో 566 మందికి కంటి పరీక్షలు, చికిత్సలు జరిగాయి. 75 మందికి** పొరలు ఆపరేషన్‌చేసి లెన్సు అమర్చబడినవి. 7-12-14 తేది ఆశ్రమ గ్రామీణ వైద్య శిబిరం పానగల్ విశాలాక్షినగర్‌లో జరిగినది. అందు ఆర్గురు డాక్టర్లు పాల్గొని 300 మందికి చికిత్సలు చేశారు. సద్గురు సర్వ సేవా ట్రస్టుచే మందులు ఉచితంగా ఇవ్వబడినవి.

Regd.No. TRP / 123/2012-14 January 2015 Rs.6/- R.No.8139/63

Postal Regd. No.
TRP/123/2015-2017



సచ్ఛీలము ముప్పాతిక మతము

మానవుని మాధవునిగ మార్చునది సచ్ఛీలము. మానవుని దానవునిగ రూపొందించునది దుశ్శీలము. దుశ్శీలమును వీడి సచ్ఛీలమును ఆశ్రయించుటయే మానవతా చిహ్నము. Character is 3/4 Religion - సద్గుణ సమాశ్రయత్వమే ముప్పాతిక మతమని చెప్పబడినది. అది లేనిచో మతమునకు గాని, మానవునికి గాని విలువే యుండదు. కాబట్టి శీల సంపాదన, సద్గుణావలంబనము జీవితమందలి అతి ముఖ్యమైన అంశముని విజ్ఞులు పేర్కొనిరి.

- శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వేదాంతభేరి

ఫిబ్రవరి 2015 రూ. 6/-



దైవం ఆశించేది
నిర్మలమైన ప్రేమ

మీరు నివసించే గృహము అసహ్యంగా ఉండే సమయంలో ఎవరైనా మీ ఇంటికి వస్తే మీ కెంత అవమానంగా వుంటుంది? మరి మీరు నివసించే ఈ దేహంలో మలినమైన మనస్సు, అపవిత్రమైన గుణములుండగా మీరెందుకు సిగ్గుపడడంలేదు?

మీరు ధరించిన వస్త్రం మలినంగా ఉంటే అవమానం చెందనక్కర్లేదు. మీహృదయం మాత్రం పవిత్రంగా వుండాలి. మీరు భగవంతుని పొందాలన్న భావంతో పరితపిస్తున్నారా? అట్లయిన నిర్మలమైన ప్రేమను పెంచుకోండి. తప్పక భగవంతుణ్ణి చూడగలరు. భగవంతునితో చేరగలరు. దివ్యమైన ఆనందమును అనుభవించగలరు.

- శ్రీ సత్యసాయిబాబా

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 ఫిబ్రవరి 2015 సంచిక : 2

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు, విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju at Aruna Graphics Press , Rayaji Street, Nellore-524 001, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం **వేదాంతభేరి** ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 ఫిబ్రవరి 2015 సంచిక : 2

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. బ్రహ్మానందము జీవుని స్వరూపము
- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06

03. ధ్యానము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 09

04. జ్ఞానసుధ - సర్వభూషణ శివయోగి - 11

05. శ్రీనారాయణ గురుబోధనల ప్రాధాన్యం-డా॥ సముద్రాల లక్ష్మణయ్య- 14

06. ఓ మనస్సా ! వినుమా ! - శ్రీ విద్యాప్రకాశానాందగిరిస్వాములవారు-23

07. అక్కమహాదేవి అనుభవామృతం - శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి - 24

08. శ్రీ భక్తతుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 26

09. కథాత్మక గీతాసూక్తులు - డా ॥ కె. సర్వోత్తమ రావు - 31

10. పరంపరాప్రాప్త యోగ దార్శనికులు-శ్రీ అమృతానందస్వామీజీ- 36

11. భాగవత కృష్ణుని చేతి వెన్న ముద్దలు - జోశ్యం శ్రీనివాస్ - 40

12. వార్తలు - 42

ముఖచిత్రం :

పంచముఖ పరమేశ్వరుడు (శివుడు)

17-02-2015 మహాశివరాత్రి

ప్రార్థన

ఓం నమో భవాయ చ, రుద్రాయ చ, నమశ్శర్వాయ చ ।
పశుపతయే చ, నమో నీలగ్రీవాయ చ, శితికంఠాయ చ ॥
నమః కపర్దినే చ, వ్యుప్తకేశాయ చ, నమస్సహస్రాక్షాయ చ ।
శతధన్వనే చ, నమో గిరిశాయ చ, శిపివిష్టాయ చ ॥
నమో మీఢుష్టమాయ చ, ఇషుమతే చ,
నమో హ్రస్వాయ చ, వామనాయ చ, నమో బృహతే చ ॥
వర్షీయసే చ, నమో వృద్ధాయ చ, సంవృధ్వనే చ ।
నమో అగ్రియాయ చ, ప్రథమాయ చ, నమో ఆశవే చాజిరాయ చ ॥

తా ॥ భవాయ = సర్వ ప్రాణులకు కారణమైన వానికి (వీనివలన ప్రాణులు పుట్టుచున్నారు అను వ్యుత్పత్తిలో భవుడు) రుద్రునకు (రోదనమునకు కారణమైన దుఃఖాన్ని పోగొట్టువాడు రుద్రుడు) నమస్కారము.

శర్వునకు = పాపములను పోగొట్టువానికి (శృణాతి హినస్తి పాపానితి శర్వః) పశుపతికి (అజ్ఞానం వలన పశువుల వంటి వారిని పాలించువాడు) నమస్కారము. నీలకంఠునకు (సముద్ర మథనంలో వచ్చిన కాలకూట విషాన్ని శివుడు తాను తీసుకొని కంఠంలో ధరించాడు. విష ప్రభావంచే శివుని కంఠం ఏకదేశం నీలవర్ణమైంది), అట్లే తక్కిన కంఠభాగం తెల్లగావుంది అట్టి) శితి కంఠునకు నమస్కారము. జటాజూటం గలవానికి, సగము ముండితాలైన వెంద్రుకలు గలవానికి నమస్కారము. సహస్రాక్షునకు (అనేక కన్నులు గలవానికి), నూరు ధనుస్సులు గలవానికి నమస్కారము.. కైలాస పర్వతము నందుండువానికి, విష్ణు రూపము గల వానికి నమస్కారము. అన్ని ప్రాణుల పోషణకై మేఘరూపంలో మిక్కిలి వర్షించు వానికి,సాధు బాధకులను శిక్షించుటకొఅకే బాణములను ధరించియున్న వానికి నమస్కారము. వేదములచే చక్కగా పొగడబడినవానికి, సృష్టికి ముందున్న వానికి (సృష్టికంటే ముందే వున్న వానికి) అందరి కంటే ఉత్తముడు (ప్రథముడు) ఐన శివునికి– రుద్రునికి నమస్కారము.

17 – 02– 2015 తేది మహాశివరాత్రి సందర్భంగా ఆశ్రమంలో ఏకాదశ రుద్రాభిషేకము, బిల్వార్చన జరుగును.



బ్రహ్మానందము జీవుని స్వరూపము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రపంచములోని ఏ పదార్థమైనను జీవునకు త్రెంపులేని ఆనందమును ఒనగూర్చుచున్నదా ? ఒక గంట, రెండు గంటల సేపైనను అవిచ్ఛిన్నమైన సంతృప్తిని, సంతోషమును గలుగజేయుచున్నదా ? లేదు. రాజాధిరాజులు అనుభవించు సుఖములైనను తాత్కాలికమైనవే. వెంటనే ఏదియో యొక దుఃఖము వచ్చి ఆసుఖములను ఆవరించి వేయుచున్నవి. అట్టి చంచల సుఖములకు ఏమైన విలువ యుండునా ? అది, అంతములతో గూడిన ఆ యింద్రియసుఖములకు శాస్త్రకారులు ఏమాత్రము విలువ ఇవ్వలేదు. అవి సుఖమును కలిగించినట్లు తోచినను లోన అపారమగు దుఃఖమును కలిగియుండును. కనుకనే గీతాచార్యుడు 'నతేషు రమతే బుధః' వానియందు తెలివిగలవాడు ఆసక్తినుంచడు అని సెలవిచ్చెను.

యయాతి రెండు యౌవనముల కాలము అన్ని భోగములను పరిపూర్ణముగ అనుభవించి తుదకు వానిచే వాస్తవమైన శాంతిగాని, పూర్ణసంతృప్తిగాని కలుగనే కలుగదని భేరిమ్రోగించి లోకమునకు చాటెను. ఏమియులేని దరిద్రుడు విషయభోగములందు సారములేదని చెప్పినచో ఆమాటకు లోకము విలువ నొసంగకపోవచ్చును. అది అభావ వైరాగ్యమని త్రోసివేయవచ్చును. కాని ఒక మహారాజు సమస్త భోగభాగ్యములు, సకల సంపదలు తన ఆధీనమందు గలిగియుండి, ఒక యౌవనకాలముకాక వరుసగ రెండు యౌవనకాలము ఊపిరితిరుగకుండ సమస్త ఇంద్రియ సుఖములు అనుభవించి తెలిపిన అభిప్రాయమునకు తప్పక విలువనొసంగ వలసి యుండును. అతడు లోకమునకు చాటిన అంశమేమనగా

" ఓ జనులారా ! అనుభవించిన కొలది కోరికలు పెరుగుచుండునేగాని తరగవు. నిప్పులో నెయ్యివేసినచో అగ్ని ఇంకను విజృంభించునే కాని తరగిపోదుగదా ! అట్లే కోరికలున్ను ఎంత అనుభవించినను, 'చాలు' అని అననే అనవు. ఎన్ని నదులు వచ్చి సముద్రములో పడినను సముద్రము తృప్తి నొందనట్లు మనస్సున్ను ఎన్ని ప్రాపంచిక సుఖముల ననుభవించినను, తృప్తిని, శాంతిని పొందకయే యుండును. "

వసిష్ఠగీతయందు నిర్వాణ ప్రకరణములో ఒక విద్యాధరునియొక్క ఉపాఖ్యానము చెప్పబడియుండెను. ఒకానొక విద్యాధరుడు వేలకొలది సంవత్సరములు రాజ్యమేలి. శత్రువులను జయించి, బ్రహ్మాది స్తంబపర్యంతముగల సమస్త సుఖములను కడుపార అనుభవించి తుదకు అసంతృప్తినే వెల్లడించెను. పరిపూర్ణశాంతి, పరిపూర్ణ సుఖము వానివలన తనకు కలుగనేలేదని అతడు బాహాటముగ వెల్లడించి శాశ్వతమగు ఆత్మసుఖమునకై తీవ్రముగ పరితపించెను.

ప్రాప్తేన యేన నో భూయః ప్రాప్తవ్య మవతిష్ఠతే
తత్ప్రాప్తౌ యత్నమాతిష్ఠేత్కష్టయాపి హి చేష్టయా

' దేనిని పొందినచో తిరిగి మఱి దేనిని పొందనవసరము లేదో, అట్టి శాశ్వత ఆత్మప్రాప్తి కొఱకే గట్టి ప్రయత్నము చేయవలెను '. అని ఆ విద్యాధరుడు తుట్టతుదకు తన అభిప్రాయమును లోకమునకు వెల్లడించెను.

అట్లే భోగవిలాసములందు మునిగితేలిన భర్తృహరి ఎపుడెపుడు నేను గంగాతీరమందలి యిసుకతిన్నెలపై గూరుచుండి బద్ధపద్మాసనస్థుడనై దృష్టిని అంతర్ముఖమొనర్చి ' ఓ గౌరీనాథా ! ఓ త్రిపురాంతకా ! ఓ శంభూ! ఓ త్రినేత్రా ! ' అని ఆ పరమ శివుని, ఆ ఆత్మారాముని ఏకాగ్రచిత్తముతో ధ్యానింతునో! అని తల్లడిల్లెను. ఈ ప్రకారముగ ఎందరో రాజాధిరాజులు,

మహాసంపన్నులు, ఆగర్భ శ్రీమంతులు ఈ ప్రాపంచిక సుఖములను, ఈ ఇంద్రియార్థములను, ఈ విషయ భోగములను తనివితీర అనుభవించి, అనుభవించి, తుదకు విసుగును బొంది వానిచే పూర్ణతృప్తినిగాని, పూర్ణసుఖమును గాని బొందజాలక వానియన్నింటికి ఒక నమస్కారము పెట్టి, వైరాగ్యము నవలంబించి ఆత్మోన్ముఖులైరి. ప్రాపంచిక సుఖములు సుఖాభాసములేకాని సుఖములుకావు. ప్రతిబింబ సుఖములే కాని, బింబసుఖములుకావు. రాజసిక సుఖములే కాని, సాత్త్విక సుఖములుకావు. పయోముఖ విషకుంభమువలె అవి పైకి సుఖముగ కన్పించినను, లోన దుఃఖమునే కలిగి యుండును.

ఇక్కారణమున ఆ మహా మహా చక్రవర్తులందరున్ను ఎట్టకేలకు బాహ్యదృశ్య ప్రపంచమునుండి మఱలి, తమ తమ ఇంద్రియములను అంతర్ముఖ మొనర్చి ఆత్మానందమునకై తీవ్రతరకృషి సలిపిరి. నిద్రయందు మనస్సులయించినపుడు, దృశ్యమును మఱచినపుడు జీవుడు త్రెంపులేని ఆనందమును అనుభవించుచున్నాడు. అట్లే ధ్యానాభ్యాసముచే మనుజుడు అవిచ్ఛిన్నమైన ఆత్మసుఖమును అనుభవించగలడు. అయితే నిద్రయందలిది జడస్థితి కాబట్టి బంధరాహిత్యమును గలుగజేయజాలదు. ధ్యానమందలిది చైతన్యస్థితి, సమాధి స్థితి, కావున బంధమును తొలగించివేయగలదు. కావున మహనీయులు వైరాగ్య విచారణాదులచేతను, భక్తిజ్ఞానములచేతను తమ మనస్సును పవిత్రతమ మొనర్చి అతిసూక్ష్మముగజేసి అధిష్ఠానమగు ఆత్మయందు లయింపజేసి అట్టి సమాధిస్థితియందు పరమానంద మనుభవించు చుందురు. అదియే ఆత్మ సుఖము. బ్రహ్మానందము. అది త్రెంపులేనిది. అంతులేనిది. అదియే జీవుని స్వస్వరూపము. అదియే జీవుని జన్మహక్కు.అద్దాని ననుభవించుటకై సర్వులును శీఘ్రముగ యత్నశీలురు కావలయును.

ధ్యానము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

పరిశుద్ధమైన జ్ఞానము, కరుణ, త్యాగము మూర్తీభవించిన ప్రియ సోదరీ సోదరులారా ! ఒక ప్రకాశమైన లైటును (లాందరు) వెలిగించుట కొఱకు దాని గ్లాసును (చిమ్నీ) తుడుచునట్లు ప్రతి రోజు ఈ చిమ్ని (గ్లాసు) తుడుచుటచే స్వచ్ఛమైన దీపము ప్రకాశించుచుండును. ఈ చిమ్నిని కొద్దిరోజులు తుడువకపోయినచో పొగచే ఆవరింపబడినదై దీపప్రకాశము ఏలాగున కానిపించదో ఆలాగున మీ హృదయమును ప్రతిరోజు ధ్యానముతో శుద్ధపఱచనిచో మీలో ప్రకాశించుచున్న జ్ఞానము కప్పబడి అజ్ఞానులగుదురు. కనుకనే మహర్షులు ఈ ధ్యాన విధానమును ఏర్పఱచిరి. ధ్యానము చేయనిచో తెలిసికొనదగిన దానిని తెలియనివారలై జీవితముయొక్క ముఖ్య ఫలమును అనుభవింపలేకపోయెదరు. నారీమణులారా ! మీ స్వగృహములో గల చెంబు మొదలైన పాత్రలను ప్రతిదినము ప్రాతఃకాలమున కడుగుచున్నారు గదా ! అట్లు చేయనిచో పాత్రలు చిలుముపట్టి అందులోని పదార్థం యేలాగున చెడునో అదేరీతిగా అంతఃకరణశుద్ధి చేయనిచో మూఢులై పోవుదురు గదా!

ఈ ధ్యానమును ప్రాతః సంధ్యాకాలములలో అభ్యసించుట మరింత మంచిది. ఏలనన (1) అప్పుడు ప్రకృతి చాల శాంతమై యుండును. అంతేగాక సంధ్యాకాలంలో దినము రాత్రితోను, రాత్రి పగటితోను కలయుటచేత ఆత్మైక్య ధ్యానము చేయువారికి చాల అనుకూలముగా నుండును.

(2) భగవంతుడు భక్తులయొక్క భావనారూపపై యుండును. అనేకమంది మహాత్ములు, యోగులు, భక్తులు, సిద్ధులు, మహర్షులు అందురున్ను ఈ కాలమున ధ్యానము చేయుచుందురు. కనుక అప్పుడు లోకములో గొప్ప జ్ఞానము, కరుణ, శాంతము, భక్తి మొదలైన దైవభావములు వ్యాపించి యుండును. మఱియు సంధ్యాకాలము అనేక ప్రాణికోట్లకు తమో,

రజోగుణములు తొలగినవై సత్త్వగుణముండును. అస్తమయ కాలములో పక్షులన్నియు వాటి వాటి కర్మేంద్రియ వ్యాపారములను మాని చిత్తము నేకాగ్ర పఱచి తమ తమ గూడులలో ప్రశాంతముగా, ప్రసన్నముగా నుండును. అదేవిధముగా గోవులు, గొఱ్ఱెలు మొదలైన జంతువులు కూడా కర్మేన్ద్రియాల నణచుకొని అతి సంతోషంగా యుండును. కొంత రాత్రి అయిన అవన్నియు నిద్రలో ప్రవేశించును. ప్రథమయామ రాత్రిలోపల ధ్యానము చేయుట శ్రేష్ఠమని విధింపబడిన రహస్యమిదియే.

పరమహంసోపదేశాలు

– శ్రీ రామకృష్ణ పరమహంస

1. సంసారంలో ఉంటూ భగవంతుని పాదపద్మాలపై భక్తిని కలిగి వుండేవాడు నిజంగా ధన్యుడు సుమా ! నెత్తిమీద రెండుమణుగుల బరువు పెట్టుకొని కూడా దారిన వెళ్లే పెళ్లివారి ఊరేగింపు చూసే వ్యక్తి లాంటివాడు గృహస్థుడు. అతడు ఎంతో శక్తి ఉంటే తప్ప అలా జీవించలేడు.

సంసారంలో నిర్లిప్త భావంతో ఉండడానికిగాను కొన్ని సాధనలను చేయవలసి ఉంటుంది. కొంతకాలంపాటు ఏకాంతంలో ఉండడం అవసరం. అది ఏడాదిపాటు కావచ్చు, ఆరునెలలు కావచ్చు, మూడు నెలలు కావచ్చు, ఒక నెలైనా కావచ్చు. ఆ ఏకాంతంలో భగవచ్చింతన చేయాలి. వ్యాకుల చిత్తంతో భగవంతుణ్ణి భక్తి కోసం ప్రార్థించాలి.

2. వెన్న తీశాక దానిని కొత్త కుండలో కనక పెడితే అది చెడిపోవడానికి ఆస్కారం వుండదు. కానీ దానిని పెరుగుపెట్టిన కుండలో పెట్టినట్లైతే సందేహమే.

3. దైవభక్తి లేకపోవడమే మానవుని అపరిమిత బాధలన్నింటికి కారణం. కాబట్టి మానవుడు అవసాన కాలంలో నారాయణ స్మరణకు తోడ్పడే సాధన చేయాలి. అదే భక్తి సాధన.

జ్ఞాన సుధ

మూలం

శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :

పూజ్యశ్రీ శంకరానందగిరి

స్వాములవారు

ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : జగదధ్యారోపమునకు మొదట వాఙ్మనస్సుల కందని పరవస్తువు ఒకటి యున్నదని చెప్పబడినది. కావున జిజ్ఞానువులకు ఆ పరవస్తు వెట్టిది? ఎక్కడున్నది ? యని జిజ్ఞాస కలుగవచ్చును. కాబట్టి ఆ తత్త్వమును ఈ శ్లోకమున వివరించుచున్నారు.

బ్రహ్మ - స్వరూప లక్షణము

సత్తా యస్య చిదద్వయీ సుఖమయీ ప్రాగాద్యభావాన్ పరి
చ్ఛేదాన్ వస్తుముఖాన్ వ్యతీత్య మునిభిః స్వాత్మా స్వయం తుల్యతే
ఏతస్మిన్ స్వగతాది భేద విముఖే బ్రహ్మణ్యజాండాలయో
రోదస్యల్పతరాః పరాణవ ఇవ స్థేమాన మాతన్వతే11

యస్య = ఏ పరబ్రహ్మము యొక్క, సత్తా = ఉనికి, చిదద్వయీ = అద్వితీయమైన జ్ఞానరూపమో, చిద్ఘనమో, సుఖమయీ = (సకల ప్రాణుల పరమ ప్రీతికి విషయమై యున్నందున) సుఖరూపమో, ఆనందఘనమో, ప్రాగాది అభావాన్ = ప్రాగభావ ప్రధ్వంసాభావ అన్యోన్యాభావ అత్యంతా భావములను, వస్తుముఖాన్ పరిచ్ఛేదాన్ = దేశ కాలవస్తు పరిచ్ఛేదములను, వ్యతీత్య = అతిక్రమించి, స్వయం = తనంతాను ఉన్నదో, మునిభిః = మునులచేత, జ్ఞానులచేత, స్వాత్మా = తమ ఆత్మగా, స్వస్వరూపముగా, తుల్యతే = సరిపోల్చుకొని అనుభవింపబడుచున్నదో, ఏతస్మిన్ = ఇట్టి స్వగతాదిభేదవిముఖే= సజాతీయ విజాతీయ స్వగతాది భేద రహితమైన. బ్రహ్మణి=పరబ్రహ్మమునందు,అజాండాలయః = బ్రహ్మాండసమూహములు, రోదసి = ఆకాశమునందు, అల్పతరాః = మిక్కిలి చిన్నవియైన, పరాణవః ఇవ = పరమాణువులవలె, నలుసుల వలె, స్థేమానం = స్థితిని, ఉనికిని, ఆతన్వతే = చేయుచున్నవి (సత్తగలవి వలె అగపడుచున్నవి).

సచ్చిదానందమయము, అఖండము, అద్వితీయమునగు బ్రహ్మము అజ్ఞానులకు పరోక్షముగా ఉండినను సుజ్ఞానుల కపరోక్షమై యుండును. “ అయమాత్మాబ్రహ్మ ” యని బ్రహ్మము ఆత్మస్వరూపముచే అపరోక్షమై యున్నది. రూపరహితమగు ఆకాశమునందు పరమాణువులు అగపడునట్లు నిరాకార పరిపూర్ణ బ్రహ్మమునందు బ్రహ్మాండము లున్నట్టు తోచుచున్నవి. అనగా బ్రహ్మైక దేశము నందు జగత్కల్పనా వ్యవహారమని భావము. “ పాదో 2 స్య విశ్వాభూతాని ” అని శ్రుతి.

అవ : కొందఱు ఈ జగత్తు ఘటమువలె సావయవము గావున కార్యరూపమైనదే కాని అధ్యస్తము గాదు. దీనికి కారణమైన పరమేశ్వరుడు అన్యలోకమున ఉన్నాడని చెప్పుదురు. అది యుక్తము కాదని చెప్పుచున్నారు.

కేచి త్కుదృష్టి నిపుణాః శ్రుతిగుహ్యశుంఠాః
లోకాంతరే కృతగృహం జగు రీశమేషామ్,
ఆధేయ సావయవ ఖండితతాది దోషీ
యో దృష్ట నూ (యు) క్త్యధరిత స్స కథం నిదానమ్ 12

కుదృష్టి నిపుణాః = కుత్సిత దృష్టియందు నిపుణులైన, శ్రుతి గుహ్య శుంఠాః = వేదరహస్యమునందు అలసులైన, కేచిత్ = కొందఱు, ఏషాం = ఈ బ్రహ్మాండములకు, ఈశం = ఈశ్వరుడైన వానిని, లోకాంతరే = వేఱైన (పై) లోకమందు, కృతగృహం = ఇల్లు జేసికొని యున్న వానినిగా, జగుః = చెప్పుదురు. ఆధేయ = ఆశ్రయము గలవాడుగా ఉండుట, సావయవ = అవయవములు గలవాడుగా ఉండుట, ఖండితతా = పరిచ్ఛిన్నుడుగా ఉండుట, ఆది = ఈ మొదలగు, దోషీ = దోషములు గలవాడుగా, దృష్ట నూ (యు) క్తి ఆధరితః = కనబఱచబడిన ఉ (యు) క్తులచే క్రిందు చేయబడిన, యః = ఏ యీశ్వరుడుగలడో, సః = అతడు,

కథం నిదానమ్ = ఎట్లు జగత్కారణము కాగలడు ?

సావయవుడు, కైలాసవాసి, పంచముఖుడు, త్రినేత్రుడు, డమరు త్రిశూలధారి, పార్వతీ సమేతుడు నైన శివునిచే సృష్టినంగీకరించిన అది పొసగదు. అప్పుడతడు దేశకాలాదులచే పరిచ్ఛిన్నుడగును. ఒకప్పుడు అట్లంగీకరించినచో కులాలునివలె (కుమ్మరివానివలె) ఇతడును ఉత్పత్తి నాశాది దోషములచే గూడినవా డగును. తానే పుట్టు చావులకు లోనైన ఈశ్వరుడు జగదుత్పత్తికి ఎట్లు కారణమగును ? కాజాలడు. ఇక ఆ శివుడే తన ఉత్పత్తి నాశములను తానే చేసికొను ననిన కర్మకర్తృ దోషము వచ్చును. వేఱొకనిచే అని చెప్పిన అన్యోన్యాశ్రయ దోషము వచ్చును. అందుచే శరీరముగల సావయవుడగు శివునిచే జగదుత్పత్తి యని చెప్పరాదు. **12**

అపూర్వావకాశము

తిరుమల తిరుపతి దేవస్థానం వారు పోస్టల్ డిపార్టుమెంటు కలసి తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి శీఘ్ర దర్శన టిక్కెట్లు (రూ. 300/-ల టిక్కెట్లు) ఇకపైన మీ సమీప ప్రధాన పోస్టాఫీసులలో లభించే ఏర్పాట్లు చేశారు.

కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని తిరుమలలో శ్రీఘ్రదర్శనమునకు రూ. 300/- టిక్కెట్లు ఏర్పాటు చేసిన విషయం అందరికి తెలిసినదే. కానీ ఇపుడు ఆ రూ. 300/- శీఘ్ర దర్శన టిక్కెట్లు ఇటుపైన ఆంధ్రప్రదేశ్ మఱియు తెలంగాణ రాష్ట్రములలో 97 ప్రధాన పోస్టాఫీసులలో కూడా లభించును. ఒక నెల లోపల ఏ తేదీలలో మీకు శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కావాలో ఆ తేదీ దర్శనానికి కావలసిన (మూడు వందల రూపాయలు) టిక్కెట్టును ఇక మీదట మీకు దగ్గఱ గల ప్రధాన పోస్టాఫీసులలో తీసుకొనవచ్చునని తపాలా శాఖ వారు తెలియజేస్తున్నారు.

- ఇట్లు

సూపరిండెంటు, తిరుపతి ప్రాంత పోస్టాఫీసులు

శ్రీనారాయణ గురు బోధనాల ప్రాధాన్యం

- డా || సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

ఆత్మవిశ్వాసం లేనివాణ్ణి క్షుద్రమైన హృదయదౌర్బల్యం లోగొంటుంది. అట్టివాడు ఎందుకూ కొఱగాకుండా పోవడం జరుగుతుంది. ఇది గమనించిన నారాయణ గురుస్వామి బడుగువర్గాలలో ఆత్మవిశ్వాసం కల్గించడాని కవసరమైన చర్యలు చేపట్టారు, ప్రబోధాలు కావించారు. భౌతికంగానే కా, ఆధ్యాత్మికంగా కూడా ప్రజల పురోగతికి కారకు లయ్యారు.

ఆయన కొనసాగించిన ఉద్యమం నిర్మూలనాత్మకంగా **(destructive)** కాక నిర్మాణాత్మకంగా **(Constructive)** ముందుకు సాగింది. ఆయన ఋషిత్వానికిది ఒక ప్రబలమైన నిదర్శనం. శాంతియుతంగా ఊహకందని మార్పు సంభవించడం ఆశ్చర్యకరం ! స్వామి దిశానిర్దేశం చేసి వంద సంవత్సరాలు గడిచాయి. అయినా నేటికీ అది అనుసరింపదగిన మార్గంగానే ఉన్నది.

ఇది ఎలా సాధ్యమయిందో ఆనాడు జరిగిన ఒక సంఘటన ద్వారా తెలుసుకొందాం. ఆ రోజుల్లో అణచివేతకు గురి అయిన వారికి దేవాలయ ప్రవేశం ఉండేది కాదు. ఈ దుఃస్థితి వారి ఆత్మన్యూనతకు కారణమయింది. దీన్ని నివారించడానికి స్వామి కృతనిశ్చయు లైనారు.

అరువిపురం అనే చోట ఒక శివరాత్రినాడు తానే శివలింగ ప్రతిష్ఠ నిర్వహించారు. అక్కడ ఇలా ప్రకటించారు.“ ఇదొక ఆదర్శక్షేత్రం. కులభేదాలు, మతద్వేషాలు లేకుండా మానవులందరూ సోదరుల్లాగా ఇక్కడ జీవించవచ్చు. సంఘటన ద్వారా బలమూ, విద్యద్వారా స్వేచ్ఛా సిద్ధిస్తాయి”.

వినా సంఘటనాం శక్తిః వినా శక్తిం సముజ్జ్వలామ్ ।

జయో న స్యాదతః సమ్యక్ ఘటితా భవత ద్రుతమ్ ॥

విద్యాసంఘటనాహీనాశ్శక్తిహీనాశ్చ మానవాః ।

క్రమేణ పతితా లోకే దుఃఖభాజో భవన్తి హి ॥

(నారాయణవిజయః 9-25,26)

సంఘటన లేకపోవడమూ, విద్యారాహిత్యమూ అన్ని దుఃఖాలకూ కారణమని గురుస్వామి నిర్ద్వంద్వంగా ప్రకటించారు. నారాయణధర్మపరిపాలన యోగం ద్వారా ఈ సంఘటన విస్తృతవ్యాప్తి పొంది ప్రజలకు ఎనలేని శక్తి సమకూర్చింది.

వారు శివలింగాన్ని ప్రతిష్ఠించినప్పుడు "బ్రాహ్మణేతరుడైన ఎళవ కులస్థుడు శివలింగప్రతిష్ఠ ఎలా చేస్తాడు ?" అన్న వ్యతిరేకతను వ్యక్తం చేసే ప్రశ్న వచ్చింది. అందుకు స్వామి సమాధానంగా " నేను ప్రతిష్ఠించినది ఎళువ శివుణ్ణే " అని చెప్పారు. ఆ మాటతో సనాతన పండితులు నిరుత్తరులయ్యారు. గురుదేవుల ఈ చర్య ఎంత తీవ్రమైనదో అంత ప్రశాంతమైనది కూడా. అందువల్లనే వారిది నిర్మాణాత్మకమైన సంస్కరణగా ప్రశస్తమయింది.

ఆనాడు మహాత్మాగాంధీగారు దేశవ్యాప్తంగా తలపెట్టిన బడుగువర్గాల దేవాలయ ప్రవేశానికి చెందిన సత్యాగ్రహంలో 'వైకోం ' అనే చోట శ్రీనారాయణ గురుదేవులు తన శిష్యుల ద్వారా అందజేసిన సహకారం అమోఘమైనది. అదొక గొప్ప శాంతియుత సాంఘిక ఆధ్యాత్మిక విప్లవంగా భాసించింది.

మహాత్మాగాంధీ ఈ సందర్భంలోనే శ్రీనారాయణగురుస్వామిని కలుసుకున్నారు. ఇరువురి కలయిక ప్రజలలో ఎంతో ఔత్సుక్యం కల్గించింది. వర్ణవ్యవస్థ విషయమై స్వామితో మాట్లాడిన తరువాత గాంధీగారు తమకున్న

అభిప్రాయాలను మార్చుకున్నారని తెలుస్తున్నది.

దేవాలయాలు సమాజాభ్యున్నతికి సహకరించే సంస్కార కేంద్రాలుగా ఉండాలని స్వామి నిర్దేశించారు. ఆలయంచుట్టూ తోట ఉండాలి. అందులో మంచి చెట్లు పెంచాలి. ఆ చెట్లచుట్టూ విశ్రాంతికీ, ధ్యానాదులకూ అనుకూలమైన వేదికలుండాలి. ఆలయాని కనుబంధంగా ఆధ్యాత్మిక గ్రంథాలయమూ, సమావేశమందిరమూ ఉండాలి. ప్రశాంతమూ, పరిశుభ్రమూ అయిన వాతావరణం ఉన్నప్పుడే ఆలయాలు జనాకర్షకాలుగానూ సంస్కార కేంద్రాలుగానూ, ఆధ్యాత్మికనిలయాలుగానూ శోభిస్తాయి " అని స్వామి అభిప్రాయం.

త్రిచూర్ ఆలయం సందర్శించిన సందర్భంలో స్వామి ఇచ్చిన సందేశమిది. ఆ సమయంలోనే దైవదశకాన్ని స్వామి రచించారు. ప్రతియింటా సంధ్యా సమయంలో దాన్ని పఠించాలని కూడా నిర్దేశించారు. ఈ దశకంలో ప్రత్యేకించి ఒక దేవతను పేర్కొన లేదు. విశ్వసృష్టికి మూలమైన ఒక దివ్యశక్తిని ప్రార్థిస్తూ రచించిన పది ప్రార్థనా శ్లోకాలు ఇందులో సమకూర్చడమయింది.

ప్రజల భౌతిక సుస్థితి నపేక్షించి స్వామి పరిశ్రమలు స్థాపించడానికి ప్రజలను ప్రోత్సహించారు. తద్ద్వారా ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిని సాధించవచ్చు అని బోధించారు. జీవితంలో నైతిక దృక్పథం అవసరమని ఉపదేశించారు. పెండ్లిండ్లు మున్నగు సందర్భాలలో జనులు పాటించే మూఢాచారాలు ఏమాత్రం తగవని చెప్పారు.

స్వామి హిందూసమాజంలో దృఢంగా వ్రేళ్లూనుకొన్న జన్మజాతివాదాన్ని నిశితంగా ఖండించారు. ఆయన విద్యాలయాలు స్థాపించి కులభేదం లేకుండా అందులో అందరికీ ప్రవేశం కలిగించారు. అందరిచేతా వేదమంత్రాల నభ్యసింపజేశారు.

ఒకసారి శ్రీనీలకంఠశాస్త్రి అనే పండితుడు స్వామి వద్దకు పోయి " జాతి భేదం వేద సమ్మతం కదా ! వేదాన్ని విశ్వసించని బౌద్ధాదులు మాత్రమే జాతిభేదాన్ని అంగీకరించరు. అది మనకెలా సరిపడుతుంది"అని ప్రశ్నించాడు. అందుకు స్వామి " అయ్యా ! జాతిభేదం మానవులలో ప్రత్యక్షంగా కనిపించడం లేదు. ఒక వ్యక్తిని చూస్తే అతని కులమేమిటో తెలియదు కదా ! అందువల్ల ఆ భేదం అంగీకరణీయం కాదు " అని చెప్పారు.

ఆ పండితుడు " ఒక వ్యక్తిని చూచి అతని జాతి ఏదో నేను గుర్తించగలను " అని అన్నాడు. అంతట స్వామి తమ విద్యాలయంలోని బ్రహ్మచారులను పిలిపించారు. వారి చేత వేదమంత్రాలు పఠింపజేశారు. వారిలో ఒక్కొక్కరి జాతి ఏదో చెప్పమని పండితుణ్ణి కోరారు. ఆ పండితుడు వారినీ, వారి వేదపఠన విధానాన్నీ బాగా పరికించి " వీరంతా బ్రాహ్మణులే, సంశయం లేదు " అని అన్నాడు.

ఆపై స్వామి ! " అయ్యా ! వీరంతా బ్రాహ్మణులని మీరు సత్యం పలికారు. మీ అంతఃకరణం శుద్ధమైనది గాన మీరు సత్యం గ్రహించారు. కాని కొందరు వీరిని అంత్యజు లంటున్నారు. గుణకర్మానుసారం వీరంతా మీరన్నట్లు బ్రాహ్మణులే అని పలికారు.

అది విని పండితుడు సిగ్గుపడి వ్యథ చెందాడు. జాతి భేద విషయమై తన అభిప్రాయం మార్చుకున్నాడు. ఈ విషయాన్ని ఇంకా విస్తృతంగా తెలుసుకోవాలంటే ' నారాయణ విజయః ' అనే సంస్కృతకావ్యాన్ని చదవండి! స్వామి ఎంత గొప్ప తత్త్వవేత్తయో, అంత గొప్ప సంఘ సంస్కర్త. ఆ సంస్కరణ నిర్మాణాత్మకంగా స్వామి సంకల్పించినట్లే జరిగింది.

ఒకసారి ఒకవ్యక్తి తేజస్వి ఐన స్వామిని చూచి 'మీ పేరేమి' అని అడుగగా 'నారాయణ' అని స్వామి బదులు పలికారు. మరల అతడు ' మీ కుల ' మేది ? అని ప్రశ్నించాడు. చూస్తే తెలియడం లేదా? ' అని స్వామి

ప్రతిప్రశ్న వేశారు. ' చూస్తే ఎలా తెలుస్తుంది?' అని అతడన్నాడు. 'ప్రత్యక్షంగా చూస్తేనే తెలియనిది విన్నంతమాత్రాన ఎలా తెలుస్తుంది '? అని స్వామి అనే సరికి ఆయన నిరుత్తరుడయ్యాడు.

జాతి నిర్ణయం విషయంలో స్వామి తన అభిమతాన్ని ఈ క్రింది శ్లోకంలో విస్పష్టంగా ప్రకటించారు.

మనుష్యాణాం మనుష్యత్వం జాతిర్గోత్వం గవాం యథా ।
న బ్రాహ్మణాది రస్యైవం హా తత్త్వం వేత్తి కోఽపి న ॥

(సంస్కృతకృతయః, పుట - 25)

గోవులలో గోత్వం లాగా మనుష్యులలో మనుష్యత్వమే జాతి. బ్రాహ్మణాది జాతులు లేవు. అయ్యో ! ఈ తత్త్వం ఎవడూ తెలుసుకోవడం లేదే ! అని నిర్వేదం ప్రకటించారు. జాతిభేదం వల్లనే అత్యధికసంఖ్యాకుల ఐహికాముష్మికాభివృద్ధి కుంటుపడింది. ఆ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలంటే జాతి భేదాన్ని తొలగించక తప్పదు. నేటి మన రాజ్యాంగం కులభేదాన్ని అంగీకరించదు గదా !

మనుష్యజాతి అంతా ఒక్కటే అని నిర్ద్వంద్వంగా ప్రకటించిన స్వామి ఈ ఏకత్వాన్ని జాతికి మాత్రమే పరిమితం చేయక దేవతలకూ, మతాలకూ గూడా విస్తరింపజేశారు.

జాతిరేకా మనుష్యాణాం మతమేకమనిందితమ్ ।
దేవో ఽ ప్యేకః సమాసేన జాతిరాదౌ నిరూప్యతే ॥

(నారాయణ స్మృతి : 2-33)

" మానవజాతి ఒక్కటే. నిందకు గురికాని శ్రేష్ఠమైన మతమూ ఒక్కటే. దేవుడు గూడా ఒక్కడే " అని భావం.

నారాయణ స్మృతి స్వామి రచించిఇన సంస్కృతగ్రంథం. ఇందులోని 3,4,5 సర్గలలో జాతి - మత - దేవతలలోని ఏకత్వాన్ని స్వామి

హేతుబద్ధంగానూ, శాస్త్రీయంగానూ నిరూపించారు. మానవులలో లేని భేదాన్ని కల్పించి అందులో కొందరికి ఆత్మోన్నతి పొందడానికి తగిన అవకాశం లేకుండా చేయడం తీవ్రమైన దుశ్చర్య. ఈ చర్యను ప్రాక్తన స్మృతి గ్రంథాలు సమర్థించడం విచారకరం. స్వామి పటిష్ఠంగా ఈ దుర్వాదాలను ఖండించియున్నారు. అయితే వారు ఉన్నతవర్గాలపై ఎట్టి ద్వేషమూ చూపలేదు.

ఇక పుష్పదంతుడు **" నృణామేకో గమ్యస్త్వమసి పయసామర్ణవ ఇవ "** అనిశివమహిమ్న స్తోత్రంలో రుచిభేదాన్ని బట్టి ఆరాధనావిధానాలు వేరైనా గమ్యమైన పరతత్త్వం ఒక్కటే అని నిరూపించినాడు. గీతలో భగవంతుడు " అన్ని మార్గాలూ తన్ను చేరేవే " అని వివరించాడు. స్వామి అభిప్రాయాలు పై నిర్దేశాల ననుసరించినవే.. అన్ని మతాలూ ఒకే పరమాత్మను ప్రతిపాదిస్తున్నాయి. ప్రతిపాదన విధానాలు వేరైనా ప్రతిపాద్యతత్త్వం ఒకటే అయినపుడు మతమూ ఒక్కటే, దేవుడూ ఒక్కడే అనడం సమంజసమే. పండితులు సమదర్శనులని గీత చెబుతున్నది. సమదృష్టిని ఉపనిషత్తులు బ్రహ్మజ్ఞుల లక్షణమన్నాయి.

" సమబుద్ధే యిందరికీ సర్వవేదసారము, సముడిందరికీ హరి సాధనమో యయ్యా" అని అన్నమాచార్యుల ప్రబోధం, సర్వభూతసమత్వమే జ్ఞాని లక్షణమని శ్రీరమణగీత. ఇంతగా సమదృష్టిని ఎందరో ఎన్ని విధాల శ్లాఘించినా, భారతావనిలో సమత్వం మాటలకూ, ఉపన్యాసాలకూ, గ్రంథాలకూ పరిమితమై విషమత్వం విలయతాండవం చేసింది. సమత్వం అనుష్ఠానంలోకి రావాలి గాని మాటలలో ఉంటే ప్రయోజనం లేదని నిరూపించిన మహితాత్ముడు మన స్వామి.

ధ్యానంతోనూ, యోగంతోనూ స్వారాజ్య సిద్ధిని పొందిన స్వామి భౌతిక ప్రపంచం యొక్క అశాశ్వతత్వాన్ని గ్రహించిన తత్త్వజ్ఞుడు. అయినా సామాన్య జనుల భౌతికావసరాల పట్ల ఆయన అశ్రద్ధ చూపలేదు.

జీవితలక్ష్యం ఆత్మప్రాప్తి. ఆధ్యాత్మిక పరిణతి అందుకు సాధనం. స్వామి ఆధ్యాత్మిక ప్రగతితోపాటు భౌతికప్రగతి గూడా అవసరమే అన్నారు.సాధారణంగా ఆధ్యాత్మిక దృక్పథం గలవారు భౌతికంపై ఆసక్తి చూపరు. పైగా భౌతికాన్ని ఈసడిస్తారు కూడా. శ్రేయస్సు, ప్రేయస్సుల గూర్చిన ప్రస్తావన కఠోపనిషత్తులో వస్తుంది. శ్రేయస్సు ఆధ్యాత్మికతనూ, ప్రేయస్సు భౌతికతనూ నిర్దేశించే శబ్దాలు. ఐహికభోగాపేక్షతో ఆత్మనుపేక్షించరాదు అని కఠోపనిషత్తు ఆంతర్యం.

అయితే భౌతికంగా హీనదశలో ఉన్నవాడు ఆధ్యాత్మిక ప్రగతిని సాధించలేడన్నది సత్యం. ఆకలితో అలమటించే వానికి ఆధ్యాత్మిక ప్రబోధం చేయడం వ్యర్థమని స్వామి వివేకానందుల మాట. అందుకే శ్రేయస్సుతో పాటు ప్రేయస్సు గూడా ఉండాలి. ఈ విషయాన్నే స్వామి.

శ్రేయః ప్రేయఃప్రదో ధర్మః న తు సర్వోత్తమో భువి ।

(శ్రీనారాయణస్మృతి - పుట - 65)

అని సర్వశ్రేష్ఠమైన ధర్మంలో శ్రేయస్సుతో పాటు ప్రేయస్సు గూడా ఉండాలని నిరూపించారు. మతాంతరప్రవేశం అనవసరమని స్వామి ప్రకటించారు. ఒక క్రైస్తవుడు స్వామిని తమ మతంలోకి రమ్మన్నప్పుడు.

మతానామిహ సర్వేషాం సార ఏకో న సంశయః ।
మతభేదమతిస్తస్మాత్త్యజతాం దూరతో బుధైః ॥

(నారాయణ విజయః, 11-50)

' అన్ని మతాల సారాంశం ఒక్కటే. అందువల్ల విజ్ఞులు మతభేదమతిని పరిత్యంజించాలి' అని ఉద్ఘాటించారు.

గృహస్థులు తమ బిడ్డల పెండ్లిండ్లు జరిపేటప్పుడు దుబారా ఖర్చును అరికట్టాలని స్వామి సూచించారు.

వరస్య పితరౌ వధ్వాః పితరౌ సహపాఠినౌ ।

వధూవర జ్ఞాతియుగ్మం ఆచార్యశ్చ పురోహితః ॥

(నారాయణ స్మృతి పుట - 65)

అని పెండ్లిండ్లలో సమావేశం కావలసిన సన్నిహితులను నిర్దేశించారు. వరుని తల్లిదండ్రులు, వధువు తల్లిదండ్రులు, ఇద్దరు సహాధ్యాయులు, వధూవరులు దాయాదులిర్వురు, ఆచార్యుడు, పురోహితుడు మొత్తం పదిమంది సన్నిధిలో పెండ్లి జరగాలని పేర్కొన్నారు. వేలాది జనం చేరవలసిన పని లేదని దీన్నిబట్టి గ్రహించవచ్చు. అలా తండోపతండాలుగా పెండ్లిండ్లలో చేరిన జనులు ఆహారపదార్థాలను ఎంతగా వ్యర్థం చేస్తున్నారో విదితమే కదా !

ఇలా స్వామి ప్రజలకు లౌకిక జీవనంలో ఉన్నతి సాధించడాని కవసరమైన ప్రబోధాలు కావిస్తూ వారి ఆధ్యాత్మిక ప్రగతికావశ్యకమైన తత్త్వప్రచారం కూడా చేశారు. సౌభ్రాత్ర స్నేహాలను పెంపొందించారు. పీడిత ప్రజల పాలిటి ఏకైకరక్షకుడుగా విరాజిల్లారు.

లోకోత్తరమైన ప్రబోధాలతోనూ, పవిత్రమైన ఆచరణతోనూ విశ్వశ్రేయస్సు కొరకై పాటుపడిన శ్రీనారాయణ గురుదేవుల ఖ్యాతి విశ్వతోముఖంగా వారి జీవిత కాలంలోనే వ్యాపించింది. వారిని సందర్శించడానికి దేశం నలుమూలలనుండి ప్రముఖు లనేకులు వచ్చేవారు. అట్టివారిలో ఒకరైన రవీంద్రనాథటాగూరు స్వామిని దర్శించినప్పుడు తమకు కలిగిన అనుభూతినిలా వివరించారు.

" I have never seen one who is spiritually greater than swami Narayana guru, I shall never forget that radiant face illumined by the self effulgunt light of divine glory and those mystic eyes fixing their gaze on a far point in the distant horizon"

- Rabindranath Tagore.

శ్రీ నారాయణగురు స్వామివంటి మహాపురుషులు లోకంలో అరుదుగానే అవతరిస్తారు. వారి అవతారవిశిష్టతను గుర్తించి వారి అడుగు జాడలలో నడిచినవారు ధన్యులు.

జయతాత్త్వం మహాదేవ ! దీనావనపరాయణ !

జయతాత్త్వం చిదానంద ! దయాసింధో ! జగత్పతే ! (దైవదశకం)

(శ్రీనారాయణగురు జయంతి సదస్సులో చేసిన కీలకోపన్యాసము యొక్క సారాంశం ఇది)

వేదాన్తభేరి పత్రికకు ఈక్రింది వారు పోషక చందా పంపినవారు

01. సి. మార్కొండేయులు (శ్రీకాళహస్తి) రూ. 1200/-
02. కె.వి.ఎల్.నరసింహరావు (హైద్రాబాద్) రూ.1,116/-
03. శ్రీరామానంద స్వామి (రమణసేవాశ్రమం,రాచపల్లి)రూ.1200/-
04. వి.ఎస్.రామాచంద్రరావు (గట్టిగూడెం,ఖమ్మంజిల్లా) రూ. 1200/-
05. ఎం.బాలకృష్ణారెడ్డి (హోటల్ బ్లిస్, తిరుపతి) రూ.1200/-
06. సి.వెంకటరెడ్డి (వనపర్తి) రూ.1200/-
07. చెంబేటి శైలజ (హైద్రాబాద్) రూ.1200/-
08. పి.దేవిప్రసాద్ (విశాఖపట్నమ్) రూ.1500/-
09. బి.కె. దుర్గారావు (ఎ.ముప్పాళ్ల) రూ.1,116/-
10. కె.వి.సత్యశివప్రసాద్ (బెంగుళూరు) రూ.1200/-
11. ఎం.వెంకటరమణారెడ్డి (బెంగుళూరు) రూ. 1,116/-
12. పారిపల్లి గంగారాం (రాయకల్ -కరీంనగర్)రూ.1200/-
13. ఎం.ఎస్. నరసింహులు (నంద్యాల) రూ.1200/-
14. పాదం లింగమూర్తి (ఆత్మకూరు, కరీంనగర్‌జిల్లా) రూ.1500/-

ఓ మనస్సా ! వినుమా !

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

104. చిత్తమెల్లపుడును
విషయాల మీదికి
పరుగెత్తుచుండునూ మనసా
దేనిపై వ్రాలునో
జాగరూకుండవై
సాక్షిగా గమనించు మనసా

ఓ వివేకవంతుడగు మానవుడా ! విషయానందమును, ఆత్మసుఖమును రెండిటిని త్రాసునందు తూచిచూడుము. ఏది సారవంతమైనదో, శాశ్వతమైనదో, దుఃఖరహితమైనదో బాగుగ వివేచించుము. విచారణచే, స్వానుభవముచే దృశ్యానందముయొక్క అల్పత్వమును, నశ్వరత్వమును గమనించుము. ప్రజ్ఞావంతుడవైన నీవు నిత్యసుఖమునే, ఆత్మానందమునే కోరుకొనుము. చంచలమగు విషయ సుఖముల యెడల విరక్తి కలిగియుండుము. శబ్దస్పర్శాదులపై వ్రాలుచున్న చిత్తమును సాక్షిరూపముగ వీక్షించుచు, అద్దానికి తత్త్వసారమును బోధించుము. ఇంద్రియ మనంబులను బాహ్యవస్తు సంపాదన నుండి మరలించి అంతర్ముఖము గావించి, పరమానందమును అనుభవించుము.

ఓ మనస్సా ! విను ? నీవున్ను వివేకవంతుడవై స్థితప్రజ్ఞుల సన్మార్గములో పయనించు. జన్మాంతర సంస్కారముల ప్రాబల్యమున శ్రోత్రాది ఇంద్రియములు, బాహ్య సుఖములకై పరుగులిడుచున్నవి. ఏయే వస్తువులపై ఇంద్రియములు అభిలాషను కలిగియుండుచున్నవో, ఏయే అల్పసుఖములకై నీ అంతరంగము ప్రాకులాడుచున్నదో సాక్షిగ గమనించు. ఆయా వస్తువులయొక్క దృశ్యసుఖములయొక్క నశ్వరత్వమును, నాశశీలత్వమును, దుఃఖజనకత్వమును బాగుగ గ్రహించి విషయ వైరాగ్యమును చేబట్టు. నిత్య నిరతిశయానందమగు స్వాత్మ కొరకు జపసాధన, అష్టాంగయోగ సాధన సలుపు. ప్రయత్నాతిశయముచే హృదయ శుద్ధిని, జ్ఞానోదయమును బడసి కృతకృత్యుడవు కా.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత
- డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వాములవారు

21. శివశరణులు సంసారమును సంసారమనే వల, సంసారమనే కుక్క, సంసారమనే సర్పము, సంసారమనే సుడిగాలి, సంసారమనే సాగరము అని ఈవిధంగా అనేక విధములుగా సంసారమును వ్యాఖ్యానించినారు. అక్కమహాదేవి ఈ సంసారమనేది అందరి వెంటపడింది. వల లాగా బాధిస్తుంది. అరిచే కుక్కలాగా హింసిస్తుంది, పాములాగా కాటేస్తుంది, సుడిలాగా అస్థిరమైనదని ఈ సంసారాన్ని దాటిపోవడము దుస్తరమని తెలియజేసింది. చెన్నమల్లికార్జునా ! ఈ సంసార సాగరము నుంచి తప్పించుకోవాలంటే నీ కృప ఒకటే తారక మంత్రము.

22. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆదిదైవిక మనే తాపత్రయ తాపములో దహింపబడుతున్నాను. సంసారమనే వలలో బంధితుడై బాధపడుతున్నాను. సహించలేను. వీటి నుంచి నన్ను నీవు తప్ప ఎవరూ రక్షించలేరు. " తేన వినా తృణమపి న చలతి ". శివాజ్ఞ లేక గడ్డిపోచైనా చలించదు. నిన్ను శరణం వేడుచున్నాను. ఈ సంసారం నుంచి రక్షించు లేదా సంహరించు అది నీ ధర్మం

23. ఈ సంసారము నాకు శత్రువులాంటిది. శత్రువైనవాడు వంశ, వంశపర్యంతము ఎలా శతృత్వము సాధిస్తాడో ఆ విధంగా జన్మ జన్మాంతరంగా కూడా ఈ సంసారమనేది శతృవులాగా వేధించి చంపుతున్నది. ఈ బాధ నుండి బయటపడాలని నిన్ను శరణు పొందినాను. నీవే రక్షించాలి.

25. నీవు పుట్టినప్పుడే ఈ సంసారము ప్రారంభమైనది. పోషణ, శిక్షణ, పెండ్లి, ఉద్యోగమని ఈ సంసారము విస్తారమైనది. ఈ సంసార వ్యామోహముతో అజ్ఞానము పెరుగును. ఈ అజ్ఞానముతో ఆశ, దురాశలు అతియై పోవును. ఒకవేళ ఆశ తీరకుంటే కోపము వుద్భవించును. కోపముతో తామసగుణము పెరిగి ద్వేష, అసూయలు వుద్భవించును. దీనివలన సాత్విక శక్తి సంపూర్ణంగా నశించి దైవాన్ని మరచి పోతున్నాము. అప్పుడు మళ్లి పుట్టుకచావులు అనే సంసార చక్రానికి చిక్కిపోవుచున్నాము.

ఓ చెన్న మల్లికార్జునస్వామీ ! అజ్ఞానాన్ని దూరం చేసి నీ కరుణతో నన్ను శిక్షించిపోషించి ఉద్ధరించు. జ్ఞానాన్ని ఇవ్వమని నీ పాదాలను గట్టిగా పట్టుకొని వేడుకొనుచున్నాను.

27. ప్రతి యొక్కరి జీవనములోను సంసారముయొక్క సుఖదుఃఖ ద్వంద్వములు రానే వస్తాయి. ఈ సంసారము ఘోరమైనది. బాల్యం, యవ్వన వృద్ధాప్యం, మరణం ఇవన్ని వస్తాయి. ఇది జగన్నియమము, ఇదే సంసారముయొక్క సామాన్యమైన చిత్రం.

28. సంసారబంధము నుంచి విడుదల కావాలనికోరుకుంటూ భగవంతుని ప్రార్థించాలి. మరణం పొందే బొమ్మలాంటి ఈ శరీరం నాకెందుకు. మాయా మలముతో కూడినటువంటి ఈ శరీరము పునర్జన్మ చెందుతుంది. పగిలిన కుండనుండి నీరుకారిపోవు విధముగా ఈ దేహము నాశమౌతుంది. ఏ ఖర్మ ఫలముతో ఈ దేహము వచ్చిందో కాని దీనితో జీవాత్ముడు కలిసిపోయినాడు. దాని కోసము దేహము, జీవునియొక్క తాపత్రాయులను దూరం చేసి నన్ను కాపాడు. వస్తుతః నేను ఈ ప్రపంచములో పుట్టినా లౌకికమైన సుఖాలు నాకు వద్దు. ఆధ్యాత్మికమైన ఆనందాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ అహింసార్థాయ భూతానాం ధర్మ ప్రవచనం కృతమ్ ।
యః స్యాదహింసా సంపృక్తః సధర్మ ఇతి నిశ్చయః ॥
(మహాభారతం - శాంతి పర్వం- 109 -12)

అర్థము : మనో వాక్కాయ కర్మలచే నే ప్రకారము గూడ ప్రాణిహింస కాకూడదను ఉద్దేశ్యముతో ధర్మోపదేశము చేయబడినది. ఇందువలన ఏది అహింసాయుక్తమో, అది ధర్మమని ధర్మవేత్తల యొక్క నిశ్చయము.

శ్లో ॥ ప్రభవార్థాయ భూతానాం ధర్మ ప్రవచనం కృతమ్ ।
యః స్యా త్ప్రభవసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥
(మహాభారతం - శాంతి పర్వం- 109 -10)

అర్థము : ప్రాణులయొక్క అభ్యుదయ, నిఃశ్రేయస్సు కొఅకే ధర ప్రవచనము చేయబడినది. ఇందువలన ఏది ఈ ఉద్దేశ్యముతో యుక్తమై యున్నదో అనగా, దేనిచే అభ్యుదయ నిఃశ్రేయస్సులు సిద్ధించుచున్నవో, అది ధర్మమని ధర్మవేత్తల యొక్క నిశ్చయము.

సరే, ప్రకృతముననుసరించెదము. " నహి సత్యాత్పరో ధర్మః " అని చెప్పబడినందున ఏ ప్రాణికి గూడ ఏ ప్రకారముగను (మానసిక, వాచిక, కాయిక రూప) హింస కలుగకుండునట్లు ' ప్రాణులయొక్క అభ్యుదయ, నిఃశ్రేయస్సుకు తోడ్పడునట్లు " సత్య ' రూప ధర్మమును ప్రతి మానవుడు పరిపాలించవలయును. " తస్మాత్సత్యం న లోపయేత్ " (మహాభారతం - శాంతి పర్వం- 162 -24)అని వేద వ్యాసభగవానులు చెప్పినట్లు సత్యమునకు లోపము చేయకూడదు.

సత్యము యొక్క మాహాత్మ్యమును గూర్చి శాస్త్రములలో విస్తారముగా ఈక్రింది విధముగా వర్ణించనైనది.

శ్లో ॥ సత్యస్య వచనం సాధు న సత్యాద్విద్యతే పరమ్ ।
సత్యేన విధృతం సర్వం సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ "
(మహాభారతం - శాంతి పర్వం- 259 -10)

అర్థము : సత్యము పలుకుట శుభకర్మము. సత్యము కంటె నధికమైన కార్యము లేదు. సత్యమే సర్వమును ధరించి యున్నది. మరియు సత్యమునందే సర్వము ప్రతిష్ఠితమై యున్నది.

శ్లో ॥ సత్యం సత్సు సదా ధర్మః సత్యం ధర్మః సనాతనః ।
సత్యమేవ నమస్యేత సత్యం హి పరమా గతిః ॥
(మహాభారతం - శాంతి పర్వం- 162 -4)

అర్థము : సత్యరూప ధర్మము సత్పురుషులయందు ఎల్లపుడు పాలింపబడుచున్నది. సత్యమే సనాతన ధర్మముగా నున్నది. సత్యమున కెల్లపుడు తలవంచవలెను. ఎందుకనగా సత్యమే జీవుని పరమ గతియై యున్నది.

శ్లో ॥ సత్యం ధర్మస్తపోయోగః సత్యం బ్రహ్మ సనాతనమ్ ।
సత్యం యజ్ఞః పరః ప్రోక్తః సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ ॥
(మహాభారతం - శాంతి పర్వం- 162 -5)

అర్థము : సత్యమే ధర్మము, తపస్సు మరియు యోగముగా నున్నది. సత్యమే సనాతన బ్రహ్మము. సత్యమునకే పరమయజ్ఞమని చెప్పబడినది. అదేవిధముగా సత్యమునందే సర్వము ప్రతిష్ఠితమై యున్నది.

శ్లో ॥ ధారణం సర్వ వేదానాం సర్వ తీర్థావగాహనమ్ ।
సత్యం చ బ్రువతో నిత్యం సమం వా స్యాన్నవాసమమ్ ॥
(మహాభారతం - శాంతి పర్వం- 75 - 28)

అర్థము : సంపూర్ణ వేదములను ధారణ చేసినచో గలుగు పుణ్యము, మరియు సమస్త తీర్థములలో స్నానము చేసినచో గలిగెడు పుణ్యమేది గలదో అది సత్యవాది పురుషునియొక్క పుణ్యముతో సమానమగునో, కాదో సందియమున్నది. అనగా వాటికంటె సత్యము శ్రేష్ఠముగా నున్నది.

శ్లో ॥ అశ్వమేధ సహస్రం చ సత్యం చ తులయా ధృతమ్ ।
అశ్వమేధ సహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే ॥
(మహాభారతం - శాంతి పర్వం- 75 - 29)

అర్థము : ఒకవేళ త్రాసుయొక్క ఒక పళ్ళెములో (ఒకవైపు) వేయి అశ్వమేధ యజ్ఞముల పుణ్యము నుంచి, మరొక వైపు కేవలము సత్యము నుంచి తూచినచో వేయి అశ్వమేధ యజ్ఞములకంటె సత్యమే శ్రేష్ఠమగును. (అధిక బరువు గలదగును)

శ్లో ॥ సత్యేన సూర్యస్తపతి సత్యేనాగ్నిః ప్రదీప్యతే ।
సత్యేన మరుతో వాంతి సర్వం సత్యే ప్రతిష్ఠితమ్ ॥
(మహాభారతం - శాంతి పర్వం- 75 -30)

అర్థము : సత్యము యొక్క ప్రభావము చేతనే సూర్యుడు తపించుచున్నాడు. సత్యము చేతనే అగ్ని ప్రజ్వలించు చున్నది. సత్యము చేతనే సర్వత్ర వాయు యొక్క సంచారమగుచున్నది. ఎందుకనగా సర్వము సత్యము నందే ప్రతిష్ఠితమై (ఆధారపడి) యున్నది.

శ్లో ॥ సత్యేన దేవాః ప్రీయంతే పితరో బ్రాహ్మణస్తథా ।
సత్యమాహుః పరోధర్మ స్తస్మాత్సత్యం న లంఘయేత్ ॥
(మహాభారతం - శాంతి పర్వం- 75 -31)

అర్థము : దేవతలు, పితరులు మరియు బ్రాహ్మణులు సత్యము చేతనే ప్రసన్నులగుచున్నారు. సత్యమే పరమ ధర్మమని చెప్పబడినది. అందువలన ఎప్పుడు గూడ సత్యమును ఉల్లంఘించగూడదు.

శ్లో ॥ స్థితా సత్యేన ధరణీ సత్యేనైవ చ వారిధిః ।
సత్యేన జలధారాశ్చ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥
(శివ పురాణము - కోటిరుద్ర సంహితా - 40 - 29)

అర్థము : సత్యము చేతనే పృథ్వీ నిలచి యున్నది. సత్యము చేతనే సముద్రము తన మర్యాదలో నున్నది. సత్యము చేతనే సెలయేళ్ళ జలధారలు ప్రవహించు చున్నవి. ఇది అది యననేల - సర్వము సత్యమునందే స్థితమై యున్నది.

శ్లో ॥ సత్యమేక పదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః ।
సత్యమేవాక్షయా వేదాః సత్యేనావాప్యతే పరమ్ ॥
(శ్రీ వాల్మీకి రామాయణము - అయోధ్య కాండము - 14 - 7)

అర్థము : " ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ " అని చెప్పబడినట్లు ప్రణవరూప శబ్ద బ్రహ్మము సత్యము. ధర్మము సత్యము నందే ప్రతిష్ఠితమై యున్నది. అవినాశియైన వేదము సత్యము. పరబ్రహ్మ ప్రాప్తి సత్యము చేతనే కలుగును.

వస్తుతః సత్యరూప ప్రణవోపాసన చేత సత్యరూప వేదాధ్యయనము చేత అంతఃకరణ శుద్ధి గలిగి సత్య స్వరూప పరబ్రహ్మ ప్రాప్తి సుకరమగును.

శ్లో ॥ ఋషయశ్చైవ దేవాశ్చ సత్యమేవ హి మేనిరే ।
సత్యవాదీ హి లోకే 2 స్మిన్ పరం గచ్ఛతి చాక్షయమ్ ॥
(వా.రా. అ.కాం - 109 - 11)

అర్థము : ఋషులు మరియు దేవతలు ఎల్లపుడు సత్యమునే ఆదరించు చున్నారు. సత్యవాదియైన మనుష్యుడే ఈ లోకములో అక్షయమైన పరమధామమును చేరుకో గలుగుచున్నాడు.

శ్లో ॥ సత్యమేవేశ్వరో లోకే సత్యే ధర్మః సదాశ్రితః ।
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్ ॥
(వా.రా.అ.కాం. 109 - 13)

అర్థము : ఈ జగత్తులో సత్యమే ఈశ్వరుడు. సత్యరూప ఆధారముపైనే

ధర్మము స్థితి గలిగి యున్నది. సత్యమే సమస్తమునకు మూలము. సత్యమునకంటే నధిక పరమపదము లేదు.

శ్లో ॥ సత్యం స్వర్గస్య సోపానం పారావారస్య నౌరివ ।
నాస్తి సత్యాత్పరం దానం నాస్తి సత్యాత్పరం తపః ॥
(మ.భా.అను. ప. 145 అధ్యాయము. పృష్ఠము. 5988)

అర్థము : సముద్రమును దాటుటకు నౌక ఏ విధముగా సాధనముగా యున్నదో, అట్లే సత్యము స్వర్గమును చేరుటకు మెట్లువలెనుపకరించును. సత్యమునకంటే నధికమైన దానము లేదు. సత్యమునకంటే నధిక తపస్సు లేదు.

శ్లో ॥ సత్యేన పూయతే సాక్షీ ధర్మః సత్యేన వర్ధతే ।
తస్మాత్సత్యం హి వక్తవ్యం సర్వ వర్ణేషు సాక్షిభిః ॥ (మ.స్మ. 8-83)

అర్థము : సాక్షి (గవాయి, వ్యావహారిక సాక్షి) సత్యముచేతనే పాపము నుండి విడివడుతాడు (పునీతుడౌతాడు). సత్యముచేతనే అతనియొక్క ధర్మము (కీర్తి) వృద్ధి అవుతుంది. ఈ కారణము చేతనే సర్వ వర్ణములవారు సత్యమునే చెప్పవలెను.

ఆశ్రమ కంటి ఆసుపత్రి నిమిత్తం " త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు"కు ఈక్రింది వారు పైకం పంపినారు

01. ఎం.లక్ష్మీనారాయణ (బీరంగూడ, మెదక్ జిల్లా) రూ.11,150/-
02. ఎ.పి.రావు (జయనగర్, బెంగుళూరు) రూ.10,000/-
03. ఆర్.సుజాత (అసఫ్‌నగర్, హైద్రాబాద్) రూ. 5,000/-
04. ఎం.వైజయన్తిమాల (అసఫ్‌నగర్, హైద్రాబాద్)రూ. 5,000/-
05. వై.ఎస్.ఎన్.మూర్తి (సోమాజిగూడ, హైద్రాబాద్) రూ.10,000/-
06. ఎమ్.వి.స్వామి (బెంగుళూరు) రూ. 25,000/-

వీరి నందరిని శ్రీకాళహస్తీశ్వరుడు అనుగ్రహించు గాక.

కథాత్మక గీతాసూక్తులు

– ఆచార్య డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

2.2. గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః

ఈ గీతావాక్యం సాంఖ్యయోగమనే రెండవ అధ్యాయంలోని పదకొండవ శ్లోకం ఉత్తరార్ధభాగం. "గతాసూన్ అగతాసూన్ చ న అనుశోచంతి పండితాః "అని విభాగం. మరణించిన వారిని గూర్చి గాని, జీవించివున్న వారిని గూర్చి గాని పండితులు ఏ మాత్రం శోకించరని సారాంశం.

కాలమనంతం. ఈ అనంతకాలంలో భూత వర్తమాన భవిష్యత్తులని వర్గీకరించుకోవడం సహజమే ! భగవంతుని సృష్టిలో ఎన్నో జీవరాసులు పుట్టి, జీవించి ఆపై రూపురేఖలు లేకుండా గతించిపోయాయి. ఈ వైచిత్రిని సామాన్యులు ఒక రకంగా భావిస్తే, పండితులు మరోరకంగా భావిస్తారు. కారణం వారు జ్ఞానులు కావడం. అట్టి జ్ఞానసిద్ధికలవారికి సంబంధించిన ఒకరిద్దరి కథలను అనుసంధానం చేసుకొందాం.

ఉపనిషత్తులు ఉద్భవించిన కాలంలో ఎందరో రాజులుండేవారు. ఇతిహాసాల కాలం నాటి రాజులలాంటివారు కారు. సనాతనధర్మరహస్యాలు తెలిసినవారు. పైగా జ్ఞానులు. ఆలాంటి రాజవంశంలో పుట్టిన ఒక రాజకుమారుడు సహచరులతో ఒకసారి అడవికి వెళ్ళాడు. దారి తప్పాడు. అయినా కాళ్ళీడ్చుకొంటూ చివరకు అడవిలో ఒక ఆశ్రమం చేరుకొన్నాడు. ఆ ఆశ్రమంలో ఒకముని తపోనిష్ఠలో ఉన్నాడు. రాజకుమారుడు మునిపుంగవుని దగ్గరికి వెళ్ళి నమస్కరించి తాను చేరుకోవలసిన పట్టణం త్రోవ అడిగాడు.

ఆ ముని రాజకుమారుని 'ఎగాదిగా ' చూశాడు. ' నీ వెవరు ? నీ పేరేమీ ? అని ప్రశ్నించాడు. రాజకుమారుడు సవినయంగా' అందరు నన్ను ' మోహజిత్తు 'గా పిలుస్తుంటారు. నా తల్లిదండ్రులు ఈ దేహానికి పెట్టిన పేరు ' ఇదే ' అన్నాడు. ముని అతని సంభాషణ తీరుకు ఆశ్చర్యపడ్డాడు. వచ్చినవాడు ఎగతాళి కోసం తన్ను ' మోహజిత్తు'గా పరిచయం చేసుకొన్నాడేమో అని సందేహం కలిగింది.

" ఆలాగా ! నీవు మోహజిత్తువా ? నీవు రాజకుమారుడివా ? అసలు నీ పేరుకు అర్థం తెలుసా ? తెలియకపోతే విను. ' మోహాన్ని జయించినవాడు మోహజిత్.' ఇహప్రపంచంలో మోహాలు జయించడం అంత తేలిక కాదు. అదీ గాక నీవు రాజువి. రాజులకు ఈ పేరు పొసగదు' అని గదమాయించాడు. ఈ మాట వినగానే రాజకుమారుడు

" మునీంద్రా ! శాంతంగా వినండి. నేనే కాదు. మా ఇంటిలోని వారంతా మోహజిత్తులే ' అన్నాడు. ఈ మాట వినగానే ముని గతుక్కుమన్నాడు.

" నిజమా ! అయితే ఇక్కడే ఆగు. నీవు తొడుక్కున్న వస్త్రాలివ్వు. నేను వచ్చేదాకా నీవు ఆశ్రమం వదలివెళ్ళడానికి వీల్లేదు." అన్నాడు. రాజకుమారుని వస్త్రం తీసుకొన్నాడు. ఆ వస్త్రం మీద రక్తం లాంటి ఎర్రరంగు చల్లాడు. ఆ ఎర్రరంగు వస్త్రాలతో దగ్గరి పత్తనం చేరుకొన్నాడు.

ఆ ముని చేరుకొనేసరికి ఆ పట్టణంరాజు కొలువులో వున్నాడు. ముని సరాసరి రాజు దగ్గరికి వెళ్ళాలని భావించాడు. దారిలో ఒక దాసి కనబడింది. ఆ దాసి వాలకం చూస్తే అంతఃపురదాసిగా అనిపించింది. కాసేపు ఆగి –

' అమ్మా ! నీవు అంతఃపురదాసివేనా ? రాజకుమారుణ్ణి చిననాటి

నుండి పెంచినదానవు కదా ! మీ రాజకుమారుడు అడవిలో తిరుగుతుంటే పెద్ద పులి అతని మీద దూకింది. అతడు మరణించాడు. చూడమ్మా ! ఇవిగో మీ రాజకుమారుని వస్త్రాలు ' అని చూపించాడు. దాసి మునిని తేరిపార చూచింది. అతడు తెచ్చిన వస్త్రాలను కూడా చూచింది.

" స్వామీ ! ఇందులో బాధపడడానికేముంది ? పుట్టిన ప్రతిప్రాణి మరణించక తప్పదు " అంటూ వెళ్ళిపోయింది. ముని దిగ్భ్రాంతుడయ్యాడు. అయినా ముని సరాసరి రాజుగారి కొలువులోకి ప్రవేశించాడు. రాజదర్శనానికి ఏలాంటి అవరోధాలులేవు. రాజు మునికి నమస్కరించి సకల మర్యాదలు చేయబోతే.

ఎవరి కెలుకి ?

– ఆచార్య [illegible] తిరుపతి

[illegible] రాయకుడివి. నీ కొడుకు అడవిలో పులివాత [illegible] నీ సుపుత్రుని వస్త్రాలు. నీకు చెప్పడానికి [illegible] సాంతం శాంతంగా విన్నాడు. వెంటనే [illegible]న్నారో నాకర్థం కావడం లేదు. ఒక చెట్టుమీద రాత్రివేళ ఎన్నోపక్షులు చేరతాయి. తొలిపొద్దువేళకాగానే తమ దారిన తాము వెళ్ళిపోతాయి. ఆలాగే జీవులు సంసారవృక్షమునాశ్రయించి, కొంతకాలం గడిపి, ఆపై కాలం తీరగానే రెక్కలు విప్పుకొని ఎగిరిపోతాయి. రాజకుమారునికి ఆ కాలం ఆసన్నమయిందేమో అన్నాడు. రాజు మాటలకు ముని అదరిపడ్డాడు. అయినా అతనిలో పట్టుదల హెచ్చింది. సరాసరి రాణి అంతఃపురం కేసి నడిచాడు. మహారాణి మునికి స్వాగతం పలికింది.

' అమ్మా ! నేనేమని చెప్పను ? అల్లారుముద్దుగా పెంచిన నీ కొడుకు అడవిలో పులివాత బడ్డాడు. ఈ వార్త చెప్పడానికే నేను వచ్చా ' నంటూ రాజకుమారుని దుస్తులు చూపించాడు. మహారాణి మునిని తేరిపార చూచింది.

వస్త్రాలను కూడా చూచింది. ఆపై కాస్త తేరుకొని

'సంయమీంద్ర !' ఎంత శ్రమపడ్డారు. అయినా మనం చేయ గలిగిందేముంది ? ఒక రహదారి పక్కనవున్న సత్రంలో బాటసారులు చేరతారు. సేద తీర్చుకొంటారు. ఆపై వెళిపోతారు. ఈ ప్రపంచం ఒక సత్రం. జీవులందరు మోక్షపురం చేరుకోవడానికి పయనిస్తూ దారిపక్క సత్రంలో విశ్రాంతి తీసుకొంటారు. ఆపై పయనం కొనసాగిస్తారు. అంతే రాజకుమారుని పయనం కూడా ' అని నెమ్మదిగా అంది. ముని నిశ్చేష్టుడయ్యాడు. రాణిని ఓదార్చినట్టు ఓదార్చి పక్కన భవంతికేసి నడిచాడు.

ఆ భవంతి రాజకుమారునిది. ఆ భవనంలో రాజకుమారుని భార్య ఉంది. ఆమె అందగత్తె. ఆమె మొగంలో అద్వితీయమయిన కాంతిని చూచి ముని ఆశ్చర్యపడ్డాడు. అయినా తేరుకొని –

' అమ్మా ! రాజకుమారుడు అడవిలో పులివాత పడ్డాడు. పిడుగులాంటి వార్త చెప్పడానికి జడుస్తున్నా. చూడమ్మా ! నమ్మకం లేకపోతే ఈ వస్త్రాలు చూడు ' అని వస్త్రాలు చూపించాడు.

ఆ సుందరి చలించలేదు. సుతరామూ బాధపడలేదు. మునిని చూచి 'ఋషివరేణ్యా ! మీరు పనిగట్టుకొని వచ్చారు. ఒక నదీప్రవాహంలో తలో దిక్కు నుంచి వచ్చే కర్రముక్కలు ఒకదానితో ఒకటి పక్కపక్కన కలిసి కాసంతదూరం ప్రవాహంలో పయనించి ఆపైన విడిపోతాయి. మరల ఒంటరి పయనంగా కడలిలో కలిసిపోతాయి. ప్రతి జీవియాత్ర ముందు వెనుకల పయనమే ' అంది.

ముని వెనుదిరిగాడు. ఒకసారి రాజకుమారుని పరివారం వారి మాటలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. రాజకుమారుడు చెప్పింది నిజమే ! ఈ కుటుంబంలోని వారంతా 'మోహజిత్తులే ' ! అయినా తనవల్ల

అపచారం జరగకూడదని అసలు విషయం అందరికి చెప్పాడు. అయినా వారిలో ఆశ్చర్యం గాని ఉబలాటగాని కనిపించలేదు. ఇక లాభం లేదనుకొని అడవికేసి నడిచాడు. చివరిసారిగా మరో పన్నాగం పన్నాడు.

‘ కుమారా ! నేనేం చెప్పను ? అంతా అయిపోయింది. నేను వెళ్ళేసరికే అయిపోయింది. శత్రువులు కోటను ముట్టడించారు. రాజపరివారాన్ని చంపేశారు. ఊరంతా పరశురామప్రీతి చేశారు. ఏమీ మిగల్లేదు ’ అన్నాడు.

రాజకుమారుడు అంతా విన్నాడు. మునిని చూచి ‘ఆలాగా ! అన్నీ పోయాయా ? అందరూ పోయేవాళ్ళే. కలలో ఎన్నో చూస్తాము. అన్నీ సత్యాలా ? కావు. అవన్నీ సత్యమని నిరూపించలేం. అది అజ్ఞానం ‘ పరతత్త్వమొకటే సత్యం ’ అన్నాడు. ముని గతుక్కుమన్నాడు. అయినా సంబాళించుకొని ఆ రాజపుత్రుని కావలించుకొని –

“ రాజకుమారా ! నీవు నిజంగా మోహజిత్తువే. అంతేకాదు. నీ పరివార మంతా ఆలాంటివారే ’ అని తన పరీక్ష అంతా చెప్పాడు. రాజకుమారుడు నిశ్చలంగా విన్నాడు. ఆపైన ముని పట్టణానికి వెళ్ళే దారి చెప్పాడు. తదనంతరం ముని కూడా పశ్చాత్తాపంతో తపస్సుకు సిద్ధమయ్యాడు.

ఈ కథలో దాసిగాని, రాజుగాని, మహారాణిగాని ఆపై రాజకుమారుని దేవేరిగాని రాజకుమారుని మరణవార్తపట్ల స్పందించలేదు. వీరందరు పండిన ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులు.

విజ్ఞప్తి

వేదాన్తభేరి సంవత్సర చందాదారులు తమ తమ చందాలను వెంటనే ఎం.ఓ. చేయగోరుచున్నాము. ఎం.ఓ.లో తమ చందా నెంబరును తప్పక వ్రాయవలయును.

పరంపరాప్రాప్త యోగ దార్శనికులు

స్వామి అమృతానంద (రామకృష్ణ మఠం)

అనువాదం – ఎ.తారాలక్ష్మి,

(గత సంచిక తరువాయి)

శ్రీరామకృష్ణులవారి భక్తియోగంలో మంత్రయోగం, లయ యోగం, కుండలినీయోగం వంటి అనేక యోగసాధనలు ఇమిడి ఉండేవి. వీరి యోగ విధానము, ‘యోగ ’ అను పదముయొక్క మొదటి అర్థమైన “ కూడిక ” అను విషయం ఆధారంగా రూపొందింపబడి ఉండేది. వీరు హఠయోగంలో కూడా కడు సిద్ధహస్తులు. అయితే హఠయోగము దేహాత్మ భావనను పెంపొందించునన్న కారణంతో వీరు హఠయోగ సాధనపట్ల సాధకులను ప్రోత్సహించేవారు కారు. శ్రీ రామకృష్ణులవారి పవిత్ర జీవితంలోని ఒకానొక సంఘటనను ఇచట ప్రస్తావిద్దాం. శ్రీరామకృష్ణుల వారి జీవితపు చరమదశలో గొంతుకు సంబంధించిన తీవ్రమైన అస్వస్థతకు లోనయ్యారు. ఫలితంగా నోటి ద్వారా ఆహారాన్ని స్వీకరించలేకపోయేవారు. వారి శిష్యులు ఆవేదనతో కనీసం తమ కొరకైనా, జగన్మాతను ప్రార్థించి, ఎంతో కొంత ఆహారాన్ని నోటి ద్వారా స్వీకరించ గలిగేటట్లు చూడవలసినదిగా పదే పదే అభ్యర్థించారు. శిష్యబృందం మరీ మరీ కోరగా శ్రీరామకృష్ణులవారు ఇలా సమాధాన మిచ్చారు. “ నిజమే నేను అమ్మను అర్థించాను. అంతట అమ్మ నీవు లెక్కలేనన్ని గొంతుకల ద్వారా ఆహారాన్ని స్వీకరిస్తున్నావు కదా ! ” అని సమాధాన మిచ్చారు. నేను చాలా అవమానంగా భావించాను సుమా ! అన్నారు. వాస్తవమైన అద్వైతానుష్ఠానమిదియే. యోగానుష్ఠానముయొక్క పరాకాష్ఠ కూడా ఇదియే.

మరియొక సందర్భంలో భాగవత పండితులొకరు, జబ్బు పడిన శరీర భాగాలపై మనోశక్తిని కేంద్రీకరించి ప్రాణశక్తిని ప్రేరేపించినట్లయిన

ఆరోగ్యము చేకూరగలదని శ్రీరామకృష్ణుల వారికి తెలుపగా, వెంటనే వారు " నువ్వేం భాగవత పండితుడవయ్యా, నా మనస్సును జగన్మాత పాదపద్మములకు ఏనాడో అర్పించాను, మరి నీవేమో ఆ మనస్సును దేహం మీదకు తెమ్మంటున్నావు " అంటూ సమాధానమిచ్చారు. ఆ విధంగా శ్రీరామకృష్ణులవారికి దేహభావన లేశమాత్రమైనా ఉండెడిది కాదు.

శ్రీకృష్ణపరమాత్మ గానంచేసిన భగవద్గీతను పరిశీలిస్తే అందు "యోగ" అను పదమును 'కూడిక' అని అర్థం వచ్చేవిధంగా వాడడం జరిగింది. శ్రీ మద్భగవద్గీతను నిశితంగా పరిశీలిస్తే అందు అనేక యోగములు పేర్కొనబడ్డాయి. అందలి ప్రతి అధ్యాయము ఒక ప్రత్యేకమైన యోగముగా కీర్తించబడింది. అంతియేకాక అందు "యోగ " పదమునకు విపరీతమైన మరొక నిర్వచనాన్ని కూడా మనం గ్రహించవచ్చు.

" తం విద్యాదుఃఖసంయోగ వియోగం యోగసంజ్ఞితం " మనం ఇంతకు ముందే దుఃఖంతో కూడియున్నాము. ఇపుడు ఈ "కూడిక " యోగముతో జరుపవలసియున్నది.

శ్రీ మద్భగవద్గీతను దార్శనికులు యోగశాస్త్రముగ పేర్కొనినారు. ఇందు కర్మయోగమును ప్రధానముగ చర్చించినారు. ఈ యోగమును శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహించినారు. ఇది అత్యంత సనాతనమైనదనియు, నాశరహితమైన దనియు, దీనిని తొలుత తాను సూర్యునకు ఉపదేశించితిననియు, సూర్యుడు మనువునకు, మనువు ఇక్ష్వాకునకు, బోధించిరనియు, భగవానుడు తానే స్వయముగ అర్జునుడితో పలికెను. వాస్తవమునకు ఈ యోగముయొక్క మహత్వమును అద్వైత రామాయణ మందు హనుమ విషయంలో గమనింపవచ్చును. జాంబవంతుడు హనుమంతుని సామర్థ్యాన్ని బలాన్ని గుర్తు చేసేంత వరకు హనుమంతుడు తనలోని శక్తిని, క్రియాశీలత్వాన్ని ప్రదర్శింప లేకుండుట గమనించెదము. ఇలా అధ్యాత్మ రామాయణం ' ప్రవాహపతిత ' కర్మను గూర్చి ప్రస్తావిస్తుంది.

నదీ ప్రవాహంలో కొట్టుకుపోయే కొయ్యదుంగ ఎలాగైతే ప్రవాహంతోపాటు ప్రయాణిస్తూ ఉండగా, ఆవలి ఒడ్డున ఉన్న జనులు తమ వద్దకు వచ్చిన దుంగను ఎలా సొంతం చేసుకుంటారో అలాగే కర్మ కూడా వ్యక్తులను చేరుతుంది.

కాలాంతరంలో ప్రచారం తగ్గి వైభవాన్ని కోల్పోయిన కర్మ యోగమును శ్రీ కృష్ణభగవానులు పునరుద్ధరించారు. ఒకానొకప్పుడు ఈ యోగమార్గాన్ని రాజర్షులు అనుష్ఠించిరి. జనులలో ఆధ్యాత్మికత క్రమంగా లోపించినందున ఈ యోగమును ఇప్పటి ప్రజలు అనుష్ఠింపలేకున్నారు. అర్జునుని నిమిత్తునిగా జేసికొని కృష్ణపరమాత్మ ఈ యోగమును భగవద్గీత ద్వారా పునరుద్ధరించారు.

భగవద్గీత రెండవ అధ్యాయములో శ్రీ కృష్ణభగవానులు ఆత్మ స్వరూప స్వభావాలను బహు చక్కగ వివరించారు. మరియు కర్మ సిద్ధాంత రహస్యములను కూడా విపులంగా బోధించారు.

' యోగస్థఃకురు కర్మాణి ' ' సమత్వం యోగ ఉచ్యతే ', యోగః కర్మసుకౌశలం, అని ప్రకటించుటలో భగవానుడు ఉపయోగించిన యోగ అను పదమునకు కర్మయోగమన్న అర్థం వస్తుంది. శ్రీధరస్వామివారి పరిభాషలో యోగము అనగా భగవానుని పట్ల అవ్యాజమైన ఆరాధనయే.

జ్ఞానము, కర్మ భిన్న మార్గాలని పలుకువారు అవివేకులే కానీ వివేకవంతులు కారు. ఆరెండింటిలో ఏ ఒక్క మార్గమునైనా శ్రద్ధగా సాధన చేసినట్లయిన రెండింటి ఫలితాన్ని సాధకుడు పొందగలడని భగవద్గీతలోని ఐదవ అధ్యాయమునందు భగవానుడు నొక్కి చెప్పియున్నారు. మరియు కర్మయోగమునందు చక్కగా ఆరితేరినచో జ్ఞానయోగము కూడా సిద్ధించునని తెలియజేయుచున్నారు. మరియు ఆరవ అధ్యాయంలో యోగ విధానాన్ని వర్ణించుటయే కాక, ప్రారంభ దశలో ఉన్న సాధకునకు కర్మ యోగాను ష్ఠానముయొక్క ఆవశ్యకతను సైతము తెలియజేసిరి. ఈ యోగాన్ని సాధన

చేయడం ద్వారా, పరమోత్కృష్టమైన అద్వైతసిద్ధిని పొందగలరని భగవానుని భరోసా.

సర్వభూతస్థమాత్మానం సర్వ భూతాని చాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శినః

ఆరవ అధ్యాయములో 46వ శ్లోకములో తస్మాత్ యోగీ భవార్జున ‘ యోగివికమ్ము’ అని భగవానుడు అర్జునునితో పలుకుట ద్వారా, యోగి యొక్క జీవాత్మ పరమాత్మతో సన్నిహితముగా వర్తించుననియు కావున నీవు యోగివికమ్ము అని అర్జునుని భగవానుడు నిర్దేశించినట్లుగ మనము అవగాహన చేసికొనవచ్చును.

పన్నెండవ అధ్యాయమైన భక్తియోగమునందు భగవానుడు అనన్యయోగము’ అను దానిని ప్రతిపాదించిరి. అనగా పరమాత్మను తప్ప ఇతరములను తలంచని యోగమని అర్థము.

ఈ వ్యాసమును భగవద్గీత చివరి శ్లోకమైన ‘యత్ర యోగేశ్వరః కృష్ణో ’ అను శ్లోకంతో ముగిస్తాం. ఎచటెచట యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారియగు అర్జునుడు ఉంటారో అచట విజయము మరియు ధృఢమగు నీతి పరిఢవిల్లునని సంజయుని యొక్క మరియు మనందరి అభిప్రాయం.

భగవద్గీత అనేక తత్త్వాలతో కూడిన గొప్ప సంక్లిష్ట గ్రంథం ఈ వ్యాసంలో మనం కేవలం పతంజలి యోగసూత్రముల కోణంలో మాత్రమే పరిశీలించి విశ్లేషించడమైనది.

17-02-2015 తేది మహాశివరాత్రి నాడు రుద్రాభిషేకము, బిల్వార్చన అదిలాబాద్ జిల్లా దిల్వార్‌పూర్ మండలం బీరవెల్లి గ్రామంలోని శ్రీ విద్యాప్రకాశానంద గీతాశ్రమంలో మహన్యాన పూర్వక రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన జరుగును. అందు శ్రీ స్వాములవారు పాల్గొందురు.

భాగవత కృష్ణుని చేతి వెన్న ముద్దలు

సంకలన - జోశ్యం శ్రీనివాస్ (గుంటూరు)

106. శాస్త్ర సజ్జనుల వచనములందు సత్యత్వబుద్ధి కలిగియుండుట చేత నిరంతరము జాగరూకుడై యుండుటచేత అంతటను నాయొక్క సత్తను వీక్షించుటచేత, అహంకారరూపమగు తన లింగశరీరమును (సూక్ష్మ దేహమును ఁ లయింపజేయవలెను. ఆపిదప ఏ సాధనయు లేక పూర్ణ విరామమును పొందవలెను.

107. నా లోకమును పొందదలచువాడు రాజు అయినచో తన ప్రజలకును గురువైనచో తన శిష్యులకును, తండ్రి అయినచో తన బిడ్డలకును ఇట్టి శిక్షణనే ఒసంగవలెను.

108. అజ్ఞానవశమున దీనిననుసరించక విషయాసక్తి యుక్తమగు కర్మనే పరమ పురుషార్థముగ ఎవరైన భావించుచో వారిని కోపగించక, మెల్లగవారికి నచ్చచెప్పి కర్మమందు ప్రవృత్తులు కాకుండునట్లు చూడవలెను.

109. కామము, క్రోధము, మదము, లోభము, మోహము, భయము మున్నగు శత్రువులకును, కర్మబంధనమునకును మూలము మనస్సే అయి యున్నది.

110. అట్టి మనస్సుపై విశ్వాసముంచినచో, యోగిని భ్రష్ట మొనర్చివేయును. కావున మనస్సును జయించి భగవంతుడగు శ్రీకృష్ణుని యెడల అనన్యభక్తి కలిగియుండవలెను.

111. విషయరహితమగు మనస్సే అతనికి శాంతిమయమగు మోక్ష పదమును ఒసంగును.

112. మనస్సును ఉపేక్ష చేసినందువలన అది ఇంకను బలపడును Prevention is better than cure. అది స్వయముగ సర్వదా మిథ్య అయి యున్నను మీ యొక్క ఆత్మ స్వరూపమును అది కప్పివేయును.

113. కాబట్టి మీరు జాగరూకులై శ్రీ గురువు యొక్కయు శ్రీహరి యొక్కయు

పాదములను ఉపాసించుట యను అస్త్రముచే దానిని వధించి వేయుడు.

114. ఎపుడు భగవత్కథలు సదా సేవింపబడుచుండునో, అపుడవి మోక్షకాంక్షి యగు మనుజుని యొక్క నిర్మలబుద్ధిని భగవంతుడగు వాయుదేవుని యందు సంలగ్నము చేయును.

115. విరక్తులగు మహాత్ముల సత్సాంగత్యముచే ప్రాప్తించు జ్ఞానమను ఖడ్గముచే మనుజుడు ఈలోకమందే తన మోహబంధనమును ఛేదించి వేయవలెను.

116. మనుష్యుడు మనస్సు, వాక్కు శరీరములచే పాపము చేయు చున్నాడు.

117. పాపములకు యథార్థమగు ప్రాయశ్చిత్తము తత్త్వజ్ఞానమే అయియున్నది.

118. ఎవడు నియమములను చక్కగ పాలించునో, అతడు మెల్ల, మెల్లగ పాపవాసననుండి విముక్తుడై శ్రేయోదాయకమగు తత్త్వజ్ఞానమును పొందుటకు సమర్థుడగుచున్నాడు.

119. ఎవరు ఈ సంసార బంధనమునుండి తప్పించుకొనదలంచుదురో, వారికి భగవంతుని నామమునకు మించిన మఱియొక సాధనమేదియును లేదు.

120. భగవంతుని ద్వారా నిర్మితమైన భాగవతధర్మము పరమశుద్ధమైనది. రహస్యమైనది. దానిని తెలిసికొనుట కష్టము. దానిని తెలిసికొనినవాడు భగవత్స్వరూపమును పొందును.

121. ఈ ప్రపంచమున జీవులయొక్క పరమ కర్తవ్యము, పరమ ధర్మము నామ సంకీర్తనాది ఉపాయముల ద్వారా భగవంతుని పాదములందు భక్తి భావమును బడయుటయే యగును.

122. ఎవరు భగవంతుని యొక్క ఉదారములైన, కృపాపరిపూర్ణములైన చరిత్రలను శ్రవణము, కీర్తనము గావించుదురో, వారి హృదయమందు ప్రేమమయమగు భక్తి జనించును.

వార్తలు

(01). జనవరి 4వ తేది శ్రీకాళహస్తిలోని సంకటహరణ హనుమాన్ మందిరంలో సాయంత్రం 4 గంటలకు శ్రీ జొన్నలగడ్డ గురప్పగారి రచన " రామాయణ రసామృతము " అనే గ్రంథాన్ని శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు ఆవిష్కరించారు. మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు అధ్యక్షత వహించారు. శ్రీమతి ఎ. తారాలక్ష్మి గారు మొదలగు వారు ప్రసంగించారు.

(02). 5-01-2015 తేది పౌర్ణమినాడు శ్రీశుకబ్రహ్మాశ్రమంలో సద్గురు పాదుకా పూజ చేయబడింది. అల్లే భగవాన్ రమణ మహర్షుల వారి జయన్తి కార్యక్రమం నిర్వహింపబడింది.

(03). విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్యకళాశాలలో జనవరి 24, 25, 26 తేదీలందు జరిగిన హృషీకేశ్ శివానందాశ్రమం వారి 41వ (ఆంధ్రప్రదేశ్) దివ్యజీవన మహాసభలలో 24వ తేది శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(04). హైద్రాబాద్ నగరంలో శ్రీరాంనగర్ కాలనీలో నూతనంగా నిర్మింపబడిన గుంటూరుజిల్లా నంబూరులోని శ్రీకాళీ వనప్రసాద్ బాబూజీగారి కాళీవనాశ్రమ శాఖలో జనవరి 25వ తేది జరిగిన బాబూజీ గారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శ్రీస్వాములవారు పాల్గొనినారు.

(05). శ్రీకాళహస్తి సమీపం శ్రీ డా.సముద్రాల లక్ష్మణయ్య గారి స్వగ్రామం కాంట్రకాయల గుంటలో శ్రీ సముద్రాల లక్ష్మణయ్య గారిచే నూతనంగా నిర్మింపబడిన శ్రీ మలయాళస్వాములవారి ధ్యాన మందిరం (కమ్యూనిటీ హాలు)లో శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వామి వారిచే జనవరి 26వ తేది ఉదయం శ్రీ సద్గురు మలయాళస్వాములవారి మూర్తి ప్రతిష్ఠ చేయబడినది. మందిరం ప్రారంభోత్సవం చేయబడినది.

(06). ఫిబ్రవరి 3,4,5, తేదీలలో హైద్రాబాద్ మల్కాజిగిరి మారుతినగర్‌లో శ్రీ మాణయ్యగారి సత్సంగంవారు నిర్వహించు సనాతన బ్రహ్మ జ్ఞానమహాసభలలో శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు పాల్గొంటారు.

(07). ఆశ్రమ కంటిఆసుపత్రిలో డిశంబరు నెలలో **ఓ.పి.లో 454 మందికి కంటి పరీక్షలు, చికిత్సలు జరిగాయి. 43 మందికి** పొరలు ఆపరేషన్‌చేసి లెన్సు (ఉచితంగా) అమర్చబడినవి. ఆపరేషన్లు చేయబడిన వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వబడినవి.

భవసాగరమును దాటవలెను

వాసనాక్షయ, మనోనాశ, తత్త్వజ్ఞానమనే మూడింటిచేత జీవునకు బ్రహ్మసాక్షాత్కారం సిద్ధించగలదు.

అందు తత్త్వజ్ఞాన సహాయంతో వాసనాక్షయము కలుగును. వాసనాక్షయముచే మనోనాశం సిద్ధించును. మోక్షం కలుగవలెననిన మనస్సు నశించవలెను. మనస్సు నశించ వలయుననిన వాసనలు క్షయించవలెను. వాసనలు క్షయించవలయుననిన తత్త్వవిచారణ గావించవలెను.

కాబట్టి అభ్యాస వైరాగ్యములచేత, తత్త్వచింతనాదులచేత, ధ్యాననిష్ఠచేత మనస్సును లొంగదీసుకొని భవసాగరమును దాటవలెను.

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 February 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-01-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

______	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టైఫెండ్	: నెలకు రూ. 1,000/-
______	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టైఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

______	(సామవేదము/అథర్వవేదము-వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
______	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020

Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,

E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

మార్చి 2015 రూ. 6/-

భక్తిచేతనే దైవానుగ్రహాన్ని పొందవచ్చు

భగవంతుని హృదయాన్ని కరిగించి, కదిలించేది భక్తి ఒక్కటే. భగవంతుడు నీ సంపదను, పాండిత్యమును, అధికారమును చూడడు. రామాయణంలో గుహుని పాండిత్యమెంత? శబరి ఏమంత శ్రీమంతురాలు? బుడత ఉడుతలో రాముడు ఏది చూసి కరుణించాడు? పక్షియైన జటాయువునకు తండ్రియైన దశరథునికి కూడా లేని సద్గతిని కలిగించడానికి ఏది కారణు? వానరమూర్తియైన హనుమంతుడు దేనివల్ల ఎల్లరకును పూజనీయుడైనాడు? శత్రుపక్షంలోని విభీషణుడు ఎలా రామునికి దగ్గరైనాడు? ఈ ప్రకారంగా చూస్తే భక్తి చేతనే దైవానుగ్రహాన్ని పొందవచ్చునని స్పష్టమవుతున్నది.

భాగవతంలో గోపికల భక్తి మహోన్నతమైనది. చివరికి వారు కొమ్మలలోను, రెమ్మలలోను, పూలలోనూ, తీగలలోను కృష్ణుని దర్శించగలిగారు.

– శ్రీ సత్యసాయిబాబా

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 మార్చి 2015 సంచిక : 3

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju at Aruna Graphics Press , Rayaji Street, Nellore-524 001, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 మార్చి 2015 సంచిక : 3

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. రామాయణ ప్రభ - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06
03. అనన్యభక్తి - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 10
04. భగవంతునికై తీవ్ర వ్యాకులత చెందు - శ్రీ రామకృష్ణపరమహంస- 13
05. శ్రీరాముడు ఆదర్శమానవుడైనాడు - శ్రీ త్రిదండి చిన్నజీయరు స్వామి - 15
06. రాముని ఆదర్శ జీవితము - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు-18
07. జ్ఞానసుధ - సర్పభూషణ శివయోగి - 20
08. హిందువులంతా ఒక్కటే - డా॥ పి.భాస్కరయోగి - 22
09. కిష్కింధాకాండ ప్రాశస్త్యము - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 24
10. అక్కమహాదేవి అనుభవామృతం - శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి - 27
11. శ్రీ భక్తతుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 29
12. భగవంతునిపై విశ్వాసం వదలకు - కె. ఈశ్వర్ - 33
13.కథాత్మక గీతాసూక్తులు - డా ॥ కె. సర్వోత్తమ రావు - 35
14. జ్యోతి రామలింగస్వామి-ఆచార్య డా॥ జక్కంపూడి మునిరత్నం- 38
15. వార్తలు - 42

ముఖచిత్రం :

సీతాలక్ష్మణ సమేత శ్రీరామ చంద్రుడు

28 - 03- 2015 శనివారం శ్రీరామనవమి

ప్రార్థన

- అహల్యా

01. మర్త్యావతారే మనుజాకృతిం హరిం
రామాభిధేయం రమణీయ దేహినమ్ ।
ధనుర్ధరం పద్మవిశాల లోచనం
భజామి నిత్యం న పరాన్భజిష్యే ॥

02. యత్పాదపంకజరజః శ్రుతిభిర్విమృగ్యం
యన్నాభిపంకజభవః కమలాసనశ్చ ।
యన్నామసార రసికో భగవాన్పురారిః
తం రామచంద్రమనిశం హృది భావయామి ॥

03. యస్యావతారచరితాని విరించిలోకే
గాయన్తి నారదముఖాః భవపద్మజాద్యాః ।
ఆనందజాశ్రుపరిషిక్తకుచాగ్రసీమా
వాగీశ్వరీ తమహం శరణం ప్రపద్యే ॥

04. నమో2స్తు తే రామ తవాంఘ్రిపంకజం
శ్రియాధృతం వక్షసి లాలితం ప్రియాత్ ।
ఆక్రాన్తమేకేన జగత్త్రయం పురా
ధ్యేయం మునీంద్రై రభిమానవర్జితైః ॥

05. నమస్తే పురుషాధ్యక్ష నమస్తే భక్తవత్సల
నమస్తే 2స్తు హృషీకేశ నారాయణ నమో2స్తుతే ॥

06. శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపమ్ ।
ఆజానుబాహుమరవిన్దదళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి ॥

07. ఆపదామపహర్తారం దాతారం సర్వసమ్పదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥



రామనామ ప్రభావము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

రామనామము అత్యద్భుతమైన ప్రభావము కలది. భక్తితో జపించువారలయొక్క సమస్త పాపములను అది నశింపజేయగలదు. ఎందఱో మహనీయులు అట్టి పవిత్రనామమును ఉచ్చరించి తరించిరి.

‘రా’ అను అక్షరమును ఉచ్చరించగనే లోని పాపములు బయటికి పారిపోవును. ‘మ’ అను అక్షరమును పలుకగనే తలుపులవలె పెదవులు మూయబడుటచే ఆ పాపములు తిరిగి లోనికి ప్రవేశించుటకు అవకాశము లేకుండును. దాశరథీ శతకములో ఈ విషయమే నిరూపింపబడినది.

‘రా’ కలుషంబులెల్ల బయలంబడద్రోచిన ‘మా’ కవాటమై
ఢీకొని ద్రోచు నిక్కమని ధీయుతు లెన్నదదీయ వర్ణముల్
గైకొని భక్తిచే నుడవగానరుగాక విపత్పరంపరల్
దా కొనునే జగజ్జనుల దాశరథీ కరుణాపయోనిధీ ।

రామరహస్యోపనిషత్తు నందు రాముడు సాక్షాత్ పరబ్రహ్మమే యని చెప్పబడినది. కావున పరబ్రహ్మముయొక్క వాచకమగు ప్రణవము (ఓంకారము) నకున్ను, రామశబ్దమునకున్ను భేదము లేదు.

రామ ఏవ పరబ్రహ్మ రామ ఏవ పరంతపః
రామ ఏవ పరంతత్త్వం శ్రీరామో బ్రహ్మతారకమ్.

‘ రాముడే పరబ్రహ్మము. రాముడే పరమ తపస్సు, రాముడే పరతత్త్వము. రాముడే తారకబ్రహ్మము !’

శివుడు పార్వతీదేవికి ఆధ్యాత్మతత్త్వమును ప్రబోధించుచు ఒక్క రామనామము వెయ్యినామములతో సమానమని పేర్కొనెను.

రామ రామేతి రామేతి రమే రామే మనోరమే

సహస్రనామతత్తుల్యం రామనామ వరాననే.

'రామ' అను నామములో ర, ఆ, మ అను మూడు అక్షరములు కలవు. అందు మొదటిదియగు 'ర' కారము అగ్ని బీజము. 'ఆ' కారము సూర్యబీజము, 'మ'కారము చంద్రబీజము. అగ్ని, సూర్యుడు, చంద్రుడు ముగ్గురు తేజస్స్వరూపులు. భగవద్గీతయందు.

యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽ ఖిలమ్

యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ .

భగవానుడు జగత్తునంతను ప్రకాశింపజేయుచున్న సూర్యుని యందలి తేజస్సున్ను, చంద్రాగ్నులందలి తేజస్సున్ను తనదియే యని చెప్పుటచే ఈ మూడు బీజాక్షరములున్ను సాక్షాత్ భగవంతునియొక్క తేజోరూపములేయని స్పష్టమగుచున్నవి. కాబట్టి 'రామ'అను పదము ఎంతటి శక్తివంతమైనదో తెలియుచున్నది. మఱియు 'ర' కారమగు అగ్ని బీజము పాపములను భస్మీభూతము చేసివేయును. 'ఆ'కారమగు సూర్య బీజము అజ్ఞానమను తమస్సును పారద్రోలి జ్ఞానమును ప్రసాదించును. 'మ' అను చంద్రబీజము తాపత్రయమును అణచివైచి, ఆత్మశాంతిని కలుగజేయును. కావున 'రామ' మంత్రజపముచే పాపక్షయము, జ్ఞానప్రాప్తి, పరమశాంతి అను ఈ మూడు ఫలములున్ను సిద్ధించును.

రామశబ్దముయొక్క అర్థమును గూర్చి విచారించెదము

రమన్తే యోగినోఽ నన్తే నిత్యానందే చిదాత్మని

ఇతి రామపదేనేతత్పరబ్రహ్మాభిధీయతే

యోగులు అనంతమై, నిత్యానందస్వరూపమైనట్టి ఏ చిదాత్మయందు రమించుచున్నారో, అనగా పరమానందము నొందుచున్నారో, అట్టి పరబ్రహ్మమే 'రామ' అనుపదముచే చెప్పబడుచున్నది.

'రమయతీతి రామః' రమింపజేయువాడు (ఆనందమును కలుగజేయువాడు) కాబట్టి రాముడను పేరు వచ్చినది. లేక, 'రమన్తేఽస్మిన్ ఇతి రామః ' వారియందు భక్తులు రమించుదురు. (ఆనందించుదురు)

కాబట్టి రాముడని పేరు ఏర్పడినది. లేక 'రము' 'క్రీడాయాం' అను ధాత్వర్థమును బట్టి లోకములతో క్రీడించువాడు కావున రాముడు అని చెప్పబడెను.

'రా', 'మ' అను రెండు అక్షరములు రెండు నేత్రముల వంటివి. నేత్రములద్వారా వస్తువును చూడగల్గునట్లు, రా, మ, అనే నేత్రముల ద్వారా జీవుడు పరమాత్మను దర్శింపగల్గుచున్నాడు. అనగా రామనామోచ్చారణచే జీవుడు చిత్తశుద్ధిని బొంది ఆత్మానుభూతిని బడయ గల్గుచున్నాడు.

రత్నాకరుడు రామనామమును తలక్రిందులుగా జపించినను చిత్త నైర్మల్యమును బొంది, బ్రహ్మజ్ఞానియై వాల్మీకిమహర్షిగా లోకములో విఖ్యాతినొందెను.

పింగళ అను వేశ్య తనకు ఒకరు బహుమానముగా ఇచ్చిన చిలుక నోటిగుండా వచ్చిన రామశబ్దమును విని ఏకాగ్రతతో ఆ నామమును జపించుటచే మహత్తర పరిణామమునుబొంది, రామనామ ప్రభావముచే చిత్తము నిర్మలముకాగా సద్గతిని బడయగల్గెను.

హిరణ్యశిపుడు ప్రహ్లాదునకెన్నియో బాధలను కలుగజేసెను. కాని వానినతడు లెక్క చేయలేదు. సమచిత్తముతో ధైర్యముగ, ఆనందముగ నుండెను. ఇది యేమి చిత్రమని తండ్రికి ఆశ్చర్యము కలిగి ఒకనాడు కుమారునితో నాయనా ! నీ కిన్ని కష్టము లొసంగుచున్నను ఇంత నిర్భయముగా ఎలా ఉండగల్గుచున్నావు ? అని ప్రశ్నింప అందులకు ప్రహ్లాదు డిచ్చిన ఈ క్రింది సమాధానము రామనామము యొక్క మహిమాతిశయమును చక్కగ వెల్లడిచేయుచున్నది.

రామనామ జపతాం కుతో భయమ్

సర్వతాప శమనైక భేషజమ్

పశ్య తాత మమగాత్ర సన్నిధౌ

పావకోఽపి సలిలాయతేఽ ధునా.

'తండ్రీ ! నేను రామనామమును భక్తి పూర్వముగ జపించుచున్నాను.

ఇక నా కేల భయముండును ? రామనామము సమస్త సంసార తాపములను నశింపజేయగల దివ్యౌషధము, తత్ర్పభావముచే అగ్నియు నాకు చల్లనిదిగ అయినది చూడుము !

రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పు అంటించినను ఆంజనేయుడు నిరంతరము రామనామమును సంస్మరించుచుండుట వలన ఆ అగ్నిచే వారికి ఏవిధమైన ముప్పు కలుగకుండెను. అది వారికి చల్లగతోచెను. లంకాపురియంతయు అగ్నికి ఆహుతి అయినను, రామభక్తుడగు విభీషణుని భవనము మాత్రము కాలకుండెను. రామనామ ప్రభావముచే హనుమంతుడు శతయోజన విస్తీర్ణముగల మహాసముద్రమును అవలీలగ దాటగల్గెను. మఱియు సీతాదేవి తన పాతివ్రత్యమును చక్కగ నిలుపుకొనగల్గెను. భగవన్నామముయొక్క శక్తి అమోఘము, అపారము, ఆశ్చర్య జనకము అయియున్నది.
కనుకనే హనుమంతుడు శ్రీరామునితో నిల్లు చెప్పెను.

రామ త్వత్తో2ధికం నామ ఇతి మన్యామహే వయమ్
త్వయైకా తారితా2యోధ్యా నామ్నాతు భువనత్రయమ్.

‘ ఓ రామచంద్రా ! మీ కంటె మీ నామము గొప్పది అని మేము తలంచుచున్నాము. ఏలయనగా మీచే అయోధ్యావాసులు తరించినారు. మీ నామముచే ముల్లోకవాసులు తరించుచున్నారు. హనుమంతుని ఈ వాక్యములు రామనామము యొక్క అపారశక్తిని దిగ్దర్శనము చేయుచున్నవి.

త్రాసే భయే మహాపాపే బాధాయాం సర్వదా నరైః
రామేతి ద్వ్యక్షరో మంత్రః కీర్త్యతే జగతీతలే.

బాధ, భయము కలిగినపుడును, మహాపాపసందర్భమునందును. ‘రామ ’ అను రెండక్షరములతో కూడిన మంత్రమును జపించువారు బాధారహితులగుదురు. కావున సర్వకాలములందును జను లద్దానిని శ్రద్ధతో జపించవలయును.

దయగల హృదయమే భగవన్నిలయము

అనన్య భక్తి

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

అనన్య భక్తితో కొందరు సంకుచిత హృదయులు ఈలాగున తలంతురు. అదేమన శైవులైనచో శివనామస్మరణయు, శివభక్తులతో సంసర్గము, శివకథాపారాయణము, శివాలయ సేవ గలిగియుండవలెనే గాని ఇతర దేవతల నామోచ్చారణ గాని, అనగా శ్రీమన్నారాయణ, శ్రీకృష్ణ, శ్రీరామ అని ఉచ్చరించుట గాని, విష్ణుభక్తులతో సహవాసము చేయుటగాని, విష్ణుకథలను వినుటగాని, విష్ణ్వాలయములకు పోవుట గాని చేయ రాదనియు ఒకవేళ ప్రమాదవశమున అట్లు చేసినచో శివుడు కోపించుననియు, పతివ్రతయైన స్త్రీ తన పతిని విడిచి పరపురుషుని అనుగమించినచో ఏలాగున అతడు ఆ స్త్రీని విడనాడునో ఆలాగున ఈ భక్తుని శివుడు పరిత్యజించుననియు చెప్పుదురు. ఇట్టివారిని వీరశైవు లందురు. అదేరీతిగా వీరవైష్ణవులు కొందరు గలరు. వారును పైజెప్పిన వీరశైవులవలెనే విష్ణుస్మరణయు, విష్ణుభక్తియు, విష్ణుపురాణములను చదువుటయు, విష్ణ్వాలయ సేవయును, విష్ణుభక్తులతో సహవాసమును చేయవలయునేగాని, యితర శివసంబంధమైన యే కార్యమును చేయరాదనియు, ఒకవేళ చేసినచో సాధ్వీమణియైన స్త్రీ యితర పురుషుని అనుగమించిన యేలాగున భర్త విడనాడునో, ఆలాగున భగవంతుడు విడనాడునని వచింతురు. ఇది కల్పితకథయే గాని, సత్యాన్వేషులకు సంబంధించినది కాదు. ఇది స్వార్థపరత్వముతోను, సంకుచిత భావముతోను చెప్పబడిన ఒకవిధమగు భక్తియేగాని విశాలభావముతోను, విశుద్ధబుద్ధితోను చెప్పినది గాదు. పతివ్రతయైన స్త్రీ తన ప్రాణనాథుడగు పతిని సేవించుట ధర్మమే, కాని బ్రహ్మనిష్ఠులను, పరిశుద్ధాత్ములగు

అతిథులను, వృద్ధులను, అత్తమామలను సేవించుట తప్పు అని ఏ శాస్త్రము చెప్పగలుగును? ఏ భక్తుడు వచింపగల్గును ? అయితే పతితో గూడియుండవలసిన ధర్మములు కొన్ని ప్రత్యేకముగా నుండవచ్చును. దానికిమాత్రము లోపము గలుగక వర్తించుట పతివ్రతారత్నమగు నారియొక్క గుణము. అదే రీతిగా తనయొక్క యిష్టదేవతయందు ప్రీతి గలిగియుండుటయు, భక్తితో భజించుటయు, ధ్యానించుటయు మంచిది. ఇతర దైవములతోను, భక్తులతోను ద్వేషము గల్గియుండుట, ఇతర భక్తులను ప్రేమింపకపోవుట, విచారణ జ్ఞానములేని భక్తి యనియే విజ్ఞులు తలంతురు. అయితే, పై జెప్పినదిన్ని ఒకవిధమగు భక్తియే. ఈ భక్తి ఇతిహాసములలో వర్ణింపబడియున్నది. అయితే అట్టికాలము దాటిపోయినది. వచ్చు కాలము ఇట్టి సంకుచితమునకు అవకాశము గలుగజేయజాలదు. అది సర్వత్ర ప్రతిబంధము లేని మార్గముగా నుండును. విజ్ఞానరత్నకోశము లన్నిటిని తెరచివేయవలయును. ఎవరెవరు వారివారి బుద్ధికి తగినంత సారమును విమర్శించి గ్రహించేలాగున నుండవలయును. అయితే యిచ్చట స్వేచ్ఛా ప్రవర్తనచే చెడిపోవుదురేమో యని తలంచనక్కరలేదు. ఏలన? తత్త్వజ్ఞానరసపిపాస గలవాడు విజ్ఞుడగునేగాని, అజ్ఞుడు కాజాలడు. పై చెప్పిన భక్తిలో నిష్ఠ గలిగి కొంతకాలము ప్రవర్తించెడు వ్యక్తికి భగవద్ధ్యానముచే హృదయ పరిశుద్ధత గలిగి బుద్ధి వైశాల్యము గలిగెడి కాల మొకటి వచ్చును.

2. రెండవ భక్తి మరియొకటి గలదు. అది తనయొక్క ఇష్టదేవత, శ్రీ శివుడు గాని, శ్రీ విష్ణువుగాని, శ్రీ కృష్ణుడు గాని, శ్రీరాములుగాని, అయినను, అట్టి ఇష్టదైవమును స్మరించుటయు, ఇష్టదేవతా నామోచ్చారణము జేయుటయు, ఇష్టదేవతా ప్రీతికర కార్యములు చేయుటయు, ఇష్టదైవభక్తులతో సంసర్గము చేయుటయు, హృదయపుండరీకమధ్యమున నిరంతరము ఇష్ట దైవమును కనుగొనుటయు,

ఇష్టదైవమందు ధ్యానములో మగ్నులైయుండుటయు, ఇతర భక్తులతో ప్రేమకలిగి వర్తించుటయు, ఇతర దేవాలయములలోనికి వెళ్లుటయు, అచ్చటికి కావలసిన సహాయము చేయుటయు గలిగియుండును. యీ భక్తి అనన్యభక్తి యనంబడును. ఇతడు పై పేర్కొనిన వానికన్న వెయ్యి రెట్లు పవిత్రతయు, మనోవికాసమును గలవాడు. ఇతడు తనయొక్క ఇష్టదైవమందు తనకెంత ప్రీతిగలదో, ఆలాగున ఇతర భక్తులకు గూడ వారి యిష్టదైవమందు ప్రీతిగలిగి యుండునది చూచి సంతోషము నొందును. వానికిని తనవలెనే యుండుటకు వానియొక్క దైవమార్గములను తెరచిపెట్టును. అట్టి భక్తులతో గూడి ఆడును, పాడును, నాట్యము చేయును. కాని, తన ఇష్టదైవమందు మాత్రము మనస్సు లగ్నమైయుండును. దైవ రసామృతము పానము చేయును.తృప్తుడగును. ఈ భక్తియే పురాణమందు ఎక్కువగా గనబడుచుండును. మొదట చెప్పిన భక్తుని కిట్టి ఆనందము గలుగుటకు అవకాశము లేదు. వాని హృదయము భేదవాదముల చేతను, శత్రుమిత్ర భావముచేతను, హర్షశోకములచేతను నిలకడ గలుగక చంచలమై యుండును. తనయొక్క ఇష్టదైవస్మరణయందు మాత్రము కొంతసేపు హాయి గలుగవచ్చును. అటువంటివాడు ఈ రెండవ భక్తునితో సమానుడు కాజాలడు. ఇతడు అనర్గళ, ఆనంద ప్రవాహముచే నిండిన హృదయము గలవాడగును. ఇతనికి అచ్ఛిన్న తైలధారవలె దైవరసామృతము ప్రవహించుచుండును.

ఉగాది - సంవత్సరాది శుభాకాంక్షలు

21-03- 2015 తేది శనివారం మన్మథనామ సంవత్సరం ప్రారంభం. ఈ నూతన సంవత్సరంలో అందరికి సర్వ శుభములు కలుగుగాక ! లోకంలో అందరూ సుఖశాన్తులతో జీవింతురు గాక!

భగవంతునికై తీవ్ర వ్యాకులత నొందుము !

– శ్రీ రామకృష్ణ పరమహంస

ఈ కళ్లతో భగవంతుని చూడలేవు. భగవంతుడు దివ్యచక్షువులను ప్రసాదిస్తాడు. అప్పుడు మాత్రమే భగవంతుని దర్శించగలుగుతావు. భగవంతుడు అర్జునుడికి దివ్యచక్షువులను ప్రసాదించినందు వలననే అతడు ఆయనయొక్క విశ్వరూపాన్ని సందర్శించగలిగాడు.

నీలో రాగభక్తి ఉదయించినప్పుడు భగవంతుడు దర్శనం యివ్వక ఎలా ఉండగలడు ? తన భక్తుల ప్రేమపట్ల భగవంతుడికి ఎంత మక్కువో నీకు తెలుసా ? పశుగ్రాసం, తెలకపిండి మిశ్రమంపట్ల ఆవుకు ఎంత మక్కువో అంత. ఆ మేతను ఆవు గబుక్కున తినివేస్తుంది.

భగవంతుడి పట్ల గల పరిశుద్ధమైన అహేతుక భక్తినే 'రాగభక్తి' అంటారు. ఈ భక్తి భగవంతుణ్ణి తప్ప ఏ లౌకిక వస్తువునూ కాంక్షించదు. ప్రహ్లాదునికి ఈ రాగభక్తి ఉండేది.

నువ్వు ఒక పెద్దమనిషి ఇంటికి ప్రతి రోజు వెళతావు అనుకొందాం. కాని అతడి నుండి ఏమీ కోరవు. అతడిని కేవలం చూసే నిమిత్తమే నువ్వు వెళ్ళేది. అతడు నీ కేదన్నా అనుగ్రహించబోతే, నువ్వు ఇలా అంటావు. ' వద్దండీ నా కేదీ అవసరం లేదు. మిమ్మల్ని కేవలం చూసిపోదామనే నేను వస్తున్నాను ' . ఇలాంటిదే అహేతుక భక్తి. వీరు భగవంతుణ్ణి ప్రేమిస్తారు. అంతే కాని ఆయన నుండి ప్రతిఫలంగా ఏదీ కోరటం లేదు.

ఇలా అంటూ శ్రీరామకృష్ణులు పాడసాగారు.

ముక్తి నొసగ వెరువగాని
(శుద్ధ) భక్తి నొసగ వెరతు నేను
భక్తి నొందియున్నవాడు
ఎన్న మిన్న అందరికన్న
వందనీయు డందరకును
మూడు లోకముల జయించు ॥ ము ॥

వినవె చంద్రావళీ నీవు
ప్రేమ విషయ మెరుగజేతు
ముక్తి పొందగలవె గాని
భక్తి బడయ దుర్లభంబు ॥ ము ॥
ఒక్క శుద్ధభక్తి కొరకే
బలికి కావలి వాడనగుచు
ఎంతో క్రింది పాతాళమున
అతని ఇల్లు కాచుచుంటి ॥ ము ॥
దొరకదెందు శుద్ధ భక్తి
బృందావనమునందెగాక
గోపగోపీ కాంత లొకరె
దాని మర్మమెరుగు వారు ॥ ము ॥
ఒక్క శుద్ధభక్తి కొరకె
నంద గృహమునందునుంటి
తండ్రియనుచు అతని భార
ములను శిరముపైన మోపి ॥ ము ॥

శ్రీరామకృష్ణులు సంభాషణను కొనసాగించారు. “ ఈ మొత్తంలోని సారాంశం ఏమిటంటే భగవంతునికై తీవ్ర వ్యాకులతను పెంపొందించుకోవాలి. వివేక వైరాగ్యాలను అలవరచుకోవాలి.

మురళీధర కృష్ణుడు

శ్రీరాముడు ఆదర్శమానవుడైనాడు

- శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ
రామానుజ జీయరుస్వామివారు

అనేకానేక మంగళాశాసనములు

శ్రీరాముడు మానవునికి ఉండవలసిన ఓ 16 గుణాలను కలిగి ఉండి, ఎలా ప్రవర్తించాలో ఆచరించి చూపి ఆదర్శ మానవుడైనాడు. 16 గుణాలు అనే కళలతో పరిపూర్ణుడైన మానవునిగా, శ్రీరామచంద్రునిగా, మర్యాదా పురుషోత్తముడైనాడు. ఆయననుండి ఆయన జీవితంనుండి మనం అలవరుచుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. పితృవాక్యపరిపాలన, సత్యసంధత, ఏకపత్నీవ్రతము, సోదర ప్రేమ, ఆర్తరక్షణ... ఇలా ఎన్నెన్నో. అందులో ముఖ్యమైనది కృతజ్ఞత. కృతజ్ఞత అంటే ఎదుటివారు చేసిన ఉపకారాన్ని గుర్తుంచుకోవడం అని అంటాం. లోకంలో ఎవరైనా, ఒకరి నుండి ఉపకారము పొందితే గుర్తుంచుకొని తిరిగి ప్రత్యుకారము చేసేవారు కొందరుంటారు. చేసిన మేలు ఆ అవసరం తీరిపోయిన వెంటనే మర్చి పోయేవారు కొందరుంటారు. చేసిన మేలు మర్చిపోవడమే కాక తిరిగి వారికే అపకారం తలపెట్టే పెద్ద మనుషులూ మరికొందరుంటారు. కానీ, మనిషి అన్నవాడికి ఎంతటి కృతజ్ఞత ఉండాలో శ్రీరామచంద్రుని ఆచరణ ద్వారా నేర్చుకోవలసినదే.

అందరిలా ఉపకారం చేసి ఆనందపరిచినవారి పట్లేకాదు, తనను అడవులపాలు చేసి, కష్టాలు పెట్టిన కైకమ్మ విషయంలో కూడా తాను కృతజ్ఞుడై ఉన్నాడు. ఆమె చేసినదంతా తన మంచికేనని తలచాడు. అసలు అంత ఉపకారం మరెవ్వరూ చేయలేదనే తాను భావించాడనవచ్చు. ఆమె తన కుమారుడైన భరతునికి రాజ్యం దక్కడం కోసం వరమడుగుతూ, శ్రీరాముడిని 14 సంవత్సరాలు అడవికి పంపాలని రెండవ వరంగా కోరుకొంది. ఈ విషయం రామునితో చెప్పలేక దశరథుడు బాధపడుతూ

ఉంటే తానే స్వయంగా చెప్పింది. వెంటనే శ్రీరామచంద్రుడు భరతునికి రాజ్యం కావాలంటే ఆనందంగా ఇచ్చివేస్తాను. ఇక నన్ను అడవులకి వెళ్ళమనడానికి ఇంత ఆలోచించాలా ! నీ మాటను తిరస్కరిస్తానని ఎలా అనుకున్నావు ? అని ఒక్క క్షణం ఆగి " రాజ్యం వా వనవాసో వా వనవాసో మహోదయః " రాజ్యమైతేనేమి, వనవాసమైతేనేమి, నిన్నానందింపచేసేదేదో అదే నాకానందం. అది వనవాసమైతే నాకూ అదేఆనందమమ్మా ! అని రాజ్యపాలనచేస్తూ అయోధ్యలోనే ఉండిపోతే అరణ్యంలో తాను నెరవేర్చవలసిన కార్యాలు చెక్కబెట్టం ఎలా ? ఆ విషయం గుర్తుచేసి, ఉపకారం చేసింది కైకమ్మ అనుకొన్నాడు. ఈ వార్త తెలియగానే లక్ష్మణుడు కైకమ్మమీద మండిపడితే శ్రీరాముడాతనికి నచ్చచెప్పాడు. నిజానికి కైకమ్మకి భరతునిమీదకంటే నాపైనే ఎక్కువ ప్రేమ. అలాంటి ఆమె ఇప్పుడిలా కోరిందంటే ఏదో బలమైన కారణము ఉండి ఉంటుంది. ఆమె ఏమి చేసినా తల్లిలాగ నా శ్రేయస్సుకే చేస్తుందని నచ్చచెప్పాడు. ఆమె చేసిన మేలు గుర్తుంచుకొనే భరతుని పట్ల ప్రేమ ఎంతో పెంచుకొన్నాడు.

ఆమె వరం కోరబట్టే కదా ! (1) దేవతల ప్రార్థన నెరవేరుస్తూ రావణవధ చేయగలిగినది (2) తమరాజ్యంలోని భాగమే అయిన అరణ్యంలోని ఋషులకు ఖరదూషణాది రాక్షసులబారి నుండి విముక్తి కలిగించినది. (3) వారి తపస్సులు కొనసాగేట్లు రక్షించగలిగినది. (6) విభీషణుడు వంటి సోదరుడు లభించినది. (7) హనుమ వంటి దాసుని పొందగలిగాడు (8) శబరి ఎదురు చూపులను ఫలింపచేయగలిగాడు. (9). జటాయువుకి ముక్తిని యిస్తూ సత్యవాక్పాలన మహిమను చాటగలిగాడు. (10). తాను పితృసంకల్పపాలన చేయు పుత్రునిగా జగత్ప్రసిద్ధిని పొందగలిగాడు. (11) ఇక్ష్వాకుల లోకాన్నంతటినీ తిరిగి సంపాదించగలిగాడు. (12) కోతుల ఉడతల సహాయాన్ని జగత్ గుర్తించేట్టు చేయగలిగాడు. (13) సేతుబంధనం వంటి అద్భుత కార్యాలు జరుప గలిగాడు. (14) సీతాదేవి యొక్క పాత్రివ్రత్య ప్రభావం లోకం

గుర్తించగలిగింది. ఇంకా ఇంకా ఎన్నెన్నో ఉపకారాలు, కైకమ్మ తనను వనానికి పంపడం వల్లనే కదా జరిగాయి. ఈ ఘనతతంతా ఆమెదే. అని శ్రీరాముడు కైకమ్మ వలన వనవాసం చేయాల్సి వచ్చినా, దానివలన చివరికి ఏయే మంచి పరిణామాలు సంభవించాయో వాటిని మాత్రమే గుర్తుంచుకున్నాడు. నిజానికి 14 సంవత్సరాలు ఎండనక, వాననక, రాళ్ళనక, ముళ్ళనక, సుకుమారి అయిన సీతతో కలసి తిరుగుతూ, మధ్య మధ్యలో వచ్చే ఆపదలను ఎదుర్కొంటూ, తన ప్రాణమైన సీతమ్మ ఎడబాటు ఏర్పడితే ఆమె కోసం విలపించి, తపించి, వానరుల సహాయం అర్థించి, వెతికి, సేతువు కట్టి, లంకజేరి రావణుని వధించి,.... ఎన్ని కష్టాలుపడ్డాడు శ్రీరాముడు. కానీ ఆయన ఇవన్ని మర్చిపోయి, మంచినే గుర్తుపెట్టుకున్నాడు. అదీ ఆయనలో కృతజ్ఞతాస్థాయి. ఇదంతా కైకమ్మ చలవే అనుకొన్నాడు. యుద్ధం పూర్తిఅయిన తరువాత విభీషణుడు హేరామా ! అభ్యంగన స్నానమాచరించు, నూతన వస్త్రాభరణాలు ధరించు అని ప్రార్థిస్తే కూడా **" తం వినా కైకయీపుత్రం భరతం ధర్మచారిణమ్ " న మే స్నానం బహుమతం వస్త్రాణ్యాభరణాని చ "** అంటూ నాకింత ఉపకారం చేసిన కైకమ్మ కుమారుడు బరతుడు నా బయటిదేహభూతుడైన తాను ఇంకా దీక్షలో నా కోసం ఎదురు చూస్తూ ఉంటే, అతనిని చూడనిదే స్నానాదులు చేయనన్నాడు. దేహం దూరంగా పెట్టుకొని స్నానాభరణాది అలంకారాలు ఎవరికి చేయమంటావు అని అడిగాడు. ఇదీ మన రాముని గొప్పతనం.

ఉపకారికి ఉపకారం చేయడం గొప్పకాదు, అపకారికి ఉపకారం చేయడమే గొప్ప అంటారు నీతిశతకములో. కానీ శ్రీరాముడు అసలు అపకారమునే ఉపకారంగా భావించాడు. ఇలాంటిగుణాల్ని మనం మన ఆరాధ్యదైవమైన శ్రీరామునినుండి అలవరచుకోవలసి ఉంది.

– జై శ్రీమన్నారాయణ ! (రామాయణ వైజయన్తి నుండి)



రాముని ఆదర్శ జీవితము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వనవాసకాలమున శ్రీరాముడు అనుష్ఠించిన వ్రతములలో బ్రహ్మచర్యవ్రతము చాల ముఖ్యమైనది. అశ్వమేధయాగ సందర్భమున సీత రసాతల ప్రవేశము గావించినతదుపరి శ్రీరాముడు తన జీవిత కాలమున మఱియొక స్త్రీని వివాహము చేసికొనలేదు. ప్రతి యజ్ఞమందును ధర్మపత్ని యొక్క అవశ్యకత ఏర్పడినప్పుడు, శ్రీరాముడు సీతయొక్క స్వర్ణమయ ప్రతిమను వాడుచుండెను. ఈ ప్రకారముగ శ్రీరాముడు నియమ పాలనమును చక్కగ నాచరించుచు, వ్రతనిష్ఠాగరిష్ఠుడై ఆధ్యాత్మిక క్రమశిక్షణాయుతుడై లోకమునకు గొప్ప ఆదర్శమును చూపెను.

దయాదాక్షిణ్యములు :

శ్రీరాముడు దయార్ద్ర హృదయుడు. 'సర్వభూతహితే రతః' సమస్త ప్రాణులకును హిత మొనర్చుటయందు దత్తచిత్తుడు అని మారీచుడు శ్రీరామునిగూర్చి రావణునకు వర్ణించి చెప్పెను. మానవులకే కాదు, వానరులకే కాదు, పశుపక్ష్యాదులకే కాదు సర్వప్రాణులకును మేలు కలిగించవలెనను కాంక్ష శ్రీరామునకు కలదు. కనుకనే వానరులను దరికి చేర్చుకొనెను. పక్షియగు జటాయువును ఆదరించెను. గుహునితో 'నాకు భక్ష్య భోజ్యములతో పనిలేదు. నా గుఱ్ఱములకు ఒకింత మేతపెట్టిన చాలును' అని చెప్పిన కరుణామయుడు శ్రీరాముడు. నిషాదవంశమున జన్మించినను గుహుని ప్రేమపూర్వకముగ చెంతకు చేర్చి అనుగ్రహించిన మహనీయుడు. యుద్ధానంతరము లంకాపురి నుండి పుష్పక విమానముపై తిరిగివచ్చు సందర్భములో కూడ గుహుని తలంచుకొని వారికి హనుమంతుని ద్వారా

వర్తమానమును పంపెను. శబరియొక్క భక్తికిమెచ్చి ఆమె అతిథ్యమును స్వీకరించి, ఆమె ప్రేమపురస్సరముగ నొసంగిన ఫలాదులను ఆనందముతో సేవించి ఆమెను అనుగ్రహించెను.

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥

' ఎవడు ఒక్కసారియైనను శరణుబొంది ' నేను నీవాడను' అని చెప్పి రక్షింపుడని నన్ను కోరినచో అతనికి సమస్త ప్రాణులనుండియు నేను అభయము నొసంగెదను. ఇది నా యొక్క వ్రతము ' అని శ్రీరాముడు సుగ్రీవునితో పలికి శత్రుపక్షము నుండి వచ్చినప్పటికిని శరణుబొందిన విభీషణుని అనుగ్రహించి తనపక్షమున చేర్చుకొనెను. విభీషణుడు శత్రుపక్షమునుండి వచ్చినవాడు కాబట్టి చేర్చుకొనవద్దని సుగ్రీవుడు మొదలైనవారు ఎంత చెప్పినప్పటికిని శ్రీరాముడు వారి వాక్యములను వినక 'శత్రువు ఆర్తుడైనను, అభిమానియైనను, తన విపక్షిని శరణుబొందినచో శుద్ధహృదయుడగు మనుజుడు తన ప్రాణమును గూర్చిన మోహమును వదిలి అతనిని రక్షించవలయును. శరణాగతుని రక్షింపకుండుట గొప్ప దోషము ' అని వారికి హితవు చెప్పి విభీషణుని తన సైన్యములో చేర్చుకొనిన విశాల హృదయుడు శ్రీరాముడు.

వేదాన్తభేరి పత్రికకు ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01.	ఎ. ఇంద్రకిరణ్‌రెడ్డి (మెంచిర్యాల)	-	రూ. 1500/-
02.	ఎస్.వి. భాస్కరరావు (మియాపూర్)	-	రూ. 1501/-
03.	ఆర్.సత్యం (సుబ్బవరం)	-	రూ. 1200/-
04.	హుబ్లి రామచంద్రయ్య శెట్టి (అనంతపురం)	-	రూ. 1116/-

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :
పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ :పరమాత్మ సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వాధారుడు అను విషయమును అనుమాన శాబ్ద ప్రత్యక్షములను ప్రమాణములచే ముందు శ్లోకమున వివరించుచున్నారు.

ధూమాదగ్నిమివానుమీయ జగతో హేతుం చరత్కుంతతః
తద్బిభ్రాణ మివానులక్ష్య నియతం తస్యేశ మంతర్ముఖః
నానావ్యక్తిమతల్ల్యుపప్లవవశా ద్భావా దథైతద్విభోః
చిత్రాభాసశతై స్తిరోహితపటీ సత్తాం స్మరన్ మృష్యతి.

ధూమాత్ = పొగనుబట్టి, అగ్నిం ఇవ = అగ్నినివలెనే, జగతః = (కార్య రూపమైన) ప్రపంచమును బట్టి, హేతుం = కారణమైన పరమాత్మని, అనుమీయ = అనుమానించి, చరత్ కుంతతః = కదలుచున్న ఈటెయస్త్రమును బట్టి, తద్‌బిభ్రాణంఇవ = దానిని ధరించిన పురుషునివలెనే, తస్య = పూర్వోక్తమైన ప్రపంచమునకు, నియతం = నియామకుడైన, ఈశం = పరమాత్మను, అనులక్ష్య = గుర్తించి, కనిపెట్టి, అథ = ఆ పిదప, అంతర్ముఖః = అంతర్ముఖుడై (అట్టిజ్ఞాని), నానావ్యక్తి మతల్ల్యుపప్లవవశాత్ = అనేకమైన ఉత్తమవ్యక్తులకు సంబంధించిన ఉపద్రవముల వశమున, (తల్లడిల్లక) చిత్రాభాసతైః వందలకొలదిగా ఉన్న ఆభాసమాత్రములగు చిత్రములచే, తిరోహిత= మూయబడిన, పటీసత్తాం = (ఆ) చిత్రములకు ఆధారమగు వస్త్రముయొక్క సత్తను (ఉనికినే), స్మరన్ = స్మరించుచు, ఏతత్ విభౌ = ఈ పూర్ణవస్తువునందలి

భావాత్ = ఉనికిని బట్టి (నిలుకడచేత), మృష్యతి = సహించును.

" యతోవా ఇమాని " " జన్మాద్యస్య యతః" " తజ్జలా నితి శాంత ఉపాసీత " ఇత్యాది శ్రుతులు జగత్తునకు శివుడే కారణమని చెప్పుచున్నవి. ధూమలింగజ్ఞానముచేత పర్వతమందు అగ్ని యున్నదని అనుమానము చేసినట్టు కార్యరూపమగు జగత్తునుబట్టి కారణముగా ఉన్న శివుని తెలియవలెను. చలించుచున్న ఈటెను బట్టి ఆ శస్త్రధారి చేతనపురుషుని తెలిసికొనునట్లు ఈ జడమగు జగత్తు చేతనరూప శివుడు లేనిదే చలింపదు. అన్ని దేశకాలములందు కార్యోత్పత్తి యగుచుండుటవలన శివునకు నిత్యత్వ వ్యాపకత్వములు గలవనియు, వసంతకాలము అగపడని దైనను ఫలపత్ర కుసుమాద్యుత్పత్తికి హేతువైనట్లు నిరవయవ నిరాకార నిర్గుణ శివుడు జగదుత్పత్తికి కారణమైయున్నాడని కనిపెట్టి, ఈ అగపడు నామరూపాత్మక మగు జగమంతటిని చిత్రపటోదాహరణముగా శివుని సత్తయే సత్తగా గల దానినిగా చూచుచు, దీని ఉత్పత్తి నాశములందు విచలితుడు గాక జ్ఞాని శాన్తుడైయుండును.

గురుదేవుల ఆరాధనోత్సవాలు – ఆహ్వానము

గురుదేవులు పరమ **పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆరాధనోత్సవాలు 2015 ఏప్రిల్ 3 తేది నుండి 7వ తేది వరకు ఐదురోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగును. 3- 04 - 2015 తేది చైత్రశుద్ధ చతుర్దశి నాడు శ్రీవారి ఆరాధన 07-04-2015** తేది చైత్ర బహుళ తదియనాడు జన్మదినోత్సవం జరుగును. అందరికి ఆహ్వానము.

ఇట్లు

శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘము

హిందువులంతా ఒక్కటే !

(ఇంకెక్కడుంది మనమధ్య విభేదం – ప్రతి ఇంటి గడపకూ చేరాల్సిన నినాదం)

– డా ॥ వి.భాస్కరయోగి

– కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, హటక్ నుండి కటక్ వరకు ప్రజలంతా 'భారతమాతాకీ జై' అన్నప్పుడు ఆ తల్లిబిడ్డలమైన మనం సోదరులముగాక ఇంకేం అవుతాం. ఇంకెక్కడుంది మన మధ్య విభేదం !

– సంక్రాంతి, దీపావళి, దసరా, శివరాత్రి... వంటి పర్వదినాలు దేశమంతా ఒకేలా జరుగుతున్నప్పుడు ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– మన దేవతలైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శంకరుడు, సీత, సావిత్రి, దుర్గా, మొదలైన వారిని జాతి – కుల భేదాలు లేకుండా ఆరాధిస్తున్నాం. అయ్యప్ప దీక్ష, శివదీక్ష, హనుమత్ దీక్ష, భవానీ దీక్షల్లో ఎక్కడా భేదభావాలు లేనపుడు ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– ప్రతి హిందువు దేశంలోని అన్ని తీర్థయాత్రలను తమవిగా భావించి సేవిస్తున్నప్పుడు ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– పుట్టినప్పుడు, వివాహ సమయంలో, మరణించినపుడు దేశం మొత్తం ఒకే రకమైన మంత్రాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ఇంకెక్కడుంది మన మధ్య విభేదం !

– మనమంతా ఋషులసంతానం కాబట్టే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాల్లోని గోత్రాలు ఒకటిగా ఉండడం, వాటి ఋషులు ఒక్కరే ఉండడం మన కులాల యొక్క మూలాలు ఒక్కటే అని చెప్పడానికి నిదర్శనం. ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– మనం ఆరాధించే గంగ, గీత, గోమాత, గాయత్రి, తులసి, ఓంకారం, స్వస్తికం, పూర్ణకుంభం అందరికీ పూజనీయాలే. అందుకే కుంభమేళాల్లో, పుష్కరాల్లో అన్ని వర్గాల ప్రజలు ఆరాధనాభావంతోనే పాల్గొంటున్నారు. ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– ' జనని సంస్కృతంబు యెల్లభాషలకు ' మన మాతృభాషలన్నింటికీ సంస్కృతమే మూలం. దేశంలోని అన్ని భాషల్లో సంస్కృతం కనిపిస్తుంది.

అందరినీ కలిపే భాష సంస్కృతం ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– మన జాతిలో పుట్టిన మహాత్ములు, వీరులు అన్ని కులాల్లో, అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. వారంతా హిందువులందరికీ ఆరాధనీయులే ! ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– మన ఆరాధానాపద్ధతుల్లో మతభేదం లేదు. ఉన్నా అవి వ్యక్తిగత ఉపాసనా చిహ్నాలు మాత్రమే. ఉదాహరణకు బద్రీనారాయణుడి వైష్ణవాలయంలో కేరళకు చెందిన నంబూది బ్రాహ్మణ శివోపాసకుడే పూజారి అని గమనించాలి. ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– కర్నాటకలో ప్రసిద్ధిచెందిన ధర్మస్థల క్షేత్రం గొప్ప శైవక్షేత్రం. పూజారి పరమ వైష్ణవుడు. దేవాలయ పాలకుడు వీరేంద్ర హేగ్డె జైన సంప్రదాయానికి చెందినవాడు. ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

– అష్టాంగయోగం, చతురాశ్రమాలు (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాస) చతుర్విధపురుషార్థాలు (ధర్మ, అర్థ, కామ మోక్షాలు) షోడశ సంస్కారాలు దేశంలోని అన్ని వర్గాల హిందువులు ఆచరిస్తున్నారు. ఇంకెక్కడుంది మనమధ్య విభేదం !

ఒక్కసారి ఆలోచించండి. ఇన్నింటిలో మనకు సారూప్యత ఉంది. ఎలాంటి భేదాభిప్రాయం లేదు. వందల సంవత్సరాల దుర్మార్గపు మత రాజకీయ విదేశీ పాలకులు మనలో అనేక విభేదాలు సృష్టించారు. అందులో నీవు బ్రాహ్మణుడవు. అతడు క్షత్రియుడు, ఆమె వైశ్య, ఆయన శూద్రుడు అనే కులభేదాలు, నీవు బెంగాలీ, నేను తెలుగు, ఆయన మలయాళీ. అనే ప్రాంతీయ భావాలు, ఆయన శిఖ్ఖు, ఆయన శైవుడు, ఆమె వైష్ణవభక్తురాలు, అతడు బౌద్ధుడు అనే విభేదాలు సృష్టించి మన ఐక్యతను దెబ్బతీశారు.

ఇంత విజ్ఞానం పెరిగి, శాస్త్రజ్ఞానం అందుబాటులోకి వచ్చాక మనం అందులోనే కూరుకుపోవడం సమంజసమా !

హిందువులారా ! మేల్కోవాల్సిన తరుణం ఆసన్నమైంది. జాతి, కుల భేదాలను అణగద్రొక్కి భవ్యభారత నిర్మాణానికి కదలండి.

(డిశంబర్ 2014 గీతాజ్ఞానయోగ సమాచార్ నుండి)

శ్రీమద్రామాయణంలో కిష్కింధాకాండ ప్రాశస్త్యము

– మహామహోపాధ్యాయ
– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

రామాయణం ఒక నిరుపమానమైన కావ్యరాజం. ఈ ఆదికావ్యానికి దీటైన రచన మరొకటి నేటికీ వెలువడలేదు. కాళిదాసాదులైన సుప్రసిద్ధ కవులందరికీ కావ్యరచనలో మార్గదర్శకమైనది రామాయణమే.

అలంకారికులు నిబంధించిన ఉత్తమ కావ్య లక్షణాలు వాల్మీకి రచనను చూచి ఏర్పరచుకొన్నవే. రసవత్తరమైన రామచరితం భారతావనిలోనే కాక ఇతర దేశాలలో కూడా అనన్య సామాన్యమైన ఆదరణకు పాత్రమయింది.

ఏ కావ్యానికైనా అందలి కథ చాలా ప్రధానమై ఉంటుంది. కథలోని రసవత్తరమైన ఘట్టాలు కావ్య గౌరవాన్ని ఇనుమడింప చేస్తాయి. అందులోనూ కథన విధానం అత్యంత రమణీయంగా కొనసాగితే బంగారానికి తావి అబ్బినట్లుంటుంది. ఈ సుగుణాలను పుణికి పుచ్చుకోవడం వల్ల ఆదికావ్యం అద్వితీయ మయింది. నాడూ, నేడూ కూడా సహృదయుల హృదయాలను సముల్లసింపజేస్తున్నది.

రామాయణంలో ఏడు కాండలున్నాయి. అందులో కిష్కింధాకాండం ఇటు బాల – అయోధ్యా – అరణ్య కాండాలకూ, అటు సుందర – యుద్ధ ఉత్తర కాండాలకూ నడుమ మధ్యమణిలాగా భాసిస్తున్నది.

కథాఘట్టాలు

ఈ కాండంలోని కథాఘట్టాలను ఈ క్రిందిరీతిగా సంగ్రహించవచ్చు

"పంపా వర్ణనమున్, సతీవిరదీత
ప్త స్వాంతుడౌ రాముతో
పెం పొందం, గపివర్య మైత్రియు, దదా
ప్తి వాలి సంహారమున్
గుంపులో గూడిన కోతులెల్ల నలుది
క్కుల్ సీతజాడల్ విచా
రింపన్ బోయి నిరాశు లౌటయును , ని
ర్విణ్ణాత్ములౌ వానరుల్
సంపాతింగని సీత వార్త విని హ
ర్ష మ్మొంది వాతాత్మజున్
బంపన్ లంకకు నిశ్చయించుట కథా
భాగమ్ము లౌనిందులోన్ " (స్వయం)

సీతా విరహ పీడితుడైన రాముడు సుగ్రీవుని మైత్రి కోరి అతణ్ణి అన్వేషిస్తూ ఋష్యమూకాద్రికి వస్తాడు. రామలక్ష్మణ సందర్శనం సుగ్రీవునికి భయజనకమవుతుంది. హనుమంతుడు అతణ్ణి ఓదార్చి మారువేషంతో రాముని సమీపిస్తాడు. పరస్పర పరిచయం కల్గిన తర్వాత రామునికీ, సుగ్రీవునికీ, మైత్రి కుదురుతుంది. వాలిని వధిస్తానని రాముడు సుగ్రీవునికి మాట ఇస్తాడు. వాలి సుగ్రీవులకు ద్వంద్వయుద్ధం జరుగుతుంది. రెండవసారిగా జరిగిన పోరాటంలో రాముడు తన మాట నెరవేర్చు కొంటాడు.

రాజ్యాభిషిక్తుడైన సుగ్రీవుడు సుఖాసక్తుడై సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ వహిస్తాడు. కోపోద్దీపితుడైన లక్ష్మణుడు కిష్కింధకు వెళ్ళి తార మాటలతో శాంతించి సుగ్రీవునికి అతని కర్తవ్యం స్మరణకు తెస్తాడు.

సుగ్రీవుడు రాముని సమీపించి సీతాన్వేషణకై వానర వీరులను నలుదిక్కులకూ పంపుతాడు.

దక్షిణ దిశకు వెళ్లిన అంగదాదులు సీతజాడ కనుగొనలేక విషాదానికి లోనవుతారు. ఒకగుహలో ప్రవేశించిన వానరానీకం స్వయంప్రభ సాయంతో వెలికి వస్తుంది. సంపాతిని చూచి కపిబృందం భయపడుతుంది. తుదకు అతని నుండే సీత వృత్తాంతం తెలుసుకొని వానరులు సంతసిస్తారు. సముద్రం లంకాగమనానికి నిరోధకమవుతుంది. అవలీలగా సాగరలంఘనం చేయగలనని హనుమంతుడు ముందుకు రావడంతో కిష్కింధాకాండ కథ సమాప్తమవుతుంది.

కథా వైచిత్రి :

ఈ కథలో సుగ్రీవుని భయమూ, హనుమంతుని మారువేషమూ, వాలి సుగ్రీవుల చరిత్రా, వాలిని వధించిన విధానమూ, కర్తవ్య నిర్వహణలో అలసుడైన సుగ్రీవుని భోగలోలత్వమూ, సీతాన్వేషణలో అడుగడుగునా ఎదురైన వైఫల్యమూ ఇత్యాది ఘట్టాలు పాఠకునిలో ఔత్సుక్యం రేకెత్తిస్తాయి. అవి అతనిలో అపూర్వమైన శ్రవణాసక్తిని కల్గిస్తాయి. ఎవని మైత్రి కోరి రాముడు వస్తాడో, అతడే రాముని చూచి భయపడడం, ఏ సంపాతిని చూచి వానరసేన భయానికి లోనవుతుందో, అతడే వారికి సీతావృత్తాంతాన్ని తెలియుజేయుడం – ఇత్యాదులైన సన్నివేశాలు కథకు వైచిత్రి నాపాదిస్తున్నాయి. సప్తసాల వృక్షాలను రాముడొక్కబాణంతో ఛేదించడం, వాలి అవక్ర విక్రమం, స్వయం ప్రభా వృత్తాంతం మొదలైన సందర్భాలు శ్రోతలను ఆశ్చర్య చకితులను చేస్తాయి.



అక్క మహాదేవి అనుభవామృతం

తెనుగు – డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు,
(బళ్లారి)

29. పరమ శివుని యొక్క లీలావినోదమే ఈసకల జగత్తు. ఆ శివుడు తన సంతోషానికి ఈ జగత్‌ను సృష్టించాడు. తన వినోదానికి తానుకూడా జీవరాశియై సకల ప్రపంచంలో వినోదిస్తున్నాడు. అన్ని జీవులను కూడా ఈ ప్రపంచ సంసార చక్రములో తిప్పుచున్నాడు. ఈ జగత్తు యొక్క ఆట చాలు అనుకుంటే సృష్టిని తనలో లయముచేసుకొంటాడు. అప్పుడు మాయాపాశము సమాప్తమౌతుంది. అలా వున్నప్పుడు నాదేమి తప్పువుంది. నాకెందుకు ఈ సంసారము. ఈ సంసారమును పుట్టించిన నువ్వే నువ్వే కాపాడాలి కదా !

30. నేను జన్మించి వచ్చినది ఇది ఒకటే జన్మము కాదు. ఎన్నో జీవస్వరూపంగా పుట్టి వచ్చితిని. అంతులేని ఆధ్యాత్మ దైవిక ఆధి భౌతిక తాపత్రయములతో బాధపడ్డాను. ఇప్పుడు మీ కరుణ కోరి మీ సన్నిధానానికి వచ్చినాను. ఇప్పుడు చెన్నమల్లికార్జునునికి నా శరీరము సేవ చేస్తుంది. మనసు స్మరణ చేస్తుంది. దానికోసం నీవు కరుణించాలి ఇది నీ ధర్మము కూడా.

31. పుట్టకూడని యోనులలో పుట్టినాను. తినరాని తిండిని తినిపించినావు. ఇదంతా దైవము. శివునిలో పక్షపాతము లేదు. అతనికి తనవారు, పరవారు అనే పక్షపాతము లేదు. ఒకసారి భృంగి పార్వతికి వందనము చేయకుండా కేవలం శివునికి నమస్కరించింది. దానివలన

కోపము చెందిన పార్వతీ దేవి తన అంశములైన మాంస చర్మాదులను తీసుకొన్నది. అప్పుడు భృగి నిలవడానికి నిస్సక్తుడైనపుడు శివుడే మూడవకాలును ఆధారంగా ఇచ్చాడు. ఈ విధంగా శివుడు ఎవరి పక్షపాతికాదు. ఈ కథ వలన మనకు ఏమి తెలియుచున్నదంటే శివుని నమ్మినవాణ్ణి కాపాడుతాడని తెలియచున్నది.

32. పట్టు పురుగు తన నుండి జిగురుతో గూడు కట్టుకొనును. ఆ గూడే దాని మరణానికి కారణమౌతుంది. ఈవిధంగా మనుష్యుడు మనస్సు కోరినటువంటి ప్రపంచ విషయాలను అనుభవించి వాటియొక్క వాసనా బలముతో బంధనాలకు లోనవుతున్నాడు. ఈ మనస్సు యొక్క దురాశ నశించాలంటే చెన్నమల్లికార్జునా నీ కృప వల్లనే సాధ్యము. పుట్టుక చావులనే భవచక్రమునుంచి ముక్తి చెందాలని కోరుకొనేవారు దురాశను వీడాలి. భగవంతుణ్ణి సంపూర్ణంగా నమ్మాలి.

33. బయటకు చూడటానికి ఈ శరీరం అందంగా అగపడినా లోపల విచారించితే మల మూత్రముల బాండము, ఎముకల పందిరి. దుర్గంధము. ఇవన్నిటిని విచారించిన తరువాత మళ్ళీ, ఈ శరీరరూపానికి మోహము చెందవచ్చా ! ఇటువంటి ఈ అపవిత్రమైన దేహాన్ని నమ్మక చెన్నమల్లికార్జునుని తెలుసుకొని జీవనం సార్థకం చేసుకోవాలి.

34. మానవ జన్మానికి రావాలంటే అనేక జన్మలు ఎత్తాలి. ఒకటి కాదు రెండు కాదు, మూడు కాదు ఎనుబది నాలుగు లక్షల జీవరాసుల కడుపులో పుట్టి వచ్చినాము. ఎన్నో కష్టసుఖములను అనుభవించినాము. వెనుకటి జన్మముల యొక్క సుఖదుఃఖాలు వచ్చినా ఏది ఏమైనా గాని మానవుడై పుట్టిన తరువాత మహాదేవుడైన మల్లికార్జునుని తెలుసుకోవాలి. అతన్ని కరుణించమని ప్రార్థించాలి.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

సత్యముపదమూడు విధములుగా ఉంటుందని శ్రీమన్మహాభారతము ఈ క్రిందివిధముగా చెప్పుచున్నది.

శ్లో ॥ సత్యం త్రయోదశవిధం సర్వలోకేషు భారత !

శ్లో ॥ సత్యం చ సమతాచైవ దమశ్చైవ న సంశయః ।
అమాత్సర్యం క్షమాచైవ హ్రీస్తితిక్షా 2 నసూయతా ॥

శ్లో ॥ త్యాగో ధ్యానమథార్యత్వం ధృతిశ్చ సతతం స్థిరా ॥
అహింసా చైవ రాజేంద్ర ! సత్యాకారాస్త్రయోదశ ॥

(మహాభారతము - శాంతి పర్వము - (ఆపద్ధర్మ పర్వము) 162 - 7, 8, 9)

అర్థము : ఓ భారతా (ధర్మరాజా) ! సంపూర్ణ లోకములలో సత్యము యొక్క భేదములు పదమూడు గలవని స్వీకరింపబడుచున్నవి. అవియేవి యనగా!

1. సత్యము :

2. సమతా : తనయొక్క ప్రియమైన మిత్రులయందు, అప్రియమైన శత్రువుల యందు సమానభావము.

3. దమము : బాహ్యార్థముల నుండి మనస్సును మరియు నింద్రియములను నిగ్రహించుట.

4. మత్సరతా అభావము : ఇతరులు పుణ్య కార్యములు చేయునపుడు దాన ధర్మములు చేయు సమయములో మనస్సును సంయమనము చేయుట అనగా ఇతరులపై " ఈర్ష్య " పెట్టుకొనకుండుట.

5. క్షమా : సహించదగిన, సహించుటకు యోగ్యమైన వ్యవహారములో మరియు ప్రియమైన, అప్రియమైన వచనములను సమానభావముచే సహించువాడే సర్వ సమ్మత క్షమాశీలుడైన శ్రేష్ఠ పురుషుడు.

6. లజ్జా : ఏ బుద్ధిమంతుడైన పురుషుడు చక్కగా ఇతరులకు హితము చేయుచుండునో, మనస్సులో ఎప్పుడు భేదము (దుఃఖమును) పొందడో, ఎవని మనస్సు, వాణి ఎల్లప్పుడు శాంతమై యుండునో మరియు ఎవడు మనోవాక్కాయములచే నిషిద్ధ కృత్యములు చేయుటకు సంకోచపడునో వాడు లజ్జాశీలుడు అనబడును.

7. తితీక్షా : ధర్మార్థముల కొఱకు ఏ మనుష్యుడు కష్టము సహించునో, అతని ఆ సహనశీలతను " తితీక్షా " అందురు. లోకములో ఆదర్శ పురుషుడుగా రాణించాలంటే అవశ్యముగా " తితీక్ష "ను పాలించవలయును.

8. అనసూయ : " గుణేషు దోషావిష్కరణమ్ అసూయా ఇతి సిద్ధాంత కౌముదీ " 576 (1- 4-37) తద్రహితత్వమ్ - అనసూయా ।
గుణవంతుల యందు దోషారోపణము అసూయ అంటారు. అది లేకుండా ఉండుటయే అనసూయ అనబడును.

9. త్యాగము : రాగద్వేషరహితుడై శబ్దాది విషయాసక్తిని వదలుకోవడమే వాస్తవముగా " త్యాగ " మనబడును.

10. ధ్యానము : " తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్ " (పాతంజల యోగ సూత్రము 3 - 2) ధ్యేయ వస్తువు (పరమాత్మ) నవలంభించియుండు చిత్తవృత్తికి తైలధారవలెనవిచ్ఛిన్న ప్రవాహము.

11. ఆర్యతా : (శ్లో ॥ కర్తవ్యమాచరన్కామ మకర్తవ్యమనాచరన్ ।
తిష్ఠతి ప్రాకృతాచారో యఃస "ఆర్య" ఇతి స్మృతః ॥

శ్లో ॥ యథాచారం యథాశాస్త్రం యథాచిత్తం యథా స్థితమ్ ॥
వ్యవహారముపాదత్తే యః స " ఆర్య " ఇతి స్మృతః ॥

(శ్రీ యోగవాసిష్ఠ మహారామాయణము - నిర్వాణ ప్రకరణము - పూర్వార్ధము 126 - 54, 126 - 55)

అర్థము : కర్తవ్యములగు నిత్యనైమిత్తిక కర్మలన్నింటిని యాచరించుచు, అకర్తవ్యములగు నిషిద్ధ కర్మలనాచరించక, ప్రస్తుతాచారమందు స్థితి గలిగి యుండువాడు " ఆర్యు"డనబడును. తన పూర్వుల యాచారముల కనుకూలములును, చిత్తమునకు సదా తృప్తిగలుగు జేయునవియు నగు వ్యవహారములను గ్రహించువాడు " ఆర్య "డని చెప్పబడును.

శ్లో ॥ ఆర్యతా నామ భూతానాం యః కరోతి ప్రయత్నతః ।

శుభం కర్మనిరాకారో వీతరాగస్తథైవచ ॥

(మహాభారతము శాంతి పర్వము, అపద్ధర్మ పర్వము 162 - 18)

అర్థము : ఏ మనుష్యుడు తనను ప్రకటము చేసుకొనకుండా (నిరభిమానముగా) ప్రయత్న పూర్వకముగా ప్రాణుల మేలు కోసము పనిచేయునో, అతనియొక్క ఆ శ్రేష్ఠ భావము మరియు ఆచరణకు " ఆర్యత " అందురు. ఇది ఆసక్తి త్యాగముచే ప్రాప్తించును.

12. ధృతి : సుఖ దుఃఖములు ప్రాప్తమైనపుడు మనస్సులో వికారము గలుగకుండుట "ధృతి "యనంబడును. ఏ బుద్ధిమంతుడు తనయొక్క ఔన్నత్యమును గోరుతాడో, అతడు " ధృతిని " సేవించుచుండవలయును. దేహేంద్రియములు నీరసించినప్పటికి వాటిని కార్యోన్ముఖము చేయుటకు చేయు ప్రయత్న విశేషమునకు " ధృతి " అంటారని శ్రీ మధుసూదన సరస్వతి స్వాములవారు చెప్పారు. (గీత. 10-34 & 16 - 3)

13. అహింసా : మనో వాక్కాయములచే చేయు ప్రాణిపీడనము హింసాయనబడును. " అద్రోహో సర్వభూతేషు కర్మణా మనసా గిరా " (మ.భా.శాం.ప. 162 - 21) మనోవాక్కాయ కర్మలచే ఏ ప్రాణికి గూడ ద్రోహము చేయకుండుటను గూడ అహింసాయందురు. కావున నో రాజేంద్ర!

(ధర్మరాజా) పైన దెలిపిన పదమూడు భేదములు " సత్యము " యొక్క స్వరూపమే యని యెఱుంగుము. ఇందులో సంశయము లేదు.

శ్లో ॥ ఏతే త్రయోదశాకారాః , పృథక్ సత్యైక లక్షణాః ।

భజంతే సత్యమేవేహ బృంహయంతే చ భారత ! ' (భార. 162 - 22)'

అర్థము : ఓ భారత ! పృథక్పృథక్‌గా చెప్పబడిన ఈ పదమూడు విధముల ధర్మములు ఒకే ఒక సత్యమునే సూచించుచున్నవి. ఇవి యన్నియు సత్యమునే యాశ్రంచుకొని యుండి, సత్యముయొక్క వృద్ధిని మరియు పుష్టిని చేయుచున్నవి. గాన సత్యము యొక్క స్వరూప భేదములేయని తెలియదగినవి యై యున్నవి. " అనర్థానుబంధి యథాభూతార్థవచనం సత్యమ్ " పరిణామములో అనర్థమునకు దారితీయని యథార్థభాషణమును సత్యము అందురు.

ఇంతవరకు వ్యావహారిక సత్యమును గూర్చి విస్తృతముగా విచారించనైనది. ఇప్పుడు ప్రాసంగికముగా వేదాంతరీత్యా పారమార్థిక సత్యము విచారించబడుచున్నది.

" త్రైకాలికాబాధ్యత్వం సత్యత్వమ్ - సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ " (త్రై ఉ. 2-1) భూతభవిష్యద్వర్తమాన లేక జాగ్రత్స్వప్నసుషుప్త్యాదులలో యేదియు నవ్యభిచరితమై (సదా విద్యమానమై) యుండునో నది " సత్యమన" బడును.

16-01-2015 తేది శుక్రవారం సాయంకాలము 5 గంటల 30 నిమిషాలకు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం జరిగినది. అందు ఆశ్రమ పరిపాలనా సంఘ సభ్యులు శ్రీ నరసింహరావు రామదాసుగారు (సంగారెడ్డి టౌన్) తన నివాసంలో సమాధి పొందినందుకు సంతాపాన్ని ప్రకటిస్తూ తీర్మానంచడమైనది.

భగవంతునిపై విశ్వాసము వదలకు

– కె. ఈశ్వర్

కష్టాలు, నష్టాలు చూచి భగవంతునిపై అవిశ్వాసము ప్రకటించకు. స్కూలులో చదివే వారికే పరీక్షలు నిర్వహించెదరు. దారినపోయే దాసరయ్యకు ఏ పరీక్షలు ఏమీ వుండవు గదా !

అలాగే భగవంతుని దగ్గరకు చేరాలన్న వారికి కొన్ని పరీక్షలు సహజమే. పరీక్షలలో మార్కులు వేసి నిన్ను ప్రథమ స్థానములో నిలబెట్టగలరని దేవునిపై నమ్మకము ఉంచుకో. ఒక **చిన్న కథ ద్వారా భక్తుని భగవంతుడు ఎలా రక్షిస్తాడో తెలుసుకుందాం.**

ఒక వూరిలో ఒక నాస్తికుడు ఒక ఆస్తికుడు ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ఒకనాటి సాయంకాలము వూరి చివరి వరకు ఇద్దరూ షికారు వెళ్ళారు. దారిలో ఒక దేవాలయము కనుపించింది. దేవునికి దండం పెట్టుకుందాము, రమ్మని ఆస్తికుడు నాస్తిక స్నేహితుని పిలిచాడు. వాడు రానన్నాడు. సరే ఒక్కడు వెళ్ళి గుడికి ప్రదక్షిణం చేసి కుంటుతూ నాస్తిక స్నేహితుని వద్దకు వచ్చాడు. ఏరా! కుంటుతున్నావని అడిగాడు. తేలుకుట్టిందిరా అన్నాడు భక్తుడు. నాస్తికునికి పదిరూపాయలు దొరికినవి. చూచావా ! నాకు పదిరూపాయలు దొరికినవి. నీ దేవుడు నీకు తేలుకుట్టించాడు అని అతనిని హేళన చేశాడు.

అదే దారిలో వారికి ఒక సాధువు కనుపించాడు. ఆస్తిక భక్తుడు దండం పెట్టి స్వామీ దేవుని నమ్ముకున్న నాకు తేలుకుట్టుంది, దేవుని నమ్మని వానికి పది రూపాయలు దొరికింది కారణం అంతరార్థం చెప్పండి అని ప్రార్థించాడు. ఆ సాధువు గారు ఒకసారి కండ్లు మూసుకుని ధ్యానములో నిమగ్నమయి వారిని గురించి ఇలా వివరించారు.

అయ్యా !

నీకు సర్పగండము వున్నది. భగవంతుని దర్శించుట వలన శిక్ష తగ్గించబడి తేలుతో పరిమితం చేయబడినది.

ఇక నాస్తికునితో అయ్యా ! నీకు లక్ష రూపాయల నిధి రావలసి యున్నది. భగవంతుని తిరస్కరించి విమర్శించిన కారణంగా 10 రూపాయలుగా మారింది. లక్ష కోల్పోయావు. మంచి చేసిన వారికి మంచి జరుగును.

చింతచెట్టుకు మామిడి కాయలు కాయవు, మామిడి చెట్టుకు చింతకాయలు కాయవు అని సాధువుగారు వివరంగా చెప్పి వారి సమస్యను తీర్చారు. విత్తు ఏదో చెట్టు అదే వుండును. ఒకడు ఆయుర్వేద డాక్టర్‌వద్దకు వెళ్ళి డాక్టర్‌గారు మజ్జిగన్నం తిన్నాను. కడుపునొప్పి వచ్చిందన్నాడు. మజ్జిగన్నం వలన కడుపునొప్పి రాదు. అంతకు ముందు ఏమి తిన్నావని డాక్టర్ గారు అడిగారు. 20 గారెలు, 10 బజ్జీలు, 10 పూరీలు మాత్రమే తిన్నానని చెప్పాడు. అసలు విషయం దాచి మజ్జిగన్నంకు ఎలా ముడిపెట్టుతున్నారో కొందరు చేయరాని పాడు పనులు అధికంగా చేసి దేవునికి కొబ్బరికాయ కొట్టినాను, పూజించానని చెప్పి దేవుడు కరుణించుట లేదు అని అబాండాలు వేస్తుంటారు.

జీవులను బాధిస్తూ దేవుని పూజించినా దేవుడు సంతోషించడు. మందు తినుట కంటే పథ్యం ముఖ్యమైనట్లు పూజల కంటే సదాచార సద్గుణాలు అనే పథ్యమే ముఖ్యం . భక్తి కలిగి యుండండి, చెడు కార్యాలు చేయకండి. అంతా మంచియే జరుగునని మరువకండి. దేవుని నమ్మండి. మంచి పనులే చెయ్యండి. మంచి జరుగునని విశ్వసించండి. భక్తిని పెంచండి మాజీ భక్తులుగ మారకండి.

కథాత్మక గీతాసూక్తులు

– ఆచార్య డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

" గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పండితాః "

ఈ సందర్భంలో భాగవతంలోని చిత్రకేతూపాఖ్యానం కూడా స్మరించ దగ్గదే ! చిత్రకేతువు శూరసేనదేశవల్లభుడు. ఐశ్వర్యంలో దేవేంద్రునితో సమానుడు. అంతేకాదు ప్రజానురంజకుడు. అతని కెందరో భార్యలు. అయినా సంతానం లేదు. ఒకరోజు అంగిరసుడనే ముని రానే వచ్చాడు. మహారాజు ముఖంలోని దైన్యం గుర్తించి, కారణం అడిగాడు. చిత్రకేతువు 'మునీంద్రులకు సర్వం విదిత ' మన్నాడు.

అంగిరసుడు చిత్రకేతువు చేత 'పుత్రకామేష్టి ' చేయించాడు. ఆపై యజ్ఞశేషాన్ని రాజుగారి పెద్దభార్యకిచ్చి కలగబోయే కుమారునిపట్ల సుఖదుఃఖాలు అనుభవిస్తారని చెప్పి వెళ్ళిపోయాడు. కృతద్యుతి సంతానవతి అయింది. ప్రజలందరూ సంతోషించారు. చిత్రకేతు భార్యలందరు ఆనందించారు. కాని ఆ ఆనందం అట్లే చాలాకాలం నిలవలేదు. మహారాజు పుత్రవ్యామోహంతోనో లేదా తనకు సంతానం ప్రసాదించినది పెద్ద భార్య కృతద్యుతికదా అనే భావంతోనే ఆమెతోనే గడిపేవాడు. ఈ విధానం ఇతరులకు నచ్చలేదు. మాత్సర్యం ఏ పనికయినా ఒడిగడుతుంది. వారంతా కలిసి ఈ సంతానం వల్ల కదా రాజు దూరమయ్యాడని బాలునికి విషప్రయోగం చేశారు.

బాలుడు మరణించాడు. ఉదయం పిల్లవానిని లేపుదామని వెళ్ళిన దాదికి మృతకళేబరం కనిపించింది. దాది ఏడవసాగింది. కృతద్యుతి అక్కడికి చేరుకొని బావురుమన్నది. ఈ వార్త విని రాజు కూడా వచ్చి కుమారుని చూచి పలవరించాడు. ఆ సమయంలో 'అంగిరసుడు ' వచ్చాడు.

" రాజా ! నీకు వీడెవడు ? ఎందుకు శోకిస్తున్నావు ? పూర్వజన్మంలో నీకు ఎవరు కొడుకులో ఎవరు స్నేహితులో చెప్పగలవా ? నదీవేగం కారణంగా అక్కడక్కడ తిప్పలేర్పడతాయి. నదీప్రవాహం మారి మరల కలుస్తుంటుంది.

రాజా ! మనం ఇక్కడ కలిసి వున్నాం. భవిష్యత్తులో మృత్యువు కబళిస్తే ఇవుడు కలిసివున్నట్టు ఉండము. జనన మరణాలు మాయాప్రభావాలు. ఇవన్నీ భగవంతుడు నిర్దేశించినవే. అందువలన వాసుదేవునిపట్ల మనస్సు లగ్నం చేయ"మని ఆదేశించాడు.

చిత్రకేతువు ఆగంతకునితో ' ఎవరు మీరు ' అని అడిగాడు. ఆగంతకుడు తాను అంగిరసుడనని యజ్ఞకాలమందే జరుగగలవి చెప్పినవాడనని అన్నాడు. అంతేకాదు నీకూ, నీ కుమారునికి ఏలాంటి సంబంధమూ లేదన్నాడు. అయినా చిత్రకేతువు మథనపడుతుంటే బాలుని కళేబరం వైపు చూచి ' జీవుడా ! నీకు శుభమస్తు ! నీవు మళ్ళీ ఈ దేహంలో ప్రవేశించు. నీ తల్లిదండ్రుల్ని, బంధుమిత్రుల్ని చూడు. వారి శోకాన్ని పోగొట్టు. మిగిలిన ఆయుర్దాయమంతా ఈ శరీరంలోనే వుండి మీ తండ్రిగారి సింహాసనం అధిష్ఠించు ' అన్నాడు. కాని ఆ జీవుడు 'నేనెవరిని? నేను ఎన్నో జన్మలు ఎత్తాను. ఎవరిని తండ్రి అనాలి ? ఈ జన్మలో ఈ తల్లిదండ్రులు దుఃఖోపశమనం చేస్తే గతించిన జన్మల లోని తల్లిదండ్రుల స్థితిగతులేమిటి ? క్రయవిక్రయాదుల వల్ల బంగారం చేతులు మారినట్లు కర్మానుసారంగా జీవికి ఎన్నో యాత్రలు !' అంటూ ఆ జీవుడు వెళ్ళి పోయాడు.

చిత్రకేతువు అతని బంధువులు ఆశ్చర్యచకితులయ్యారు. యమునానదికి వెళ్ళి ఆ బాలుని శరీరానికి అంత్యక్రియలు చేశారు. ఆ తరువాత చిత్రకేతువు నారాయణమంత్రాన్ని ఏడు రాత్రులు మననం చేసి విద్యాధరచక్రవర్తిత్వాన్ని పొందాడు.

ఈ కథ భగవద్గీత 'గతాంసూన్ ' వాక్యానికి భాష్యం లాంటిది. అలాగే మహాభారతంలో పాండవులు చివర యోగంతో మహాప్రస్థానం చేసే వేళ ద్రౌపది, ఆపై పాండవులలో ఒక్కొక్కరు పడిపోతున్నా ధర్మరాజు వారు పడిపోవడానికి కారణాలు వివరించి తాను మాత్రం ముందుకే కదిలాడు. మరణించిన వారి పట్లగాని జీవించిన వారి పట్లగాని ఏలాంటి చింతలేక ముందుకు సాగినవాడు ధర్మరాజు.

అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజావాదాంశ్చ భాషసే
గతాసూ నగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః

Statement of Ownership and other Particulars of Vedantha Bheri (FORM IV See Rule 8)

01. Place of Publication	:	Srikalahasti
02. Periodicity of its Publications	:	Monthly
03. Printer's Name	:	B.Viswa Natha Raju
Whether Citizen of India ?	:	Yes
Address	:	Aruna Graphics, Rayaji Street, Nellore - 524001.
04. Publisher's Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
05. Editors Name	:	Vidyaswarupanandagiri Swamy
Whether Citizen of India ?	:	Yes
Address	:	Sri Sukabrahma Asramam Swami Vidyaprakasananda Nagar, Sri Sukabrahma Ashram (P.O.) SRIKALAHASTI - 517640
06. Name and Address of Indiduals Who own the News Paper Partners of Share holders holding more than one percent of the total Capital	:	Vidyaswarupanandagiri Swamy Sri Sukabrahma Ashram Spiritual Institution Srikalahasti - 517640 Chittoor District A.P.

I Vidyaswarupanandagiri Swamy hereby declare that the particulars give above are true to the best of my knowledge and belief.

Date : 1st March 2015 **(Sd/-) Vidya Swarupanandagiri Swamy**
Signature of the Publisher

శ్రీ జ్యోతి రామలింగస్వామి

– ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం

(గత జనవరి సంచిక తరువాయి)

కేవలం భగవచ్చింతిన, భగవదుపాసన మాత్రమే సరిపోవని రామలింగస్వామి భావించారు. ప్రాణులకు చేసే సేవే పరబ్రహ్మకు చేసే సేవగా ఆయన భావించారు. ఆ కాలంలో అధిక జనం అన్నం లేకుండా అల్లాడుతుండేవారు. పేదరికంతో పెనుగులాడే వారు. ఆకలిగొన్న వారి ముఖాలు రామలింగస్వామి అంతరంగాన్నంతా తరంగితం చేశాయి. వడలూరికి వెళ్ళి అక్కడ ఒక ధర్మశాలను నిర్మింపజేశారు. అన్నదానాన్ని ప్రారంభించారు. ఆకలిగొని వచ్చినవారికి తన చేతులారా అన్నం పెట్టి ఆకలిని పోగొట్టారు. అప్పుడే వేటువళమ్ జమీందార్ భార్యకు మహోదర వ్యాధి పోగొట్టారు. ఆమె స్వామివారికి 80 కాణుల భూమిని రాసిచ్చింది. స్వామి ఆ నేలలో ధర్మ వేదపాఠశాలను నిర్మింపజేశారు. భౌతికమైన ఆకలిని తీర్చుడానికి ధర్మశాల, ఆత్మ ఆకలిని తీర్చుడానికి ధర్మ వేదపాఠశాల, ప్రాణం ఆకలి తీర్చేందుకు సత్యజ్ఞాన సభను నిర్మింపజేశారు.

రామలింగస్వామి కొంతకాలం మేటుకుప్పం అనే ప్రదేశంలో నివసించారు. అప్పుడాయన శివానుభవ సంపన్నులుగా ప్రకాశించారు. రామలింగస్వామి మేటుకుప్పంలో ఉన్నప్పుడు శివసాక్షాత్కారం పొందాలని తీవ్రంగా తపించారు. రాత్రింబవళ్ళు అదే ధ్యాసతోనే గడిపారు. శివదర్శనం కలుగలేదని ఎంతగానో ఏడ్చారు. ఒక రాత్రి ఏడుస్తూ అలాగే మూర్ఛపోయారు. శివుడికి దయ కలిగింది. స్వయంగా వచ్చి రామలింగస్వామిని స్పృశించాడు. అనుగ్రహజ్యోతి రూపంలో ఆయనలో

ప్రవేశించాడు. రామలింగస్వామిలో కలిసిపోయి అంతటా వ్యాపించాడు. రామలింగస్వామికి స్పృహ వచ్చింది. మాటలకందని మధురానుభూతి. అది చెప్పరాని ఆనందం. రామలింగస్వామి ఇంతకుముందు ఏడ్చిన దానికంటే అధికంగా ఏడవసాగారు. రామలింగం ! ఇంతకు ముందు నీవూ నేను వేరు వేరుగా ఉన్నప్పుడు ఏడ్చావు. ఇప్పుడు నేను నీలో కలిసిపోయి ఉన్నాను కదా ! ఇంకా ఎందుకు ఏడుస్తున్నావు ? అని పరమేశ్వరుడు రామలింగస్వామిని ప్రశ్నించాడు.

స్వామీ ! ఇంతకుముందు నాకు శివానునంభం కలుగ లేదనే ఏడ్చాను. ఇప్పుడీ మహద్భాగ్యాన్ని పొందాను. ఇప్పుడిది ఈ ప్రపంచ వాసులందరికీ కలుగలేదు కదా అని విలిపిస్తున్నాను అన్నారు. దీన్ని తరువాత ఒక పద్యంలో స్వామే తెలియజేశారు.

రామలింగస్వామి ప్రజల అభ్యున్నతి కోసం ప్రతినిమిషమూ తపించారు. ప్రజలనుంచి రావలసినంత స్పందన రాకపోవడం పట్ల విచారించారు. అంగడి పరిచాను, కొనేవారు ఎవ్వరూ కనిపించలేదు అని వాపోయారు. అష్టసిద్ధులూ వారికి సంక్రమించినప్పటికీ వాటిని తమకోసం ఉపయోగించుకోలేదు. ఇతరుల క్షేమం కోసమే వాటిని వినియోగించారు.

శ్రీముఖనామ సంవత్సరం పుష్యమాసం పునర్వసు నక్షత్రం నాడు 1874 జనవరి 30వ తేదీన రామలింగస్వామి పంచభూతాత్మకమైన తమ శరీరాన్ని పంచభూతాల్లో కలిపివేశారు. ఆత్మను పరమాత్మలో ఐక్యం చేశారు. కొన్నాళ్ళు ఈ ప్రపంచానికి కనిపించను అని తమ కుటీరంలోకి వెళ్ళిన స్వాములవారు మళ్ళీ వెలుపలికి రాలేదు. జ్యోతిస్వరూపులయ్యారు. మేటుకుప్పంలో ఇప్పుడు కూడా ప్రతి జనవరిలోను తైమాస పునర్వసు నక్షత్రంలో విశేష పూజలు జరుగుతాయి. ఆరోజే స్వామి లోపలికి వెళ్ళిన

భవనం యొక్క ఏడు ద్వారాలు తెరుస్తారు. వెళ్ళేవారికి అక్కడ జ్యోతి దర్శనమిస్తుంది. ఆ రోజు కాగానే యథాపూర్వకంగా ఆ భవనానికి తాళాలు వేస్తారు. ఆ జ్యోతికి ఎవరైనా వెళ్ళి చమురు పొయ్యడం గాని వెలిగించడం గానీ ఉండదు. అయినప్పటికీ ఆ జ్యోతి నిరంతరమూ వెలుగుతూనే ఉంటుంది. ఇది జ్యోతిరామలింగస్వామి మహిమ అని ప్రజలు చెప్పుకొంటారు.

రామలింగస్వామి వేలకొలది గేయాలను, పద్యాలను రచించారు. అవి కొన్ని గ్రంథాలుగా రూపుదిద్దుకున్నాయి. ఆ గ్రంథాలు ఆనందకళిప్పు, వెన్నిలాపాట్టు,, మనుమురై కండవాసగమ్, జీవకారుణ్య వొళ్ళుక్కమ్, తిరువరుప్ప, శివనేశవెన్బ మొదలైనవి. వళ్ళలార్ రచనల్లో భక్తి రచనలే గాక మధురభక్తి రచనలు కూడా వుండడం గమనార్హం. రామలింగస్వామి తమను నాయికగా భావించుకొని చిదంబరం నటరాజస్వామిని నాయకుడుగా భావించారు. నాయకుణ్ణి పొందేందుకు నాయికపడే ఆరాటాన్ని తమ రచనల్లో అవిష్కరించారు.

ప్రపంచ ప్రజలారా ! మళ్ళీ మళ్ళీ చింతన చేసి, మళ్ళీ మళ్ళీ గ్రహించి ప్రేమనిండిన హృదయంతో మాటి మాటికీ కన్నీరు కారుస్తూ ఓ అనుగ్రహా మృతమా ! గొప్పనిధీ ! నా నాయకుడా ! జ్ఞాన నటశేఖరా ! అని పిలుస్తూ, నమస్కరిస్తూ ప్రార్థిద్దాం రండి. అలా చేస్తే మరణం లేని మహాజీవితం సిద్ధిస్తుంది. నేను కల్పించి చెప్పడం లేదు. అబద్ధమూ చెప్పడం లేదు. సత్యాన్నే చెబుతున్నాను. కనకసభలో, చిత్‌సభలో ప్రవేశించే తరుణమిదే రండి అని ప్రపంచ ప్రజలను ఎలుగెత్తి పిలిచారు. ప్రేమను, దయనూ పెంపొందించుకొని ఇతరులకు తోడ్పడాలన్నారు.

శివాయ నమః అని యేభక్తులు చెబుతారో వారికి దుఃఖముగాని ఆపద గాని ఉండవు అని స్వామి సెలవిచ్చారు. ఎవరు పంచాక్షరీమంత్రాన్ని

జపిస్తారో వారు సమస్త సౌఖ్యాలను పొందుతారు. నమశ్శివాయ అని ఉచ్చరిస్తూ విభూతి ధరించే వారికి పాడే చక్కని వాక్కును, క్షీరాన్నాన్ని, భక్తుల సహవాసాన్ని, మంచి గుణాలను ఆ మంత్రం అనుగ్రహిస్తుంది. మనసా నీవు భయపడకు, అన్వేషించి పొందడానికి అరుదైన వారి నామాన్ని నమశ్శివాయ అని ఉచ్చరించి పాలభాగంలో విభూతిని ధరించు అని తమ మనస్సును ఉద్భోధించారు. తద్వారా లోకులకు బోధించారు. యముడు వచ్చినప్పుడు అన్నదమ్ములు గాని భార్యాబిడ్డలుగాని సహాయపడరు అన్నారు.

వేదాలు, దేవతలు, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు చూడలేని పరబ్రహ్మాన్ని అహంకారం లేని చోట చూడవచ్చునన్నాడు. అహకారం లేనట్లయితే అందరూ దర్శించ వచ్చునని ఆయన అభిప్రాయ పడ్డారు.

దేవుడు ఒక్కడే జాతిమతకుల వివక్షత ఉండకూడదు. అందరూ భగవంతుని సంతానమే అని వళ్ళలార్ బోధించారు. ప్రతిదీ నేను చేశాను, నేను చేస్తున్నాను అనుకోవడం మాని అన్నీ శివుని లీలలే శివుని చేతలే అని భావించి శివపథంలోనే జీవులు మెలగాలని రామలింగస్వామి బోధించారు.

మాంసం తినకూడదన్నారు. ప్రాణివధ చేయకూడదన్నారు. అందరూ శివుణ్ణి ఆశ్రయించి భవదుఃఖాన్ని పోగొట్టుకోవాలన్నారు. శివానుభవంతో మాత్రమే జన్మదుఃఖము పోతుంది అన్నారు.

రామలింగస్వామి రచించిన గేయాలు, పద్యాలు వేల సంఖ్యలోనే ఉన్నాయి. అవన్నీ మనస్సుకు బాగా హత్తుకునేలా ఉన్నాయి. వాటి నుంచి వారి బోధనలను, సూక్తులను గ్రహించవచ్చు. రామలింగస్వామి చెప్పిన విషయాలను, ఆయన జీవిత విశేషాలను హృదయస్థం చేసుకోవాలి. మాటి మాటికే మననం చేసుకోవాలి. తాదాత్మ్యం పొంది తరించాలి. ఇది ప్రస్తుత మన కర్తవ్యం.

వార్తలు

(01). ఏర్పేడు మండలం (చిత్తూరుజిల్లా)లోని పరమ పవిత్ర శ్రీ వ్యాసాశ్రమంలో ఫిబ్రవరి 3వ తేది నుండి 9వ తేది వరకు జరిగిన పరమపూజ్య సద్గురు శ్రీ మలయాళస్వాములవారి తపస్సిద్ధి శతజయన్తి శ్రీ వ్యాసాశ్రమ ప్రథమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విమలానన్ద స్వాములవారి శతజయన్తి, ద్వితీయ పీఠాధిపతులు పూజ్య శ్రీ విద్యానన్ద స్వాములవారి శతజయన్త్యుత్సవాలలో 6వ తేది మధ్యాహ్నం శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని పరమగురుదేవుల మహత్వాన్ని గురించి ప్రవచన చేశారు.

(02). ఫిబ్రవరి 7వ తేది శ్రీకాళహస్తిలోని పౌరసంక్షేమ సంస్థవారు నిర్వహించిన అలంకరణ, టైలరింగ్ శిక్షణలో పాల్గొని సదరు శిక్షణలో ఉత్తీర్ణత నొందిన మహిళామణులకు బహుమతి ప్రదానం, ఉత్తీర్ణతా సర్టిఫికేట్లను పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు ఇచ్చి వృత్తి విద్యాప్రాముఖ్యతను గురించి ప్రవచన చేశారు.

(03). ఫిబ్రవరి 16,17,18 తేదీలలో అదిలాబాద్ జిల్లా, నిర్మలమండలం, వెంకటాపురం శివారు విజయనగర్‌కాలనీలోని శ్రీ విద్యాప్రకాశానంద బ్రహ్మనిష్ఠాశ్రమంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రవచనలు చేశారు. 17వ తేది మహాశివరాత్రి నాడు రాత్రి రుద్రాభిషేకాలు లక్ష బిల్వపత్రిపూజ నిర్వహించి గ్రామ ప్రజలకు తీర్థప్రసాదాలనిచ్చారు. 19,20,21 తేదీలలో నిర్మల సమీపం సమస్తిపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో శ్రీ విద్యాప్రకాశానంద స్వామి గీతాశ్రమంలో గీతాజ్ఞానయజ్ఞంలో ప్రవచన చేశారు. 22,23,24 తేదీలలో అదిలాబాద్ జిల్లా దిల్వార్‌పూర్ మండలం జినర్సాపూర్‌లోని శ్రీ విద్యాప్రకాశానందస్వామి గీతాసత్సంగ సమాజం వారు నిర్వహించిన జ్ఞానయజ్ఞంలో పాల్గొని ప్రవచనలు చేశారు. ఈ మూడు కార్యక్రమాలలో పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీ ప్రసాదమాతాజీ (గుంటూరుజిల్లా నంబూరు కాళీవనాశ్రమ పీఠాధిపతులు) పూజ్యశ్రీ జ్యోతిర్మయానందభారతి మాతాజీ (ప.గో.జిల్లా పాలకొల్లులోని పరబ్రహ్మఖణ్మభానందాశ్రమాధిపతులు) మఱియు శ్రీ శుకబ్రహ్మాశ్రమ బ్రహ్మవిద్యా పాఠశాల ఆచార్యులు పూజ్యశ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచనలు చేశారు.

(04). ఫిబ్రవరి 20వ తేది శుక్రవారం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో అవతార వరిష్ఠులు పూజ్య శ్రీశ్రీశ్రీ రామకృష్ణ పరమహంస జయన్తి జరిగినది. గురుమహరాజ్ శ్రీరామకృష్ణుల వారికి షోడశోపచార పూజ జరిగి తీర్థప్రసాదలివ్వబడినవి.

(05). ఫిబ్రవరి 8వ తేది ఆదివారం శ్రీ శుకబ్రహ్మాశ్రమ గ్రామీణ వైద్య సేవా శిబిరం శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో జరిగినది. ఏడుగురు స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొనినారు. **400 మందికి వైద్యపరీక్షలు చేసి** మందులివ్వబడినది. ఆశ్రమ కంటి ఆస్పత్రిలో జనవరి నెలలో **ఓ.పిలో 372** మందికి కంటి చికిత్సలు చేయబడినవి. **26 మందికి కంటిపొరలు** తీసి లెన్సు అమర్చబడినవి.

ప్రతి జీవితము ఘనీభవించిన ఆత్మస్వరూపమే, దేవహముకాదు. కాని చిత్తశుద్ధిలేని కారణముచే మనుజునకట్టి అపరోక్షజ్ఞానము కలుగుటలేదు. కాబట్టి చిత్తశుద్ధికై నిష్కామ కర్మాచరణ తప్పక చేయవలసియున్నది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్తృత్వరహితులుగ, నిష్కామముగ కర్మల నాచరించుచు వచ్చిన కొలది కాలములోనే చిత్తము నిర్మలమగును. మలిన రహిత అద్దమందు సూర్యప్రతిబింబం చక్కగ గోచరించునట్లు, మురికిలేని వస్త్రమునకు రంగు బాగుగా అంటునట్లు నిర్మల చిత్తమునందు ఆత్మజ్ఞానము లెస్సగ అనుభూతమగును. కావున నిర్మల భక్తితోగూడి భగవానుని నామసంకీర్తన, జపము, పూజ, ప్రార్థనాదులను చేయుచుండ వలయును.

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 March 2015 Rs.6/- R.No.8139/63
Date of Publication 26-02-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

________ : ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు : 8 నుంచి 10 సం. మధ్య.
స్టైఫెండ్ : నెలకు రూ. 1,000/-

________ : ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు : 15 సం॥ ఆపైన
స్టైఫెండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

________ (సామవేదము/అథర్వవేదము–వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము : 2 సంవత్సరములు
సంభావన : నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.

________ : (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత : ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత : మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత : 5 సంవత్సరములు
సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020
Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,
E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

ఏప్రిల్ 2015

రూ. 6/-



నిజమైన సుఖం

- సుఖం దుఃఖం అనేవి ఒకే నాణెపు రెండు ప్రక్కల వంటివి. సుఖాన్ని స్వీకరించేవాడు, దుఃఖాన్ని కూడా స్వీకరించాలి. దుఃఖం లేని సుఖాన్ని పొందగలమని మనందరి వెర్రి ఆలోచన. ఆ ఆలోచనకు మనమెంత లొంగి ఉన్నామంటే ఇంద్రియాలపై మనకు అదుపే లేదు.

- సుఖం, దుఃఖమనే కిరీటాన్ని ధరించి మానవుని వద్దకు వస్తుంది. సుఖానికి స్వాగతం చెప్పేవాడు దుఃఖానికి కూడా స్వాగతం చెప్పి తీరవలసిందే!

- కోరికలు ఎంత కాలం ఉంటాయో, అంత వరకు నిజమైన సుఖం కలుగదు.

- మనం, ఓర్పును, సహనాన్ని, క్షమావృత్తిని అలవరచుకునే తీరాలి. ఈ శాశ్వతమైన నీతిపాఠాన్ని నేర్చుకుని దానికి కట్టుబడి ఉండడానికి సిద్ధమైనవారు ఆనందమయమైన జీవితాన్ని గడుపుతారు.

– శ్రీ స్వామి వివేకానంద

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 ఏప్రిల్ 2015 సంచిక : 4

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు, విడి సంచిక రూ. 6/-లు
విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju at Aruna Graphics Press , Rayaji Street, Nellore-524 001, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 ఏప్రిల్ 2015 సంచిక : 4

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ప్రయత్నము - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06
03. సద్గురూ ! నీకు మా శతకోటి ప్రణామాలు !
- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 11
04. సద్గురు బోధ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 13
05. మహాప్రవక్త శ్రీ విద్యాప్రకాశానందస్వామి- డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 15
06. మూర్తి ఆర్జించిన కీర్తి - శివానంద బ్రహ్మచారి - 19
07. పురందరదాసు పదాలలో 'ధర్మం'- డా ॥ కె. సర్వోత్తమ రావు - 21
08. సద్గురు స్వామీ ! వందనాలు ! - కె. ఈశ్వర్ - 22
09. అక్కమహాదేవి అనుభవామృతం - శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి - 24
10. సత్ - చిత్ - ఆనంద స్వరూపమే శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు
- ఎ. తారాలక్ష్మి - 26
11. భక్తతుకారాం అభంగవాణి (శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు) - 32
12. హారతి పాట - ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం - 34
13. గీతామకరంద ప్రదాత - ఎ.సీతారామావు - 35
14. 17వ సద్గురు ఆరాధన - 39
15. సత్యంవద ధర్మంచర - బి.ఎన్. కల్యాణ సుందరం - 40
16. వార్తలు - 42

ముఖచిత్రం :

గురుదేవులు పరమహంస పరివ్రాజకాచార్య పూజ్య
శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

ప్రార్థన

01. ఓం బ్రహ్మ విద్యానిధిభ్యోఽస్తు బ్రహ్మాదిభ్యో నమో నమః ।
నమో వంశఋషిభ్యోఽస్తు సద్గురుభ్యో నమో నమః ॥

02. విద్యయా తపసాచైవ పూతాత్మా యతిపుంగవః ।
స్వామీ విద్యాప్రకాశాఖ్యో గురుర్విజయతే తరామ్ ॥

03. మలయాళయతీన్ద్రస్య శిష్యశ్రేష్ఠాయ ధీమతే ।
శుకాశ్రమప్రతిష్ఠాత్రే తస్మై శ్రీ గురువే నమః ॥

04. ద్వాదశాబ్దతపోనిష్ఠా గరిష్ఠాయ మహాత్మనే ।
సాక్షాత్కృతాత్మతత్త్వాయ గురుదేవాయ తే నమః ॥

05. వాగ్వైభవం యతేర్యస్య సర్వలోకముదావహమ్ ।
జాడ్యాపహం చ చైతన్యదాయకం తం గురుం భజే ॥

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య

06. తేనెల్ చిందెడు నే యతీంద్రు భగవద్గీతా ప్రసంగంబులన్
నానాపండిత పామరౌఘము మహానందంబుతో వించు వి
జ్ఞానంబున్ గడియించు నప్పరమ పుణ్యశ్లోకు విద్యాప్రకా
శానందాఖ్యు శుకాశ్రమాధిపతి నే నశ్రాంతమున్ గొల్చెదన్ ॥

07. అతని కతండె సాటి హృదయంగమ వాఙ్ముఖమందు ఏమియా
కుతుకము ? నేల యీనినటు గుంపులు గూడెదరెల్లవార, లా
కతలను స్వామి తెల్పవలె, కమ్మని కంఠము నెత్తి స్వామియే
మతి కరగంగ పాడవలె, మాటలు స్వామియే చెప్పగావలెన్ ॥

– విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

03–04–2015 తేది స్వామి ఆరాధన

07–04–2015 స్వామి జన్మదినం



ప్రయత్నము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రయత్నముచే మానవుడు సాధింపరాని దీ ప్రపంచమున ఏదియును లేదు. భౌతిక క్షేత్రమందుగాని, ఆధ్యాత్మిక క్షేత్రమందుగాని వ్యక్తి తన అధ్యవసాయముచే మహోన్నత శిఖరముల నధిష్ఠింప గల్గుచున్నాడు.

నిరంతర సాధన చేతను, తీవ్రతర అభ్యాసము చేతను ఎటువంటి కార్యమునైనను జగత్తులో సాధించవచ్చును. ఇక మానవునకు గల దుస్సంస్కారములను పోగొట్టుకొనుట ఒక లెక్కా ? అయితే పట్టుదల, శ్రద్ధ, లక్ష్యమునందు ప్రీతి – ఇవి తప్పక ఉండవలెను. ఈ ప్రకారముగ పట్టుదలతో ఈ జీవితమునందే దైవసంపదను సాధించి వేయుటకును, తద్ద్వారా పరమానంద ప్రాప్తినొందుటకును మానవుడు కృత నిశ్చయుడు కావలయును. దైవసంపదచే, సుగుణరాశిచే సామాన్య మనుజుడు సాక్షాత్ బ్రహ్మర్షి కాగలడు. బ్రహర్షిత్వము ఒకరిచ్చునది కాని, పుచ్చుకొనునది కాని కాదు. అది ప్రయత్నముచే వారు వారు సంపాదించు మహత్తర స్థితి.

చిన్న రాజ్యమునకు అధినేతయైన సిద్ధార్థుడు బుద్ధదేవుడుగ విఖ్యాతినొందెను గదా ! అట్లే శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, గాంధీజీ మొదలైన ఆధునిక వ్యక్తులు తమ యకుంఠిత దీక్ష చేతను, భగవద్భక్తి చేతను, సాధనాతిశయముచేతను విశ్వవంద్యులై, లోకోత్తర పురుషులై, బ్రహ్మర్షులై విలసిల్లిరి.

మహర్షిత్వముగాని, బ్రహ్మర్షిత్వముగాని ఒకరిసొత్తు గాదు. అది ఒకానొక జాతిచేగాని, వ్యక్తిచేగాని, వర్ణముచే గాని గుత్తకు (**Contract**)

తీసికొనబడు పదార్థము కాదు. యోగ్యతగల వారందఱున్ను బ్రహర్షిత్వమునకు అర్హులే. పవిత్రత, సహనము, పట్టుదల (**Purity, Patience, Perseverence**) గలవారు ఏనాటికైనను బ్రహ్మర్షిత్వమును సాధించియే తీరుదురు. వ్యక్తియందు దుర్వృత్తులు, దుర్గుణములు, దుస్సంకల్పములు ఉండునపుడు, భగవంతుని దృష్టియందు గాని, లోకులయొక్క దృష్టియందుకాని యతడు చాల అల్పుడుగనే యుండును. బంగారము ఇతర లోహములతో గూడియున్నపుడు దానికి విలువ చాల తక్కువగనే యుండును గదా ! ఆ బంగారమే అగ్నిహోత్రముపై బాగుగ పుటము పెట్టబడినపుడు దానియందలి ఇతర లోహములన్నియు నశించి పోగా, స్వచ్ఛమగు మేలిమి బంగారుగ మాత్రమే శేషించును. అపుడు దాని విలువయు చాల పెరుగును. అట్లే తపస్సు, ఇంద్రియనిగ్రహము, భగవద్భక్తి మున్నగువానిచే మనస్సునందలి దోషములన్నియు పరిహరింపబడినపుడు, పాపాత్ముడున్ను పుణ్యాత్ముడై పఱుగును. అల్పుడు లోకోత్తరుడుగ చెన్నొందును. సామాన్యుడు విశ్వవంద్యుడై యలరారును. మహాత్ములు తమ జీవితముల నీ ప్రకారమే ప్రయత్న పూర్వకముగ సంస్కరించుకొని లోకములో గణనీయస్థానము నలంకరించిరి.

ఆధ్యాత్మిక చరిత్రయం దౌన్నత్యము నొందిన మహనీయుల జీవిత చరిత్రములన్నిటిని పరికించినచో ఏదియో యొక అద్భుత సంఘటన **(miracle)** వలన ఒక్క పర్యాయము ఆకస్మికముగ వారు పైకి వచ్చినట్లు కానబడుటలేదు. ఒక క్రమపద్ధతిని నెమ్మది నెమ్మదిగా ప్రయత్నపూర్వకంగా వారు చేసిన సాధనల ననుసరించి ఉన్నత స్థానమున కెగబ్రాకినట్లే కనుపించుచున్నది. అనుష్ఠానమందు ప్రీతి, నియమబద్ధమగు జీవితమును గడుపుటయందు పట్టుదల, దైనందిన వ్యవహారములందును చక్కని క్రమశిక్షణ మున్నగు సుగుణములే వారి ప్రగతికి కారణము.

" సర్వ జీవరాసుల యెడల ప్రేమ, దయ, కరుణ గలిగి యుండుడు! భక్తి, జ్ఞాన, వైరాగ్యములను మందుతోబాటు సర్వభూతదయ యను పథ్యమునుగూడ అవలంబింపుడు " అనునది వారి బోధలలో ప్రధానమైనది. ఇట్టి విశాలహృదయము, విశ్వప్రేమ ముముక్షువుల కత్యావశ్యకమై యున్నది. బ్రహ్మర్షిత్వమున కర్హతయు నిదియే. సంకుచిత హృదయములు, దయాదాక్షిణ్యవర్జితులు భగవంతు నెన్నటికిని బొందజాలరు. కావున, ముముక్షువుల్లెలరు తమ భక్తి, జ్ఞానాద్యుపకరణములతోబాటు ప్రాణికోట్లయెడల దయనుగూడ అభ్యసించవలయును. అనన్యభక్తి, నిరంతరతత్త్వచింతన, ఆధ్యాత్మిక క్రమశిక్షణ, నియమపాలన, సర్వభూతదయ మొదలగు ఉదాత్తగుణముల నవలంభించి జనులు ప్రయత్న పరులై సామాన్య స్థితి నుండి బ్రహ్మర్షిస్థితికి చేరవలయును.

ఈ ప్రకారముగ ప్రయత్న పూర్వకముగ తమ యొక్క ఉన్నతిని సాధించుటకు జనులు బద్ధకంకణులు కావలయును. అనేక యుక్తులద్వారా ఇంద్రియములను జయించి జన్మాంతర వాసనలను, దుర్గుణములను అరికట్టవలెను. హృదయమందలి అసుర ప్రకృతిని పారద్రోలి, దైవప్రకృతికి అవకాశ మీయవలెను.

శ్రీమద్రామాయణమందు దండకారణ్యమును గూర్చిన ప్రస్తావన కలదు. శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై వనప్రదేశములందు పాదచారియై పయనమగుచుండ త్రోవలో భయంకరమైన దండకారణ్యము ఎదురుపడెను. కోదండధారియగు రాముడు నిర్భీకుడై అందు ప్రవేశించెను. విరాధుడు, ఖరుడు, మారీచుడు, కబంధుడు, శూర్పణఖ మొదలైన అగణిత రాక్షస సమూహములకు అలవాలమైన ఆ భీకరారణ్యమునందు శ్రీ రాముడు ధైర్యోత్సాహములతో సంచరించి దుష్టచరిత్రులు, దుశ్శీలురునగు ఆ దానవులందఱిని తుదముట్టించెను. శరభంగుడు, అగస్త్యుడు, సుతీక్ష్ణుడు,

జటాయువు, శబరి మొదలగు పవిత్ర హృదయులు, భక్తవరేణ్యులు నివసించుచున్న ఆ దండకవనమును నిష్కంటకముగ నొనర్చి మునులకు రాక్షసబాధ లవలేశముకూడ లేకుండ జేసెను. శ్రీరాముని పాదస్పర్శచే దండకారణ్యమందలి అణువణువు పునీతమైపోయెను. వారి రాకచే మునుల హృదయసీమలు బ్రహ్మానందముచే పరిప్లావితములైనవి. దండకారణ్యము నందనవనమై విలసిల్లినది, శత్రుబాధ తొలగిపోయినది. రాక్షసులు పలాయనము చిత్తగించిరి. ఋషులు సంతుష్టాంతరంగులైరి.

ఆ దండ కారణ్యము ఎచటనో దూరముగ లేదు. అజ్ఞాని హృదయమే దండకారణ్యము. దేహాభిమానియగు జీవుని హృదయక్షేత్రమే ఆ దండకవనము. కామక్రోధాదులే ఆ రాక్షసులు. భక్తివైరాగ్యాది సుగుణసంపత్తియే దండకారణ్యవాసులగు మునీంద్రులు. ప్రతిజీవియొక్క హృదయమందు మంచి, చెడ్డ, ధర్మము, అధర్మము, న్యాయము, అన్యాయము, సత్యము, అసత్యము, క్రూరత్వము, దయ వసించుచున్నవి. దండ కారణ్యములో జనులకు బోధించు సన్మార్గులు ఇరువురును ఉండినట్లే జీవుల హృదయాంతరాళమునందు దైవాసుర ప్రకృతులు రెండును ఉండియుండును. కొందఱియందు దైవసంపద అధికముగ నుండును. మఱికొందరియందు అసురసంపద ఆధిక్యత గలిగియుండును.

అసుర ప్రకృతిని కూలద్రోయుటకై ముముక్షువు వివేకమను శ్రీరామచంద్రుని తన హృదయసీమకు ఆహ్వానించును. అత్యంత సూక్ష్మ బుద్ధియను తీక్ష్ణశరములచే ఆ వివేకము కామక్రోధాది దానవపరంపరనంతను అచిర కాలములో రూపుమాపి, రామబాణముయొక్క శక్తి సామర్థ్యములను లోకమునకు చక్కగ నిరూపించును. ప్రతి జన్మయందును అనేక దుఃఖ పరంపరలను బొందుచు, జనన మరణ రూప సంసార చక్రమందు తగుల్కొని బహు యాతనల ననుభవించుచున్న జీవుడు

ఏనాటికైనను వివేకమను శ్రీరామచంద్రుని ఆశ్రయించనిచో అతని హృదయమను దండకారణ్యము ఎన్నటికిని నిష్కంటకము కానేరదు. తత్ఫలితముగ అతడు కామాది దానవుల ప్రతాపముచే సతమతమైపోవుచు పరమ అశాంతిని బడయుచుండును.

కోహం కథమిదం చేతి యావన్న ప్రవిచారితమ్
సంసారాడమ్బరం తావదన్ధకారోపమం స్థితమ్ (వసిష్ఠగీత)

“ నే నెవరను ? ఈ జగత్తు ఏ ప్రకారము ఏర్పడినది ” అని మనుజు డెంతవఱకును విచారింపడో అంతవఱ కాతనికి ప్రపంచమంతయు చీకటిగనే (దుఃఖమయుగనే) యుండును, అని వసిష్ఠమహర్షి శ్రీరామచంద్రునకు బోధించెను. మఱియు ప్రపంచమున సత్యవస్తువు లేనిచో అసత్య వస్తువుకొఱకు ప్రాకులాడుటలో కొంత అర్థము కలదు. కాని సత్యవస్తువు తనకు అతి సమీపముగనే తన హృదయాంతరాళములో విరాజిల్లుచుండగా అసత్యమగు నామరూపముల వెంట పరుగెత్తుట హాస్యాస్పదమే యగును. కాబట్టి విజ్ఞుడగువాడు బాగుగ యోచించి, ప్రజ్ఞయను దీపము నాశ్రయించి, తన హృదయగుహయందు బహుకాలమునుండి దాగియున్న రక్కసులను చీల్చి చెండాడి, వారిని అట నుండి తరుమగొట్టి, హృదయమును దండకారణ్యమునందు నిత్యానిత్యవస్తు వివేకమను శ్రీరామచంద్రుని ఆహ్వానించి ఆ కోదండధరుని ధాటిచే హృదయక్షేత్రమును కామాది శత్రుశూన్యముగ నొనర్చుకొనవలెను. నిష్కంటముగ గావించుకొనవలెను. సత్యహింసా శమమాది సద్గుణరూప మునీశ్వర సంయుక్తముగ నొనర్చుకొనవలెను. అత్తఱి జీవునకు కలుగు ఆనందము అపారము, అతనికి కలుగు శాంతి అనంతము. అది యొక దివ్యానుభూతి. అట్టి మహత్తర లక్ష్యమునకై మానవ జీవితము అంకిత మొనర్పబడవలెను.

సద్గురూ ! నీకు మా శతకోటి ప్రణామాలు

– శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

లోకంలో గురువులుండవచ్చు కానీ సద్గురువులు చిక్కడం చాలా కష్టం. సమస్తానికి మూలకారణమై, జడజగత్తుకు చైతన్యాన్నిచ్చే సత్, చిత్, ఆనందం తన స్వరూపంగా గల పరమాత్మను 'ఏకం సత్ ' అని వేదంచే ప్రతిపాదింపబడిన పరబ్రహ్మను సాక్షాత్కరింపజేసి, జీవస్థానాన్నుండి తనను పరమాత్మ స్థాయికి, మానవత్వాన్నుండి మాధవత్వస్థాయికి, నరత్వాన్నుండి నారాయణత్వానికి తీసుకుపోయి విశ్వనాథుణ్ణి చేసిన గురువే సద్గురువు. ఇట్టి సద్గురువు లభించడం చాలా అదృష్టం. పూర్వ పుణ్యఫలం.

అంచేతనే జగద్గురు శంకరాచార్యులవారు "దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహ హేతుకమ్ ! మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః " – మహాత్ముల ఆశ్రయం దైవానుగ్రహముంటేనే లభిస్తుంది " అన్నారు.

ఇట్టి సద్గురువుకు ఇలలో ఎవరూ సాటిలేరు. ఇలలోనే కాదు పరంలోను సాటి లేరు. కాబట్టే శివుడు పార్వతితో – ' న గురోరధికం న గురోరధికం ' – గురువుకంటే అధికులు లేరు లేరు అన్నాడు. అంచేతనే ' గురుస్సాక్షాత్పరం బ్రహ్మ ' – గురువు సాక్షాత్ పరబ్రహ్మమే అన్నారు పెద్దలు. ఇట్టి సద్గురువే మా గురుదేవులు పరమహంస పరివ్రాజకాచార్య పూజ్యపాద శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు.

మానవాళికి ఒక మహాప్రయోజనాన్ని కలుగజేసి మానవాళిని చైతన్యవంతం చేసే వాడు మహాత్ముడు. అతడు తన కోసరం జన్మించడు, తన కోసరం జీవించడు. ఇతరుల కోసరమే జన్మిస్తాడు, ఇతరుల కోసరమే జీవిస్తాడు. కాబట్టే ఆయన కారణజన్ముడు. మా గురుదేవులు ఆ కోవకు చెందినవారే. వారు తన కోసరం జీవించలేదు. తనకోసరం శ్రమించలేదు. మనకోసరం జీవించారు, మనకోసరం శ్రమించారు, మనకోసరం తపించారు. అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి నలభై సంవత్సరాలు రాత్రింబవళ్ళు అనర్గళ గీత ప్రవచనాల ద్వారా అజ్ఞానాన్ని పోగొట్టి మానవాళిని చైతన్యవంతులను చేశారు. సన్మార్గంలో పయనింప చేశారు. అశేష జనావళిలో ఆధ్యాత్మికచింతనపై ఆసక్తిని కలిగింపచేశారు. కాబట్టే శ్రీ స్వాములవారు మహాత్ముడు అనబడ్డారు.

శ్రీశ్రీశ్రీ స్వాములవారి ప్రసంగాలు పండిత పామరరంజకాలు. తేనెకన్నా, చక్కెర కన్నా, పనసతొనలకన్నా తియ్యనైనవి. శ్రీ స్వాములవారు ఒక మహాతపస్వి, మహామనిషి, మహాప్రవక్త. వారి కంఠం కంచులా మ్రోగేది. వారి వాక్కులో ఒక జనాకర్షణ, ఒక రసఝురి, ఒక రసాస్వాదన వుండేది. అంచేతనే వారి ప్రవచనాలు దారినపోయేవారిని కూడా ఆకర్షించేవి. సన్మార్గం వైపు పయనింపజేసేవి. వారి ప్రవచనంలో వచ్చి కూర్చున్న వాడు చివరివరకు లేచిపోయేవాడు కాదు. వారొక లోకోత్తర పురుషుడు.

" **BE FEARLESS** నిర్భయుడవు కా ! అనేది శ్రీ స్వాములవారి మంత్రం. నిన్ను నీవు ఉద్ధరించుకో ! మేము మార్గదర్శకులం మాత్రమే. జీవితంలో అంతో ఇంతో చైతన్యైనంత పరోపకారం చెయ్, పరపీడన చేయకు" అని స్వాములవారు జనసామాన్యులకిచ్చే ఉపదేశం.

" నిన్ను నీవు అల్పుడవనుకోకు, పాపినని అనుకోకు. నీవు సాక్షాత్ సచ్చిదానంద పరబ్రహ్మవు " అని స్వామివారి హెచ్చరిక. ఇట్టి ఓ సద్గురుదేవా! నీకు మా శతకోటి ప్రణామాలు".

ఆశ్రమ కంటి ఆసుపత్రికి ఈక్రింది వారు పైకమిచ్చారు

01. శ్రీమతి ముప్పిరి ధనలక్ష్మి గారు (మచిలీపట్నం) – రూ. 50,000/–
(రిటైర్డ్ ప్రిన్సిపల్)
02. కె.వినోదరెడ్డి గారు (హైద్రాబాద్) – రూ. 10,000/–
03. ఎన్.రమావతమ్మ గారు (చెన్నై) – రూ. 11,000/–
04. ఆదిత్య స్పిన్నింగ్ మిల్ (రాగిగుంట), – రూ. 40,000/–
(ఇనుపకుర్చీలకు)

సద్గురు బోధ

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

01. బీజము వృక్షముగా పరిణమించుటకు పృధివ్యాది పంచభూతముల ఆనుకూల్యమేలాగున యుండవలెనో ఆలాగున ఈ జీవుడు గూడ బంధము నుండి విముక్తిని పొంది తన పూర్వ సౌఖ్యమును పొందగల్గుటకై పంచశీలమను అనుష్ఠాన పంచకము నభ్యసించవలెను.

అది 1. నిరన్తర ఈశ్వర విచారము, 2. ఆత్మ యొక్క యథార్థమును తెలిసికొనుట. 3 హృదయము నెల్లప్పుడును నిర్మలముగా నుంచుకొనుట. 4. బ్రహ్మచర్యవ్రతమును చక్కగ ఆచరణయందుంచుట (ఇది గృహస్థ బ్రహ్మ చర్యము ఐనను సరే) 5. ఆహార నియమము గల్గియుండుట.

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశమనెడి పంచభూతములలో దేని కొరత గలిగినా చెట్లు ఎట్లు పెరుగుజాలవో ఆలాగున ఈ పంచ శీలములలో దేని లోపము గలిగినా జీవుడు తన పూర్ణావస్థను బొందజాలడు.

ఈ జన్మలుగాని మరియొక జన్మలో గాని ఈ శీలపంచకము సమావస్థకు వచ్చినపుడు మాత్రమే జీవునకు ముక్తియు పూర్ణత్వమున్ను గలుగును.

02. సత్తువగల భూమిలో మంచి విత్తనములను విత్తినను వర్షము లేనిచో అవి ఫలించనట్లు శుద్ధ హృదయంలో గూడ ధ్యాన, జప, తప, యోగ, యజ్ఞ, వ్రత శ్రవణాదులనే విత్తనములను పాతిపెట్టినను సర్వేశ్వర కరుణా కటాక్ష వీక్షణామృత భక్తియనే వర్షం (వృష్టి) లేనిచో జ్ఞాన ఫలము ఫలింపదు. కనుక ముక్తికి భక్తియు ముఖ్య సాధనమని మరువకుడు.

03. తామర పుష్పము వికసించునపుడు దళములు తమకు తామే వీడిపోయినట్లు హృదయము వికసించునపుడు సప్తావరణములు అనగా వృత్తులు స్వయముగా వదలిపోయి స్వస్వరూపమగు ఆత్మ మాత్రమే శేషించి యుండును. కాని కమలము వికసించుటకు సూర్యరశ్మి కావలసియుండునట్లు హృదయము వికసించుటకు సర్వేశ్వర కరుణా కటాక్ష వృష్టి (వర్షం) వుండవలయును.

04. ఆహారనియమము, ఆత్మ నియమము, నివాస నియమము, సంసర్గనియమము, కృత్య నియమము అను నీ పంచనియములు గలవారు, పంచభూతముల సానుకూల్యతచే బీజమేలాగున ఫలపల్లవ పుష్పాదులతో అక్షయమై అలరారుచుండునో ఆలాగున జీవనోపాధి నుండి ప్రబోధము గల్గి శమదమాది గుణములతో పూర్ణప్రజ్ఞ గలవారై తేజరిల్లుదురు.

05. భగవంతుడు అంతటాయున్నాడని తెలిసికొని చాటుననైనను పాపకార్యములను చేయకుము.

వేదాన్తభేరికి పోషక చందా పంపినవారు

01.	బి.రాజలింగం (జనగాం)	–	రూ. 1200/–
02.	డి.పిచ్చేశ్వరరావు (ప్రసాదంపాడు, విజయవాడ)	–	రూ. 1200/–
03.	పి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు (విజయవాడ)	–	రూ. 1500/–
04.	సిహెచ్. రామమోహనరావు (విజయవాడ)	–	రూ. 1200/–
05.	మాతంగి వెంకటయ్య (మేడిపల్లి, ఆదిలాబాద్ జిల్లా)	–	రూ. 1200/–
06.	హెచ్. రామచంద్రయ్య చెట్టి (అనంతపురం)	–	రూ. 1200/–

వేదాన్తభేరి ... పోషక చందా మురళీధర కృష్ణుడు

మహాప్రవక్త
శ్రీ విద్యాప్రకాశానందస్వామి

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరువతి)

మలయాళ మహర్షీణాం శిష్యేషు ప్రథమస్సుధీః ।
జయత్యసౌ మహా శ్రీ విద్యాప్రకాశానందనామకః ॥
(బండ్ల వేంకటరమణయ్య)

శ్రీ సద్గురు - మహర్షి మలయాళ స్వాములవారి శిష్యులలో మొదటి వాడు, సద్బుద్ధి సంపన్నుడు, మిగుల గొప్పవాడు శ్రీ విద్యాప్రకాశానందుడు అనే పేరు గలవాడగు ఈ మహనీయుడు సర్వోత్కృష్టుడై వర్ధిల్లుచున్నాడు.

శ్రీ మలయాళ సద్గురు స్వాములవారి పాదస్పర్శ సోకి ఆంధ్రభూమి పావనమయింది. జడత్వం దూరమై చైతన్యం వెల్లివిరిసింది. భగవద్గీత ఇంటింటా పారాయణం చేయదగినదై భాసించింది. తరతరాల నుండి సంస్కృత భాష ఎట్టిదో ఎరుగని కుటుంబాలలోని బాలబాలికలు ఆ భాషను అభ్యసించి మహావిద్యానిధులయ్యారు. శుష్క వేదాంతులు తోక ముడుచుకొని పారిపోయారు. అనుష్ఠాన వేదాంతం అమలులోకి వచ్చింది.

ఈ పరిణామం భగవత్సంకల్పఫలమే. అన్నమయ్య కీర్తించినట్లు తెరచిన నరకద్వారాన్ని మూసివేయడానికీ, మూసిన వైకుంఠద్వారాన్ని తెరిచి పెట్టడానికీ భగవదంకిత చరిత్రులైన మహామహులు లోకంలో అవతరిస్తారు.

అలా 19వ శతాబ్ది చివరిపాదంలో అవతరించిన మహాత్ములలో శ్రీ మలయాళ సద్గురు దేవులు అగ్రగణ్యులు. అయితే ఒక్క గురువు అవతరించగానే వారి అవతార ప్రయోజనం నెరవేరదు. వారికి శిష్యపరంపర అవసరమవుతుంది. ఆ శిష్యుల ద్వారా వారి సంకల్పాలు సాఫల్యం

చెందుతాయి.

భగవంతుడు రాముడు గానో, కృష్ణుడుగానో అవతరించినపుడు గూడా ఆ దేవునికి తోడ్పడడానికి వివిధ దేవతలు నానారూపాలలో అవతరించారని పురాణాలలో వింటున్నాము.

ఆధునిక యుగంలో గూడా శ్రీరామకృష్ణ పరమహంస వంటి గురుమూర్తులకు శ్రీ వివేకానంద వంటి శిష్యశ్రేష్ఠులు తోడ్పడ్డారు గదా ! అలా శ్రీమలయాళ సద్గురు దేవులకు గూడా శిష్య పరంపర ఏర్పడింది. ఆ శిష్యుల ద్వారా శ్రీ సద్గురుదేవుల సత్సంకల్పాలు ఫలవంతమయ్యాయి.

ఆ శిష్యులలో మొదట పేర్కొన దగిన మహనీయులు శ్రీ విద్యాప్రకాశానందులు. శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులుగానే కాక అష్టోత్తర శత గీతాజ్ఞానయజ్ఞ కర్తగా, ' గీతామకరంద' రచయితగా తన వాక్ నైపుణ్యంతో లక్షలకొలది జనులలో భగవద్గీత పట్ల ఆసక్తి కల్గించిన అపరగీతాచార్యులుగా ప్రసిద్ధులైన శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు ప్రాతఃస్మరణీయచరిత్రులుగా ప్రసిద్ధులయ్యారు.

శ్రీ స్వాములవారి వచో వైశాలిని వినుతిస్తూ మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యులవారు ఇలా వ్రాశారు.

పరమతదూషణంబునకు
పాల్పడకుండ సమస్తమానవుల్
పరమ ముదంబునంద నుతి
పాత్రము గాగ శతాధికంబుగా
జరిపితి జ్ఞాన యజ్ఞములు
ఛాత్రునిగా మిము బొందినట్టి స
ద్గురు మలయాళ యోగి వరు
తొల్లిటి పుణ్యవిశేష మెట్టిదో !

ఇందలి మాటలు అక్షర సత్యాలు. గంటల కొలది అనర్గళంగా

వాగ్ఝరిని ప్రసరింపజేస్తున్నా, శ్రీ విద్యాప్రకాశానందస్వామి వారి ప్రసంగంలో ఎక్కడా పరమతనింద వినిపించేదికాదు. అది వారి గురుదేవులు శ్రీ మలయాళస్వాములవారు వారిపట్ల అనుగ్రహించిన వరం. కొందరు మతప్రచారకులు ఇతర మతాలను నిందించకుండా ఒక్క నిముషం సేపైనా మాట్లాడలేరు. ఈ దోషం శ్రీ విద్యాప్రకాశానందుల వచో వైశాలిలో ఏ మాత్రం పొడసూపేది కాదు. పిన్నలు, పెద్దలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్త్రీలు, జిజ్ఞాసువులు, జ్ఞానులు, ఇతర మతస్థులు, అందరూ స్వాములవారి ప్రవచనాన్ని మంత్రముగ్ధులై వినేవారు. అమందానందం పొందేవారు.

వారి ప్రసంగాలు ఆకాశంలో లీనమై అంతరించి పోగూడదని భావించి తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆడియో కేసెట్లలోనూ, వీడియోలలోనూ చొప్పించి లోకానికి ఎంతో మేలు చేశారు. ఈ విషయంలో ఆనాటి కార్యనిర్వహణాధికారి శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు, టి.టి.డి. బోర్డు సభ్యులు, తదనంతరం ఛైర్మన్ అయిన శ్రీ పి.వేంకటేశ్వర్లు గారు చూపిన చొరవ ప్రశంసనీయం. ఆనాడు దేవస్థానంలో ధర్మప్రచారపరిషత్ కార్యదర్శిగా పనిచేసిన నాకూ అందులో ఒక అణుమాత్రం సేవాభాగ్యం లభించింది. అయితే ప్రస్తుతం టి.టి.డి.వారు తాము తయారు చేసిన వీడియో ప్రసంగాలను తమ ఛానల్ ద్వారా ప్రసారం చేయకపోవడం విచారకరం. శ్రీ కొండమాచార్యులవారన్నట్లు శ్రీ విద్యాప్రకాశానందులు శ్రీ మలయాళ స్వామివారికి శిష్యులుగా లభించడం ప్రశంసనీయమే. ఆ గురుశిష్యుల అనుబంధం అట్టిది.

జగ్గయ్యపేటకు చెందిన శ్రీ వాసవీ గ్రంథాలయంవారు స్వామి వాణిని ఇలా కీర్తించారు.

ఉపనిషద్వాక్యంబులుచ్చరించెడు వేళ
ధీరతన్ మెరయు గంభీరరవము
గత చరిత్రలలో కథలు చెప్పెడు వేళ

సరసమై యొప్పు స్వచ్ఛ స్వరమ్ము
నేటి కాలపు తీరు చాటి చెప్పెడు వేళ
చిరునవ్వు లొలికింపజేయురవళి
అజ్ఞానులకు బోధ లందజేసెడు వేళ
నమృతవాహినియైన అమరవాణి
విశ్వసిద్ధాంత రీతి విన్పించు వేళ
సారతరమై ధ్వనించు ఘంటారవమ్ము
తమ మహోన్నత వాగ్గుంభనముల సొంపు
లెన్ని రూపంబులో వచియింప దరమె ?

ఈ పద్యంలో పేర్కొన్నట్లు స్వామి కావించిన ఉపన్యాసాలలో ఉపనిషత్తులు, గత చరిత్రలు, నేటి కాలపు తీరుతెన్నులు, అజ్ఞానులకు బోధలు, విశ్వసిద్ధాంత రీతులు, విస్తారంగా వినిపించేవి. అవి వారి వాగ్వైఖరికి ఇంపుసొంపులు కల్గించేవి.

అటు ఉపన్యాసాలూ, ఇటు గ్రంథరచనలూ, భక్తులను చిరునవ్వులో పలకరించే సౌహార్దమూ, లోకసేవా కార్యక్రమాలూ ఇవీ అవీ అనడమెందుకు, శ్రీ స్వామివారి జీవితంలోని చర్యలన్నీ వారి మహానుభావతకు నిదర్శనాలై విలసిల్లాయి. శ్రీ సద్గురు మలయాళస్వాములవారి చరాచర సుఖాభి లాషిత్వాన్ని తలపులోనికి తెచ్చాయి.

వాగ్వైభవం యతేర్యస్యసర్వలోక ముదావహమ్ ।
జాడ్యాపహంచ చైతన్యదాయకం తం గురుంభజే ॥

ఏ యతీశ్వరుని వాగ్వైభవం సర్వలోకానికి సంతోషం కల్గించిందో, జడత్వాన్ని నశింపజేసిందో, చైతన్యాన్ని సమకూర్చిందో అట్టి గురుదేవులు శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారిని భజిస్తున్నాను. **ఈ వ్యాసంలో ఉదాహరించిన పద్యాలు శ్రీ స్వామి జీవిత చరిత్రనుంచి స్వీకరింపబడినవి. అందు ఇంకనూ ఇట్టివి అనేకం కలవు.**

మూర్తి ఆర్జించిన కీర్తి

- శ్రీ శివానంద బ్రహ్మచారి (కాశి)

విద్యాప్రకాశ సంయుక్తం విద్యాప్రకాశ శోభితం
విద్యాప్రకాశినం వందే విద్యాప్రకాశ రూపకమ్ ॥

పరతంత్ర పరిపీడలనచే ఆధ్యాత్మిక సంస్కృతి అడుగంటిపోతున్న రోజులవి. కైలాసవాసియగు పరమేశ్వరుడు తన కమనీయ ధామానికి స్వస్తిజెప్పి కేరళాన్నాశ్రయించి అవతరించియున్న రోజులవి.

మాయామానుష వేషధారియగు ఆ మహితామహేశుడు తన అనురాగ ప్రపూర్ణ అనునయాలతో బాల్యలీలలను ముగించుకొని, తన పరమాప్త పావన పాదారవింద రజోరేణువుతో ఆ సేతుహిమాచలాన్ని పునీతమొనర్చి, గోవిందుని సంరక్షణలతో గోగర్భమున తపమాచరించి, గణనీయ గొప్ప తపస్విగా ఖ్యాతినార్జించి, సంకల్పిత శివసంకల్పాల చరితార్థతకై కాశీబుగ్గనాశ్రయించి, వ్యాసాశ్రమాన్ని స్థాపించి, లోకరూపముగ భాసిస్తున్న లోకేశుని సేవకై శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు శ్రీకారం చుట్టిన రోజులవి. తన మహత్తర కార్యసాధనకై చరణ చతుష్టయాన్ని రూపొందించుకొన్నారు.

ఇంతియేగాక తన ప్రచార ప్రసారాల సర్వాంగీణతకు ప్రముఖ ప్రతినిధిగా ప్రసిద్ధోపన్యాసకులుగా ఉపకరించగలరన్న భావనతో ఆనాడు అంతేవాసిగానున్న ఆనందమోహన్ బ్రహ్మచారిగారిని ప్రేరేపించి పరమహంస పరివ్రాజకాచార్యులుగా పరివర్తింపజేసి విద్యాప్రకాశానంద అనెడి వినూత్న అభిధానాన్ని అనుగ్రహించి ఆశీర్వదించి ఔపన్యాసిక ప్రచారాలకై పంపిన రోజులవి.

గురుదేవుల ఆశీర్వాదబలంతో పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు ఆనాటి ఆధ్యాత్మిక మహాధివక్తలలో సాటిలేని మేటి దిట్టయి, సర్వలోకరంజకులై, సర్వాధిపులై, సర్వాధికంగా స్థానమానాలను ఆర్జించి, ఆంధ్రలో ఆధ్యాత్మిక సంస్కారాలకు అంకురార్పణ గలిగించిన వారిలో శ్రీ స్వాములవారు అసదృశులని ఖ్యాతినార్జించుకొన్నారు. మరియు ఆంధ్ర పరిసర ప్రాంతాలలో గూడ తన ఆధ్యాత్మిక ప్రచుర ప్రచార ప్రసార

ప్రకాశకిరణాలను ప్రసరింపజేసుకొన్నారు.

ఇరువదవ శతాబ్దంలో విశ్వజనీనమైన గొప్ప ఆధ్యాత్మిక సంచలనాన్ని గల్గించిన మహాధివక్తగా, తత్త్వవేత్తగా, గంభీరోపన్యాసకులుగా గణతికెక్కిన మహామహులలో విదిత వేదాంతియైన శ్రీ విద్యాప్రకాశానందస్వాములవారిదే ప్రముఖ స్థానము. వారి ముఖారవిందమునుండి వెల్వడిన ఉపదేశాత్మక ఉపన్యాసాలు ఈ గద్యపద్య గీత్యాత్మక కావ్యాలను, గ్రంథాలను, శబ్దగ్రాహక క్యాసెట్లను ఆశ్రయించి వారి వైదుష్య ప్రపూర్ణ గంభీర నిర్ఝర గంగాప్రవాహ సదృశ వాక్ చమత్కారవైభవాన్ని స్మరింపజేస్తున్నాయి.

తపోధనులై తరతరాలను తరింపజేసిన మహర్షి మలయాళ స్వాములవారి గౌరవాన్ని పెంచిన మూర్తరూపమైన వారి మూర్తి కనుమరుగైనను వారి ఆశయాలు, వారి ఆధ్యాత్మిక ప్రచారాలు ఈనాటి సాధకలోకానికి, రానున్న సాధులోకానికి ఆర్షాభిమత ఆశాజ్యోతులై శ్రేయః ప్రేయాల సంసాధనకు కలకాలం సహకరిస్తుండగలవనుటలో సందియమేమున్నది ?

పరివ్రాజక చక్రవర్తీ ! ప్రథిత తపోనిధీ ! సునీల వినీల ఆకాశంలో సూక్ష్మంగా వ్యాపించి వినీత హృదయులను వీక్షిస్తున్న విశ్వగోప్తా ! సాశ్రుపూరిత నయనాలతో అందజేస్తున్న శ్రద్ధాంజలులను అందుకొంటూ, ఆశ్రయించిన అశేష ప్రజానీకానికి ఆశ్వస్తతను, ఆనందమును గల్గిస్తూ, తమ అడుగుజాడలను అనుసరించేటట్లు, తమ ఆచరణలను అనుకరించేటట్టు ప్రేరేపిస్తూ తపః సాధనలకు వలసిన శక్తిని, స్ఫూర్తిని ప్రసాదిస్తూ, కంటికి రెప్పవలె కరుణిస్తూ అనుగ్రహించాలని అర్థిస్తున్నవారందరినీ అనుగ్రహించు తండ్రీ !

విశ్వాసైక శరణ్యులమై విశ్వసించి చరిస్తున్న మమ్ములనందరినీ ఉద్ధరించు తండ్రీ ! సద్గురుదేవుల సాయుజ్యాన్ని, శోభింపజేస్తున్న గురుదేవా! ఆప్తకాముడవైన మీకు మేమివ్వగలిగినదే మున్నది ?

అయినను హృత్పూర్వకంగా అందజేస్తున్న హృదయకమలాలను స్వీకరించాలని ప్రార్థిస్తున్నాము. స్వీకరించగలరని విశ్వసిస్తున్నాము.

శుకబ్రహ్మాశ్రమస్థాయ శుకబ్రహ్మ నిభాయచ
శుకబ్రహ్మేతి గీతాయ శుకబ్రహ్మ నమోఽస్తుతే ॥

పురందరదాసు పదాలలో "ధర్మం"

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

హరిదాసులలో సర్వశ్రేష్ఠులయిన పురందర దాసులవారు ధర్మ సంబంధ పదాలు ఐదు రచించారు. ఇవన్నీ ధర్మశబ్దంతో మొదలు కావడం విశేషం వీటిలో వైవిధ్యముంది.

' ధర్మ ఏకః సహాయః ' ఈ కీర్తనలో ఎవరెవరికి ధర్మం సహాయకమో చెప్పారు దాసులవారు. వాటిలో ప్రధానంగా కౌటుంబిక ధర్మాలను నిర్వహించిన వారికి, నైతిక జీవనం గడిపినవారికి, భక్త జీవితం గడిపిన వారికి ' ధర్మ ఏకః సహాయః' అన్నారు. తల్లిదండ్రుల్ని ప్రియంతో చూచిన వారికి, ఇతరులకు ఉపకారం కలిగించినవారికి, యాత్రలు చేసిన పుణ్యాత్ములకు, విఠల భజనపరులకు ' ధర్మ ఏకః సహాయకః ' అని భరోసా ఇచ్చారు దాసులవారు.

" ధర్మక్కె బారదీ కాల అని మరో కీర్తన. ధర్మచింతనాపరులకు ఎదురయ్యే సమస్యలు ఈ కీర్తనలో వర్ణితం. పోకిరులు, దుండగులు, వితండవాదు లుండగా ధర్మచింతన అంతంత మాత్రమే. అసత్యవాదులు, తొత్తులకు అనుకూలకాలం. మంచీ చెడు, పెద్ద చిన్న లేని వారితో మసలే కాలం. మనసులో పురందరవిఠలుని నుతించని వారికాలం.

"ధర్మ దొరకువుదే" అన్నది మరో పదం. గడచిన జన్మం తలచుకో. ముందటి జన్మల దారులు తెలుసుకో. బాడుగ ఇల్లులాగే దేహం ఆత్మకు బాడుగ ఇల్లు అని తెలుసుకో. మనసు లేని వానికి డబ్బుంటే ఏంలాభం? పురందర విఠలుని మరువవద్దు. నాల్గవది 'ధర్మవెంబ సంబళవ "ధర్మమనే జీతాన్ని దాచుకో' యముడు ఎవరిని వదలి పెట్టడు. మేడలో వున్నా, బంగారున్నా, పరివారమున్నా కాలపురుషుడు వదలి పెట్టడు. సవాలక్ష కారణాలు చెప్పి నచ్చచెప్పి తప్పించుకోవాలన్నా వదలడు. పురందరవిఠలుని భక్తితో భజించు. చివరిది " ధర్మవే జయవెంబ దివ్యమంత్ర " విషం పెట్టిన వాణ్ణి పిలిచి షడ్రసోపేత భోజనం పెట్టు. ద్వేషించేవాణ్ణి పోషించు. మోసం చేసిన వాని పేరును కొడుకుకు పెట్టు. వెనక నానామాటలు మాటాడే వారిని ముందట నోరార పొగడు. బంధించిన వారిని విడిపించు. చంపిన వారిని యింటికి నడచి వెళ్ళు. నీవంటే లెక్క చేయని వారిని, సహించని వారిని, గిట్టని వారిని ఆహ్వానించు. పురందర విఠలుని కొండాడి ధన్యుడు కావాలె. ఈ చివరి కీర్తనలోని అంశాలు పాటించడానికి ఎంత సాత్త్వికత, ఔదార్యం కావాలో మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. ఆదర్శవాదం ఆకాశమంత!



సద్గురు స్వామీ! వందనాలు!!

– కె. ఈశ్వర్

1914 సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీన తమరు అవతరించారు. భగవద్గీతా ప్రచారమునకై భగవంతుడు పంపిన మహర్షియే శ్రీ సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. గంగానదిలో గంగాదేవి ద్వారా భగవద్గీతను అందుకున్న మహానుభావులు మీరు

భగవద్గీత పేరు వినగానే గుర్తుకు వచ్చేది మీరే స్వామీ !

01. మీ కలము నుండి వెలువడిన రచనలలో " గీతామకరందము" అద్భుతమైన గ్రంథము. తమ తపశ్శక్తినంతయు ధారపోసి రచించినారు. కావున మకరంద స్వామీ ! అంటారు భక్తులు.

02. మృధు మధురమైన కంఠముతో అత్యంత తేలిక భాషతో చక్కని చతురోక్తులతో గీతాబోధ చేసి అన్ని తరగతుల జనులను ఆకర్షించారు. మీరు మీ గీతాబోధ వినుటకే సమయము కేటాయించి మీ గీతా ప్రవచనములు జరుగుచున్న రోజులలో సినిమాలు చూచుట కూడ విరమించుకున్నారు భక్తులు.

ప్రముఖుల అభిప్రాయం 01.భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు

01.01.1987 పుట్టపర్తిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ సభల సందర్భంగా శ్రీ స్వాములవారి ప్రవచనము విని శ్రీ భగవాన్ సత్యసాయిబాబా వారు సభాముఖముగా ఇలా ప్రవచన చేసిరి.

" అనేకమంది వేద వేత్తలు, అనేక భాషల యందు అనేక విధములుగా భగవద్గీతను గురించి వ్యాఖ్యానించి అనేక విధములుగా దానిని వ్యాప్తి నొందించి వున్నారు. శ్రీ విద్యాప్రకాశానందులవారు దీనిని గురించి సమత్వాన్ని బోధిస్తూ దివ్యవ్యాప్తిని గావించవలసిన విధానము కూడాను తెలుపుతూ వచ్చారు. గీతామకరంద స్వామి వారు " అని

అభినందించారు. భగవానుల వారు.

02.జగద్గురు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య మహా స్వాములవారు ఇలా అన్నారు.

శ్రీ మలయాళస్వాములవారి ముఖ్య శిష్యులు అయిన వీరిచే చేయబడిన గీతామకరందమను అనువాదము గీతార్థమును అత్యంత సరళమైన తెలుగు భాషలో తేటతెల్లముగా వివరించడం వలన ఆంధ్రదేశములో సుప్రసిద్ధమైనది. పలు భాషలలో అనువదించబడినది.

03.పూజ్యులు త్రిదండి రామానుజ జీయరుస్వామి వారు ఇలా సెలవిచ్చారు.

“ప్రజ్ఞాచక్షువులైన శ్రీ స్వామి భగవద్గీతా ప్రచారంలో సేవా కార్యక్రమములో ఒక విప్లవాత్మకమైనట్టి మలుపు తిప్పారు.

గీతాజ్ఞాన యజ్ఞాలలో వారు బోధించే తీరు అద్భుతం. ప్రవచనాలు కడుపుబ్బ నవ్వించే కథలతోనే సాగేవి. అందమైన ఆంగ్లభాష కొటేషన్సు ప్రయోగిస్తూ అందరిని ఆశ్చర్యపరచేవారు. వారు రచించిన గీతామకరందం ఎన్నో భాషలలో లక్షలాది మందికి కరభూషణమైంది. శ్రీ స్వామివారి సేవా కార్యక్రమాలలో 1993లో భక్త కన్నప్ప ఉచితకంటి ఆస్పత్రి ప్రారంభములో నేను కూడా పాల్గొని వారి ఔదార్యాన్ని కన్నులారా చూశాను

04. శ్రీ కె.రోశయ్య గారు ప్రస్తుత తమిళనాడు గవర్నర్

“శ్రీ స్వాములవారి ప్రవచనాలు తెలుగు ప్రజలకు చిరస్మరణీయాలు. 1960 తెనాలిలో 20 రోజులు వారి ప్రవచనాలు విన్నాను. హైద్రాబాదులో జరిగిన గీతాజ్ఞాన యజ్ఞ సభలకు హాజరై ఉత్తేజితులైన వారిలో నేను ఒకణ్ణి కావడం అదృష్టంగా భావిస్తున్నాను” అన్నారు శ్రీ రోశయ్య గారు. ఈ విధంగా మహాత్ములు, రాజకీయ నాయకులు వ్యాపార వేత్తలు శ్రీ స్వాములవారి ప్రవచనములకు ఆకర్షితులైన వారు ఎందరో వున్నారు. అట్టి సద్గురువులు మద్గురు దేవులకు వందనాలు అర్పిస్తూ శ్రీ స్వామివారి ఆశీస్సులు కోరుతూ శ్రీవారి జన్మదిన ఆరాధన కార్యక్రమాలలో భక్తులు పాల్గొని ఆనందానుభూతి నొందెదరు గాక.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

35. దేవుని అనుగ్రహము పొందడానికి వచ్చినటువంటి ఈ శరీరము స్థిరమైనది కాదు. దీనియొక్క స్వరూపాన్ని తెలుసుకొన్నాము. ఇది ఆరు వికారములతో కూడినది. శరీరము వలన అనుభవించే సుఖము కూడా క్షణికమే. దేవుడు వ్రాసిన విధి లిఖిత ముగింపు ముగియక ముందే శివుని శరణు వేడాలి.

36. ఎర్రమట్టి వర్షముపడినట్లల్లా కరిగి ప్రవహించి పోతుంది. ఇసుకరాశిని ఎంత వేసినా అది గాలికి జరిగిపోవును. మానవుని బ్రతుకంతా కల. కలలో వేరేదో కావాలని కోరుకొంటున్నారు. కుమ్మరి వాడు కుమ్మరాములో కుండలు, ముంతలు, గిద్దలు, మొదలైనవన్ని కాలుస్తాడు. ఆ కుమ్మరాము అగ్ని దాని అంతటా వ్యాపించి వాటిని కాల్చినట్లు ఈ సంసారము యొక్క తాపత్రయాగ్ని మానవుని జీవితమంతా కాల్చుతుంది. ఆపత్కాలములో ఎవరూ సహాయానికి రారు. ఇది జగము యొక్క నియమము. సుఖము వచ్చితే అందరూ దగ్గరకు వస్తారు. దుఃఖము వచ్చితే అందరూ దూరమౌతారు. దానికోసం చెన్నమల్లికార్జున నీవే కరుణించి కాపాడాలి.

38. వింధ్యపర్వతములో స్వచ్ఛందంగా పెరిగిన ఏనుగు తన గుంపును వదలి ఒంటరియై తన గుంపును స్మరించుచున్నది. వేటగానికి చిక్కి పంజరములో బంధింప బడిన చిలుక తన బంధువులను స్మరించేది సహజము. ఆ విధంగా పరశివ స్వరూపుడైన నీ నుంచి దూరమై సంసార బంధనములో చిక్కిపడివున్నాను. నీవు “ నన్ను బిడ్డా ఇక్కడికి రా ” అని పిలిచితేనే నేను ఈ భవబంధముల నుంచి విముక్తి పొందుతాను. అప్పుడు కరుణామూర్తుడని నీ పేరు సార్థకమౌతుంది. ఇది నా ప్రార్థన. నా ప్రార్థన విని నన్ను లాలించి పాలించు.

39. లోకవ్యవహారానికి సూర్యోదయమే కారణం. ఇంద్రియముల

వ్యవహారానికి మనస్సే కారణము. సంసారానికి, మోక్షసాధనానికి ఈ ఒకటే మనస్సు కారణం. ఏ మార్గములో వెళ్ళితే అది అబ్బుతుంది. అటువంటి మనసు చెన్నమల్లికార్జునదేవా నీలో లీనమైతే పుట్టుచావు అనే బంధము నాకు వుంటుందా ?

40. నేను సంసార సంఘములో మునిగితిని. సంసారము నిస్సారమని శ్రీ గురునాథుడు నా మనస్సుకు బాగా అర్థమయ్యేటట్లుగా ఉపదేశించినాడు. శరీర సంఘ వికారాన్ని విడిపించి, ఆచారాది లింగములను నా శరీరములో ప్రతిష్ఠాపనము చేసి నన్ను శివ స్వరూపంగా తీర్చిదిద్దాడు. పూర్వజన్మల ఆనవాది మలములను నాశనము చేసి జీవుని యొక్క గమ్యాన్ని చూపించినాడు. శివునిలో సమరసమయ్యే నిజతత్వాన్ని అనుభవింప జేసినాడు.

42. శ్రీ గురువు వేధా దీక్షతో అంతరంగమును శుద్ధి చేసి, ఆజ్ఞాదీక్షతో బహిరంగ క్రియలన్నిటిని పరిశుద్ధముగా గావించి ఈవిధముగా లోపల బయట అన్ని సంసయములను నివారిస్తాడు. స్ఫటికములాగా శిష్యుడు లోపల బయట శుద్ధి అవుతాడు. ఫలవంతమైన భూమిలో విత్తనములు వచ్చినట్లు శుద్ధాంతఃకరణమైన జీవాత్మునిలో మంత్రోపదేశమనే బీజాన్ని వేస్తాడు. దీనివలన బాహ్య వ్యవహారముతో నివృత్తుడై ఆంతరంగిక తన నిజస్వరూపాన్ని తెలుసుకొంటాడు. ఈ విధముగా ఉపదేశాన్ని ప్రబోధించే వారే జ్ఞానగురువు. ఇటువంటి శ్రీ గురు పాదానికి శరణు పొందాలి.

43. శ్రీ గురువు తన శిష్యుని మస్తకముపై హస్తమును పెట్టినపుడు ఆ శిష్యుని దేహము పరుషమును లౌకిక లోహము బంగారుగా మారునట్లు శిష్యుని శరీరము మంత్రమయమౌతుంది. నొసటిపైన శ్రీ విభూతిని ధరించుటవలన మోక్ష రాజ్యానికి పట్టం కట్టినట్లు అవుతుంది. వీభూతి రుద్రాక్ష ధారణ చేసి సద్యోజాతాది పంచకళసములతో శిష్యునికి అభిషేకము చేయటం వలన శివుని కరుణామృతము శిష్యునిపై కుసిరిస్తున్నట్లవుతుంది. శివగణముల సాక్షిగా శిఖాచక్రములో వున్నటువంటి మహాచైతన్య జ్యోతిని ఇష్టలింగాకారంగా చేసి ఎడమ చేతిలో శ్రీ గురువు అనుగ్రహిస్తాడు. అంగాంగములలో ఆచారాది శివలింగములను ప్రతిష్ఠాపనము చేస్తాడు. ఓంకార ప్రణవయుక్తమైన పంచాక్షరీ మన్త్రాన్ని చెవిలో ఉపదేశిస్తాడు.

సత్ - చిత్ - ఆనంద స్వరూపమే
శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

–ఎ.తారాలక్ష్మి, ఎం.ఎ., ఎం.ఇడి., ఎమ్.ఫిల్.
(శ్రీకాళహస్తి)

సువిఖ్యాతమైన శ్రీ శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఆధ్యాత్మిక జగత్తుకు నెరపిన సేవ కడు అపూర్వ మయినది. ప్రబోధాలు చిరస్మరణీయమైనవి. పూజ్యశ్రీ గండి రామకృష్ణానంద స్వాములవారు వచించినట్లు ఆంధ్రదేశములో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి రాక అసామాన్య విభూతి " శుచీనాం శ్రీమతాంగేహే " అన్నట్లుగా పవిత్రమైన ఆచార విచారములతో కూడిన సంపన్నుల కుటుంబంలో జన్మించిన సిద్ధ పురుషులు వీరు. సాధనచతుష్టయసంపత్తిగల వారే సాధువులు. అటువంటి సాధనలో పరిపుష్టిని పొందిన వారే శ్రీ విద్యాప్రకాశానందులు "బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్య లాభః " అన్న పతంజలి యోగసూత్రానికి ప్రతిరూపమే వీరు. శ్రీ విద్యాప్రకాశానందులవారు " వేదాంతభేరి " యనెడి మాస పత్రిక ద్వారా వేదాంత భేరి నాదమును దశ దిశలో మ్రోగింప జేసిరి. ఎటువంటి హంగు, ఆర్భాటం లేకుండా వందలకొద్దీ పల్లెలు పట్టణాలలో అష్టోత్తర శతాధిక జ్ఞాన యజ్ఞాలను నిర్వహించిన ఘనత శ్రీ వారికే దక్కింది. వీరు రచించిన " గీతామకరందం " అశేష ప్రజానీకానికి శ్రీ కృష్ణ భగవానుని దివ్యోపదేశాన్ని అందజేసి, వారిని దివ్యపథం వైపు నడిపించింది. శ్రీ వారు యోగవాసిష్ఠ గ్రంథమును తెనిగించి సరళమైన భాషలో సాధకులకు అందజేయడమే గాక భారత భాగవత రామాయణ రహస్యార్థాలను సరళమైన చక్కటి తెలుగులో సర్వులనూ అర్థమయ్యే రీతిన పంచరత్నాకరాలను రచించి

ముముక్షువులకు ప్రసాదించారు.

మానవసేవనే మాధవుని సేవగా భావించి విద్యా వైద్య సేవలలో గణనీయమైన ఆశీస్సులనందజేసి శ్రీకాళహస్తి పట్టణంలో ఒక డిగ్రీ కళాశాల మరియు ఒక బాలికల జూనియర్ కళాశాలను స్థాపించారు. మరియు భక్త కన్నప్ప పేరున ఓ ఉచిత నేత్ర చికిత్సాలయాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని వివిధ ప్రాంత ప్రజలకు బహుధా సేవలందించిన దివ్య పురుషులు శ్రీ స్వామి వారు.

ఋషీకేశ్‌లో పవిత్ర గంగానదిలో పూలతోనూ, కుంకుమతోనూ అర్చించబడిన శ్రీ మద్భగవద్గీతా గ్రంథము స్వామి దరికి చేరడాన్ని, ఓ పరమహంస పరివ్రాజకాచార్యునకు భగవంతుడు పంపిన ఆహ్వానంగా పరిగణించవచ్చును. వారి జీవన గమనాన్ని మరియు లక్ష్యాన్ని నిర్దేశించిన దివ్య సందేశమది.

శైశవదశలోనే అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించిన ఆనందమోహనునకు నాల్గవ యేటనే అక్షరాభ్యాసము జరిగింది. పువ్వు పుట్టగనే పరిమళించు నన్నట్లు బాల్యదశలోనే వారిలో దైవభక్తి, ఆధ్యాత్మ జిజ్ఞాస పొడచూపింది. శ్రీ శంకరుల అద్వైత వేదాంతం వారిని బాల్యంలోనే అమితంగా ఆకర్షించింది.

విద్యార్థిగా పాఠశాలలో ప్రతి తరగతిలోనూ ప్రథమస్థానంలో ఉత్తీర్ణుడగుటయే కాక, పాఠ్య విషయాలలోనే కాక, వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలలోనూ సర్వ ప్రథములుగా ఉండెడివారు. లౌకిక, పారమార్థిక విద్యల మేలు కలయికగా వీరి పాఠశాల విద్యకొనసాగింది. తండ్రి గారితో కూడి స్వాతంత్ర్యోద్యమంలో సైతము ప్రాతినిధ్యం వహించారు. పరోపకారం, జాలి, వినయం వంటి దైవీ గుణాలు వారిలో బాల్యంలోనే మిక్కుటంగా

వెల్లి విరిసాయి.

ప్రతి ఆదివారమూ కుటుంబ సభ్యులందరూ అపక్వాహారమే స్వీకరించ వలెనన్న తండ్రి అయిన శ్రీరామస్వామి గారి కట్టడి భావికాలంలో ఆనందుడు 12 ఏళ్ళపాటు అపక్వాహారాన్ని స్వీకరిస్తూ, ఆత్మ సాక్షాత్కారానికై కఠోర సాధన చేసేటందులకు దోహదకారి అయినదేమో ? ఆనందమోహనుని పదవయేట నిరాడంబరముగా నిర్వహింపబడిన ఉపనయన సంస్కారముతో ద్విజుడై వేదాధ్యయనమునకు అధికారి అయినాడు.

ఆ రోజుల్లో వేటపాళెంలోని సారస్వతనికేతనంలో ఓ సమావేశం నిర్వహింపబడింది. అందు బ్రహ్మచర్య ధర్మాలను గూర్చి తన సహజ సిద్ధమైన వాక్ పటిమతో అనర్గళంగా ఉపన్యసించిన ఆనంద మోహనుని ఉపన్యాసానికి ముగ్ధులైన ప్రభుత్వ ఆస్థాన కవి శ్రీ కాశీ కృష్ణమాచార్యుల వారు “ ఈ బాల బ్రహ్మచారి సామాన్యుడు కాడు, ఇతని కీర్తి నలుదెసలా వ్యాపించే కాలము రానున్నదని ” భవిష్యత్ వాణిని వినిపించారు.

మచిలీపట్నం (కృష్ణాజిల్లా) నోబుల్ కళాశాలలో విద్యార్థిగా నున్నప్పుడే ఆనందమోహనుడు శ్రీ వివేకానందులవారిపట్ల మరియు వారి బోధల పట్ల అమితంగా ఆకర్షితులైనారు. భగవద్గీత మరియు బైబిల్ గ్రంథాలను తులనాత్మకంగా పరిశీలించి వారు వ్రాసిన సమన్వయాత్మక వ్యాసం పలువురి మెప్పు పొందింది.

శ్రీ మహర్షి మలయాళస్వామి, శ్రీ వ్యాసాశ్రమాన్ని స్థాపించిన 1926వ సంవత్సరములోనే సనాతన వేదాంత జ్ఞాన సభలు ప్రారంభించారు. భక్తుల ఆహ్వానం మేరకు శ్రీ మలయాళస్వామి వారు అనేక ప్రాంతాలలో అధ్యాత్మ ప్రవచనాలు చేస్తూ పర్యటించేవారు. సదరు

పర్యటనలలో భాగంగా వారు ఒకసారి మచిలీపట్నం విచ్చేసారు. ఆ సందర్భంలోనే శ్రీ మలయాళస్వాములవారు ఆనంద మోహనునకు పంచాక్షరీ మంత్రోపదేశం చేశారు. గురుశిష్య బంధం భౌతికంగా వ్యక్తమయ్యింది.

కాశీ విద్యాపీఠంలో విద్యార్థులు నిర్వహించే ఓ ఆంగ్ల పత్రికకు ఆనందమోహనుడు సంపాదకత్వం నడిపారు. అలాగే "తపో భూమి" అను మాసపత్రికకు కూడా కొంతకాలం సంపాదకులుగా వ్యవహరించారు. అలా చిరుప్రాయంలోనే వారిలోని రచనానైపుణ్యం వ్యక్తమయ్యింది. ఆ సమయంలోనే వారికి బౌద్ధమత వాఙ్మయంలో తీవ్ర పరిశోధనలు నెరపిన రాహుల్ సాంకృత్యాయన్ మరియు శ్రీ కాశీ విద్యాపీఠం ప్రధానాచార్యులు ఆచార్య నరేంద్ర దేవ్ మఱియు శ్రీ ప్రకాష్, శ్రీ సంపూర్ణానంద, శ్రీ బలబీర్ మొదలైన ప్రముఖులతో సాన్నిహిత్యం లభించి వారి వ్యక్తిగత ప్రతిష్ఠను ఇనుమడింపజేసింది. అప్పట్లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరయిన గాంధీ మహాత్మునికి వీరు వాలంటీరుగా పనిచేశారు. గాంధీ గారికి వాలంటీరుగా వున్న వీరిని జాతిపిత ఆచార్య వ్యవహారాలు, నియమనిష్ఠలు, దైనందిన కార్యకలాపాలు ఎంతగానో ప్రభావితం చేశాయి.

లోకోత్తర చరితులైన మహర్షి మలయాళస్వామి వారికి ఓ నాడు రామస్వామి తమ గృహంలో భిక్షను ఏర్పాటు చేశారు. భిక్ష అనంతరం స్వామి రామస్వామితో ఆనందమోహనునకు అధ్యాత్మ విద్యను నేర్పడం, పరమార్థ క్షేత్రంలో ప్రవేశింప జేయడం ఉత్తమమన్న విషయాన్ని సూచనా మాత్రంగా తెలియజేశారు. గురుభక్తి పరాయణుడైన శ్రీరామస్వామి ఆ సూచనలోని ఔన్నత్యాన్ని గ్రహించి అందులకు సమ్మతించి ఆనంద

మోహనుని శ్రీ మలయాళ స్వామికి సమర్పించారు.

ఆనందమోహనుడు 1936 వ సంవత్సరంలో ఏర్పేడులోని వ్యాసాశ్రమంలో సాధకునిగా చేరారు. 12 సంవత్సరాలు అపక్వాహారంతో, ఏకాంతవాసంతో తపస్సు చేశారు.

మహర్షి గురుత్వంలో 1947లో వీరు సన్న్యాస దీక్షను స్వీకరించి శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామిగా సన్న్యాసాశ్రమ జగత్తులో అవతరించారు. 1950లో శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించి దాని పీఠాధిపతిగా వ్యవహరించారు.

హిందూమతం మానవాళికి ప్రసాదించిన గొప్ప బహుమతులలో భగవద్గీత అత్యంత ప్రధానమైనది. అది ఒక జ్ఞాన భాండాగారము, అమూల్యమైన మార్గదర్శి మరియు నిత్యజీవితపు నిఘంటువు. ఆంధ్రదేశంలో గీతాజ్ఞన వ్యాప్తికి చేయూతనిచ్చిన వారిలో శ్రీ విద్యా ప్రకాశానందులవారు అగ్రగణ్యులనడం నగ్న సత్యం, నిర్వివాదాంశము. వీరు రచించిన గీతామకరందము, వెలువరించిన గీతోపన్యాసములు, నిర్వహించిన శతాధిక గీతాజ్ఞాన యజ్ఞములే ఇందుకు చక్కని నిదర్శనాలు. ప్రపంచంలోనే ఉంటూ దానితో బంధింపబడకుండా ఉండే సామర్థ్యం, పాపపుణ్యాలు సుఖ దుఃఖాల మధ్యే మెలుగుచూ వాటి ప్రభావానికి లోను కాకుండా జీవించే మార్గాన్ని గీత ప్రబోధిస్తుందన్న విషయాన్ని సామాన్యులకు సైతము సవివరంగా అర్థమయ్యే రీతిలో వీరు కావించిన ప్రచారం అసామాన్యమైనది.

జనన మరణాల గొలుసులో బంధింపబడి, సుఖదుఃఖాలకు లోనవుతూ సంసార సాగరంలో పడి కొట్టుమిట్టాడుచు దిక్కుతోచని స్థితిలో నున్న పామర ప్రజానీకాన్ని దరిచేర్చే తరణోపాయాన్ని ప్రసాదించిన

మహనీయమూర్తి శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి.

" అర్జునా ! అధైర్యపడకుము. హేయమైన ఈ మనోదౌర్బల్యము నీ కేలదాపురించినది ?! " అన్న భగవానుని సందేశాన్ని తన సరళమైన మాటలలో ప్రజానీకానికి అందించిన శ్రీ స్వామివారు, మోహగ్రస్తులైన ఎందరో జనులను కార్యశూరులుగా ప్రేరేపించారు.

కర్మ ద్వారానే మనుజుడు సర్వోత్కృష్ట స్థితిని పొందగలడనియు, కర్మఫలముల యందు అనాసక్తిని కల్గియుండవలెననియు, ద్వంద్వములలో సమబుద్ధిని కల్గి ఉండవలెననియు మొదలగు గీతాతత్త్వ రహస్యములను సరళమైన భాషలో చమత్కారాలతో, పిట్ట కథలతో సామాన్యులకు సైతము అర్థమయ్యే రీతిలో సాగిన వీరి బోధ అసామాన్యము. శ్రీవారి ఈ జన్మదిన సందర్భంలో ఈ మహనీయునకు మనసా, వచసా శిరసా ప్రణామాలు సమర్పిస్తూ వారు చూపిన బాటలో పయనిద్దాం.

అన్నదాన నిధిగా ఈక్రింది వారు పైకం పంపినారు

01. శ్రీమతి ఆమంచి భారతి – (శ్రీకాళహస్తి)
తల్లి సంపూర్ణమ్మ పేరిట (భిక్షకు) – రూ. 15,000/-
02. చెలికాని వరప్రసాద్ – రూ. 21,000/-
(పోతేపల్లి, ద్వారాకా తిరుమల మండలం) మాఘశుద్ధ తదియనాడు భిక్ష

వీరందరిని శ్రీకాళహస్తీశ్వరుడు అనుగ్రహించు గాక !

ఆశ్రమ శివాలయ పూజానిధికి పైకం ఇచ్చిన వారు

01. శ్రీ విద్యాప్రకాశానంద సత్సంగ సేవాసమాజం (దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్) వడ్డీతో శివాలయ నిత్య పూజకు నిధి – రూ. 606716/-
02. పాబోతు సుబ్రమణ్యం (గూడూరు) – రూ. 20,000/-
03. పాబోతు సీతారామమ్మ (గూడూరు) – రూ. 20,000/-
04. పాబోతు సురేష్ (గూడూరు) – రూ. 10,000/-



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ ఆకాశాది జగత్సర్వమనృతం మాయికత్వతః ।
నానృతం బ్రహ్మ తేనైతత్సత్య మిత్యభిధీయతే ॥
(అనుభూతి ప్రకాశము. 2 – 8)

అర్థము : ఆకాశము మొదలగు జగత్తులోని వస్తుజాతమంతయును మాయికమైనందున అసత్యము (అనృతములు). బ్రహ్మ యనృతము కానందున సత్యమని చెప్పబడుచున్నది.

" సత్య శబ్దస్య బ్రహ్మణ్యసకృత్ప్రయుక్తత్వాత్ " (బ్ర.సూ. భాష్యే 3-3-310) సత్య శబ్దమునకర్థము " బ్రహ్మ" అని అనేక పర్యాయములు ప్రయోగించబడింది కదా !

శ్లో ॥ సర్వం సత్యం పరంబ్రహ్మ నచాన్యదితి యా మతిః ।
తచ్చ సత్యం వరం ప్రోక్తం వేదాంత జ్ఞానపారగః ॥
(జాబాల దర్శనోపనిషత్ – 1 –10)

అర్థము : సర్వము సత్యరూప పరమాత్మయే యున్నది. తద్వ్యతిరిక్తమన్య వస్తువెద్దియును లేదు అను నీ దృఢ నిశ్చయమేది గలదో దానినే వేదాంతనిష్ణాతులైన శ్రేష్ఠపురుషులు సర్వ శ్రేష్ఠ " సత్యమని" చెప్పిరి.
" సదానిరస్తకుహకం సత్యం పరం ధీమహి " (శ్రీ మద్భాగవతము 1-1-1)

ఎల్లపుడు మాయా తత్కార్యముచే పూర్ణతః విముక్తమైయున్న పరమ సత్యరూప పరమాత్మను మేము ధ్యానించుచున్నాము అని శ్రీ మద్భాగవత మంగళ శ్లోక పాదార్థము.

శ్లో ॥ సత్యవ్రతం సత్యపరం త్రిసత్యం, సత్యస్య యోనిం నిహితంచసత్యే।
సత్యస్య సత్యంబుతసత్య నేత్రం, సత్యాత్మకం త్వాం శరణం ప్రపన్నాః॥

(శ్రీ మద్భాగవతము 10 -2-26)

అర్థము : ప్రభో ! నీవు సత్యసంకల్పుడవు. నిన్ను పొందుటకు సత్యమే శ్రేష్ఠమైన సాధనమైయున్నది. సృష్టి, స్థితి, లయములను సత్యావస్థలలో గూడ నీవు సత్యరూపుడవై యున్నావు. వ్యావహారిక సత్యరూప ఆకాశాది పంచభూతములకు నీవే కారణమై యున్నావు. మరియు వాటిలో నంతర్యామిరూపముచే విరాజమానమై యున్నావు. నీవు ఈ దృశ్యమాన జగత్తుయొక్క పరమార్థ స్వరూపమై యున్నావు. నీవే మధురమైన వాణికి మరియు సమదర్శనమునకు నేత్రము (ప్రవర్తకుడ) లై యున్నావు. హే భగవన్ ! నీవే సత్యస్వరూపుడవు. మేము నీ శరణు జొచ్చియున్నాము.

"తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్" (తై. ఉ. 2 -6) పరమేశ్వరుడే ... రచించి) దానియందు తానే జీవ రూపముచే

ఎవరి కెఱుక ?

- ఆచార్య కె. పద్మోత్తమరావు (తిరుపతి)

... సర్వ క్షేత్రేషుభారత । (గీత 13 - 3) హే అర్జున ! ఈ దృశ్యమాన క్షేత్రముల (శరీరముల)లో క్షేత్రజ్ఞుడను అనగా జీవాత్మను నేనే (పరమాత్మను) అని తెలియుము. "ఆత్మా హి బ్రహ్మ" (తై. ఉ. ఉపోద్ఘాత భాష్యము) ఆత్మయే బ్రహ్మము పైనుదహరింపబడిన శ్రుతి, స్మృతి మరియు భాష్యోక్తుల ప్రకారము జీవాత్మ పరమాత్మచే నభిన్నుడని తెలియబడుచున్నందున "ప్రత్యగభిన్న పరమాత్మ యే" పారమార్థిక "సత్య"మని యెఱుంగవలయును. తద్భిన్నమసత్యము. 3.

ఏ మనుష్యుడు వాడి పొట్టను పోషించుకొనుటకు మాత్రమే వండుకొని ఒంటరిగా భుజించునో, పేద (ఆకలితో నలమటించు) ప్రాణుల యందు దయజూపడో, ఇంటికేతెంచిన యతిథికి యన్నమిడక, కోపగించి, బెదిరించి, భగ్నాశుని చేసి తన గృహద్వారము నుండి వెడలగొట్టునో వాడు యమునికి కానుక గాగలడు అనగా యమదండనకు గురిగాగలడని శ్రీ తుకారాం మహారాజు గారు నాలుగవ చరణములో తెలియజేయుచున్నాడు. ఈ విషయమున శాస్త్రసమ్మతమున్నది గనుక యథామతి శాస్త్రమును విచారించెదము.

హారతి పాట

- ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం

హారతి గొనుమా సద్గురు చంద్ర
హారతి గొనుమా సద్గుణ సాంద్ర
హారతి గొనుమా విద్యాప్రకాశా
హారతి గొనుమా శుకసంకాశ ॥ హారతి ॥

జనన మొందితివి కృష్ణాతటమున
జాహ్నవి తీరమున పెరిగితివి
కనక ముఖీ తటమున నెలకొంటివి
కాంతిపుంజ మై దారి చూపితివి ॥ హారతి ॥

మా తమ మంతయు మాపుటకొరకై
మాకు లభించిన మందారమవై
గీతను మార్చగ జనులకు నెల్లను
గీతా మకరందము పంచితివి ॥ హారతి ॥

ఎన్ని జన్మములు ఎంతో వ్యర్థము
ఇకనైనను త్వరపడుడని యంటివి
కన్న తల్లివలె కరుణ చూపితివి
కలకాలము మా ఎదలో నిలిచి ॥ హారతి ॥

గీతామకరంద ప్రదాత

- ఏ. సీతారామారావు (విజయనగరం)

మకరందం అంటే తేనె. తేనెటీగ ఎన్నో పూవుల నుంచి మధువును సేకరించి తేనె తుట్టెలో కూడ బెడుతుంది. ఎన్నో రకాల పుష్పాలతో ఉన్న మధుమిశ్రమమే తేనె. అదేవిధంగా శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వాములవారు ప్రధానమైన ఉపనిషత్సారమైన భగవద్గీత నుండే కాక, ప్రాచీన పురాణేతిహాసాల నుండి, శతాబ్దాలకు పూర్వమే రచించిన త్రిమతాచార్యుల భాష్యాల నుంచి ప్రాక్ప్రతీచీ పండితుల విశేషణాల నుంచి అమూల్యమైన విశేషాలను (మధువును) సేకరించి, క్రోడీకరించి, ఇంతవరకు వచ్చిన భాష్యాలకే భాష్యంగా భగవద్గీతను " గీతామకరందం "గా అందించారు పూజ్యపాదులు.

సాధుసత్పురుషుల సందర్శనం, ప్రవచనాలను వినడం, అట్టి మహనీయులతో సంభాషణం, ఆశీస్సులు పొందడం శుభాలను, మంగళాన్ని అందిస్తాయని శాస్త్ర వచనం. పవిత్రాత్మ స్వరూపులు, గీతామకరంద ప్రదాత అయిన శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి శతజయంత్యుత్సవ సభల్లో ఎందరికో అందిన అపూర్వ అదృష్టం. అప్పుడే రెండేళ్ళు గడిచిపోయాయి. అయినా ఆనాటి స్మృతులు ఎదలో అలాగే ఉన్నాయి.

ఆనంద మోహనుని (స్వామివారి పూర్వాశ్రమనామం) లో అప్రమేయమైన ధీశక్తిని గ్రహించిన పూజ్యులు శ్రీ మలయాళ యతీంద్రులు వారిని చేరదీయడం దైవసంకల్పం. శ్రీరామకృష్ణపరమహంసకు వివేకానందుని వలె శ్రీ మలయాళ యతీంద్రులకు అంతేవాసియై భారతీయ సనాతన ధర్మ వాఙ్మయాన్ని ప్రజలందరికీ చేరువయ్యేటట్లు చేయడంలో కృత కృత్యులయ్యారు.

విశేషమేమంటే, జన్మతః శ్రీ మలయాళస్వాములవారు సర్వసంగ పరిత్యాగియైనా, ఆనందమోహనునికి సన్న్యాస దీక్ష ప్రసాదించాలంటే ముందుగా తాను సన్న్యాసం స్వీకరించాలి. శ్రీ ఆదిశంకరులవలె దశనామ సంప్రదాయానుసారం తాము ముందుగా సన్న్యాస దీక్షను పొంది శ్రీ అసంగానందులుగా సన్యాసనామం స్వీకరంచాకే ఆనంద మోహనునికి సన్న్యాస దీక్షను ఇచ్చి శ్రీ విద్యాప్రకాశానందగిరియని నామకరణం చేశారు. ఇటువంటి ఘటన అపూర్వం. భారతీయ సనాతన ధర్మంలో కనుపించదు.

శ్రీ మలయాళ యతీంద్రుల అంతేవాసిగా, సన్న్యాసాశ్రమ నియమ నిష్ఠలను ఒకవైపు పాటిస్తూనే, గురువుల సంకల్పాలకు రూపకల్పన కావించడంలో స్వామివారి అకుంఠిత దీక్ష నిరుపమానమైనది. అప్పటికే సంస్కృతాంధ్రాంగ్ల హిందీ భాషలలో ప్రావీణ్యత సంతరించుకున్న స్వామివారు, గురువుల వద్ద వేదోపనిషత్తులను ఆమూలాగ్రం అధ్యయనం చేసి " గురువును మించిన శిష్యుడ' నిపించుకున్నారు.

గురువులచే ప్రతిష్ఠితమైన శ్రీ వ్యాసాశ్రమంకు అనుబంధంగా ఆంధ్రదేశమంతా పలుశాఖలు ఆవిర్భవించాయి. వ్యాసాశ్రమంచే ప్రకటితమైన అనేక శాస్త్ర గ్రంథాలలో శ్రీ విద్యాప్రకాశానందగిరి వారి ముద్రను చూడవచ్చు. శ్రీ స్వామివారు తమ గురువరేణ్యులలో శ్రీ వ్యాసుల వారినే దర్శించారు. అందుకే వారి అనుమోదంతో ప్రతిష్ఠించిన తమ ఆశ్రమానికి ' శ్రీ శుకబ్రహ్మాశ్రమం ' అని పేరిడినారు. ఆశ్రమ ఉద్ఘాటన గురువరేణ్యులే చేయడం విశేషం. ఆనాటి ఆహూతులందరూ ఆ గురుశిష్యులలో శ్రీ వ్యాస, శుకమునీంద్రులనే భావన చేయడం ఊహలకందనిది.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు జ్ఞానభాస్కరులు. కర్మసాక్షియైన సూర్యభగవానుడు తన కిరణములతో చీకటిని పోగొట్టినట్లు స్వామి వారు

తమ ప్రవచనాల ద్వారా అవిద్యతో అజ్ఞానంతో అలమటిస్తున్న అసంఖ్యాక ప్రజలలో ఆధ్యాత్మికతయనే జ్ఞాన పుంజాలను వారి హృదయాలలో నింపారు.

గురువుల ఆదేశానుసరించి పవిత్రమైన ఆధ్యాత్మిక సేవయే పరమార్థ సేవగా భావించి, వివేకానందుని వలె పర్యటనలు సలిపి, నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక విషమ పరిస్థితులు తొలగించడానికి అభేద దర్శనాత్మకమైన జ్ఞానలేమియే కారణమని గ్రహించి, వాటిని తొలగించే ప్రయత్నం జీవిత పర్యంతం చేశారు.

స్వామివారి ప్రవచనాలు శ్రవణానందకరం. ఉపమానపరంగా చెప్పాలంటే యమునా నదీ తీరంలో, చంద్రోదయ కాంతిలో శ్రీకృష్ణుడు మురళీ మ్రోయించగా, వ్రజ గోపికలంతా తమ తమ పనులన్నీ ప్రక్కన పెట్టి, వేణుగానలోలుని చుట్టూ చేరినట్లు, స్వామి వారు ప్రవచిస్తూన్నారని విన్నంతనే ఎక్కడెక్కడివారు అన్ని పనులు విడిచిపెట్టి వచ్చేవారు. మంత్రముగ్ధులై, అధ్యాత్మగంగలో మునిగి పరవశించేశారు.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు భగవద్గీతా ప్రవచనాలను, సప్తాహాలను, సభలను ఒక వంక నిర్వహిస్తూనే, పుంఖాను పుంఖంగా ఆర్షవాఙ్మయ గ్రంథాలను రచించారు. పలుభాషలపై పట్టు ఉన్న వీరి పాండిత్యం మిక్కుటమైనది. వారి కలం వెలువరించిన వాఙ్మయం వెలకట్ట లేనిది.

స్వామివారు రచించిన గ్రంథాలన్నీ విస్త ృతమైన పరిశీలనం, పరిశోధనం చేసిన తరువాత నిర్మించినవే ! అలా వచ్చినవే పంచరత్నాకరములు.

శ్రీ స్వామి వారి రచనా నైపుణ్యం తెలుసుకొనడానికి ఎంతో సమర్థవంతంగా, శాస్త్రాధారాలతో రచించిన " గీతామకరందం " ఒక్కటి చాలు. ఇది ఇంతవరకు వెలువడిన భాష్యాలకు, వ్యాఖ్యలకు భాష్యం అని

చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికే లక్షలాది ప్రతులు ముద్రణకు నోచుకుని, ప్రతి ఇంటిలో శ్రీ మద్భగవద్గీతతోపాటు గీతామకరందం కూడ ఉంటుందని తెలుసుకున్నప్పుడు విస్మయం కలుగుతుంది. ఈ గ్రంథం ఆంగ్ల, కన్నడ, తమిళ, హిందీ భాషలలో అనూదితమై ముద్రితమైన ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. శ్రీ స్వామివారు ఆధ్యాత్మిక విషయాలపై పలు గ్రంథాలు వ్రాయడమే గాక, అనుష్ఠాన వేదాంతం పరమావధిగా **" వేదాంతభేరి " మాస పత్రికను** ఆశ్రమంపరంగా మ్రోగించారు. సుమారు అర్ధ శతాబ్ది నుండి ఈ పత్రిక నిరాటకంగా ఆధ్యాత్మిక చింతనా పరులకు వరప్రసాదంగా ఉండడం ముదావహం.

ఆధ్యాత్మిక రంగంతోపాటు, మానవసేవయే మాధవసేవ అను దృఢసంకల్పంతో శ్రీకాళహస్తిలో, శ్రీ స్వామివారి పేరిట ఆధునిక విద్య అందించడానికి , కాలేజీలు ఏర్పాటు చేయడంతోపాటు, " ఇంద్రియాణాం నయనం ప్రధానం " అన్న చందంగా, కంటి చూపు కరువైన వారికోసం ఉచిత కంటి ఆసుపత్రి " త్రినేత్ర కంటి వైద్యాలయం " ఆశ్రమ ప్రాంగణంలోనే నిర్వహిస్తుండడం విశేషాంశం.

శ్రీ శుకబ్రహ్మాశ్రమం ఏ కోణంలో దర్శించినా అది నిజంగా దేవాలయమే ! శ్రీరామకృష్ణాద్యవతారములవలే శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు – స్వామి వివేకానంద, శ్రీరామానంద తీర్థ, శ్రీ రమణ మహర్షి వలె – భగవదంశ సంభూతులే !

శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకునే యాత్రీకులు శ్రీ శుకబ్రహ్మాశ్రమం తప్పక దర్శించి, వారి తేజోమూర్తికి వందనమాచరించి, శ్రీ స్వామి వారు నడయాడిన ఆ ప్రదేశంలో కాసేపు విశ్రమించగలిగితే తమ జీవితాలను ధన్యం చేసుకున్న వారౌతారనడంలో సందేహం లేదు.

పూజ్యులు శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి వారి
పాదపద్మములకు సమర్పితం

17వ సద్గురు ఆరాధన

పరమపూజ్యులు పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి **17వ ఆరాధనోత్సవము, 102వ జన్మదినోత్సవములు శ్రీ శుకబ్రహ్మాశ్రమం (శ్రీకాళహస్తి)లో 03-04-2015 నుండి 07-04-2015 వఱకు ఐదు రోజులు జరుగును.** అందు పాల్గొని తమ ప్రవచనలందించు మహాత్ములు.

01. పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారు
(**అష్టలక్ష్మీ పీఠాధిపతులు - తెనాలి**)

02. పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు
(**జగద్గురు సత్సంగ ఆశ్రమాధిపతులు, హైద్రాబాద్**)

03. పూజ్య శ్రీ డా॥ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు
(**గవి మఠ ఉత్తరాధిపతి, బళ్లారి**)

04. పూజ్యశ్రీ శ్రీహరితీర్థస్వాములవారు
(**శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతులు, ఇనమడుగు**)

05. పూజ్యశ్రీ రామకోటి రామకృష్ణానందస్వాములవారు
(**శ్రీపురీక్షేత్రాధిపతులు, ఈదుల బళ్ళాపురం**)

06. పూజ్యశ్రీ శంకరానందగిరిస్వాములవారు
(**శ్రీ దత్తాత్రేయాశ్రమాధిపతులు, మహేశ్వరం**)

07. పూజ్యశ్రీ ప్రణవానందగిరిస్వాములవారు
(**శ్రీ ఉమామహేశ్వర పీఠాధిపతులు, లత్తవరం**)

08. పూజ్యశ్రీ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ గారు
(**కాళీవనాశ్రమాధిపతులు, నంబూరు**)

09. పూజ్యశ్రీ మాతా జ్యోతిర్మయానంద భారతి స్వామిని వారు
(**శ్రీ షణ్ముఖానందాశ్రమాధిపతులు, పాలకొల్లు**)

10. పూజ్యశ్రీ మాతా ప్రతిభానందగిరి స్వామిని వారు
(**శ్రీ భూమానందాశ్రమాధిపతులు, గండిక్షేత్రం**)

11. పూజ్యశ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు
(**బ్రహ్మవిద్యా పాఠశాల ఆచార్యులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమం**)

12. పూజ్యశ్రీ కైలాసానందగిరి స్వాములవారు
(**శాంత్యాశ్రమాధిపతులు, కైలాసకోన, పుత్తూరు**)

సత్యంవద, ధర్మంచర

- బి.ఎన్. కల్యాణ సుందరం (బెంగుళూరు)

ధర్మము పరమాత్మ స్వరూపము. ధర్మము ముల్లోకాలకు ఆదర్శవంతమైనది. “ త్రైలోక్యే దీపకోధర్మః ” ధర్మము మన మానవీయ తను వికసింపజేస్తుంది. మన ఆచార వ్యవహారములు ధర్మసమ్మతమైనవి. “ సత్యాన్నాస్తి పరోధర్మః ”. సత్య సంకల్పము నుండి గోచరమగునది ధర్మము. రామాయణ మహాబారత గ్రంథముల ద్వారా ధర్మాధర్మముల పరిణామములు గ్రహించగలిగెదము. త్రేతాయుగమున శ్రీరామచంద్రుడవతరించి ధర్మస్థాపనగావించి “ రామోవిగ్రహావాన్ ధర్మః” అన్న పేరును గడించి లోకాభిరాముడుగా వెలుగొందినాడు. ద్వాపర యుగమున శ్రీకృష్ణుడవతరించి దుష్టుల శిక్షించి, శిష్టుల రక్షించి, భగవద్గీతను సృష్టించి, సత్య ధర్మముల బోధించి ఎల్లరిమనస్సుల హరియించి పరమపూజ్యుడై, జగద్రక్షకుడై పేరొందినాడు. హరిశ్చంద్రుడు “ త్రికాలాబాధ్యం సత్యం ” అన్న లోకోక్తి ననుసరించి సత్యానికి మించిన ధర్మం లేదని సత్యమే తనకు మార్గదర్శనమని ఆతని సత్యశీలతను నిరూపించ, అనేక కష్టనష్టాల కోర్చి విముక్తుడై సత్యహరిశ్చంద్రుడనెడి బిరుదును పొందగలిగాడు. పాండవాగ్రజుడైన ధర్మనందనుడు “ సత్యం కంఠస్య భూషణం ” అన్న శృతి వాక్యాన్ని బట్టి సత్యమే తన ఏకైక ధర్మమని భావించి సత్యశీలుడై, ధర్మబద్ధుడై, ప్రజల ప్రశంసలందుకున్నాడు. సత్య ధర్మాలకా దర్శమైన మనదేశమున అనేక రాజేంద్రులు, ఆచార్యులు, పండితులు, విద్వాంసులు, యతిశ్రేష్ఠులు, మఠాదిపతులు, కళాకారులు, రాజకీయ నాయకులు జన్మించి, వారి వారి ప్రతిభాశక్తుల నిరూపించి,

భారతీయ సంస్కృతిని, నాగరికతను, ఆచార వ్యవహారములను విస్తరించి మన దేశాభివృద్ధికై శ్రమించిన వారైరి. ఇటువంటి మహనీయులు మన దేశపు మార్గదర్శకులై వ్యవహరించడం వల్ల సత్యధర్మాలకున్న గొప్పతనం హర్షింపతగినది. అంతేకాక మన దేశ ప్రజలయందు కూడ వాటి ప్రభావం తప్పనిసరిగా వ్యాపించడమైనది. కాబట్టి మన సమాజంలో సత్యానికి మించన ధర్మముండదు. " తత్ సత్యం ఉత్తమాధీనం " సత్యమొక శక్తి స్వరూపిణి. సత్యము సర్వభూతాంతరాత్మ. మానవుడు సత్యాన్ని విస్మరించక తన నిత్యజీవితమందు సత్యమార్గమును పాటించడం శ్రేయస్కరంగా గుర్తించతగినది. అందుచేత మానవుడు సత్య సంకల్పమును పెంపొందించి, సత్ సంఘమాశించి, ధర్మ సమ్మతమైన సత్కార్యములు చేబట్టి సద్గుణశీలుడై రాణించవలెను. శ్రీ కృష్ణ పరమాత్మ ధర్మ సమ్మతమైన కర్మాచారము లన్నియూ అతనిరూపములుగ పేర్కొన్నారు." శరీర మాద్యంఖలు ధర్మ సాధనం " మన దేహము ధర్మాచరణ నిమిత్తమై సృష్టించబడినది. భగవద్గీతయందు శ్రీ కృష్ణ పరమాత్మ ధర్మమునుద్దేశించి బోధించినదేమనగా.

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానం అధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥

మానవుడు ధర్మమార్గమును విసర్జించి అధర్మ మార్గమనుసరించి నంత పరమాత్ముడవతారమెత్తి అధర్మాన్ని రూపుమాపి, ధర్మస్థాపన గావింతునన్నాడు. అందుచేత గీతాచార్యులు బోధించిన ధర్మ సూక్తులను అనుసరించినవారు కైవల్య పదవికి అర్హులు కాగలరు. ఈ ధర్మ సూక్తులను ఉపనిషత్తులు మరియు ఆధ్యాత్మిక గ్రంథముల ద్వారా గ్రహించగలిగెదము.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు దేహాభిమానము చేత, ఆహార విహారాదులచేత సంభవించుచున్నవి. ఈ అరిషడ్వర్గములు అధర్మానికి నిదర్శనములు. వీనిని పూర్తిగా వదలి పెట్టవలయును.

వార్తలు

(01). 21-03-2015 తేది శుక్రవారం శ్రీ మన్మథనామ సంవత్సర చైత్రశుద్ధ పాడ్యమి ఉగాది సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శ్రీ నర్మదేశ్వర మహాదేవునకు ప్రాతఃకాలంలో రుద్రాభిషేకము, బిల్వార్చన జరిగినది. భగవద్గీత ఉపనిషత్తుల సమిష్టి పారాయణ జరిగినది. సాయంకాలం వేదపారాయణ పంచాంగ శ్రవణం జరిగినది.

(02). (ఎ). 05-03-2015 తేది ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా గురువారం ఆశ్రమంలో గురుపాదుకలకు అభిషేకం, పూజ జరిగినది. (బి). 0-03-2015 తేది ఏకాదశి ఆదివారం నాడు 16-03-2015 ఏకాదశి సోమవారం నాడు, 31-03-15 ఏకాదశి మంగళవారం నాడు అధిష్ఠాన మందిరంలో భగవద్గీత 18 అధ్యాయాలు అఖండ పారాయణ జరిగినది. (సి). 19-03-15 తేది గురువారం మాసశివరాత్రి సందర్భంగా ప్రదోషకాలంలో ఆశ్రమ నర్మదేశ్వర మహాదేవునకు అభిషేకం, అర్చన జరిగినది. (డి). 25-3-2015 తేది బుధవారం నాడు కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో ప్రదోష కాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అర్చన జరిగినది.

(03). 28-3-15 తేది చైత్ర శుద్ధ నవమి శనివారం శ్రీరామనవమి సందర్భంగా ఆశ్రమంలో శ్రీరామచంద్రునకు షోడశోప్రచారపూజ, సహస్రనామార్చన జరిగి నారాయణ సేవ (ఏనాది బాల బాలికలకు భిక్ష) చేయబడినది.

(04). 1-03-15 తేది ఆదివారం ఆశ్రమ గ్రామీణ వైద్య సేవా శిబిరం తొట్టంబేడు మండలం కాళంగి గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగినది. తిరుపతి నుండి ఎనిమిది మంది స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొని వైద్య సేవలందించారు. 290 మందికి వైద్య పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. మందులను ఆశ్రమ సద్గురు సర్వసేవా ట్రస్టుచే ఉచితంగా ఇవ్వబడినది.

(05). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఫిబ్రవరి నెలలో **ఓ.పి.లో 734 గురికి** కంటి పరీక్షలు చేసి చికిత్సలు చేయబడినవి. **102 మందికి కంటి పొరలు** ఆపరేషన్ చేసి లెన్సు అమర్చబడినవి. ఫిబ్రవరిలో కాటూరు, పూడి, కోవనూరు గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి.

సద్గురువాణి

నావచే సముద్రమును దాటునట్లు, విచారణజ్ఞానముచే సంసారమును, ధ్యానముచే మాయను, యోగముచే మనస్సును, ధైర్యముచే లోకమునున్నూ దాటవచ్చును.

* * *

వర్షముచే దావాగ్ని శమించునట్లు భక్తిచే తాపత్రయాగ్ని, ప్రేమచే ద్వేషబుద్ధి, అమృతత్వముచే మృత్యువు, పారిశుద్ధ్యముచే మాలిన్యము శమించును.

* * *

నీళ్లచే నిప్పును చల్లార్చునట్లు శాంతముచే కోపమును, సత్యముచే అసత్యమును, ధర్మముచే అధర్మమును, శ్రద్ధచే ఆలస్యమును జయించవలయును.

* * *

ప్రకాశముచే తమస్సును (చీకటిని) జయించునట్లు, కరుణచే కాఠిన్యమును, త్యాగముచే లోభమును, విరాగముచే రాగమును, దయచే భేదబుద్ధినిన్ని జయించవలయును.

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

Regd.No. TRP / 123 / 2015-17 April 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-03-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

______	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టై ఫెండ్	: నెలకు రూ. 1,000/-
______	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టై ఫెండ్	: నెలకు రూ. 3,000/-

అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

______	(సామవేదము/అథర్వవేదము-వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
______	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని ందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. వసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు ధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

egd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020

Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,

E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

మే 2015 రూ. 6/-



చిత్తశుద్ధిలేక
ఆత్మానుభూతి కలుగదు

భగవద్దర్శనమునకు రెండు విషయములు ప్రతివారికి అత్యవసరములు. అవి 1. ప్రయత్నము 2. చిత్తశుద్ధి.

క్షేత్రమును బాగుగ దున్ని, కలుపుతీసి, శుద్ధము చేసి, ఎరువుచల్లి ఆపిదప విత్తనును వేసినచో చక్కగ పైరగును. అట్లుగాక దున్నక, కలుపు తీయక విత్తనమును వేసినను, ఊషర క్షేత్రమున వేసినను ఆ విత్తనము మొలవదు. ఒకవేళ మొలచినను పెరుగదు, పెరిగినను సైరన ఫలితాన్నివ్వదు. అట్లే సాధకుడు సాధకన చతుష్టయ సంపత్తి మొదలగువానిద్వారా చిత్తమును ముందుగా శుద్ధి మొనర్చుకొనినచో ఆత్మవిచారణ ధ్యానాదులచే అతి సులభముగ ఆత్మనుభూతి కలుగదు. అట్లు చేయనివారు ఎంత ప్రయత్నించినను ఆత్మానుభూతిని పొందజాలరు.

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 మే 2015 సంచిక : 5

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju at Aruna Graphics Press , Rayaji Street, Nellore-524 001, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 మే 2015 సంచిక : 5

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. దుర్గుణజయోపాయములు- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06

03. అనన్యభక్తి - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 11

05. ఎవడు బ్రాహ్మణుడు - బుద్ధుడు - 17

06. జ్ఞానసుధ - శంకరానందగిరి స్వాములవారు - 19

07. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి -22

08. ధర్మపదం కథలు - బోధ చైతన్య - 24

09. శ్రీ బుద్ధభగవానుడు సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వామి - శ్రీమతి బొప్పన అరుణాదేవి - 27

10. పురందరదాసు పద చమత్కారం - ఆచార్య డా॥కె.సర్వోత్తమరావు - 33

11. మహాపరిత్తం - 34

12. భక్తతుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు- 36

13. సత్యంవద ధర్మంచర - బి.ఎన్. కల్యాణ సుందరం - 38

14. డా॥ సముద్రాల లక్ష్మణయ్యకు విశ్వభారతీ పురస్కారం - 40

15. గోమాత గోడు - మిట్టపల్లి శంకరయ్య - 41

16. వార్తలు - 42

ముఖచిత్రం :

అహింసామూర్తి గౌతమ బుద్ధుడు

ప్రార్థన

ఓం రం రం రం రక్తవర్ణం దినకరవదనం తీక్ష్ణదంష్ట్రాకరాళం ।
రం రం రం రమ్యతేజం గిరిచలనకరం కీర్తిపంచాది వక్త్రమ్ ।
రం రం రం రాజయోగం సకలశుభనిధిం సప్తభేతాళభేద్యం
రం రం రం రాక్షసాంతం సకలదిశయశం రామదూతం నమామి ॥

ఓం ఖం ఖం ఖం ఖడ్గహస్తం విషజ్వరహరణం వేదవేదాంగదీపం
ఖం ఖం ఖం ఖడ్గరూపం త్రిభువన నిలయం దేవతా సుప్రకాశమ్ ।
ఖం ఖం ఖం కల్పవృక్షం మణిమయ మకుటం మాయమాయాస్వరూపం
ఖం ఖం ఖం కాలచక్రం సకలదిశయశం రామదూతం నమామి ॥

ఇం ఇం ఇం ఇంద్రవంద్యం జలనిధికలనం సౌమ్యసామ్రాజ్యలాభం
ఇం ఇం ఇం సిద్ధియోగం నతజనసదయం ఆర్యపూజ్యార్చితాంగమ్ ।
ఇం ఇం ఇం సింహనాదం అమృతకరతలం ఆది అంత్య ప్రకాశం
ఇం ఇం ఇం చిత్స్వరూపం సకలదిశయశం రామదూతం నమామి ॥

సం సం సం సాక్షిభూతం వికసితవదనం పింగళాక్షం సురక్షం ।
సం సం సం సత్యగీతం సకలమునినుతం శాస్త్రసంపత్కరీయమ్ ।
సం సం సం సామవేదం నిపుణసులలితం నిత్యతత్త్వ స్వరూపం
సం సం సం సావధానం సకలదిశయశం రామదూతం నమామి ॥

హం హం హం హంసరూపం స్ఫుటవికటముఖం సూక్ష్మసూక్ష్మావతారం
హం హం హం అంతరాత్మం రవిశశినయనం రమ్యగంభీర భీమమ్।
హం హం హం అట్టహాసం సువరనిలయం ఊర్ధ్వరోమం కరాళం
హం హం హం హంసహంసం సకలదిశయశం రామదూతం నమామి॥

13- 05-2015 హనుమజ్జయన్తి



దుర్గుణజయోపాయములు

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మనస్సునందు అనేక జన్మలనుండి బాగుగ పేరుకొనిపోయి, నిగూఢములై యున్న దుర్గుణములను తొలగించుటకు సాధకుడు కొన్ని యుక్తులను ఉపాయములను అవలంబించ వలసియుండును. ఆ ఉపాయములు భాగవతమునందు ఈ క్రిందివిధముగ చక్కగ వర్ణింపబడియున్నవి.

అసంకల్పాజ్జయేత్కామం క్రోధం కామ వివర్జనాత్
అర్థానర్థేక్షయా లోభం భయం తత్త్వావమర్శనాత్.

(భాగవతము 7-15-22)

“ సంకల్పములను వదలివేయుట ద్వారా కామమును, కామమును (కోరికలను) త్యజించుట ద్వారా క్రోధమును, ప్రాపంచిక వస్తుసంపదల యందు అనర్థమును చూచుట ద్వారా లోభమును, తత్త్వవిచారణచే భయమును జయించవలయును ’ అని ఈ శ్లోకము యొక్క తాత్పర్యము.

ఈ శ్లోకము భాగవతమునందలి సప్తమస్కంధములో పదునైదవ ఆధ్యాయమందు కలదు. నారదుడు ధర్మరాజునకు మోక్షప్రాప్తికి వలసిన సాధనల నుపదేశించుచు ఈ శ్లోకమును జెప్పెను. దీనియందు కామ, క్రోధ, లోభ, భయములను నాలుగు దుర్గుణములను మనుజు డెట్లు జయించగలడో ఆ పద్ధతులు పేర్కొనబడినవి.

1. కామము : సంకల్పమును వదలి వేయుట ద్వారా దీనిని జయించవచ్చును.

2. క్రోధము : కోరికలు లేకుండుటచే ఇది వశపడును.

3. లోభము : ప్రాపంచిక సంపదలందు అనర్థమును వీక్షించుట ద్వారా దీనిని జయించవచ్చును.

4. భయము : తత్త్వవిచారణచే ఇది తొలగిపోగలదు. ఈ నాలుగు దుర్గుణములను గూర్చి యిపుడు బాగుగ విచారించెదము.

కామము :

శ్లో ॥ కామ జానామి తే మూలం సంకల్పాత్త్వం హి జాయసే
న త్వాం సంకల్పయిష్యామి సమూలస్త్వం వినశ్యసి.

" ఓ కామమా ! నీ 'అంతు'నే నిపుడు కనుగొంటిని, సంకల్పము నుండియే నీవు పుట్టుచున్నావు. నిన్ను నేనిక సంకల్పించను. కాబట్టి నీవు సమూలముగ నశించిపోగలవు " అని పూర్వము కచుడను మహర్షి పలికిన చందమున కామము సంకల్పమునుండియే ఆవిర్భవించును. గావున కామ జయమునకు ఉపాయము (కామ) సంకల్పత్యాగమే అయి యున్నది. శ్రీకృష్ణపరమాత్మయు గీత రెండవ అధ్యాయమందు " విషయములను గూర్చి సంకల్పించుటవలన వానితో మనుజునకు సంగమేర్పడగలదనియు, అట్టి సంగమువలన కామ ముద్భవించగలదనియు (సంగాత్సంజాయతే కామః) స్పష్టముగ బోధించియున్నారు. కాబట్టి కామావిర్భావమునకు తత్సంబంధమైన సంకల్పమే మూలకారణము. విచారణాబలముచే అట్టి సంకల్పమును విడనాడుటచే ఇక కామమునకు బీజము నశించినట్లే యగును. దానిచే నయ్యది సమూలముగ ధ్వంసమైపోవును. కాబట్టి కామమువలన అనర్థమే వాటిల్లునను వివేకము గల్గి తత్సంబంధమైన సంకల్పము హృదయమున అసలు పుట్టకుండగనే చూచుటవలన కామము సంపూర్ణముగ జయించి వేయబడుచున్నది.

జీవులకు కామమను దుర్గుణము మోక్షమార్గమున

మహాప్రతిబంధకమై యున్నది. అది ' మహాశన ' మని, మహాపాపజనకమని గీతయందు వర్ణింపబడినది. అనగా ఎంత అనుభవించినను తృప్తిలేనిదనియు, మహాపాపమును గలుగజేయుననియు అర్థము. అది నరకద్వారమనిగూడ భగవానుడొకచోట పేర్కొనియుండెను. కాబట్టి అద్దానిని జయించుట అత్యవసరమై యున్నది. దానిని గూర్చిన సంకల్పమును గావింపకుండుటయే తజ్జయోపాయమని ముముక్షువు లెఱింగి, ఈ ప్రకారముగ తమ హృదయకుహరమునుండి కామమును పెకలించి వేసి పరమశాంతిని అనుభవించవలయును.

క్రోధము : కామ క్రోధ లోభములను నరకద్వారముల మూడింటిలోను రెండవది క్రోధము. ఇదియు గొప్ప దుర్గుణము. కామమువలె నిదియు రజోగుణ జనితమైనది. క్రోధము ప్రవేశించినపుడు మనస్సు కల్లోలముతో గూడి మహావిక్షేపయుక్తముగ నుండును. "కామాత్క్రోధోభిజాయతే ' అనునట్లు సామాన్యముగ క్రోధము కామము నుండియే ఆవిర్భవించుచుండును. కావున క్రోధమును జయించవలెననిన దానికి హేతువగు కామమును తొలగించుకొనవలయును. ఈ రహస్యమే ' క్రోధం కామ వివర్జనాత్ ' అను భాగవతశ్లోకమునందు తెలుపబడినది. క్రోధమునకు కామము బీజము కావున కామము తొలగుటచే క్రోధమున్ను తొలగుచున్నది. కాబట్టి క్రోధజయోపాయము కామనాత్యాగవే అయియున్నది.

ముముక్షువగువాడు క్రోధమునుగూర్చి ఈ క్రింది విధముగ సంబోధించవలయును.

' ఓ క్రోధమా ! ముముక్షువులమైన మాకు నిన్ను జూచినచో ఏ విధమైన భీతి ఉండబోదు. అక్రోధమను సుగుణమును ప్రయత్నపూర్వకముగ

అభ్యసించుచున్న మాకు క్రోధమను నీవు చుక్కెదురు అయినప్పటికిని, నిన్ను జయించుటకు కావలసిన పరికరములన్నియు మాయొద్ద నిలవయుండుటచే నీబోటి వారెందఱు వచ్చినను మాకు దిగులు లేదు. నీవు నీ చుట్టములగు కామము, లోభము, ద్వేషము, రాగము మొదలైన వారందఱిని తీసికొనివచ్చినప్పటికిని మహాత్ముల సాంగత్యము చక్కగా చేసియున్న మాకు నీవేలాటి అపకారమున్ను చేయజాలవు. క్రోధమా ! నీ ప్రతాపము అవివేకులయొద్దనే చెల్లును. వివేకవంతులదగ్గఱ, భగవద్భక్తుల వద్ద నీ ఆటలు సాగవు. నీ పప్పులు వారి వద్ద ఉడకవు. వారు అహోరాత్రములు బహుజాగరూకులై, దైవసంపత్సమేతులై నీబోటి అసురసంపద్రూపులను దఱికి జేర్చకుందురు. అంతియేకాదు, దూరముగ గెంటివేయుదురు కూడను. రామనామము, కృష్ణనామము, శివనామమున్నగునవి సదా జపించుచుండు పరమభాగవతోత్తముల కడ నీపస చెల్లదు. కాబట్టి పలాయనము చిత్తగింపుము. '

ఓ క్రోధమా ! గీతయందు శ్రీకృష్ణ పరమాత్మ నీవు రజోగుణసముద్భవుడవని, జ్ఞానులకు నిత్యవైరివని, నరక ద్వారమని వర్ణించి చెప్పెను. కాబట్టి ఇప్పటికైనను బుద్ధి తెచ్చుకొని ఎవరినీ బాధింపక, ఎక్కడనైనా ఏకాంతమునకు బోయి కాలము గడపుము. భక్తజనులుండు చోటునకు నీవు రానేవద్దు. వచ్చితివా నీకు తగినశాస్తి జరిగియే తీరును. ఏలయనగా, నిన్ను జయించుటకు వారిదగ్గఱ చక్కని ఆయుధములు సమకూడియున్నవి.ఆ ఆయుధము లెవ్వియని అడిగెదవేమో, కొన్నిటిని మచ్చుకు చెప్పెదను వినుము.

(1). ఎవరికైనను క్రోధము వచ్చినచో వెంటనే నవ్వుట.

(2). అందఱును భగవత్స్వరూపులే కాబట్టి ఇక ఎవరి మీద క్రోధము ? అని తలంచుట.

(3). క్రోధముపై క్రోధమును జూపుట.

(4). క్రోధమను మానసికరంగము వచ్చీరాకమునుపే దానిని సాక్షిగ గమనించి తొలగించి వేయుట.

(5). జీవితము క్షణికము కాబట్టి బ్రతికిన కొద్దిరోజులు భగవత్స్మరణచేయక ' ఈ పాడు వికారము లేమి ? ' అని తలంచి సిగ్గుపడుట, ఈప్రకారముగా భక్తజనులు చక్కటి ఆయుధములను సమకూర్చుకొని క్రోధమగు నిన్ను పరిమార్చుటకై సిద్ధముగ నున్నారు. కావున వారి జోలికి పోకుము.

ఈ ప్రకారముగ క్రోధమునకు హెచ్చరిక చేసి ముముక్షువు అద్దానిని దరికి చేర్చరాదు. కోపము కల్లువంటిది. అది మనుజునియందు ప్రవేశించునపుడు అతని స్వరూప స్వభావములే మారిపోవును. ముఖము వికృతమగును. చిత్తము వికలత్వమును జెందును. క్రోధము యొక్క ఉద్రేకము శరీరమునందలి నరముల క్రమమును చెడగొట్టును. సూక్ష్మశరీరముపై ఒత్తిడిని కలుగజేయును. మనస్సునందు కలిగెడు కోపావేశముయొక్క ఫలితము కొద్ది కాలములో ఒకవేళ తగ్గిపోయినను ఆ స్పందనము (Mental wave) కొన్ని రోజులవఱకు, లేక కొన్ని వారములవఱకు లింగశరీరమందు నిలిచియుండును. ఆ పుండు మానుటకు చాలాకాలము పట్టును. ఈ ప్రకారముగ కోపముయొక్క దారుణ ఫలితములను తెలిసికొని విజ్ఞుడగువాడు దానికి ఆహుతి కాకుండ చూడవలయును.

గృహస్థ జీవితం గడుపుతూ సాధన చేయడం కోటలో వుంటూ యుద్ధం చేయడంలాంటిది. సన్న్యాస జీవితం కోట బయట వుండి యుద్ధం చేయడం లాంటిది. శ్రీరామకృష్ణ పరమహంస అనేవారు కోట లోపల వుండి యుద్ధం చేయడం కన్నా కోట బయట ఉండి యుద్ధం చేయడం ప్రమాదకరం. కాబట్టి గృహస్థులు స్వధర్మాన్ని నిర్వర్తిస్తూ ఆధ్యాత్మిక సాధనలను అనుష్ఠించాలి.
(ఏప్రిల్ రామకృష్ణ ప్రభ నుండి)

అనన్య భక్తి

(మార్చి తరువాయి)

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

3. మూడవ భక్తి ముందు చెప్పిన రెండింటికన్న విలక్షణముగా మరి యొకటి గలదు. దీని ననుసరించువాడు అనేకత్వములో ఏకత్వము కనుగొనుటయే అనన్యభక్తి యని తలంచును. అనేక పాత్రలలో జలము నుంచిన అన్నిటిలోను సూర్యప్రతిబింబము ఏలాగున ఒకేవిధముగా గోచరించునో లేక అనేకరకములగు మణులలో ఒకేసూత్రము ఏలాగున వ్యాపించియుండునో అలాగున పిపీలికాది సమస్త ప్రాణికొట్లలోనే గాక, సర్వపరమాణువులలోను గూడ ఆ పరబ్రహ్మమే, ఆ పరమాత్మయే, ఆతనియొక్క యిష్టదైవమే ప్రకాశించుచుండునని కనుగొనును. పాత్రములయొక్క ఆకృతులు అనేక ప్రకారములుగా నుండినను, లేక అనేక విధములగు లోహములతో చేయబడినవి యైనను అనేక వర్ణములతో గూడినవిగా నుండినను అన్నిటిలోను భాస్కరుని ప్రతిబింబము ఒకే విధముగా నుండును గదా ! ఆలాగున సర్వేశ్వరుండు సర్వచరాచరములలో వెలుగుచుండునని తెలిసికొనును. ముందు చెప్పబడిన భక్తులయొక్క భగవత్స్వరూపములన్నియు ఇట్టి సర్వాంతర్యామియైన యీశ్వరుని నుండి గల్గినవి యనియు, ఆ దివ్యమూర్తులన్నియు సముద్రములో నుండి అలలు ఏర్పడినట్లుండుననియు, తరంగములు ఏలాగున సముద్రమున కన్యములు గావో ఆలాగున అఖండదివ్యమూర్తియగు పరమాత్మనుండియే ఈ భక్తులయొక్క దివ్యఉపాసనామూర్తులు గలిగియుండుననియు గోచరించును. ఇది రెండవ భక్తికన్న వేలకొలది రెట్లు విశాలభావముతోను, విశుద్ధగుణములతోను గూడియుండును. పర్వతములనుండి ఏర్పడిన స్రోతస్సు లన్నియు సముద్రములో ఐక్యమగునట్లు ఈ అవతారము లన్నియు

పరబ్రహ్మమునుండి ఉద్భవించినవి యనియు, నదుల నాశ్రయించినవారు క్రమముగా సముద్రమును జేరునట్లు పై పేర్కొనబడిన దైవములలో భక్తి గలిగినను ఆఖరున అందరును ఆ పరమాత్మనే పొందుదురనియు గ్రహింపగల్గును. ఇట్టి భక్తి స్మృతులలోను, ఉపనిషత్తులలో కొన్నిటిలోను పేర్కొనబడియున్నది.

ఇట్టి భావము గలుగని వ్యక్తిగతమైన భక్తియుండిన అనగా పై నిరూపింపబడిన శ్రీశివ, శ్రీకృష్ణ, శ్రీరామ, శ్రీనారాయణభక్తులలో ఒకదానిలో మాత్రమే మోక్షము గలుగునని వాదించెడు శాస్త్రములను క్రోడీకరించి కోట్లకొలది నిరూపింపగలవారై యితరులయొక్క పవిత్రభక్తి మార్గమును ఖండనము చేయదలంచువాడు ఒకవిధమగు భ్రాంతి ఆస్పత్రులలో గల పిచ్చివారలలో చేరిన ఒక్క భ్రాంతుడనియే విజ్ఞానులు గ్రహింపగల్గుదురు. అయితే ఇతడు బోధహీనులైన పిచ్చివారలవంటివాడు కాజాలడు. వీనియొక్క భక్తికి పరిపక్వదశ గల్గునప్పుడు అజ్ఞానావరణములు దహించిపోయి, హృదయ గ్రంథి వీడిపోయి నీటిలో కరిగిన ఉప్పు ఏలాగున నీరైమారునో, ఆలాగున పూర్ణదైవమయమై మారెడు కాలమొకటి వచ్చును. లేక జన్మమొకటి గల్గును. వీరి జీవితము అప్పుడు ధన్యమగును. అప్పుడు పర్వతపంక్తి నుండి పొంగి ప్రవహించెడు నది యేలాగున కట్టలన్నిటిని త్రెంచివేసి అతివేగముగా పరుగెత్తి మహాసముద్రములో ప్రతిబంధములను అనగా హద్దులను భేదించి తీవ్రగతిని పొంది జ్ఞానానందసాగరమయుడగు బ్రహ్మమును తనయొక్క యిష్టదైవమును పొందగలుగును.

నాల్గవది – అన్యముగాక యుండెడి అవస్థనే అనన్యమందురు. అచ్చట అనేకములు లేవు. ఏకమే యుండును. ఆభరణముల నేకములైనను సువర్ణమేకముగాను, యంత్రము లనేకములై యుండినను, ఇనుము ఏలాగున ఏకముగాను, విగ్రహము బహువిధములుగా కనుపించినను కంచు ఒకటిగాను, వస్త్రము లనేకరకములుగా కనుపించినను దూది ఏకముగానుండునట్లు ఒకే దైవముయొక్క ఏకరూపమే యీ కానుపించెడు

అనేక రూపములని గ్రహింపగల్గును. అదే పూర్ణమైన భక్తి. ఇదే యుత్తమమైన యుపనిషత్ప్రతిపాదితమగు అనన్యభక్తి . ఇదే వేదములయొక్క అంతమనబడు వేదాంతము. లేక వేదాంతసారము. ఇచ్చటికి కాలక్రమముగా పై నుదాహరింపబడిన భక్తిమార్గములనెడి నదీనదము లన్నియు వచ్చిచేరును. ఇది సాగరము, నదీనదములన్నియు ఋజువక్రములై ప్రవహించినను, ఉత్తర, దక్షిణ, పశ్చిమ, పూర్వవాహినులై ప్రవహించినను, చిన్నవి పెద్దవిగా గమించినను, అన్నియు ఈ జ్ఞాన సముద్రములోనికే వచ్చి చేరుచుండును. ఇచ్చట చేరువరకు నిమ్నోన్నతము లనెడు ఉచ్చ – నీచజన్మములెత్తి సుఖదుఃఖము లనుభవించి నిలకడలేక మందమందముగా గాని, తీవ్రముగా గాని ప్రయాణము చేసి వచ్చిచేరును. శ్రమతో నడచివచ్చెడు బాటసారి గమ్యస్థానము చేరి సుఖించునట్లు అనేక జన్మములెత్తి సంసార మరుభూమిలో తాపత్రయాగ్నిచే తపించి ఇచ్చటికి వచ్చెడు జీవులయొక్క శ్రమ అంతరించును. అప్పుడు జీవి అమృతత్వము నొందును. తమస్సులోనుండి ప్రకాశములోనికి ప్రవేశించును. మృత్యువునుండి అమృతములోనికి జొరబడిన వాడగును. అజ్ఞానమునుండి జ్ఞానములోనికి వచ్చిన వాడగును. ఇచ్చట అతని హృదయగ్రంథులన్నియు వీడిపోవును. సంశయములన్నియు అస్తమించును. కర్మకట్టెలన్నియు కాలిపోవును. అపుడు అసత్తునుండి సత్తులోనికి వచ్చినవాడగును. ఈ పదవిని ఉపనిషత్తు లీలాగున వర్ణించుచున్నవి.

భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వసంశయాః ।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మి న్ దృష్టే పరావరే ॥
యదా సర్వే ప్రముచ్యంతే కామాయే 2 స్య హృది శ్రితాః ।
అథ మర్త్యో 2 మృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥
ఏకో వశీ సర్వభూతాంతరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి ।
తమాత్మస్థం యే 2 నుపశ్యంతి ధీరాస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్॥

దీని అర్థము లన్నియు పై చెప్పిన వానిలో అంతర్భూతములై

యున్నవి. ఇచట శ్రీ బుద్ధదేవుడు కనుగొనిన నిర్వాణపదవి ఇదే యని గోచరించును. ఇచ్చటనే శ్రీ శంకరులు ఉపదేశించిన అద్వయ బ్రహ్మాభావమని బోధ గలుగును. ఇచ్చటనే శ్రీరామానుజులువారును, శ్రీ మధ్వలును తెలిపిన పరమపద మని అవగాహనము గలుగును. శాస్త్రములను మాత్రము పరిశీలించినవారలు వీనిలో కొన్నిటిని పరమపదవు లని నమ్మకపోవచ్చును. అయితే వానిని బోధించిన మహాపురుషు లందరును దుఃఖమును దాటినవారలే. వారుపదేశించినదే పరమకాష్ఠయనియు, జీవులకు అంత్యప్రాప్యమనియు, కేవలము దుఃఖరహిత పరమానంద పదవియనియు నమ్మియుండిరి. బ్రహ్మమతస్థులయొక్క బ్రహ్మముగూడ ఈ దైవపదవియే యని జ్ఞానము గల్గును. ఆర్యసామాజికులయొక్క యీశ్వరప్రాప్తియు ఈదైవస్థలమే యని జ్ఞప్తిలో గనుగొనగల్గును. అచల సాంప్రదాయులయొక్క అచలమున్ను పరిపూర్ణవాదులయొక్క వాదభేదరహితమున్ను ఇదియే యని బోధగల్గును. ఇచ్చోటనే శూన్యవాదులయొక్క దృశ్యశూన్యపదవి యని గూడ తెలియనగును. యోగులయొక్క నిర్వికల్ప సమాధి నిలయమును ఇచ్చోటనే అగును. ఇచ్చోటికి వెళ్ళునపుడే కురుడు కొబ్బరిపీచు నుండియు, చిప్పనుండియు స్వయముగా వేరుపడునట్లు ప్రకృతినుండి ఆత్మ వీడిపోవుచుండును. చింతకాయ పండునప్పుడు దానియొక్క తోడునుండి వదలిపోవునట్లు, మాయోపాధి నుండి యీ ఆత్మ విముక్తిపొందును. ఇచ్చో సర్పము కాలపరిపక్వత వచ్చునప్పుడు కుబుసమును విడుచునట్లు అజ్ఞానమనెడు ఆవరణమును మెల్లమెల్లగా ఈ ఆత్మ దైవమయమై విడిచిపెట్టును. సమయము సరిగా వచ్చునప్పుడు పండు చెట్టు నుండి స్వయముగా ఊడిపడునట్లు అనాది మాయావృక్షము నుండి ఈ ఆత్మ స్వయముగా విముక్తినొందును. అగ్నిలో వేసి తిత్తితో ఊదబడెడు లోహము లన్నియు ఏలాగున క్రమక్రమముగా అగ్నిమయముగా మారునో అట్లు దృక్కగు ఈ యాత్మయందు దృశ్యములగు దేహేంద్రియములన్నియు ఆత్మమయమై మారుచుండునది కనుగొనవచ్చును. అగాధజలములో

పడవేసిన ఉప్పుబొమ్మ చిన్నచిన్నగా కరిగి కరిగి జలమయమై పోవునట్లు ధ్యేయమగు దైవాకారమై మారునట్లు గోచరించును.

ఓహో ! ఎంతసుఖము. ఓహో ! ఇది అమృతఘనీభూతముగదా ! ఓహో ! యేమి మాధుర్యము ! ఎట్టి అద్భుతము ! ఓహో ! ఇది అమృత సాగరమా ! లేక జ్ఞానగిరియా ? ఓహో ! ఇచ్చట మనస్సు మననము చేయజాలక నిలిచిపోవుచున్నదే ! ఇచ్చట బుద్ధి నిశ్చయము జేయనొల్లక నిశ్చేష్టత్వము నొందుచున్నదే ! ఇచ్చట చిత్తము చింతనము చేయజాలక సంకోచించు చున్నదే ! ఇచ్చట అహంకారము, అహంకరింపజాలక సో 2 హంపరమగుచున్నదే ! ఇదియేమి యాశ్చర్యము ! ఏమి మహిమ ! ఇచట నాయొక్క మనస్సు అహంకరించియుండు పోలీసు సబ్ ఇన్స్పెక్టరు సూపరింటెండెంటు దగ్గర వినయుడై నిలుచునట్లు వినమ్రమైపోవుచున్నదే! ఇచట నా మనస్సు మదపుటేనుగు సింహము సన్నిధిలో అణగినట్లు అణగిపోయినదే ! ఇచట నాయొక్క ఆశలన్నియు త్రాచుపాములు గరుత్మంతుని దృష్టిలో పడిపోయినట్లు, పడిపోయినవే ! పరిపరివిధములుగా దృశ్యములపై పరుగెత్తెడు వృత్తులన్నియు, సివంగిని చూచిన జింకలవలె నిశ్చేష్టములై నిలిచినవే ! ఇచ్చట అనేక యంత్రోపయంత్రములతో తిరుచుచుండు చక్రములన్నియు, యంత్రముల క్రియలన్నియు, ఇంజన్ నిలిపిన ఆగిపోవునట్లు స్థూలసూక్ష్మకారణములనెడు శరీరత్రయమును, దానియొక్క క్రియలనెడు సంసార చక్రములన్నియు వానియొక్క గుణములనెడు కృత్యములన్నియు ఆగిపోయినవే ! ఇచ్చట నా యొక్క అజ్ఞానము శుష్కతృణపుంజము, మండుచుండు మహాగ్నిలో కాలునట్లు కాలుచున్నదే ! ఇదేమి చిత్రము ! ఇచట కర్పూరము అగ్నిలో జ్వలించునట్లు, కర్మలన్నియు కాలికాలి కనుమరుగై పోవుచున్నవే ! పంచదార నీటిలో కరుగునట్లు నాయొక్క దృశ్యమంతయు దైవమయమై దృక్కుగా మారుచున్నదే! సూర్యుడుదయించునప్పుడు చీకటి కనపడనట్లు నాకు అవిద్యగానుపించుట లేదే ! కొలిమిలో వేసిన లోహఖండములన్నియు, తోలుతిత్తిచే ఊదునప్పుడు

అగ్నిమయమై ప్రజ్వలించునట్లు నా యింద్రియములన్నియు ఈశ్వరమయములుగా మారుచున్నవే ! ఇది యేమిచిత్రము ! ఇచట తైలము నశించిన దీపము స్వయముగా ఆరిపోవునట్లు, మాయయొక్క దృశ్యవాసనలన్నియు నశించుచున్నవి. ఇచట బాడబాగ్ని సముద్రజలమును ఇంకింపజేయునట్లు ప్రకృతి యంతయు పరమపురుషుడుగా మారుచున్నదే! ఇచట దావాగ్ని అడవిని గాల్చునట్లు నాయొక్క మనోభావన లన్నియు మాయమైపోవుచున్నవే ! ఓహో ! ఇదియేమి చిత్రము !

ఇచట ఘనీభూతమగు మేఘము వర్షించిపోయిన తర్వాత ఆకాశము నిశ్శబ్దముగాను, నిర్మలముగాను ఉన్నట్లు నాయొక్క హృదయాకాశము నిర్మలముగాను, నిశ్శబ్దముగాను ఉన్నది ! ఇచట గాలిలేని స్థలములో దీపమువలె నాయొక్క స్వరూపసాక్షాత్కార జ్ఞానదీపము కదలక నిలుచుచున్నది. చిత్రములో వ్రాసిన బొమ్మలవలె నా దేహేంద్రియము లన్నియు నిలిచిపోవుచున్నవి.

ఇదియేమి యాశ్చర్యము. ఏమి నాకు ప్రాణము లేదా ! నాదేహమిట్లు స్తంభించిపోవుటకు కారణమేమి ? విచిత్రముగా గానుపించుచున్నదే ! ఇదియేమి ? కట్టెలు నశించిన అగ్ని స్వయముగా చల్లారిపోవునట్లు నా మనస్సంస్కారము లన్నియు భస్మమై పోవుచున్నవి. అలలుడిగిన గంభీర సముద్రమువలె సమస్త చలనములుడిగి నేను ఆత్మభావనయందు నిలుకడగల్గి యున్నాను. ఇప్పుడు గదా నేను నేనై యున్నాను !

ఓహో ! ఇదియేమి భాగ్యము ! ఈశ్వరకృపయా ? గురుమహారాజు కరుణయా ? లేక నాయొక్క పురాకృత పుణ్యపరిపాకమా ? ఓహో ! ఆశ్చర్యము! పరమాశ్చర్యము ! ధన్యో 2 స్మి ! కృతకృత్యో 2 స్మి ! ఆహా ! ఈ లోకము గూడ ధన్యము ! ఆత్మసోదరులారా ! మీరందరును ధన్యులు ! దైవాత్మస్వరూపులారా ! పరమాత్మ స్వరూపులగు సోదరీ మణులారా ! మీరు ధన్యులు. పక్షివర్గములారా ! మీరు ధన్యులు ! మృగసమూహములారా ! మీరు ధన్యాత్ములు ! వృక్షలతా గుల్మములారా ! మీరు ధన్యులు ! వనపర్వత సాగరములారా ! మీరును ధన్యులే !

ఎవడు బ్రాహ్మణుడు ?

మూలం **అనువాదం**

బుద్ధుని ధర్మపదం **- బ్రహ్మచారి ఆనందమోహన్**

యస్సపారం అపారంవా - పారాపారసంనవిజ్జతి ।
వీతద్దరం విసఙ్ఞుత్తం తమహం బ్రూమిబ్రాహ్మణమ్ ॥ (పాలి)

1. యస్యపారం అపారం వా పారాపారం న విద్యతే ।
వీతదరం విసంయుక్తం తమహం బ్రహీమి బ్రాహ్మణమ్ ॥

తా ॥ ఈవలి తీరమును (త్వక్ (చర్మం) చక్షు (కన్ను) శ్రోత్ర (చెవి)జిహ్వా (నాలుక) ఘ్రాణము (ముక్కు) లనే ఇన్ద్రియముల తీరమును) ఆవలి తీరమున్ను (శబ్ద స్పర్శ రూప రస గంధములనే విషయముల తీరమును), ఉభయ తీరములను (నేను, నాది అనే భావములు అహంకార మమకారముల ఒడ్డును) దాటినవాడును (నేను, నాది అనే భావములు నశించిన వాడును) అనగా విషయవికారములు లేనివాడును, ఆసక్తి లేనివాడును అగు వానిని నేను బ్రాహ్మణుడందును.

2. యస్సకాయేన వాచాయ మనసా నత్థి తుఃఖదుకుతం ।
సంవుతంతీహి ఠానేహి తమహం బ్రూమి బ్రాహ్మణమ్ ॥ (పాలి)
యస్య కాయేన వాచా మనసా నాసి దుష్కృతమ్ ।
సంవృతం త్రిభిఃస్థానైః తమహం బ్రవీమి బ్రాహ్మణమ్ ॥

తా ॥ మనోవాక్కాయములచే పాపం చేయనివాడు, మనోవాక్కాయముల సంయమనము కలవానిని నేను బ్రాహ్మణుడందును.

3. న జటాహి నగోత్తేహి న జచ్చాహోతి బ్రాహ్మణో ।
యమ్హి సచ్చ ఇచ్ఛధమ్మో చ సో సుచీ సో బ్రాహ్మణో ॥
నజటాభిర్నగోత్రై ర్నజాత్యా భవతి బ్రాహ్మణః
యస్మిన్ సత్యం చ ధర్మశ్చ సశుచిస్స చ బ్రాహ్మణః ॥

తా ॥ జడలచేగాని (వెంట్రుకలు జడలు కట్టి నంతమాత్రం చేతగాని), గోత్రముచేగాని, జన్మచే గాని, ఎవడును బ్రాహ్మణుడు కాజాలడు. ఎవనియందు సత్యము, ధర్మమున్ను ఉండునో అతడే పవిత్రుడు, బ్రాహ్మణుడున్ను.

4. అక్కోసం బధబద్ధఇచ్చ అదుట్ఠొఎఓ యోతితిక్ఖతి ।
ఖన్తిబలం బలానీకం తమహం బ్రూమిబ్రాహ్మణమ్ ॥ (పాలీ)
అక్రోశన్ పథబన్ధంచ అదుష్టో యస్తితిక్షతి ।
క్షాన్తిబలం బలానీకం తమహం బ్రవీమి బ్రాహ్మణమ్ ॥

తా ॥ చిత్తాన్ని కలుషితం చేయక, ఇతరుల నిందావాక్యాలను, ప్రహారాలను సహించుకొనువాడు,క్షాన్తి (ఓర్పు) అను (సైనిక) బలము గలవానినే నేను బ్రాహ్మణుడందును.

5. అక్కోదనం వతవన్తం సీలవన్తం అనుస్సదమ్ ।
దన్తం అన్తిమసారీరం తమహం బ్రూమి బ్రాహ్మణమ్ ।
అక్రోధనం వ్రతవన్తం శీలవన్తం అనుశ్రుతమ్
దాన్తం అన్తిమశారీరం తమహం బ్రవీమి బ్రాహ్మణమ్ ॥

తా ॥ కోపం లేనివాడు, వ్రతనిష్ఠుడు, శీలవంతుడు, బహుశ్రుతుడు (అనేక శాస్త్రాలను అధ్యయనం చేసినవాడు), సంయమము గలవాడు, అన్తిమ శరీరం (ఆఖరు జన్మ) గలవానిని బ్రాహ్మణుడు అని నేను చెప్పుచున్నాను.

6. గంభీరప్రజ్ఞం మేధావినం మార్గామార్గస్యకోవిదమ్ ।
ఉత్తమార్థమనుప్రాప్తం తమహం బ్రవీమి బ్రాహ్మణమ్ ॥

తా ॥ గంభీర ప్రజ్ఞగలవాడు, మేధా సంపన్నుడు, మార్గామార్గముల (కర్తవ్యాకర్తవ్యముల) నెఱిగినవాడు, ఉత్తమ వస్తువగు సత్యమును పొందిన వానిని బ్రాహ్మణుడని నేను చెప్పుదును.

జ్ఞాన సుధ

మూలం శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం : పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు

ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవతారిక : జగత్తు నందలి ప్రతియొక కార్యమునకు నిమిత్తోపాదాన సహకారి కారణములనెడి మూడు కారణములు యుండగా ఈ జగద్రూప కార్యమునకు శివుడనెడి ఒక్క వస్తువే కారణమని చెప్పుట ఎట్లనిన – అతడు అభిన్ననిమిత్తోపాదాన కారణమై యున్నాడని దృష్టాంత పూర్వకముగా దెలుపుచున్నారు.

14. యథా సరీసృష్టి పటం గుణోదరః
స్వమేవ కుర్వన్ భువి కారణత్రయమ్ ।
తథైక ఏవ శ్రుతిచూడ బోధితో
జగంతి సూతే స సనాతన శ్శివః ॥

ప్రతిపదార్థం :– భువి = లోకమునందు, గుణోదరః = సాలెపురుగు, స్వమేవ = తననే, కారణత్రయం = నిమిత్త, ఉపాదాన, సహకారి కారణములుగా,కుర్వన్ = చేసికొని, పటం = జాలమును, యథా =ఎట్లు, సరీసృష్టి = సృజించునో, తథా = అట్లే, శ్రుతిచూడబోధితః = శ్రుతిశిరః (ఉపనిషత్తులు) ప్రతిపాద్యుడైన, సః సనాతనః = ఆ పురాణ పురుషుడగు, శివః = శివుడు, ఏకః ఏవ = ఒక్కడే (ఇతర కారణములు ఏవియు లేకనే) జగన్తి = బ్రహ్మాండములను, సూతే = సృజించును.

సాలెపురుగు తాను అల్లునట్టి వలకు తన బొడ్డునుండియే కలిగెడి దారముచే ఉపాదాన కారణమై, జాల నిర్మాణ జ్ఞానముచే నిమిత్త కారణమై యుండునట్లు పరమేశ్వరుడు (మాయోపహితమైన బ్రహ్మము) జగన్నిర్మాణమున అభిన్న నిమిత్తోపాదాన కారణమై యున్నాడని అభిప్రాయము.

అవతారిక : – కరణకర్త ృత్వము, సంకల్ప కర్త ృత్వము, సన్నిధాన కర్తృత్వము అను వీనియందు శివుడు నిరవయవుడైనందున మొదటి రెండు కర్త ృత్వములతనియందు చెప్పుటకు వీలులేదు. అయితే సన్నిధాన కర్తృత్వము మాత్రము గలదని తెలుపుచున్నారు.

15. కులాల కరణాద్ఘటః స్వరివ విశ్వకర్మ స్మృతేః
నృకృత్య మినసన్నిధే ర్లగతి తత్ర పూర్వద్వయమ్ ।
ప్రయత్నజటిలం పరం తదవకేశీత్యగ్రైరిదం
జగజ్జనన కర్మణి ప్రతినిధీయతే బ్రహ్మణా ॥

ప్రతిపదార్థం :– కులాల కరణాద్ఘటః ఇవ= కుమ్మరివాని ఇంద్రియ వ్యాపారం వలన కుండ అయినట్లు, విశ్వకర్మ స్మృతేః స్వః ఇవ= విశ్వకర్మ యొక్క సంకల్పమువలన స్వర్గమైనట్లు, ఇన సన్నిధేః నృకృత్యం లగతి = సూర్యుని సన్నిధానంచే మానవుల వ్యవహారం జరుగుచున్నది. తత్ర పూర్వద్వయం ప్రయత్న జటిలం = ఈ మూడువిధములగు కారణములందు మొదటి రెండును ప్రయత్నంతో సంబంధపడియున్నవి. తత్పరం = ఆ తరువాతది (మూడవదగు సన్నిధాన కర్త ృత్వము) అవకేశి = ఫల (ప్రయత్న) రహితము, జగత్ జనన కర్మణి = ఈ బ్రహ్మాండముల యొక్క సృష్టి వ్యాపారమునందు, బ్రహ్మణా = పరమేశ్వరుని చేత, ప్రతినిధీయతే = మారుగా (సన్నిధాన కర్త ృత్వము) చేయబడుచున్నది. ఇతి = అని, ఇట్లు ఇదం = ఇది, అగ్రైః = పెద్దల చేత, ఉక్తం = చెప్పబడినది.

తా॥ కులాలుని (కుమ్మరి) యందువలె పరమాత్మయందు కరణ

కర్తృత్వమును చెప్పినచో కులాలుని (కుమ్మరి) భంగి పరమాత్మ ఉత్పత్తి నాశములు గలవాడై యుండవలసి వచ్చును. విశ్వకర్మ సంకల్పముచే స్వర్గము రచింపబడినట్లు పరమాత్మయందు సంకల్ప కర్తృత్వమును చెప్పిన జీవత్వదోషమాపన్నమగును. ఇక కర్తృత్వమే లేదనిన సృష్టి ప్రసంగమే అసంగత మగును. అను శంకలను పురస్కరించుకొని సమాధానం చెప్పుచున్నారు. అయ్యా పరమాత్మయందు కులాలునియందువలె కరణ కర్తృత్వమును గాని, విశ్వామిత్ర విశ్వకర్మ ఇత్యాదులందు వలె సంకల్ప కర్తృత్వమునుగాని మేము చెప్పుటలేదు. కాని సూర్యునియందువలె సన్నిధాన కర్తృత్వమును చెప్పుచున్నాము. అది యెట్లన- ఇచ్ఛాప్రయత్నములు లేకయే సూర్యుని సన్నిధాన మాత్రమున లౌకిక వైదిక సమస్త వ్యవహారములు లోకమునందు జరుగుచున్నట్లు శివుని సన్నిధాన మాత్రమున ప్రకృతి యందు సృష్టి వ్యవహారము నడచుచున్నదని భావము. “ మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్” అని స్మృతి.

భగవంతుణ్ణి తెలుసుకోకుండా జీవించేవారు మట్టి గోడలతో కట్టిన ఇంట్లో నివసించే లాంటి వారు. మిణుకు మిణుకుమనే కొద్దిపాటి వెలుగులో వారు కేవలం ఇంటి లోపలి ప్రదేశాన్ని మాత్రమే చూడగలుగుతారు. కానీ జ్ఞానాన్ని సముపార్జించుకొని భగవంతుణ్ణి సాక్షాత్కరించుకొన్న తరువాత సంసారంలో జీవించేవారు అద్దాల మేడలో నివసించే వారి లాంటివారు. వారు ఇంటి లోపలా చూడగలరు, బయట వస్తువును కూడా చూడగలరు. ఏది మంచిది ? ఏది చెడ్డది ? ఏది నిత్యం, ఏదనిత్యం అని ఎంతో స్పష్టంగా చూడగలరు.

- శ్రీ రామకృష్ణ పరమహంస



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేంద్ర మహాస్వామి

45. చెన్నమల్లికార్జునా ! నీ కరుణ అత్యంత శ్రేష్ఠమైనది. అది పాలులో నీరు కలిపినట్లు నన్ను నీ స్వరూపంగా మార్చేస్తుంది. నీ కరుణ అపార శక్తివంతమైనది. నీవు అనుగ్రహిస్తే చీమ కూడా శ్రీ రుద్రరూపము ధరిస్తుంది. శివానుగ్రహము పొందినవాడు శివ స్వరూపుడౌతాడు.

47. శ్రీ గురులింగదేవుడు శివదీక్ష చేసినపుడు వారి పవిత్రమైన హస్తములను నా మస్తకముపై వుంచినాడు. అప్పుడు నా పుట్టుకచావులు నాశనమైనాయి. గురు అనుగ్రహమైతే మల్లాజన్మలేదని శాస్త్రములు చెప్పుచున్నాయి. ఒక జ్యోతినుంచి ఇంకొక జ్యోతి వెలుగునట్లుగా గురుకృపతో గురువైనాను. శిష్యుని శిరస్సులో వున్న చిత్ చైతన్యాన్ని శివలింగ స్వరూపంగా చేసి నా హస్తములో కరుణించినాడు. అదేవిధంగా మనసు అనే మంటపములో ప్రాణలింగము ప్రతిష్ఠించి అనుగ్రహించినాడు. ఆ ప్రాణలింగమే జ్ఞానమనే మంటపములో భావ లింగమై పరణమించును. అలాగే మనస్సులో ప్రాణలింగ మున్నదని ఇష్టలింగాన్ని తీయకూడదు. ఇష్టలింగము అకస్మాత్తుగా దూరమైతే ఆత్మహత్య చేసుకొనకూడదు.

48. కర స్థలములో వచ్చినటువంటి ఈ ఇష్టలింగము సత్‌చిత్ ఆనందస్వరూపము. అటువంటి లింగదాత నిత్య పరిపూర్ణమైన నాభక్తికి మెచ్చి ముక్తి ఇవ్వడానికి నా యింటికి నడచి వచ్చినాడు. అప్పుడు జయజయగురవే, హరహర శంకర గురవే పరమగురవే నమో నమో, చెన్నమల్లికార్జునమనే ఇష్టలింగమును నాకు కరుణించిన గురువుకు అనంతానంత ప్రణామములు.

49. చెరువులోని నీరు అంతా ఆరిపోయి కేవలము బురద మాత్రము మిగిలినిపుడు నది ప్రవహించి వచ్చితే ఏవిధంగా సంతోషమౌతుందో, మరియు నీళ్ళు లేక చెట్లు వాడిపోయే సమయంలో వర్షము కురిస్తే ఆ చెట్లు పచ్చగా శోభించును. ఈ రోజు నాకు ఇహలోక సంపత్తులు, పరలోక గమ్యము దొరికినట్లయింది. ఎంతో ఆనందమైనది ఊహించలేకపోతున్నాను. గురుపాదములు దర్శించి ధన్యుడనైతిని. గురునాథుడు పరమ హితైషి. ఆయనే పెద్ద తనములోనే లింగదేవుడై వరుడైనాడు నేనే వధువైనాను. జనానికి తెలిసేటట్లుగా అసంఖ్యమైన శివభక్తులే తల్లిదండ్రులైనారు. సమాన గుణస్థుడైన చెన్నమల్లికార్జునుడే భర్త అయినాడు. లోకబంధువులు నాకు సంబంధీకులు కారు.

52. సద్గురు పాదోదకముతో స్నానము చేసేది నాకు మంగళస్నానము. విభూతి ధారణయే పసుపులేపనము. దిగంబరమే దివ్యాంబరము। శివభక్తుల పాదధూళియే గంధలేపనము రుద్రాక్షలే నా శరీరముపై ధరించు ఆభరణములు. శివశరణుల పాదములకు శరణమనేదే బాసింగము. చెన్నమల్లికార్జునునితో వివాహమయ్యే కన్యకు ఈ అలంకారములే శృంగారములు. లౌకిక భర్తని సంతోష పరచాలంటే లౌకిక ఆ భరణములు కావాలి. అలౌకిక భర్త అనుగ్రహానికి ఈ పైన తెలిపిన అలంకారములే శృంగారములు.

55. గురుకరుణతో లింగము ప్రాప్తము అయినది. లింగపూజాఫలముతో జంగముడి ఆగమనము అయినది. జంగమదేవుని కృపవలన పాదోదక ప్రసాదములు లభించినవి. ఈ విధముగా గురు కరుణతో లింగ, జంగమ, పాదోదక, ప్రపాదమను నాలుగు సంపదలు దొరికినవి. మరియు సజ్జన, సద్భక్తుల సాంగత్యము వలన సద్గోష్ఠి దొరికినది. నీవు పుట్టినపుడే సద్గురు నాథుడు నాకు విభూతి ధరించి, శివలింగమును ప్రసాదించినాడు. నా జన్మము సార్థకమైనది.

ధర్మపదం కథలు
అనాథ పిండకుని కుమారుడు

తెనుగు - బోధ చైతన్య

రాజ్యాలేలే రాజులు కూడా అసూయ పడదగినంత ధనవంతుడు అనాథపిండకుడు. ధనం సంపాయించడంలో అతనికి మించినవాడు లేడు. వ్యయం చేయడంలోనూ అతనికి మించినవాడు లేడు. భోగానికి గానీ ధర్మానికిగానీ వినియోగింపబడక ఊరక కూడబెట్టబడే ధనం మట్టితో సమానమని అతని భావన. బుద్ధుని చూచిన తరువాత అతని ధనవ్యయం ఎక్కువ భాగం ధర్మవ్యయం క్రిందనే మారింది.

బౌద్ధభిక్షువులను ఆహ్వానించడం, ఉపన్యాస కార్యక్రమాలు పెట్టించడం, ఊరి జనాన్నంతా రమ్మని స్వయంగా పోయి పిలవడం ఇలాంటి పనుల్లో తలమునకలౌతున్నాడు. " ఈ రోజు మహాకాశ్యపులవారి ప్రసంగం ఉంటుంది. ఆయన బుద్ధుని ప్రధాన శిష్యుల్లో ఒకడు. ఆయన ఉపన్యాసం వింటుంటే ఈ లోకమే మరచిపోతాము " అని ఒకవీధిలో కొందరినుద్దేశించి అనాథపిండకుడు ఉత్సాహంగా చెప్పుకుపోతుంటే ఒకడు అడ్డు తగిలి " అయ్యా శ్రేష్ఠిగారూ, ఆ ఉపన్యాసాలకు ఊరి జనమంతా ఎందుకులెండి ? తమ కుమారరత్నానికి ఒకడికి పెట్టించండి ఆ సభ, చాలు. దానివల్ల ఈ ఊరు బాగుపడితే అదే మాకు పదివేలు " అన్నాడు.

అనాథపిండకుని కుమారుడు కాలనాథుడు. ఆ ఊరిలోని అల్లరి యువకులకు నాయకుడు. ఎప్పుడూ వాహనాల మీదే తిరుగుతుంటాడు. ముందు మూడు వాహనాలు, వెనుక ఐదు వాహనాలు, మధ్యలో కాలనాథుడి వాహనం. అమిత వేగంతో వీధుల్లో తిరుగుతుంటాడు. రాజాధికారులు కూడా అతని అల్లరి చూసీ చూడనట్లుగా పోతుంటారు. ఆ రాజ్యానికి కాబోయే రాజు ఇతని స్నేహితుడు. కనుక కాలనాథుడు ఆడింది ఆట, పాడింది పాటగా చెల్లిపోతున్నది. అతణ్ణి ఏమి అని అడిగే సాహసం ఎవరూ చేయడం లేదు.

కాలనాథుడు చేసే ఇంత రాచకార్యానికి ధనం లేకపోతే కుదరదు. జట్టుగాళ్లను అదే పనిగా మేపాలి. వారి విలాసాలకు, వినోదాలకు, విహారాలకు ధనాన్ని నీళ్లప్రాయంగా ఖర్చు చేయాలి. కాలనాథుడు ఇందులో ఏమీ తీసిపోలేదు. కానీ అతనికి స్వంత సంపాదనంటూ ఏమీ లేదు. అనాథపిండకుని దగ్గరనుండే తన దిన ఖర్చులకు వందలు వేలు తీసుకొని పోయేవాడు.

“ నాన్నా ఈ రోజు యువజనమండలి సాహిత్య గోష్ఠి పెట్టుకొన్నాము. ఓ నూరు వరహాలు అవసరమౌతుంది ” అన్నాడు కాలనాథుడు. వీధిలో నిన్న విన్న వెటకారం మాటలు అనాథపిండకుని చెవుల్లో ఇంకా గింగురుమంటున్నాయి. “ బాబూ, ఈ రోజు నుండి ఒక నియమం పెట్టుకున్నాను. ‘ఊరక డబ్బు ఎవ్వరికీ ఇవ్వరాదని’. నీకు నూరు వరహాలు రోజూ కావాలి. కనుక ఒక పని చేయి. బౌద్ధ విహారానికి రోజూ వెళ్ళి వచ్చే పని చేసస్తూండు. ఆ పనికి నూరు వరహాలు రోజూ ముట్టజెప్పుతాను” అన్నాడు అనాథపిండకుడు.

కాలనాథుడికి బౌద్ధభిక్షువులంటే ఏమాత్రం గౌరవం లేదు. ‘శరణం గచ్ఛామిగాళ్ళు ’ అని ఎగతాళి చేస్తుంటాడు. అయినా ఇప్పుడు దిన ఖర్చులకోసమైనా బౌద్ధ విహారానికి వెళ్ళిరాక తప్పదు. వాహనం మీద బయలుదేరాడు.

“ విహారానికి వెళ్లి వచ్చాను నాన్నా ఏదీ డబ్బులు ” అని తండ్రిని అధికారిక స్వరంతో అడిగాడు. “ నీవు బౌద్ధ విహారానికి వెళ్లి వచ్చావో వేశ్యా గృహానికి వెళ్ళి వచ్చావో నాకెలా తెలుస్తుంది ? వెళ్లి వచ్చిన దానికి గుర్తుగా బుద్ధుని ప్రవచనాల్లో ఒక దానిని ఒప్పజెప్పి అర్థం వివరించి చెప్పగలిగావంటే నూరేమిటి వేయి వరహాలు రోజుకిస్తాను వెళ్లు ” అన్నాడు తండ్రి.

కాలనాథుడు మళ్లీ విహారానికి వెళ్లాడు. అక్కడ బుద్ధుని ప్రవచనం సాయంకాలం జరుగుతుందని తెలిసింది. అంతదాకా అక్కడే వేచి ఉండి ఉపన్యాస సమయానికి, ముందు వరుసలో కూర్చున్నాడు. బుద్ధవచనాన్ని

ఏకాగ్రంగా విన్నాడు. బుద్ధుడు అర్థంగాని అయోమయ ప్రసంగం చేయడం లేదు. ఎంత మందమతికైనా చక్కగా అర్థమయ్యే రీతిలో పరమ గంభీరమైన విషయాలను బోధిస్తున్నాడు. అంగులీమాలుండంతటివాడు బుద్ధుని వాగమృత ప్రవాహంలో కొట్టుకొనిపోగా కాలనాథుడొకలెక్కా ? అతడు ఆ రాత్రి ఇంటికి కూడా వెళ్లలేదు. విహారంలో ఒకమూల కూర్చొని తాను విన్న పరమ సత్యాలను ధ్యానం చేస్తూ ఉండిపోయాడు.

మరునాడు అనాథపిండకుని ఆహ్వానం మన్నించి అతని ఇంటికి బౌద్ధసంఘమంతా కదిలింది. కాలనాథుడూ వారితోనూ కలిసి ఇంటికి బయలుదేరాడు. వారికి చేయవలసిన పూజా సత్కారాలన్నీ అయ్యాక తన కుమారుని సంగతి అనాథపిండకునికి జ్ఞాపకం వచ్చి అతని వైపు చూచాడు. ఒక వృద్ధ భిక్షువుకు చాలా వినయంగా విసనకఱ్ఱను విసురుతూ సేవించడం కనబడింది. “ హమ్మయ్య, బుద్ధిమంతుడు అయ్యా” డనుకొని వేయి వరహాల సంచిని అతనికివ్వబోయాడు. “ నాన్నగారూ ఆ సంచిన మీదగ్గరే ఉంచండి. నేను నిన్న విన్న బుద్ధవచనానికి వెలకట్టుతున్నారు. మీ మొత్తం ఆస్తి అంతా ఒకచోట కుప్పపోసి తూచినా బుద్ధుని ఒక్క వాక్యానికి సమం కాజాలదు. వేయివరహాలు ఎరజూపి నన్ను సంసారకూపం నుండి పైకి లాగి బుద్ధుని పాదపద్మాల ముందు పడవేశారు. ఆ ఒక్క మేలు చాలు, ఇంత మేలు లోకంలో ఏ తండ్రీ ఏ తనయుడికీ చేసి ఉండలేదు ” అన్నాడు.

అనాథపిండకుడు పరమానందభరితుడై బుద్ధుని పాదపద్మాలకు మళ్లీ మోకరిల్లాడు. “ అనాథపిండకా, లెమ్ము. ఇప్పుడు నీ కుమారుడు స్రోతాపత్తి ఫలాన్ని పొందినవాడైనాడు. అతని విషయంలో నీకిక విచారం వలదు ” అని క్రింది శ్లోకాన్ని పఠించాడు.

పృథివ్యా ఏకరాజ్యాత్ స్వర్గస్య గమనాద్ వా
సర్వలోకాధిపత్యాద్ వా స్రోతాపత్తిఫలం వరమ్ 13-12

పృథివియందు ఏకచ్ఛత్రాధిపత్యం కంటెనూ, స్వర్గంలో ఇంద్రపదవి కంటెనూ, సర్వలోకాధిపత్యమైన బ్రహ్మపదవి కంటెనూ స్రోతాపత్తి ఫలము గొప్పది.

శ్రీ బుద్ధభగవానుడు
సద్గురు మహర్షి శ్రీ మలయాళస్వామి

– రచన శ్రీమతి బొప్పన అరుణాదేవి, హైదరాబాదు

సంచారము

బుద్ధుడు

కపిలవస్తును వదిలిన సిద్ధార్థుడు మగధరాజధాని రాజగృహం చేరుకున్నాడు. బింబిసారుడు మగధరాజ్యానికి పాలకుడు. ఇంటింటికి తిరిగి భిక్ష స్వీకరించేవాడు సిద్ధార్థుడు. నగరంలో సంచలనం కలిగిస్తున్న మహనీయుడు ఎవరని బింబిసారుడు ఆరాతీసి అతను శాక్యవంశపు రాజకుమారుడని ప్రపంచాన్ని త్యజించి భిక్ష తెచ్చుకొని జీవిస్తున్నాడని తెల్సుకొని చలించిపోయాడు. అతని దర్శనానికి వెళ్ళి వినయంగా నమస్కరించి, తన రాజ్యాన్ని స్వీకరించమని కోరాడు. సిద్ధార్థుడు చిరునవ్వుతో అతని దానాన్ని తిరస్కరించి, "ముక్తి కోసం రాజ్యం వదలి వచ్చినవాడిని. స్వేచ్ఛగా సంచరిస్తున్నాను. బంధనాలు వద్దు. సిద్ధి పొందిన తర్వాత తిరిగివస్తాను " అని వాగ్దానం చేసి సెలవు తీసుకొన్నాడు.

బ్రహ్మజ్ఞాన సంపన్నులయిన బ్రాహ్మణ గురువులయిన అలారుడు, ఉద్ధకుడు ఆ కాలంలో ఉద్ధండ పండితులు, తత్త్వజ్ఞానులు. సిద్ధార్థుడు వారిని ఆశ్రయించి కర్మసిద్ధాంతాన్ని, పునర్జన్మ సిద్ధాంతాన్ని తెలుసుకొన్నాడు. మంత్రాలు, నివేదనలు, సమాధి ద్వారా అహంకారాన్ని వదిలివేసే పద్ధతులు అధ్యయనం చేశాడు. వారి ఉపదేశంతో సిద్ధార్థుడు తృప్తి చెందలేదు. కర్మలోని సత్యాన్ని గ్రహించాడు. కాని కర్మలన్నింటిని చేసే ఆత్మలేదని భావించాడు. ఆత్మకేవలం భ్రమఅనిపించింది అతనికి. తర్వాత దేవాలయాలలో పూజలు చేసే అర్చకుల వద్దకు వెళ్ళాడు. పండుగ సంబరాలు చేయటం,

జంతువులను బలి ఇవ్వటం వంటివి కేవలం అజ్ఞానం కారణంగా జరుగుతున్నాయని, రక్తపాతం ద్వారా దేవుళ్ళను తృప్తి పరచటం కంటే, సత్యాన్ని ఆరాధించటం శ్రేష్ఠమని భావించాడు. జీవహింస ద్వారా తమ పాపాలు పరిహారమవుతాయి అని భావించే వారిని చూచి జాలిపడ్డాడు. దానికి బదులుగా కామాన్ని, ద్వేషాన్ని బలిచేసి నైతికజీవనంద్వారా ధర్మాచరణ చేయటం ఉత్తమం అని గ్రహించాడు.

సత్యాన్వేషణలో ఉత్తమ పద్ధతులను గ్రహించటానికి ఉరువేల వనంలో తపస్వుల ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఐదుగురు మునులు తపస్సు చేసుకొంటున్నారు. వారితో కలసి తపస్సు మొదలుపెట్టారు.

మలయాళస్వామి

వేలప్ప ఇళ్ళు వదిలి తీర్థయాత్ర మొదలుపెట్టాడు. కాలినడకతో యాత్ర అంతటిని ముగించాడు. దేశమంతా పర్యటించి, తపస్సుకు యోగ్యమయిన పవిత్ర ప్రదేశాన్ని ఎంచుకొని ఆత్మసాక్షాత్కారము కలిగేంతవరకు తపోనిష్ఠ కొనసాగించాలని ముందుగానే నిర్ణయించుకొన్నాడు. తీర్థతీరములందు, పుణ్యక్షేత్రములందు గల ఆశ్రమాలలో మహాత్ములను దర్శించి, వారి నుంచి అనేక ధర్మరహస్యములను గ్రహించినాడు. భక్తులు ఏ విధంగా ఉండాలి, ఆశ్రమాలు ఎలా నిర్వహించాలి, అతిథి సేవలు ఎలా చేయాలి, ధ్యాన అనుష్ఠానములు ఎలా చేయాలి అనే విషయాలను వారి నుంచి చక్కగా నేర్చుకొన్నాడు. తేనెటీగలు వివిధ పుష్పాలనుండి రకరకాల తేనెను గ్రహించినట్లుగా అనేక ఆశ్రమాల నుండి, మహాత్ములనుండి అనేక ధర్మసూక్ష్మాలు వేలప్ప గ్రహించాడు. సిద్ధార్థుని వలెనె స్వామి కూడా అర్ధరాత్రి ఇళ్ళు వదిలినాడు. జోలెలో గ్రంథాలు, జపమాల, విభూతి, రాసుకోవటానికి కాగితాలు, పెన్సిలు, ఒక చిన్న పాత్ర ఉన్నాయి. లభించిన దానితో తృప్తిపడి సూర్యోదయానంతరము కాలినడకతో ప్రయాణిస్తూ, సాయంత్రానికి సత్రాలలో విశ్రాంతి తీసుకొంటూ

భారతదేశమంతా ఒక పర్యాయయము తీర్థయాత్ర పూర్తి చేయటానికి వేలప్పకి మూడు సంవత్సరాలు పట్టింది. యాత్ర పూర్తి అవగానే గురుదేవుని చెంతకేగి యాత్ర విశేషాలను వివరించి, వారి అనుమతితో ఇంటికి వెళ్లాడు. తాను ఇళ్ళువిడిచిన కొంతకాలానికే తండ్రి మరణించినాడని, తల్లిగారు భర్తవియోగంతో, పుత్రుడు ఇళ్ళు వదలిన బెంగతో కృంగి కృశించిపోవటం తెల్సుకుని, తల్లికి పరిచర్యలు చేస్తూ కొంతకాలం గడిపాడు. మధ్యలో గురుదేవుని ఆశ్రమానికి వెళుతూ గ్రంథపఠనము, పూజ, అనుష్ఠానముతో మూడు సంవత్సరాలు గడిపి ఒకనాడు ఎవ్వరితో చెప్పకుండా ఇళ్ళు విడిచి తిరుమల పుణ్యక్షేత్రములోని గోగర్భతీర్థము చేరుకొన్నాడు. అప్పుడు వేలప్పకి ఇరువది తొమ్మిది సంవత్సరాలు. తీవ్ర తపస్సుకై ఆయత్తమైనాడు.

తపస్సు

బుద్ధుడు

సత్యాన్వేషణలో ఇంద్రియాలను వశపరచుకొని, శరీరాన్ని శుష్కింపచేసి కఠోర క్రమశిక్షణతో, మిగిలిన వారికంటే కఠిన తపస్సు చేస్తుంటే ఐదుగురు తపస్వులు చిన్నవాడైనా సిద్ధార్థుని గురువులా భావించి, సేవలు చేసేవారు.

జ్ఞానోదయం కావాలంటే శరీరాన్ని శుష్కింపచేసి నిర్మలంగా ఉంచాలని సిద్ధార్థుడు భావించాడు. పళ్ళు బిగించి, నాలుకను అంగిట నొక్కిపట్టి ధ్యానమగ్నుడయ్యాడు. అతని బాహుమూలాల నుండి స్వేదజలం సెలయేళ్ళలా ప్రవహించింది. శ్వాసను నియంత్రించి, క్లిష్టతర ధ్యాన ముద్రను కొనసాగించగా, వేదనాభరితమైన అలాంటి సాధనలో ఒక స్థితి నుండి మరో స్థితికి పురోగమించే కొద్దీ శిరస్సులో రక్తం పరవళ్ళు తొక్కుతున్నట్లు, కపాలం రెండుగా చీలుతున్నట్లు, కత్తితో కడుపు చీల్చుతున్నట్లు, కణకణమండే నిప్పులగుండంలో పడి కాలిపోతున్నట్లు బాధ కలిగేది. అయినా సిద్ధార్థుడు మొండిగా భరించాడు. క్రమక్రమంగా ఆహారాన్ని

తగ్గించుకుంటూ వచ్చి, చివరికి రోజుకి ఒక ధాన్యపు గింజను తీసుకొనేవాడు. కొంతకాలము కందమూలాలు, పచ్చిగడ్డి, విత్తనాలు తిని జీవించాడు. కేశ కంబళ్ళు, జుగుప్స కలిగించే దుస్తులు ధరించాడు. జుట్టు గడ్డంలోని ఒక్కొక్క వెంట్రుక పీకివేశాడు. రోజులతరబడి నిలబడి, ముళ్ళకంప మీద పడుకొని గడిపాడు. దేహంమీద దుమ్ము, ధూళి పేరుకుపోయి ఎండిన మోడులాగా తయారయినాడు. చిక్కి శల్యమై ఎముకలగూడులాగా తయారయినాడు. తరచుగా శ్మశానానికి వెళ్ళి కుళ్ళి కంపుకొడుతున్న శవాల మధ్య పడుకునే వాడు. కడుపు తాకితే వెన్ను, వెన్ను తాకితే కడుపు తగిలేవి. కఠినమయిన ఉపవాస దీక్ష వలన సిద్ధార్థుని కడుపు వెన్నుకు అంటుకుపోయింది. అంతటి కఠోరసాధన చేసినా సిద్ధార్థునికి జ్ఞానోదయం కలగలేదు. అయితే అతని కీర్తి మాత్రం అన్ని దేశాలకి ప్రాకింది. దూర ప్రాంతాల నుండి ప్రజలు ఆయన దర్శనానికి, ఆశీర్వాదానికి రావటం మొదలుపెట్టారు.

మలయాళస్వామి

పరమవైరాగ్యంతో కట్టుబట్టలతో గోగర్భక్షేత్రము చేరుకున్న వేలప్ప తన లక్ష్యసిద్ధిని సాధించటానికై ఘోరమయిన తపస్సుకు ఉపక్రమించాడు. రోజుకి ఒక్క పూట మాత్రమే ఆహారం తీసుకొనేవాడు. తొలిరోజులలో తిరుమల గ్రామానికి నిర్ణీత సమయానికి భిక్షకు వెళ్ళి, పుణ్యాత్ములు పెట్టినది గ్రహించి రోజు రోజుకూ ధ్యానము తీవ్రతరము చేయసాగాడు. ప్రాతఃకాలములో ధ్యానస్థితుడైతే ఒక్కో పర్యాయయము పొద్దువాలేవరకు ధ్యానము నుండి లేవటానికి ఇష్టముండేది కాదు. తపోనిష్ఠ తీవ్రము అయ్యే కొలది భిక్షకు వెళ్ళటానికి గృహత్యాగము చేసిన వేలప్పకి భోజనము సమస్యగా అనిపించలేదు. గోగర్భ తీర్థములో యాత్రీకులు వదిలిన పిండములలోని పచ్చిపిండిని తిని కొంతకాలం గడిపినాడు. తర్వాత శ్రీ వేంకటేశ్వర స్వామికి నైవేద్యములు వండిన పాత్రలలోని మెతుకులు ఏరుకుని తిని తృప్తిపడేవాడు. కొన్నిసార్లు రెండుమూడు రోజులు ఆహారం

లేకుండానే గడిపేవాడు. అటువంటి సమయాలలో చిన్ననాడు తల్లిగారు ప్రేమతో పెట్టిన భోజనపు పళ్ళెరమును కోపంతో తాను కాలితో తన్నిన సంఘటన గుర్తుకు వచ్చి పశ్చాత్తాపంతో " దాని ఫలితము అనుభవింపక తప్పదు " అని భావించేవాడు.

తీవ్ర తపస్సులో కాలం గడిపే ఆ మహనీయుని కీర్తి తిరుమల క్షేత్రానికి యాత్రలకి వచ్చే భక్తులకు ప్రాకిపోయింది. భక్తులు ఆ మహనీయుని దర్శించి, భిక్ష చేయటానికి తహతహలాడసాగారు. ఆయన మలయాళ దేశీయుడని తెల్సుకుని వారిని భక్తులు 'మలయాళస్వామి' అని పిలవసాగారు.

మారుని దుష్టత్వం - భగవత్కరుణ

బుద్ధుడు

జనన మరణాలతో కూడిన సంసారసాగరాన్ని తరించి ముక్తిని పొంది ప్రపంచానికి దుఃఖ నివృత్తి మార్గాన్ని చూపాలనే లక్ష్యంతో సిద్ధార్థుని తపస్సు కొనసాగింది. తీవ్ర తపస్సుతో శరీరం క్షీణించిపోయింది. ఉపవాసాలతో శరీరం శిథిలమయింది. మృత్యువు కబళించటానికి సిద్ధంగా ఉంది. అయినా కండరాలు కరిగి, శరీరం చిక్కిశల్యమైనా, దృఢమైన సంకల్పం, శ్రద్ధాసక్తులు, అకుంఠిత దీక్ష, నిశ్చలమైన మనస్సు, ప్రశాంతత వదలలేదు సిద్ధార్థుడు. సాధన విఫలమై జీవించే కంటే, సాధన చేస్తూ మరణించటమే మేలు అని భావించాడు. అది గ్రహించిన మారుని దుష్టశక్తి వెనక్కి తగ్గింది.

సిద్ధార్థుడు సాధించిన దానితో తృప్తిపడలేదు. కోరుకొన్న సత్యజ్ఞానం కలగలేదు. శరీరాన్ని శుష్కింపచేసినా కోరికలు అణగిపోవని, ఆనంద సమాధిలో మునిగినా వివేకోదయం కలగదని అర్థం చేసుకొన్నాడు. ఉపవాస దీక్ష వలన మోక్షమార్గంలో ముందుకు వెళ్ళలేకపోయినందున, అది సరిఅయిన పద్ధతి కాదని, దాన్ని విడిచివేయాలని నిర్ణయించుకొన్నాడు.

నైరంజని నదిలో స్నానానికి వెళ్ళి స్పృహ తప్పి పడిపోయిన సిద్ధార్థుడు మరణించాడని భావించిన ఐదుగురు తపస్వులు అతనిని వదిలివెళ్ళిపోయారు. పశువుల కాపరి కూతురు నంద పెట్టిన పాయసాన్నం తిని సిద్ధార్థుడు స్వస్థుడయినాడు.

మలయాళస్వామి

స్వామికి ప్రాథమిక దశలో భోజన సమస్య తీవ్రంగా బాధించింది. తర్వాత తిరుమలకి వచ్చే భక్తులు స్వామిని వెదుకుతూ వచ్చి భిక్ష చేసేవారు. తిరువేంకటాచార్యులు అనే బ్రాహ్మణుడు నిత్యము స్వామికి ప్రసాదము ఇచ్చేవాడు. రామలఖనదాసు భగవత్ప్రేరితుడై స్వామికి మఠములో భోజనములకు ఏర్పాటు చేసాడు. అయితే తీవ్రధ్యాననిష్ఠలో నుండి ప్రొద్దు వ్రాలిన తర్వాత లేచి భోజనానికి సమయము తప్పి వెళ్ళటం వలన వంటవారు విసుగుచెందటం గమనించిన స్వామి భోజనానికై మఠమునకు వెళ్ళటం మానుకొన్నారు.

వర్షాకాలములో ఒక పర్యాయము మూడురోజులు గుహదాటి రావటానికి వీలుకాలేదు. కాలువ నిండుగా ప్రవహించసాగింది. స్వామి ఆకలి బాధ ఓర్చుకోలేక భగవంతుని స్మరిస్తూ కాలం గడపసాగారు. అప్పుడు శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో షరాబుగా పనిచేస్తున్న నైనేని సుబ్బరాయశెట్టిగారు మధ్యాహ్న సమయంలో నిద్రిస్తుండగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి స్వప్నంలో దర్శనమిచ్చి, గోగర్భంలో తన భక్తుడు ఆకలితో అలమటిస్తున్న విషయం చెప్పి ఆహారం తీసుకుపోవలసిందిగా చెప్పగానే అతను ఆహారం మూటకట్టుకొని వెళ్ళి, ఒక వెదురుగడకు మూటను కట్టి స్వామివారికి అందించగా, భగవంతుని కృపకు ఆనందించి ఆహారాన్ని భుజించి తృప్తిపడినారు.

(శ్రీ రామకృష్ణ మఠ ప్రచురణ నుండి)

పురందరదాసు 'పద' చమత్కారం

– ఆచార్య డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

కర్ణాటక దేశంలో గ్రామీణుడయినా, నాగరకుడుయినా శైవుడయినా వైష్ణవుడయినా తమ సంభాషణలలో 'పురందరదాసు' కీర్తనల పంక్తుల్ని అలవోకగా అనుసంధానిస్తుంటారు. వాటిలో నంబికెట్టవరిల్ల (నమ్మి చెడ్డవారు లేరు) సత్యవంతరగిదు కాలవిల్ల (సత్యవంతులకు ఈ రోజులు మంచివి కావు) యారిగె యారో పురందరవిఠల (ఎవరికి ఎవరో విఠల) లాంటివి. ఇవన్నీ వైరాగ్య సంబంధివి అయినా పురందరదాసు పదాలలో పౌరాణిక ప్రసంగాలు చాలా ఉన్నాయి. ఆ సన్నివేశాల్ని చమత్కారంగా చెప్పడమే దాసులవారి ప్రత్యేకత. వాటిలో ఒకటి 'హేవ వెల్లిహుదయ్య వైకుంఠపతిగె [illegible] ందా అని ప్రశ్న. ఈ పదం పైకి నాస్తికుల [illegible] అయితే శబ్దచమత్కారముంది.

[illegible] నే తల్లి తల నరికావు. ఇది సరేనా (పరశు [illegible] లను తండ్రి ఆనతి మేరకు ఖండించాడు)

ఒక మామను చంపావు (కృష్ణావతారంలో కంసవధ), ఒక మామ మీద బాణం అనుసంధానించావు (రామావతారంలో రాముడు సముద్రుడు దారి ఇవ్వకపోతే అస్త్రసంధానం చేశాడు). ఒక మామతో బాహా బాహి సమరం చేశావు (జాంబవంతునితో కృష్ణావతారంలో). పోనీ 'బావ' అనే గౌరవముందా. రుక్మిని బంధించావు. నిర్దయగా ఒక మఱిదికి సారథి (అర్జునునికి సారథి కావడం) అయ్యావు. కుంభినికి (భూమికి – లక్ష్మికి) మగడయ్యావు. ఒక కుంభానికి (కన్నడంలో పాలు, పెరుగు వ్యాపారం చేసేవారిని కుంభినులంటారు) కొడుకయ్యావు. పోనీ ఆగావా యదువంశంలో దుమఘోషుని భార్య శ్రుతశ్రవ (వసుదేవుని సోదరి)కు కుంభిని అని పేరు. ఆమె కొడుకు శిశుపాలుడు. ఆ శిశుపాలుని నిండుసభలో చంపావు.

– ఆచార్య కె.సర్వోత్తమరావు (తిరుపతి)

అంబుధికి (నదికి) తండ్రి అయ్యావు. అంబుధికి (సముద్రునికి) కొడుకయ్యావు. మత్స్యంగా సముద్రంలో పుట్టావు. అంబుధిజాత (సంద్రంలో పుట్టిన స్త్రీకి)కు మగడయ్యావు.

అయినా వైకుంఠపతీ పురందరవిఠల నీ బంధువర్గ వ్యవహారం అంతుపట్టని ఆకాశమంత రహస్యం.

మహాపరిత్తం

ఒకానొక సమయమున భగవానుడు శ్రావస్తియందు అనాథ పిండకుని ఆరామం జేతవనంలో ఉన్నప్పుడు ఒకనాటి రాత్రి కడపటి జాములో జేతవనమునంతటినీ తన ఉజ్జ్వల కాంతితో ప్రకాశింపజేస్తూ ఒక దేవపుత్రుడు భగవానుని సన్నిధికి ఏ తెంచినాడు, భగవానుణ్ణి సమీపించి ప్రణామం చేసి ఒక ప్రక్కకు జరిగి వినయంగా నిలబడి భగవానుని ఇలా అర్థించినాడు.

1. చాలామంది దేవతలు మనుష్యులు స్వస్త్యయనమును (**well - being)** ఆకాంక్షించినవారై మంగళములు (**blessings**) ఏవి అని మీమాంసంలో పడినారు. మంగళములలో ఉత్తమమైన మంగళమును తెలియజెప్పుము.

భగవానుడు :

2. మూర్ఖులకు దూరంగా ఉండడం, పండితులతో (**wise men)** సాన్నిధ్యం కలిగియుండడం, పూజనీయులను గౌరవించడం – ఇవి ఉత్తమ మంగళములు (**bring great blessing**).

3. అనుకూల ప్రదేశంలో నివాసం కలిగియుండడం, పూర్వం చేసుకొన్న పుణ్యం సరియైన ప్రణిధి (**aspiration=** సంకల్పం) – ఇవి ఉత్తమ మంగళములు.

4. పాండిత్యం **(vast learning)** , పనితనం, క్రమశిక్షణ, మంచిశిక్షణ, మంచిమాటలు – ఇవి ఉత్తమ మంగళములు.

5. తల్లిదండ్రులకు సేవ చేయుట, భార్యాబిడ్డలను పోషించుట, స్వచ్ఛమైన **(free from greed, hatred etc)** పనులు – ఇవి ఉత్తమ మంగళములు.

6. దానం (**generosity**) సద్వర్తన, బంధువులకు సహాయత, అనిందితమైన (**blasmeless)** పనులు – ఇవి ఉత్తమ మంగళములు.

7. పాపాకార్యాల పట్ల విముఖత, మద్యపానం చేయకుండుట, కర్తవ్యముల

పట్ల జాగరూకత – ఇవి ఉత్తమ మంగళములు.

8. పెద్దల ఎడల గౌరవం – వినయం, లభించినదానిపట్ల సంతుష్టి, సహాయపడినవారిపట్ల కృతజ్ఞత, ధమ్మశ్రవణం **(listening of the teachings of Buddha)** ఇవి ఉత్తమ మంగళములు.

9. ఓరిమి, విధేయత, శ్రమణుల దర్శనం, ధమ్మమీమాంస (చర్చలు) – ఇవి ఉత్తమ మంగళములు.

10. తపస్సు, బ్రహ్మచర్యం, నాలుగు ఆర్యసత్యముల దర్శనం, నిర్వాణ సాక్షాత్కారం **(experiencing)** ఇవి ఉత్తమ మంగళములు.

11. లోకధర్మాల తాకిడికి చలించని చిత్తము. శోకానికి వశం కాని చిత్తము, నిర్మలచిత్తము, క్షేమాన్ని **(real security** = భద్రత) పొందిన చిత్తము – ఇవి ఉత్తమ మంగళములు.

12. ఈ ముప్ఫైఎనిమిది మంగళాచరణములు కలిగినవారు జీవితంలో ఎక్కడా అపజయం పొందరు. అన్నిచోట్ల భద్రతను కలిగియుందురు. ఈ ఉత్తమ మంగళములు వారికి స్వంతమగును.

ఆశంన

ఈ సత్యవచన ప్రభావం వల్ల నాకు స్వస్తి **(safety)** కలుగుగాక !

ఈ సత్యవచన ప్రభావం వల్ల నాకు జయమంగళం కలుగుగాక !

ఈ సత్యవచన ప్రభావం వల్ల సకల రోగములు నశించుగాక !

వేదాన్తభేరికి పోషక చందా ఈ క్రిందివారు పంపినారు

01.	గ్రంధి రాము (కాకినాడు)	–	రూ. 1200/-
02.	బి.ధనంజయ (అమలాపూర్)	–	రూ. 1200/-
03.	పి.జయప్రకాష్‌జెట్టి (వెంకటగిరి) (అడ్వకేట్)	–	రూ. 1200/-
04.	వి.వెంకటరమణ (కొరిటికల్)	–	రూ. 1200/-



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

– శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ అఘం సకేవలం భుంక్తే యే పచన్త్యాత్మకారణాత్ ।
యజ్ఞ శిష్టాశనం హ్యేతత్సతామన్నం విధీయతే ॥ (మ.స్మృ.3-118)

అర్థము : ఎవరు దేవతలకు, అతిథులకు మరియు నితరప్రాణులకు నన్నము సమర్పించకుండా కేవలము స్వార్థమునకై ఒంటరిగా భుజించునో నతడు భోజనరూపములో పాపమునే తినుచున్నాడు. ఎందుకనగా గృహస్థులకు విధానము చేయబడిన పంచయజ్ఞములను చేయగా యజ్ఞ శేషాన్నమే సజ్జనులయొక్క అన్నమని చెప్పబడినది.

మంత్రవర్ణము : మోఘమన్నం విన్దతే అప్రచేతాః సత్యం బ్రవీమి వధ ఇత్సతస్య ।
నార్యమణం పుష్యతి నో సఖాయం కేవలాఘో భవతి కేవలాదీ ॥
(ఋగ్వేదము : 10 - 117 -6)

అర్థము : ఏ అవిద్వాంసపురుషుడు యే పాపమయ అన్నమును గ్రహించుచున్నాడో, వాడు ఆత్మఘాతకుడేయని యర్థము. ఎవడు వైశ్వదేవం చేత సూర్యుని తృప్తి పఱచడో, రాత్రియందున ఉపకారకుడైన యగ్నిని తృప్తిపరచడో కేవలము దేహపోషణార్థము భక్షించుచున్నాడో, వాడు ఆ రూపంలో పాపమునే భక్షించుచున్నాడు. పాపియే యగుచున్నాడు అని సత్యమును చెప్పుచున్నాను.

శ్లో ॥ తైర్దత్తానప్రదాయైభ్యో యోభుంక్తే స్తేన ఏవ సః (గీత 3-12)

అర్థము : దేవతలనుద్దేశించి చేయబడిన యజ్ఞములచే దేవతలు తృప్తినొంది యజ్ఞకర్తలైన యజమానులకు ఇష్టమైన భోగములనిచ్చుదురు. ఏ పురుషుడైతే వారి (దేవతల) చేత ప్రదత్తమైన భోగములను వారికి నివేదించకుండా భుజిస్తాడో (అనుభవిస్తాడో), అతడు చోరుడు (దొంగ) అనబడుతాడు.

శ్లో ॥ భుంజతే తేత్వఘం పాపా యే పచన్త్యాత్మకారణాత్ (గీత 3-13)
అర్థము : ఎవడు వైశ్వదేవాదులకు సమర్పించకుండా వాడి దేహపోషణకై మాత్రమే వండుకుని తింటాడో, ఆ పాపి పాపమునే ఉపభోగిస్తున్నాడని తెలియాలి.

శ్లో ॥ విప్రాతిథ్యే కృతే రాజన్ ! భక్త్యా శుశ్రూషితే 2 పిచ ।
దేవా శుశ్రూషితాః సర్వే త్రయస్త్రింశదరిందమ ॥
(మహాభారతము - ఆశ్వమేధిక పర్వము - వైష్ణవ ధర్మ పర్వము - పృష్ఠము 6329 గోరక్ పూర్ ప్రెస్ - హిందీ)
అర్థము : హేశత్రుదమన ధర్మరాజా ! బ్రాహ్మణునికి అతిథి సత్కారము మరియు శ్రద్ధా భక్తిపూర్వక సేవ చేయుట చేత ముప్పది మూడు కోట్ల (ప్రకారముల) దేవతల సేవ ఘటిల్లును.

శ్లో ॥ అభ్యాగతో జ్ఞాత పూర్వో హ్యజ్ఞాతో 2 తిథిరుచ్యతే ।
తయోః పూజాం ద్విజః కుర్యాదితి పౌరాణికీ శ్రుతిః ॥
అర్థము : పూర్వపరిచిత ఆహ్వానింపబడిన పురుషులు ఇంటికేతెంచిన వారిని అభ్యాగతులంటారు. అపరిచిత పురుషుడు సకాలమునకు విచ్చేసినచో అతనిని అతిథి యని యంటారు. వీరిరువురికి గృహస్థుడైనవాడు యథోచిత పూజలు చేయవలెనని - పంచమ వేదమైన పౌరాణిక శ్రతి చెప్పుచున్నది.

శ్లో ॥ ఏకరాత్రం తు నివసన్నతిథిర్బ్రాహ్మణః స్మృతః ।
అనిత్యం హిం స్థితో యస్మాత్తస్మాదతిథిరుచ్యతే ॥ (మ.స్మ. 3-102)
అర్థము : గృహస్థుని యింటికి ఒక రాత్రి నిలుచుటకు మాత్రము వచ్చు (యాత్రికుడైన) బ్రాహ్మణుని అతిథి యందురు. (న విద్యతే తిథిర్యస్య సః అతిథిః) అతడు వచ్చుటకు తిథి (సమయము) నిశ్చయము లేదు గనుక " అతిథి " యనబడుతాడు.

సత్యంవద , ధర్మంచర

(గత సంచిక తరువాయి)

- బి.ఎన్. కల్యాణ సుందరం (బెంగుళూరు)

దైవభక్తి ప్రీతి వాత్సల్యములు, ప్రేమాభిమానములు శాంతి సహనములు, పరోపకారములు ఇత్యాది సద్గుణములు హృదయము నుండి ఆవిర్భవించునవి. వీటిని స్వధర్మములుగ గుర్తించ తగినది. ఈ స్వధర్మములను పాటించువారు ఆత్మసాక్షాత్కారమును పొందగలుగుదురు. కాబట్టి స్వధర్మాన్ని స్వీకరించి, అధర్మాన్ని ధిక్కరించడం ఉత్తమ మానవుని లక్షణంగా భావించతగినది.

స్వధర్మే నిధనంశ్రేయః ।
పరధర్మో భయావహః ॥

ఆత్మసంబంధమైనది స్వధర్మము. ఇంద్రియ సంబంధమైనది పరధర్మము. పరధర్మమాసించువారు ఇంద్రియముల నిగ్రహించని ' బలహీనులు'. " నాయమాత్మాబలహీనేనలభ్యః " లౌకిక భౌతిక వ్యామోహములచే అశాంతి నెదుర్కొనెదరు. దీనివల్ల మానవుని జీవితం అంధకారాన్ని ఆహ్వానిస్తుంది.

స్వధర్మపోషకులు ఇంద్రియముల నిగ్రహించు సమర్థులు. భౌతిక వ్యామోహములకు దూరమై, దృశ్య పదార్థముల నాశించక ఆత్మాభిమానాన్ని గుర్తించగల పురుష శ్రేష్ఠులు.

మానవత్వము ప్రేమాభిమానములతో నిండియున్నది. " అనంతోవై ప్రేమః " అనంతమైనది ప్రేమ. ప్రేమ సత్య స్వరూపమైనది. ప్రేమశాంతికి నిదర్శనము, ప్రేమనవరసములతో కూడియున్నది.

నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం
నిత్య - శుద్ధ - బుద్ధ - ముక్త - నిర్మల స్వరూపం

సత్య, ధర్మ, శాంతి, ప్రేమ అహింసాదులు మానవుడి పంచ

ప్రాణాలుగా భావించతగినది. ఇవి ఆతని ఆత్మ గౌరవానికి ప్రతిరూపములు. ఈ అమూల్యమైన సద్గుణాదులు మానవుని సిరిసంపదలు. ఇవి అతని మనోభావములను తీర్చిదిద్దగలవు. అతని బుద్ధి కుశలతలను సవరించగలవు. అతని సంస్కారమును చక్కబెట్టగలవు. అతని ఆత్మ స్వరూపమును బాగు చేయగలదు. మానవుడి ప్రాధాన్యతను బలపఱచ గలదు. కాని ఈ సౌలభ్యములు స్వధర్మములనాశించు సుజనశీలులకు మాత్రము వర్తించును గాని అన్యులకు గాదు. కాబట్టి, మనస్సు, బుద్ధి , సంస్కారాదుల సహకారం చేత మానవుడు మాధవుడుగా పరిణమించగల విశ్వాసమేర్పడకపోదు.

ఆత్మభావమును గుర్తించక, భౌతిక వ్యామోహముల నాశించి, దేహభ్రాంతి చేత అనేక దుష్కార్యములనొనరించి బ్రతుకనెంచిన మానవుడు కష్టనష్టాలతో, దుఃఖితుడై పరితపించక తప్పదు. అందుచేత అశాశ్వతమైన దేహాన్ని మఱచి నిర్మలచిత్తుడై, నిశ్చల మనస్కుడై, సుఖశాంతుడై మెలగదలచి నంత, మానవుడు పాటించవలసిన ధర్మసూక్తులు.

1. **సర్వలోక హితే రతా :** లోకశ్రేయస్సు నాశించుట
2. **సర్వ సముదితాగుణై :** సద్గుణములను పోషించుట
3. **సర్వేజ్ఞానోపసంపన్నా :** జ్ఞానాన్ని పెంచుకొనుట

ఈ మార్గములననుసరించు మానవుడు ఒక ప్రయోజకుడుగ, సుజనశీలుడుగ, ఆదర్శవంతుడుగ రాణించగలడు.

" త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు " కు భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి నిమిత్తం ఈక్రింది వారు పైకం పంపినారు

01.ఎం.రాధాకృష్ణ గారు (కోరమంగళ, బెంగుళూరు)- రూ. 25000

02. అత్యం వెంకటాచలం గారు (పెనుగొండ, ప.గో.జిల్లా) రూ. 30600

03. మన్నె వెంకటవిద్యాసాగర్ గారు (హైద్రాబాద్) రూ. 10000/-

డా ॥ సముద్రాల లక్ష్మణయ్యకు విశ్వభారతీ పురస్కారం

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల ప్రధాన సంపాదకులు ధర్మప్రచార పరిషత్ మాజీ కార్యదర్శి డా ॥ సముద్రాల లక్ష్మణయ్యను కాశీక్షేత్రంలోని జంగమవాడి మఠసంస్థానంవారు శ్రీజగద్గురు విశ్వారాధ్య విశ్వభారతీ పురస్కార ప్రదానం చేసి గౌరవించారు. ఈ పురస్కారం మహాశివరాత్రి సందర్భంగా కాశీలోని పై మఠంలో 16-02-2015న నిర్వహించిన సంస్కృత పండిత పరిషత్ సమావేశంలో విశ్వారాధ్య జ్ఞాన సింహాసన పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములవారి చేతులమీదుగా 25,000 రూపాయల నగదు, సన్మానపత్రం, శాలువాలతో సహా అంద జేయడమైనది.

ఈ సందర్భంలో 'సిద్ధాంత శిఖామణి ' అను శైవసిద్ధాంత గ్రంథంపై సముద్రాల లక్ష్మణయ్య తాము సంస్కృతంలో రచించిన ఒక సమీక్షాగ్రంథాన్ని మఠాధిపతులకు సమర్పించారు.

డా ॥ సముద్రాల లక్ష్మణయ్య గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం దేవస్థాన ప్రచురణలకు ప్రధాన సంపాదకులుగా, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా వున్నారు. సంస్కృతాంధ్రభాషలలో నలుబదికి పైగా గ్రంథాలు రచించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంవారు వీరికి 'వాచస్పతి', 'మహామహోపాధ్యాయ ' అనే గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసి వున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు వీరిని ' ఉత్తమ సంస్కృత పండిత' బిరుదుతో సత్కరించి వున్నారు.

శ్రీవ్యాసాశ్రమ పూర్వ విద్యార్థి - శ్రీమలయాళస్వాములవారి శిష్యులు అయిన వీరికి ఈ పురస్కారం అందడం ముదావహమని వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థులు, భక్తులు హర్షం ప్రకటించారు.

గోమాతగోడు

– రచయిత : మిట్టపల్లి శంకరయ్య

పల్లవి : గోభక్తులార నా గోస చూడండి
గోశాల యందు నా గోడు వినండి
కసాయి వాడికి నన్ను అమ్మకండి
దేవుడిచ్చిన వరము మీకు నేనండి **గోభక్తులార**

చరణము : ఆకలైతే నాకు ఆహారమెక్కడ
దాహమేస్తే నాకు నీల్లెవరిస్తారు
రోగమొస్తే నాకు మందెవ్వరిస్తారు
కష్టమొస్తే నన్నెవరాదుకుంటారు **గోభక్తులార**

చరణము : యెండలో ఎండి వానలో తడిసి
చలిని తట్టుకోక చచ్చిపోతున్న
వచ్చే వారు లేరు చూసె వారు లేరు
యెట్లా నా బ్రతుకు యెవరినడుగాలి **గోభక్తులార**

చరణము : అభివృద్ధి కోరల్లో దుర్బుద్ధి పుట్టేను
కాలుష్య కోరల్లో భూదేవి మాడేను
ప్రజానాయకులు పట్టించుకోరాయె
అధికారులూ ఆలోచించరాయె **గోభక్తులార**

చరణము : తినబోదామంటే గడ్డి కరువాయె
తాగబోదామంటే నీరు కరువాయె
అవ్వలారా రండి అయ్యలారా రండి
మీ పిల్ల పాపలు చల్లగుండాలండి **గోభక్తులార**

చరణము : భక్తి ప్రేమతో పూజ చేయండి
మీ ఇల్లు బంగారమైపోవునండి
భరత భూమి మిమ్ము మన్నించునండి
గోపాలుడు మిమ్ము రక్షించునండి

వార్తలు

(01). 30-03-2015 తేది చైత్ర శుద్ధ ఏకాదశి నాడు శ్రీ వ్యాసాశ్రమ స్థాపకులు పరమ గురుదేవులు పరమపూజ్య సద్గురు మహర్షి మలయాళస్వాములవారి 102వ జన్మదినోత్సవము శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. శ్రీ స్వాములవారి ఛాయాచిత్రానికి షోడశోపచార పూజ – అర్చన చేయబడినది. భక్తులకు తిరుపతి వాస్తవ్యులు సద్గురు అనన్య భక్తులు మహా మహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారి ద్రవ్యంచే భిక్ష చేయబడినది.

(02). 03-04-2015 చైత్రశుద్ధ చతుర్థశి నాడు గురుదేవులు పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 17వ ఆరాధనోత్సవాలు ప్రారంభమైనవి. నేడు శ్రీవారి దివ్య విగ్రహానికి గంగాజలంతో అభిషేకం చేయబడినది. షోడశోపచార పూజ మహానైవేద్యం చేయబడి భక్తులకు అన్న సంతర్పణ జరిగినది. 04-04-15న ఆశ్రమ వార్షికోత్సవము, 5-04-15తేది కంటి ఆస్పత్రి వార్షికోత్సవం, 6-4-15 తేది సద్గురు సర్వసేవా ట్రస్టు వార్షికోత్సవము జరిగినది. 7-4-15 వతేది చైత్ర బహుళ తదియ నాడు గురుదేవుల 102వ జన్మదినోత్సవం జరిగినది. ఈ పాంచాహ్నిక కార్యక్రమాలకు వివిధ ప్రాంతముల నుండి మహాత్ములు వచ్చి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

(03). 23-4-2015తేది గురువారం నాడు జగద్గురు ఆదిశంకరాచార్యుల జయన్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. ఉదయం శ్రీ శంకరాచార్యుల వారికి షోడశోపచార పూజ, అర్చన, ప్రసాద వినియోగం జరిగినది. సాయంకాలం శంకరాచార్యుల విశిష్టత గురించి ఉపన్యాసాలు జరిగాయి.

(04). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో మార్చి నెలలో **ఓ.పి.విభాగంలో 1148 గురికి** కంటి పరీక్షలు చేసి చికిత్సలు చేయబడినవి. **111 మందికి కంటి పొరలు** ఆపరేషన్ చేసి లెన్సు అమర్చబడినవి.

పాపభీతిని కోల్పోవడమే

అశాన్తికి కారణం

ప్రేమ స్వరూపులారా! అందరియందున్న ఆత్మ తత్త్వము ఒక్కటే అని గుర్తించండి. భేదములను త్రుంచుకోండి. ప్రేమ ప్రకాశమును అనుభవించండి. ఈనాటి మానవుడు పాపభీతిని కోల్పోవడం వలన ఎన్నో విధములైన పెడమార్గాలు పడుతున్నాడు.

పాపభీతిలేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దానిబట్టి
మానవత్వమణిగె మానవులందున
విశ్వశాన్తి కిదియే విప్లవంబు

మానవునియందు దివ్యత్వము మరుగుపడడానికి కారణం ఇదియే. మానవునివలె పశు పక్షి మృగాదులు కూడా ఆనందమును ఆశిస్తున్నాయి. అనుభవిస్తున్నాయి. కాని మానవుడు అనుభవించే ఆనందమునకు పశుపక్షి మృగాదులు అనుభవించే ఆనందమునకు వ్యత్యాసమున్నది. పశుపక్షిమృగాదులు సుఖానికి పొంగిపోవు. దుఃఖానికి కృంగిపోవు. సుఖదుఃఖాల పట్ల అవి సమత్వం వహిస్తాయి. కాని మానవునియందు ఆ సమత్వం లేదు. కామ క్రోధాది దుర్గణములను అరికట్టుకోలేక మానవుడు పతనం చెందుతున్నాడు

– శ్రీ సత్యసాయిబాబా

Regd.No. TRP / 123 / 2015-17 May 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-04-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

______	ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	8 నుంచి 10 సం. మధ్య.
స్టైఫెండ్	నెలకు రూ. 1,000/-
______	ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	15 సం॥ ఆపైన
స్టైఫెండ్	నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

______	(సామవేదము/అథర్వవేదము–వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	2 సంవత్సరములు
సంభావన	నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
______	(ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	5 సంవత్సరములు
సంభావన	నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020
Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,
E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

జూన్ 2015

రూ. 6/-



అందరినీ సమత్వంగా చూడండి

దూడను చూచిన తక్షణమే గోవు చేపు విడుస్తుంది. అదేవిధంగా నిర్మలమైన ప్రేమను గలిగి నిస్స్వార్థపరుడై ఉన్న భక్తుని చూచిన తక్షణమే భగవంతుడు జ్ఞానామృతమును ప్రసాదిస్తాడు.

మీ అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు ఆహారంలేక బాధపడుతూంటే మీరు భరించగలరా? అందరూ భగవంతుని బిడ్డలే! కాబట్టి దిక్కులేక దీనులై తపించే ప్రజలకు మీ శక్తికొలదీ సహాయం చేయండి. జాతి, మత, కుల, భేదములను విడనాడి అందరినీ సమత్వంతో చూడండి.

– శ్రీ సత్యసాయిబాబా

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 జూన్ 2015 సంచిక : 6

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు, విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadha Raju Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 జూన్ 2015 సంచిక : 6

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ధ్యానయోగము అత్యావశ్యకము–శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు- 06
03. ధ్యానము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 14
04. యోగము - శ్రీ శివానంద సరస్వతి స్వాములవారు - 18
05. సంప్రదాయాలు - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 23
06. పూర్ణయోగం - ముఖ్య వివరణలు - నైనారు అప్పాస్వామి - 27
07. పాపతేని మంచం - ఆచార్య డా॥ కె.సర్వోత్తమరావు - 32
08. అపర పరమేశ్వరుడు - ఆదిశంకరుడు - ఎ. తారాలక్ష్మి - 33
10. యోగావశ్యకత - శ్రీ స్వామి శివానంద సరస్వతి - 35
11. సప్తర్షుల అవతార వృత్తాంతం - లగడపాటి భాస్కర్ - 38
12. ప్రథమ ప్రపంచ యోగ దినోత్సవము -
శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 41
12. వార్తలు - 42

ముఖచిత్రం :

ధ్యాన ముద్రలో పూజ్యశ్రీ

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రపంచ ప్రథమ

"యోగ దినోత్సవము" జూన్ 21వ తేది

– డా
న సముద్రా
లక్ష్మణయ్య

ప్రార్థన

(01). ఓం పావకా నః సరస్వతీ వాజేభి ర్వాజినీ వతీ ।
యజ్ఞం వష్టు ధియా వసుః ॥ (ఋగ్వేదం 1-1-9-10)

తా ॥ సర్వవిద్యామయీ ! ఓ వాక్పతీ నీ కృపవలన మాకు సకల శాస్త్ర విజ్ఞానంతో గూడిన వాణి (సరస్వతి) లభించుగాక ! ఉత్కృష్టమైన అన్నాదులతోబాటు సర్వోత్తమ క్రియావిజ్ఞానంతో కూడిన పవిత్ర స్వరూపం గల మంగళకారినియగు వాణి నీ ప్రేరణచే లభించుగాక ! నీ యనుగ్రహంతో పరమోత్తమబుద్ధితో గూడిన ఈ వాణి సకలశాస్త్రబోధ గలిగినది. పూజనీయుడువగు నీ విజ్ఞానాన్ని సదా కోరునదియగుగాక ! దీనిచే మేము పాండిత్యం గలవారమగుదుము గాక !

(02). ఓం శం నో భగః శము నః శంసో అస్తు శం నః
పురంధిః శము సన్తు రాయః ।
శం నః సత్యస్య సుయమస్య శం సః శం నో
అర్యమా పురుజాతో అస్తు ॥ (ఋగ్వేదం 5-3-28-2)

తా ॥ ఈశ్వరా ! నీవు ఇచ్చిన ఐశ్వర్యము మాకు సుఖమునిచ్చునది యగుగాక ! నీ దయ వలన మా యొక్క సుఖప్రదమైన ప్రశంస ఎల్లప్పుడు జరుగుగాక ! సత్యమైన యథార్థ ధర్మము మఱియు లోకమందంట ప్రసిద్ధమైన పరమానందము, శాన్తి మాకు లభించుగాక ! న్యాయాన్ని చేయువాడవు, అనంతసామర్థ్యంగల నీవు మాకు కళ్యాణకారకుడవు అగుదువు గాక !

(03). పతంజలి వ్యాసముఖ్యాన్ గురూ నన్యాంశ్చ భక్తితః ।
నతో2స్మి వాఙ్మనః కాయైః అజ్ఞానధ్వాంత భాస్కరాన్ ॥

తా ॥ అజ్ఞానాంధకారమును పోగొట్టుటకై అనేక సూర్యులవలె ప్రకాశించుచున్న శ్రీ పతంజలి మహర్షి, శ్రీ వ్యాస మహర్షి మొదలగు ముఖ్యులైన గురువులను త్రికరణాలతో భక్తిపూర్వకంగా ప్రణమిల్లుతున్నాను.



ధ్యానయోగము అత్యావశ్యకము

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పరమార్థపథమున పురోగమించు సాధకునకు ధ్యానయోగము అత్యావశ్యకమైయున్నది. ఒక వస్తువును గూర్చి తదేకనిష్ఠతో ధ్యానించునపుడు ధ్యాతయొక్క చిత్తమంతయు ధ్యేయాకారముగ పరిణమించి పోవును. ఇది ప్రకృతిలో గల నియమము. కీటకము (పురుగు) భ్రమరము (తుమ్మెద)ను నిరంతరము చింతన జేయుటవలన భ్రమరాకారముగ మారుచుండునని లోకప్రతీతి. దీనినే ' భ్రమరకీట న్యాయ ' మనియు అందురు. చిత్తము ఒక అద్దము వంటిది. అద్దము తన పురోభాగమున నేది యుండునో దానిని తనయందు ప్రతిబింబింప జేసికొని తద్రూపమును బొందుచుండును. అట్లే చిత్తమున్ను, అసుర సంపత్తి, దయ్యపు స్వభావము దాని ముందుంచిన చిత్త మా యసుర రూపమునే పొందును. దైవసంపత్తి, సత్త్వగుణ స్వభావము దాని ముందుంచిన చిత్త మా సత్త్వగుణ రూపమునే పొందును. కావున పారమార్థిక శ్రేయము కొఱకై, నిత్యశుద్ధ బుద్ధముక్తమగు హృదయస్థ పరమాత్మనే ధ్యానించుచు చిత్తమును అద్దానియందే ప్రతిష్ఠింపజేయవలెనని భగవానుడు గీతలో తెలిపియున్నారు.

' ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చిన్తయేత్ '

' మనస్సును బాహ్యమునుండి మఱల్చి అంతర్ముఖ మొనర్చి ఆత్మయందు స్థాపించి ఆత్మేతరమగు ఎద్దానిని చింతింపరాద'ని ఆదేశించెను. ధ్యానమందు ఏమి చేయవలెనో ఈ శ్లోకపాదము స్పష్టముగ పేర్కొనినది. ఈ ప్రకారముగ ధ్యాననిష్ఠచే మనస్సు క్రమముగా తనయందలి రజోగుణ,

తమోగుణములను, వాసనా మాలిన్యమును పారద్రోలి క్రమముగ ధ్యేయాకారమగు ఆత్మ స్వరూపమునే పొందుచున్నది. ఉప్పుకల్లు సముద్రములో పడి సముద్రాకారమును జెందునట్లు సామాన్యమగు చిత్తము ధ్యానాదులచే ఆత్మయందు విలీనమై మహత్తమమగు ఆత్మరూపముగనే మారిపోవుచున్నది. ఈ ప్రకారము ధ్యానము మోక్షప్రాప్తికి హేతు భూతమగుటచే సర్వులకును ఇయ్యది అత్యావశ్యకమయి యున్నది.

కావున అట్టి ధ్యానము నెట్లు శీలించవలెనో ఇపుడు తెలిసికొందము– గృహమందుగాని, మఠమందుగాని ధ్యానించుటకొక చోటు నెన్నుకొని దానిని చాల పవిత్రముగ నుంచవలెను. ' బాహ్యాభ్యన్తర శ్శుచిః ' అనునట్లు అంతఃకరణశుద్ధియే ముఖ్యము కాని తక్కినదానితో మనకేమిపని యని తలంచక బాహ్యపరిసరములున్ను శుద్ధముగా నుండునట్లు చూడవలెను. మలినప్రదేశములయం దుండు వారికి మలిన సంకల్పములే ఉదయించుచుండును. దేవాలయములను ప్రతిరోజు ఊడ్చి, కడిగి, ధూపదీపములు వెలిగించి పవిత్రవంతముగా నుంచుటకు కారణమేమి ? అచట ప్రవేశించిన వారికి అందటికిని ఆ శుచి, శుభ్రత వలన, దైవసాన్నిధ్యము వలన ఉదాత్తభావములు కలుగుటకొఱకే. కనుకనే ధ్యానపద్ధతిని చెప్పుట కుపక్రమించుచు, శ్రీ కృష్ణభగవానుడు ' శుచౌదేశే ' (నిర్మల ప్రదేశమందు) అని సెలవిచ్చెను. 'శుచౌ దేశే' అని సర్వసామాన్యముగ **(GENERAL)** చెప్పుట వలన ఇల్లుకాని' వనము కాని, మఠముకాని, పర్వతగుహకాని ఏది యైనను సరియే శుచిగా నున్నచో ధ్యానమునకు యోగ్యమే యని తెలియుచున్నది.

" ఇండ్లలో ధ్యానము జరుగునా ? " అను సందియ మేమాత్రము పెట్టుకొనక ఇంటిలో నొక గదిని ప్రత్యేకముగ పూజార్చనాధ్యానాదులకై

నియమించి భగవానుడు తెలిపినట్లు దానిని శుచివంతముగ నుంచు కొనవలయును. దానిని గోమయముతో అలికి ముగ్గులు పెట్టి, అగరు వత్తి, సాంబ్రాణి మొదలగు సుగంధద్రవ్యములను వేల్చుకొని, దీపారాధన గావించి, అవతార పురుషులు, మహనీయులు నగు వారి పటములతో నా ప్రదేశము నలంకరించి దేవమందిరముగ, తయారు చేసికొనవలయును. చంటిపిల్లలను లోనికి రానీయగూడదు. ఏలననగా వారు శబ్దము చేయుదురు. పశు వికారములను కలుగజేయు శృంగార పటములను వేనిని అచట చేర్చరాదు. ఒక వ్యక్తి ఏ స్థితియందున్నాడో, ఏ గుణము నాశ్రయించి యున్నాడో, అతను యింటిలో తగిలించి యుండు పటములను చూచి చెప్పివేయవచ్చును. సత్త్వగుణము నాశ్రయించి యుండు వ్యక్తి తన యింటిలో రామకృష్ణాద్యవతారముల యొక్కయు ఇతర దేవతల యొక్కయు, మహాత్ముల యొక్కయు పటములను తగిలించుకొనుచు. రజోగుణము నాశ్రయించి యుండు వ్యక్తి రాజకీయవేత్తల యొక్కయు, ప్రాపంచిక మిత్రులయొక్కయు పటములను తగిలించుకొనును. తమోగుణము నాశ్రయించియుండు వ్యక్తి పాశవిక భావములను రగుల్కొల్పు బూతుబొమ్మలను తగిలించుకొని ఆనందించుచుండును. కాబట్టి తరింప నుద్దేశము గల సాధకుడు తన పరిసరములను పునీతముగ నొనర్చుకొని అపవిత్ర వస్తువులను జేర్చక, ఉన్నత భావములకు అవకాశమిచ్చు కార్యములనే చేయుచు, క్రమముగ ధ్యానమును అభ్యసించవలెను.

ధ్యానము చేయునపుడు సాధ్యమైనంతవఱకు ఒంటరిగ నుండుటయే మంచిది. సామాన్యముగ ఇద్దఱు ముగ్గఱు కలిసి ఒకేచోట ప్రక్క ప్రక్కన కూర్చుండి ధ్యానము ప్రారింభించినచో ప్రాథమికదశలో వాడేమి చేయుచున్నాడో చూడవలెనని వీనికి, వీడేమి చేయుచున్నాడో చూడవలెనని

వానికి సంకల్పములు కలిగి విక్షేపము జనించుచుండును. 'ఏక్ నిరంజన్ ' అను సామెత లోకములో కలదు గదా ! మఱియు ' దో గడబిడ్' అను విషయమునుగూడ జ్ఞాపకమునందుంచుకొనవలసియున్నది. కనుకనే గీతాచార్యుడు ధ్యాన మెట్లు చేయవలెనో చెప్పుటకు ప్రారంభించుచు ' రహసి స్థితః ' (ఏకాంతముగ ధ్యానము సలుప వలయును) ' ఏకాకీ (ఒంటరిగా ధ్యానింపవలెను) అని హితవు పలికియున్నాడు. కొందఱు ధ్యానించునపుడు కాని సంధ్యావందనము చేయునపుడు కాని బహిరంగ స్థలములందు కూర్చొనుచుందురు. తాను పరమభక్తుడని నలుగురు తెలిసికొనవలెనని వారి ఉబలాటము. ఇట్టి ప్రదర్శన **(Emblition)** స్వభావము ధ్యాతకు ఉండరాదు. ధ్యానమకాని, ప్రార్థనకాని, జపముకాని, పూజకాని భక్తునకు భగవంతునకు సంబంధపడిన క్రియయే కాని, దారినపోయే వారితో సంబంధపడినది కాదు. పైగా ఒకరి మెప్పుకొఱకు చేయబడునదియు కాదు. తాను ధ్యానించుచున్నాడని పత్రికలలో పడవలసిన అగత్యమున్ను లేదు. మన హృదయ సాక్షియగు సర్వేశ్వరు డొకడు తెలిసికొనిన చాలును. అతనికో మనము ఏ మూల ధ్యానించినను తెలిసికొనుశక్తి ఉండనే ఉన్నది. కాబట్టి సాధకుడు ఏకాంతముగ, ఒంటరిగ ధ్యానించుట శ్రేయస్కరము.

మిక్కిలి యెత్తుగాను, మిక్కిలి పల్లముగాను లేనట్టి స్థానమున (అనగా ఒకింత ఎత్తుగానున్న చిన్న పీట మొదలగు వానిపై ం దర్భాసనము పఱచుకొని, దానిపై గుడ్డ పఱచి ఈ ప్రకారముగ మెత్తగ, కదలకయుండు ఆస్తరణముపై తనకు అనుకూలమైన ఆసనము వేసుకొని కూర్చుండి ధ్యానము ప్రారంభింపవలెను.

' స్థిరసుఖ మాసనమ్ '

అని పతంజలి నుడివినట్లు ఏ ఆసనము వేసికొనిన తాను కదలక

నుండగలడో, ఏది తనకు అనుకూలముగ నుండునో దానినే ధ్యానకాలమున సాధకుడు అవలంబించవచ్చును. అయితే కూర్చొనినపుడు శరీరము, శిరస్సు ఏమాత్రము వంగకుండ నిటారుగా నుండవలెను. ఏల యనిన బొడ్డుక్రింద మూలాధారమున నిద్రించుచు నుండు కుండలినీశక్తి తీవ్రధ్యానము యొక్క ప్రభావముచే లేచి ఊర్ధ్వ ముఖముగ ప్రవహింపజొచ్చును. మూలాధారము నుండి బయలుదేరి స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా, సహస్రారము లను షట్చక్రములగుండ ప్రవహించును. అత్తఱి శరీరాద్యవయవములు తిన్నగ నున్నచో ప్రవాహము నిరాటంకముగ జనును. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ ' సమం కాయ శిరోగ్రీవం ' అని పేర్కొనెను. ఈ ప్రకారముగ కూర్చుండి, దృష్టిని ముక్కుచివఱ (నాసికాగ్రమునందు) ఉంచి దిక్కులను చూడకుండ మనస్సును ఏకాగ్రపఱచి పరమాత్మ చింతనమును ప్రారంభించవలెను. గీతయందు నాసికాగ్రదృష్టి చెప్పబడినది. కొందఱు భ్రూమధ్యమందు దృష్టిని నిలిపి ధ్యానింతురు. మఱికొందఱు హృదయస్థానమందు నిలుపుదురు. వేఱొకఱు సహస్రారమందు నిలుపుదురు. వారి వారి అనుకూలమును బట్టి ఏదియో యొకచోట స్థిరపఱచుకొని అచ్చోట దృష్టి నుంచి మనస్సును దృశ్య విషయములపై చెదరనీయక ఏకాగ్రముగ దైవధ్యానము సలుపవలెను.

కాని కొందఱికి ప్రారంభములో మనస్సు ధ్యేయవస్తువగు పరమాత్మయందు నిలుకడను బొందక పూర్వవాసనాబలముచే బయటకు పరుగెత్తుచుండును. వారికి ధ్యానము చేయవలెనను కుతూహలముండును గాని మనస్సు చంచలముగా నున్నదై వేధించుచుండును. లక్ష్యమందు నిలువక పారిపోవుచుండును. అపుడు సాధకుడేమి చేయవలెను ? దానికి శ్రీకృష్ణమూర్తి యిట్లు సమాధాన మొసంగెను.

యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్
తతస్తతో నియమ్యైత దాత్మన్యేవ వశం నయేత్ (6-26)

' మనస్సు చంచలముగను, అస్థిరముగను నున్నదై ఏయే విషయములపైకి పరుగెత్తునో, ఆయా విషయముల నుండి దానిని మరల్చి, దానికి బుద్ధి చెప్పి, మరల ఆత్మయందే యుంచవలెను. ' 'లాలయేత్ చిత్త బాలకమ్ ' అని వసిష్ఠులానతిచ్చినట్లు చిత్తమను బాలకుని హితవాక్యములచే మెల్లగ లాలించి దారికి తీసికొని రావలెను. అంతేగాని బలాత్కారము చేసినచో అయ్యది తిరుగబడును. ప్రతిక్రియ (Reaction) కలుగజేయును. అట్టి మోటు పద్ధతులను ధ్యాననిష్ఠ డెన్నటికిని అవలంబించగూడదు. పూర్వము ఉద్ధాలకుడు తన ఇంద్రియములకు మనస్సునకు ఎంతనయముగ బోధించి వానిని స్వాధీనపఱచుకొనెనో సాధకులు జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను. సాధకు డీ క్రింది విధముగ తన మనస్సున కుద్బోధించవలెను.

ఓ మనసా ! ఓ ఇంద్రియములారా ! మీ రెచటికి పరుగెత్తుదురు? విషయములపైకా ? చాలా పొరపాటు. అయితే అది మీ తప్పుకాదు. అనేక జన్మార్జితములగు ప్రాపంచిక వాసనలవలననే మీ కట్టి బుద్ధి కలుగుచున్నది. ఇంతకాలమువఱకు మిమ్ములను ప్రేరేపించిన యా బుద్ధి అవిద్యావృతమై అంధకారమున బడియున్నది. ఇప్పుడు సద్గురు కటాక్షమున జ్ఞానముదయింప అవిద్య అంతరించిపోవ వస్తువుల యొక్క యథార్థతత్త్వము గోచరించినది. మీరింతవరకు నభిలషించుచున్న యీ పదార్థములు సత్యములు కావు. క్షణిక పదార్థము ఆనందమునెట్లు కలుగజేయగలదు ? నాశశీలమగు వస్తువునుండి నిరతిశయసుఖమెట్లావిర్భవించగలదు ? ఒకవేళ ఆ పదార్థములు రమణీయముగా నున్నవని యందురా ? అది

ఆపాతరమణీయత్వమే కాని వాస్తవ సౌందర్యము కాదు. పంచభూతాత్మకములై కాలక్రమమున నశించి పోవునవియు, క్రుళ్ళి కృశించిపోవునవియు నగు పదార్థములందు ఎలాంటి రమణీయత్వ ముండునో మీరే యోచించుకొనుడు. మోసపోవద్దు. బంగారు లేడిని చూచి సీత మోసపోయినది. అది సత్యమని భ్రమించి దానిని కాంక్షించినది. ఫలిత మేమైనదో మీకు తెలియునుగదా ? శ్రీరామచంద్రుని పోగొట్టు కొనినది. ఆత్మారామునకు (సుఖమునకు) దూరమైనది. (శోక మావరించినది) . కావున (మీరున్ను) ప్రపంచము యొక్క తళుకులను జూచి మురిసిపోయి వాని వెంట పరుగెత్తితిరా, మోకాటి దెబ్బలు తప్ప మఱేవియు మిగులవు. ఎండమావులను జూచి చెంబులు తీసికొని పరుగెత్తువారికి ఎన్ని నీళ్లు లభించునో మీకును అన్నియే లభించును. మీ జన్మహక్కుగు ఆత్మానందము ననుబవించుటకై సన్నద్ధులు కండు. దానికొఱకై మీరు దూరముగ పరుగిడ నవసరములేదు. అది మీ చెంతనే యున్నది. బహిః ప్రవృత్తిని వదలి అంతర్ముఖులు కండు. మీకది కరతలామకలమై పోవును. జన్మ సఫలమగును.

కావున ఓ ఇంద్రియములారా ! ఓ మనస్సా ! అనేక జన్మల యందు బాధపడినది చాలును. ఇప్పటికైనను బుద్ధి తెచ్చుకొని, చెంపలు వాయించుకొని భగవానుని యాదేశమును పాటించి ' న తేషు రమతే బుధః ' అనునట్లు భోగజాలమందు రమింపకుడు. పదార్థ వ్యామోహమును విడనాడుడు. జీవితము అతి స్వల్పమైనది. మృత్యువు శరీరమును కబళించుటకు పూర్వమే మీ లక్ష్యమగు పరమాత్మను జేరుకొనుడు. ' ఉత్తిష్ఠత, జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత' లెండు ! మేలుకొనుడు ! పెద్దల నాశ్రయించి అవిద్య నుండి తెప్పరించుకొనుడు !, అని యీ ప్రకారముగ

ఆ యింద్రియ మనంబులకు మెల్లగా హితబోధ చేసి దృశ్య విషయముల నుండి వాని నెట్టైన మరల్చి ఆత్మయందు స్థాపితము చేయవలెను. ఇంత బోధించినప్పటికిని, మనస్సు ఒప్పుకున్నట్లు ఒప్పుకొని కొంతసేపటికి మరల తటాలున జారిపోవును. అత్తఱి నిరుత్సాహపడకుండ మరల వెనువెంటనే దానిని లేవనెత్తి తీసికొని వచ్చి అధిష్ఠాన మగు ఆత్మయందు, హృదయమందు చేర్చవలెను. ఇంతకు మినహా మనశ్శాంతికి వేఱొకదారి లేదు. ఇట్లు చేయుచు రాగా రాగా, కొంతకాలమున కిక ఆ మనస్సు తన పాత పద్ధతులను మార్చుకొని పాత దారులను వదలిపెట్టి స్వాధీనపడగలదు.

" త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు " కు ఈక్రింది వారు పైకం పంపినారు

(01) అత్యం వెంకటాచలం (పెనుగొండ, ప.గో.జిల్లా) రూ.47,709/-

(02). ఎం.రాధాకృష్ణ (కోరమంగళ, బెంగుళూరు) రూ.25,000/-

(03). మన్నె వెంకటవిద్యాసాగర్ (హైద్రాబాద్) రూ. 10,000/-

(04). దుగ్గి రామమూర్తిశెట్టి (పుత్తూరు) రూ.10,116/-

(05). డి.కె.నాగరాజు (బెంగుళూరు) రూ.10,000/-

(06). వినాయక నాగనాథ్ కోటా (షోలాపూర్) రూ.21,000/-

(07). కె.శివరాం (హైద్రాబాద్) రూ.10,000/-

(08). గాదం శెట్టి గోపాల్‌రావు సి.ఎ. (పొద్దుటూరు) రూ.10,120/-

(09). పి.వి.బ్రహ్మం ఛారిటబుల్ అండ్ వెల్‌ఫేర్ ట్రస్టు (హైద్రాబాద్) రూ. 10,000/-

వీరందరిని శ్రీకాళహస్తీశ్వరుడు అనుగ్రహించుగాక

ధ్యానము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

ఈశ్వరో గురురాత్మేతి మూర్తిభేద విభాగినే ।
వ్యోమవద్వ్యాప్త దేహాయ దక్షిణామూర్తయే నమః ॥

పరిశుద్ధమైన జ్ఞానమును, కరుణయు, త్యాగమును మూర్తీభవించిన ప్రియసోదరీ సోదరులారా ! ఇది ధ్యానకాలము. అదిగో ఒక ప్రకాశమైన లైటు వెలిగించుట కొఱకు గాస్లును (చిమ్ని) ఒక్కరు తుడుచుచున్నారు. ప్రతిరోజు ఈ చిమ్ని తుడుచుటచే స్వచ్ఛమై దీపము ప్రకాశించుచుండును. ఈ చిమ్ని కొద్దిరోజులు తుడువక పోయినచో పొగచే ఆవరింపబడినదై, దీపము ఏలాగున కానిపింపదో, ఆలాగున మీ హృదయమును ప్రతిరోజు ధ్యానమను ఉపాయముచే శుద్ధ పరచనిచో మీలో ప్రకాశించియుండు జ్ఞానము ఆవరింపబడి అజ్ఞానులగుదురు. కనుకనే మహర్షులు ఈ ధ్యానవిధిని ఏర్పరచిరి. ఇట్లు చేయనిచో తెలిసికొనదగినదానిని తెలియనివారలై జీవితముయొక్క ముఖ్య ఫలమనుభవింపకపోయెదరు. నారీమణులారా ! మీ స్వగృహములలో గల చెంబు మొదలైన పాత్రలను ప్రతిదినము ప్రాతః కాలమున గడుగుచున్నారుగదా ! అట్లు చేయనిచో, పాత్రలు చిలుము పట్టి యేలాగున చెడునో, అదే రీతిగా అంతఃకరణ శుద్ధి చేయనిచో మూఢులై పోవుదురు గదా !

ఈ ధ్యానము ప్రాతఃసంధ్యాకాలములలో అభ్యసించి శీలించుట మరింత మంచిది. ఏలన ?

1. అప్పుడు ప్రకృతి చాల శాంతమైయుండును. అంతేగాక దినము రాత్రితోను, రాత్రి పగలుతోను కలియుటచేత ఆత్మైక్యధ్యానము చేయువారికి చాల అనుకూలముగా నుండును.

2. అంతేగాక భగవంతుడు భక్తులయొక్క భావనారూపమై

యుండును. అనేక మహాత్ములు, యోగులు, భక్తులు, సిద్ధులు, మహర్షులందరును ఈ కాలమున ధ్యానము చేయుచుందురు. కనుక అప్పుడు లోకములో గొప్ప జ్ఞానము, కరుణ, శాంతము, భక్తి మొదలైన దైవభావములు గల్గుచుండును. మరియు సంధ్యాకాలము అనేక ప్రాణికోట్లకు తమోరజోగుణములు తొలగినదై, సత్త్వగుణమై యుండును. సంధ్యాకాలమున అనేక పశుపక్ష్యాదులగు జంతువులే గాక మనుజులలో కూలిపని, ఉద్యోగము మొదలు వృత్తిగాగల మనుజులును విద్యార్థులును, కర్మయోగములను మానియుందురు. వారి హృదయము సత్త్వగుణమునకు వచ్చుచుండును. కర్మము రజోగుణము, కరణములచే జేయబడు కార్యమునకు కర్మమనిపేరు. వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలనెడు అయిదును కర్మేంద్రియములు. అస్తమయకాలమున పక్షులన్నియు వాటి కర్మేంద్రియ వ్యాపారములను మాని, చిత్తమునేకాగ్రపరచి, గూండ్లలో ప్రశాంతముగాను, ప్రసన్నముగాను ఉండును. అదే ప్రకారము గోవులు, గొఱ్ఱెలు మొదలైన జంతువులు గూడ కర్మేంద్రియముల నణచుకొని అతిసంతోషముగా అంతరంగమనస్సు గలిగియుండును. అవి యన్నియు ప్రశాంత సుఖము ననుభవించుచుండును. ఇక కొంతరాత్రియైన, అవి అన్నియు తమః స్వరూపమగు నిద్రలో ప్రవేశించును. ప్రథమ యామరాత్రి లోపల ధ్యానము చేయుట శ్రేష్ఠమని విధింపబడిన రహస్యమిదియే.

రాత్రి 9 గంటలలోపల ధ్యానము చేయు టుత్తమము, అదే ప్రకారము ప్రాతఃకాల మనగా ఉదయము 4 గంటల నుండి సూర్యోదయమైన తర్వాత 6 గంటలలోపల యోగాద్యనుష్ఠానము చేయుట మంచిది. బ్రహ్మముహూర్తము అని యీ సమయమునకు పేరు. అప్పుడు సుషుప్తి యను తమస్సు నుండి సత్త్వగుణములోనికి ప్రవేశించు కాలము. సూర్యుడుదయించి కొంతసేపు పోయిన పై చెప్పిన పశ్వాది జంతువులన్నియు కర్మేంద్రియ కృత్యముల కుపక్రమించును. ప్రాతఃసంధ్యా కాలములలో ప్రకృతి యెంత ప్రశాంతమైన రమణీయతతో నాట్యము చేయుచుండునో చూడుడు. కవి పుంగవులందరును

ప్రకృతిని వర్ణించెడు విషయమై బుద్ధిని ఈ కాలములో వినియోగపరచెదరు. మనుజులును సూర్యోదయమున స్నానసంధ్యాధ్యాన పూజాది కృత్యముల నిర్వహించి ప్రశాంత ప్రశోభిత ఈశ్వరాయత్తచిత్తులై ఆనంధభరతులై, భోజనాదులు సలిపి వారివారి కార్యముల ననుసరించి యుద్యోగములకు వెళ్ళి కర్మేంద్రియ కార్యములలో ప్రవేశించెదరు గదా !

3. మరియు గొప్పవారు ధ్యానించునప్పుడు ఒక్క విధమగు దైవమహిమ గల్గుచుండును. సామాన్య ధ్యానకాలమున అందరును ఒకే స్థలంబున ధ్యానించుట మంచిది. విశేష ధ్యానము ఏకాంతమున ఏకాకియై మాత్రమే చేయవలయును. విరక్తులైన కొందరు దైవభక్తిగలవారు గాని, తత్వబోధగలవారు గాని ధ్యానించెడు సమయమున సామాన్య జనులుగూడ అదే స్థలమున ధ్యానము చేయుట మంచిది. ఎట్లన ? కొన్ని యెండిన కట్టెలు మండుచున్నప్పుడు దానిలో కొన్ని పచ్చికట్టె లుండినను కాలిపోవును గదా ! లేక కొన్ని చిన్న చిన్న దీపపు వత్తులను ఒకే స్థలమున వెలిగించిన గొప్ప ప్రకాశముగా మారునట్లు సామాన్యజ్ఞానశక్తి గలవారు ఒకే స్థలమున ధ్యానము చేయునపుడు అట్టి స్థలము గొప్ప జ్ఞానమయముగ మారును. గొప్ప నిప్పుచుట్టును గూర్చుండువారికి ఆ గొప్ప ప్రకాశము అందరికి ఒకే విధముగా నుండునట్లు అచ్చోట నుండువారందరికిని గొప్ప ఆత్మలాభము గల్గును. లేక, ఒక రైలు ఇంజనుతో తగిలించియుండు భారముతో గూడిన అనేకములగు పెట్టెలను ఇంజను లాగుకొని పోవునట్లు, గొప్ప బ్రహ్మనిష్ఠుని ధ్యానకాలమున వారి ధ్యానముతో మీ మనస్సును ఐక్యపరచిరేని, మీరును ఆ గొప్పదైన సుఖము ననుభవింపగలరు. మీ హృదయములో ప్రపంచవాసనలనెడు కర్మభారముండినను ఈ ధ్యానముచే తరింపవచ్చును. ఇంజన్ అనునది మహాబ్రహ్మనిష్ఠులని పెట్టెలనునవి మీ అందరి హృదయములని, వానిలోగల భారమనునది ప్రపంచ వాసన యనియు, గ్రహించదగినది. మరియు ధ్యానకాలమున మనస్సును విశాలముగాను, విశుద్ధముగాను చేయుడు. ఒక టాంకిలో నీరు నిండుగా నుండినను గొట్టము ఎంతటిదో, అంత నీరు గదా దాని ద్వారా వచ్చును. కొళాయి చిన్నదైనచో

కొంచెము జలము మాత్రము వచ్చుచుండును. లేక ఒక్క నది నిండుగా జలముండినను మీరు తీసికొనిపోయిన పాత్రల యొక్క పరిమాణము ననుసరించి జలము తీసికొని రావచ్చును గదా ! ఒక చెరువు నిండుగా జలము గలదని భావింపుడు. తూమును, కాలువయును, ఎంత పెద్దవో అంత జలము తద్ద్వారా వచ్చునట్లు మీ హృదయ మెంత వికాసము, విశుద్ధి గలిగి యుండునో దాని ననుసరించి మీకు దైవశక్తి గూడ గలుగుచుండును. గంగాదిజలము మహత్తరముగా పొంగి ప్రవహించినను మీరు తీసికొనిపోయిన పాత్ర యొక్క ముఖము మూసి జలములో ముంచిన దానిలో ఒక బొట్టై నను జలము ప్రవేశించనట్లు మీ హృదయ ద్వారమును ఇట్టి ధ్యానకాలములో ఇతర సంకల్పములచే మూసినచో ఈ ధ్యానము యొక్క సుఖ మిసుమంతయు ననుభవింపజాలరు. లేక ప్రచండభాస్కరుడు ప్రకాశించుచుండినను మీ గృహాంతరాళకవాటమును తెరవకపోయిన ప్రకాశము దానిలోపల ప్రవేశించని చందంబున ధ్యానకాలములో నిస్సంకల్పస్థితిని పొందనిచో జ్ఞానస్వరూపడగు ఈశ్వరుని అనగా ఆత్మసౌఖ్యము నొందజాలరని మీరు మరువక యుందురని తలంచెద. మరియు ప్రభాకరుడు ప్రపంచమంతయు ప్రకాశించుచుండినను స్వచ్ఛమైన జలమందు గాని, నిర్మలమైన దర్పణమునందు గాని మాత్రమే ప్రతిబింబించును గదా ! ఆలాగున సర్వేశ్వరుండు సమస్త ప్రాణికోట్ల హృదయమందు సమముగా నుండినను, విషయ విరక్తుల చిత్తమునందు మాత్రమే గోచరించును. అదే రీతిగా సూర్యరశ్మి అంతట నుండినను సూర్యకాంతపుమణి మాత్రము కదా ప్రజ్వలించును ! ఆలాగున చంద్రునియొక్క చంద్రికయు సర్వత్ర ప్రసరించియుండినను చంద్రకాంతమణి మాత్రమే అమృతమును స్రవించునుగదా ! అదేరీతిగా ఈశ్వరుండు అందరిచేతస్సులో వ్యాపకమైయుండినను, సూర్యకాంతమణివలె శుద్ధమును, చంద్రకాంతమణివలె శాంతమును అగు హృదయములో మాత్రము ప్రకాశించును, దైవభక్తియును గలుగును.

యోగము

– శ్రీ శివానంద సరస్వతిస్వాములవారు

(దివ్యజీవన సంఘ సంస్థాపకులు, ఋషీకేశ్)

స్వాత్మశిక్షణకు యోగమే పరిపూర్ణమైన అభ్యాస పద్ధతియై యున్నది. యోగమే సరియైన శాస్త్రము. ఇది జీవాత్మదేహ మనస్సులయొక్క సమత్వాభివృద్ధి లక్ష్యమును కలిగి యుండును. దృశ్య పదార్థములనుండి ఇంద్రియములను మరలించి, మనస్సు నాంతరికముగా ఏకాగ్రమొనర్చుటయే యోగమనఁబడును. ఆత్మయందఖండముగా జీవించుటయే యోగము. మానసిక వృత్తులను, మనస్సును అదుపులో నుంచుకొనుటయే యోగమునకు ధ్యేయమై యున్నది. ఆంతరిక మార్గమే యోగమార్గము. దీనికి నీ హృదయమే ముఖద్వారమై యున్నది.

శరీరమును, మనస్సును, ఇంద్రియములను క్రమశిక్షణ యందుంచుటయే యోగమనఁబడును. శరీరములోని ఇంద్రియ శక్తులను నిరోధించి, సమత్వము నొనగూర్చుటకు యోగము సహకరించును. యోగము శాశ్వత శాంత్యానందయుక్త పరిపూర్ణత్వమునుబడయ జేయును. నీ దైనిక జీవితమునందు, సమస్త కార్యకలాపములయందును యోగము నీకు సహాయమొనర్చును. యోగాభ్యాసము ద్వారా నీ వెల్లప్పుడు ప్రశాంత మనస్కుడవై యుండగలుగుదువు. నిశ్చింతగా నిద్రింపఁ జాలుదువు. యోగము ద్వారా తుష్టి, పుష్టి, ఉత్సాహము. తరుగని బలము. దీర్ఘ జీవితము, ఉన్నతమగు ఆరోగ్యములను పొందగలుగుదువు. యోగము నీ యందున్న పాశవిక స్వభావమును దైవస్వభావముగా మార్చి వేసి, దివ్యప్రకాశ యుతమైన యశోశిఖరముల నధిరోహింపజేయును.

యోగాభ్యాసము మానసిక వికారములను, ఉద్రేకముల

నణచివేయుటకు సహాయమొనర్చి, ఆకర్షణల నదిమి వేయుటకు, మానసిక చాంచల్యమును పోద్రోలుటకు నీకు శక్తి నొసంగును. ఎల్లప్పుడు నీవు నీ మనస్సునునసమస్థితి యందుంచుకొనునట్లు, అలనటను పోద్రోలునట్లుగను చేయును. ప్రశాంతత, నిశ్శబ్దత మరియు నిశ్చల ఏకాగ్రతలను నీ యందు దృఢమొనర్చును. యోగము నిన్ను దైవముతో సంయోగ పఱచి, అఖండత్వ సిద్ధిని ప్రాప్తింపఁజేయుటతో జీవిత లక్ష్యము నొందింపఁజేయును.

నీవు యోగమునందు విజయము నొందఁగోరుదువేని. నీ వవశ్యముగా ప్రాపంచిక భోగములను విడనాడి. బ్రహ్మచర్య. తపస్సుల నభ్యసింపవలయును. దృఢచిత్తుడవై మంచి నేర్పుగలవాడవై నీ మనస్సు నదుపులో యుంచవలెను. దాని నణచి వేయుటకు మంచి తెలివిగల, బుద్ధిమంతములైన ఉపాయములను పన్నవలయును. నీవు దానిపై నీ బలమును ప్రయోగించినప్పుడది మరింత తుంటరియై నిన్ను సంక్షోభింపఁజేయును. కావున బలమును ప్రయోగించి దాని నదుపులో నుంచలేము. అది అధికాధికముగా క్రిందికి, మీదికి ఎగిరి పడుచుండును. మనస్సును బలవంతముగా నిరోధించుటకు ప్రయత్నించువారు. భయంకరమైన మదించిన ఏనుగును సన్నని పట్టుదారముతో బంధించుటకు ప్రయత్నించు వారగుదురు.

యోగాభ్యాసమునకు గురువత్యంతావశ్యకమై యున్నాడు. యోగ మార్గావలంబియగు సాధకుడు ముఖ్యముగా వినయ విధేయుడై, మాన్య మర్యాదలుఁగలవాడై,, ఓరిమి, కరుణ, దయాదాక్షిణ్యములు కలవాడునై యుండవలయును. నీవు సిద్ధులనొందుటకై తీవ్రమైన కాంక్షగలవాడవై యుందువేని యోగమునం దుత్తీర్ణుడవు కాలేవు. ఒకనెల. లేక వారము రోజులు భూమియందు పాతిపెట్టబడి యుండుట, హృదయ స్పందనము నాపివేయుట, నాడీసంచలనమును స్తంభింపఁజేయుట, ఒకే ఆసనముపై

ఆరుగంటలు కూర్చొనియుండుట మాత్రమే యోగముకాదు.

అతిగర్వము, అధికప్రసంగము, మదము, భోగపరాయణత్వము, పేరుప్రఖ్యాతుల నాశించుట, తాను చెప్పినదే శ్రేష్ఠముగా భావించుట, మూర్ఖపుపట్టుదల, నే నే శ్రేష్ఠుడ ననుకొనుట, విషయేచ్ఛ, దుస్సహవాసము, సోమరితనము, అమితాహారము, అమితకార్యపర్వతము, లౌకిక మానవులతో అధికముగా కలియుట, అధికముగా వ్యర్థ సంభాషణ మొనర్చుట ఇవన్నియు యోగమునకు విఘ్నకరములై యున్నవి. నీ తప్పిదములను నిర్మోహమాటముగా ఒప్పుకొనుము. నీ వెపుడైతే ఈ దుష్ట లక్షణములనుండి విడివడుదువో, అపుడు సమాధి, లేక భగవదైక్యము తనంతట తానే వచ్చి తీరును.

యమ నియమముల నభ్యసింపుము. పద్మాసనము, లేక సిద్ధాసనముపై సుఖాసీనుడవగుము. శ్వాసను బంధింపుము. ఇంద్రియములను బంధింపుము. సంకల్పములను నిరోధించుము. మనస్సును ధ్యానముచే ఏకాగ్రమొనర్చి, అసంప్రజ్ఞాత, లేక నిర్వికల్ప సమాధి నొందుము. యోగాభ్యాసము ద్వారా నీవు నిపుణుడైనట్టి యోగివిగా ప్రకాశింతువుగాక ! నీవా శాశ్వతమగు పరమానందమునను భవింతువుగాక!

యోగాభ్యాసికి తగిన ఆహారము

ఇంద్రియములను ఉత్తేజపరచి మోహమును కలిగించుటలో ఆహారము ప్రత్యేక ప్రాధాన్యత కలిగి యున్నది. సాధకుడు ప్రారంభములో సాత్త్వికమైన ఆహార పదార్థములను ఎంచుకొనుటలో చాలా జాగ్రత్తగ నుండవలెను. తదుపరి కఠినమైన ఆహార నియమములను తొలగించవచ్చును హవిస్యాన్నము అనగా నేతితో కలిపిన వరిఅన్నము యోగాభ్యాసికి శ్రేష్ఠమైనది. నెయ్యి,పాలు, పంచదార, వరిఅన్నముతో ఉడికించిన అది ' ఖీర ' (పాయసము లేక పరమాన్నము) అందురు. ఇది

సాధకునికి సమీకృతాహారమని చెప్పవచ్చును.

పాలు

పాలలో క్రొవ్వు, కార్బోహైడ్రేడు మొదలైన వివిధములైన ప్రోటీన్లు సక్రమమైన నిష్పత్తిలో ఉండుటయేగాక, జీర్ణమైన పిదప ప్రేవులలో మిగిలిన మాలిన్యము తక్కువగ నుండును. కాబట్టి ఇవి సమగ్రమైన ఆహారమని చెప్పవచ్చును. ప్రాణాయామ సాధన సమయములో యోగికి ఇది ఆదర్శమైన ఆహారము. ఆరోగ్యకరమైన ఆవు నుండి తీసిన తాజాపాలు (టి.బి.వ్యాధి లేని ఆవు పాలు) కాచినవి మంచివి. పాలను కాచెడి విధానమేదనగా మరుగుచూ పొంగెడి పాలను వెంటనే దించవలెను. మరగకాచుట మంచిది కాదు. ఎక్కువగా మరగకాచినచో, అందలి విటమిన్లు, ప్రోటీన్లు తరిగిపోయి ఆహారపు విలువను కోల్పోయి అవి నిరుపయోగమగును.

ఫలహారము

పండ్లు యోగాభ్యాసి కోరదగిన ఆహారము. ఇది ప్రకృతి సిద్ధమైన ఆహారము. అరటిపండ్లు, తియ్యని నారింజపండ్లు, దానిమ్మ పండ్లు మొదలైనవి సమగ్రమైన ఆహారము. అరటిపండ్లు బలవర్ధకమైనవి. నిమ్మకాయలో రోగనిరోధక శక్తి ఉండుటయేగాక, రక్తమును శుభ్రపరచెడి లక్షణము కూడ ఉన్నది. పండ్ల రసములు బలవర్ధకమైనవే గాక విటమిన్ సి కూడ ఉన్నది. ఇవి సులభముగ జీర్ణమై, జీర్ణకోశమును సాత్త్వికముగ నుంచును.

మితాహారము

ఉదరమును సగభాగము సాత్త్వికాహారముతో నింపి, పావుభాగము మంచినీటిని తీసుకొనవలెను. మిగిలిన పావుభాగము వాయువు యొక్క సంకోచ వ్యాకోచముల కనుగుణముగ వదలి వేయవలెను. ఇది మితాహారమును సేవించెడి విధానము. ఇది యోగాభ్యాసికి

ఆదర్శప్రాయమైన విధానము. ఇది ఆరోగ్యము వాంఛించెడి వారందరికి కూడ ఆదర్శప్రాయమైన విధానము. ఆధునిక వైద్య శాస్త్రములలో కూడ సామరస్య పూర్వకమైన ఈ ఆరోగ్య విధానమునే సూచించుచున్నారు.

నాత్యశ్నతస్తు యోగోస్తి నచైకాంత మనశ్నతః
నచాతి స్వప్నశీలస్య జాగ్రతోనైవ చార్జున

తా ॥ " అర్జునా ! అతిగ భుజించువానికి, నియమముగ భుజింపక విడిచినవానికిని, అతి నిద్రజేయు వానికిని, లేక మేలుకొని యుండు వానికిని యోగము సిద్ధింపదు. యోగనిష్ఠ యలవడదు " అని భగవద్గీతలో చెప్పబడినది. (గీత 16 అ. 16 శ్లో) అందువలన యోగాభ్యాసికి మితాహారము సూచించబడినది.

శ్లో ॥ ఆహార శుద్ధౌ సత్వశుద్ధిః సత్వశుద్ధౌ ధృవాస్మృతిః
స్మృతిర్లాభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః

" ఓ బ్రాహ్మణా శుద్ధమైన ఆహారము వలన శుద్ధమైన సత్త్వగుణము ఏర్పడును. శుద్ధసత్త్వమువలన జ్ఞాపకశక్తి లభించును. అట్టి జ్ఞాపకశక్తి వలన సర్వగ్రంథులు విడువడి మోక్షము లభించును. "

కావున సాధకునికి సాత్త్వికాహారమే వాంఛించదగినది. గోధుమ, వరి, బార్లీ, పంచదార, వెన్న, కలకండ, పాలు, నెయ్యి, పెసరపప్పు, కూరగాయలు, ఆకుకూరలు, టొమాటో మొదలైనవి సాత్త్వికమైన ఆహార దినుసులు.

నిషేదించవలసిన పదార్థములు వేపుడుకూరలు, కారము ఎక్కువగా నున్నవి. పచ్చళ్ళు, మాంసము, చేపలు మొదలైనవి సాధకునికి నిషేధము.

సమత్వం యోగ ఉచ్యతే
అనుకూల ప్రతికూలములందు
సమబుద్ధే యోగము

సంప్రదాయాలు

– మహామహోపాధ్యాయ

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

‘ సంప్రదాయం ’ అనే మాటను మనం తరచూగా వ్యవహారంలో వాడుతూ వున్నాము. నిఘంటువులలో ఈ శబ్దానికి ‘ గురుపారంపర్యము’ అన్న అర్థం కనిపిస్తుంది. “ మాది శంకర సంప్రదాయం ’, “ మాది మలయాళస్వామి సంప్రదాయం ” అన్నప్పుడు ఆ మాట గురుపరంపర అనే అర్థాన్నే ఇస్తుంది.

కాని లోకవ్యవహారంలో బహుకాలంనుండీ ఆచరణలో వున్న పద్ధతులను ‘ సంప్రదాయం ’ అని చెప్పడం కద్దు. సమాజంలో అలవాటుగా మారిపోయిన కొన్ని ఆచరణలు కాలక్రమంలో సంప్రదాయాలుగా స్థిరపడిపోయాయి. అవి ఆదికాలంలో లేకున్నా, మధ్యకాలంలో ఎప్పుడో ఒకప్పుడు సమాజంలో ప్రవేశించి వుంటాయి.

“ సంప్రదాయాన్ని పాటించండి, సంప్రదాయాన్ని కాపాడాలి ” ఇత్యాదిగా ఇప్పుడు సంప్రదాయవాదులు కొందరు ఘోషించడం వింటున్నాము. దీనిని గూర్చి కాస్తా విచారించడం శ్రేయస్సుయన్న భావనతోనే ఈ వ్యాసం వ్రాయడం జరుగుతున్నది.

సంప్రదాయం మంచిదైనప్పుడు దానిని సత్సంప్రదాయ మంటాము. దానిని పాటించడం అవశ్యకర్తవ్యమనడంలో సందేహం లేదు. కాని నేడు మన వారు పాటిస్తున్న ఆచారాలలో అనేకం దురాచారాలు క్రిందికే వస్తాయి. వాటిని ‘ దుష్ట సంప్రదాయం ’ అనక తప్పదు. సత్సంప్రదాయాన్ని కాపాడడం ఎంత ముఖ్యమో, దుస్సంప్రదాయాన్ని విడనాడడమూ అంతముఖ్యమే. దీన్ని గుర్తించి వర్తించినప్పుడే సమాజం సర్వతోముఖంగా వృద్ధి చెందుతుంది.

హిందూ సమాజంలో వర్ణ వ్యవస్థ అనాది సిద్ధంగా ఉన్నది. సమాజ వ్యవహార నిర్వహణకు ఈ వ్యవస్థ ఆనాడు అవసరం అయి వుండవచ్చు. కాని అందులో తక్కువ వర్ణానికి చెందిన వారిని అల్పులుగా భావించడం, ఉన్నత విద్యకు వారికి అర్హత లేదనడం, ఉన్నత స్థానాలలో వారికి ప్రవేశం కల్పించకపోవడం అన్న సంప్రదాయం ఆనాడు స్థిరపడిపోయింది. ఏ విధంగా చూచినా ఈ స్థితి సత్సంప్రదాయానికి చెందదు. గుణాన్ని బట్టి కాక, కులాన్ని బట్టి మనిషి యోగ్యతను నిర్ణయించే దుష్ట సంప్రదాయం ఈ వర్ణవ్యవస్థ వల్ల కలిగినదే. దీనిని విజ్ఞులెవరూ నేడు హర్షించరు.

పైగా సమాజంలో అనేక కులాలు ఏర్పడి అస్పృశ్యత మున్నగు దురాచారాలు సంప్రదాయంగా నిలబడిపోయాయి. నేడు అవి శిక్షార్హమైన నేరాలు, కాని పూర్వం పాటించదగిన ఆచారాలుగా ఉండేవి.

సమాజంలో నెలకొన్న ఈ ఉచ్చనీచభావాలు కాలక్రమంలో మత మార్పిడులకు గూడా కారణమయ్యాయి. ఈ స్థితి కలిగే దాకా మన మతాచార్యులు ఈ దురాచారాలను పట్టించుకోలేదు. మత పరివర్తన కారణంగా ఇప్పుడిప్పుడు హిందూ సమాజంలో కులభేదాలు తగవని చెప్పడం ప్రారంభించారు.

ఇట్లే సముద్రంపై పయనించడం దురాచారంగా పూర్వం భావించే వారు. అలా దాటినవారిని కులం నుండి వెలివేసిన సందర్భాలు గూడా లేక పోలేదు. ఈకాలంలో ఈ దుష్టసంప్రదాయం పూర్తిగా రూపుమాసి పోయింది.

జంతువులను క్షుద్ర దేవతలకు బలి యివ్వడం సంప్రదాయమయింది. దీన్ని చట్టం ద్వారా నిషేదించినప్పటికీ ఇంకా ఈ దుస్సంప్రదాయం ఎక్కడో ఒక్కచోట కొనసాగుతూనే వుండడం విచారకరం. పూర్వం బుద్ధుడు, నేడు శ్రీ మలయాళస్వామి వంటి మహాత్ములు జంతుబలిని నిరసించారు. అది దుష్ట సంప్రదాయమని ఘోషించారు.

పూర్వం కొన్ని కులాలకు దేవాలయంలో ప్రవేశాన్ని నిషేధించారు. ఈ నిషేధాన్ని నేటి చట్టం అంగీకరించదు. సుప్రసిద్ధమైన తిరుమల ఆలయం వంటి ఆలయాలలో నేడు అందరికీ ప్రవేశం ఉన్నది. మహాత్మాగాంధీ, శ్రీ నారాయణ గురువు వంటి మహనీయులు ఈ దేవాలయ ప్రవేశ నిషేధాన్ని తొలగించడానికి అనేక విధాలా ప్రయత్నించి సఫల ప్రయత్నులయ్యారు. అయినా నేటికీ మారుమూల ప్రాంతాలలో ఈ దురాచారం కొనసాగుతూ వుండడం విచారకరం. ఆలయ ప్రవేశ నిషేధానికి గురి అయినవారు "మేము మతాంతరం పుచ్చుకొంటాం " అని ప్రతిఘటించే వరకూ పరిస్థితి దిగజారింది. ఇటీవల పత్రికలలో వచ్చిన వార్తలు చూచిన వారికి ఇది విదితమే. అందువల్ల ఆలయ ప్రవేశ నిషేధం వంటి దుష్ట సంప్రదాయాలను నిరోధించడానికి సమాజంలో ప్రతి యొక్కరూ నడుంబిగించాలి.

స్త్రీలూ, ద్విజేతరులూ వేదాలు, ఉపనిషత్తులు చదువరానే మూఢ విశ్వాసం అనాదికాలంనుండీ ఈ దేశంలో గట్టిగా పాతుకుపోయింది. శ్రీ దయానందస్వామి, శ్రీ నారాయణ గురువు మున్నగు మహా పురుషులు ఈ దురాచారాన్ని రూపుమాపటానికి ఎంతగానో ప్రయత్నించారు. వారి ప్రయత్నం పూర్తిగా ఫలప్రదమయ్యే శుభఘడియల కోసం ఎదురుచూద్దాం.

ఒక సంప్రదాయాన్ని పాటించే ముందు ఆ సంప్రదాయం మంచిదా? కాదా ? అని ఆలోచించాలి. భగవంతుడు మానవునికిచ్చిన పెద్ద వరం వివేచనా శక్తి. దానితోనే వివేకోదయమవుతుంది. ఆ విధంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకో గల్గినప్పుడు సంఘంలోని మూఢవిశ్వాసాలు తొలగిపోతాయి. గ్రుడ్డినమ్మకం తగదు.

ఆధునిక కాలంలో వైజ్ఞానికవిద్యా ప్రభావంవల్ల అనేక మూఢ విశ్వాసాలు అంతరించడం శుభ పరిణామం. సంప్రదాయమన్న పేరుతో ఆ విశ్వాసాలను సమర్థించడం సమాజాన్ని అంధయుగాలవైపు నడిపించడమే అవుతుంది.

' ఇతరులను అణగద్రొక్కాలని దురాగ్రహంతో ప్రయత్నించే వాడు, తప్పక ఇతరులచే అణగ్రొక్కబడతాడు " అని శ్రీ మలయాళ సద్గురు దేవుల

సూక్తి. మనం పాటించే పలు దురాచారాలు ఇతరులను అణద్రొక్కేవిగా ఉన్నాయి. వీటిని జాగ్రత్తగా పరిశీలించి విడనాడడం మంచిది.

ఎవరికీ హాని కల్గించని సంప్రదాయమే సత్సంప్రదాయం. అట్టి సంప్రదాయాన్ని గౌరవిద్దాం. దుస్సంప్రదాయాలను దూరంగా తరిమివేద్దాం.

ఇప్పుడే వెలువడినది

శ్రీ జగద్గురు ఆది శంకరాచార్యులచే రచింపబడిన దక్షిణామూర్తి స్తోత్రము దానికి సురేశ్వరాచార్యులచే వ్రాయబడిన మానసోల్లాస వార్తిక సహితం తెలుగు అనువాదంతో తెలుగులో ప్రతిపదార్థం, తాత్పర్యంతో శ్రీ శుకబ్రహ్మాశ్రమం వారిచే ప్రచురింపబడి ఇప్పుడే వెలువడినది. తొలి ముద్రణ 1 / 8 డెమ్మీ 180 పేజీలు దక్షిణామూర్తి త్రివర్ణముఖ చిత్రంతో – ధర రూ. 50/–లు మాత్రమే. పోస్టేజి అదనం.

వేదాన్తభేరి పత్రికకు పోషక చందా పంపినవారు

01. డా॥ కె.కృష్ణారావు (బిజనగెర) రాయచూర్ జిల్లా	రూ. 1200/–
02.శ్రీ నిత్యానందస్వామి (కనిగిరి)	రూ. 1200/–
03. శ్రీమతి డి. సుభాషిణి (తిరుపతి)	రూ. 1200/–
04. హరి వెంకటేశ్వరరావు (గొల్లమూడి)	రూ. 1200/–
05. పి.నాగభూషణం (ఎల్లారెడ్డి గూడ)	రూ. 1200/–
06. కె.మణీయులు (మల్కాజిగిరి)	రూ. 1200/–
07. జి. నాగలక్ష్మి (మల్కాజిగిరి)	రూ. 1200/–
08. ఎం.వి. రఘునాథ (వరంగల్లు)	రూ. 1,116/–
09. వి.రామానాయుడు (ముంగిలపట్టు)	రూ. 1200/–
10. వి.రమేష్ (అనంతపురం)	రూ. 1150/–
11. డా ॥ బి.శివరాములు (శేర్‌లింగంపల్లి)	రూ. 1200/–

అరవిందుల పూర్ణయోగం

- నైనారు అప్పాస్వామి

శ్రీ అరవిందులు తమ పూర్ణయోగాన్ని ప్రకటించినప్పుడు దాన్ని సాధన చేసిన కొందరు శిష్యులు తమకు కలిగిన సందేహాలను నివేదించారు. అట్టి సందేహాల నివృత్తికై శ్రీ అరవిందులు విపులమైన వివరణలు ఇచ్చారు. పూర్ణయోగంలోని కీలకమైన అంశాలను సుబోధకం గావించారు.

ఈ ప్రపంచంలోని ప్రతిదీ మానవునికి కొంత తాత్కాలిక సౌఖ్యాన్ని కలిగించినా చివరికి అతణ్ణి విఫలుణ్ణి చేస్తుంది. కాని మానవుడు సంపూర్ణ ఆత్మార్పణతో దైవాన్ని ఆశ్రయించినచో అతనికి విఫలత అనునది కలుగదు. మానవుడు నిరాశానిస్పృహలకు, విఘాతాలకు గురికావడం అతనిలో ఏదో చెడు వున్నందువల్ల కాదు. అశాశ్వతమైన వస్తుజాలంపై కోరికలు పెంచుకోవడం వల్ల, వాటిని సాధించలేక పోవడం వల్ల అవి లభించినా ఆశించిన తృప్తిని శాశ్వతంగా ఇవ్వనందువల్ల, వాటిని పోగొట్టుకొనుట వల్ల అట్టి విఫలతలు, విఘాతాలు కలుగుతాయి. కావున జీవితంలో భగవంతుని మాత్రమే సంపూర్ణ మానసంతో ఆశ్రయించడం మానవునికి శ్రేయోదాయకం. అదియే జీవిత సత్యము.

పూర్ణయోగంలో ఆధ్యాత్మిక జీవితాన్ని, ఆధ్యాత్మిక సత్యాన్ని కోరుటకు నిజమైన మొదటి కారణం ఆ దైవాన్ని దర్శించుటయే, అత్యావశ్యకమైనది అది ఒక్కటియే. అదిలేని తక్కిన ప్రయత్నాలన్నీ వృథా కాగలవు. ఆ దైవాన్ని సందర్శించి దైవచైతన్యాన్ని అభివ్యక్తం చేయడం అనగా సాధకుడు తన పరిమిత చైతన్యాన్ని సంపూర్ణ దైవచైతన్యంగా పరివర్తన చేయుట.

అనంత కాంతిలో, శాంతిలో, ప్రేమలో, శక్తిలో, పరమానందంలో జీవించడం. తన క్రియాశీల నైజంలో ఆదైవచైతన్యపు పాత్రగా, వాహినిగా, ఉపకరణంగా వుండుట. ఇవియే ముఖ్య లక్ష్యాలుగా వుండాలి. పరమాత్మ సందర్శనం లభించిన అనంతరం ఆ పరమాత్మ మన నుండి ఏ కార్యాన్ని శాసిస్తున్నాడో గ్రహించగలము. అంతవరకు మనజీవితం, కార్యాచరణ

ఆ పరమాత్మను దర్శించుటకై సాధనాలుగా మాత్రమే వుండగలవు. మనము అంతరంగ చైతన్యంలో అభివృద్ధిని పొందునప్పుడు, లేక దివ్యసత్యం మనలో ప్రస్ఫుట మగుచున్నప్పుడు మనజీవితం అధికాధికంగా దానినుండి ప్రసరించవలెను. దానితో ఏకమగు చుండవలెను. అంతేకాని మరిదేనిని కాని, మన పరిమిత మనస్సుతో నిర్ణయించుట దైవసత్య ప్రసరణకు ప్రతిబంధకం కాగలదు. ఆ దైవసత్యం క్రమక్రమంగా వృద్ధి చెందునప్పుడు దివ్యకాంతి, శక్తి, బలము, పవిత్రత, శాంతి మనలో కలిగి పనిచేయుటను, మనలను కార్యాచరణలో నడిపించుటను, మన చైతన్యమును పరివర్తన చేయుటను, మనలను పరమాత్మ ప్రతిరూపాలుగా మార్చుటకై యత్నించుటను, మనలోని మాలిన్యాలను తొలగించి దివ్య స్వర్ణకాంతులను వెదజల్లుటను మనము అనుభవించగలము.

మనలో ఎల్లప్పుడు ఆ దైవం యొక్క ఉనికి వున్నప్పుడే, మన చైతన్యం పరివర్తన చెందినప్పుడే మనము దానిని భూతలముపై అభివ్యక్తం చేయగలమని అందుకు సిద్ధంగా వున్నామని విదితము కాగలదు. అటులకాక ఒక మానసిక అధర్మాన్ని లేక సూత్రాన్ని ఆధారంగా చేసుకొని దానిని అంతరంగంలో ప్రతిష్ఠించుటకు ప్రయత్నించిన అది మనలను పెడదారిని పట్టించగలదు. మన కృషి దైవంవైపునుండి మర్చబడును. మనలను యోగసాధన నుండి విముఖులను చేయు ప్రమాదమును కల్పించగలదు. మనస్సు తన అవివేకము ద్వారా వర్తించుటచే అది మన సాధనకు ఉపకరించ జాలదు. పైగా మన ఏకైక లక్ష్యము నుండి మనలను ప్రక్కకు విఫలురను చేయగలదు. కావున మనస్సును, దాని ప్రవృత్తులను నిగ్రహించవలెను.

మన యోగసాధన ఫలించుటకై అవసరమగు శక్తిని, కాంతిని, బలమును ఆనందమును ప్రసాదించుటకై, స్థిరత్వమును కలిగించుటకై ఆ దైవమును ప్రార్థించ వలెను. మన అంతరంగ జీవితమే కాక బాహ్య జీవితము పరివర్తన చెందవలెను. అదియే పూర్ణాయోగ సాధన.

పూర్ణయోగ లక్ష్యం దైవసన్నిధిని పొందుట. చైతన్యము లోనికి ప్రవేశించుట, దాని ఆధీనములో నుండుట, దైవము కొరకై దైవమును ప్రేమించుట, మన నైజములో దైవ నైజమునకై లయాత్మకముగా నుండుట, మన ఇచ్ఛలో కార్యములలో జీవితంలో దైవంయొక్క ఉపకరణముగా నుండుట.

దాని లక్ష్యం ఒక మహాయోగిగానో, అతి మానవుడుగానో వుండుట కాదు. లేక అహంకారపు శక్తికై, గర్వమునకై లేక వినోదమునకై దైవాన్ని ఆత్రంగా ఆశ్రయించుట కాదు. అది మోక్షానికి మాత్రమే కాదు. దైవం మాత్రమే పూర్ణయోగ లక్ష్యము.

కేవలం అతిమానవుడుగా మారుటకు మాత్రమే ఈ యోగంలోనికి వచ్చుట ప్రాణిక అహంకార చర్చకాగలదు. అది యోగ లక్ష్యమునే విఫలం చేయగలదు. మానవుని వేరుచేయు స్వార్థాహంకారమును మొదట దైవచైతన్యంలో కలిపివేయవలెను. ఆపై మనోప్రాణదేహాలను మార్చుటకై అతి మానసిక చైతన్యమును భూమిపైకి తేవలెను. దివ్య సత్యము ఈ భూమిపైకి రావలెనన్న మొదట అది మన మనోప్రాణదేహములలోనికే కాక పదార్థం లోనికి కూడా రావలెను. అందుకు జీవితపు పరివర్తన ముఖ్యము. అహంకారపు అవధులను నిరోధించవలెను. మానసిక భ్రమణములు, జీవితపు కోర్కెలు నెరవేరుటకు తావీయరాదు. ఆ దైవేచ్ఛను నెరవేర్చుట మాత్రమే మన సర్వకర్తవ్యము కావలెను. అవివేకముచే వికృతము చేయబడని, ప్రాణిక కోర్కెలచే వక్రీకరింపబడని, విపరీతార్థములు కల్పించబడని దైవేచ్ఛ తన సత్యాన్ని అభివ్యక్తం చేయగల పరిస్థితులను సృష్టించుటయే యోగ లక్ష్యము. మనము కోరవలసినది మన వ్యక్తిగత అభివ్యక్తి కాదు. అన్ని హద్దులనుండి, బంధములనుండి విడిపడిన అహంకారపు విహారం కాదు. మన ఆధ్యాత్మిక విముక్తి పరిపూర్ణత ఆ దైవాభివ్యక్తం యొక్క భాగంగా, ఫలితంగా వుండవలెను. దైవ నిర్ణయమే ఆరాధ్యమై సాధన సాగవలెను.

ఈ పూర్ణయోగం దివ్యసత్యావిష్కరణకు అనువగు ఆకాంక్షకు జీవితాన్ని సంపూర్ణంగా సమర్పణ చేయుటనే కోరుతుంది. జీవితాన్ని కొంత స్వార్థ ప్రాపంచికానుభూతులకు, కొంత దైవానికి విభజించుట అంగీకరింప బడదు. కావలసినది దైవానికి సంపూర్ణమగు ఆత్మసమర్పణ, మానసిక అభీష్టాలకై ప్రాకులాడుట పూర్తిగా జీవనపథం నుండి తొలగింపబడవలెను. ప్రాపంచిక, వాంఛలకై ప్రాకులాట సమూలముగా నిరోధింపబడవలెను. ప్రతికార్యము సత్యము నుండియే ప్రారంభం కావలెను.

జీవితపు పరివర్తన అనగా మనోప్రాణదేహముల సంపూర్ణ పరివర్తన. దానిని ఉన్నట్లుండి సాధించుట దుర్లభము కాగలదు. అట్టి ప్రయత్నం సాధకునిలో

ఘర్షణను కలిగించ వచ్చును. ఆ ఘర్షణ సాధన నుండి విముఖత్వం వహించుటకు ప్రేరేపించగలదు. కావున లక్ష్యమును స్థిరముగా నుంచుకొని, కర్మయోగ భావంతో క్రమక్రమంగా జీవితాన్ని మార్చుటకై ప్రయత్నించవలెను. ప్రాణిక వాంఛలను క్రమేపి దూరము చేయవలెను. గీతలో చెప్పబడిన అసంగత్వము, సమానత్వము, దైవముపై అచంచల విశ్వాసము మున్నగు భావములతో జీవించుటను ప్రారంభించుట సులభమగు మార్గము. అప్పుడు పరివర్తన సహజముగా, సులభముగా సాధ్యము కాగలదు.

మానవుడు రెండు విధములకు చైతన్యములచే నడుపబడుచున్నాడు. ఒకటి జీవనక్రీడకు పైగా నుండి దానిని పర్యవేక్షించు ఉన్నత చైతన్యము. దీనినే జీవుడని, ఆత్మయని, దైవమని పేర్కొను చున్నాము. వేరొకటి మనము జీవించు మామూలు చైతన్యము. దీనిలో జీవించువారు మానసిక కదలికలచే ప్రేరణలచే నడుపబడుచున్నారు. అందువల్ల జీవితంలో సంతోషవిషాదాలకు, వ్యాకులతలకు, కోరికలకు, నిరాశలకు, తదితర దైనందిన ప్రవృత్తులకు గురియగుచున్నారు. వారు పొందు సుఖసంతోషాలు, శాంతి తాత్కాలికమైనవి మాత్రమే. ఇందుకు విభిన్నంగా ఆధ్యాత్మిక చైతన్యమగు ఉన్నత చైతన్యంలో మానవుడు జీవించగలిగినచో సర్వము కాంతి, శాంతి, శక్తి మరియు ఆనందమయమగు దాని ప్రభావముచే శాశ్వతానందమును పొందగలడనుట నిస్సందేహము. అట్టి జీవితం అన్ని భయాల నుండి, ఆపదల నుండి, వేదనల నుండి విముక్తము కాగలదు. ఈ ఆధ్యాత్మిక చైతన్యానికై వికసించుట వలన మానవుడు తాను అభిలషించు శాంతిని, సత్యాన్ని, జ్ఞానాన్ని, ఆనందాన్ని అత్యంత అధికంగా పొందగలడు. ఈ దైవ చైతన్యములోనికి ప్రవేశించుటకు ముఖ్యావశ్యకము అంతరగంలోనికి పోవుటకై అంతర్ముఖులగుటకు వలయు నిరంతర సాధన మాత్రమే. అందుకై సాధకుడు తన్నుతాను సంపూర్ణముగా సమర్పించు కొనవలెను. ఈ సమర్పణ అనగా ఆ దివ్యచైతన్యముతో స్థిరమగు సంబంధాన్ని లేక దానితో ఐక్యమగు ఆకాంక్షను కలిగి యుండి మరి దేనిని కోరకుండుట. ఆ దివ్యచైతన్యపు స్పర్శమాత్రముచే మనోప్రాణదేహాలలో దైవశక్తి పనిచేయుటను అనుభవించగలము. దాని సహాయముచే నిమ్నప్రకృతిని నిరసించి పవిత్రమగు పరివర్తనను పొందుట సులభము కాగలదు.

ధ్యానభ్యాసము

– శ్రీ శివానంద సరస్వతి స్వాములవారు

మోక్షము నొందుటకు ధ్యానమే రాజబాటయై యున్నది. ధ్యానము సమస్త బాధలను, దుఃఖములను, తాపత్రయములను (ఆధ్యాత్మికాధి దైవికాధి భౌతికములను) మరియు పంచక్లేశములను (అవిద్య, అస్మిత, రాగద్వేషాభి నివేశములు) నశింప జేయును. ధ్యానము ఐక్యదృష్టి నొసంగును. ధ్యానము ఏకత్వ భావమును కలుగజేయును. నిత్యానంద, పరమశాంతి సామ్రాజ్యములలోని కెగురుటకై సాధకునకు ధ్యానము విమానమువంటిదై యున్నది. అది భూలోక స్వర్గలోకములను జోడించునట్టి అతి రహస్యమైన నిచ్చెనవంటి దగుటచే ముముక్షువును ఆ శాశ్వతమైన బ్రహ్మత్వము నొందించును.

ఒక పాత్ర నుండి మఱొక పాత్రలోని కఖండముగా ప్రవహించి నూనెవలె (తైలధారవత్) అఖండమైన భగవచ్చింతనయే ధ్యానమనఁబడును. ఏకాగ్రతనుబట్టియే ధ్యానమలవడును. బ్రాహ్మీముహూర్తములో (వేకువఝామున 4 గంటల నుండి 6 గంటల వఱకు) ధ్యానము నభ్యసింపుము. ధ్యానాభ్యాసమున కిదియే మంచి అనుకూలమైన సమయము. పద్మాసనము, సిద్ధాసనము, లేక సుఖాసనములలో దేనియందైనను కూర్చొనుము. శిరస్సును, కంఠమును, నడుమును తిన్నగా యుంచుము. కండ్లు మూసుకొని హృదయస్థానము, లేక భ్రూమధ్య స్థానమునందైనను ఏకాగ్ర మొనర్పుము.

సగుణధ్యానము, నిర్గుణ ధ్యానమని ధ్యానము రెండు విధములు. సగుణధ్యాన సాధకుడు శ్రీకృష్ణుడు. శ్రీరాముడు, శివుడు, విష్ణువు, దేవి, గాయత్రి మొదలగు సాకార ధ్యానమొనరించును. నిర్గుణ ధ్యాన సాధకుడు తన స్వస్వరూపమును గూర్చియే ధ్యాన మొనరించును.

‘ పాపలేని మంచం ’

– ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

స్థితికారకుడు విష్ణువు. అవతారాలన్నీ మహావిష్ణువుకే. ఆ మహావిష్ణువు పాలకడలి వాసుదు. శేషశయనుడు. ఆ శేషుడే మహావిష్ణువు అర్చావతారమయిన శ్రీనివాసునికి బ్రహ్మోత్సవ కాలంలో ‘ వాహనంగా’ మారడం తెలిసిన అంశమే.

కన్నడ హరిదాసులు ఆ శేషుని ‘మంచంగా’ భావించారు. జగన్నాథ దాసులవారు ‘ బహురమ్యవాగిదె హరియ మంచ (చాలా రమ్యంగా ఉంది. శ్రీహరి మంచం) అని ఒక కీర్తన పాడారు. అనేక పురాణాంశాలను జతకూర్చి వ్రాసిన ఈ కీర్తన రమ్యాతిరమ్యం.

అది రాజేశ్వరుని మంచం. పవనతనయుని మంచం. పావన మయిన మంచం. భువనత్రయాన్ని మోసిన మంచం. చెవులు లేని మంచం. శ్రీనికేతనుని మంచం. శివరూపంలో హరిని మోసిన మంచం. నీలాంబరం కట్టుకొని తళుకు మెళకులతో ఆడే మంచం. రెండు నాల్కల మంచం. నలభై కల్పాలు తపస్సు చేసిన మంచం. కాలమనే ముసలాన్ని పట్టుకొన్న మంచం. శ్రీరామచంద్రుని అనుజులై రణరంగలో విహారం చేసిన మంచం. భీముని అట్టే పట్టేసిన మంచం. సహస్ర ముఖాలతో సన్నుతించే మంచం. దేవకీ జఠరంలో జనించిన మంచం. వారుణీదేవికి ప్రియమయిన వరుణ్ణి ప్రసాదించిన మంచం. జగన్నాథవిఠలరాయుని విమల శేష మంచం.

గృహవైద్యం

పది కిస్మిస్ (ద్రాక్ష) పండ్లను నీళ్లలో ఉడుకబెట్టి ఆ నీరు తాగితే రక్తం శుద్ధి అయి బలం కలుగుతుంది. మూత్రంలో అమోనియా పెరుగదు. రాళ్లు చేరవు.

అపర పరమేశ్వరుడు - ఆదిశంకరుడు

–ఎ.తారాలక్ష్మి, ఎం.ఎ., ఎ.ఎడ్., ఎం.ఫిల్. (శ్రీకాళహస్తి)

దుష్టాచార వినాశాయ ప్రాదుర్భూతో మహీతలే
సైవ శంకరాచార్యః సాక్షాత్ కైవల్య నాయకః ॥

సర్వ శుభంకరుడైన శంకరుని అపర అవతార స్వరూపమే ఆదిశంకరాచార్యులు. ఆదిశంకరులు ఆవిర్భవించిన నాటికి దేశంలో అనేక విచ్ఛిన్న కరశక్తులు తలెత్తాయి. దేశంలో శూన్యవాదం నాస్తికత్వం ప్రబలి జనసామాన్యం నిష్క్రియము, నిర్వీర్యము కాసాగింది. వివిధ దార్శనికులు, మత ప్రచారకులు భిన్న సిద్ధాంతాలతో వైదిక వాఙ్మయాన్ని అస్తవ్యస్తం చేసి సంప్రదాయాన్ని ధ్వంసం చేసి, తద్వారా సామాజిక సామరస్యతను, శాంతిని భంగం చేశారు. అట్టి కల్లోల పరిస్థితుల్లో వైదిక వాఙ్మయాన్ని సరిగా అధ్యయనంచేసి వాఖ్యానించగలిగేవారు కరువయ్యారు. అటువంటి సమయంలో దుష్టాచారాలను నశింపజేయుటకు కైవల్య నాయకుడైన శంకరుడే ఆదిశంకరుని రూపంలో అవతరించారు. శ్రౌత, స్మార్త క్రియలను సుప్రతిష్ఠితం చేసి వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి నీలలోహితుడు స్వయంగా శంకరాచార్యుని రూపంలో అవతరించాడు. కవులలో మహాకవి, పండితులలో మహాపండితుడు, మేధావులలో మహా మేధావి, హేతువాదులకు హేతువాది అయిన ఈ వేద వేదాంగ వేత్త, అర్థం లేని ఆచారాలతో అస్తవ్యస్తంగా ఉన్న వివిధ ఆధ్యాత్మిక సాంప్రదాయాలను, సంప్రదాయానుగుణంగా సమన్వయపరచిన భారతీయ సనాతన సంప్రదాయ పరిరక్షకుడు. సంసార ఘోరారణ్యములో దిక్కుతోచక తల్లడిల్లుచున్న ముముక్షువులకు, జిజ్ఞాసువులకు భక్తి జ్ఞాన వైరాగ్యాది మోక్ష సాధనా రహస్యాలను బోధించు నిమిత్తమై పెక్కు ఆధ్యాత్మిక గ్రంథములను రచించిన బహు గ్రంథకర్త. దేశ విదేశములలోని జిజ్ఞాసువులకు, సత్యాన్వేషకులకు మార్గదర్శియై వారికి పరమశాంతిని ప్రసాదించిన బ్రహ్మవేత్త. అత్యద్భుతమైన మేధాసంపత్తితో మహోన్నతమైన వైదిక సత్యాలను దర్శించిన గొప్ప దార్శనికుడు. పేరు ప్రతిష్ఠలున్న ఎందరో పాశ్చాత్య తత్తవేత్తలు వీరి ప్రజ్ఞాపాటవాలకు శిరస్సు వంచి దాసోహ మన్నారు.

శంకరాచార్యులవారు అద్వైతతత్వాన్ని గొప్పగా అభివర్ణించారు. బ్రహ్మసత్యం, జగన్మిథ్య అనునది వీరి సిద్ధాంతం. బ్రహ్మ ఒకటే సత్యము, తక్కినదంతా అసత్యము లేదా మిథ్య, ఇదే శంకరుని అద్వైత సిద్ధాంత సారాంశము. ఉన్నదంతా ఒక్కటే, అదే బ్రహ్మము. అనేకత్వము వైవిధ్యము అనుభావనలు

కేవలము భ్రాంతి మాత్రమే.

శంకరుల దృష్టిలో కంటికి కనిపించే భౌతిక జగత్తంతా మాయ లేక అవిద్యాజనితమైనది. మాయ భగవంతుని నిగూఢమైన చేతనా శక్తి. మార్పు చెందని సచ్చిదానంద పరబ్రహ్మము మార్పు చెందే ప్రకృతి రూపములో మనకు దర్శనమిస్తున్నాడు.

శంకరుల దృష్టిలో జీవుడు సచ్చిదానంద పరబ్రహ్మమునకు నడుమ బేధము కేవలము అవిద్య మాత్రమే. అవిద్య, లేక అజ్ఞానము కారణంగా జీవుడు శరీరాన్ని, మనస్సును ఇంద్రియాలను తానుగా భావిస్తూ అజ్ఞాన జనితమైన భ్రాంతిలో ఉంటాడు. కర్తృత్వ, భోక్తృత్వ భావనలకు లోనై ఉంటాడు. వాస్తవానికి జీవుడు సచ్చిదానంద పరబ్రహ్మకు అభిన్నుడు. అవిద్యావశుడైన జీవుడు తాను పరిమితుడన్న భ్రాంతిలో ఉంటాడు. అయితే బ్రహ్మ జ్ఞానము పొందిన పిదప జీవుడు ఉపాధి నుండి విడివడి, స్వేచ్ఛను పొంది పరబ్రహ్మలో లీనమై తన యథార్ధ రూపాన్ని సచ్చిదానంద స్థితిని తిరిగి పొందుతున్నాడు.

శంకరుల దృష్టిలో మోక్షం అంటే జ్ఞానమే. జీవుడు సచ్చిదానంద పరబ్రహ్మకు అభిన్నుం అని తెలుసుకోవడమే జ్ఞానం. అవిద్యానాశనమే జ్ఞానం. అవిద్య నశించినం తనే జీవుడు పరబ్రహ్మలో లీనమవుతాడు. భక్తి ద్వారా గానీ, కర్మ ద్వారా గానీ సాధకుడు జ్ఞానాన్ని పొందగలడు.

మసక చీకటిలో కనిపించిన తాడు మీద పాము ఆరోపింపబడినట్లు ఈ దేహము, ఈ సృష్టి ఆత్మ మీద ఆరోపింపబడినది. జ్ఞానమను దీపపు కాంతిలో తాడును గూర్చిన జ్ఞానాన్ని పొందినపుడు, సర్పభ్రాంతి తొలగి పోతుంది. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య ' అని తెలుసుకున్న వ్యక్తి జగత్తు పట్ల దాని విషయాల పట్ల భ్రాంతిని పొందదు. బ్రహ్మను గూర్చిన జ్ఞానాన్ని పొందినపుడు అవిద్య తొలగిపోతుంది. అదియే మోక్ష స్థితి.

విశ్వ కళ్యాణార్థమై శంకరులు అద్వైత సిద్ధాంతాన్ని, వేదాంత రహస్యాలను ఎలుగెత్తి చాటారు. వారి బోధలు అక్షర సత్యాలు మరియు చిరస్మరణీయాలు, భావితరాలకు ఇవి ఎంతో ఉపయుక్తమైనవి. విశ్వ వ్యాప్తంగా దేశ దేశాలలో, వాడ వాడలలో ప్రచారము చేయదగినవి. మానవుల మధ్య ఐకమత్యమును పెంపొందించి, వారిని విశ్వ మానవులుగా తీర్చిదిద్ది వారికి శాంతిని, సౌఖ్యాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించగలవు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న పలు రుగ్మతలకు దివ్యమైన ఔషధం అద్వైత సిద్ధాంతమే. మానవులంతా అద్వైత భావనను పెంపొందించినట్లయితే, స్వార్థము, ఈర్ష్య, ద్వేషము వంటి దుర్గుణములు నశించి ప్రేమ, దయ వంటి గుణములు పెంపొందును. **(మే నెలలో శంకరజయన్తి సందర్భంగా)**

యోగావశ్యకత

– రచన : శ్రీ స్వామి శివానంద సరస్వతి (అస్సాం)

విజ్ఞాన బలంతో మానవుడు అసాధ్యమైన పనులను గూడ చేస్తున్నాడు. ఆకాశంలో ఎగురుతున్నాడు. భూమిని గిర గిర చుట్టి వస్తున్నాడు. చంద్రగ్రహంపై, శుక్రగ్రహంపై దిగి వస్తున్నాడు. కానీ ముసలితనం, రోగాలు, అకాలమరణాల బారినుండి తప్పించుకోలేక పోతున్నాడు. వాటి వాతబడి అసహాయ జీవితాన్ని గడుపుతున్నాడు. ఇది చాల శోచనీయము. మానవుడీ సవాలును ఒక యోగంతోనే ఎదుర్కొనగలడు. ప్రాచీన మహర్షులు కనిపెట్టిన యోగబలంతో మానవుడు ముసలితనాన్ని, వ్యాధులను, అకాల మరణాన్ని ఆదుపులో పెట్టగలడు. భౌతిక విజ్ఞానానికి, వైద్యానికి లొంగని అనేక రోగాలను నేడు యోగంతో బాగు చేయుట అందరెఱిగినదే. భౌతిక వైద్యశాస్త్రాలను ఆశ్చర్యంతో ముంచెత్తే యోగక్రియల నెన్నింటినో నేడు యోగులు ప్రదర్శించిన విషయం అందరికీ తెలిసిందే. కాబట్టి యోగవిద్య సహాయంతో మనం జరావ్యాధి అకాల మరణాలను అదుపులో పెట్టుకోవచ్చు. ఐతే మనం ఇచట ఒక విషయం జ్ఞాపకముంచుకోవాలి. అదేమంటే రెండు మూడు ఆసనాలను నేర్చుకొని శరీరం రోగం లేనిది కాలేదే ? అని తలంచరాదు.

యోగంలో ధౌతి, వస్తి, ఆసనం, ముద్ర, ప్రాణాయామాలని ఐదంగాలున్నాయి. ధౌతి వల్ల నాభి (బొడ్డు) ప్రదేశంలో, మఱియు పొట్టయందు పేరుకొనిపోయివున్న సమస్త మలిన పదార్థాలు బయటకు నెట్టబడుతాయి. నాభి ప్రదేశంలో, ఉదరం (పొట్ట)లో మలిన పదార్థాలు చేరడానికి మలాశయం మరోస్థానము. వస్తిక్రియ ద్వారా మలాశయంలోని మలిన పదార్థాలు బయటకు నెట్టబడి మలాశయం శుద్ధంగా వున్న వానికి ఏలాటి దీర్ఘరోగాలు రావు. యోగాంగాలైన ఈ ధౌతి వస్తి క్రియల ద్వారా

శరీరంలో అన్ని రోగాలు నిరోధింపబడుతాయి. అకాల మరణం నిరోధింపబడుతుంది.

హఠయోగంలో మరొక ఆశ్చర్యజనకక్రియ ముద్ర. ఈ ముద్ర క్రియ శరీరంలోని గ్రంథులను **(Glands)** అన్నింటిని ఆరోగ్యవంతులుగా, బలిష్ఠాలుగాను వుంచుతుంది. గ్రంథులలోని అంతర్ముఖరసం శరీరాన్ని పుష్టికరంగా వుంచుతుంది. శరీరంలోని గ్రంథుల స్వాస్థ్యం శరీరాన్ని ఆరోగ్యంగా వుంచడంలో ఎంతో తోడ్పడుతుంది. ఈ గ్రంథులను బలముగలవిగా, ఆరోగ్యవంతాలుగా వుంచుకోవడానికి ముద్రాభ్యాసము ఎంతేని అవసరము.

యోగంలోని జనోపకార మరో అవిష్కరణ సాధన, క్రియ ప్రాణాయామము. ఈ ప్రాణాయామం యొక్క క్రమాభ్యాసం చేత జీవనశక్తి పెరుగుతుంది. ఆయస్సు వృద్ధి అవుతుంది. కాబట్టి శరీరం జరావ్యాధులను అకాల మరణాన్ని ఎదిరించి తిప్పి కొట్టడంలో చాలా సమర్థవంతమవుతుంది. ఈ ప్రాణాయామం సరైన పద్ధతిలో సక్రమంగా చేస్తే శరీరంలోని వాయుగ్రంథులు శక్తివంతాలౌతాయి. శ్వాసకోశం సుదృఢమవుతుంది. దాని సామర్థ్యం పెరుగుతుంది. దానివలన శరీరానికి అధికంగా ఆక్సిజన్ లభిస్తుంది, రక్తం శుద్ధమవుతుంది.

యోగం యొక్క ఏ ఒకటి, రెండు క్రియలతో అంగాలతో సమాహారం కలయిక – ద్వారానే మానవుడు ముసలితనం, వ్యాధి అకాల మరణాలను జయించగల్గుతాడు. గాబట్టి అలోపతి, హోమియోపతి, ఆయుర్వేద చికిత్సలవలెనే యోగచికిత్స గూడ నేడత్యంతఅవసరము. వాటికంటే ఇది ఉత్తమము. యోగులు శరీర నిర్మాణ శాస్త్రాన్ని, శారీరక విజ్ఞానాన్ని చాలా బాగా తెలుసుకొన్నారు. మానవ ప్రపంచానికే వరదానమైన యోగాన్ని కనిపెట్టినారు. నేడు క్రొ గ్రంథుల **(Glands)** ను గూర్చిన సరికొత్త విషయాలను తెలిసికొనడంతో పాశ్చాత్య వైద్య విజ్ఞానంలో ఒక

కొత్త క్రాంతే బయల్వెడలింది. కానీ ప్రాచీన యుగంలో భారతీయఋషులు ఈ గ్రంథులను గూర్చిన సమగ్ర జ్ఞానముతోనే యోగిక క్రియలను మనకు సంక్రమింప జేశారు.

స్థూల దృష్టితో చూస్తే యోగపద్ధతి రాజయోగం. హఠయోగం అని రెండు ప్రధానాంగాలుగా వుంది. అందు రాజయోగం ముఖ్యంగా మానసిక శుద్ధిని సిద్ధింపజేసేది. రాజయోగం ద్వారా మనం మన మనస్సుకు స్వయం అధిష్ఠాతలమై ఉచ్చకోటికి చెందిన స్వానుభూతితో మన ఆత్మయొక్క దివ్యాంశమును సాక్షాత్కరించుకోగలుగుతున్నాం. ఈ రాజయోగ వివరణ పతంజలి యోగదర్శనంలో విస్తారంగా వివరింపబడియుంది.

హఠయోగా న్ననుసరించి ఈ శరీరం యన్త్రమువలె ఒక మిషను. మన ఆత్మ ఈ మిషన్‌కు డ్రైవరు. మస్తిష్కం, బుద్ధి, అహంకారం మొదలుగునవి ఈ ఆత్మ యొక్క శక్తి తత్త్వాలు. ఈ శక్తితత్త్వాలన్నీ గ్రంథుల ద్వారా తమ కార్యాలను చేస్తూంటాయి. మన శరీరంలోని స్నాయుప్రణాళి లేక గ్రంథి ప్రణాళి యొక్క కార్యం సామాన్యంగా ప్రకృతావస్థ యందు స్వాస్థ్యప్రదమైతే, మనం మన ఈ శరీరం ద్వారా మన ఆత్మ యొక్క దివ్యభావంతో ఈశ్వరీయ భావాన్ని సాక్షాత్కరించుకొంటూ పరమసిద్ధిని పొందగల్గుతాం. ఎవడు గానీ శారీరక అవయవాలను దోషరహితం చేయకుండా, తన మానసిక దివ్యత్వానికి అధికారి కాజాలడు, మఱియు అట్టివాడు దైవభావంతో గూడిన మానసిక శక్తికి స్వామి - అధికారి గాజాలడు.

చిత్తవృత్తి ' నిరోధమే ' యోగము

కర్మయందు కుశలత్వమే యోగము

సప్తర్షుల అవతార వృత్తాంతం

- లగడపాటి భాస్కర్, ఎం.ఎ.

పంచలక్షణ సమన్వితాలైన మనపురాణాలన్నింటిలో సృష్టిక్రమాన్ని గురించి వివరించడం ఒక తప్పనిసరి అంశం. భారతం, భాగవతం, విష్ణు పురాణం, వామన పురాణం, శ్రీమద్భగవద్గీత, ఇంకను ఇతర పురాణాలూ ఉపనిషద్వాక్యాలను పరిశీలిస్తే దేవ వర్గంలో ఋషులూ, మునులూ ఉన్నట్టూ, సృష్టి విస్తృతిలో వీరు ముఖ్య పాత్ర నిర్వహించినట్టూ తెలుస్తున్నది. ప్రస్తుతం మనం లెక్కలోనికి తీసుకుంటున్న ఏడుగురు మహర్షులే ఆది నుంచి ఉన్నారా ? వారు అవతార పురుషులా ? వారి ఆవిర్భావం ఎలా జరిగింది? భవిష్యత్తులో రానున్న మహర్షులెవ్వరు ? ఈ విషయాలపై చర్చ ఈ వ్యాసం.

" నమః పరమ ఋషిభ్యో, నమః పరమ ఋషిభ్యః "

అంటూ ముండకోపనిషద్ పరమఋషులకు నమస్కారం చెల్లిస్తుంది.

బ్రహ్మ దేవుడు తన సృష్టిని విస్తరించడం కోసం తనతో సమానమైన శక్తినీ, జ్ఞానాన్నీ, మహిమనూ కలిగిన పదిమందిని ఆదిలో తన మన స్సంకల్పంతో సృష్టించాడు. వారే " మరీచి, అత్రి, అంగిరస, పులస్త్య, పులహ, క్రతు, భృగు, వసిష్ఠ, దక్ష, నారదులు ".

" మరీచిరత్ర్యంగిరసౌ, పులస్త్యః పులహః క్రతుః ।
భృగుర్వసిష్ఠో, దక్షశ్చ దశమ స్తత్ర నారదః ॥

(శ్రీ మద్భాగవతం - 3.12/ 22)

వీరు బ్రహ్మ సమానులనీ వీరినే నవబ్రహ్మలనీ పిలుస్తారంటుంది విష్ణు పురాణం.

' నవ బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ॥ "

ఇదే ఆది ఋషి సర్గ ! - (విష్ణు పురా. 1/7/6)

ఈ విష్ణు పురాణంలో మొదటి సర్గలో ఋషిగణం - పదిమంది కాకుండ, తొమ్మిదిగా పేర్కొనబడింది. నారదుని పేరు ' మానసుడు'గా

కూడ ఉన్నది. ఆ తొమ్మిది మంది వీరే ! భృగు, పులస్త్య, పులహ, క్రతు, అంగిరస, మరీచి, దక్ష, అత్రి, వసిష్ఠ, మానసులు. ఈ మహర్షులే వేరు వేరు మన్వంతరాల్లో, సప్తర్షుల రూపాల్లో అవతరిస్తుంటారు.

శ్రీ మద్భాగవతంలో సూతుడు శౌనకాది మునులకు ప్రస్తావ వశాన ఏమన్నాడంటే....

" ఋషయో మునయో దేవా మనుపుత్రా మహౌజసః ।
కలాః సర్వే హరే రేవ సప్రజాపతయ స్తథా ॥ ' (శ్రీ మద్భాగవతం /3/27)

ఋషులు, మునులు, దేవతలు, ప్రజాపతులు, ముని పుత్రులు, మహాశక్తి సంపన్నులు. ఎందుకంటే వారంతా శ్రీహరి ' అంశావతారులు ', లేక 'కళావతారులు '. కనుక ! బ్రహ్మ దేవుని మానస పుత్రులైన సప్తర్షులు అందుచేతనే భగవద్విభూతి యుక్తులైన హరి అంశావతారులుగా గణింపబడుతున్నారు. బ్రహ్మ వీరిని మనస్సంకల్పతోను, తన వివిధాంగాల నుండి కూడ సృష్టించాడు. కనుక వీరి సృష్టి ' సాంకల్పికమూ ', ఆంగికము' కూడ అనాలి.

వీరిలో నారదుడు ' బ్రహ్మ ' ఒడి నుండి పుట్టాడు. అంగుష్ఠం నుంచి దక్షుడు జన్మించాడు. వసిష్ఠుడు 'ప్రాణం ' నుంచి, భృగువు – చర్మం నుంచి, క్రతువు చేతుల నుంచి పుట్టారు. పులహుడు 'నాభి' నుంచి, పులస్త్యుడు చెవుల నుంచి, అంగిరసుడు ముఖం నుంచి, అత్రి నేత్రాల నుంచి, మరీచి 'మనస్సు ' నుంచి – బ్రహ్మపుత్రులై పుట్టారు.

' ఉత్సంగాన్నారదో జజ్ఞే దక్షో 2 ఙ్గుష్ఠాత్స్వయమ్భువః ।
ప్రాణాద్వసిష్ఠః సంజాతో భృగుస్త్వచికర్మాత్రతుః ॥
పులహో నాభితో జ్ఞేయో పులస్త్యః కర్ణయోర్ఋషిః ।
అంగిరాముఖతో 2 క్ష్ణో 2 త్రిర్మరీచిర్మనసో 2 భవత్ ॥
(శ్రీ మద్భాగవతం – 3/12/23, 24)

పురాణాలు, బ్రహ్మచే సృష్టింపబడిన ఈ ఋషుల ప్రాదుర్భావాన్నే ' ఋషిర్ల ' అని చెబుతున్నాయి. మరొక విధంగా చెప్పాలంటే వీరంతా బ్రహ్మ

దేవుని ఆత్మ స్వరూపాలే.! అవతారాలే ! సృష్టి విస్తరణలో, సంరక్షణలో కూడ వీరికి గల పాత్ర మహత్వ పూర్ణమైనది. వివిధ మన్వంతరాల్లో వీరే – వేరు వేరు నామాలతో సప్తర్షులై ఉంటూ, మహాప్రళయ సమయంలో చరాచరముల్లో సూక్ష్మాతి సూక్ష్మరూపులుగాను, వనస్పతుల్లో, ఓషధుల్లో బీజరూపులుగాను ఉంటారు ! అలా ప్రళయంలోను, మరల పునః సృష్టిలోను వీరు విద్యమానులై ఉంటూ, తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారు. వీరిలా స్థూల సృష్టికి ' సత్వాంశ ' చైతన్యాంశ ' లుగా లేకుండినట్లైతే, ప్రళయం తర్వాత (సురక్షిత బీజాంశ లేకుండ) పునః సృష్టి చేయడం కష్టతరమయ్యేది.

ఈ సప్తర్షులు భగవానుని కృపకు పాత్రులై, భక్తులై, శక్తి సంపన్నులై లోక కల్యాణం కావిస్తున్నారు. వీరు ఒక రూపంలో నక్షత్ర మండలంలో స్థిరంగా ప్రకాశిస్తుంటారు. మరొక రూపంలో భూలోకంలో ఉంటూ లోకులకు – జ్ఞానము, భక్తి, వైరాగ్యము, తపము, భగవత్ప్రేమ, సత్యము, పరోపకారము, ఓర్పు, అహింస మొదలైన సాత్త్విక భావాలు పెంపొందించు కోవడంలో మార్గదర్శనం చేస్తుంటారు.

కృత (సత్య) త్రేత, ద్వాపర, కలియుగాలు నాల్గూ గడచిన ప్రతిసారి, ' వేద విప్లవం ' వస్తుంటుంది. అప్పుడు సప్తర్షులు భూతలంపై అవతరించి 'వేదోద్ధరణ ' చేస్తారు. ' కల్పాంత జీవులూ, త్రికాల వేత్తలూ, ముక్తాత్ములూ, దివ్య దేహధారులూ అయిన ఈ సప్తర్షులు, జ్ఞాన పరంపరకు అధికారులు కూడ. వీరు జిజ్ఞాసువులకు తత్త్వజ్ఞానాన్ని అందించి, ముక్తి మార్గంలో నడిపిస్తారు. అతీంద్రియ ద్రష్టలైన వీరు పురాణాల్లో బ్రహ్మవాదులుగా పిలువ బడ్డారు. గృహస్థాశ్రమంలో ఉంటూ, సత్య, ధర్మ, శౌచ, స్వాధ్యాయాది సదాచారాలూ, అపరిగ్రహాది ఆదర్శ గుణాలతో లోకులకు ఆదర్శ ప్రాయులుగా ఉంటూ, తమ ప్రమాణ వాక్యాలతో, జనులను సన్మార్గోన్ముఖులను గావిస్తూ, బ్రహ్మతేజోమయులై, యజ్ఞయాగాదులు నిర్వహించి, దేవతలకు ప్రీతి కలిగించే మహాత్ములు – సప్తర్షులు ! **(సశేషం)**

ప్రథమ ప్రపంచ యోగ దినోత్సవము

– శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు

ఈ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ప్రపంచమంతటా యోగ దినోత్సవం జరుపాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. ఆ ప్రకారం జూన్ 21వ తేది ప్రథమ ప్రపంచ యోగదినోత్సవం జరుగనున్నది. యోగంవలన చిత్తశాన్తి, స్థైర్యం కలుగుతుందనీ, ప్రశాన్త చిత్తుని వ్యవహారం వ్యక్తిగత శాన్తికి తద్వారా సమాజశాన్తికి హేతువవుతుందని ప్రపంచం గుర్తించింది. ఏ వైద్యానికీ బాగుగాని కొన్ని జబ్బులు యోగ చికిత్సతో బాగువుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ప్రకటించింది.

ప్రతి ప్రాణి చేయు కర్మ యొక్క ఫలము ఆ ప్రాణిచే అవశ్యం అనుభోక్తవ్యము శుభకర్మచే శుభఫలము, అశుభకర్మచే అశుభఫలము కలుగుతుంది. తీపి తింటే తిన్నవానికి మధురానుభూతి కల్గుతుంది. కారం, లేక చేదు తిన్న వానికి చేదు అనుభూతి తప్పక కల్గుతుంది. మంచి చేసిన వానికి పుణ్యముచే ఆ కర్మఫలము. చెడు చేసిన వానికి పాపం ఆ కర్మ ఫలము. పుణ్యము సుఖము, పాపంవలన దుఃఖం కలుగుతుంది. ఎట్టి కర్మను చేసినవాడు అట్టి ఫలాన్ని అనుభవించాల్సిందే. అందుచే శాస్త్రం అన్నది " అవశ్యమనుభోక్తవ్యం ఫలంకర్మ శుభాశుభమ్ " అని ఫలితాలు.

ఈ కర్మల ఫలితమే సుఖదుఃఖాలు రోగాలు అశాన్తులు. సమాజంలో కొన్ని పనుల, చేసిన వానితోనే పోవు. సమాజాన్ని కూడ ప్రభావితం చేస్తాయి. ఒక పిచ్చివాడు తుపాకితో ఇష్ట మొచ్చినట్లు కాలిస్తే అది వానితోనే పోలేదు. ఎదుటివాళ్లు చాలామంది దానికి బాధితులయ్యారు. కాబట్టి సమాజంలో కొందరు చేసిన కర్మ ఫలాలు ఇతరులు కూడా అనుభవించాల్సి వస్తూంది. కాబట్టి ప్రతిపాణి చేసే కర్మ తనకూ సమాజానికి మేలు చేకూర్చేదిగా వుండాలి. దానికి కర్మప్రేరకమైన ప్రతివానిబుద్ధి, చిత్తము శుద్ధమై వుండాలి. ప్రసన్న చిత్తుడు, శుద్ధ చిత్తుడు తాను శాన్తిగా వుంటాడు. సమాజాన్ని శాన్తిగా వుండనిస్తాడు. కాబట్టి వ్యక్తి శాన్తిసుఖజీవననానికి సమాజ సుఖ, శాన్తి జీవనానికి వాని చిత్తం ప్రసన్నంగా, శుద్ధంగా వుండాలి అని తేలింది. అది యోగంతోనే సాధ్యం. కాబట్టే భగవంతుడు " ప్రసన్న మనసం హ్యేనం యోగినం సుఖముత్తమం ఉపైతి " అన్నారు.

అట్టి శుద్ధ చిత్తాన్ని, సమచిత్తాన్ని ఇచ్చేది యోగము. అందుకే భగవద్గీతలో భగవానుడు " యోగః కర్మసు కౌశలమ్ " అని అన్నారు. కర్మలో ఇట్టి కుశలత్వాన్ని అనుకూల ప్రతికూలము రెండింటిలో " సమబుద్ధిని " ఇచ్చే యోగం నేడు ప్రతివానికీ అవసరము. ఇది గుర్తించిన ప్రపంచ సంస్థ ఐక్యరాజ్య సమితి **" యోగదినోత్సవాన్ని"** నడపడం ఏంతేని సమంజసం.

వార్తలు

(01). (ఎ) గురుదేవులు పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆరాధనోత్సవాలు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగిన విధంగానే విశాఖపట్టణం రాజప్పనాయుడువీధిలోని గీతాభవనంలో శ్రీ గీతాప్రచారసమితి వారు ఏప్రిల్ 3వ తేది శ్రీవారి ఆరాధన, 7వ తేది జన్మదినోత్సవాన్ని ఘనంగా జరిపారు.

(బి). హైద్రాబాద్ దిల్‌సుఖనగర్‌లోని శ్రీ విద్యాప్రకాశానంద సత్సంగ సేవా సమాజం వారు కూడా 3వ తేది శ్రీవారి ఆరాధన ఘనంగా చేశారు. అట్లే ఆదిలాబాద్ జిల్లా నిర్మల సమీపం బీరవల్లి శ్రీ విద్యాప్రకాశానంద గీతాశ్రమంలోను ఆరాధనోత్సవాలు జరిపారు. అన్నదానం కూడా చేశారు.

(02). చిత్తూరుజిల్లా, పుత్తూరు శివాలయ ప్రాంగణంలోని గీతామందిరంలో గీతాసేవాసమాజం యొక్క రజతోత్సవాలు 17-04-2015 నుండి 30-04-2015 వరకు జరిగాయి. అందు 17వ తేది రజతోత్సవ ప్రారంభోత్సవం పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారిచే జరుపబడినది.

(03). 23-04-2015 తేది గురువారం జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి జయన్త్యుత్సవం ఆశ్రమంలో జరిగినది. ఆనాడు సాయంకాలం 6 గంటల నుండి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో శంకరజయన్తిని పురస్కరించుకొని పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ప్రవచన జరిగినది.

(04). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఏప్రిల్ నెలలో **1164 గురికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్స చేశారు. **142 మందికి కంటి పొరలు** ఆపరేషన్ చేసి కండ్లలో లెన్సు అమర్చినారు. ఈనెలలో కొత్తకండ్రిగ గ్రామంలో కంటి వైద్య శిబిరం ఆశ్రమం వారు నడిపారు.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

_______	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టైఫెండ్	: నెలకు రూ. 1,000/-
_______	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టైఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

_______	(సామవేదము/అథర్వవేదము–వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మతీయొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
_______	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020

Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,

E-mail : info@kakatiyacement.com

Regd.No. TRP / 123 / 2015-17 June 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-05-2015, Permitted to post : 29th, 30th every month.

శుకబ్రహ్మాశ్రమ యోగ తరగతులలో ధ్యానం చేస్తున్న వారు

వేదాంతభేరి

జులై 2015 రూ. 6/-



సాధకులు జపధ్యానాదులు పూర్ణదైవ భావముతో జేయవలెను. తమలోని మలినరాసులను దగ్ధము జేయుటకు తాము జపించు ప్రతి మంత్రాక్షరమును, తపోగ్ని కణముగ భావించి అద్దానిని రగుల్కొల్పి మహాగ్నిగ మార్చవలెను. ఆ యగ్నికి వెఱచి ప్రాపంచిక వ్యామోహములు మీదరి జేరక గడగడలాడుచు పలాయనము గావించును. ప్రతి గీతా శ్లోకములోని అనంతశక్తిని ఎదురులేని బ్రహ్మాస్త్రముగ భావించి మీ యజ్ఞాన శత్రువును పరిమార్చుటకు ప్రయోగింపుడు.

- శ్రీ మలయాళస్వాములవారు

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 జూలై 2015 సంచిక : 7

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 జూలై 2015 సంచిక : 7

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. ప్రతిజీవి ఒక అశోక చక్రవర్తి- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు- 06

03. లెండు మేల్కొనుడు - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -09

04. శ్రీరామకృష్ణ కథామృతం - శ్రీ రామకృష్ణ పరమహంస - 10

05. సద్గురువు - - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 13

06. స్త్రీ జనోద్ధరణకై శ్రీసద్గురు మలయాళస్వాములవారి కృషి
- శ్రీవిద్యాస్వరూపానందగిరి స్వాములవారు - 19

07. ఆధ్యాత్మికాకాశంలో శ్రీ మలయాళస్వాములవారొకధృవతార
- డా।। సముద్రాల లక్ష్మణయ్య - 21

08. మంగళమో కీర్తి సాంద్ర - మలయాళ మౌని చంద్ర
- ఆచార్య డా।। జక్కంపూడి మునిరత్నం - 24

09. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా।।కరిబసవరాజేంద్ర మహాస్వామి -25

10. వరుణ దేవుని కరుణ - బి.రాజయ్య - 27

11. సప్తర్షుల అవతార వృత్తాంతం - లగడపాటి భాస్కర్ - 29

12. జీవాత్మ - పరమాత్మ - శ్రీమతి ఎం.సీతాలక్ష్మీదేవి - 32

13. శ్రీ సద్గురు స్వాములవారి ఆదర్శ గుణగణములు
- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 35

14. శ్రీ మలయాళస్వామి స్తోత్రం - శ్రీపాదకృష్ణకవికృతం - 38

15. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారు తుంబురతీర్థంలో తపస్సు చేయుట

ప్రార్థన

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

అఖండ ధామ మండితం సుభక్తకోటి సేవితమ్
సదా ప్రసన్న మానసం అసంగదేశికం భజే ॥ 01

తాత్పర్యం : అఖండమైన ఆత్మతేజముచే అలంకరింపబడినవాడును, ఉత్తమ భక్తసముదాయముచే సేవింపబడువాడును, ఎల్లప్పుడు ప్రసన్నమైన మనస్సుగలవాడును అగు శ్రీ మదసంగానంద సద్గురువును (శ్రీ మలయాళ స్వామిని) భజించుచున్నాను. (శ్రీ సద్గురుదేవుల సన్న్యాసదీక్షానామం శ్రీ మదసంగానందగిరిస్వాములవారు).

అనంత సౌఖ్యదాయకం, విలీన దృశ్యమండలమ్ ।
సులబ్ధ దృక్స్వరూపకం, అసంగసద్గురుం భజే ॥ 02

తాత్పర్యం : ఆత్మానందము గలుగజేయువాడును, విలీనమైన దృశ్యమండలము గలవాడును, దృక్స్వరూపమగు పరబ్రహ్మమును లెస్సగ సాక్షాత్కరించుకొన్నవాడును అగు శ్రీమదసంగానంద సద్గురువును భజించుచున్నాను.

అఖర్వశక్తి దీపకం, అకుంఠిత ప్రభానిధిమ్ ।
జగత్తమః ప్రభంజకం, అసంగసద్గురుం భజే ॥ 03

తాత్పర్యం : అఖండమగు ఆధ్యాత్మిక శక్తి నుద్దీపింప జేయువాడును, అకుంఠితమగు జ్ఞానతేజమునకు నిలయమైనవాడును, జనుల అజ్ఞానమును పూర్ణముగ భేదించివైచువాడును అగు శ్రీమదసంగానంద సద్గురువును భజించుచున్నాను.

సమస్తలోక పావనం, సుశిక్షణ ప్రదాయినమ్ ।
అనల్పదుఃఖ దూరకం, అసంగ దేశికం భజే ॥ 04

తాత్పర్యం : సర్వలోకములను పవిత్రమొనర్చువాడును, సాధకులకు ఉత్తమ శిక్షణ గరపు వాడును, మహత్తరమగు సంసారదుఃఖమును తొలగించువాడును అగు శ్రీమదసంగానందసద్గురువును భజించుచున్నాను.

అశేష ఛాత్రవందితం, సుసాధు సేవ్య మానసమ్ ।
విరక్తలోక పాలకం అసంగసద్గురుం భజే ॥ 05

తాత్పర్యం : సమస్త శిష్యకోటిచే నమస్కరింపబడినవాడును, ఉత్తమ సాధువులచే సేవింపదగిన మానసము గలవాడును, వైరాగ్యశీలురగు జనులకు మోక్షమార్గము జూపి రక్షించువాడును నగు శ్రీ మదసంగానంద సద్గురువును భజించుచున్నాను.

అధీత వేదసంతతిం, ముముక్షు కల్ప పాదపమ్ ।
అజన్మ మార్గ దీపకం, అసంగదైవతం భజే ॥ 06

తాత్పర్యం : వేదముల నన్నింటిని బాగుగా అధ్యయనము చేసినవాడును, ముముక్షువులకు కల్పవృక్షమైనవాడును, జనన మరణరహితమైన ముక్తిమార్గమును బోధించువాడును అగు శ్రీ మదసంగానందదేవుని భజించుచున్నాను.



ప్రతి జీవి ఒక అశోక చక్రవర్తి

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

చరిత్ర (**History**) లో అశోక చక్రవర్తిని గూర్చి జనులు వినుచుందురు. ప్రతి జీవియు ఒక అశోక చక్రవర్తి యను పరమ సత్యమును ఉపనిషత్తులు ఉద్ఘోషించుచున్నవి. దానిని అనుభూత మొనర్చుకొనినచో ఇక శోకము (దుఃఖము), క్లేశము, ఆపదలు లవలేశమైనను జీవుని బాధించనేరవు. 'మాశుచః' శోకించువలదు అని గీతాచార్యుడు అర్జునునకు పదే పదే హితబోధ గావించి శోకసంవిగ్నమానసుడగు అతనికి పరమశాంతిని ప్రసాదించెను. గీతాబోధ అర్జునుని శోకరహితుడుగా చేసినప్పుడు ఇక తక్కిన వారిని ఏల శోకరహితులుగా చేయకుండును ! తప్పక చేయును. ఆ బోధను ఆచరించిన చాలును. గీతాచార్యుల అమృతోపములగు సద్బోధలను కార్యాన్విత మొనర్చిన చాలును.

జీవులు శోకరహితమైన సచ్చిదానందాత్మను తమ హృదయ మందుంచుకొని యున్నప్పటికి పరితపించుచున్నారు. దీనికి కారణము అజ్ఞానమేయగును. బ్రహ్మానందమే తమ నిజస్వరూపమను జ్ఞానము లేకపోవుటయే యగును. భగవద్గీతలో ఒక సందర్భమున జీవులు ఎందులకు శోకించుచున్నారు. అను ప్రశ్నకు శ్రీ కృష్ణపరమాత్మ యిట్లు సమాధాన మొసంగెను.

అజ్ఞానేనావృతం జ్ఞానం, తేన ముహ్యన్తి జన్తవః

మేఘముచే సూర్యుడు కప్పబడినట్లు అజ్ఞానముచే జ్ఞానస్వరూపమగు ఆత్మ కప్పబడుటవలన జీవులు దుఃఖము నొందుచున్నారు. కాబట్టి ఇపుడు

దుఃఖమునుండి తప్పించుకొనుటకు ఉపాయము విచారణచే, వివేకముచే, ఆ అజ్ఞానమును తొలగించుకొనుటయే యగును.

జ్ఞానేనతు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః
తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్

కావున శోకసముద్రమును దాటుటకు సులభోపాయము శోక వర్జితమగు ఆత్మ తానని భావించుటయే యగును. కనుకనే గీతాచార్యుడు ' అశోచ్యాన్ ' అను చక్కని పదమును ప్రయోగించి ' ఓ జనులారా ! మీరు వాస్తవముగ శోకింపదగనివారు. మీరు ఆనంత స్వరూపులు. మీకు చావు పుట్టుకలు లేవు. సంసార చక్రమునకు సాక్షియై విలసిల్లు నిత్య శుద్ధ బుద్ధముక్త ఆత్మయే మీరు. మీరు దేహము కాదు. మనస్సు కాదు. దృశ్యవస్తువుకాదు. క్షేత్రముకాదు. క్షేత్రజ్ఞుడగు ఆత్మయే మీరు అని ఘంటాపథముగ ఉద్బోధించెను. ఈ బోధ సంసార దుఃఖపరిమగ్నులగు జనులందఱికిని కనువిప్పును కలిగించునదై యున్నది.

తన శిష్యు డొకపుడు దుఃఖించుచుండగా వివేకానంద స్వామి పలికిన ఈ క్రింది వాక్యములు జనులకు పరమ ధైర్యమును చేకూర్చుచున్నవి.

కిం నామ రోదిషి సఖే త్వయి సర్వశక్తిః
ఆమంత్రయస్వ భగవన్ భగదం స్వరూపమ్
త్రైలోక్యమేతదఖిలం తవపాదమూలే
ఆత్మైవ హి ప్రభవతి న జడః కదాచిత్.

' నాయనా ! ఎందుల కేడ్చుచున్నావు ? నీవు దుఃఖించు వాడవుకాదు. నీయందు అఖండమైన శక్తి ఇమిడియున్నది. నీ నిజస్వరూపమగు ఆత్మను తెలిసికొని అద్దానిని ప్రకటించుము. ముల్లోకములున్ను నీ పాదములచెంతనే యున్నవి. చైతన్యమగు ఆత్మయే నీవు, కాని జడమగు దేహము నీవు కాదు.

కాబట్టి జీవుడు దుఃఖరూపుడు కాదు. అశోక చక్రవర్తి. ఆనంద

సామ్రాజ్యమునకు అధిపతి. " ఆనందరూప శ్శివో 2 హమ్. శివో 2హమ్' అని ఎలుగెత్తి పాడదగినవాడు. తన స్వరూపమును మైమఱచి, సంసార వ్యామోహములో పడి అనాదికాలమునుండి దుఃఖించుటయే పనిగా పెట్టుకొని జీవయాత్రను గడుపుచున్నాడు. దుఃఖము జీవునకు సహజముకాదు. అది ఆగంతుకము. మధ్యలో వచ్చినది. మఱి మధ్యలోనే (వివేకముచే) తొలగిపోవును. దుఃఖము మనస్సు వలన కలుగుచున్నది. జీవుని స్వరూపము మనస్సు కాదు. మనస్సుకు సాక్షియైన ఆత్మ. కనుక దుఃఖము, శోకములకు ఆవలనున్నవాడే జీవుడు. సుషుప్తిలో మనస్సు లయించుటచే అవిచ్ఛిన్నమైన సుఖమును జీవుడనుభవించుచున్నాడు కదా. అట్టి జడస్థితిలోనే అంత ఆనందమును అనుభవించుచుండ ఇక చైతన్యరూపమగు సమాధిస్థితియందెంత ఆనందమును జీవుడను భవించును?

కాబట్టి ప్రతి జీవియు తాను మనస్సునకు ఆవలనున్న ఆత్మయే యని నిరంతరము భావించుచు మనోధర్మమగు శోకమును పారద్రోలి అశోక చక్రవర్తియై విలసిల్లుచు జీవితమును వసంతమువలె ఆహ్లాదయుతముగ నొనర్చుకొనవలెను.

భూరివిరాళము

శ్రీ సి.వాసుదేవరెడ్డి గారు (హేమా క్లినిక్, నుంగంబాకం, చెన్నై) శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో అన్నదానికి గాను మూలనిధిగా 39 లక్షల రూపాయలను ఇచ్చారు. వీరిని వీరి కుటుంబాన్ని శ్రీ జ్ఞానప్రసూనాంబా సమేత శ్రీకాళహస్తీశ్వరుడు అనుగ్రహించుగాక !

లెండు మేల్కొనుడు

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

“ దివ్యాత్మస్వరూపులగు సోదరులారా ! సోదరీ జనులారా ! తిలకుగారు స్వరాజ్యము మన జన్మహక్కని ఉద్ఘోషించినట్లు, స్వారాజ్యము, దానికి సంబంధించిన సాధనలు, సాధన కనుకూలములగు శాస్త్రములు మనుషులందఱి సొంతమని దృఢముగా ఉద్ఘోషింపుడు. ఇట్టి దృఢమగు బోధ కలిగి వర్తింపుడు. అప్పుడే మీరు నిద్ర నుండి మేల్కొనిన వారగుదురు.

విజ్ఞాన మూర్తులారా ! మాయామోహము నుండి లెండు ! అజ్ఞాన నిద్ర నుండి మేల్కొనుడు ! మీరెల్లరు జ్ఞాన స్వరూపులని మీ నిజావస్థను కనుగొనుడు ! ఆనందము నొందుడు. ఉత్తిష్ఠత ! జాగృత ! ప్రాప్యవరాన్ని బోధత ! ఇప్పుడు మనము చేయవలసినది బ్రహ్మవిద్యనభివృద్ధి పఱచుటయే.

మహర్షుల వంశములో పుట్టిన సోదరీ సోదరులారా ! మహనీయుల దివ్య జీవితములను స్మరింపుడు ! **లెండు ! మేల్కొనుడు !** ప్రకృతికి పరమైన ఆత్మస్థితిని పొందిన వారిని ఆశ్రయించి తత్త్వమును గ్రహింపుడు. ఏలన, కాలచక్రము ఒక్క నిమిషమైన నిలువక తన ప్రయాణము సాగించుచున్నది. దైవాత్మ స్వరూపులారా ! దయా మూర్తులారా ! పగలు, రాత్రి, దినము, వారము, పక్షము, మాసము, ఆయనము, సంవత్సరము – అతివేగముగా దాటిపోవుచున్నవి. ఇట్టి తరుణమున ఊరకుండుట పాడియా! జాగరూకులై ఆత్మావలోకన మొనర్చుటకు ప్రయత్నింపుడు ! శోక సాగరమును దాటుడు ! నిత్య సుఖమును పొందుడు ! అమృతమైన పదము నధిష్ఠించి సుఖింపుడు !

శ్రీరామకృష్ణ కథామృతం

– శ్రీ రామకృష్ణ పరమహంస

దక్షిణేశ్వర ఆలయ ఉద్యానవనాన్ని అనేకులు సందర్శిస్తారు. సందర్శకులలో కొందరు భగవంతుడిపట్ల అనాస్తకులుగా ఉండటం నేను గమనిస్తే వారితో ‘ మీరు కాస్త దూరంగా పోయి కూర్చోండి ’ అనేవాణ్ణి. కొన్ని సందర్భాలలో ‘ అటు వెళ్లి మంచి బిల్డింగులను చూడండి ’ అనేవాణ్ణి. (నవ్వులు).

కొన్ని సమయాలలో భక్తులతో కలిసి అయోగ్యులు కూడ రావటం నేను గమనించాను. వీరు లోకాభిరామాయణంలో మునిగిపోయి ఆధ్యాత్మిక ప్రసంగాలపట్ల పూర్తిగా విముఖులై ఉంటారు. భక్తులు నాతో చాలసేపు భగవత్ప్రసంగాలు చేస్తూవుంటే, వీరు అశాంతచిత్తు లవుతారు. ఇక అక్కడ కూర్చోవటం వారికి అసాధ్యంకాగా తమ భక్తులైన మిత్రులతో యిలా గుసగుసలాడతారు. ‘ మనం ఎప్పుడు బయలుదేరుతున్నాం ? ఇంకా ఎంతసేపు మీరిక్కడ ఉంటారు ?’ అందుకు భక్తులు ‘ ఓ క్షణం ఆగండి. కొంచెంసేపట్లో బయలుదేరుదాం ’ అంటారు అప్పు డీ లౌకిక జనం, కంఠంలో విసుగు ధ్వనించేలా, ‘ సరే, మీరు మాట్లాడుకోండి. మీకోసం పడవలో నిరీక్షిస్తూవుంటాం ’ అంటారు. (అందరూ నవ్వారు)

ఈ లౌకిక వ్యక్తులతో సమస్తాన్ని త్యజించమని, మనస్ఫూర్తిగా భగవంతుడికి అంకితం అవమని చెబితే ససేమిరా వినరు. అందుచేతనే చైతన్య నిత్యానందులు బాగా యోచించి ఈ లౌకిక జనాన్ని ఆకర్షించే నిమిత్తం ఒక ఏర్పాటు చేశారు. ఆ వ్యక్తులను సమీపించి “ రండి, హరినామస్మరణ

చేయండి. 'మాగూర్ ' చేపల పులుసు, యువతి ఆలింగనం మీకు దక్కుతవి,” అనేవారు. అనేకులు ఈ చేప, యువతి పట్ల ఆకర్షితులై భగవన్నామ సంకీర్తన చేసేవారు. భగవంతుడి పవిత్ర నామామృతాన్ని కొంత రుచి చూశాక నిజానికి ' ఈ చేప పులుసు' ను భగవత్ప్రేమలో తాము స్రవించే కన్నీరుగా వారు గుర్తిస్తారు. ' యువతి ' పృథివిని సూచిస్తుందని వారికి ఎరుక కలుగుతుంది. యువతి ఆలింగనం భగవత్ప్రేమలో పరమానందంతో నేలపైపడి దొర్లటంగా అర్థం చేసుకొంటారు.

జనం హరినామస్మరణ చేయటం కోసం నిత్యానందుడు ఏవేవో మార్గాలను చేపట్టేవాడు. భగవన్నామానికి ఎంతో మహత్వం ఉందని చైతన్యుడు అనేవాడు. అది తక్షణమే ఫలితాన్ని ఇవ్వకపోవచ్చును కాని ఏదో ఒకరోజు ఫలాన్ని తప్పక అందిస్తుంది. ఒక భవనపు గోడమీద వదలివేయబడిన విత్తనం వంటిది అది. చాలా రోజులు గడిచాక భవనం కూలిపోయి, విత్తనం నేలమీద రాలుతుంది. పిమ్మట అంకురించి, చివరికి ఫలవంత మవుతుంది.

సంసారులలో సత్త్వరజస్తమస్సు అనే గుణాలు ఉన్నట్లే భక్తి కూడా ఈ గుణాలచే చిత్రీకరించబడింది. సంసారులలో సత్త్వగుణంగల వ్యక్తి ఎలా ఉంటాడో తెలుసా ? బహుశ అతడి ఇల్లు కొంతమేర జీర్ణావస్థలో ఉంటుంది. దాని మరమ్మత్తు గురించి అతడు పట్టించుకోడు. దేవుడింటిలో పావురాళ్ల రెట్టలు, ముంగిట పాచిపట్టి ఉంటుంది. వీటి గురించి అతడికి ధ్యాసే ఉండదు. ఇంట్లోని కుర్చీలు వగైరాలు పాతవై ఉంటవి. వాటికి పాలిష్ చేసి శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచనే అతడికి రాదు. ధరించే ఉడుపుల గురించి అసలు పట్టించుకోడు. ఏదో ఒకటి ధరించి సరిపెట్టుకొంటాడు. కాని వ్యక్తి మాత్రం శాంత స్వభావి. నెమ్మదస్థుడు, దయాళువు, వినమ్రుడు, ఎవ్వరికీ హాని తలపెట్టడు.

మళ్లీ సంసారులలో రజోగుణ లక్షణాలుగల వ్యక్తులు కొందరు ఉంటారు. అలాటి వ్యక్తి గొలుసున్న చేతిగడియారం, వేళ్లకు రెండు మూడు ఉంగరాలు ధరిస్తాడు. ఇంట్లో సామాను అందంగా, పొందికగా అమర్చబడి ఉంటుంది. గోడలకు మహారాణి, రాకుమారుడు తదితర ప్రముఖుల తైలవర్ణ చిత్రాలు వ్రేలాడుతూ ఉంటవి. ఇల్లు చక్కగా సున్నం కొట్టబడి ఉంటుంది. నానారకాల దుస్తులు అతడికి ఉంటాయి. సేవకులకు కూడ తగినట్లు దుస్తులు అమరి ఉంటవి.

సంసారులలో తమోగుణ లక్షణాలు గల వ్యక్తిలో నిద్ర, కామం, క్రోధం, అహంకారం మొదలైనవి ఉంటాయి.

అదే రకంగా భక్తికి సత్వగుణం ఉంటుంది. సత్వగుణంగల భక్తుడు ఎంతో గోప్యంగా బహుశ తన దోమతెరలో భగవద్ధ్యానం చేస్తాడు. అతడు నిద్రిస్తున్నాడని ఇతరులు భావిస్తారు. ఉదయం అతడు కాస్త ఆలస్యంగా నిద్రలేవటం చేత, రాత్రి అతడు బాగా నిద్రపోయి ఉండడని అనుకొంటారు. ఆకలి తీర్చుకోవటం, అదీ ఏదో పచ్చడి మెతుకులతోనే అంత వరకే. అతడికి దేహంపట్ల ధ్యాస ఉంటుంది. అతడికి పంచభక్ష్యపరమాన్నాలు అక్కర్లేదు, ఆడంబరమైన దుస్తులతో పనిలేదు. ఇంట్లో సామాన్ల ప్రదర్శన ఉండదు. అంతేగాక ధనంకోసం ఎవ్వరినీ ముఖస్తుతి చేయడు.

భక్తులైనచో తనకు కనుపించునందతయు దైవమయము గాను, జ్ఞాని అయినచో తన ఆత్మకన్న వేఱు అణుమాత్రమైనను లేదనియు భావన చేయవలయును. అట్టి భావశుద్ధి గలవారు మాత్రమే జ్ఞానసిద్ధిని పొందగలరు. భావశుద్ధియే జ్ఞానసిద్ధి.

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు



సద్గురువు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

“ శిష్యులను సద్వస్తువగు ఆత్మ యొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందే కాక, అనుష్ఠానమునందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలు గలవారు సహజముగనే జనులలో చాల అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురుపీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు. అట్టివారిలో నొకరు శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు.

వారు జీవించిన డెబ్బది యెనిమిది వసంతములు వాస్తవముగ ప్రజలకు వసంత సదృశములుగనే యుండినవి. ఆధ్యాత్మిక విషయములందు పండిన యనుభవముగల మహనీయులగుటవలనను, పారమార్థిక సూత్రములన్నియు వారికి కాచివడబోసినవే అయియుండుట వలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వాగాహనము సులభతర మనిపించుచుండెడిది. బ్రహ్మజ్ఞానము పుస్తకమునుండి గ్రహింపదగిన విద్యకాదు. హృదయమునుండి హృదయమునకు ప్రవహించవలసిన అనుభవమది. బ్రహ్మానుభూతి నొంది సద్గురుని హృదయ క్షేత్రమునుండి పొంగి పారలి అధికారియగు సచ్ఛిష్యుని హృదయసీమయందు దొరలు నట్టిదియే బ్రహ్మజ్ఞానము. కావున నిర్మలచరిత్ర ద్వారా తమ తమ హృదయ స్థానములను పునీత మొనర్చుకొనిన భక్తకోటి యంతయు అట్టి మహాత్ములు

వర్షించు బ్రహ్మజ్ఞానామృతమును గ్రహించి, అనుష్ఠించి, అనుభూత మొనర్చుకొని, జన్మసార్థక మొనర్చుకొనిరి. ఒనర్చుకొనుచున్నారు కూడాను మహాత్ముల దివ్యావతరణముచే గలుగు పరమలాభమిదియే.

శ్రీవారు తమ జీవితకాలమంతను అనుష్ఠానమును గూర్చియే ఎక్కువగా నొక్కి చెప్పుచుండెడివారు. వారు స్వతః అట్లాచరించిరి. గనుకనే ఆయనుష్ఠానముపై వారికంత నమ్మకము ఏర్పడినది. (1). గురువు, (2). దైవము (3). అనుష్ఠానము అను మూడింటిని ఏ కాలమందును విస్మరించరాదనియు, అట్లు విస్మరించనందువలననే తనకెంతయో శాంతి జీవితమునందు లభించినదనియు వారపుడపుడు చెప్పుచుండెడివారు. కావున శ్రీవారి జీవితమునుండి మొట్టమొదట గ్రహింపదగిన మహాపాఠమిదియే ‘ అనుష్ఠానము నెన్నడును మఱువరాదు ’ ప్రతిదినమున్ను ప్రతివారును నియమ పూర్వకముగ భోజన మెట్లాచరించుచున్నారో, అట్లే దైవధ్యానమున్ను నియమ పూర్వకముగ చేయవలయుననుట వారి బోధలలో ప్రముఖమైనది. ఈ నియమము సక్రమముగ నాచరింపబడుచో అదియే సాధకుని మెల్ల మెల్లగ మహోన్నత ఆధ్యాత్మిక శిఖరములకు గొనిపోగలదని వారి విశ్వాసము.

ప్రతి ప్రాణియందును గొప్ప గొప్ప శక్తులు విరాజిల్లుచున్నవి. అయ్యవి నిగూఢములుగ నుండుటవలన ఎవరికి వానియొక్క పరిచయము కలుగుటలేదు. నిదురించుచున్న కుండలినీ శక్తి యోగాభ్యాసముచే ఏ ప్రకారము పైకి లేచునో, ఆ ప్రకారమే మానవుని యందంతర్లీన ములైయున్న దివ్య పారమార్థిక శక్తులు అతని సత్ప్రయత్నముచే లెస్సగ ప్రస్ఫుటములు కాగలవు. బంగారము ఇతర లోహముతో గూడియుండినపుడు దానికేమంత విలువయుండదు. కాని, బాగుగపుటము గావింపబడి వేలిమిగా మారునపుడు దానికి గొప్ప విలువ యేర్పడుచుండును. అట్లే అజ్ఞాన పరివేష్టితుడై, అసురగుణాభిభూతుడై,

మురళీధర కృష్ణుడు

అపవిత్ర హృదయుడై యుండునపుడు జీవునకు విలువయుండదు. అతని నెవరును లెక్క చేయరు. అయినను అంతమాత్రముచేత నతడు నిర్లక్ష్యము చేయదగినవాడు కాడు. ఏలయనిన, అతనియందు పవిత్రాత్మయుండియే యున్నది. దానిని వ్యక్తమొనర్పవలెను. సత్సాంగత్యముచేతను, మహనీయుల సద్బోధల చేతను అట్టి ఆత్మస్థితి తప్పక చేకూరగలదు. అత్తఱి యింతదనుక ఎంతయో నీచుడుగ పరిగణింపబడువాడు సంఘమున సర్వోత్తముడుగ గణుతి కెక్కును. కావున **<u>పాపము చెడ్డది, కాని పాపి చెడ్డవాడు కాడు. పాపి యేనాటికైనను పుణ్యాత్ముడు కాగలడు.</u>** ప్రయత్నాతిశయముచే మానవుడు మాధవుడు కాగలడు. పశువు పశుపతి కాగలదు. ఈ సత్యమునే శ్రీ గురుదేవులు తమ జీవితమందు పదే పదే యుద్ఘాటించుచుండువారు. కాబట్టి ప్రతి జీవియు తన నికృష్ట స్థితిని జూచి నిరుత్సాహము జెందక, హృదయమును చక్కగ పరిశోధించుకొని, అసుర గుణములు, దుస్సంకల్పములు, దుర్వాసనలు తమయందేవైన యుండిన వానిని సమూలముగ తొలగించివేసి, దైవమే అయి శోభిల్లవలెను. ఈ ప్రకారముగ అల్పుడు మహాత్ముడు కాగల్గు సదవకాశమును శాస్త్రములు జనులకొసంగి యున్నవి. కావున ప్రతిజీవియు తన హృదయమును చక్కగ వికసింపజేసికొని జీవిత పరమావధియగు స్వస్వరూప (ఆత్మ) సాక్షాత్కారమును బడసి ధన్యుడు కావలయును.

ఈ ప్రకారములైన సర్వజీవ సంతారణరూపములగు మహత్తర సద్బోధలను శ్రీవారు గావించుచు జనుల కుత్తేజమును గలిగించు చుండెడివారు. ఆధ్యాత్మక్షేత్రమున ఆంధ్ర భూమియందు గొప్ప క్రాంతిని, సంచలనమును శ్రీవారు తీసికొనివచ్చిరి. వారు వచ్చిన వెనుక ఆంధ్రభూమిలో ఎన్నియో ఆశ్రమములు ఉద్భవించినవి, ఎన్నియో పీఠములు ఆవిర్భవించినవి. ఎందఱో సామాన్యజనులు ముముక్షువులైరి. ఎందఱో ముముక్షువులు ముక్తులైరి. శుష్క వేదాంత తమోజాలమును ప్రజల హృదయ వీధులనుండి

దూరీకరించుటకు వారెట్లు కంకణము కట్టుకొనిరో, అట్లే వేదాంతభేరిని దశదిశల మారు మ్రోగించుటకును వారు కటిబద్ధులైరి. వేదాంత పితామహులగు అట్టి మహనీయులైన సద్గురువుల బోధలు జనులకు ఎంతయో అవసరములై యున్నవి.

పర్వతమును బోలిన స్థైర్యము, సముద్రమును బోలిన గాంభీర్యము, ఆకాశమును బోలిన విశాలహృదయము గల్గి తమ యపార తపశ్శక్తిచే ఆంధ్రలోకమున గొప్ప ఆధ్యాత్మిక సంచలనమును గావించి నైతికముగ అఖండ ఉత్తేజమును జనులలో రేకెత్తించిన యతి పుంగవులు బ్రహ్మర్షి శ్రీ మలయాళస్వాములవారు. వారు లోకమునకు ప్రసాదించిన జ్ఞానసంపద అక్షయమై, అవ్యయమై, నిత్యనూతనమై యలరారుచున్నది. వారి దివ్యప్రవచనములు, అమృతహితోక్తులు, ఒక దేశమునకు గాని, ఒక కాలమునకు గాని సంబంధించినవి కావు. ఒక జాతికిగాని, ఒక వర్ణమునకుగాని చెందినవికావు. అవి సార్వకాలీన, సార్వజనీన, సర్వమత సంసేవ్యములైన ఆధ్యాత్మిక దివ్యరహస్యములు.

లోకములో సామాన్యుడు తన ప్రయత్నాతిశయముచే మాన్యుడు కాగలడు. అరిసదృశుడు తన పూనికచే హరి సదృశుడు కాగలడు. ప్రయత్నముచే మానవుడు సాధింపరానిదీ ప్రపంచమున ఏదియును లేదు. భౌతిక క్షేత్రమందు గాని, ఆధ్యాత్మిక క్షేత్రమందుగాని వ్యక్తి తన అధ్యవసాయముచే మహోన్నత శిఖరముల నధిష్ఠింపగల్గుచున్నాడు. చిన్న రాజ్యమునకు అధినేతయైన సిద్ధార్థుడు తన వివేక వైరాగ్యములచేతను, గొప్ప పట్టుదలచేతను, ఇంద్రియ నిగ్రహ మనోనిగ్రహములను సాధించివైచి అచిర కాలములో ఆత్మసామ్రాజ్యమునకు అధినేతయై బుద్ధదేవుడుగ విఖ్యాతినొందెను గదా ! అట్లే శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, గాంధీజీ మొదలైన ఆధునిక వ్యక్తులు తమ యకుంఠిత దీక్ష చేతను, భగవద్భక్తి

చేతను, సాధనాతిశయము చేతను విశ్వవంద్యులై, లోకోత్తర పురుషులై, బ్రహ్మర్షులై విలసిల్లిరి.

మహర్షిత్వముగాని, బ్రహ్మర్షిత్వముగాని ఒకరిసొత్తు గాదు. అది ఒకానొక జాతిచేగాని, వ్యక్తిచేగాని, వర్ణముచే గాని గుత్తకు తీసికొనబడు పదార్థము కాదు. యోగ్యతగల వారందరున్ను బ్రహ్మర్షిత్వమునకు అర్హులే. పవిత్రత, సమనము, పట్టుదల గలవారు ఏనాటికైనను బ్రహర్షిత్వమును సాధించియే తీరుదురు. వ్యక్తియందు దుర్వ ృత్తులు, దుర్గుణములు, దుస్సంకల్పములు ఉండునపుడు, భగవంతుని దృష్టి యందుగాని, లోకులయొక్క దృష్టియందుగాని యతడు చాల అల్పుడుగనే యుండును. బంగారము ఇతర లోహములతో గూడియున్నపుడు దానికి విలువ చాల తక్కువగనే యుండును గదా ! ఆ బంగారమే అగ్నిహోత్రముపై బాగుగ పుటము పెట్టబడినపుడు దాని యందలి యితర లోహములన్నియు ఆవిరియైపోగా, స్వచ్ఛమగు మేలిమి బంగారుగ మాత్రమే శేషించును. అపుడు దాని విలువయు చాల పెరుగును. అట్లే తపస్సు ఇంద్రియనిగ్రహము, భగవద్భక్తి మున్నగువానిచే మనస్సునందలి దోషములన్నియు పరిహరింపబడినపుడు, పాపాత్ముడున్ను పుణ్యాత్ముడై పఱగును. అల్పుడు లోకోత్తరుడుగ చెన్నొందును. సామాన్యుడు విశ్వవంద్యుడై యలరారును. మహాత్ములు తమ జీవితముల నీ ప్రకారమే ప్రయత్నపూర్వకముగ సంస్కరించుకొని లోకములో గణనీయ స్థానము నలంకరించిరి.

ఆధ్యాత్మిక చరిత్రయందౌన్నత్యము పొందిన మహనీయుల జీవిత చరిత్రములన్నిటిని పరికించినచో ఏదియో యొక అద్భుతసంఘటన వలన ఒక్క పర్యాయము ఆకస్మికముగ వారు పైకివచ్చినట్లు కానంబడుటలేదు. ఒక క్రమపద్ధతియందు నెమ్మది నెమ్మదిగా వారు చేసిన సాధనల ననుసరించి ఉన్నతస్థానమున కెగబ్రాకినట్లే కనుపించుచున్నది.

గురుదేవులగు శ్రీ మలయాళస్వాములవారున్ను బాల్యకాలమునుండియు తీవ్రతర ముముక్షుత్వము గలవారై భగవద్భక్తి సంయుతులై, పరమార్థ సాధనలను లెస్సగ గావించుచు క్రమక్రమముగ ఊర్ధ్వస్థితినిబడసి బ్రహ్మర్షియై విలసిల్లిరి. అనుష్ఠానమందు వారికిగల ప్రీతి, నియమబద్ధమగు జీవితమును గడపుటయందు వారి పట్టుదల, దైనందిన వ్యవహారము లందును చక్కని క్రమశిక్షణ గల్గియుండవలెనని వారు కావించుబోధ జనులలో వారియెడల భక్తి శ్రద్ధలను ఇనుమడింపజేసినవి. తత్ఫలితముగ ఆంధ్రదేశముననే గాక, తదితర ప్రాంతములందును వారు ఆరాధ్యులై పరగుచు, జనుల జీవితనౌకలకు ధ్రువతారయై యొప్పుచుండిరి.

“ సర్వజీవరాసుల యెడల ప్రేమ, దయ, కరుణగలిగి యుండుడు! భక్తి, జ్ఞాన, వైరాగ్యములను మందుతోబాటు సర్వభూతదయ యను పథ్యమును గూడ ఆవలంబింపుడు ” అనునది వారి బోధలలో ప్రధానమైనది. ఇట్టి విశాల హృదయము, విశ్వప్రేమ ముముక్షువుల కత్యావశ్యకమై యున్నవి. బ్రహ్మర్షిత్వమున కర్హతయు నిదియే. సంకుచిత హృదయులు, దయాదాక్షిణ్య వర్జితులు భగవంతునెన్నటికిని బొందజాలరు. కావున, ముముక్షువులెల్లరు తమ భక్తి, జ్ఞానాద్యుపకరణములతో బాటు ప్రాణికోట్ల యెడల దయను గూడ అభ్యసించవలయును. ఇట్టి అపారకరుణ, విశాల హృదయము గలిగిఉండుటవలననే శ్రీ మలయాళస్వాములవారు ఉన్నతపథము నధిరోహింపగల్గి బ్రహ్మర్షులై విఖ్యాతి నొందిరి. కావున ముముక్షువులెల్లరును వారి యాదర్శమును గ్రహించి, అనన్యభక్తి, నిరంతర తత్త్వచింతన, ఆధ్యాత్మిక క్రమశిక్షణ, నియమపాలన, సర్వభూతదయ మొదలగు ఉదాత్తగుణముల నవలంబించి బ్రహ్మర్షిత్వమును కైవశ మొనర్చుకొని పరమానందమయులై జీవితమును ధన్య మొనర్చుకొందురు గాక !

స్త్రీ జనోద్ధరణకై శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి కృషి

– శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

పూర్వకాలంలోని గార్గి, చూడాల, మదాలస వంటి వారివలె నేడున్ను మహిళామణులు విద్యావంతులుగా తయారుకావాలని స్త్రీలలో అట్టివారు వచ్చినపుడే సమాజం బాగుపడుతుందని శ్రీ సద్గురు స్వాములవారి అభిప్రాయం. అందుకు శ్రీవారు తీవ్రంగా కృషి చేశారు. స్త్రీల సంస్కృతాభ్యాసంకోసరమే శ్రీ వ్యాసాశ్రమంలో కన్యాగురుకులం స్థాపించారు. ఆంధ్రదేశంలో వేలకువేలు మాతాజీలను నిర్దుష్టంగా భగవద్గీత పారాయణ చేసేట్లు తయారు చేశారు.

శ్రీ వ్యాసాశ్రమంలో కన్యాగురుకులం పెట్టకముందుగూడ అచట స్త్రీలను సంస్కృతం చదివించారు. పండితులను చేశారు. ఆ సందర్భంలో నెల్లూరు సమీపం కనుపర్తిపాడులో శ్రీ సద్గురు స్వాములవారు సభలు జరుపగా వారి ఉపన్యాస ప్రభావంచే ఆ గ్రామం నుండి గౌరవప్రద కుటుంబంనుండి చెంచుసుబ్బమ్మ గారు ఆశ్రమ పాఠశాలలో చేరి సంస్కృత ఎంట్రన్సు చదివి అందుత్తీర్ణురాలయినారు. ఆపైన శ్రీ సద్గురు స్వాములవారు చెంచు సుబ్బమ్మగారిని వ్యాకరణ శిరోమణి చదువుడని తిరుపతి దేవస్థాన ఓరియంటల్ కళాశాలకు పంపినారు. కాని నాటి కళాశాలలోని ఛాందసులు స్త్రీకి తత్రాపి శూద్రస్త్రీకి **వ్యాకరణం చెప్పము**. సాహిత్యశిరోమణిలో చేరుడని చెప్పారు. అప్పుడు శ్రీ సద్గురు స్వాములవారు ప్రభుత్వం వారికి ఫిర్యాదు చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తేగా ప్రభుత్వ ఆఫీసరు నేరులో వచ్చి విషయం తెలుసుకొని **వ్యాకరణంలో** ఆమెను చేర్చుకోకపోతే కళాశాలకు ప్రభుత్వ గుర్తింపును రద్దు చేస్తామని వ్రాతమూలకంగా తెలిపారు.

కళాశాలకు ప్రభుత్వ గుర్తింపుపోతే అచట చదివే వారికి ఉద్యోగాలు రావు. అచట చదివేవారు 90 శాతం బ్రాహ్మణులే. వారికి ఉద్యోగాలు రావని రూఢికాగా అపుడు దిగివచ్చి చెంచుసుబ్బమ్మ గారికి **వ్యాకరణ శిరోమణి** లో సీటిచ్చినారు. మాతాజీగారు **వ్యాకరణ శిరోమణి**లో మంచి మార్కులలో ఉత్తీర్ణులైనారు. అది చూచి శ్రీ స్వాములవారు ఆనంద బాష్పాలు రాలుస్తూ ఆమెను ఆశ్రమ ప్రోత్సాహంతో మద్రాసు విశ్వవిద్యాలయంలో డాక్టర్ టి.ఎం.పి. మహదేవన్ గారి వద్ద వేదాంతంలో ఎం.ఎ., పి.హెచ్.డి. చదివించారు.

శ్రీ సద్గురు స్వాములవారి పట్టుదలను తెలుసుకొన్న పుట్టపర్తి సాయిబాబా గారు చెంచుసుబ్బమ్మ గారికి అనంతపురంలోని తమ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గాను, హాస్టల్ వార్డెన్ గాను నియమించారు. చెంచుసుబ్బమ్మ గారు ఆజీవితం సాయిబాబా గారి సేవలోనే వుండినారు.

అటు తరువాత శ్రీ వారు కన్యాగురుకులం స్థాపించి అందు అనేకమంది బాలికలను సంస్కృతంలో పండితులను చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక జిల్లాల లోని ప్రభుత్వ పాఠశాలలో నాడు, నేడున్ను మహిళలు సంస్కృత పండితులుగా వున్నారు. అట్లే అనేక ప్రాంతాలలో ఆశ్రమాలను ఏర్పఱచి తద్వారా ఆయా ప్రాంతాలలో గ్రామాలలోని స్త్రీలకు భగవద్గీతను నేర్పి నేడున్ను నిత్య గీతపారాయణ చేయనిదే భోజనం చేయని నియమ నిష్ఠలు గల తల్లులను తయారు చేశారు.

ఎచట స్త్రీలు విద్యావంతులుగా ఆదర్శ తల్లులుగా తయారయి సమాజంలో గౌరవింప బడుతారో ఆ సమాజం, ఆ దేశం శాన్తి సౌభాగ్యాలతో విరాజిల్లుతుందని శ్రీ సద్గురు స్వాములవారి ఆశయము. ఈ ఆశయ సిద్ధిని తమ జీవితంలోనే చూచిన పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీ సద్గురు మలయాళస్వామి గురుదేవులకు శతాభివందనములు.

ఆధ్యాత్మికాకాశంలో శ్రీ మలయాళస్వాముల వారొక ధృవతార

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య

తిరుమల గోగర్భగుహలో తపస్సు చేస్తూ

అతీత వైరాగ్య మఖండబోధః
కదా ను మే సిద్ధ్యతు హే దయాళో
సమాధియోగస్య పరస్య నిష్ఠా
సర్వేషు భూతేషు సమత్వబుద్ధిః ॥

ఓ దయానిధివగు పరమేశ్వరా ! అతీతమైన వైరాగ్యమూ, అఖండమైన బోధయూ, నిర్వికల్ప సమాధినిష్ఠా, సర్వభూత సమభావమూ - నాకెప్పుడు సిద్ధించునో ? అని ఆర్తితో పరమాత్ముని వేడుకొని ద్వాదశ వర్ష తీవ్రతపోనిష్ఠతో ఆ మహోన్నత లక్ష్యాలను సాధించిన మహామహులు శ్రీ మలయాళ సద్గురు దేవులు. తరువాతి కాలంలో శ్రీ విద్యాప్రకాశానంద స్వామిగా లోకప్రసిద్ధి పొంది తమ గురుదేవుల ఔన్నత్యాన్నీ, మహనీయతనూ వివరిస్తూ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వ్రాసిన ఈ క్రింది పంక్తులు ఈసందర్భంలో మననం చేసుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

" శిష్యులను సద్వస్తువగు ఆత్మ యొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందే కాక, అనుష్ఠానమునందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలు గలవారు సహజముగనే జనులలో చాల అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురుపీఠ మలంకరించి

లోకములో విరాజిల్లుచుందురు. అట్టివారిలో నొకరు శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు ".

" ఆధ్యాత్మిక విషయములయందు పండిన యనుభవము గల మహనీయులగుటవలనను, పారమార్థిక సూత్రము లన్నియు వారికి కాచి వడబోసినవే అయియుండుట వలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించుచుండెడిది ".

సాంఘిక - ఆధ్యాత్మిక రంగములందు శ్రీవారి ప్రబోధ ప్రచారములచే ఎన్నియో విప్లవాత్మకములైన పరిణామములు సంభవించినవి. జనులలో సంకుచితములైన భావములు తొలగి విశాలభావములు ఏర్పడినవి. సాంఘికాధ్యాత్మిక రంగములందు వెనుకబడియున్న స్త్రీలు, ద్విజేతరులు ఆయారంగములలో లెస్సగ పురోగమించిరి. శ్రీవారి ప్రబోధములచే జనులలో ప్రగతిశీలమైన దృక్పథము ఏర్పడినది. భౌతికాభివృద్ధితో తృప్తిపడక ఆత్మోన్నతికిగూడా కృషి సలుపవలెననియు, విశ్వశ్రేయస్సునకై శక్తికొలది పాటుపడవలె ననియు శ్రీవారి ప్రబోధములచే జనులు తెలిసికొనదొడగిరి.

శ్రీ వ్యాసాశ్రమస్థాపకులగు శ్రీ మలయాళస్వాములవారు దైవాంశసంభూతులు. ప్రజల అజ్ఞాన మేఘములను విచ్ఛిన్న మొనర్చి జ్ఞానాలోకమును కలుగజేయుటకై అవతరించిన మహనీయులు. చెప్పినది చేయుట, చేసినది చెప్పుట వారియందలి ఒక గొప్పవిశేషము. శ్రీవారి జీవితము ఒక విస్తృత ఆధ్యాత్మిక ప్రయోగశాల అని చెప్పవచ్చును.

నియమనిష్ఠలను పాలించుటలోను, ఇతరులచే పాలింప జేయుటలోను శ్రీ స్వాములవారు అందెవేసిన చేయి. జీవిత మంతయు నియమబద్ధముగా గడపవలె నను దృఢసంకల్పము కలుగు దశ నుండియే మానవత్వము ప్రారంభించునని శ్రీవారు తఱచు సెలవిచ్చుచుందురు.

ఆధ్యాత్మిక నియమ నిబంధనలకు, క్రమశిక్షణకు శ్రీ వా రెంతయో ప్రాధాన్యము నొసంగుచుందురు. శ్రీవారి క్రమశిక్షణా విధానము వజ్రతుల్యముగ నున్నను, దానివెనుక నవనీత హృదయము దాగియుండును. శ్రీవారిలోని గొప్ప విశేషములలో ఇది యొకటి. బ్రహ్మవిద్యాపారంగతులు, అపరశంకరులు, ఆధునిక వ్యాసులు, అవిద్యాతమోభాస్కరులు అగు శ్రీ స్వాములవారు తాము తరించి ఇతరులను తరింపజేయుటలో అవిరామముగ కృషి చేసిరి.

కార్యదక్షత, బ్రహ్మర్షిత్వము, కోమల హృదయము, తపోమహిమ, నిర్వికల్ప ధ్యానము, విద్యావైదుష్యము, భక్తి జ్ఞాన వైరాగ్యములు శ్రీ స్వాములవారి యందు నెలవు చేసికొనినవి.

శ్రీ స్వాములవారి జీవితము భగవద్గీతకు భాష్యమని చెప్పవచ్చును. వారి తపోనిష్ఠ, తీవ్రవైరాగ్యము, విజ్ఞానము, దూరదర్శిత్వము, అసంగత్వము, నిర్వికారత్వము, విశాలహృదయము, పరోపకారకాంక్ష జనులకు మార్గదర్శకములై యున్నవి. వెయ్యేల ? ఆధ్యాత్మికాకాశమున శ్రీ స్వాములవారు ధ్రువతారయై విలసిల్లుచున్నారు.

శ్రీ రామకృష్ణానందగిరి స్వామివారి శతజయంతి ఉత్సవములు

13-07-2015 నుండి 17-07-2015 వరకు

కడపజిల్లా వేంపల్లె మండలము గండిక్షేత్రములో వెలసియున్న శ్రీ భూమానందాశ్రమములో మాతా ప్రతిభానందగిరి వారి ఆధ్వర్యములో 13-7-2015 నుండి 17-7-2015 వరకు శ్రీరామకృష్ణానందగిరి స్వాములవారి శతజయంతి ఉత్సవములు ఘనముగా నిర్వహించబడును. ఈ కార్యక్రమానికి అనేకమంది పీఠాధిపతులు ఆంధ్ర, కర్ణాటక మహాత్ములు వచ్చి తమ దివ్య సందేశములను అనుగ్రహింతురు.

మంగళమో కీర్తి సాంద్ర !
మలయాళ మౌని చంద్ర !

- ఆచార్య జక్కంపూడి మునిరత్నం

1. ఎంత విద్యావంతులైన ఎట్టివయోవృద్ధులైన
ఎంతటి సంపన్నులైన ఎటువంటి అధికారులైన
చెంత జేరుచు దాసునట్లు సేవించవలె దేశికునని
మంతవ్యముగ దెల్పినావు మలయాళమౌనీంద్ర చంద్ర !

2. మానవాళికి సేవజేసి మన్నన కెక్కుట పాడి
మానసంబున నిండియున్న మాలిన్యమును రూపుమాపి
మానవసేవ గావించి మహితాత్ములగుడని తెలిపి
మాననీయుడవైతివీవు మలయాళమౌనీంద్ర చంద్ర !

3. వెలుపలా లోపలా వెలుగుచూడదలచునెడల
తలపునూ మాటయూ పనియుతప్పక ఒకటి కావలయు
పలుతెరంగుల నవియున్న బ్రహ్మంబు గోచరింపదని
మలినంబుమాప చెప్పితివి మలయాళమౌనీంద్ర చంద్ర !

4. మునులకూ యోగులకైన పూర్ణజ్ఞానులకైనగాని
కనకకాంతల గెల్వకున్న కలుగదేనాటికీ సిద్ధి
వినుత మార్గమునందు నడచి విజయంబుగైకొనుడనుచు
మనసుకెక్కగ తెల్పినావు మలయాళమౌనీంద్ర చంద్ర !

5. అడవి ఏనుగును బంధించ అవసరమగునొక గొలుసు
వడిగా చలించెడు మదిని పట్టుకొనగ జపమాల
పుడమిని కావలెననుచు బోధించితివి పుణ్యచరిత
మడికాసువలె నీదు మనసు మలయాళమౌనీంద్ర చంద్ర !

6. మంగళమోయతివర్య ! మంగళమోహిత కార్య !
మంగళ వ్యాసాశ్రమపతి ! మంగళములకు నీవెగతి !
మంగళం సద్గురుదేవ ! మంగళము మహానుభావ !
మంగళమోకీర్తిసాంద్ర ! మలయాళ మౌనీంద్ర చంద్ర !



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి

56. శ్రీ గురువు శివదీక్షనిచ్చి మరణాధీనమైన నరజన్మాన్ని అతిక్రమించి శివునిలో ఐక్యమయ్యే శివజ్ఞానాన్ని ప్రసాదించినాడు. మాంసమయమైన శరీరానికి మంత్రోపదేశము చేసి మంత్రమయ శరీరంగా మార్చినాడు. పుట్టు చావులు అనే సంసార బంధనము నుంచి తప్పించి, శివజీవైక్యమైన పరమ సుఖాన్ని శ్రీ గురువు అనుగ్రహించాడు. సుఖం దుఃఖం మొదలైన ఈ సంసార స్వరూపాన్ని తొలగించి ముక్తుడయ్యే భక్తి మార్గాన్ని తెలిపినాడు. పుట్టని, చావని, చెన్నమల్లికార్జునుడనే ఇష్టలింగాన్ని నా చేతికిచ్చిన గురువుకు శరణు శరణార్థి.

58. లింగపూజ అనేది ఆత్మ నిరీక్ష సాధనము. మరుపు అనేది అజ్ఞానము. అజ్ఞానమే మాయ. ఇటవంటి అజ్ఞానాన్ని తొలగించాలని గురునాథుడు ఇష్టలింగాన్ని ఇచ్చినాడు. అజ్ఞానాన్ని నివారించడానికి ఇష్టలింగము సాధనమైతే తన స్వరూపాన్ని తెలుసుకోవడానికి ప్రాణలింగమే సాధనము. దానికోసం కేవల ఇష్టలింగమును పూజించిన చాలదు. దానితోపాటు ప్రాణలింగ అనుసంధానము కూడా చేయాలి. భగవత్ భక్తిలో అంధశ్రద్ధ, మూఢ నమ్మకము చోటు చేసుకోకూడదు. నిజమైన పర శివ స్వరూపాన్ని తెలిసి పూజించి ధ్యానంచేస్తే పుట్టుక, చావు, భయము వుండవు.

59. ఇష్ట లింగ పూజ చేసే వారి దగ్గర మంచితనము, శాంతత, సమరతి, సదాభగవత్ స్మరణ, ఈ నాలుగు గుణములు అవస్యంగా వుండాలి. ఇష్ట లింగ దేవునికి అభిషేకము చేసే వ్యక్తి సజ్జనుడు సద్భావియై వుండాలి. కోపతాపములను నివారించినపుడే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. సమాధానముతో లింగాన్ని పూజిస్తేనే దానియొక్క పూజాఫలము లభ్యమౌతుంది. శివ భావమును పొంది శివలింగమును స్తుతించి శివునిలో ఐక్యత పొందాలి. అప్పుడు చెన్న మల్లికార్జునునిలో అన్యోన్యత లభిస్తుంది. శివునితో ఇటువంటి అన్యోన్యత కోసమే పెద్దలు ఈ ఇష్టలింగ పూజను పెట్టినారు.

60. ఇష్ట లింగమును అష్టవిధానార్చనతో పూజించి చేతిలో వున్నటువంటి ఇష్టలింగమునకు మంగళహారతి చేసినపుడు ఆ లింగములో జ్యోతి వెలుగును. ఆ జ్యోతిని చూచి, చూచి, కంటిలో ఆ జ్యోతి నిండిపోవాలి. ఆవుదూడ తన తల్లిని ఎల్లప్పుడు అనన్య భావముతో చూస్తుందో ఆ విధముగా శివలింగమును అనన్య శ్రద్ధతో నిరీక్షించాలి. ప్రీతి వుంటేనే పూజ బాగా వుండును. స్నేహముంటేనే అన్యోన్య సంభాషణ వుండును. ఇది నిరంతరం జరగాలి. అది చెన్న మల్లికార్జున స్వామితో సన్నిహితమైన సదాపూజ అగును. ఇది నాకు సాధ్యమైందని అక్కమహాదేవి తెలియపరిచింది.

62. వీరశైవ సిద్ధాంతములో జ్ఞానానికి, ఆచారానికి దగ్గర సంబంధమున్నది. ఈ సంబంధాన్ని అక్కమహాదేవి ఒక్క ఉదాహరణతో నిరూపిస్తున్నది. వడ్లు నుంచి బియ్యమును వేరు పరచిన త్రౌడుకు నీరు పోసితే మొలకెత్తదు. ఆ విధంగా జ్ఞానము లేనివాడు కేవలం ఆచారముతో ఫలాన్ని పొందలేడు. అంటే జ్ఞానము లేని ఆచారానికి అర్థము లేదు. అర్థము లేని ఆచారము ధృఢ విశ్వాసాన్ని కలిగించదు. శివ భక్తులకు శివజ్ఞాన మెంత ముఖ్యమో సదాచారము కూడా అంతే ముఖ్యము. జ్ఞానము, ఆచారముల యొక్క సంగమమే శివశరణుల మార్గము.

64. శివతేజస్సును కలిగించేది శ్రీ విభూతి. విభూతి ధారణం గురించి వేద పురాణఆగమములలో వివరించబడినది. భక్తులైన వారు ప్రప్రథముగా రుద్రాక్ష భస్మములను ధరించి శివమంత్రమును పఠించడం ప్రాథమిక దశ. భస్మధారణం సర్వపాపహరణమని, శివునికి ప్రియమైనదని, మరణభయాన్ని తొలగిస్తుందని, అగస్త్య,కశ్యప, జమదగ్ని, మొదలైన ఋషులు విభూతిధారణము చేసి పునీతులైనారని ఆగమములలో వివరించబడినది. ఓం నమశ్శివాయ అనే మంత్రాన్ని నాలుకపైన, శ్రీ విభూతి త్రిపుండ్రధారణ నొసటిపైన ధరించితే, మెడలో రుద్రాక్షలు ధరించితే, సప్త జన్మలలో చేసిన పాపము ఆ క్షణములోనే నాశనమౌతుంది.

వరుణ దేవుని కరుణ

– బి.రాజయ్య (శ్రీ రాజశేఖరేంద్రగిరి స్వామి)

మహాత్ముల మహిమలు అనంతములు గదా ! మనవంటి యల్పజ్ఞులకవి గ్రహింప నశక్యములు. ఎన్ని విన్నను తనివి తీరదు.

శ్రీ మలయాళస్వాములవారు దత్తాత్రేయాశ్రమ శంకుస్థాపన జేయు సందర్భమున జరిగిన యుదంతము మరియొకటి వినుము. మనసు మోదమందును.

నిర్ణీత కార్యక్రమమును కార్యకర్తలు కోలాహలముగ జరుపుచున్నారు. ఎవరి యేర్పాట్లు వారు పూర్తికావించిరి. కనుపర్తిపాడు ప్రజలు భక్త్యుత్సాహముతో గుమిగూడిరి. కలకలారవముల మధ్య భజనలు, పాటలు, పారాయణలు వినపడుచున్నవి. విన సొంపుగ, కనువిందుగ నుండి అపుడందరికి ఉల్లాసము పెల్లుబకుచున్నది. ఆశ్రమశంకుస్థాపన లగ్నము సమీపించు చుండుటచే ఆతురత జెందుచు యావన్మంది శ్రీవారిరాక కెదురుచూచుచున్నారు. ఆశ్రమమునకు అనతిదూరములో నున్న మా ఇంటి దగ్గరనుండి బయలుదేరి శ్రీస్వాములవారు రావలయును. దారితీయుటకు మేళతాళములతో భజంత్రీలు తయారుగనున్నారు. అంతలో అనుకోకుండ పర్జన్యుడు ఆకాశమును ఆక్రమించెను. అతని అనుయాయులును ఆగంతుకులయిరి. వర్షము తుంపరులుగ ప్రారంభమై క్రమేపి పెద్దగ అవజొచ్చినది. మిన్నువలె భక్తుల మనస్సులును మసకచీకట్లలో మునిగిపోయినవి. వానలో శంకుస్థాపన కూడదన్నారు కార్యవాదులు. శ్రీవారు ప్రాంగణమునకు వచ్చిరి. గొడుగుముడిచి నిబ్బరముగ నభము (ఆకాశం) వైపు చూస్తూ " వర్షము వచ్చుచున్నదా " యని యలాగే కొంతతడవు ఏకాగ్రతతో కండ్లు మూసికొని నుండిరి. మరి వారేమి సంకల్పించి, విశ్వసించిరో గాని వర్షమంతటితో మటుమాయ మయిపోయినది. అందరు ఆశ్చర్యచకితులయిరి. సూర్యకిరణములవే కనవచ్చినవి. కనువారి కనులలో కాంతులు క్రమ్ముకొన్నవి. ముకుళిత మనఃకమలములు మనోహరముగ వికసించినవి. శ్రీవారిచే శంకుస్థాపన సానందముగ, సక్రమముగ యథా సమయమున సంపూర్ణమైనది.

ఇది శ్రీవారి తపః ప్రభావమున కుదాహరణయనియు సిద్ధసంకల్పమునకు తార్కాణమనియు, సంభ్రమాశ్చర్య జనకముగ జనులెల్లరు చెప్పుకొనసాగిరి.

భారత పురాణాదులలో పంచభూతములు భక్తులకు సహకరించుటే గాక స్వాధీనములగుననియు వినియున్నాము. అంతెందుకు, అనసూయాది సాధ్వీమతల్లులకు త్రిమూర్తులు సహితము పారాడెడి పసిబిడ్డలయిరి. తపస్సంపన్నులకు శాపము వలెనే యాశీర్వాదము కూడ సిద్ధించుచుండెడిది ! త్రికరణముల సమైక్యత కశక్యమైనది యుండదని యందురు.

తరచు శ్రీవారు సభలలో బోధించుచుండెడివారు : పరమేశ్వరునకు ప్రియతమమైన భక్తులైదుగురు. వారు పంచభూతములు. ఆకాశము, అనలము, అనిలము, అంబువు, అవని. వీరు దేవుని దూతలుగ పని చేయుదురు. అందుచే ఏలినవాని ఎఱుక లేక ఎవరును ఎచ్చటను, ఏమియు చేయజాలరు. పూర్వులు ప్రతిజ్ఞ జేయునపుడు పంచభూతముల సాక్షిగ జేసెడివారు. తీర్పు దినమున నియ్యైదుగురు ప్రత్యక్ష సాక్ష్యమివ్వగలరు. సత్యము, ప్రేమ, కరుణ, పరోపకారము, తమ గుణములు ప్రముఖముగ గలిగిన పంచవిధ భక్తులు విశేష భగవద్విశ్వాసముగల వినయశీలురు. విమలగుణులగు శ్రీవారి లాంటి వారికి సహకరించిరనుటలో నాశ్చర్యమేమున్నది.

తే ॥ పంచభూతాత్మకంబగు ప్రకృతిలోన
నెందుఁ జూచిన నీశుండు నందె గలఁడు
పరమ సత్యంబు నిది గన్న పండితుండు
డెందమందున బొందకు సందియంబు

వివిధ మన్వంతరాల్లో - వివిధ సప్తర్షి గణాలు

(గత సంచిక తరువాయి) - **లగడపాటి భాస్కర్, ఎం.ఎ.**

ఒక్కొక్క మనువు కాలాన్ని ' మన్వంతరం ' అంటారు. ' బ్రహ్మకు' ఒక్క దినంలో (ఒక కల్పకాలంలో) పద్నాలుగు ' మను కాలాలు ' వస్తాయి. ఈ పద్నాలుగురు మనువులూ, వారి కుమారులు, ఒక్కొక్కరూ, భూమండలానికంతా ప్రభువులై, ధర్మపరిపాలన సాగిస్తారు. పదునాల్గు మన్వంతరాలకూ, ఆయా మన్వంతరంలో పాలించే ప్రభువు పేరు పెట్టబడుతుంది. ఇందులో మొదటి మనువు పేరు, ' స్వాయంభువ మనువు'

శ్రీ మహావిష్ణువుయొక్క నాభికమలంనుండి చతుర్ముఖబ్రహ్మ ఉద్భవించాడు. ఆయన మానస సృష్టికాకుండ, మొట్టమొదట సృష్టిలో వైవిధ్యం కోసం ' మైథునక్రియ' మూలంగా ప్రాణోత్పత్తి జరిపించటానికి, తన శరీరంనుంచే ' స్వాయంభువ మనువునూ, ' శతరూప' అనే స్త్రీ మూర్తినీ ఉద్భవింప జేశాడు. ఆ మొదటి మనువు పేరనే ఆ మన్వంతరం ' స్వామయంభువ మన్వంతరం ' అయ్యింది. రెండవ మనువు పేరు స్వారోచిషుడు. ఇలా వరుసగా ఔత్తమ, తామస, రైవత, చాక్షుషమనే ఆర్గురు మనువులూ, ఆరు మన్వంతరాలూ గడచిపోయాయి. ప్రస్తుతం ఏడవదైన ' వైవస్వత ' మన్వంతరం జరుగుతున్నది. ఈ మన్వంతరం పిదప మరి ఏడు మన్వంతరాలు రానున్నాయి. వాటి పేర్లివీ.

1. సూర్య సావర్ణి, 2.దక్షసావర్ణి, 3. బ్రహ్మసావర్ణి, 4.ధర్మసావర్ణి 5. రుద్రసావర్ణి, 6.రౌచ్యసావర్ణి 7.భౌత్యసావర్ణి (మార్కండేయ పురాణానుసారం) కల్పభేదాల్ని పట్టి మన్వంతరాల పేళ్లలో కూడ కొన్ని వ్యత్యాసాలు కనిపిస్తున్నవి.

ముందు చెప్పినట్టు వేరు వేరు మన్వంతరాల్లో అవతరించిన, అవతరించబోయే సప్తర్షుల పేర్లు కూడ భిన్నంగా ఉంటాయి. ఈ విషయాన్ని మనపురాణాలు విపులంగా వివరించాయి. ప్రామాణిక పురాణంగా

పేర్కొనబడే విష్ణుపురాణంలో - వివిధ మన్వంతరాల్లోని సప్తర్షుల పేళ్లీవిధంగా ఉన్నాయి.

1. ప్రథమ స్వాయంభువ మన్వంతరంలో - (1) మరీచి (2). అత్రి (3). అంగిరస (4) పులస్త్య (5) పులహ (6). క్రతు (7) వసిష్ఠులు.

2. ద్వితీయ స్వారోచిష మన్వంతరంలో - (1) ఊర్జ (2). స్తంభ (3) వాత (4) ప్రాణ (5) పృషభ (6) నిరయ (7) పరీవానులు.

3. తృతీయ ఉత్తమ మన్వంతరంలో - మహర్షి వసిష్ఠుని ఏడుగురు పుత్రులు.

4. చతుర్థ తామసమన్వంతరంలో - (1) జ్యోతిర్ధామా (2) పృథు (3) కావ్య (4) చైత్ర (5) అగ్ని (6) వనక (7) పీవరు -లు.

5. పంచమ రైవత మన్వంతరంలో - (1) హిరణ్య రోమా (2) వేదశ్రీ (3) ఊర్ధ్వబాహు (4) వేదబాహు (5) సుధామా, (6) పర్జన్య (7) మహాముని అనేవారు.

6. షష్ఠ చాక్షుష మన్వంతరంలో - (1) సుమేధా (2) విరజా (3) హవిష్మాను (4) ఉత్తమ (5) మధు (6) అతినామా (7) సహిష్ణులు

7. వర్తమాన సప్తమ వైవస్వతమన్వంతరంలో - (1) కాశ్యప (2) అత్రి (3) వసిష్ఠ (4) విశ్వామిత్ర (5) గౌతమ (6) జమదగ్ని (7) భరద్వాజులు

8. అష్టమ సావర్ణిక మన్వంతరంలో - అవతరించనున్న సప్తర్షులు (1) గాలవ (2) దీప్తిమాన (3) రామ (4) అశ్వత్థామా (5) కృప (6) ఋష్య శృంగ (7) వ్యాసు -లు

9. నవమ దక్ష సావర్ణి మన్వంతరంలో (1) మేధాతిథి (2) వసు (3) సత్య (4) జ్యోతిష్మాన్ (5) ద్యుతిమాన్ (6) సవన (7) భవ్య - నాములు

10. దశమ బ్రహ్మ సావర్ణి మన్వంతరంలో - (1) తపోమూర్తి

(2) హవిష్మాను (3) సుకృత (4) సత్య (5) నాభాగ (6) అప్రతిమౌజ (7) సత్యకేతు -లు

11. ఏకాదశ ధర్మసావర్ణి మన్వంతరంలో - (1) వపుష్మాను (2) ఘృణి (3) ఆరుణి (4) నిఃస్వర (5) హవిష్మాను (6) అనఘ (7) అగ్ని తేజా - అనువారు

12. ద్వాదశ రుద్రసావర్ణి మన్వంతరంలో - (1) తపోద్యుతి (2) తపస్వీ (3) సుతపా (4) తపోమూర్తి (5) తపోధన (6) తపోరతి (7) తపోధృతి అనువారు

13. త్రయోదశ దేవసావర్ణి మన్వతరంలో - (1)ధృతిమాను (2) అవ్యయ (3) తత్త్వదర్శీ (4) నిరుత్సుక (5) నిర్మోహ (6) సుతపా (7) నిష్ప్రకంప అనబడువారు

14. చతుర్దశ ఇంద్రసావర్ణి మన్వంతరంలో - (1) అగ్నిధ్ర (2) అగ్నిబాహు (3) శుచి (4) యుక్త (5) మాగధ (6) శుక్ర (7) జిత నాములు

ఈ మహాత్ములందరూ గొప్ప తపోధనులు. వేద మంత్రాలను దర్శించిన వారు. అందుకే

" ఋషయో మంత్ర ద్రష్టారః " అన్నారు.

వేదాధ్యయనం చేసేవారు ఋషి, ఛందస్సు, దేవత, వినియోగాదులు తెలిసి చేయాలనీ, అప్పుడే వేదమంత్రాలకు ఫలితాలుంటాయనీ అందుకే అంటారు.

గృహ వైద్యము

ఉసిరిక పండ్ల రసము తేనె కలిపి అర కప్పు చొప్పున మూడు రోజులు త్రాగితే మూత్రదోష బాధలు నివారణ యగును.

ఉసిరిక పండ్లను మొత్తగా నూరి పొత్తి కడుపుకు పట్టు వేస్తే మూత్రం జారీయగును.

జీవాత్మ - పరమాత్మ

- శ్రీమతి ఎం.సీతాలక్ష్మీదేవి, హైదరాబాదు

సృష్టిలో నున్న 84 లక్షల జీవరాసులు, పిపీలికాది బ్రహ్మపర్యం తము ఆ పరమాత్మ సృష్టియే. " ఈశావాస్యమిదం సర్వం " అన్నిట అంతట పరబ్రహ్మ అంశ జీవాత్మ ఉంటుంది. రాయిరప్పలు, క్రిమికీటకాలు, వృక్షజాలములు, జంతు జాతులుగా క్రమ క్రమముగా పరిణితి చెంది కొన్ని కోట్ల సంవత్సరముల తరువాత దుర్లభమైన ఈ మానవజన్మ పొందుతుంది ఈ జీవాత్మ. ఈ జన్మ దేవుడిచ్చిన వరం. సృష్టి అంతటిలోను లేని వివేకమనే విశిష్ట గుణం మానవుని ఒక్కడికే ఉంది. ఈ విశేష గుణాన్ని ఉపయోగించి సదసద్వివేచనతో సత్యాసత్యాలను, సుఖదుఃఖాలను, మంచి చెడులను గుర్తించి జీవించాలి. ఈ వివేకము సత్పురుషులసాంగత్యము, సద్గ్రంథ పఠనము, జపతపాదుల వల్ల సాధ్యం. మన మాంసనేత్రానికి కనబడని పాలలో వెన్నలా, కట్టెలలో అగ్నిలా మనలోని అజ్ఞాన తమస్సును పోగొట్టే శక్తి దైవానుగ్రహ సంపన్నులగు మహాత్ములకే సాధ్యము.

సంకల్ప వికల్పములే మనస్సు. ఈ మనస్సును భక్తి అనే త్రాడుతో కోతి వలె చంచలమైన మనస్సును నిగ్రహించాలి. అప్పుడే బుద్ధి, బుద్ధి వల్ల వివేకం వికశిస్తాయి. అప్పుడే " దేహోదేవాలయః ప్రోక్తః " దేహమే దేవాలయం అని జీవుడే దేవుడని, అజ్ఞాన నిర్మాల్యాన్ని తొలగించి " సో 2 హం " నేనే దేవుడనని, నాలోని జీవుడే అందరిలో ఉన్నాడనే భావన కలుగుతుంది. అప్పుడు పరనింద ఉండదు. మరి నిన్ను నీవే నిందించుకున్నట్లవుతుంది గదా !

ఆ జీవచైతన్య శక్తి వల్లే సర్వేంద్రియాలు పనిచేయగల్గుతున్నాయి. మరి కళ్ళు ఉండి గ్రుడ్డివాడు, చెవులుండి చెవిటివాడు చూడలేడు, వినలేడు. ఇలాగే అన్ని ఇంద్రియాల వెనుక ఆ జీవ చైతన్యశక్తే అంటే ఆ పరమాత్ముని

శక్తే. హృదయ స్థానమునన్న అనాహత చక్రములో వడ్లగింజ మొనవలె సూక్ష్మమై, విద్యుల్లేఖవలె ప్రకాశవంతంగా ఉంటుంది. అచటి నుండియే మన శ్వాస నిశ్వాసలు కలుగుతుంటాయి. అదే ప్రాణ శక్తి. అది లేనిచో శివస్వరూపమైన శరీరం శవం అయిపోతుంది. కాన " సో 2 హం, సో 2 హం " అంటూ ధ్యానం చేయాలి. ఆ పరమాత్మే నేను " చిదానంద రూప శ్శివో 2 హం శివో 2 హం " అన్నారు శంకర భగవత్పాదులు. " అంతః బహిశ్చసర్వం వ్యాప్యనారాయణ స్థితః " అణువణువున పరమాత్మే. సర్వాత్మ భావన, అఖండాత్మ భావనతో మమైక్యం కావాలి అనన్యాశ్చింతయంతో మాం.... యోగక్షేమం వహామ్యహం " అని గీతలో కృష్ణ భగవానుడు చెప్పాడు. జీవితంలో ఏ కర్మ, పని చేస్తున్నా ఆ భగవత్ జ్ఞప్తితో, సమర్పణ భావంతో చేస్తే మన యోగక్షేమాలు ఆయనే చూచుకుంటానని అభయం ఇచ్చాడు కృష్ణపరమాత్మ. ఇక భయమెందుకు? ఆయన సర్వజ్ఞుడు. సర్వశక్తి మంతుడు, సర్వ వ్యాపి. ఆయన కృప వల్ల అసాధ్య కార్యాలు కూడ సాధ్యపడతాయి. మూగవాడు సైతం మాట్లాడగలుగుతాడు. కుంటివాడు పర్వతాలను ఎక్కగలుగుతాడు. ఆయనే మనకు తల్లి, తండ్రి, గురువు, సమస్తమున్ను.

" యత్ దృశ్యం తత్ నశ్యం " మన కంటికి కనిపించే సమస్తమున్ను. నశించేదే. అందువల్ల నిత్య, సత్య పరంధాముని ధ్యానిద్దాము. పూజ కేవలం నామమాత్రంగా, యాంత్రికంగా చేయరాదు. భావయుక్తంగా చేయాలి. ఆ జీవపరమాత్మే నామరూపాలు ధరించి రామకృష్ణాది అవతార మూర్తులుగా దిగివచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణలు చేస్తూ మనకు మంచి చెడులను చూపుతున్నారు. అదిగ్రహించి ఆచరణలో పెట్టాలి. పూజ కేవలం గదిలోనే కాక మదిలో సదా భగవద్భావనతో ఉండాలి. పరమాత్మ అన్ని ఇస్తాడు – ఇవ్వాలి అని కాక ఇన్ని ఇచ్చాడు అనే కృతజ్ఞతా భావంతో జీవితాన్ని తృప్తితో, ఆనందంగా గడపాలి. " పరోపకారార్థమిదం శరీరం" ఈ శరీరమును బీద, పేద, వృద్ధ జనులకు దాన ధర్మ, సేవల ద్వారా ఉపయోగించాలి.

సృష్టిలో వృక్షాలు, నదులు మున్నగునవి స్వలాభమునకు గాక ఇతరుల కొరకే అన్నీ ఇస్తున్నాయి. ఇట్టి భావములను మనము చిన్నతనము నుండియే తెలుసుకోవాలి. ఈ స్మరణాది సద్భావములు తుది వరకు అవసానకాలమున మరణానంతరము దైవసాయుజ్యానికి తోడ్పడుతాయి.

కావున మనమందరము ప్రియ వాక్యములతో, మృదు మధురంగా మాట్లాడుతూ అందరికి ఆనందాన్ని కలిగిస్తూ మీరు సంతోషపడుతూ సదా స్మరణ – సమర్పణ భావాలతో జీవితంలోనే జీవాత్మను పరమాత్మ విలీనతకు జపతపాదులు చేస్తూ, ధ్యానం ద్వారా సర్వ విధముల సాధన చేసి జన్మరాహిత్యమును పొందేందుకు యత్న పూర్వకంగా ప్రయత్నం చేసి తరింతుము గాక !

కొందరి ప్రశ్నలకు శ్రీ మలయాళస్వాముల వారి సమాధానములు

01. **ప్రశ్న** : స్వామీ ! మీకు జ్యోతిష్యము తెలుసునా ?

శ్రీవారు : తెలుసు. పూర్వము మీరేది చేసిరో, దాని నిపుడను భవించుచున్నారు. ఇపుడేమి చేయు చున్నారో దాని ఫలితము తదుపరి రాబోవుచున్నది. ఇదియే నాకు తెలిసిన జ్యోతిష్యము.

02. **ప్రశ్న** : స్వామీ ! మీ యొద్ద మలయాళ మంత్రము లేవైనా ఉన్నవా ?

శ్రీవారు : ఉన్నవి. అవి (1) దృక్కగు ఆత్మలో నిలుకడ కలిగియుండుట, దృశ్యభావన లేకుండుట. (2) పవిత్ర ఆచరణ (3) తపస్సు (4) బ్రహ్మచర్యము (5) ఆత్మవిచారణ (6) అనుష్ఠానము

(శ్రీ సద్గురు స్వాములవారి ఆరాధన ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా)

శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి ఆదర్శ గుణగణములు

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

I **సర్వభూతదయ :**

01. బాల్యకాలమున ఒక వేటగాడు రెండు పక్షులను బంధించి తీసికొనిపోవుచుండ, శ్రీ స్వాములవారు వానిని కొనివైచి ఆకసమున విడిచిపెట్టి ఆనందించిరి.

02. మాంసాహార విసర్జనమును ప్రోత్సహించి అనేకులచే మాంసాహారమును వర్జింప జేసిరి.

03. ' చరాచర సుఖాభిలాషి ' అని తమ పేరు ముందు వ్రాయుచు సమస్త ప్రాణికోట్ల యెడల దయగలిగి యుండుటయే తమ యభీష్టమని వ్యక్తము చేసిరి.

04. పాములు మొదలైన క్రూరజంతువులను కూడ హింసింపక పట్టకారుతో పట్టి దూరముగ వదలివేయు ఏర్పాటు చేసిరి.

05. కేరళదేశమున శ్రీవారు తమ గురువు గారి ఆశ్రమమునందు జనుల ఉపయోగార్థము ఒక బావిని త్రవ్వించిరి. ఒక భారవాహినిని ఏర్పాటు చేసిరి.

06. శ్రీ వ్యాసాశ్రమమున పశువులశాలయొద్ద పశువులు దురద తీర్చు కొనుటకుగాను ఒక రాతిని నాటింపించిరి.

07. ఆశ్రమములో భిక్ష జరిగినపుడు పశువులకు పచ్చగడ్డి ప్రత్యేకముగ ఏర్పాటు చేయుదురు.

II. **చిన్నకార్యములందు కూడ జాగ్రత, శ్రద్ధ కలిగియుండుట.**

01. శ్రీ స్వాములవారు తమ చాపనుతామే చుట్టుకొందురు. తమ చెంబు తామే తోముకొందురు. తమ వస్త్రమును తామే కుట్టుకొందురు.

02. కళ్ళజోడు పెట్టి మూయునపుడు గాని, పుస్తకము మూయునపుడుగాని శబ్దము కలుగకుండ చూడవలెనని చెప్పుదురు.

03. ధరించు వస్త్రము నేలకు తగులరాదనియు, ఒకింత పైగా ఉండులాగున ధరించవలెననియు చెప్పుదురు.

04. దీపమును నోటితో ఆర్పగూడదని బోధించుదురు.

05. ఏదైన ముఖ్య విషయము ఉన్నపుడే కార్డుగాని, ఉత్తరముగాని వ్రాయవలయుననియు, అనవసరముగ కార్డు మొదలైనవి వృథా చేయగూడదనియు చెప్పుదురు.

06. చిన్న తెల్లకాగితపు ముక్కను కూడ పారవేయక శ్రీవారు దానిని భద్రముగా దాచి ఉపయోగించుచుందురు.

III, **క్రమశిక్షణ :**

01. బ్రహ్మముహూర్తమున నిద్రలేచుట, గీతా పారాయణాదులను జరుపుట, ధ్యానాదులను శీలించుట, ఆహారాది విషయములందు సంయమమును శీలించుట, మొదలైన నియమములను శ్రీవారు తాము శ్రద్ధగా పాలించుచు ఇతరులచే పాలింపచేయుదురు.

రాయి సుత్తి దెబ్బలు తిని విగ్రహమైనట్లు శిష్యుడు గురు సన్నిధియందు బాగుగా శిక్షణ బడయ వలయునని చెప్పుదురు. సాధకుడు సోమరితనమునకు తిలాంజలి నొసంగి పట్టుదలతో సాధన కొనసాగించవలెనని శ్రీవారు తఱచు బోధించుదురు. ఆశ్రమములో ' ఇచట సోమరులకు చోటు లేదు ' అని వ్రాయబడిన బోర్డును కట్టించుటయే కాక ప్రతిదినము ఆ వాక్యమును ఆశ్రమ విద్యార్థులచే పెద్ద పెట్టున ఘోషింప జేయుదురు.

IV. **నిరాడంబరత్వము :**

శ్రీవారు ఆడంబరమును ఎన్నడును కోరరు. ఆశ్రమములో శిష్యులకు పెద్ద పెద్ద భవనములను ఏర్పాటు చేసి తాము మాత్రము పూరి పాకలందే నిష్ఠ సలుపుకొనుచుందురు. ఆడంబరముతో గూడిన కార్యములను చేయవలదని బోధించు చుందురు.

V. **అకుంఠిత దైవభక్తి :**

శ్రీ స్వాములవారు భగవంతునిపై అపారమైన భక్తి విశ్వాసములు కలిగియుందురు. వారి జీవితమందలి ప్రతి సంఘటనయందును. వారు బోధించు ప్రతి విషయము నందును దైవభక్తి ప్రస్ఫుటమగు చుండును. గురుభక్తి దైవభక్తి రెండును మానవుని అభ్యున్నతికి ఎంతయో ఆవశ్యకములని శ్రీవారు తఱచు బోధించుచుందురు.

VI. **నవనీత హృదయము :**

శ్రీ స్వాములవారు దయార్ద్రహృదయులు, ప్రేమ, దయ, కరుణ, వాత్సల్యము వారి ప్రతికార్యమందును లెస్సగ ప్రస్ఫుటమగు చుండును. ఆశ్రమ విద్యార్థులలో ఎవరైన క్రమశిక్షణను పాటించనిచో వారికి ఒక పూట ' నిరాహారశిక్ష ' విధించినప్పటికిని కరుణాపూరిత హృదయాంతరంగులగు శ్రీ స్వాములవారు వారిని కొద్దిసేపటికి పిలిపించి తప్పు చేయవద్దని చెప్పి మరల అన్నము పెట్టించుదురు.

వేదాన్తభేరికి వీరు పోషక చందా పంపినారు

(1).	జి.మోహనరావు (విజయవాడ)	-	రూ.1200/-
(2).	జి.అచ్యుతరామలక్ష్మి (రాజమండ్రి)	-	రూ.2120/-
(3).	డి.వేణునాదస్వామి (ఖమ్మం)	-	రూ.1200/-
(4).	కె.నాగభూషణం (హైద్రాబాద్)	-	రూ.1200/-
(5).	జి.శంకరరెడ్డి (సుల్తానాబాద్)	-	రూ.1200/-
(6).	వేముల రామకృష్ణ (మంచిర్యాల)	-	రూ.5000/-

శ్రీ మలయాళస్వామి స్తోత్రం
శ్రీ పాదకృష్ణ కవికృతం

వివరణ : డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

అది 1931వ సంవత్సరం. రాజమండ్రి పట్టణంలో సనాతన ధర్మ పరిపాలన సేవాసమాజముయొక్క పంచమ వార్షిక సభలు జరిగాయి. ఆ సభలే తరువాత ' సనాతన వేదాంత జ్ఞాన సభలు'గా రూపొందాయి.

రాజమండ్రి సభకు శ్రీ రాజేశ్వరానందస్వాములవారు అధ్యక్షత వహించారు. కవి సార్వభౌమ శ్రీ పాదకృష్ణమూర్తిశాస్త్రిగారు, శ్రీన్యాపతి సుబ్బారావుపంతులుగారు మున్నగు ప్రముఖ వ్యక్తులు ఈ సభలో పాల్గొన్నారు.

శ్రీ మలయాళస్వాములవారు ఈ సభలో సాంఖ్యయోగమును గూర్చి అనర్గళంగా సుదీర్ఘమైన ఉపన్యాసం కావించారు. అజ్ఞాన స్వరూపాన్ని, దాన్ని తొలగించవలసిన ఆవశ్యకతనూ, అందుకై అనుసరించవలసిన పద్ధతులనూ అత్యద్భుతంగా వివరించారు. అజ్ఞానాన్ని ఒక బ్రహ్మరాక్షసుణ్ణిగా వర్ణిస్తూ వాని వికృత చేష్టలను విశదీకరించారు. దాన్ని హతమార్చడానికి ఉద్యమించినవారు ఏ కాలంలో ఎక్కడ ఎలా అందుకు ఉపక్రమించారో ప్రస్తుత కాలంలో ఆరక్కసుణ్ణి ఏ రీతిగా ఎదుర్కొనాలో తేటతెల్లంగా వివరిస్తూ ఆశ్చర్యకరమైన ప్రబోధం కావించారు.

శ్రీ స్వాములవారి ఆ అపూర్వప్రసంగం విన్న కవిసార్వభౌముల హృదయం స్పందించింది. స్వామిపై వారికి ఎనలేని భక్తి కల్గింది. వెంటనే ఆ కవీశ్వరుడు సంస్కృతంలో స్రగ్ధరావృత్తాలలో ఐదు పద్యాలు " శ్రీ మలయాళస్వామి స్తోత్రం " అన్న పేరుతో రచించి గురుదేవులకు సమర్పించారు.

ఈ స్తోత్రం మొదట " స్వబోధసుధాకరం " అన్న గ్రంథంలో

ప్రకటితమయింది. 1962లో నేను ' రచించిన శ్రీ మలయాళ సద్గురు శతకంలో శ్రీ స్వామివారి అనుమతితోనే దీన్ని గ్రంథాదిలో ప్రచురింప జేశాను.

ఆ స్తోత్రం భావార్థంతో సహా గురుదేవుల జీవిత చరిత్రలోని పంచమ ప్రకరణంలో ప్రచురించడమయింది. ఈ ప్రచురణ మొదటిసారిగా 1976లో జరిగింది.

ఇప్పుడు శ్రీ స్వాములవారి 53వ ఆరాధనా శుభ సందర్భంలో మరల దీనిని ఈ పత్రికా ముఖంగా వెలుగులోకి తేవడం సమంజసమని భావిస్తున్నాను.

ఓమిత్యేకాక్షరం యత్ప్రణవమభిహితం బ్రహ్మతత్త్వం సమస్తం
తద్ధ్యానైకాగ్రచిత్త స్తదభవదమలం యస్తపస్తప్తదేహః ।
జ్ఞానానందస్వరూపం ఘనతరకరుణాసాగరం సర్వగమ్యం
మల్యాళస్వామినం తం మహితగుణయుతం మంత్రమూర్తిం భజేఽహమ్॥

తాత్పర్యము : ' ఓం ' అను ఏ యేకాక్షరం ప్రణవంగా, సమస్త బ్రహ్మతత్త్వంగా పేర్కొనబడినదో, దానిని ధ్యానించడంలో ఏకాగ్రమైన చిత్తం కలవాడూ, తీవ్ర తపస్సుచే తప్తమైన శరీరం కలవాడూ, ఆ తపః ప్రభావంచేత నిర్మలమైన ఆ బ్రహ్మతత్త్వంగానే రూపొందినవాడూ, జ్ఞానానందములే స్వరూపంగా గలవాడూ, మహాకరుణాసముద్రుడూ, సర్వజనులకూ ఆశ్రయింప దగినవాడూ, పూజనీయమైన సద్గుణములచే ఒప్పువాడూ, మంత్రమూర్తీ అయిన శ్రీ మలయాళస్వామిని నేను భజిస్తున్నాను.

బ్రహ్మాంశాత్సంప్రభూతః సదసదపరగోవ్యాసభట్టారకోఽ స్మిన్
ఆంధ్రే గోగర్భనామ్నో గిరివరవివరా దద్యభక్తావనార్థమ్,
సంజాతః కాశిబుగ్గ ప్రథితమునినుతక్షేత్రవాసీ పునర్యః
మల్యాళస్వామినంతం మహితగుణయుతం మంత్రమూర్తిం భజేఽహమ్॥

తాత్పర్యము : బ్రహ్మాంశం నుండి జనించినవాడూ, సదసద్విలక్షణుడూ, అయిన ఏ వేదవ్యాసుడు నేడు భక్తులను కాపాడడానికై ఈ ఆంధ్రావనిలో గోగర్భమను తిరుమల గుహనుండి ఉద్భవించినవాడై ' కాశిబుగ్గ ' అని ప్రసిద్ధమైన మునులు నుతించిన క్షేత్రంలో నివసిస్తున్నాడో, అట్టి పూజ్యగుణోపేతుడూ, మంత్రమూర్తీ అయిన శ్రీ మలయాళస్వామిని నేను సేవిస్తున్నాను.

సాధూనాం పాలనాయ ప్రబలదురిత విధ్వంసనాయాంధ్రభూమౌ
ధర్మాణాం రక్షణాయ ప్రభురఖిలజగన్నాయకోఽ ద్యావిరాసీత్
బ్రహ్మశ్రీ శంకరార్యః పునరితిచ యతిం యంవదంతీహ సాధుం
మల్యాళస్వామినం తం మహితగుణయుతం మంత్రమూర్తిం భజేఽహమ్॥

సాధువులనుపాలించుటకూ, ప్రబలమైన పాపాలు నశింప జేయడానికీ, ధర్మాన్ని కాపాడడానికీ సకల జగన్నాయకుడై ఆంధ్రభూమిలో ఇపుడవతరించాడనీ ఈయన బ్రహ్మశ్రీ శంకరాచార్యుడే అనీ సాధురూపుడైన ఏ యతీశ్వరుని ప్రజలు కీర్తిస్తున్నారో, అట్టి మహితగుణగరిష్ఠుడూ, మంత్రమూర్తీ అయిన శ్రీమలయాళస్వామిని నేను భజిస్తున్నాను.

సన్న్యస్యేహస్థితానాం గృహధనవనితావాహనానాం సుసంగం
సోఽహం బ్రహ్మేతివాచా శ్రుతిషు కలితయా వ్యాహరన్యోరరాజ
తం సాక్షాచ్ఛంకరం సంయమిజనపరమం వ్యాసనామాశ్రమస్థం
మల్యాళస్వామినం తం మహితగుణయుతం మంత్రమూర్తిం భజేఽహమ్॥

ఈ లోకంలోని గృహ ధన స్త్రీ వాహనాల సంగం పరిత్యజించి వేదోక్తమైన ' సో ఽ హం బ్రహ్మ ' అనే వాక్యం ఉచ్చరిస్తూ బ్రహ్మతత్త్వం పొంది ఎవడు విరాజిల్లాడో అలాంటి సాక్షాత్ శంకర స్వరూపుడూ, మునిజన శ్రేష్ఠుడూ, వ్యాసాశ్రమనివాసీ, మాన్యగుణవంతుడూ, మంత్రమూర్తీ అయిన శ్రీమలయాళస్వామిని నేను సేవిస్తున్నాను.

అహమస్మి ' బ్రహ్మాసోఽస్మీ' త్యను పదమపరం బ్రహ్మసాక్షాదభూద్యో
విలసన్మూర్తి ర్హృతార్తి ర్నిజపదకమలధ్యానసక్తోత్తమానాం

లలితం విజ్ఞానతేజోబలకలితమహం నిర్మలం నిర్వికారం
మల్యాళ స్వామినం తం మహితగుణయుతం మంత్రమూర్తిం భజే2హమ్॥
అహం బ్రహ్మాస్మి " అనే మహా వాక్యాన్ని స్మరించి ఎవడు తానే సాక్షాత్ బ్రహ్మమయ్యాడో, ప్రకాశించే ఆకృతిగల్గి తన పాదపద్మాలను ధ్యానించే భక్తోత్తముల ఆర్తిని హరించువాడో, అట్టి మనోహరుడూ, విజ్ఞానతేజోబలంకలవాడూ, నిర్మలుడూ, నిర్వికారుడూ, మహితగుణ సంపన్నుడూ, మంత్రరూపుడూ అయిన శ్రీ మలయాళస్వామిని నేను భజిస్తున్నాను.

శ్రీ పాదకృష్ణ కవినా రచితం పరమార్థదమ్,
మల్యాళస్వామినఃస్తోత్రం జీయాదాచంద్రతారకమ్ ॥

శ్రీ పాదకృష్ణకవి రచించినదీ, పరమార్థాన్ని ప్రసాదించేదీ అయిన శ్రీ మలయాళస్వామి స్తోత్రం చంద్రుడు, తారకలు ఉన్నంతకాలం సర్వోత్తమ స్తోత్రంగా వర్ధిల్లుగాక !

విశేషాంశాలు : ఈ స్తోత్రకర్త శ్రీ పాదకృష్ణకవి ఆనాటి కవులలో అగ్రగణ్యులు. కవి సార్వభౌములుగా ప్రఖ్యాతి గాంచినవారు, బహుగ్రంథకర్త. ఈ స్తోత్రంలో ' మలయాళ ' అనుటకు బదులు ' మల్యాళ ' అని ఛందసౌకర్యం కొర్కై పదప్రయోగం చేయడమయింది. అలా చేసే అధికారం కవులకున్నది.

ఇందులో వ్యాసుడు, శంకరుడు ప్రస్తావించబడియున్నారు. వ్యాసాదులతో సమానులని శ్రీస్వాములవారిని గుర్తించి స్తుతించిన శ్రీపాదవారు ఎంతటి గుణజ్ఞులో, ఎంత సమభావసంపన్నులో గమనార్హము.

శ్రీ మలయాళ సద్గురు దేవులు భౌతికంగా కనుమరుగై 53 సంవత్సరాలు గడచిపోయాయి. కాని వారి కీర్తికాయం నానాటికీ శోభావిలసితమై ప్రకాశిస్తున్నది. శ్రీపాదవారి వలె మనమూ శ్రీగురుదేవులను స్తుతించి ధన్యుల మగుదుము గాక !

వార్తలు

(01). మే 13వ తేది హనుమజ్జయన్తి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో హనుమంతునకు తమలపాకు అర్చన చేయబడింది. హనుమాన్ చాలీసాసమిష్టి పారాయణ చేయబడి ప్రసాద వితరణ చేయబడింది.

(02). జూన్ 5వ తేది శుక్రవారం నాడు శ్రీకాళహస్తి ముత్యాలమ్మగుడివీధిలోని సరస్వతి శిశుమందిరం పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారిచే పునః ప్రారంభింపబడినది.

(03). జూన్ 21వ తేది ప్రపంచ ప్రథమ యోగదినోత్సవం శ్రీకాళహస్తి ఆశ్రమంలో ఆశ్రమ యోగాచార్యులు మాన్యశ్రీ మార్కండేయులు ఆధ్వర్యంలో జరిగినది. ఆశ్రమ యోగ విద్యాలయంలో తర్ఫీదు అయిన యోగ విద్యార్థులు యోగాసన, ముద్రల ప్రదర్శనలు చేశారు. యోగ ప్రాధాన్యతను పూజ్యశ్రీ స్వాములవారు వివరించారు.

(04). 31-05-2015వ తేది ఆదివారం శ్రీశుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం ఆశ్రమంలో సంఘ ఉపాధ్యక్షులు బి.రాధాకృష్ణయ్య (రిటైర్డ్ జిల్లా సేషన్స్ జడ్జి) గారి అధ్యక్షతన జరిగినది.

(05). జూన్ 2వ తేది మంగళవారం కృషి పూర్ణిమ సందర్భంగా గురుపాదుకాపూజ ఆశ్రమంలో జరిగినది. జూన్ 12వ తేది శుక్రవారం, 28వ తేది ఆదివారం ఏకాదశిల సందర్భంగా భగవద్గీత సంపూర్ణ సమిష్టి పారాయణ జరిగినది. జూన్ 14వ తేది ఆదివారం కృత్తిక సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం, అర్చన యథారీతి జరిగినది. 15వ తేది మాసశివరాత్రి ప్రదోషకాలంలో శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(06). తన జనప్రియ గీతోపన్యాసాలు, భాగవత ప్రవచనల ద్వారా సాధు మహాత్ములలో భక్తులలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకొనిన మహాత్ముడు పూజ్యశ్రీ రామకృష్ణానందస్వాములవారి (గండిక్షేత్రం) శతజయన్త్యుత్సవాలు గండి శ్రీభవామానందాశ్రమంలో జూలై 13వ తేది నుండి 17వ తేది వరకు పంచాహ్నికంగా వైభవంగా అపూర్వంగా జరుగనున్నవి. ఆసందర్భంగా పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు అందు పాల్గొని ప్రవచన చేస్తారు.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో మే నెలలో **ఓ.పి.విభాగంలో 1090 గురికి** వివిధ కంటి పరీక్షలు చేసి చికిత్సలు చేయబడినవి. **95 మందికి కంటి పొరలు** ఆపరేషన్ చేసి కండ్లలో లెన్సు అమర్చబడినవి.

తనది కాని వస్తువును తనదని భ్రమించి
దానిపై వ్యామోహమును కలిగియుండుటయే
అజ్ఞానము. ఆ వస్తువుపై మమత్వమును వృద్ధి
నొందించుకొనుటయే అవిద్య. ఈ దేహము,
ఇంద్రియములు తనవికావు. మనస్సుగాని,
బుద్ధిగాని తనవికావు. వీని యన్నింటికిని
సాక్షియై వెలుగు ఆత్మయే తాను. తాను
దృక్స్వరూపుడు, కూటస్థ అచల - నిర్వికార
క్షేత్రజ్ఞుడు అను విచారణచే ఆత్మస్వరూపము
నెఱింగి దానియందే నిలుకడ కలవాడై
దేహేంద్రియాదులయందు సక్తుడు కాక
అసంగముగ వ్యవహరించుచు పరమానందమును
బడయవలెను.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వామి

Regd.No. TRP / 123 / 2015-17 July 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-06-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

________	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టై ఫెండ్	: నెలకు రూ. 1,000/-
________	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం।। ఆపైన
స్టై ఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

________	(సామవేదము/అథర్వవేదము-వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
________	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020
Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,
E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

ఆగస్టు 2015 రూ. 6/-



చిత్తశుద్ధి లేకుండ
ఆత్మానుభూతి కలుగదు.

భగవద్దర్శనమునకు రెండు విషయములు ప్రతివారికి అత్యవసరములు. అవి 1-ప్రయత్నము, 2-చిత్తశుద్ధి.

క్షేత్రమును బాగుగా దున్ని, కలుపు తీసి, శుద్ధము చేసి ఆ పిదప విత్తనము వేసినచో చక్కగా పైరగును. అట్లు గాక దున్నక, కలుపు తీయక విత్తనమును వేసినను, ఊషరక్షేత్రమున వేసినను ఆ విత్తనము మొలవదు. మొలచినను పెరుగదు. పెరిగినను సరైన ఫలితాన్నివ్వదు. అట్లే సాధకుడు సాధనచతుష్టయ సంపత్తి మొదలగు వాని ద్వారా చిత్తమును ముందుగా శుద్ధ మొనర్చుకొననిచో ఆత్మావిచారణ ధ్యానాదులచే అతి సులభముగ ఆత్మానుభూతి కలుగదు. అట్లు చేయని వారు ఎంత ప్రయత్నించినను ఆత్మానుభూతిని పొందజాలరు.

-శ్రీ విద్యా ప్రకాశానంద గిరి స్వాముల వారు.

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 ఆగష్టు 2015 సంచిక : 8

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

4

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 ఆగష్టు 2015 సంచిక : 8

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. దుర్గుణ జయోపాయములు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06

03. భాగవత సుధ - శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు - 10

04. మానవుని వారసత్వము - శ్రీ స్వామి చిన్మయానంద - 18

05. సులభాజనక సంవాదం - డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 22

06. జ్ఞానసుధ - పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు - 27

07. ఆచార్య దేవో భవ - ఆచార్య కె.సర్వోత్తమరావు - 30

08. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి -33

09. శ్రీ భక్తతుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 35

10. కొన్ని మరుచుట వలన మనశ్శాంతి చేకూరగలదు - కె.ఈశ్వర్ - 40

11. వార్తలు - 42

ముఖచిత్రం :

శ్రీ అరవింద యోగి

15 - 08 - 2015 తేది

అరవింద యోగి జయన్తి

ప్రార్థన

– జగద్గురు శంకరాచార్యుల వారు

సంసారభీకరకరీంద్ర కరాభిఘాత
నిష్పిష్ట మర్మవపుషః సకలార్తినాశ
ప్రాణప్రయాణ భవభీతి సమాకులస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్.
అంధస్య మే హృతవివేక మహాధనస్య
చోరైః ప్రభో బలిభిరింద్రియ నామధేయైః
మోహాంధకూప కుహరే వినిపాతితస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ .
లక్ష్మీపతే కమలనాభ సురేశ విష్ణో
వైకుంఠ కృష్ణ మధుసూదన పుష్కరాక్ష
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
దేవేశ దేహి కృపణస్య కరావలంబమ్.
యన్మాయయోర్జిత వపుః ప్రచురప్రవాహ
మగ్నార్థమత్ర నివహోరు కరావలంబం
లక్ష్మీనృసింహ చరణాబ్జమధువ్రతేన
స్తోత్రం కృతం సుఖకరం భువి శంకరేణ.

జీవుని దృష్టిలో జడబుద్ధి కాని, ఈశ్వరుని దృష్టిలో అంతా తానే. మరో వస్తువు లేదు. సర్వాత్మ భావసంపన్నుడే పరమహంస. ఆకారభ్రాన్తిని వికార భ్రాన్తిని, ప్రకారభ్రాన్తిని అధిష్ఠాన దృష్టితో బాధించినపుడు ఉండేది ఒకే ఒక సచ్చిదానంద బ్రహ్మ మాత్రమే.

– శ్రీ రామకృష్ణానందస్వాములవారు (గండిక్షేత్రం)



దుర్గుణ జయోపాయములు – 2

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

క్రోధమును అరికట్టుట కీ క్రింది ఉపాయములను అవలంబించ వచ్చును.

(1). కోపము యొక్క ఆవిర్భావము ఎపుడు సంభవించునో కడుజాగ్రతగ గమనించుచునుండి, అది ప్రవేశించక ముందే హెచ్చరికతో దానిని లోనికి రానీయక చూడవలెను. విచారణచే దానిని తరుమగొట్టవలెను. ఇది ఉత్తమోత్తమపద్ధతి. కోపము ప్రవేశించిన పిదప వెంటనే దానిని తొలగించుట మధ్యమపద్ధతి. కోపము ప్రవేశించి, చాలసేపు బాధించిన వెనుక దానిని పోగొట్ట యత్నించుట అధమపద్ధతి.

(2). క్రోధము యొక్క తరంగములు పుట్టిన వెంటనే కనిపెట్టి క్షమ, ప్రేమ, దయ, సహనము ఇత్యాది సుగుణ సంపత్తిచే దానిని నివారించవలెను. చిత్తము ఆ దుష్టవికారముచే ఏ మాత్రము కదలిక లేకుండునట్లు, సమరూపముగ నుండునట్లు **(Poise)** ప్రయత్నించవలెను.

(3). అందఱును భగవత్స్వరూపులే యను భావన గాని, ఆత్మ స్వరూపులే యను నమ్మకముగాని యుండవలెను. అపుడు క్రోధావిర్భావమునకు అవకాశమే లేదు (తత్రకోమోహః .....)

(4). కోపమను వృత్తితో తాదాత్మ్యము నొందరాదు. సాక్షిగా ఉ ండి దానిని వీక్షింపవలెను. అపుడు క్రమముగ దానంతట నదియే తొలగిపోవును.

(5). ఎవరైన దూషించినచో, అది మన మంచికొఱకే యని తలంచవలెను, దూషింపదగిన పొరపాటు ఉన్నచో, దానిని పోగొట్టు

కొనుటయు, అకారణముగ దూషించినచో, ' ఇది నా సహనశక్తిని పరీక్షించుట కొరకు అవకాశ ' మని తలంచియు, చిత్తమునందు ఏ వికారమున్ను రానీయక శాంతముగా నుండవలెను.

(6). కోపము వచ్చినపుడు ఆ చోటు విడిచి మఱియొక చోటికి వెళ్లుట మంచిది. అచట ప్రశాంతముగ అన్నియు ఆలోచించుకొనవచ్చును.

(7). కోపము కలిగినపుడు చన్నీళ్ళస్నాము చేయుటయో, లేక ఒకటి, రెండు, మూడు అని ఈ ప్రకారముగ ఇఱువదివఱకు సంఖ్యలు లెక్క పెట్టుటయో జరిపిన, అదికొంత శమించవచ్చును.

(8). కోపము వచ్చినవారు అద్దము చూచుకొనినచో, వారి వికార వంతమగు స్వరూపము వారికే సిగ్గు కలుగజేయగలదు. మానవుడు దానవుడుగా మారిపోవుట అత్తఱి గమనించగలడు.

(9). క్రోధమునకు పుట్టిల్లు కామము, కామమువలన క్రోధము జనించును. (కామాత్క్రోధో2భిజాయతే). కాబట్టి కోరికలు తగ్గించుకొనినచో, లేక పూర్తిగ తొలగించుకొనినచో ఇక క్రోధా విర్భావమునకు అవకాశముండదు.

(10). నవ్వుగాని, పాటగాని సత్త్వగుణస్థితియందు సంభవించును. కోపము రజోగుణమువలన కలుగును. కాబట్టి కోపము వచ్చినపుడు ఒక పాట పాడుటయో, లేక నవ్వుటయో ఒనర్చిన ఆ వికారమును రూపుమాపవచ్చును.

(11). కోపము కలిగినపుడు సాధకుడు వెంటనే ' శత్రువును పట్టుకొనుటకు, నా యొక్క సంయమనశక్తిని, సహన శక్తిని దిగ్దర్శన మొనర్చుటకు ఇదియే తగిన వేళ 'అని నిశ్చయించుకొని పొంచియుండి, అది రాగానే విచారణాదులచే దానిని తత్క్షణమే అరికట్టి వేయవలెను.

(12). కోపమునకు ఆశ్రయ మొసంగినచో ఘోరపాపమును మూటకట్టుకొనినట్లే అను విశ్వాసము గలిగి, పాపభీతి గలవాడై దానిని

దరికి చేర్చకుండ చూడవలెను.

(13). గీత రెండవ అధ్యాయమున 62, 63వ శ్లోకములందు క్రోధము యొక్క విపత్కర పరిణామములను భగవానుడు చెప్పిన వానిని అపుడపుడు బాగుగ మననము చేయుచు, ఆ క్రోధరూపభయంకర దుర్గుణపిశాచమును దరికి జేర్చనీయక కడుజాగరూకుడై మెలగవలెను.

1. ధ్యాయతో విషయాన్ ....

2. క్రోధాద్భవతి .... (గీత 2 – 62, 63)

ఇక లోభమును గూర్చి విచారించెదము. నరక ద్వారములలో మూడవదియగు లోభము సంపదలందు, భోగములందు, ప్రాపంచిక వస్తుజాలమందు అనర్థమును వీక్షించుట వలన తొలగగలదు. ప్రాపంచిక వైభవములు జీవుని భోగ విలాసములలోనికి దింపి భగవంతునకు దూరునిగ నొనర్చుచున్నవి. ఇక్కారణమున అవి అనర్థకరములే యగును. ఈ సత్యము నెఱుగుటవలన ఇక జీవుడు వానిని ఆశింపక తనకున్న సంపదలలో కొంతభాగమును దీనులకు, దరిద్రులకు అన్నాతురులకు త్యాగమొనర్చును. మఱియు అపుడాతనికి లోభబుద్ధి అంతరించును. సంగ్రహబుద్ధి తొలగిపోవును. కాబట్టి లోభ జయోపాయము దృశ్యవస్తువులందు, సంపదలందు, భోగవిలాసములందు అనర్థమును వీక్షించుటయే యగును.

భయము : ' తాను దేహమని ' తలంచుటచే జీవునకు భయము కలుగుచున్నది. ' తాను దేహము కాదు ఆత్మయే ' అని తలంచుటవలన జీవునకు నిర్భయత్వము కలుగుచున్నది.

రజుసర్పవదాత్మానం జీవం జ్ఞాత్వా భయం వహేత్
నాహం జీవః పరాత్మేతి జ్ఞాతశ్చే న్నిర్భయో భవేత్. (ఆత్మబోధ)

" త్రాటియందు సర్పమువలె తన్ను జీవుడని భావించుటవలన మనుజునకు భయము కలుగుచున్నది. 'నేను జీవుడనుకాను పరమాత్మను,'

అని యెఱుంగుటవలన నిర్భయత్వము కలుగుచున్నది " అని శ్రీ శంకరభగవత్పాదాచార్యులు ఆత్మబోధయందు తెలిపిన చందమున దేహ భ్రాంతియే, జీవభ్రాంతియే భయమునకు మూలమై యున్నది. తత్త్వవిచారణచే, తాను శాశ్వతమగు ఆత్మయేకాని నశ్వరములగు దేహాదులు కాదని జీవుడెపు డెఱుగునో, అపుడాతనికి అపరిమిత నిర్భయత్వము కలుగ గలదు. ' భయం తత్త్వావమర్శనాత్ ' అని తెలుపబడిన దాని భావమిదియే అయి యున్నది. కాబట్టి వివేకవంతుడు చక్కగ ఆత్మానాత్మ విచారణమును గావించుకొని, దేహభ్రాంతిని వీడి, అఖండసచ్చిదానంద పరమాత్మయే తానని యనుభూత మొనర్చుకొని భయమను పెనుభూతమును హృదయమునుండి సంపూర్ణముగ పారద్రోలవలెను.

ఈ ప్రకారముగ కామ, క్రోధ, లోభ, భయములను దుష్టచతుష్టయమును, పైన పేర్కొనిన యుపాయములచే జయించివైచి హృదయమును నిష్కంటక మొనర్చి ఆత్మానందమును, పరమశాంతిని అనుభవించవలయును.

1. అన్వీక్షిక్యా శోకమోహౌ దమ్భం మహదుపాసయా
యోగాన్తరాయాన్ మౌనేన హింసాం కాయాద్యనీహయా
(భాగవతము - 7-15-23)

2. కృపయా భూతజం దుఃఖం దైవం జహ్యాత్ సమాధినా,
ఆత్మజం యోగవీర్యేణ నిద్రాం సత్త్వనిషేవయా (7-15-24)

తత్త్వవిచారణచే శోకమోహములను, మహనీయులను పాసించుటచే (వారియొక్క సేవాప్రార్థనాదులచే) దంభమును, మౌనముచే యోగవిఘ్నములను, శరీరాదులను చేష్టింపకుండుట ద్వారా హింసను, దయచే భూతజనిత దుఃఖమును, సమాధినిష్ఠచే ఆధిదైవిక పరితాపములను, యోగబలముచే ఆధ్యాత్మిక దుఃఖములను, సాత్త్వికాహారాదుల సేవనముచే నిద్రను జయించవలెను.

I II III IV

భాగవత సుధ

- శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,
(గండిక్షేత్రము)

గీతావాణి గీతోపన్యాసాల ప్రథమాధ్యాయ పీఠికలో నేను స్వవిషయాన్ని గురించి వ్రాస్తూ.

" గీత భాగవతము చేతికిచ్చి కపీంద్రు
సేవయందు నిల్వ జేసినావు !
కడమ జీవితంబు కాపాడి రక్షించు
వాసుదేవ ! కృష్ణ ! వందనంబు. "

అని చెప్పుకునే వున్నాను. రెండూ పెనవేసికొని వున్న జీవ నదులు. ఇవి నిత్యము నేను ఆరాధించు అక్షర దేవతలు.

" విద్యావతాం భాగవతే పరీక్షా " - విద్యావంతులను భాగవతంలో పరీక్ష చేయాలనే ఆర్యోక్తి వుంది. " భాగవతము తెలిసి పలుకుట చోద్యంబు" అని పోతనామాత్యుడే అన్నాడు. తెలిసినవాడు శుకయోగి యైనాడు. పలికినవాడు వేదవ్యాసుడైనాడు.

శుకుడు అవధూత, గోచియు లేదు. దివ్యోన్మాద మనీషి, స్త్రీ పురుష భేదం లేనివాడు. ' ఆవు పిదికిన తడవెంత అంత తడవు ఒకచోట నుండడు. ఆయన భాగవతం పలికాడంటే శుకుడై పలుకలేదు. భాగవతంలో.

" తద్రసామృత తృప్తస్య నాన్యత్ర స్యాద్రతిః క్వచిత్ " (12-13-15) అని చెప్పబడింది. శ్రీ భాగవతామృత ఫల రసాస్వాద మత్తచిత్త శుకానికి అన్య వ్యాసంగం పట్టమన్నా పట్టదు. కావుననే ఆయన వేదవ్యాసుడై పలికాడు. శుకోపాధితో వేదవ్యాసుడే పలికాడు సుమా !

భాగవతము తెలియుట చోద్యం, పలుకుట చోద్యం. గీతలో చెప్పబడే

వుంది కదా !

" ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనం ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః !
ఆశ్చర్యవ చ్చైన మన్యశ్శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్"
(2 -29)

భగవంతుని వలె భాగవతము కూడా

" అణోరణీయాన్ మహతో మహీయాన్ " (కఠ 1-2-20)

అణువులలో అణువు, మహత్తులలో మహత్తు. కొండను మోసిన గోపాల కృష్ణుడు తులసిదళానికి తూగాడు. బ్రహ్మ మొదలు బ్రహ్మాండాలను తన మాయలో మూసివేసే ప్రభువు యశోద పైట కొంగులో దాక్కున్నాడు.

భాగవత సుధారాశిని ఆపోశనం తీసుకొనేందుకు మనం అగస్త్యులం కాలేకపోయినా, గుటకో చిటకో పానం చేసి " జననంబున్ సఫలంబు " చేసుకొనేందుకు ఎట్టి అభ్యంతరం లేదు.

సముద్రంలో ఒక మూల స్నానం చేస్తాం. స్నానం చేసే ఓపిక లేకపోతే " అపవిత్రః పవిత్రోవా " అని మంత్రం చెప్పుకొని సముద్రస్నానం చేసినంత సంతృప్తి పొందుతాం. సముద్ర స్నానం చేసినామని చెప్పుకొంటాం. ఏ మూలలో కాస్త చేసినా అంతా చేసినట్లే.

ఒక చిన్న పిల్లవాడు తల్లి చిటికెన వ్రేలు పట్టుకొని నడుస్తుంటాడు. " అమ్మను పట్టుకొన్నా, అమ్మను పట్టుకొన్నా " నని మురిసిపోతుంటాడు. వాడు అమ్మనంతా పట్టుకోలేదు. రవంత చిటికెన వ్రేలు మాత్రం పట్టుకొన్నాడు. అయినా " అమ్మను పట్టుకొన్నా, అమ్మను పట్టుకొన్నా " నంటాడు. " ఏమిరా అబద్ధం చెబుతావే ! నన్నంతా పట్టుకొన్నావా " అని తల్లి వాన్ని కసిరి వేస్తుందా ? లేదు. కొంచెం పట్టుకొన్నా అంతా పట్టుకొన్నట్లే.

కొండంత దేవునికి కొండంత పత్రితో పూజ చేయగలుగుతామా? " పత్రం పుష్పం " క్యాంటిటీ కాదు, క్వాలిటీ. పరిమాణం కాదు ముఖ్యం

– యోగ్యత ముఖ్యం. గీత కూడా అనింది.

" స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ " (2 -40)

ధర్మము స్వల్పమైనా ఫరవాలేదు, దాంతోనే వాడు ఉద్ధారకం కావచ్చు. స్వల్పమనే మాటలకు అల్పమనే మాటకు వ్యత్యాసం వుంది. అల్పమంటే పరిమాణమూ యోగ్యతా తక్కువ. స్వల్పమంటే పరిమాణం తక్కువైనా యోగ్యత తక్కువ కాదు. ద్రౌపది పెట్టిన మెతుకుతో పదివేల మందికి సమారాధనం జరిగింది. సమాధానం కుదిరింది.

" విబుధవరుల చేత విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపఱతు ! "

భాగవతసుధా సమారాధనంలో కూడా నా పాత్ర అంతే. నేను నిమిత్త మాత్రం, సర్వకర్త భగవంతుడు.

" మయాహతాంస్త్వం జహి మావ్యధిష్ఠా యుధ్యస్వ జేతాసి " (గీత 11-34)

" అంత పనీ నేనే చేసిపెట్టాను. అర్జునా ! నీవు నిమిత్తమాత్రంగా ముందుకు నిలబడు. తప్పక జయిస్తావ్ " అని చెప్పిన శ్రీకృష్ణుని మాటను స్మరిస్తూ నా పనిని నేననుసరిస్తాను.

ఒకాయన ఎవరికి ఏమి దానం చేసినా తలకాయ వంచుకొని దానం చేసే వాడట. " ఏమయ్యా సిగ్గా " అని ఎవడో అడిగితే, ' అవును సిగ్గే, ఎందుకంటే ? ఇచ్చేవాడు ఈశ్వరుడు ఇస్తూంటే అందరూ నన్ను పొగడ్తూంటారు. అందుకే సిగ్గు " అని ఆయన అన్నాడట.

నేనూ నిమిత్త మాత్రం. పలికించెడివాడు రామభద్రుడు కావచ్చు – శ్యామభద్రుడు కావచ్చు. ఎటైతేనేమి !

" పలికిన భవహరమగునట పలికెద వేఱొండు గాథ పలుకుగనేలా ! "

మీరు రసిక భావవిదులు కాబట్టి భాగవత సుధను పానం చేస్తున్నారు. ' కాకి వేప పండ్లను తింటుంది కాని, మామిడి పండ్లను ఆస్వాదిస్తుందా ? " అని శ్రీ చైతన్య ప్రభువు తమ చైతన్య భాగవతంలో అంటారు. భాగవతఫలరసాస్వాదన చేయాలంటే భక్తిరస రసికభావులు

కావాలి. “ భక్త్యా భాగవతం శాస్త్రం నతు బుద్ధ్యా న టీకయా ” అని వైష్ణవాచార్యులు అన్నారు. తెలివితేటలతో టీకాటిప్పణులతో భాగవత మర్మం అంతుపట్టేది కాదు. దానికి ఆకర్షించే దాన్ని ఆకళించే దానికి భక్తి హృదయమే కావాలి. రసము రసంలో కరుగుతుంది. రాళ్లలో కరుగదు. భగవంతుడు రసం, “ రసో వై సః ” భక్తి రసము. అది అమృత రసము. “ యేతు ధర్మ్యామృత మిదం ” అని భగవద్గీత భక్తియోగం చివరి శ్లోకంలో భగవంతుడూ పేర్కొన్నాడు. భాగవతం రసం. “ రసమాలయం ” రసాగారమని శ్రీ వేదవ్యాసులే అన్నారు. “ భాగవత పురాణ ఫలరస ” మని శ్రీ పోతనగారి సూక్తి.

ఈ అమృతం నోటితో త్రాగేది కాదు. చెవులతో త్రాగేది. “ శ్రవణ మంగళం ” అని గోపికలన్నారు. నోటితో త్రాగేది కాదు కాబట్టి యెందరు త్రాగినా యెంగిలి కాదు. దేవలోకంలోని అమృతం మాదకమే కాని మోదకం కాదు. ఆ అమృతం పుణ్యక్షయం చేస్తుంది కాని, పాపక్షయం చేయదు. శ్రీ నరసీ మోహతా అన్నారు. “ ధోయీ బురా ఈ పాప్నీ – గంగా బహే భే ఆప్ నీ ” పాప కల్మషాలను ప్రక్షాళనం చేసే కోసం స్వామీ ! నీ భక్తి గంగ ప్రవహిస్తుం ”దని.

భాగవతము పరమహంస సంహిత. “ శ్రీ మద్భాగవతే పారమహంస్య సంహితాయాం వైయాసిక్యాం ” అని ప్రతిస్కంధం చివరిలో పుష్పికలో మనం చదువుకొంటున్నాము. పరమహంస గాథలు, బోధలు యిందులో వర్ణింపబడ్డాయి. శుకుడు, నారదుడు, వ్యాసుడు, కపిలుడు, ధ్రువుడు, విదురుడు, మైత్రేయుడు, సతీ దేవి, శంకర స్వామి, పృథు చక్రవర్తి, ఋషభ దేవుడు, జడ భరతుడు, అంగిరసుడు, ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి, అంబరీషుడు, శ్రీరాముడు, రుక్మిణి, వసుదేవుడు, సుధాముడు, దత్తాత్రేయుడు, ఉద్ధవుడు, గోపికలు, శ్రుతదేవుడు యీ మొదలైన వారంతా పరమహంసలు.

శ్రీ కృష్ణుణి సంగతి సరేసరి. పరమహంసలకు పరమహంస.

“ పరమహంసాస్వాదిత చరణకమల చిన్మకరందుడు. ” పూర్ణ బ్రహ్మసనాతనం. పూర్ణ పరబ్రహ్మము. “ గూఢం పరమబ్రహ్మ మనుష్య లింగం ” కృష్ణస్తు భగవాన్ స్వయమ్ ” అని భాగవతమే చెప్పింది.

భాగవతము పరమహంసల శాస్త్రము. “ అస్మిన్ పారమహంస్యమేక మమలం జ్ఞానం పరం గీయతే ” – దీనిలో అద్వితీయ పరమహంస జ్ఞానము చెప్పబడింది. “ వస్త్వద్వితీయం తన్నిష్ఠం – కైవల్యైకప్రయోజనమ్” భాగవత ప్రతిపాద్య వస్తువు – అద్వితీయ బ్రహ్మ వస్తువు. ఏకమాత్ర “ శ్రీ కైవల్య పద ” ప్రాప్తి దీని ప్రయోజనము.

భాగవతము పరమహంసల ద్వారా ఉపాసింపబడేది. పరమ హంసలైన వారికి శ్రవణ ప్రియమైంది. పరమహంసల ద్వారా శ్రవణం చేయదగింది. పరమహంసలు కాగోరే వారి ద్వారా శ్రవణం చేయ బడ్తాండేది. పరమహంసలైనవారు తమ పరమహంస నిష్ఠను స్థిరీకరించుకొనే కోసం దృఢాపరోక్ష సిద్ధికోసం శ్రవణం చేస్తూండేది. చెప్పినవాడు శుకుడు పరమహంస. విన్నవాడు పరీక్షితుడు పరమహంస అయ్యే కోసం వారం రోజులు శ్రవణం చేసి పరమహంసత్వం పొందినవాడు. చెప్పేవాళ్లకు, వినేవాళ్లకే కాక వ్రాసేవాళ్లకు కూడా భాగవతము పరమహంసత్వం ప్రసాదిస్తుందేమోనని నా ఊహ, నా ఆశ కూడా.

హంస నీటిని వదిలి పాలను స్వీకరిస్తుంది. పరమహంస జడాన్ని వదిలి చైతన్యాన్ని స్వీకరిస్తాడు. జడత్వబుద్ధిని బాధించి సర్వత్రా అతడు చిన్మయ భావాన్ని గ్రహిస్తాడు. “ పురుష ఏవ ఇదగ్ం సర్వం ” అని పురుష సూక్తం చెప్పింది. “ ఇదంతా పరమ పురుషుడే ” నని వేదం చెప్పగా, జడం చైతన్యం అని రెండెక్కడివని ? జీవుని దృష్టిలో జడబుద్ధికాని – ఈశ్వరుని దృష్టిలో అంతా తానే. సర్వాత్మ భావ సంపన్నుడే పరమ హంస. ఆకారభ్రాంతిని, వికారభ్రాంతిని, ప్రకారభ్రాంతిని అదిష్ఠాన దృష్టితో బాధించినప్పుడు ఉండేది ఒకే ఒక సచ్చిదానంద బ్రహ్మ వస్తువు మాత్రమే.

" మాయా మాత్రమిదం ద్వైతం – అద్వైతం పరమార్థః " భాగవతము యీ తత్వాన్ని ప్రతిచోటా ప్రతిపాదించింది. " సర్వము తానె యైనాడు. అఖిల రూపములు తన రూపమైనాడు ". " హరిమయము కాని ద్రవ్యము పరమాణువు లేదు " అంటూ.

జడభరతుని విషయం చెబుతూ భాగవతంలో " అచ్చట విప్రసూనుడు భయం బొకయించుకలేక జంపంగా వచ్చినవారి యందు కరవాలము నందును కాళి యందు దానచ్యుత భావముంచి ".

నరకబడే జడభరతుడు, నరక బూనిన వృషలరాజు, నరికే కత్తి అంతా పరమాత్మే. కల్పిత నామరూపదృష్టిని బాధించి అధిష్టాన నిర్విశేష సత్తా మాత్ర బ్రహ్మదృష్టి కలవాడే పరమహంస. స్వప్న త్రిపుటి స్వప్న సాక్షిలో కల్పింపబడినట్లు యీ జాగ్రత్త్రిపుటి సర్వసాక్షి పరబ్రహ్మంలో కల్పింపబడింది. ఇదే సుదర్శనం. ఈ సుదర్శన సంపన్నుడే (కలవాడే) పరమహంస.

" ప్రతి నిమిషము పరబ్రహ్మంబు వీక్షించి మది చొక్కి వెలుపల మఱచువాడు " శుకుడు పరమహంస, వెలుపల మఱచువాడు. ఆయనకు నామ రూప దృష్టి లేదు. ఆయనది కల్పిత దృష్టి కాదు, అధిష్ఠాన దృష్టి. నామరూప దృష్టి కాదు, వస్తు దృష్టి. ఆరోప దృష్టి కాదు, స్వరూప దృష్టి.

" నిమిషార్థం న తిష్ఠంతి – వృత్తిం బ్రహ్మమయీం వినా !
యథా తిష్ఠంతి బ్రహ్మాద్యాస్సనకాద్యాశ్శుకాదయః !! "

దేనికైనా చ్యుతి వుంది కాని, స్వరూపానికి చ్యుతి వుందా ? వృత్తి నిరావణం కావడమే తరువాయి – స్వరూప బ్రహ్మనిష్ఠ సిద్ధించే వుంది. భ్రాంతి ఉడిగితే చాలు బ్రహ్మము బట్టబయలు.

" శుకుడు గోచియు లేక పై జనఁజూచి, తోయములందు
లజ్జకుఁ జలింపక, చీరలొల్లక, చల్లులాడెడి దేవక
కన్యకలు " హా శుక " యంచు వెన్కఁ జనంగ వ్యాసుని జూచి
యంశుకములన్ ధరించి సిగ్గున స్రుక్కిరందఱు ధీనిధీ " (1-44)

శుకుడు స్వయంగా నిర్వికారుడు. అంతే కాదు – ఆయన్ని చూచినవారు కూడ నిర్వికారులే. అది ఆయనలోని విశేషం. అందుకే శుకుడు శుకబ్రహ్మ అయినాడు. పరమహంసలు పసిపిల్లలూ ఒకటే. వారికి దేహాభిమానం లేదు. ఒక అవధూతను చూచి యెవడో ఒకడు " ఏమయ్యా! గుడ్డ కట్టుకోరాదా !" అని అడిగాడట. " గోనె సంచికి పైన ముసుగు కావాల్నా " అని ఆయన అన్నాడట.

దిగంబరంగా శుకుడు పోతూంటే దిగంబరంగా స్నానాలు చేస్తూండే దేవతా స్త్రీలు దేహభావం మరిచి అట్లే స్నానాలు చేస్తున్నారట. వెంట వెంట " మహాభీతి – హాకుమార " అంటూ, వ్యాస మహర్షి వచ్చాడు. ఆయన్ను చూచి ఆ స్త్రీలు ఆదర బాదర వస్త్రాలను చుట్టుకొన్నారు. ఆయనకు ఆశ్చర్యం వేసింది. " తన కొడుకు పదారేండ్ల పడుచువాడు, వాన్ని చూస్తే సిగ్గులేని వీళ్లు, ముసలివాణ్ణి కదా – నన్ను చూస్తే వీరికి సిగ్గు కల్గిందే ! ఏవమ్మా ! ఏమిటిది ? " అని అడగనే అడిగాడు.

అయ్యా, ఆయనెక్కడ ? నీవెక్కడ ? " స్త్రీ పుంభిదా నతు సుతస్య వివిక్త దృష్టేః " బ్రహ్మచారి, బ్రహ్మజ్ఞాని. ఆయనకు స్త్రీ పురుష భేదమే లేదు. వివిక్త దృష్టి, వేషాలను చూచేవాడు కాదు, వేషధారిని చూచేవాడు. సామాన్యుడు వేషాన్ని చూస్తాడు. జ్ఞాని వేషం వేసుకొన్నవాన్ని చూస్తాడు. స్వామీ ! ఇలా అన్నామని అనుకోకండి. నీవు ముసలివానివైనా నీ మనస్సు ముసలిది కాలేదే! బాబూ ! నీవు రుచిమరిగిన పులివి, నమస్కారం. నర రక్తం రుచిమరిగిన పులి మానవసంచారం వున్న చోట్లలోనే మసలుతూంటుంది. మనది సజాతి. ఆయనది బ్రహ్మజాతి. సజాతిలో సిగ్గు వుంటుంది, కాని విజాతిలో సిగ్గుకు తావుండదు. "

" పుత్రాదిచ్ఛేత్పరాజయం – శిష్యాదిచ్ఛేత్పరాజయం " వ్యాసుల వారికి ఆనందమూ కల్గింది. ఆందోళనా కల్గింది. తనకంటే తన కొడుకు

గొప్పవాడంటే - తనకంటే తన శిష్యుడు గొప్పవాడంటే, యే తండ్రి సంతోషించడు ? యే గురువు సంతోషించడు ?

వడలూరు రామలింగస్వామి వుండే కాలంలో ఒక అవధూత దిగంబరుడుండే వాడట. వచ్చే పోయే మనుషులను చూచి " కుక్క పోతూంది, గాడిద పోతూంది, పంది పోతూంది, పాము పోతూంది " అంటూండేవాడట. " పిచ్చివాడులె "మ్మని అందరూ అనుకొనేవాళ్లు. ఒకరోజు రామలింగస్వామి వచ్చినారు. అవధూత ఆదర బాదర గుడ్డ కట్టుకొన్నాడు. " ఇందరిని చూచినప్పుడు లేని సిగ్గు యిప్పుడు యీాయన్ను చూస్తే వచ్చిందా ? " అని అడిగారు. కుక్కలను పందులను చూస్తే యేమి సిగ్గు ? మనిషి వచ్చాడు కాబట్టి సిగ్గు. సజాతిలో సిగ్గు గాని, విజాతిలో సిగ్గేముంది ? " వ్యాసులవారూ నీ కుమారునిది బ్రహ్మజాతి. మనది మానవజాతి, తెలిసిందా ?

(పూజ్యశ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారి శతజయన్తి సందర్భంగా)

ఆశ్రమ అన్నదానానికి ఈ క్రింది వారు నిధిగా పైకం ఇచ్చినారు

(1). వై.మణి భూషణమ్మ .తల్లిపేర, (సంతపేట, నెల్లూరు) రూ.40,000-

(2). " " అన్న పేరిట " రూ. 30,000/-

(3). " " తన పేరిట " రూ. 30,000/-

(4). ఎస్.జయగోపాల్ శెట్టి (శ్రీపెరంబుదూరు) తమిళనాడు రూ. 30,000-

(5). అన్నంబాకం సత్యవతమ్మ (పునబాక),
భర్త : కీ॥శే॥ చంద్రశేఖర్‌రెడ్డి పేరిట రూ. 15,116/-

(6). పుత్తేరి రామసుబ్బమ్మ (బత్తిరెడ్డి భార్య) పునబాక రూ. 15,116/-

(7). బొమ్మిరెడ్డి శాంతమ్మ (రామన్నపాళెం) రూ. 10,000/-

మానవుని వారసత్వము

- శ్రీ స్వామి చిన్మయానంద

తెలుగు అనువాదం - శ్రీమతి లక్ష్మి

స్వాతంత్ర్యము అన్నది మానవునిలోని ప్రధాన తత్త్వం. చిన్న చిన్న సుఖాలకోసం ప్రపంచంపై బానిసవలె ఆధారపడకుండా తప్పించుకున్నప్పుడే అతడు సంపూర్ణంగా స్వతంత్రుడౌతాడు. ఇతరులు వేసవిలో సుడిగాలికి ఎగిరే ఎండుటాకులవలె బాహ్యప్రపంచం చేసే సవాలును ఎదుర్కోలేక అటు యిటు కొట్టుకొని పోతూవుంటారు.

ప్రపంచంలోని భోగవస్తువులు బూటకపు మెరుపులను, అబద్ధపు సుఖాలను చూపిస్తాయి. శరీరవాంఛలకు సంబంధించిన ఈ పిలుపుకు లొంగిపోకుండా ఇంద్రియ నిగ్రహం అలవరచుకోవటమే మానవుని యొక్క గొప్పతనం. అటువంటి సంపూర్ణ మానవుడు జీవిత సమరంలో, మహాసాగరం మధ్య దీపస్థంభం వలె సంక్షుభిత తరంగాల తాకిడికి తట్టుకొని చెదరక నిలబడగలడు. ఈ స్వతంత్ర జీవిత రహస్యాన్ని తెలుసుకోలేక మనం నడిసముద్రంలో నిర్లక్ష్యంగా వదిలివేయబడిన పడవవలె స్థూల ప్రపంచపు మార్పులమధ్య కలత పొందుతున్నాము. పరిపూర్ణత అనే ప్రశాంతమైన రేవు చేరాలంటే నడిసముద్రంలో తప్పిపోయిన నావికుడవలంభించే పద్ధతినే మనంకూడా అనుసరించాలి.

మానవుడు సహజంగా దివ్యుడవటం వల్ల ఆదివ్యవాణి మన అందరి హృదయాలలోనూ ఉన్నది. ఐనా జీవితంలోని ఒడిదుడుకుల నెదుర్కునేటప్పుడు ఆ అంతర్వాణివైపు మరలే మార్గాన్ని తెలుసుకోలేక పోతున్నాము. వేదాంత గ్రంథాలు అసలైన ఎల్లప్పుడూ సరియైన మార్గాన్నే చూపుతూ వుంటాయి. నావికుడు దిక్సూచిపైనే ఆధారపడి ముందుకు సాగిపోతూ ఉంటాడు. అట్లే మనం కూడా వేదాంత గ్రంథాలపై విశ్వాసం

వుంచి దానిని భక్తి శ్రద్ధలతో అనుసరించి, శాంతి, సంపూర్ణత్వాల ఔన్నత్యాన్ని చేరేవరకు మన జీవిత నౌకను సరియైన మార్గంలో నడుపుకోవాలి.

ఈవిధంగా మానవుడు తనచుట్టూ అవరించి వున్న అశాంతిని జయించగలిగిననాడు ఈ స్థూల ప్రపంచపు కలతలేవీ అతనిని స్పృశింప జాలవు. ప్రపంచం అతనిని అనుభూతులు లేని బడమైన ' రాతి విగ్రహం' అనీ ఆ 'విగ్రహం మెడలో పూలమాల వేసినా, తలపై కాకి వ్రాలినా " భేదం గుర్తించలేడనీ తలచవచ్చు. అతడు ప్రపంచ వ్యవహారాల ఎడల చూపే ఉపేక్షను నిర్లక్ష్యంగా భావించి ప్రపంచం అతనిని నిందించి విమర్శిస్తూ ఉండవచ్చు. అతడు మహోత్కృష్ట స్థానాన్ని సాధించాడనే నిజాన్ని అజ్ఞానంవల్ల తెలుసుకోలేక మనం అటువంటి భావాలను అతని ఎడల వ్యక్తం చేస్తాము. ఐతే అటువంటి మానవుడు బొత్తిగా రాగద్వేషాలు లేనివాడని మనం అనుకుంటే మాత్రం అది నిజం కానేరదు. మనో వికారాలన్నీ అతడు మనవలెనే అనుభవిస్తాడు. కాని ఆ భావాలు తనను అణచివేయకుండా కాపాడుకోగలగటమే అతడి ప్రత్యేకత. ఇతరుల ఎడల కరుణ, సానుభూతి వ్యక్తం చేయటం సద్గుణమే. కాని ఆమనోవికారాలకు లొంగిపోతే అవికూడా మనను అధఃపాతాళానికి అణగత్రొక్కి భౌతికంగానూ, ఆధ్యాత్మికంగానూ కూడా పురోగమనానికి ప్రతిబంధకం అవుతుంది. అనుభూతులు కలిగివుండటం మానవునికి అలంకారమైతే, వాటికి లొంగిపోవటం అతడి వ్యక్తిత్వానికే గొడ్డలిపెట్టు.

మన పూర్వీకులైన ఋషులు ఈ విధంగా మానసికమైన గొప్ప శక్తిని సంపాదించి జీవితపు పెనుతుఫానుల మధ్య హిమవన్నగంవలె స్థిరంగా నిలువ గలిగారు. మానవజాతి అనుభవిస్తున్న బాధలు చూసి వారి హృదయాలు కరుణతో కరగిపోయాయి. ఐనా, వారు ఆ అనుభూతులకు లొంగక, ఆ ఉన్నతాదర్శాల రాచబాటలో ధైర్యంతో తలఎత్తుకొని, ప్రశాంతంగా నడవగలిగారు. ఒక వ్యక్తి అనిశ్చలమైన జీవితపు సుడిగుండాల మధ్య చిక్కుకుని కలతపడవచ్చు. కాని, జీవితంలో ఒక ఉన్నతాశయాన్ని నిర్ణయించుకొని దానిని సాధించటానికే, తనలోని క్షుద్రమైన ఉద్రేకాలను విడిచిపెట్టి తన వ్యక్తిత్వాన్ని ఉద్ధరించుకోగలిగిన నాడు ఆ ఆదర్శాల ఔన్నత్యం వల్ల అతడీ అలజడి నుండి బయటపడి ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగించగలడు. అందువల్ల, జీవితాన్ని జయించటంలో గల రహస్యం హృదయావేదనలను విడిచిపెట్టి వాటి కతీతంగా బుద్ధిని మలుచు కోవటంలోనే వుంది. జీవితంలో జయం పొందగోరే మానవుడు తన వివేకము, విచక్షణాజ్ఞానము ఉద్రేకపు ప్రవాహంలోపడి కొట్టుకుపోనివ్వడు.

మనం కూడా ఒక ఉన్నతాశయాన్ని సాధించటానికి జీవితాన్ని అర్పించి, మన నమ్మకాలకు అనుగుణంగా జీవించటానికి తగిన ధైర్యం అలవరచుకుందాము. నిజాయితీగా, ఆత్మ విశ్వాసంతో జీవించగలిగితే అది ఒక వ్యక్తి జీవితానికి ఒక విధమైన ప్రశాంతతను కలిగిస్తుంది. ప్రతి వ్యక్తి ఆ విధంగా తన జీవితానికొక అర్థం ఏర్పరచుకోగలిగితే ఆ ప్రభావం వల్ల దేశానికే ప్రఖ్యాతి లభిస్తుంది.

(పూజ్యశ్రీ చిన్మయానంద (చిన్మయ మిషన్ సంస్థాపకులు) స్వాములవారి శతజయన్తి సందర్భంగా)

ఆశ్రమ శివాలయానికి ఈక్రిందివారు పైకం ఇచ్చినారు

(1). టి.అనంతలక్ష్మి (అద్దంకి, ప్రకాశం జిల్లా)

భర్త : కీ॥ శే॥ రామకోటేశ్వరరావు పేరిట నిత్య పూజానిధికి రూ. 50,000/-

(2). ఎల్.శారదమ్మ (రామారెడ్డిపాళెం, మిాంజూరు)

భర్త :: కీ॥శే॥ సుబ్రహ్మణ్యం రెడ్డి పేరిట నిత్య పూజానిధికి రూ. 10,000/-

(3). ఉప్పల రామకృష్ణరావు (బెల్గాం, కర్నాటక) రూ. 21000/-

సులభాజనక సంవాదం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య

" యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్ ! "

" ఇందులో ఏది ఉన్నదో, అదే ఇతరత్రా ఉన్నది. ఇందులో లేనిది ఎందులోనూ ఉండదు " అని మహాభారతము యొక్క ప్రశస్తి కీర్తింపబడింది.

పంచమవేదమైన మహాభారతం విజ్ఞాన సర్వస్వంగా గణుతి కెక్కింది. " వేద " మనే శబ్దానికి 'జ్ఞానం' అని అర్థం. మన గ్రహించవలసిన సర్వ విషయాలకూ చెందిన జ్ఞానం మహాభారతంలో నిక్షిప్తమై వున్నది.

జ్ఞానం లౌకికమనీ, అలౌకికమనీ రెండు రకాలు. "జ్ఞానాదేవ చ కైవల్యం " అన్నప్పుడు ఆధ్యాత్మిక జ్ఞానం వల్లనే మోక్షం అని గ్రహించాలి. అలౌకిక జ్ఞానమే ఆత్మజ్ఞానం. అపరావిద్య వల్ల లౌకికజ్ఞానం, పరా విద్యా వల్ల అలౌకిక ఆత్మజ్ఞానం కల్గుతాయి.

సర్వయోగ సమన్వయాత్మకమైన ఆధ్యాత్మికజ్ఞానం భీష్మపర్వంలోని 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకూ 18 అధ్యాయాలలో విశదీకరింపబడింది. ఈ భాగాన్నే భగవద్గీత అంటారు. అది ఉపనిషత్సారంగా పేరొందింది.

ఇంకా పలుచోట్ల భారతంలో ఆధ్యాత్మికజ్ఞానం వివరించబడింది. " ససత్సుజాతీయం " ఇత్యాదిగా గల ఘట్టాలన్నీ ఆత్మవిజ్ఞాన బోధకాలే. అట్టి ఘట్టాలలో శాంతిపర్వంలోని 'సులభాజనక సంవాదం ' ముఖ్యాతి ముఖ్యమైనది. మహాయోగిని అయిన సులభకు గల జ్ఞానాన్ని గురించి తలపోస్తే ఆశ్చర్యం కల్గుతుంది.

వేదకాలంలో పురుషులవలె స్త్రీలు గూడా వివిధ విద్యల్లో ఆరితేరివుండే వారు. ఇందుకు వేదాలే నిదర్శనం. వేదబుక్కులను స్వయంగా దర్శించిన మహిళామణుల పేర్లు గూడా వేదవాఙ్మయంలో వినవస్తాయి.

'బృహదారణ్యకం' మొదలైన గ్రంథాలలో గార్గి మున్నగువారి వేదాంత విద్యా వైదుష్యం వ్యక్తీకృతమయింది. సులభ గూడా ఆ కోవకు చెందిన స్త్రీ రత్నమే.

తత్త్వవేత్తగా ప్రసిద్ధుడైన జనక చక్రవర్తిని ఆమె సభలో ప్రతివచనరహితుణ్ణిగా చేసిన రమణీయ ఘట్టం శాంతిపర్వంలోని 'సులభాజనక సంవాదం '. సకల విద్యానిధులైన వనితామణులకు నెలవైన పవిత్ర భారతావనిలో కాలక్రమాన మధ్య యుగాలలో స్త్రీలు లౌకిక విద్యాభ్యాసానికి సైతం నోచుకోని దుఃస్థితి కల్గడం విచారకరం.

ఇప్పుడు సులభాజనకుల సంభాషణ లోని విశేషాలను తెలుసుకొందాం.

జనకుడు మిథిలాధిపతి. ధర్మధ్వజుడుగా ప్రశస్తి పొందాడు. వేదశాస్త్రాదులలో ప్రవీణుడు. సాటి విజ్ఞులందరూ ఆయనను ఆదర్శంగా భావించేవారు.

అది ధర్మయుగం. ఆ రోజుల్లో యోగవిద్యలో నిపుణులైన ఒక మహిళామణి ఉండేది. ఆమె పేరు సులభ. ఆమె సన్న్యాసిని. నేల నలువైపులా సంచరిస్తూ ఆ యోగిని తన పరివ్రాజికాత్వాన్ని సార్థకం చేసింది.

సులభ జనకుణ్ణి గురించి విన్నది. ఆయనను చూడాలనుకొన్నది. యోగశక్తితో యుక్త వయస్సు కల మహారూపవతిగా మారింది. మిథిలకు పోయింది. భిక్షాటన వ్యాజంతో పోయి జనకచక్రవర్తిని చూచింది. జనకూడా సుకుమారిని చూచాడు. " ఎవరీమె ? ఎక్కడ నుండి వచ్చింది ? " అని ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆమెకు స్వాగతం చెప్పాడు. ఆతిథ్యం సమకూర్చాడు.

ఆ తరువాత వేదాంతులందరూ చేరిన సభలో కొలువుదీరిన జనకుని మనస్సులో ఆమె యోగశక్తితో ప్రవేశించింది. అతని చూపులను తన చూపులతో బంధించింది.

జనకు డామె తీరు చూచి ఇలా అన్నాడు. " నీవెవరు ? ఎవరి

ఎల్.ఐ.సి.వారు శ్రీశుకబ్రహ్మాశ్రమ కంటి ఆసుపత్రికి లేజర్ మిషన్ ఇచ్చుట (కుడి నుంచి) ఎల్.ఐ.సి. చీఫ్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్‌బాబుగారు, డా॥ కొండారెడ్డిగారు, డా॥ వేణుగోపాలాచారిగారు , అటవీశాఖామాత్యులు గౌ॥ బి. గోపాలకృష్ణారెడ్డిగారు, పూజ్యశ్రీ స్వాములవారు, డా॥ రాఘవాచారిగారు, డా॥ పెంచలయ్యగారు, డా॥ ప్రసన్నకుమార్ రెడ్డిగార్లు.

అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా శ్రీవిద్యాస్వరూపానందస్వాములవారి ప్రసంగం
ప్రక్కన మంత్రివర్యులు శ్రీగోపాలకృష్ణారెడ్డిగారు, మరోవైపు యోగాచార్యులు మార్కండేయులుగారు

అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా అటవీశాఖామాత్యులు గౌరవనీయులు
శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డిగారు ఉపన్యసించుట. ప్రక్కన శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఈ.ఓ. రామిరెడ్డిగారు

అప్పాయాగ్ లేజర్ మిషన్ ప్రారంభోత్సవానికి వస్తున్న గౌ॥ బి.గోపాలకృష్ణారెడ్డిగారిని(అటవీ శాఖామాత్యులు)
ఎల్.ఐ.సి. నెల్లూరు డివిజన్ సీనియర్ చీఫ్ మేనేజర్, మరియు ఎల్.ఐ.సి. అధికారులు ఆహ్వానించుట

అప్పాయాగ్ లేజర్ మిషన్ ప్రారంభోత్సవానికి కంటి ఆసుపత్రికి వస్తున్న మంత్రి గారు,
శ్రీస్వాములవారితో కంటి ఆసుపత్రి డాక్టర్లు ప్రసన్నకుమార్ రెడ్డి, ఎ.రాఘవాచారి,
పెంచలయ్య, ఆశ్రమ మేనేజర్ ఈశ్వర్

ప్రపంచ యోగా దినోత్సవానికి శ్రీకాళహస్తి పట్టణంలో
ర్యాలీకి బయలుదేరిన విద్యార్థులు పౌరులు

ప్రపంచ యోగా దినోత్సవంలో వేదికపై మంత్రిగారుశ్రీ గోపాలకృష్ణారెడ్డిగారితో
యోగాసనాలు ప్రదర్శించిన సాధకులు,

దానవు ? నిన్ను చూస్తే ఉత్తమ జాతికి చెందిన వనితవుగా గోచరిస్తున్నావు. నేను రాజునైనా ముక్తుడను. నాకెలా మోక్షప్రదమైన జ్ఞానం కలిగిందో చెబుతాను. విను.

" మోక్షానికి వైరాగ్యం, వైరాగ్యానికి జ్ఞానం కారణాలు. జ్ఞానంతో జీవుడు ప్రయత్నపరుడై మహత్త్వం పొందుతాడు. అది విముక్తి కల్గిస్తుంది. నేను సంసారంలో ఉన్నా ముక్తుడనే. వేగిన విత్తనం మొలకెత్తదు గదా ! అట్లే నిర్బీజమైన నా జ్ఞానం విషయ సుఖాలలో ప్రవర్తించదు.

పంచశిఖముని నా గురువు. ఆయన బోధతో నేను జ్ఞానినయ్యాను. నా కుడిచేతిపై చందనం పూసేవాణ్ణి. ఎడమచేతిని కత్తితో నరికేవాణ్ణి నేను సమానంగా చూస్తాను. మట్టిపెళ్ళ, రాయి, బంగారం అన్నీ నా దృష్టిలో సమానమే.

జ్ఞానం వల్లనే ముక్తి సిద్ధిస్తుంది. దండ కమండలు కాషాయాదువల్ల ముక్తి కల్గదు. అవి ఉన్నప్పటికీ జ్ఞానముంటేనే మోక్షం. ఛత్రచామరాదులు మోక్షానికి ఆటంకాలు కావు. ధర్మార్థకామాదుల్లో వున్నా నాకు బంధం లేదు. నేను త్యాగమనే కత్తితో ఐశ్వర్యమనే సంకెళ్లను నరికివేశాను.

నేను నీ సంగతి గ్రహించాను. ఇంత సౌకుమార్యం, చక్కదనం, యౌవనం కల్గిన నీకు సన్న్యాసం ఎలా కుదురుతుంది ? కాముకులకు దండాది చిహ్నాలు ఎందుకు ?

నా రాష్ట్రంలోకి, పట్టణంలోకి ఎలా ప్రవేశించావు ? నా హృదయం లోకి ఎందుకు చొరబడ్డావు ? నీవు బ్రాహ్మణివి. నేను క్షత్రియుణ్ణి. మనకు కలయిక ఎలా సాధ్యం ? వర్ణ సాంకర్యం తగునా ? నీవు సన్న్యాసినివి. నేను గృహస్థుణ్ణి. ఆశ్రమ సాంకర్యం యుక్తమా ? నీవు సగోత్రవైతే గోత్ర సాంకర్యం కూడా కల్గుతుంది.

నీ భర్త జీవించి వున్నాడా ? లేక పరదేశం వెళ్ళాడా ? పరస్త్రీ సంగమం వల్ల ధర్మసాంకర్యం సంభవిస్తుంది సుమా !

ఇలా నీవు ఈ దుష్కార్యానికి ఒడిగట్టడం తగునా ? ఒకవేళ నీవు

స్వతంత్రవైనా నీ శాస్త్రజ్ఞానం అపమార్గం పట్టింది. ఈ వేషం నీకు తగదు. నీవు నన్నే కాక ఇక్కడ ఉన్న వారినందరినీ లోబరచుకొనజూస్తున్నావు. విషానికీ, అమృతానికీ పొత్తు కుదరదు. నా దగ్గర నీ ఎత్తులు పనిచేయవు. నీ జాతి వృత్తాదులను స్పష్టంగా చెప్పు ".

ఈ రీతిగా జనకుడు పరుషమైన మాటలతో సులభను తూలనాడాడు. అందుకు సులభ ఏమాత్రం చలించలేదు. ఆమె ఇలా అన్నది.

" రాజా ! నేను అర్థవంతంగా, యుక్తియుక్తంగా, నిస్సంశయంగా, సత్యంగా మాట్లాడతాను. విను.

నీవు నీలో పరమాత్మను చూచితినన్నావు. మరి ఇతరులలో నీకు ఆ పరమాత్మ ఎందుకు కనిపించదు ? నీకు సమదృష్టి సిద్ధించలేదా ? సిద్ధిస్తే " నీ వెవరు ? ఎవరి దానవు ? ఎక్కడి దానవు ? " అని ఎందుకడిగావు?

' ఇది నాది, ఇది నాది కాదు ' అనే ద్వంద్వభావం తొలగిన వారు అడుగదగిన ప్రశ్నలేనా ఇవి ? శత్రుమిత్రుల పట్ల భేదబుద్ధిని కల్గి వుండడం ముక్తుని లక్షణమగునా ? ధర్మార్థకామాలలో ఆసక్తుడైన రాజుకు ముక్తలక్షణ మెలా కల్గుతుంది ? నేను ముక్తుడననే అభిమానం నీకు తగదు సుమా !

తనలో తన్ను చూడడమే ముక్తి. ఇంతకంటే వేరొకటి లేదు.

నీవు భూపాలుడివి. ఒక పట్టణాన్ని అధిష్ఠించి వున్నావు. ఆ నగరంలో ఒక ఇల్లు, అందులో ఒక పడక, ప్రక్కనే ఒక స్త్రీ – ఇలా ఉండేవాడికి ఫలసంబంధం ఎలా లేకుండా పోతుందో చెప్పు ?

రాజు సదా పరాధీనుడు. అతనికి నిగ్రహం, అనుగ్రహం రెండూ వుంటాయి. ఇక స్వేచ్ఛ ఎక్కడిది ? మంత్రుల సభలో వారు చెప్పినట్లు వినేవాడికి స్వాతంత్ర్యమెక్కడిది ?

నిద్రించడానికి కూడా రాజుకు స్వేచ్ఛ లేదు. కార్యార్థులు ఎప్పుడైనా అతని నిద్రకు ఆటంకం కల్గిస్తారు. స్నాన పాన భోజనాదులను ఇతరుల ప్రేరణచే చేసేవాడు రాజు. యాచకులతణ్ణి చుట్టుముట్టి వుంటారు. దానం చేయకుంటే వారితో వైరం తప్పదు. దానం చేస్తే ధనాగారం క్షీణిస్తుంది.

అడుగడుగునా నీకు ఇతరుల పట్ల సందేహం, భయం తప్పవు.

రాజరికంలో సుఖం అల్పం, దుఃఖం అధికం. ఇక శాంతి ఎక్కడిది? నీవు 'నావి' అని భావించే రాజ్యాదులు నిజంగా ఎవరివి ? ఎవరివి కావు ? రాజ్యాధికారం చెలాయించే వారు సత్యధర్మాలను ఎలా పాటించగలరు ?

మిథిలాధిపతీ ! ఇలా నేను నీ రాజరికంలోని దోషాల నెన్నింటినైనా పేర్కొనగలను. నాకు నా శరీరంతోనే సంగం లేదు. ఇక ఇతరులతో సంగం ఎలా ఉంటుంది ? ఎందుకిలా మాట్లాడావు ?

నీవు ముక్తి అంటే ఏమిటో సమగ్రంగా గ్రహించావా ? నాకు సంగం లేదు అన్నావు. మరి ఈ రాజచిహ్నాలతో ఎలా సంగం కల్గిందో చెప్పు. నీకు శాస్త్రజ్ఞానం లేదు. నీవు చదివింది నిజమైన శాస్త్రం కాదు. నీవు పామరునిలాగా రాజాది సంజ్ఞలచే బద్ధుడవు.

నీవు నిజంగా పూర్ణముక్తుడివైతే నేను నీలో ప్రవేశించడం వల్ల నీకు నష్టమేమీ ? యతులు శూన్యంలో ఉండాలి కదా ? శూన్యస్థితిలో ఉన్న నీలో నా ఆత్మను ప్రవేశపెట్టడం వల్ల నీకేమి హాని ? నేను నా చేతులతో, కాళ్లతో, ఇతరావయవాలతో నిన్ను తాకలేదు కదా ? తామరాకులోన నీరులాగా నేను ఏమాత్రం స్పర్శలేకుండా ఉన్నాను. నా స్పర్శ నీకు తెలిసిందా ? ఐతే నీ జ్ఞానం నిర్బీజం ఎలా అవుతుంది ? నీకు అటు గృహస్థ ధర్మమూ లేదు, ఇటు మోక్ష ధర్మమూ లేదు.

ఆశ్రమాలు వేరు, వర్ణాలు వేరు. అందలి అంతర్భాగాలు వేరు. ఇలా వుండగా వాటిలో సాంకర్యం ఎలా కల్గుతుంది ?

నేను నీవన్నట్లు బ్రాహ్మణిని కాను. క్షత్రియజాతి స్త్రీని. నీ కంటే తక్కువ జాతి దాన్ని కాను. నేను మనువంశంలో పుట్టాను. నాపేరు సులభ. నా పూర్వులెన్నో యజ్ఞాలు చేశారు. నాకు తగిన నాథుడు దొరకక మోక్షధర్మం ఆశ్రయించాను.

నాలో కాపట్యం లేదు. నేను పరధనాన్ని అపహరించే దాన్ని కాను. ధర్మసంకరం చేయను. చపలచిత్తను కాను. ఆలోచించకుండా మాట్లాడను. బాగా ఆలోచించే నీ చెంతకు వచ్చాను. నీవేదో గొప్పవాడవని విని చూడాలని

వచ్చాను. నన్ను గౌరవించావు. ఆతిథ్యమిచ్చావు. నీకు శుభం కల్గుగాక ! ఈ దినం ఇక్కడ ఉండి రేపు వెళ్తాను ".

ఇలా సులభ సమాధానం చెప్పగానే జనకుడు నిరుత్తరుడయ్యాడు.

ఈ వృత్తాంతం వల్ల ఆదికాలంలో స్త్రీలు జ్ఞానవిజ్ఞానాలతో ఎంతగా ముందంజ వేసి వుండినారో తెలుస్తున్నది.

కాని మధ్యకాలంలో వచ్చిన శ్రుతివిరుద్ధమైన స్మృతులు ఏ కారణం వల్లనో నానా విధాలైన నిషేధాలు విధించాయి. స్త్రీలకు సమానావకాశాలు లేకుండా చేశాయి. వేదాంతవిద్య అలా ఉండనీ, కనీసం లౌకిక విద్య కూడా వారికి కలగకుండా చేసిన దుఃస్థితి తరువాత భారతావనిలో ఏర్పడింది. ఇది శోచనీయమైన పరిస్థితి.

ఇప్పుడు కాలం మారింది. ఎన్నో సంస్కరణలు వచ్చాయి. లౌకిక విద్యలలో మహిళలు రాణిస్తున్నారు. ఆధ్యాత్మిక విద్యలో కూడా పురోగతి కనిపిస్తున్నది. వ్యాసాశ్రమ స్థాపకులు మహర్షి సద్గురు మలయాళస్వాముల వారు స్త్రీలకు బ్రహ్మవిద్య అవసరమన్న విషయాన్ని ఎలుగెత్తి చాటారు.

వారు తమ ' మలయాళయతీంద్రగీత ' లో స్త్రీ విద్యపై ఒక అధ్యాయం వ్రాశారు. కన్యాగురుకులం స్థాపించి స్త్రీలకు సంస్కృతం, గీత, ఉపనిషత్తులు ఇత్యాదులు బోధించారు. సనాతన వేదాంత జ్ఞానసభల్లో స్త్రీలకు ప్రత్యేక సభ ఏర్పాటు చేసి వారి అధ్యక్షత క్రిందనే వారినే ప్రసంగించేటట్లు కూడా వ్యవస్థ చేశారు. శ్రీస్వాములవారి మార్గదర్శకత్వం మనకు ఎంతైనా అవసరం.

మహాభారతంలోని " సులభాజనక సంవాదం " వంటి ఘట్టాలు మనకు స్ఫూర్తినిస్తాయి. ఆ స్ఫూర్తి నందుకొని ఆధ్యాత్మిక జ్ఞానమార్గంలో మనం పయనించాలి.

---

05 – 07 – 2015 తేది ఆదివారం శ్రీ విద్యాప్రకాశానందస్వామి స్మారక మెడికల్ క్యాంపు శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలనీలోని స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగినది. **8 మంది డాక్టర్లు పాల్గొనినారు.**

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు
(మే సంచిక తరువాయి)

అనువాదం :
పూజశ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : పరమేశ్వరుడు అనగా చిద్రూపుడగు పరమాత్మ జగత్తునకు వివర్తోపాదాన కారణమై యున్నాడని చెప్పుచున్నారు.

రథస్యేంధనం భూరిభూతం మృదం
ఘట స్యాసమాధాయ వైకార్యతః
ఉపాదాన మీశం ప్రపంచస్య తం
గుణం సర్పభాతే రివాహు ర్బుధాః 16

రథస్య = రథమునకు, భూరిభూతం = అధికమైన, ఇంధనం = కట్టెను, ఘటస్య= కుండకు, మృదం = మన్నును, (ఉపాదానమునుగా చెప్పునట్లు జగత్తునకు ఈశ్వరుని పరిణామి ఉపాదాన కారణముగా చెప్పినచో) వైకార్యతః = వికారిత్వదోషము సంభవించును కాబట్టి, బుధాః = జ్ఞానులు (దీనిని), అసమాధాయ = సమ్మతింపక, సర్పభాతేః = సర్ప ప్రతీతికి, గుణం= రజ్జువును (త్రాటిని)వలె, ప్రపంచస్య = జగత్తునకు, తం ఈశం = ఆ పరమాత్ముని, ఉపాదానం వివర్తోపాదానకారణముగా, ఆహుః = చెప్పిరి.

జగత్తునకు భిన్నమైన కారణము లేనందున ఇది భ్రమరూప మైనదని సిద్ధించినది. ఎట్లన, జగత్తునకు జగత్తే కారణమనిన ఇది యసంభవ మగును. ఏదియు తనకుతానే కారణము కాజాలదుగదా ? బ్రహ్మమే కారణమనిన అది నిర్వికారము. ఇక మాయయే కారణమా యన్న అది సత్తలేనిది. అందుచేత రజ్జువునందు ప్రాతిభాసికమగు సర్పము ఏవిధమున ఆరోపితమై అగపడునో అటువలెనే పరమాత్మయందు జగత్తు ఆరోపితమై

యగపడుచున్నదే కాని వస్తుతః లేదని పెద్దల నిశ్చయము.

పరమాత్మ సన్నిధాన కర్తృత్వమూలమున సృష్టి యగుచున్నదని (వ్యావహారిక దృష్టితో) చెప్పినను ఇందు వికారిత్వ దోషమున్నది. అతడు జగత్తునకు ఉపాదాన కారణమై యున్నాడని చెప్పినను సరికాదు. ఏలయన, పాలు పెరుగైనట్లు శివుడే జగద్రూపు డైనాడని చెప్పినచో శివుని పరిణామ్యుపాదాన కారణముగా చెప్పినట్లగును. ఇందుచేత పరమాత్మకు వికారిత్వము, అనిత్యత్వముకలుగును. క్షీర దధి న్యాయమున పూర్వ రూప పరిత్యాగ పూర్వకముగా రూపాంతర ప్రాప్తియందు పరిణామ్యుపాదాన కారణత్వము వర్తించును. మేము దానిని చెప్పుట లేదు. కాని రజ్జు సర్ప న్యాయమున వివర్తోపాదానకారణమును చెప్పెదము. అనగా పగ్గము చెడలేదు. పాము తోపకపోలేదు. ఇట్లు పరమాత్మకు వికారము కలుగలేదు. వికారమగు జగత్తు తోపక పోలేదు. విషమసత్తాన్యథారూప ప్రతీతియే వివర్తమని చెప్పబడును. లేక పూర్వరూపము మార్పునొందకయే మార్పు నొందినట్లు అగపడుట యని భావము. " అప్రచ్యుతపూర్వ స్వరూపస్య (అసత్య) నానాప్రకారాభాసః ఇతి వివర్తః "

అవ : త్రికాలాబాధ్యమగు పారమార్థిక సత్తారూప బ్రహ్మము నందు భావమగు జగత్తు రజ్జుసర్పమువలె ప్రాతిభాసికమై యున్నదని తెలిసినవాడే బ్రహ్మవిద్వర్యుడని తెలుపుచున్నారు.

పారమార్థిక సత్తాయాం సత్తాం యాం వ్యావహారికీమ్
ప్రాతిభాసిక సత్తాం యో వేత్తి స బ్రహ్మవిద్వరః 17

పారమార్థిక సత్తాయాం = త్రికాలాబాధ్యమైన (వాస్తవమగు) బ్రహ్మ స్వరూపమైన సత్తయందు, యాం = ఏ, వ్యావహారికీం సత్తాం = వస్తుతః లేకున్నను అర్థక్రియాకారియై వ్యవహారయోగ్యముగా ఉన్నట్టి

ఘటపటాదిరూపమైన దృశ్య ప్రపంచసత్తగలదో, తాం = దానిని, ప్రాతిభాసిక సత్తాం = అధిష్ఠాన జ్ఞానముచే బాధింపబడునదై తోచుచున్న కాలమున మాత్రమే ఉన్నట్టుండెడి ఆభాసమాత్రమైన రజ్జు సర్పాదుల వంటి సత్తనుగా, యః – ఎవడు, వేత్తి = తెలిసికొనునో, సః = అతడు, బ్రహ్మవిద్ వరః = బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడు.

బ్రహమ్మము జగత్తునకు కారణమై యున్నది. జగత్తు కార్యమై యున్నది. కావున కారణమైన బ్రహ్మముయొక్క లక్షణము కార్యమైన జగత్తునందు ఉండవలెగదా ? యనిన, కారణమునందు ఉండు లక్షణము కార్యమునం దుండవలయుననెడి ఈ నియమము సర్వత్ర వర్తింపదు. ఎట్లనగా కారణమైన క్షీరమునందుండు మధురత్వము కార్యమగు దధి (పెరుగు) యందు కనబడుటలేదు గదా ? ఒకవేళ ఔపచారికముగా పరమాత్మ జగత్కారణమని చెప్పినను ఈ జగత్తు పరమాత్మవలె సత్యము కాదు. సర్పమునకు రజ్జువు కారణమైనను రజ్జువువలె సర్పము సత్యము కాజాలదు. అవివేకముచేత అసజ్జడదుఃఖాత్మకమై విజాతీయమైన వ్యావహారిక సత్త తోచును. అయితే శ్రుతి యుక్తి అనుభవములచే విచారింప అధిష్ఠాన పారమార్థిక సత్తా స్వరూపమగు బ్రహ్మమునందు ఇదెల్లయు స్వప్నమువలె ప్రాతిభాసికమై యున్నదని తెలియును. ఇది ఎఱిగినవాడు బ్రహ్మవిదులయందు శ్రేష్ఠుడు. **17**

ఆశ్రమ కంటి ఆసుపత్రికి “ త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు ” కు ఈక్రింది వారు పైకం పంపినారు

(1) ఉప్పల రామకృష్ణారావు (బెల్గాం, కర్నాటక రాష్ట్రం)రూ. 21,000/–

(2). సిరిపురం యోగేశ్ కుమార్ రూ. 10,000/–

(ఉన్నత గార్డెన్స్, థానా, మహారాష్ట్ర)

ఆచార్య దేవో భవ

–ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

మాతృదేవో భవ, పితృదేవో భవ అని ఎవరయినా అంటే విన్న వాళ్ళు వెన్వెంటనే ‘ ఆచార్యదేవో భవ ’ అని జోడిస్తారు. ఇవన్నీ వైదిక సూక్తులు. ప్రసిద్ధ ఉపనిషత్తులలోని పవిత్రవాక్యాలు.

ఆచార్య, ఉపాధ్యాయాది శబ్దవిశేషార్థాలు –

ఆచార్య శబ్దానికి అర్థం దృష్ట్యా ప్రాముఖ్యమెంతో వుంది. ‘ ఆచారం గ్రాహయిత్వా చినోత్యర్థోవా చినోతి బుద్ధిమపి వా ’ అని నిరుక్తం. ప్రాచీన కాలంలో చదువులంటే వేదాలూ, శాస్త్రాలే. అటువంటి శాస్త్రాదులలో ప్రతిపాదింపబడే అర్థవిశేషాలను తాము అవగతం చేసుకొని ఆచరిస్తూ ఇతరులచే ఆచరింపజేస్తూ మార్గదర్శకుడయ్యేవాడే ఆచార్యుడు. ఇదేగాక మరో వివరణ కూడా లేకపోలేదు – మంత్రవ్యాఖ్యాకృతాచార్యః – మంత్రాన్ని ఉపదేశించేవాడని. వేదంలోనే ఆచార్యశబ్దముంది కనుక ఉపనిషత్తులలో ఆచార్యుడు పూర్వాక్షరం. శిష్యుడు ఉత్తరాక్షరం లాంటివి కనిపిస్తాయి.

ఈ రోజుల్లో ‘ ఆచార్య ’ శబ్దానికి వ్యాప్తి తక్కువ. శ్రీవైష్ణవుల పేర్ల చివర ‘ఆచార్య ’ వినబడుతుంది. మతస్థాపకుల్ని ఆచార్యులుగా భావించడం నియతం. ఇటీవల విశ్వవిద్యాలయాలలో విద్యాబోధన, పరిశోధనల పర్యవేక్షణాదులు నిర్వహించే వారిని ‘ఆచార్యులుగా ’ పిలుస్తుంటారు. సంబోధిస్తుంటారు. ప్రత్యేకించి భాషా సాహిత్యాలను బోధించే వారిని ‘ఆచార్యులుగా’ గుర్తించడం సామాన్యాంశమయింది.

‘ఆచార్య’ శబ్దానికి పర్యాయంగా విస్తృతంగా వాడబడే మాట “ ఉపాధ్యాయుడు ’. ఈ శబ్దంకూడా ప్రాచీనకాలవిద్యావిధానాన్ని సూచించేది. ఆ రోజుల్లో అధ్యయనమంటే వేదాధ్యయనమే. వేదాధ్యయనం గురుముఖతః అభ్యసించవలసిన విధానం. గురువు దగ్గర కూర్చొని శ్రద్ధగా నేర్వదగిన నేర్వవలసిన క్రమం. కాని కాలాంతరంలో ప్రాథమిక పాఠశాలల్లో, ఉన్నత

పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించేవారిని ' ఉపాధ్యాయుడు ' అనడం పరిపాటిగా మారిపోయింది. అలాగే 'అధ్యాపక ' శబ్దం కూడా రూఢిగా నిలిచింది.

ఇక మూడవది 'గురువు'. ఈ శబ్దానికి 'గృణాతి ఉపదిశతి గాయత్ర్యాదిక మితి గురుః ' అని వ్యుత్పత్తి. గాయత్ర్యాది మంత్రోపదేశాలు చేసేవాడని వివరణ. ఇదేగాక 'గురు ' అనే రెండక్షరాలకు రకరకాలయిన వ్యాఖ్యానాలున్నాయి. వాటిలో ప్రసిద్ధమయినది – 'గు' అంటే అంధకారం. 'ర' అంటే అంధకారాన్ని పటాపంచలు చేసే తేజస్సు. బ్రహ్మోపదేశంతో అజ్ఞానాంధకారమయిన చీకటిని నాశంచేసి స్వయం ప్రకాశమయిన పరబ్రహ్మ స్వరూపాన్ని కరతలామలకం చేసేవాడని, 'గు' అంటే గుణాతీతం – 'రు' అంటే రూపాతీతం. నామరూపగుణరహితమయిన బ్రహ్మమునకు సంబంధించిన అంశాలను విశదీకరించేవాడని. ఆలాగే మరోవివరణ 'గ' సిద్ధినిచ్చే గణేశ బీజం. రేఫం అశివాలను అడ్డగించే అగ్నిబీజం – ఉకారం హరి.

మాతృమూర్తిలో ముగ్గురు దేవతలున్నారని – విద్యాబుద్ధులు నేర్పేవేళ సరస్వతి, పోషణ బాధ్యతలలో లక్ష్మి, శుభాలను ఆకాంక్షించడంలో పార్వతి అని భావించినట్లు, 'తండ్రి ' సకల సౌకర్యాలు సమకూర్చడంలో బ్రహ్మ, రక్షణ, పోషణాదులలో విష్ణువు, మందలింపులో శివుడని సమన్వయించినట్లు, శిష్యునిలో మంచిని పెంచేవేళ బ్రహ్మగా, ఆ మంచితనం నిలిపే వేళ విష్ణువుగా, ఆ శిష్యునిలో కనిపించే చెడును నిర్మూలించే వేళ శివునిగా గురువును భావిస్తారు. ఏది ఏమయినా ఈనాడు 'గురువు' అనే మాటకు వ్యాప్తి ఎక్కువ. ఆలయంలోని పూజారి – ' గురుక్కళ్', వృత్తిలో నైపుణ్యం పెరిగేలా సూచనలిచ్చేవాడు గురువు. పెద్దరికంలో ఎదుటివారిని గౌరవించేలా సంబోధించే మాట 'గురూ'.

బిడ్డకు తొలిగురువు తల్లి, ఆపై తండ్రి, తదనంతరం జ్ఞానప్రదానం చేసేవాడు. శరీరప్రదాతలు జననీ జనకులయితే జ్ఞానప్రదాత గురువు. అందుకే తమిళంలో 'ఎళుత్తు అరివిత్తవన్ ఇఱైవన్ ఆవాన్ ' (అక్షర జ్ఞానం కలిగించినవాడు సాక్షాత్ భగవంతుడే) అనే సామెత. తెలంగాణ ప్రాంతంలో వినబడి 'తిరునామాలు ' అనే గేయాలలో – వెలుగు లేని త్రోవ యాలా ? మరుగులేని ఇల్లు యాలా ? గురువులేని జన్మమేలా అనే ప్రశ్నార్థకముంది.

ప్రాచీనులు ప్రతి విషయంలోనూ జాగ్రత్త పడినట్లే గురువు యొక్క లక్షణాలు చెప్పడంలోనూ జాగ్రత్త వహించారు. మాటలాడడంలో నేర్పరులుగా, వివేకవంతులుగా, ఆధ్యాత్మిక జ్ఞానం కలవారిగా, శుచిత్వానికి ప్రాధాన్యమిచ్చే వారిగా, మితభాషులుగా, కామక్రోధవర్జితులుగా, సదాచారులుగా, సమబుద్ధి కలవారుగా, ఆశ్రయింపదగినవారుగా ఉండాలన్నారు. అలాగే శిష్యుల సొమ్ము హరించేవారుగా కాకుండా, శిష్యుల సంతాపాన్ని హరించేవారుగా ఉండాలని సూచించారు.

గురుగీత ఏడురకాల గురువుల గుణగణాలను విశదం చేసింది. అక్షరాభ్యాసం చేయించి లౌకికశాస్త్రాలు నేర్పేవాడు సూచకగురువు. ధర్మాధర్మ బోధకుడు వాచకగురువు. 'పంచాక్షరి ' మంత్రాలను ఉపదేశించేవాడు బోధక గురువు. మారణవశ్యాది తుచ్ఛమంత్రాలు నేర్పేవాడు నిషిద్ధ గురువు. సంసారం అనిత్యమని విశదం చేసి వైరాగ్యం బోధించేవాడు కారణగురువు. సంశయాలను పోగొట్టి జన్మజరామరణభీతి తొలగించేవాడు పరమ గురువు. వీరిలో ఆశ్రయింపదగనివాడు ' నిషిద్ధగురువు '. విద్యార్థి దశలో, బ్రహ్మచర్యంలో 'సూచక గురువు'లే శ్రేష్ఠులు. వార్ధక్యంలో, వైరాగ్యంలో ' పరమ గురువు '. తోడు పెట్టనిదే పాలు 'పెరుగు' కానట్లు గురుబోధ వల్లనే శిష్యుడు చదువులో మెలకువలు తెలుసుకోగలుగుతాడు.

గురుశబ్దానికి పర్యాయంగా అధ్యాపకుడు, అధ్యాపయిత, అనుయోక్త, ఆఖ్యాత, ఆఖ్యాయక, ఆచార్య, ఇష్వుడు, ఉపాద్దేలయ్య, ఒజ్జ, చదువులయ్య, ప్రశాసక, ప్రతిపాదయిత, శాస్త, బోధ, బృహస్పతి, వాగ్మి లాంటివి కనిపిస్తాయి.

ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జూలై నెలలో ఓ.పి.లో 1138 మందికి చికిత్సలు జరగాయి. 132 మందికి కంటి పొరలు ఆపరేషన్లు చేసి లెన్సు అమర్చినారు.

అక్క మహాదేవి అనుభవామృతం



తెలుగు సేత

- డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు

67. జీవాత్మకు అనిమిత్తవైరులైనటువంటి కామాది అరిషడ్వర్గములచే గుణ దోషములు కలుగును. ఈ ఆరు శత్రువుల స్వభావాన్ని తెలుసుకొని సద్గుణవంతులు అవ్వాలి. ఈ ఆరుగుణాలు మానవులను నాశనము చేస్తాయి. వాటిని మంచి మార్గములో అలవరుచుకోవాలి. లింగపూజ చేసే విషయములో కామం (కోరిక) వుండాలి. అంటే శివలింగ పూజా ఆసక్తిని పెంచుకోవాలి. ఇంద్రియములు విషయాదులలో ఆసక్తమైనపుడు కోపము తెచ్చుకోవాలి. పాదోదక ప్రసాదము స్వీకరించేటపుడు లోభముండాలి. గురులింగజంగముల పట్ల ప్రేమ వుండాలి. శివాచారముకన్నా మించినది లేదని అటువంటి శివాచారాన్ని నేను ఆచరిస్తున్నాననే మదముండాలి. కాంత, కనక, కాంచన, మట్టిపై మత్సరముండాలి. ఇవన్నీ మనము ఆచరించినపుడు చెన్నమల్లికార్జునుడు అనుగ్రహించును.

68. మానవులలో అనంతమైన ఆశలు. మనుష్యలను ఆశలు నీడలాగా వెంటాడుచున్నవి. సదాశ, దురాశ. ఈ రెండింటిలో సత్సంగ, సద్గోష్ఠులతో శివవరణుల శివానుభవ వాక్యాలను వినాలని సదాశ పుట్టుతుంది. ఈ ఆశలు చెన్నమల్లికార్జునునితో ఐక్యమైనప్పుడే అంతమౌతాయి. ఆశనాశమైనపుడు " ఆశ దాసత్వం, నిరాశ ఈశత్వము " అనే సామెత ప్రకారంగా ఈశుడై పోతాడు.

69. పరమశివుడు నిరాకారుడు, నిర్గుణుడు. అటువంటి వాణ్ణి ఏ విధముగా పూజించాలి ? నాదాతీతుడైన అతని పూజకు నాద, స్తుతి, మొదలైన శబ్ధములు చాలవు. అదృశ్యమైనవాడు స్పర్శకు అందనివాడు, ఐన శివ స్వరూపాన్ని చేతుల్తో ఎట్లా పూజించాలి. అటువంటి స్వరూపం సకల నిష్కల రూపముగా గురుకరుణతో నా చేతులలో దొరికింది. ఇట్టి స్వరూపాన్ని చూచి నాకు ఆశ్చర్యము అగుచున్నది.

70. ఈ ప్రపంచము రంజనాత్మకమైనది. రకారకాలైన ఆటపాటలు కడుపుకోసమే. కోతికి ఆట మాట నేర్పించడం పొట్టకోసమే. బొమ్మలాట ఆడించేది కూడా పొట్ట కొరకే. ఈ ప్రపంచము యొక్క యంత్రాన్ని నడిపించే వాడు పరమాత్ముడు. అతడు ఆడించినట్లు అన్ని జీవులు ఆడుచున్నవి. " తేన వినా తృణమపి న చలతి " భగవంతుని ఆజ్ఞ లేక గడ్డిపోచ అయినా కదలదు. ఆ విధంగా ఆయన (చెన్నమల్లికార్జునుడు) ఆడించినట్లు ఆడుచున్నాను. మాట్లాడించినట్లు మాట్లాడుచున్నాను. ఆయన వుండమన్న విధంగా వుంటున్నాను. నేను స్వతంత్రరాలును కాదు. అన్నియు ఆయన ఆధీనంలో వున్నది. ఆయన చాలు అనే వరకు నేను వుంటాను.

72. శివున్ని భోళాశంకరుడంటారు. అయితే అతడు భోళాశంకరుడని నమ్మవద్దు. అతడు నమ్మిన భక్తులను పరీక్ష చేస్తాడు. ఎవరు సంపూర్ణముగా తను మన, ధవముతో శరణు పొందుతారో వారికి సేవకుడూ అవుతాడు. బాణుడనుకవి భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన శివుడు అతనికి వెయ్యి చేతులను ప్రసాదించినాడు. మయూర, కాళిదాసు, ఓహిళ, ఉద్భట, మలూహణుల, వీరి భక్తి భిన్నమైనది. వీరందరికి శివుడు ముక్తిని కరుణించినాడు. ఆత్మ సమర్పణ అనే భక్తి వీరందరిలో స్పష్టంగా కనబడుచున్నది.

73. ఆవు తన దూడను ప్రేమిస్తూ పాలను ఇస్తుంది. చిలుకకు ప్రేమతో మాట నేర్పిస్తే మాట్లాడుతుంది. శిష్యునికి తల్లి లాగా వాత్సల్యముతో గురువు విద్య నేర్పించాలి. ఇక్కడ మనస్సే చిలుక, దాన్ని లాలించి మన అదుపులో పెట్టుకోవాలి. మనస్సు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియముల మూలంగా సంచరిస్తుంది. ఇంద్రియ సహాయం లేకపోతే మనస్సు నిర్జీవమౌతుంది. చిలుక లాగా గురువు నేర్పిన విద్యతో జ్ఞానాన్ని సంపాదించుకోవాలి.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(మే సంచిక తరువాయి)

శ్లో ॥ అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతినివర్తతే ।
స దత్వా దుష్కృతం తస్మై పుణ్య మాదాయ గచ్ఛతి ॥
(విష్ణు పురాణము 3-9-15, 3-1168), (మహాభారతము - శాంతి పర్వము 191-12)

అర్థము : ఎవరి యింటినుండి అతిథి భగ్నాశుడై (నిరాశచేత) తిరిగి వెళ్ళిపోవునో, అతడు అతని యొక్క సమస్త పాపములను ఆ యింటి యజమానికిచ్చి, వానియొక్క (యజమాని యొక్క) సమస్త పుణ్యమును స్వయముగా తీసుకెళ్ళును.

శ్లో ॥ పాపం ప్రతిగృహీతారం ప్రదాతురుపగచ్ఛతి ।
ప్రతిగృహీతుర్యత్పుణ్యం ప్రదాతారముపైతి తత్ ॥
(మహాభారతం - అశ్వమేధిక పర్వం పృష్ఠ - 6316)

అర్థము : దాత యొక్క పాపము దానముతోబాటు దానము తీసికొనువాని వద్దకు వెళ్లిపోవును. మఱియు నతని పుణ్యము దాతకు ప్రాప్తమగును. అందువలన పరలోకములో తన హితమును గోరువాడు ఎల్లపుడు దానము చేయుచుండవలెను.

శ్లో ॥ దివాతిథౌ తు విముఖే గతే యత్పాతకం నృప ! ।
తదేవాష్టగణం పుంసస్సూర్యోఢే విముఖే గతే ॥
(వి.పు. 3-11-108)

అర్థము : ఓ రాజా ! దినము నందు అతిథి నిరాశుడై వెళ్ళిపోయిన నెంత పాపము గలుగునో, దానికి యెనిమిది వంతుల పాపము సూర్యుడు అస్తమించిన పిదప గృహస్థుని యింటినుండి అతిథి తిరిగి నిరాశచేత వెళ్ళిపోయినచో గలుగును.

శ్లో ॥ పిధాయతు గృహద్వారం భుంక్తేయో 2 న్న ప్రహృష్టవాన్ ।
స్వర్గద్వారపిధానం వై కృతం తేన యుధిష్ఠిర ! ॥
(మహాభారతము - ఆశ్వమేధిక పర్వము - వైష్ణవ ధర్మ పర్వము - పృష్ఠము - 6355)

అర్థము : ఓ ధర్మరాజా ! ఎవడు భిక్షువుయొక్క లేదా అతిథియొక్క భయముచే తన యింటి ద్వారమును మూసివేసి ప్రసన్న పూర్వకముగా భుజిస్తాడో, వాడు స్వయముగా వాడి స్వర్గద్వారమును మూసివేసుకున్నాడని తెలియాలి.

శ్లో ॥ నిర్వాసయతి యో విప్రం దేశకాలాగతం గృహాత్ ।
పతితస్తత్ క్షణాదేవ జాయతే నాత్ర సంశయః ॥
(మహాభారతము ఆ.ప.వై.ప. పృష్ఠము. - 6329)

అర్థము : ఎవడు దేశకాలానుసారము ఇంటికి వచ్చిన బ్రాహ్మణుని అక్కడ నుండి వెడలగొట్టునో, నతడు తత్క్షణమే పతితుడగును. ఇందులో నిసుమంతయు సందేహము లేదు.

శ్లో ॥ అతిథిర్యస్య భగ్నాశో గృహాత్ప్రతి నివర్తతే ।
పితరస్తస్య నాశ్నంతి దశవర్షాణి పంచ చ ॥
(మహాభారతము ఆ.ప. వై.ప. పృష్ఠము - 6329)

అర్థము : ఎవడి యింటి నుండి అతిథి నిరాశచేత వెళ్ళిపోవలసి వచ్చునో, వాడి పితరులు పదునైదు సంవత్సరములు భోజనము చేయరు.

శ్లో ॥అభ్యాగతం శ్రాంతమను వ్రజంతి, దేవాశ్చ సర్వే పితరో 2 గ్నయ శ్చ।
తస్మిన్ ద్విజే పూజితే పూజితాః స్యుర్గతే నిరాశాః పితరో వ్రజంతి ॥
(మహాభారతము ఆ.ప.వై.ప పృష్ఠము - 6329)

అర్థము : అలసిపోయిన అభ్యాగతుడు ఏ గృహస్థుని యింటికి వచ్చునో, అతని వెంట సమస్త దేవతలు, పితరులు మరియు అగ్నియును విచ్చేయుదురు. ఒకవేళ ఆ యింటి యజమాని చేత అభ్యాగతుడు పూజింపబడినచో, అతనితోపాటు విచ్చేసిన దేవతాదులందరు పూజింపబడిన వారగుదురు. లేక అభ్యాగతుడు నిరాశచేత వెళ్ళిపోవలసి వచ్చినచో, అతనితోపాటు దేవతాదులందరును హతాశులై తిరిగి వెళ్ళిపోయెదరు.

శ్లో ॥ స్వాధ్యాయ గోత్రా చరణమపృష్ట్వా చ తథా కులమ్ ।
హిరణ్యగర్భబుద్ధ్యా తం మన్యేతాభ్యాగతం గృహీ ॥
(విష్ణుపురాణము - 3-11-63)

అర్థము : గృహస్థ పురుషుడు తన యింటికి వచ్చిన అతిథియొక్క అధ్యయనము, గోత్రము, ఆచరణ మరియు కులము మొదలగు విషయములను ఏమియును అడగకుండానే, అతనిని హిరణ్య గర్భుడుగా భావించి పూజించాలి.

శ్లో ॥ అతిథిం నావమన్యేత నానృతాం గిరమీరయేత్ ।
న పృచ్ఛేద్గోత్ర చరణం నాధీతం వా కదాచన ॥
(మ.భా. ఆ.ప. వై.ప. పృష్ఠము - 6355)

అర్థము : గృహస్థ పురుషుడు ఎప్పుడు గూడ అతిథిని అనాదరించగూడదు. అతనితో అబద్ధమాడగూడదు. మరియు అతని యొక్క గోత్రము, శాఖా అధ్యయన విషయంలో ఎప్పుడు గూడ ప్రశ్నించగూడదు.

శ్లో ॥ క్రోధముత్పతితం హిత్వా సుశీలో వీతమత్సరః ।
అర్చయేదతిథిం ప్రీతః పరత్ర హిత భూతయే ॥ (పృష్ఠము -6355)

అర్థము : పరలోకమందు తన కళ్యాణమునుగోరు మనుష్యుడు, తన యొక్క ఉద్భూత క్రోధమును గూడ నిరోధించి, మాత్సర్యమును త్యజించి సౌశీల్యత చేతను మరియు ప్రసన్న పూర్వకముగా అతిథి పూజ చేయవలెను.

శ్లో ॥ చాండాలో వా శ్వపాకోవా కాలే యః కశ్చిదాగతః ।
అన్నేన పూజనీయః స్యాత్ పరత్ర హితమిచ్ఛతా ॥ (పృ. 6355)

అర్థము : పరలోకమునందు తనయొక్క కళ్యాణమును గోరు గృహస్థ పురుషుడు భోజనసమయమునకు యింటికేతెంచిన చాండాలుడుగాని, శ్వపచుకుడు (కుక్కమాంసమును వండుకొని తినువాడు) గాని అతనికి యన్నమును తృప్తిగా పెట్టి సత్కరించవలయును.

ఎల్లప్పుడు, నిరంతరము పరమాత్మధ్యాన తత్పరుడగు బ్రహ్మ నిష్ఠునకు భోజనము నిడిన గలుగు మహత్పుణ్య ఫలమును గూర్చి శాస్త్రము యీక్రింది విధముగా నుడువుచున్నది.

శ్లో ॥ యత్ఫలం లభతే మర్త్యః కోటిబ్రాహ్మణ భోజనైః ।
తత్ఫలం సమవాప్నోతి జ్ఞానినం యస్తు భోజయేత్ ॥
(శ్రీ శివగీత - 11 -43)

అర్థము : కోటి బ్రాహ్మణులకు భోజనం పెట్టినందున మనుజుడు యే పుణ్య - ఫలమును బొందునో, ఆ ఫలం ఒక్క బ్రహ్మ జ్ఞానికి యాహారము పెట్టినందున పొందగలడు.

శ్లో ॥ కుక్షౌ తిష్ఠతి యస్యాన్నం యోగాభ్యాసేన జీర్యతే ।
కులాన్ తారయతే తేషాం దశపూర్వాన్దశాపరాన్ ॥

అర్థము : పరమాత్మ ధ్యానము చేయువారి యుదరమునందు పడిన యన్నము, ధ్యాన నిష్ఠచే జీర్ణమైనచో నా ఫలము అన్నదాత యొక్క పదితరముల మృతి నొందిన వారిని, రాబోవు పదితరముల వారిని గూడ ధన్యుల గావించును.

శ్లో ॥ పరమాద్వైత విజ్ఞాన నిష్ఠస్యైన మహాత్మనః ।
శుశ్రూషా క్రియతే యేన తత్పాదౌ మమమస్తకే ॥
(సూత సంహిత - బ్రహ్మగీత - 4-143 1/2,144 1/2)

అర్థము : ఎవడు పరమాద్వైత పరబ్రహ్మ విజ్ఞాన ధ్యాన నిష్ఠయందుండు మహాత్మున కన్నవస్త్రాదులిచ్చి శుశ్రూష జేయునో ఆ పుణ్యాత్ముని యొక్క రెండు పాదకమలములున్ను నా శిరముపై ధరించు చున్నానని శ్రీ బ్రహ్మదేవుడుపదేశించెను.



జీవుడా! మేలుకో!!

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

శక్తియంతయు నీలో కలదన్నా
లోనిశక్తిని, తెలిసి ధైర్యము కలిగియుండన్నా
నేను అల్పుడ నేను దుఃఖిని
అనుచు ఏల పరితపింతువు
సర్వశక్తులతోను గూడిన

ఆత్మ నేనని శాంతినొందుము.
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురుని చెంత, నిజముగనుగొని లాభమొందన్నా 100

అజ్ఞాని యను జీవుడు తాను అల్పుడనని, కృశించినవాడనని, దుఃఖినని, పరిమితమగు దేహమందు బంధింపబడియున్నానని, పుట్టుచున్నానని, మరణించు చున్నానని, శక్తిహీనుడనని, దుర్బలుడనని యెంచి మిక్కిలి పరితాపము నొందుచున్నాడు. కాని నరుడు దీనుడు బలహీనుడు. అల్పుడు కానేకాదు. అఖండశక్తి, సామర్థ్యములు అతనియందే నిగూఢముగ యున్నవి. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, నిత్యుడు, సనాతనుడు అగు భగవానుడు జీవియొక్క హృదయమందే విరాజిల్లుచున్నాడు. ఆ విషయమెఱుంగక అవివేకి అయి తాను అల్పుడనని యెంచి దుఃఖించుచున్నాడు. అతని ఆ దుఃఖమునకు కారణము అజ్ఞానమే, అవిద్యయే. ఆత్మశక్తిని తెలుసుకొనిన నాడు అతనికి మహత్తర ధైర్యము, పూర్ణశాంతి లభించగలవు.

ఓ మానవుడా ! ఓ జీవుడా ! మేలుకో ! అవిద్యాస్వప్నమునుండి మేలుకో ! పంభూతములచే నిర్మింపబడిన దేహము నీవు కాదు. నీవు ఆ దేహమందు బంధింపబడలేదు. నీయొక్క వాస్తవస్వరూపము నిత్యసత్యమగు ఆత్మయే. ఆత్మస్వరూపుడగునీవు సర్వశక్తిమంతుడు, జగన్నాథుడవు. ఇకనైనను అజ్ఞానమును వదలిపెట్టు. శరీరాభిమానమును త్యజించు. సద్గురుసేవ, మహాత్ములసాంగత్యము అలవరచుకో. అల్పభావములను, దృశ్యభావములను వదలివేసి ఆత్మభావమును, దృక్స్వభావమును వృద్ధిచేసుకో. అఖండధైర్యోత్సాహములతో నిత్యము ధ్యానము, ఆత్మవిచారణ సలుపు. బ్రహ్మానుసంధానతత్పరుడవై గురుకృపను, దైవకటాక్షమును సంపాదించి సాక్షాత్ భగవత్స్వరూపుడవై తేజరిల్లు. అజ్ఞానముచే బాధపడుచు, సంసార సాగరమున మునుకలిడుచున్న జనులకు దైవమార్గమును, పూర్ణశాంతి మార్గమును చూపించు. నీవు తరించు. ఇతరులను తరింపజేయి.



కొన్ని మరుచుట వలన మనశ్శాంతి చేకూరగలదు

- కె. ఈశ్వర్

కొన్ని విషయాలు మరచుటవలన మనిషికి మనశ్శాంతి చేకూరగలదు. ఒక వ్యక్తి నిన్ను అనవసరంగా దూషించాడు. అదేవిషయాన్ని నిద్రలో కూడ కలవరిస్తూ వున్నచో నీ ఆరోగ్యానికి హాని చేయకూరగలదు. జీవితములో కొన్ని సంఘటనలు బాధిస్తూ వుంటాయి. ఆ సంఘటనలు మాటిమాటికి గుర్తు చేసుకుంటూ కుమిలి, కుమిలి, ఏడ్చే వారున్నారు. ఇట్టిస్థితిలో మరుపు చాలా అవసరము. జీవితములో తీపి గుర్తులు కూడా వుంటాయి. తీపి గుర్తులను మననంచేసుకుంటూ చేదు సంఘటనలు మరచిపోవుట అవసరము.

మనస్సు అనవసర విషయాలను గుర్తుంచుకొని అవసరమైన విషయాలను మరచిపోయి మనిషిని అశాంతిలో పడేస్తున్నది. మాపాత స్నేహితులు వచ్చి చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేస్తే నాకు అస్సలు జ్ఞాపకం లేదు రా ! ఒకటి మాత్రం గుర్తుంది. వాడున్నాడే సుబ్బిగాడు నాసైకలుపంచరు చేశాడు. ఎప్పుడురా అంటే 10 సంవత్సరాలయింది రా అని తేదీలతో సహా చెప్పి బాధను వ్యక్తపరచువారున్నారు. మంచిని మరుచుట, చెడును గుర్తుంచుకొనుట ఈ స్థితి నుండి మనిషి మారాలి.

మన కష్టాలలో ఆదుకొన్న వ్యక్తిని గుర్తుంచుకొని కృతజ్ఞత తెలుపుట మానవుని కర్తవ్యముగ భావించాలి. మనకు కష్టనష్టాలు కలుగచేసిన వ్యక్తిని

క్షమించి అంతటితో ఆవిషయాన్ని మరచిపోవుట అవసరము.

ఒకచోట వివాహము చాలా ఘనంగా అట్టహాసంగా, ఎంతో డేకరేషన్‌తో చూచువారందరికి ఆహా అనిపించునట్లు జరిగిందట. రకరకాల పిండివంటలు ఊరేగింపులు అద్భుతమట. ఆర్భాటాలలో పడి పెండ్లి కొడుకు పెండ్లికూతురుకు తాలిబొట్టు కట్టుట మరిచిపోయారట.

పెండ్లిలో ఏదిముఖ్యము. తాలికట్టుట ముఖ్యము. అసలు విషయం మరచి తక్కినవి, ఘనంగా జరిపించిన ప్రయోజనం శూన్యమే గదా !

డ్రైవర్ కారుతోలుతూ బ్రేకు వేయుట మరచిపోతే ఎలా వుంటుందో ఆలోచించండి. బాధించే విషయాలను మరవండి, ఆనందం అందించు విషయాలను స్మరించండి. అప్పుడు మనశ్శాంతి మనవశమయి హాయిగా నిద్రపోయానంటావు. తెలుసుకొనండి. నిద్రలో సమస్తం మరిచారు. మరుపులోనే వుంది మనశ్శాంతి. అని గమనించు.

శాంతిగ వుండదలంచితివా – సర్దుకుపోవడం నేర్చుకో

జై సద్గురు స్వాములవారికి జై – జై శ్రీరామ – వాసుదేవ

వేదాన్తభేరికి వీరు పోషక చందా పంపినారు

(1).	జి.విశ్వనాథన్ (బెంగుళూరు)	–	రూ. 1200/-
(2).	బి.వెంకటరమణారెడ్డి (దేవనగర్)	–	రూ. 1200/-
(3).	ఎన్.వేణుమాధవన్ (హైద్రాబాద్)	–	రూ. 1200/-
(4).	విజయకుమార్ కొమరగిరి (సికింద్రాబాద్)	–	రూ. 1200/-
(5).	బొమ్మిరెడ్డి శాన్తమ్మ (రామన్నపాళెం)	–	రూ. 1200/-
(6).	శ్రీనాథుని నాగేంద్రప్రసాద్ (మధిర)	–	రూ. 1200/-
(7).	గుణ్ణం కృష్ణమూర్తి (సహపురం)	–	రూ. 1200/-

వార్తలు

(01). లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (భారత జీవిత భీమా నిగమన సంస్థ) గోల్డెన్ ఫౌండేషన్ వారు నెల్లూరు డివిజన్ ద్వారా ఆశ్రమ కంటి ఆసుపత్రికి కొనిచ్చిన " అప్పొయాగ్ లేజర్ " మిషనును 21-06-2015 తేది ఆదివారం ప్రపంచ యోగదినోత్సవం నాడు ఉదయం 10.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీశాఖ మంత్రివర్యులు, గౌరవనీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి గారు ప్రారంబోత్సవం చేశారు.

ఆ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీశ్రీశ్రీ స్వాములవారు అధ్యక్షత వహించారు. మంత్రిగారు, ఆసుపత్రి అభివృద్ధికి చేతనైనంత సహకారం ఇస్తామన్నారు. కంటి ఆస్పత్రిలో సహకారం ఇస్తామన్నారు. కంటి ఆస్పత్రిలో ఇది వరకు పనిచేసిన శ్రీ డా॥ వేణుగోపాలాచారి , శ్రీ డా॥ పెంచిలయ్య గారు, ఇపుడు పనిచేస్తున్నశ్రీ డా॥ ఎ.రాఘవాచారి గారు, శ్రీ డా॥ ప్రసన్న కుమార్‌రెడ్డి గార్లు ఆస్పత్రి చేస్తున్న కంటి సేవలను వివరించారు..

(02). 21-6-2015 తేది సాయంకాలం ప్రపంచయోగదినోత్సవాన్ని స్థానికంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమ యోగవిద్యాలయంవారు, స్థానిక యోగ మిత్రులు కలసి పట్టణంలోని శ్రీ ప్రసన్న వరదరాజస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిపారు. ఆ సందర్భంగా ముఖ్య అతిథులుగా గౌరవనీయులు ఎ.పి. ఆటవీశాఖ మాత్యులు శ్రీ బి.గోపాలకృష్ణారెడ్డి గారు, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ రామిరెడ్డి గార్లు ఆశ్రమ యోగాచార్యులు శ్రీ మార్కండేయులు గారు యోగావశ్యకతను గురించి మాట్లాడినారు. ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాములవారు అధ్యక్షత వహించారు. కొద్ది మంది యోగాభ్యాసకులు యోగాభ్యాసం వలన తమకు పోయిన దీర్ఘరోగాలను గురించి వివరించి వివిధ యోగసనాలను ప్రదర్శించినారు. సమావేశానికి మొదట స్థానిక కళాశాల విద్యార్థులు, ఉన్నత పాఠశాల బాల బాలికలు, యువకులు, పౌరులు కలసి పట్టణ నాల్గు వీధులలో యోగ వూరేగింపు చేశారు.

(03). కడపజిల్లా వెంపల్లె మండలం గండిక్షేత్రంలోని శ్రీభూమానందాశ్రమంలో పూజ్యశ్రీశ్రీశ్రీ రామకృష్ణానందస్వాముల వారి శతజయన్తి, ఉత్సవాలు 13 -07-2015 నుండి ఐదు రోజులు చలా ఆనందప్రదంగా చాలా విశేషంగా జరిగినది. పలు ప్రాంతాల నుంచి మహాత్ములే తెంచి ప్రవచనలు చేశారు.

Regd.No. TRP / 123 / 2015-17 August 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-07-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

____________	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టై ఫెండ్	: నెలకు రూ. 1,000/-
____________	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టై ఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

____________	(సామవేదము/అథర్వవేదము-వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
____________	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020

Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,

E-mail : info@kakatiyacement.com

ప్రతి జీవి ఘనీభవించిన ఆత్మస్వరూపమే, దేహముకాదు. కాని చిత్తశుద్ధిలెని కారణముచే మనుజునకట్టి అపరోక్షజ్ఞానము కలుగుటలేదు. కాబట్టి చిత్తశుద్ధికై నిష్కామ కర్మాచరణ తప్పక చేయవలసి యున్నది. ఈశ్వరార్పణ బిద్ధితో కర్తృత్వరహితముగ, నిష్కామముగా కర్మల నాచరించుచు వచ్చిన కొలది కాలములోనే చిత్తము నిర్మలమగును. మలిన రహిత అద్దమందు సూర్య ప్రతిబింబం చక్కగ గోచరించునట్లు, మురికిలెని వస్త్రమునకు రంగు బాగుగా అంటునట్లు నిర్మల చిత్తమునందు ఆత్మజ్ఞానము లెస్సగ అనుభూతమగును. కావున నిర్మల భక్తితోగూడ భగవానుని నామసంకీర్తన, జపము, పూజ, ప్రార్థనాదులను చేయుచుండ వలయును.

-శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వేదాంతభేరి

సెప్టెంబర్ 2015 రూ. 6/-

దైవదృష్టితో చేయు కార్యము బంధముకాదు.

"చిత్తమును దైవమునందు (ఆత్మయందు) నిలిపి మీ మీ కర్తవ్యములను చేసికొనుడు. ఫలమును ఈశ్వరార్పణగావించి, కర్తృత్వమును వదలి ఎన్ని కార్యములనైనను చేయుడు. అట్టి కార్యములచే మీకు బంధము కలుగదు" అని భగవద్గీతలో భగవానుడు ఉపదేశించిరి.

గణితశాస్త్రమునందొక సిద్ధాన్తము గలదు. అదియేది యనిన

"Infinity + Anything = Infinity"

'అనంతమునకు ఏది జోడించినను తుదకు అనంతమే మిగిలును' అని, దైవము అనంతము. జ్ఞానము అనంతము. కాబట్టి దైవదృష్టి గలిగి, ఆత్మ జ్ఞానము కలిగి ఏ కార్యమాచరించినప్పటికిని (అది లౌకికక కార్యమైనను, పరమార్థకార్యమైనను సరియే) తుదకు దైవమే శేషించును. కర్మబంధముకాదు. ఇదియే గీతాచార్యుల కర్మయోగ రహస్యము.

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 సెప్టెంబర్ 2015 సంచిక : 9

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

వేదాంతభేరి

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 సెప్టెంబర్ 2015 సంచిక : 9

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. దుర్గుణ జయోపాయములు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. ఋషుల సేవ అనంతమైనది-శ్రీ సద్గురు మలయాళస్వాములవారు-10
04. అనురాగ అంజనం - శ్రీ రామకృష్ణ పరమహంస - 13
05. ధ్యానములో అనుభవాలు - శ్రీ స్వామి శివానంద - 14
06. జ్ఞానసుధ - శ్రీ శంకరానందగిరి స్వాములవారు - 17
07. దివ్యత్వంతో ఉండు - శ్రీ స్వామి చిదానంద - 21
08. జీవించటంలో ఆనందము - శ్రీ స్వామి చిన్మయానంద - 28
09. ఆచార్యదేవోభవ - డా॥ కె.సర్వోత్తమరావు - 31
10. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి -35
11. శ్రీరామకృష్ణానందస్వామి శతజయన్తి - ఉత్సవాలు - 37
12. భాగవత కృష్ణుని చేతి వెన్న ముద్దలు - జోశ్యం శ్రీనివాస్ - 40
13. శివా ! మానవులేపాటి - సీతాలక్ష్మిదేవి - 41
14. వార్తలు - 42

ముఖచిత్రం :

వటపత్రశాయి శ్రీ కృష్ణుడు

05 - 09 - 2015 తేది శనివారం

శ్రీ కృష్ణాష్టమి

ప్రార్థన

– జగద్గురు శంకరాచార్యులవారు

సత్యం జ్ఞానమనన్తం నిత్యమనాకాశం పరమాకాశం
గోష్ఠప్రాఙ్గణ రిఙ్గణలోల మనాయాసం పరమాయాసమ్ ॥
మాయాకల్పిత నానాకారమనాకారం భువనాకారం
క్ష్మాయానాథమనాథం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్ ॥ 1

మృత్స్నామత్స్నీహేతి యశోదాతాడనశైశవ సంత్రాసం,
వ్యాదిత వక్త్రాలోకిపలోకాలోక చతుర్దశ లోకాలిమ్ ।
లోకత్రయపురమూలస్తమ్భం లోకాలోకమనాలోకం
లోకేశం పరమేశం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్ ॥ 2

త్రైవిష్టప రిపువీరఘ్నం క్షితిభారఘ్నం భవరోగఘ్నం
కైవల్యం నవనీతాహారమనాహారం భువనాహారమ్ ।
వైమల్యస్ఫుట చేతోవృత్తి విశేషాభాసమనాభాసం
శైవం కేవలశాన్తం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్ ॥ 3

గోపాలం భూలీలావిగ్రహ గోపాలం కులగోపాలం
గోపీ ఖేలన గోవర్ధన ధృతిలీలాలాలిత గోపాలమ్ ।
గోభిర్నిగదిత గోవిన్దస్ఫుటనామానం బహునామానం
గోపీగోచరదూరం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్ ॥ 4

గోపీమణ్డల గోష్ఠీభేదం భేదావస్థమభేదాభం
శశ్వద్గోఖురనిర్ధూతోద్ధత ధూలీధూసర సౌభాగ్యమ్ ।
శ్రద్ధాభక్తి గృహీతానన్దమచిన్త్యం చిన్తితసద్భావం
చిన్తామణి మహిమానం ప్రణమత గోవిన్దం పరమానన్దమ్ ॥ 5



దుర్గుణ జయోపాయములు – 3

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

భాగవతమునందలి సప్తమస్కంధమున నారదుడు ధర్మరాజున కీ ప్రకారముగ దుర్గుణములను జయించు వివిధ మార్గములను సూచించెను. చిత్తశుద్ధిని బడయనిచో మనుజుడేకాలమందును పరమాత్మ సాక్షాత్కారమును బొందజాలడనుట నిక్కము. కాబట్టి ముముక్షువు మొట్టమొదట తన యందలి దుర్గుణములను అనవరతసాధనచేతను, పెక్కు యుక్తులచేతను ఎట్లైన జయించి వేయవలయును. భావశుద్ధియే జ్ఞానసిద్ధికి కారణము. ఇక్కారణమున చిత్తశుద్ధి నిమిత్తము దుర్గుణజయోపాయములను మనుజుడు క్షుణ్ణముగ నెఱిగియుండవలెను. ఆ యుపాయముల నిచట కొన్ని కొన్నిటిని విచారించెదము.

1.శోక మోహములు : శోకమోహములకు కారణము అవిద్యయే. తన స్వరూపమును బాగుగ తెలిసికొనజాలక పోవుటయే దుఃఖమునకు హేతువు. తాను వాస్తవముగ సచ్చిదానంద పరబ్రహ్మమే కాని పాంచభౌతిక జడ సంఘాతము కాదను సత్యము నెఱిగినవాడిక శోకమును గాని, మోహమును గాని యెట్లు పొందగలడు ? కనుకనే శోకమోహములను జయించుటకు తత్త్వజ్ఞానమే (ఆత్మ విచారణయే) ఏకైక ఉపాయము.

2. దంభము : దంభము, అభిమానము, గర్వము – ఇవన్నియు దాదాపు ఒకే తరగతికి జెందిన దుర్గుణములు, మహనీయుల యొక్క సాంగత్యముచే అవి యన్నియు పటాపంచలై పోగలవు. పెద్దలను సేవించుట వలన, వారిని ఉపాసించుట వలన మానవుడు తనయొక్క అహంకారమును రూపుమాపుకొనగలడు. భౌతికశక్తి యెంత గొప్పదైనను ఆధ్యాత్మిక శక్తి

ముందు తీసికట్టేయగును. కావున మనుజుడు ప్రాపంచికముగ ఎంత సమున్నత స్థానము నాక్రమించి యున్నను, పరమార్థ విజ్ఞానానుభూతిని బడసిన మహాత్ముల చెంత నాతడు గణనకు రానివాడే యగును. ఈ సందర్భమున భర్తృహరి పలికిన పలుకులు ఉల్లేఖింపదగియున్నవి.

యదా కించిద్‌జ్ఞో 2 హం ద్విప ఇవ మదాన్ధః సమభవం
తదా సర్వజ్ఞో 2 స్మీత్యభవదవలిప్తం మే మనః
యదా కించిత్కించిద్బుధజనసకాశాదవగతం
తదా మూర్ఖోస్మీతి జ్వర ఇవ మదో మే వ్యపగతః.

" వాస్తవముగ నాకేమియు తెలియనపుడు నా కంతయు తెలియుననెడి అహంభావము గలిగియుండి నేనే సర్వజ్ఞుడనని భావించుచు ఏనుగువలె మదాంధుడనై యుంటిని. కాని యెపుడు మెల్లమెల్లగ నేను మహాత్ములయొక్క సాంగత్యము నవలంబించుచు వచ్చితినో, అపుడు నే " సర్వజ్ఞుడను కాను, అల్పుడనే ' అను విషయము చక్కగ బోధపడగా నా మదమను జ్వరము తొలగిపోయెను " – కాబట్టి మహనీయుల సేవా శుశ్రూషచే, ప్రార్థనాదులచే జీవులయొక్క దంభాహంకారాది దుర్గుణములు తొలగి పోగలవు.

3. యోగనిఘ్నములు : యోగవిఘ్నములను మౌనముచే జయించవలెనని ఇచట (భాగవతమున) తెలుపబడినది. మౌనము రెండు విధములు. 1. వాజ్‌మౌనము, 2. మనోమౌనము – అని. సహనము కల్గి సుఖదుఃఖములకు ఏమాత్రము బెదరక, మౌనముతో, సమభావముతో భగవద్విశ్వాసముతో విఘ్నములన్నిటిని అధిగమించవలెనని యిట సూచింపబడినది. 'మచ్చిత్తస్సర్వ దుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ' ' నాయందు చిత్తమును నెలకొల్పినచో నా యనుగ్రహముచే నీవు సమస్త ఆపదలను, విఘ్నములను దాటివేయగలవు ' అను భగవద్వాక్యానుసారము

దైవవిశ్వాసముగలవారు, మౌనముతో సుఖదుఃఖములను సహించుకొనువారు, క్రమముగ ఆయా ద్వంద్వములను, విఘ్నములను దాటివేయగలరు.

4. హింస : శరీరాదులను చేష్టింపకుండుట ద్వారా హింసను జయింపవలెను. ' శరీరాదుల'ను పదములో ఇంద్రియ, మనోబుద్ధులు కూడ చేరియున్నవి. ఏ క్రియకైనను కారణము మనస్సే యగును. ఆ మనస్సు (తన సంస్కారము ననుసరించి) శరీరేంద్రియములచే తత్తత్కార్యములను (పుణ్యపాపములను) చేయించుచుండును. వివేకము నాశ్రయించి మనస్సును దుష్టసంస్కార రహితముగ నొనర్చినచో, ఇక నయ్యది శరీరాదులచే ఆయా పాపకార్యములను చేయించకుండును.

5. భూతజనిత దుఃఖము : భూతకోట్లచే తనకు గలుగు దుఃఖమును సాధకుడు ' దయ ' యను సద్గుణము నభివృద్ధి పఱచుకొనినచో జయింప వచ్చును. దయాశీలున కెవనియందును ద్వేషముండదు. తన కపకారము చేసిన వానిని గూడ దయాదృష్టితో నతడు వీక్షించి క్షమించుచుండును. కావున అట్టి కరుణామయులను, దయావంతులను భూతజనిత దుఃఖమేమియు బాధింపకుండును. దయాదిసద్గుణములచే వారట్టి దుఃఖమును సంపూర్ణముగ అధిగమించి వేయుదురు.

6. ఆధిదైవిక ఆధ్యాత్మిక పరితాపములు : సమాధి నిష్ఠచే ఆధిదైవిక పరితాపములను, యోగబలముచే ఆధ్యాత్మిక దుఃఖములను జయింప వలెనని నారదులు ధర్మజున కెఱింగించెను. సామాన్యముగ దుఃఖములు మూడు విధములుగ చెప్పబడుచుండును. 1. ఆధ్యాత్మిక, 2. ఆధిభౌతిక, 3. ఆధిదైవికములని. రోగములు, మనోవికారములు మున్నగునవి ఆధ్యాత్మిక దుఃఖములనియు, భూతకోట్ల వలన కలుగునని ఆధిభౌతిక దుఃఖములనియు, వర్షాభావము మున్నగునవి ఆధిదైవిక దుఃఖములనియు పేర్కొనబడును. అందు ఆధిభౌతిక దుఃఖములను దయాదిసద్గుణ సంపత్తిచే

జయింపవలెను. సమాధి నిష్ఠచే ఆధిదైవిక సంతాపములను, యోగబలముచే ఆధ్యాత్మిక క్లేశములను జయించవలెను. సమాధి నిష్ఠుడు తన ఇంద్రియమనంబులను దృశ్యవిషయముల నుండి, ప్రపంచక్షేత్రమునుండి మరల్చి అంతర్ముఖ మొనర్చి ఆత్మయందు స్థాపించును. గావున ఇక నాతనికి భౌతిక జగత్తునకు సంబంధించిన సంతాపము లెవ్వియు నుండనేరవు. కావున తద్దుఃఖ నివారణార్థము మనుజుడు సమాధినిష్ఠను, ఆత్మసంస్థితిని తప్పక అభ్యసించవలెను. అట్లే యోగాభ్యాసముచేతను ప్రాణాయామాదులచేతను, రోగాది దుఃఖములను, మనోవికారములను జయించి వేయవలెను.

రజస్తమశ్చ సత్త్వేన సత్త్వం చోపశమేన చ
ఏతత్సర్వం గురౌ భక్త్యా పురుషోహ్యంజసా జయేత్.

(భాగవతము : 7-5-25)

“ రజోగుణ, తమోగుణములను సత్త్వగుణముచే జయించి వేయవలెను. (నిర్వికల్పాత్మస్థితియను) ఉపరతి ద్వారా సత్త్వగుణమును దాటిపోవలెను. దుర్గుణము లన్నింటిని సాధకుడు గురుభక్తియొక్క సాహాయ్యముచే శీఘ్రముగ జయించి వేయగలడు. ”

భాగవతసప్తమస్కంధములోని పదునైదవ అధ్యాయమున నారదుడు ధర్మరాజునకు మోక్షప్రాప్తికి వలసిన సాధనముల నుపదేశించుచు దుర్గుణ సమూహమును ఎట్లు జయించి వేయవలెనో ఈ ప్రకారముగ విశదీకరించి చెప్పెను. అంతఃకరణము నిర్మలముగ నుండిననే తప్ప ఆత్మసాక్షాత్కార మెవరికిని కానేరదు. కావున దానియందలి దోషములన్నిటిని సాధకుడు బాగుగ పరిశీలించి, ఒక్కొక్క దానిని వివేకము యొక్క సహాయముచే లెస్సగ తొలగించి వేయవలెను.

**భాష జాతిప్రగతిని వివరించే ముఖ్య సాధనం.
భావాలను ప్రకటించడానికి సాధనం - స్వామి వివేకానంద**

ఋషుల సేవ అనంతమైనది

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

పుష్పము వికసించినప్పుడు తుమ్మెదలను పిలువనక్కర లేదు. అవియే స్వయముగా వచ్చి మధుపానము చేయుచుండును. అలాగున మీ హృదయము వికసించి జ్ఞానము కలుగునపుడు కోట్లకొలది జనులు రేయింబవళ్ళు మీ పాదములవద్ద పడియుండి ధర్మబోధను వినుచు ఆనందామృతపానము చేసి మగ్నులై యుందురు. కాయపండినపుడు మాధుర్యము కలుగును. దానినే జనులు భుజింతురు గాని పచ్చిదానిని తినజాలరు. ఆలాగున మీ హృదయమునకు జ్ఞాననిష్ఠలో పరిపక్వత కలుగనిండు. తొందర పడనక్కరలేదు. అధికారము గల వాక్యములకే విలువ గలదు. తక్కిన వారి వచనములు గాలి వంటివి. ఎంతోకాలము చదివి జడ్జి, కలెక్టరు, గవర్నరు వైస్రాయి యెట్లగుచున్నారో, అలాగున మీరున్ను బ్రహ్మవిద్యలో చాల పాఠములను చదివి ఉత్తీర్ణులు కావలసియుండును. అధికారము వచ్చు వరకు మీ వాక్యములకు విలువయుండదు. అంతవరకు మీ గంభీరోపన్యాసములు మందు మాత్రము వేసి గుండులేని ఫిరంగి శబ్దమువలెనుండును. ‘ దానమిచ్చుటకు ప్రయాసము లేదు. సామగ్రి సమకూర్చుటకు యత్నము చేయుము. ’ ఇత్యాది ధర్మవాక్యములను అనుభవజ్ఞుల యుపదేశ వాక్యములను చాల జాగరూకతతో గ్రహించుకొనుడు.

బ్రహ్మనిష్ఠలోను, తపస్సులోను, జ్ఞానములోను మీ ఆత్మ పరిశుద్ధము గానిండు. అపుడు మీకు కొద్దికాలముననే అమోఘమగు లోకోపకారము చేయు శక్తి కలుగును.

విద్యుచ్ఛక్తి యంత్రము ఒకే స్థలములోనే యుండును. దానియందు శక్తియుండిన ఎన్నియో మైళ్ళదూరమున దీపములు ప్రకాశించుచూ

యంత్రములు పనిచేయుచుండును. అలాగున నీవు దైవశక్తి గలవాడవు కమ్ము. అప్పుడు నీవు తలంచుకొనిన లోకమున అనేకకోట్ల జనులు లోకోపకారము చేయగలరు. రేడియో యంత్రము ద్వారా శబ్దమును ఆకాశమందు కలుపుటచే ఒకే సమయములో ప్రపంచములో అనేకచోట్ల కోట్ల యంత్రములు మాట్లాడగల్గుట చూచుట లేదా ! అలాగున మీ మనస్సు శుద్ధమై ఆకాశము వలె వికసించి వ్యాపకము గానిండు. అప్పుడు ప్రపంచమున అనేక కోట్ల జనుల హృదయముల యందది వ్యాపించి మీ సంకల్పము ప్రకారమది ఐక్యమొనర్చి ఏకాకార స్థితి కలిగేలాగున చేయుడు. అప్పుడు ఈశ్వరుని సంకల్పమున్ను వ్యాపించి పని చేయగలుగును.

పూర్వీక ఋషులు, సిద్ధపురుషులు ఇటువంటి స్థితిగలవారై యుండిరి. కనుకనే వారి సంకల్ప ప్రకారము లోకమున జరుగుచుండును. అట్టి మహాకార్యమెద్దియో దాని కొఱకు యత్నింపుడు. అట్టివారే మనకు ఈ కాలమున కావలసిన వారలు. అట్టివారివల్లనే లోకోద్ధరణ కాగల్గును. వట్టి వాక్కు చెప్పుచుండిన ప్రయోజన మేమియు లేదు. కాన కార్యరంగమున ప్రవేశించి చేయవలసిన కార్యమొద్దియో దానిని చేయుడు. అయితే నేను చేయుచున్నా నని సంకల్పము కలుగజేసికొనకుడు. మీరు సర్వేశ్వరుని చేతిలో పిల్లనగ్రోవి వలె, ఆ పరమ పురుషుని యాశయమును లోకమున కుపదేశించుటకు పాత్రులు కండు. అంతఃకరణము సంపూర్ణముగా శుద్ధమయ్యే లాగున చేసికొనుడు. అప్పుడు దానిలో గల్గెడు శక్తికంతము లేదు. అది మహాశ్చర్య కరమైనది. అపుడు మీకే ఆ శక్తి అత్యద్భుతముగా గోచరము కాగలదు.

ఒక్కొక్క మతాచార్యులు వారు వారు పోయిన మార్గములు చెప్పునది సరియే గాని దీనియందు తప్పేమియు లేదు. ఉత్తరకోసల మందు శ్రీరాములై, కురుక్షేత్రములో కృష్ణుడై, కపిలవస్తులో శ్రీబుద్ధులై, కేరళయందు శ్రీ శంకరులై, ద్రావిడ దేశమందు శ్రీరామానుజులై, కర్ణాటకమందు

శ్రీమధ్వులై, పాంచాల దేశములో గురునానకై అవతరించి లోకసంరక్షణ చేసిన మహనీయులందరు నొకటియే యగు పరబ్రహ్మశక్తియే గాని మరి యేమియును గాదు. ఈ రహస్యము సాధారణ మనుజులకు గోచరము కాదు. ఎట్లనగా నొక ఆటకంపెనీ యందొక డొక సమయమందు శ్రీకృష్ణవేషము ఇంకొక సమయమందొక మునిపుంగవుని వేషమును ఈలాగుననే అనేక వేషములను ధరించి వచ్చునపుడు దూరమందు కూర్చుండు మనుజులు ఈ వేషధారి వేరు, ఆ వేషధారి వేరు అని తలంచెదరు. వారున్ను ఆ వేషమునకు తగిన చర్యలు చూపుచూ ఆడుదురు. ఈ రహస్యము వారితో కూడి అంతరంగ మందుండు వారికి తెలియును. ఆలాగుననే శ్రీ పరమేశ్వరుడొక్కడైనను ఒకొక్క కాలమందు ఒకొక్క అవతారము వహించి ఆ దేశమందున్న జనులయొక్క మనఃపక్వత ననుసరించి ఉపదేశము చేయుచుండును. ఈ విషయము దైవ సన్నిధికి దూరముగా నుండు అజ్ఞానులకు తెలిసికొనుటకు సాధ్యము కాదు. జ్ఞానులు ఈ రహస్య మెఱింగి వాదరహితులై సుఖింతురు. కావున మానవులకు సమాజమునకు మహాత్ములు అనేక విధములుగా ధర్మములను మతములను బోధించి ఏ స్వభావమునకు ఏది నచ్చునో ఆ భావములను గ్రహించి భగవంతుని చేరు మార్గములను ఉపదేశించిరి. వారి మార్గమును అనుసరించిన వారు ఎందరో లోకమున తరించిరి. ఇపుడు తరించుచున్నారు. ఇక ముందు కూడ తరింపగలరు.

కావున మహాత్ములగు ఋషుల సేవ అనంతమైనది. విలువ కట్ట జాలనిది. వారికి ఎప్పుడూ కృతజ్ఞులమై యుండవలయును. ఎవరు ఏ ఏ మార్గమును అనుసరించిరో దానియందు లక్ష్యమును సాధించు వరకు పయనింప వలయును. మార్గమాధ్యమున నిలిచిపోయినవాడు ఎన్నటికిని గమ్యమును చేరికొనజాలడు.

ఋషుల ఋణమును తీర్చుకొనుట యనగా వారు చెప్పిన ధర్మమార్గములను సంపూర్ణముగ ఆచరించుటయే.

అనురాగ అంజనం

– శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణులు : పులి జంతువులను ఆవురావురు మంటూ కబళించి వేసే రీతిలో భగవత్ ప్రేమ అనే పులి కామక్రోధాదులనే శత్రువులను కబళించి వేస్తుంది. ఒకసారి హృదయంలో భగవత్ ప్రేమ కలిగితే కామక్రోధాదులు అంతర్ధానమవుతాయి. శ్రీకృష్ణునిపట్ల అంతటి అనురాగం ఉండబట్టే బృందావనగోపికలకు అటువంటి స్థితి కలిగింది.

‘ అనురాగ అంజనం ’ అంటే ప్రేమ కాటుక. రాధ తన సఖీమణులతో ‘ నేను సర్వత్రా కృష్ణుణ్ణి చూస్తున్నాను. ’ అన్నది. అందుకు వారు ఇలా అన్నారు. ‘ సఖీ ! నీవు ‘ ప్రేమ కాటుకను కళ్ళకు రాసుకొన్నావు కదా ! అందుచేతనే కృష్ణుణ్ణి సర్వత్రా చూడగలుగుతున్నావు ’.

భగవంతుని స్మరించని బద్ధజీవులు సర్వదా కామినీ కాంచనాలలోనే వాసం చేస్తూ ఉంటారు. అలాంటప్పుడు వారినుండి మహత్కార్యాలు ఎలా ఆశించగలం ? వారు కాకులు కొట్టిన మామిడి పండు లాంటివారు. అలాంటి పండు దేవుని నైవేద్యానికి పనికిరాదు, మనుషులు కూడా తినడానికి సంకోచిస్తారు.

సంసారంలో బందీలైనవారు, పట్టుపురుగు లాంటివారు. ఈ పురుగు తాను స్వయంగా కట్టుకున్న గూటిపట్ల అమితమైన అపేక్ష కారణంగా గూటిని వదలి రాదు. చివరకు అది అక్కడే మరణిస్తుంది. ముక్తజీవులు కామినీ కాంచనాలకు వశులు కారు.

లౌకికులు భగవన్నామ స్మరణ చేస్తారు. కానీ దానిలో అనురాగం ఉండదు. లౌకికులకు పట్టుదల ఉండదు. జరిగితే జరగనీ, జరగకుంటే పోనివ్వు – ఇదే వారి వ్యవహారం. మంచినీళ్ళు అవసరమైనప్పుడు బావి త్రవ్వడం ప్రారంభిస్తారు. కానీ త్రవ్వకంలో బండరాయి అడ్డుపడ్డప్పుడు అక్కడ త్రవ్వడం ఆపుచేసి, మరోచోట త్రవ్వడం మొదలుపెడతారు. బహుశా అక్కడ ఇసుకపొర పడితే, ఆ స్థలం కూడా వదలిపెట్టి ఇంకో చోటుకు వెళతారు. మొదలు పెట్టిన స్థలంలోనే గట్టి పట్టుదలతో త్రవ్వకం కొనసాగిస్తేనే కదా నీరు లభిస్తుంది.

ధ్యానములో అనుభవాలు

ధ్యానములో సామాన్య అనుభవాలు

– మూలం : శ్రీ శివానంద స్వామి

అనువాదం – యు.నారాయణరావు

ధ్యానము ప్రారంభములో ఎరుపు, తెలుపు,నీలిమ, ఆకుపచ్చ, ఎరుపు – ఆకుపచ్చ రంగుల మిశ్రమము కలిగిన వివిధ రంగుల కాంతులు నుదిటి మీద దర్శనమిచ్చును. వాటిని తన్మాత్రిక కాంతులు అందురు. ప్రతి తత్త్వము దాని స్వయంవర్ణాన్ని కలిగియుండును. పృథ్వి తత్త్వము పసుపురంగును కలిగియుండును. జలతత్త్వము తెలుపు రంగును కలిగియుండును. అగ్ని ఎరుపురంగును కలిగియుండును. వాయువు ఆకుపచ్చరంగును కలిగియుండును. ఆకాశము నీలిరంగును కలిగియుండును. ఈ తత్త్వాల కారణంగానే రంగులు కాంతులు ఏర్పడును.

ధ్యానములో ఉన్నపుడు ఒక్కొక్కసారి ఒక పెద్ద సూర్యుడు లేదా చంద్రుడు లేదా ఒక మెఱుపు వంటి కాంతులు నుదిటి ముందు కాననగును. ఈ దృశ్యాలను వేటినీ పట్టించుకొనకుము. వాటిని విసర్జించుము. ఈ కాంతుల ప్రభవస్థానములో లోపలికి వెళ్ళుటకు ప్రయత్నించుము.

కొన్ని సమయాలలో దేవతలు, ఋషులు, నిత్య సిద్ధులు ధ్యానములో దర్శనమిత్తురు. సగౌరవముగా వారిని ఆహ్వానించుము. వారికి ఒంగి నమస్కరించుము. వారి నుండి సలహాలు పొందుము. నీకు సహాయపడుటకు, నిన్ను ప్రోత్సాహపరచుటకు వారు నీముందు ప్రత్యక్షమగుచుందురు.

ధ్యానము, ధారణ ప్రారంభదశలలో నుదుటి కేంద్రభాగమున దేదీప్యమానమైన కాంతిరేఖను నీవు గాంచుదువు. అది అరనిమిషము

(లేక) ఒక నిమిషము ఉండి అదృశ్యమగును. ఆ కాంతిరేఖ ఊర్ధ్వమునుండిగాని, పార్శ్వాల నుండి గాని వెలుగొందును. ఒక్కొక్కసారి ఆరు లేదా ఎనిమిది అంగుళాల వ్యాసము కలిగిన సూర్యబింబము కిరణాలతో గాని కిరణాలు లేకుండా గాని కనపడును. నీ గురువు రూపమును గాని, ఉపాస్యమూర్తిని గాని నీవు చూడవచ్చును.

క్షణమాత్ర ఆత్మదర్శనాన్ని పొందినపుడుగాని, జ్వలించే కాంతిని గాంచినపుడు గాని, ఇంకా ఇతర అసాధారణ ఆధ్యాత్మిక అనుభవం పొందినపుడు గాని భయంతో క్రిందపడకుము. సాధనను విస్మరించకుము. అది ఒక పెనుభూతమని పొరబాటు పడక, ధైర్యముగా ఉండుము. సంతోషంగా సాహసముతో ముందుకు సాగుము.

ధ్యానములో ఉన్నప్పుడు సమయము యొక్క ఆలోచన రాదు. నీకు ఏ రకమైన శబ్దాలు వినపడవు. నీకు పరిసరాల ఆలోచన రాదు. నీ పేరును, ఇతరులతో అన్ని రకాల సంబంధాలను మరచిపోవుదువు. నీవు శాంతిని, పరమానందాన్ని అనుభవించుదువు. క్రమంగా నీవు సమాధిలో నిమగ్నమగుదువు.

మొదట పరమానందస్థితి కొంతసేపే ఉండును. తరువాత వెనుకకు వచ్చుచుండును. నిరంతర ధ్యానములో స్థిరమైన సాధన చేస్తే, అతడు సదా అదే ఉన్నతస్థితిలో ఉండగలుగును. అటుపైన దేహభావన పూర్తిగా నశించును.

నీవు గాఢ ధ్యానములోనికి ప్రవేశిస్తే నీకు నీ దేహచైతన్యముగాని, పరిసరాలు గాని గుర్తుకు రావు. నీవు మానసిక సమతుల్యతతో నుందువు. ఏ శబ్దములు నీకు వినపడవు. ఇంద్రియ భ్రాంతులు పైకి, క్రిందికి వెళ్ళడం ఆగిపోవును. అహంకార చైతన్యము కూడ క్రమంగా నశించును. చెప్పనలవికాని ఆనందాన్ని, వర్ణించనలవికాని సంతోషాన్ని నీవు అనుభవించుదువు. క్రమక్రమముగా హేతుకత, తలంపులు కూడ

మృగ్యమగును.

గాఢ ధ్యానము ద్వారా నీవు మౌనం లోనికి వెళ్ళినపుడు బాహ్యప్రపంచము, నీ సమస్త కష్టాలు తొలగిపోవును. నీవు అనంతమైన శాంతిని అనుభవింతువు. ఈ మౌనంలోనే జ్యోతులలో దివ్యమైనట్టి జ్యోతి లభించును. ఈ మౌనంలో అక్షయమైన పరమానందముండును. ఈ మౌనంలో నిజమైన శక్తి, ఆనందము ఉండును.

నీవు తీవ్ర ధ్యానసాధన గావిస్తే వాయుస్తంభనము అనగా కుంభకము మాత్రమే జరిగి, పూరక – రేచకాలు జరుగవు. కేవలం కుంభకం మాత్రమే ఉన్నప్పుడు నీకు అనంతమైన శాంతి కలిగి, ఏకాగ్రత కలిగిన మనస్సు ఏర్పడును.

ఆశ్రమంలో అర్ధ చాతుర్మాస్యవ్రతము

31-07-2015 ఆషాఢ పౌర్ణమి శుక్రవారం నుండి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో అర్ధచాతుర్మాస్యవ్రతం ప్రారంభింపబడినది. అందు ప్రతిరోజు ఉదయం గీతా పారాయణానంతరం పూజ్య శ్రీ స్వాములవారు శ్రీ మధుసూదన సరస్వతి వారి భగవద్గీత – గూఢార్థ దీపికపై, శ్రీ రమణ మహర్షుల "ఉపదేశసారం"పై పూజ్య శ్రీ మాతా స్వరూపానందగిరి వారు ప్రవచన చేస్తున్నారు. సాయంకాలం 4 గంటల నుండి 5 గంటల వరకు శ్రీ మాతాజీ వారే గీతోక్త భక్తుని లక్షణాలు గురించి ఉపన్యసిస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు ప్రతి సోమవారం శివసహస్రనామపారాయణ, మంగళ, శుక్రవారము లలితా సహస్రనామాపారాయణ, బుధ, శనివారము విష్ణు సహస్రనామస్తోత్రపారాయణ, గురువారం గురుపాదుకాస్తవం, ఆదివారం ఆదిత్య హృదయం సమష్టి పారాయణ జరుగుతూంది. చాతుర్మాస్యంలో పాల్గొనిన వారికి ఉచిత (ఫ్రీ) నివాస భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయబడినవి.

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు
(గత సంచిక తరువాయి)

అనువాదం :
శ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : ఈ జగత్తునకు అత్యంతాభావముగలదని వివరించుచున్నారు –

అద్వైతాయాం మృద్యసత్త్వా ద్ఘటస్య
ప్రాఙ్ముఖ్యాభావత్రయే 2 పహ్నుతే యః,
అత్యంతాభావో 2 వశిష్ట స్స వస్తు
న్యద్వైతే స్యాదస్యవిశ్వస్య 1 నూనమ్ **18**

అద్వైతాయాం = ఘటశరావాది భేదములు లేని, మృది = మృత్తిక యందు, ఘటస్య = ఘటమునకు, అసత్త్వాత్ = అస్తిత్వము లేనందువలన, (ఆ ఘటము యొక్క) ప్రాఙ్ముఖ్యాభావత్రయే = ప్రాగభావము మొదలైన మూడు అభావములు, అపహ్ను తే = నిరసింపబడగా, అవశిష్టః = మిగిలిన, యః = ఏ, అత్యంతాభావః = అత్యంతాభావముగలదో, సః = అదియే, అద్వైతే = స్వగతాది భేదములేని, వస్తుని = బ్రహ్మమందు, అస్య విశ్వస్య = ఈ జగత్తునకు, స్యాత్ = వర్తించును, నూనం = నిశ్చయము.

ఘటము ఉత్పన్నము గాకపూర్వము మన్నే, ఉన్నపుడు మన్నే. పగిలిన పిదపగూడ మన్నే. ఈ రీతి త్రికాలములయందు మృదస్తిత్వము వినా ఘటమునకు (కుండకు) సత్త లేదు. ఇట్టి ఘటమునకు ఉత్పత్తి మొదలగు వానిని గల్పించి ప్రాగభావము మొదలుగా గల మూడు అభావములను చెప్పుట ఎంతటి అసమంజసమో! అట్లే నిత్య నిర్వికారాద్వితీయ పరమాత్మ యందు ఎన్నడులేని జగత్తునకు ప్రాగభావాదులను గల్పించి చెప్పుట అత్యంతాసమంజసము. అనగా ఈ జగత్తునకు అద్వైత బ్రహ్మమునందు అత్యంత అభావమే కలదు. దీనికి ఉనికి ఎన్నడును లేనేలేదని అర్థము.

మఱియు జగత్తు సర్పమువలె ప్రాతిభాసిక మని చెప్పుట సరికాదు. ఎందుకనగా రజ్జు జ్ఞాన మైన పిదప సర్ప మగపడక పోవుటచే దానిని ప్రాతిభాసిక మని చెప్పవచ్చును. కాని జగత్తు ఇట్టిదిగా లేదు. బ్రహ్మజ్ఞానమైన పిదపగూడ జగత్తు అగపడుచున్నది. అందువలన దీనిని ప్రాతిభాసిక మని తాము ఎట్లు చెప్పుదురు ? జ్ఞానోత్తర కాలమునందు గూడ బాధితానువృత్తిచే జగద్భానమగునని మీరే చెప్పుచున్నారు గదా! అనిన సమాధానము " ఆదా వంతేచ యన్నాస్తి వర్తమానే 2 పి తత్తథా" ఆది అంతములయందు లేనిది వర్తమానమునందును లేదను వాక్యానుసారము జగత్తు లేనిదై యున్నది. ఉత్పత్తికి పూర్వము, నాశానంతరము ఘటము లేదు. కావున ఘట ప్రతీతి కాలము నందును ఘటము లేదనియే అర్థము. మూడు కాలముల యందును మృత్తే యున్నది. మన్ను చూచువానికి ఘటము లేదని భావము. జగత్తు మూడు కాలములందును స్వరూపమున అత్యంతాభావము గలిగి యున్నదని యెఱిగి తనను అద్వితీయ బ్రహ్మముగా అనుభవమునకు తెచ్చుకొనినవాడే బ్రహ్మవిద్వరుడని భావము.

అవ : జగత్తు లేనే లేదని చెప్పితిరి. అగపడుచున్నదే ? యని అడిగిన బ్రహ్మమే జగదాకారమున గోచరమగుచున్నదని తెలుపుచున్నారు –

స్వస్థశ్చే త్ప్రళయే శివోస్య జగత శ్చిష్టాండనిష్ఠీవనాత్
తాంత స్స్యాస్తు సదా సకృత్సృజతిచే త్స్రష్టా పునః కృష్ణవాన్ ।
సాన్నిధ్యా ద్యది శాస్త్యభూ త్స తు పృథ క్త్వాత్మైవ చే ద్విశ్రుతిః
స్యాద్వైవర్త్య మతోద్వయాన్నపరతో వ్యస్తంసమస్తంజగత్.

శివః = శివుడు, సదా = ఎల్లప్పుడు, సృజతిచేత్ = సృష్టి చేయుచునే యున్నట్లైతే, అతః = ఈ సృష్టికార్యము వలన, తాంతః = అలసిపోయినవాడు, (స్యాత్ = అగును, అదియుగాక) అస్య = ఈ జగత్తు యొక్క, ప్రళయే = ప్రళయము నందు, స్వస్థః = స్వస్థుడై

(వ్యవహార రహితుడై) ఉండును. (అను శ్రుతి వాక్యము అప్రమాణమగును) సకృత్ = ఒక్కమాటే, సృజతి ఇతిచేత్ = సృష్టి చేయును అనినచో, న = కూడదు, శిష్ట అండ నిష్ఠీవనాత్ = శేషించిన బ్రహ్మాండములను వెడల గ్రక్కుటవలన, (పునః సృష్టి కాలమున బయల్వెడలించుట వలన అని ఆక్షేపము). పునః = పక్షాంతరమున, సాన్నిధ్యాత్ = శివుని సన్నిధానమున నుండి, స్రష్టా = బ్రహ్మ, చతుర్ముఖుడు, (సృజతి = సృజించును), శాస్తి = శాసించును, ఇతి యది =అనినయెడల, సఃతు = ఆ బ్రహ్మయైతే, పృథక్ = వేఱుగా, క్వ = ఎక్కడనుండి, కృష్టవాన్ = లాగుకొని రాబడెను ? (వీనిని ఎక్కడి నుండి పట్టుకొని వచ్చితివని ఆక్షేపము), అస్తు = ఉండనిమ్ము, (ఇతిచేత్ = అన్నట్లైతే), విశ్రుతిః = శ్రుతివిరోధము, అభూత్ = ఆయెను, అతః = ఇందువలన, పరతః = ఇతరుని నుండి, (సృష్టియగుననుట) న = కూడదు.(మతేమన) వ్యస్తం = వ్యష్టిరూపమును, సమస్తం = సమష్టిరూపమును ఐన, జగత్ = జగత్తు, అద్వయాత్ = అద్వితీయమైన బ్రహ్మము నుండియే, వైవర్త్యం = వివర్తభావమును (పొందుచున్నది), అతః = ఇందువలన, (ఇది, ఈ జగత్తు) ఆత్మా ఏవ = ఆత్మయే, స్యాత్ = అగును.

శివుడు ఈ జగత్తును సదా సృష్టించుచునే ఉండును అనినచో ఈ సృష్టికార్యము వలన అతడు అలసట జెందువాడగును. అందుచే సదా సృష్టి చేయుట యనునది ఆక్షేపింపబడెను. ప్రళయకాలమున శివుడు స్వస్థుడై తూష్ణీంభావమున నుండు ననెడి శ్రుతివాక్యమును బట్టియు ఈ విషయము ఆక్షేపింపబడిన దాయెను. ఒక్క మాటే, ఈ సమస్తమును శివుడు సృష్టించును అనినచో అదియు కూడదు. ఏలన, " భూత గ్రామ స్స ఏ వాయం భూత్వాభూత్వా ప్రలీయతే " విసృజామి పునఃపునః " ఇత్యాది వాక్యములు అప్రమాణము లగును. కావున ఒకే పర్యాయము

సృష్టి చేయునను విషయము ఆక్షేపింపబడెను. శివుని సన్నిధాన బలమున బ్రహ్మదేవుడు సృష్టికార్యాదుల జేయును అనినచో అపుడు ' యతోవా ఇమాని భూతాని జాయంతే " " జన్మాద్యస్యయతః " ఇత్యాది శ్రుతి స్మృతివిరుద్ధ ప్రసంగమగును. ఇట్లు (1) సదాసృష్టి (2) ఏకదాసృష్టి, (3) బ్రహ్మణా సృష్టి ఆక్షేపింప బడినవాయెను. సర్వవిధముల సృష్టి ప్రసంగము అసంగత మైనదని భావము. అట్లైన ఈ కనబడుచున్న జగత్తు సంగతి యేమియనిన, ఇది బ్రహ్మముయొక్క వివర్తము మాత్రమే. అనగా బ్రహ్మమే ఈ జగద్రూపమున భాసించుచున్నదని గురుముఖతః విని శ్రుతియుక్త్యనుభవములచే తెలియుటయే పురుషార్థము. జగత్తునకు అత్యంతాభావము గలదని తాము చెప్పిన మాట సరికాదు. ఎందుకనగా జ్ఞానము కలుగక పూర్వము జగత్తున్నది. జ్ఞానానంతరము బాధితాను వృత్తిచే భాసమగు (తోచు) చున్నది. ఇట్లుండ దీనికి అత్యంతాభావము ఎట్లు పొసగును ? అనిన ఇందులకు సమాధానము. జగదుత్పత్తి స్థిత్యాదులను మేము అజ్ఞజనుల బుద్ధి సమాధానార్థమై, దాది బాలకునకు కథ చెప్పినట్టుగా గౌణముగా చెప్పియున్నాము. బ్రహ్మవిద్వరిష్ఠుని దృష్ట్యా విచారించిన జగత్తునకు అత్యంతాభావము గలదని చెప్పుట గూడ గౌణమై యున్నది. అసలు జగత్తు పుట్టనే లేదు. పుట్టి యుండినగదా భావాభావములు పొసగును ? " గ్రామోనాస్తి కుతస్సీమా " గ్రామమే లేదు. ఇక పొలిమేర యెచ్చటి నుండి వచ్చును ? అన్నట్టు జగదుత్పత్తియే లేని స్థితియందు అగపడునది అగపడకుండునది అని చెప్పుట ఎట్లు పొసగును ? అనగా పారమార్థికసత్తాస్వరూపాద్వితీయ బ్రహ్మము వినా వేఱొకటి లేదు. ఎండ వేడిమిచే వచ్చి ఇంటియందు ప్రవేశించిన వానికి ఇంటియందలి వెలుతురే చీకటిగా దోచినట్లు, జలమే అలగా తోచినట్లు అద్వితీయ బ్రహ్మమే జగదాకారమున భానమగు (తోచు) చున్నదని భావము.



దివ్యత్వంతో ఉండు

ఆంగ్లమూలం : స్వామి చిదానంద

అనువాదం : తిప్పరాజు కొండల్‌రావు

(పూజ్య శ్రీశ్రీశ్రీ చిదానంద సరస్వతి స్వాములవారు శ్రీ శివానందస్వామి వారి ముఖ్యశిష్యుడు,దివ్యజీవసంఘాధ్యక్షుడు. ఈ మధ్యనే శ్రీవారు బ్రహ్మీభూతులయ్యారు)

శాశ్వత పరమానందానికి, నిత్యమైన జీవనానికి, స్వర్గ సామ్రాజ్యానికి ఆధారం, భగవత్సాక్షాత్కారానికి, సమాధికి, పరమచైతన్యానికి, ఆత్మసాక్షాత్కారానికి ఆధారం, విశ్వచైతన్యానికి, నిర్వాణానికి ఆధారం – వీటన్నింటికీ ఆధారం, సత్ప్రవర్తన, సద్గుణం, ధర్మం, స్వచ్ఛత, సత్యం దయ, కరుణ, సాధారణ జీవనశైలి, స్వయం నియంత్రణ, కోరికల నియంత్రణ, నమ్రత, మితము, సమయాన్ని వృథాచేయకుండా, వ్యర్థప్రలాపాలు చేయకుండా, అనవసరమైన ఆలోచనలకు, అనవసరమైన చర్యలకు, అనాధ్యాత్మిక భావనలకు దూరంగా వుండుట. సంక్షిప్తంగా చెప్పాలంటే పరమాత్మను అర్థం చేసుకునే జీవితం, దివ్యమైన సద్గుణాలు కలిగి, దివ్యమైన ధార్మికత కలిగి, దివ్యస్వభావం కలిగివున్న దివ్యజీవనం గడపడం, ఇదే శాశ్వత ఆధారం. ఆధ్యాత్మిక జీవనంలో దీన్ని మరవడానికి వీలులేదు. శాంతిని, ఆనందాన్ని కాంక్షించే వ్యక్తి జీవితంలో మంచిగా వుండాలి, సన్మార్గాన్ని ఎన్నుకోవాలి. సజ్జీవనం నుండే, స్వచ్ఛమైన జీవనం నుండే, ధార్మిక జీవనం నుండే ఆనందం లభిస్తుంది.

ధార్మిక జీవనం కష్టంగా, బాధాకరంగా వుండవచ్చు. ఎన్నో దుఃఖాలను, ఎన్నో ప్రయాసలను, ఎన్నో బాధలను కలిగించవచ్చు. కాని ఆ జీవనం మాటల్లో వ్యక్తం చేయలేని, వర్ణణాతీతమైన, అపరిమితమైన, ఆనందాన్ని కలుగజేస్తుంది.

అన్ని బాధలను, అన్ని దుఃఖాలను, అన్ని ప్రయాసలను, అన్ని కష్టాలను అధిగమించే శక్తియే ఆనందం. కొన్ని సందర్భాల్లో మంచివ్యక్తి ఎన్నో బాధలను ఎదుర్కొంటునట్లు, చెడు వ్యక్తి భోగాలను అనుభవిస్తున్నట్లు, చాలా సంతోషంగా వున్నట్లు చూస్తుంటాం. ఇది ఆలోచన సరళిలో జరిగే విచిత్రమైన తత్తరపాటు. లోపల వున్న నిజాన్ని గమనించకపోవడం. మంచివాడు ఎన్నో బాధలను ఎదుర్కోవచ్చు కాని ఆనందంగా ఉంటాడు. అతని హృదయంలో శాంతి సంతోషాలుంటాయి. బాధలను భరిస్తాడు. అయినా శాంతంగా, సుఖంగా వుంటాడు. ప్రశాంతంగా నిదురించగలడు.

దుర్మార్గుడు మంచి జీవనాన్ని గడపని వాడు పైకి సుఖంగా, సంతోషంగా వున్నట్లు అగుపడినా అశాంతితో ఉంటాడు. హృదయంలో బాధపడ్తుంటాడు, మనఃశ్శాంతి వుండదు. అతనికి నిజమైన ఆనందం కలుగదు.బాహ్య పరిస్థితులకు అతీతమైంది ఆనందం. బాధలు, కష్టాలు ఆనందంతో సహజీవనం చేస్తాయి. ఇది తథ్యం. హాయి, ఆనుకూల్యత, సౌఖ్యం – ఇవి బాధ, అశాంతి, అంతరంగిక ఆందోళన, అసంతృప్తి, అసంతుష్టి కలిసి మెలసి వుంటాయి. ఆనందం, శాంతి – ధర్మాన్ని వెంబడిస్తాయి అన్నది ఉన్నతదైవ శాసనం. ఎవడు ధార్మికుడో అతనికి శాంతి లభిస్తుంది. ఎవడు మంచివాడో అతనికి ఆనందం, ధన్యత కలుగుతాయి.

పరమధన్యతకు, పరమానందానికి, పరమశాంతికి ధర్మమే రాచమార్గం. ఇది సత్యం. ఇదే భగవత్సాక్షాత్కారానికి, అపరిమితమైన ఆనందానికి ఆధారం. దివ్యానందం, శాశ్వత శాంతి, జీవితంలో మంచితనం ధార్మిక జీవనం వల్లే లభిస్తాయి. అంతరాధ్యాత్మికత వికాసానికి దోహదం చేసే దివ్యజీవనపథం నిఃస్వార్థం, సేవ , భక్తి, ఆరాధన : బాహ్య వస్తువుల నుండి మనస్సును మరలించుట – ఈ సాధనల పథమే. “ నేను ఎవరు ”, “ నేను ఏమిటి ?” అనే నిరంతర విచారణా మార్గం. “ నేను ఈ శరీరం

కాదు, నేను ఈ మనస్సు కాదు, నేను ఈ బుద్ధికాదు, నేను అంతరాంతర జీవిని, పరమాత్మను, ఆత్మను, నామరూపరహిత, జన్మలేని క్షీణతలేని, మరణం లేని, నాశనం లేని శాశ్వత, ఏకత్వాన్ని. " నేను అదే ", " అదే నేను " సత్, చిత్, ఆనందాన్ని – అని ధృఢంగా ఉద్ఘాటించే మార్గం.

సత్య సంధత, స్వచ్ఛత, వినయ విధేయత, సత్ప్రవర్తన, సచ్ఛీలం, స్వయం నియంత్రణ, కోరికలను నుండి స్వేచ్ఛ, ఆధ్యాత్మిక జీవనం, అన్ని కార్యక్రమాలను, విధులను శ్రద్ధగా నిర్వర్తిస్తూ భగవంతుడు మాత్రమే లక్ష్యంగా కలిగి వుండడం, ప్రేమతో విశ్వాసంతో పరమాత్మను జ్ఞాపకం ఉంచుకోవడం, అన్నింటిలో " అతన్నే " దర్శించడం. ఆరాధనా భావంతో పూజించడం, నిస్వార్ధత సేవ ద్వారా ఆధ్యాత్మిక ప్రగతి సాధించడం, భక్తి, పూజ, ధారణ, ధ్యానం, నిరంతర ఆత్మ విచారణ ద్వారా దివ్యచైతన్యమనే ధన్య స్థితికి చేరడం, దివ్యానుభూతిని, ఆత్మ సాక్షాత్కారాన్ని పొందడం – ఇదే దివ్యజీవనం.

ఆ స్థాయి మీకొక నూతన అనుభవాన్ని కలుగజేస్తుంది. ఓ చైతన్యాన్ని ఆవిష్కరిస్తుంది. " నేను సర్వోన్నతుడను, నేను సచ్చిదానంద ఆత్మను, నేను సత్ – చిత్ ఆనందాన్ని, నాకు వృద్ధాప్యం లేదు, మరణం లేదు, నాలో అశాంతి లేదు, నాకు భయం లేదు, నాకు దుఃఖం లేదు, నేను అవినాశిని, నేను ఆనందాన్ని, నేను శాంతిని, అన్ని అవస్థల్లోను – నేను యువకుడినైనా, వృద్ధుడనైనా, బలవంతుడినైనా, బలహీనుడినైనా, నేను కురచనైనా, ఎత్తైనా, ధనికుడినైనా, పేదనైనా, " నేను అదే "– ఇలాంటి చైతన్యాన్ని కలుగజేస్తుంది. శరీరం కాని, మనస్సు కాని ఏ దశలో వున్నా – ఉత్సాహంగా వున్నా, నిరుత్సాహంగా వున్నా సరే ఫరవాలేదు. నేను నిరుత్సాహంగా వుండను, నేను నిరుత్సాహంగా వుండను. నేను " అదే " – " నేను " ఏకం అయిన సత్, చిత్, ఆనందాన్ని. నా శరీరం స్వస్థతగా వున్నా , అనారోగ్యంగా వున్నా, హాయిగా వున్నా, బాధగావున్నా, మనస్సు

తృప్తిగా వున్నా, అసంతృప్తిగా వున్నా, మనస్సు వికసించినా, కుంచించుకపోయినా – నేను అన్ని స్థలాల్లోను, అన్ని పరిస్థితుల్లోను ఆ " సత్యాన్నే ". నేను చిరిగిన దుస్తులు ధరించినా, నిరుద్యోగినైనా, నాకు ఏ రోగం వచ్చినా, సంఘం నన్ను తిరస్కరించినా, నా కుటుంబం నన్ను వెలివేసినా, నాకు స్నేహితులు లేకున్నా, నా బాగోగులు చూడడానికి ఎవరులేకున్నా – నేను సత్, చిత్, ఆనందాన్నే. ఈ బాహ్య పరిస్థితులు ప్రకాశవంతమైన నా ఆత్మను, నా జీవున్ని తాకలేవు. కళంకాన్ని ఆపాదించలేవు.

అన్ని విషయాలపై విజయం సాధించిన ఆ అనుభవం, అత్యుత్తమమైన, పరమోన్నతమైన, విజయవంతమైన అనుభవం. ఆ స్థితిని సాధిస్తే " ఆనందోహం, ఆనందోహం, బ్రహ్మానందోహమ్ ". దీన్ని సాధిస్తే అన్ని పరిస్థితులపై, అన్ని అవస్థలపై అన్ని ద్వంద్వాలపై విజయం సాధించినట్లే.

గురుదేవులు స్వామి శివానంద " ది డివైన్ ఇన్జక్షన్ " అన్న పాటను చాలా ఇష్టపడేవారు. ఈ పాటను ఒక్కసారి పాడినా నీ స్థూల అవస్థను కాంతివంతమైన, నీ వాస్తవమైన చైతన్యావస్థకు ఎదగజేసేది. అది నీ జన్మహక్కును జ్ఞాపకం చేసి, ఇప్పుడే ఇక్కడే ఆ జన్మ హక్కును సాధించాలని నిన్ను ప్రేరేపిస్తుంది. నీ వాస్తవమైన స్వభావానికి సంబంధించిన పాట. ప్రజలు దీన్ని "చిదానంద గానం " అనేవారు. అన్ని ప్రత్యేక సందర్భాల్లో ఈ పాటను గానం చేయమని శ్రోతలు, భక్తులు గురుదేవులను ప్రార్థించేవారు. 1950లో సంపూర్ణ భారతదేశ యాత్ర సందర్భంగా ఈ పాటను చాలా సార్లు గానం చేశారు.

చాలా మందికి " చిదానంద గానం " గురించి తెలుసు. నా పేరు " చిదానంద " కాదు. అది మీ నిజమైన పేరు, నా వాస్తవమైన పేరు కూడా. " చిత్ " శబ్దం ' ఆనంద్ " శబ్దంతో కలిసినపుడు ' త' ' ద'గా మారుతుంది. ఆ శబ్దం 'చిదానంద ' అవుతుంది. ఈ విషయాన్ని మీరు

అనుభవించి " నేను సంపూర్ణ జ్ఞానానందాన్ని, మృత్యువు, వార్ధక్యం, భయం, బాధ, బంధంలేని సంపూర్ణ జ్ఞానానందాన్ని " అని ఆనందించాలి. అయితే మీరు ఆ అనుభవానికి ఎదిగానని తలచకండి. అది మీ లక్ష్యం అనీ, అది బీజస్థితిలో వుంది అన్న ఎరుక కలిగి వుండండి. అది గుప్తంగా, నిద్రావస్థలో వుంది. అందుకే మేలుకో ! రా ! ఆ గొప్ప అనుభవం వైపు కదులు. నీలో మొగ్గగా వున్నదాన్ని పుష్పంగా వికసింపజేయడానికి అన్ని ప్రయత్నాలు చేయి. నీలోని మొగ్గ వికసించి పుష్పంగా మారాలి. దాని నుండి బీజం ఉద్భవించాలి. జీవితంలో ఎదిగి దివ్యానుభవం అనే వృక్షంగా ఎదగాలి. ఆ దిశగా శ్రమించాలి.

ఈ భావన ఇదివరకే నీలో వుంది. అది తాళం వేసిన పెట్టెలో అమూల్యమైన అపరిమితమైన అందమైన వజ్రంలా వుంది. తాళంచెవి మాత్రం దొరకలేదు. మీరు ఆ పెట్టెను తెరచి ఆ వజ్రాన్ని స్వంతం చేసుకోవాలి. అదే రీతిలో ఈ శాశ్వత సంపూర్ణత్వం నీలో నిద్రాణమై వుంది. మీరు ఇదివరకే " అది ". నేను ఇప్పుడు మాట్లాడుతున్నా, మీరు వింటున్నా మీరు సంపూర్ణ సచ్చిదానంద స్వరూపులే. సదా సంపూర్ణమైన ఆత్మయే. సచ్చిదానంద చైతన్యమే. అదే మీ నిజమైన చైతన్యం. " నా మోకాలులో నొప్పిగా వుంది, చాలాసేపు కూర్చున్నాను, నా నడుములో నొప్పిగా వుంది" లాంటి ఎరుక స్థూలచైతన్యం, శారీరక చైతన్యం మాత్రమే.

మనం కొన్ని వాస్తవాలను ఎదుర్కోవాలి. గుఱ్ఱం ముందు బండి వుంచడం భావ్యంకాదు. ఏ విషయం గురించి పట్టించు కోవాలో దాన్ని విస్మరించలేము. అందుకే సాధన అనివార్యం. సాధన ద్వారానే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. సాధన అంటే ఏమిటి ? సాధన అంటే సజ్జీవనం. పరమాత్మ దిశగా పయనించే జీవనవిధానం. నీవు ' అదే' అన్న విషయాన్ని ప్రదర్శించే విధంగా జీవించడం. నీవు సదా స్వచ్ఛం, మచ్చలేని వాడవు. ఆ మచ్చలేని స్వచ్ఛమైన తత్త్వాన్ని నీ ఆలోచనల్లో, మాటల్లో, నీ కోరిక విధానంలో, నీ అంతరంగ భావాల్లో, నీ దైనందిన జీవనంలో ప్రతిబింబించేలా ప్రయత్నం చేయాలి. దాన్నే సాధన చేయాలి. దానిలో జీవించాలి. దాన్నే ప్రకాశింపజేయాలి. అదే సాధన. నీవే 'సత్యం', నీవే పరమవాస్తవం. ఈ సత్యాన్ని ప్రదర్శించు. నీ హృదయ నుండి అసత్యాన్ని, అవాస్తవాన్ని సమూలంగా తొలగించు. సత్యానికి ప్రతిరూపంగా మారిపో. నీ జీవితం, నీ వాస్తవానికి విరుద్ధంగా వుండవద్దు. ఇదే అతి ముఖ్యమైన సాధన. అదే దివ్యజీవనానికి, మనసా, వాచా, కర్మణా దివ్యంగా ఉండడానికి మార్గం.

' సత్యమే నా భగవంతుడు ' అన్నాడు మహాత్మాగాంధీజీ. భగవంతుడే సత్యం, సత్యమే భగవంతుడు, భారతదేశపుటల్లో చిరస్థాయిగా నిలచిపోయిన ఆ గొప్ప వ్యక్తి, ఆ వీరుడు, దివ్యత్వాన్ని సత్యంలో దర్శించాడు. అదే సాధన. నీవు కూడా ఆ సాధన వల్ల లాభం పొందవచ్చు. ఈ గొప్ప అనుభవాన్ని పరమాత్మ దిశగా పయనించే జీవనం ద్వారా, నీ అంతరంగ ఆలోచనల్లో, నీ కార్యకలాపాల్లో ఆధ్యాత్మికత నిండిన నీ జీవన విధానం ద్వారా సాధించు. ఒక్కో అడుగు ముందుకువేస్తూ, ఒక్కో ఇటుకను పేరుస్తూ గొప్ప సౌధాన్ని నిర్మించవచ్చు. ఆధ్యాత్మిక శ్రమ ఒక ఆనందం, దాన్ని సాధించే దిశగా పయనించడం మహిమాన్వితం. దివ్యత్వాన్ని ప్రదర్శించడం కన్నా మీకు విలువైనదేది ? నీ స్వభావానికి విరుద్ధంగా నీ జీవితాన్ని దిగజారనీయకు. ప్రతి అడుగులో నీ స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే నిన్నెవరు ఆదుకోగలరు ? ఎవరు నిన్ను బంధవిముక్తుని చేయగలరు ? నీ చేతల ద్వారా, నీ జీవన విధానం ద్వారా నిన్ను నీవే ఆ స్థితికి దూరం చేసుకుంటున్నావు. జీవితంలో నిజమైన స్వభావానికి విరుద్ధంగా జీవిస్తూ నిజమైన ఆనందాన్ని, నిజమైన సంతోషాన్ని, నిజమైన శాంతిని కోల్పోతున్నావు.

ప్రతి ఆలోచన, ప్రతిమాట, ప్రతి చర్య **దివ్యత్వంలో నిండి వున్న జీవనం గడపడమే సాధన.** దివ్యత్వంలో జీవించే జీవన విధానం ద్వారా

అన్ని కోణాల్లో నీలో అంతరంగంగా వున్న దివ్యత్వాన్ని ప్రదర్శిస్తూ, దివ్యానుభవం పొంది ఆనందించు. " చిదానంద చిదానంద ఓం, అన్ని పరిస్థితుల్లోను నేను సత్, చిత్, ఆనందాన్ని, సంపూర్ణ ఆనందాన్ని, సంపూర్ణ సత్‌ను " అని పరమానందంతో ఘోషించు. దీనికోసం శ్రమించు నీ జన్మ హక్కును సాధించు, దీనికై ఎంత ప్రయత్నం చేసినా తక్కువే. సంతోషంతో, ఆశతో, సాహసంగా ఈ దిశగా ప్రయత్నించేయి. నీవు ఏ పని చేస్తున్నాసరే నీ అంతరంగ చైతన్యాన్ని నీ ప్రజ్ఞను వదలవద్దు. ప్రతిక్షణం అన్ని విషయాల్లో దీన్ని ధృఢంగా ఆలోచించు. పరిస్థితిపై విజయం సాధించు. నీ మనస్సును గెలిచిన చక్రవర్తిగా, నీ కోరికలను అణచిన వీరునిగా, నీ భవిషత్తును నీ ప్రారబ్ధానికి ప్రభువుగా మారిపో.

దీనికోసం నిరంతరం శ్రమపడాలి అని పునరుద్ఘాటిస్తాను. శిఖరాన్ని చేరాలంటే పైకి ఎక్కాలి. ఒక్కసారి అక్కడకి చేరితే మీరు పడ్డ శ్రమ అంతా పిల్లలాటగా అగుపడుతుంది. శిఖరం చేరేవరకు అడుగులేస్తూ, మెట్లు ఎక్కుతూ శ్రమించాలి. మీ ప్రజ్ఞకు కట్టుబడి వుండండి. శిఖరాన్ని చేరినట్లుగా భావించండి. అయినా ఎక్కడం మానవద్దు. ఒక్కో మెట్టు ఎక్కుతూ శిఖరాన్ని చేరండి ఇదే సాధనలోని రహస్యం.

భగవంతుడు మిమ్మల్ని దీవించుగాక ! తన అనుగ్రహం మీపై వర్షించుగాక ! సద్గురు స్వామి శివానందగారి సందేశాలు ప్రతిదినం మీ జీవితంలో మార్గదర్శనం చేయుగాక. విజయవంతంగా దివ్యజీవనం గడుపుతూ సద్గుణాలతో ప్రకాశించేలా దీవించుగాక ! మీరు దివ్యమైన శీలాన్ని పెంపొందించుకొని, స్వచ్ఛమైన మార్గంలో పయనిస్తూ అద్భుతమైన ఆ లక్ష్యాన్ని చేరాలిగాక. ఇది మీ జన్మహక్కు. ఈ జన్మలోనే, ఈ శరీరంతోనే దీన్ని సాధించడానికి వీలౌతుంది. నీ ప్రయత్నాన్ని వాయిదా వేయకు. మేలుకో ! పయనం సాగించు. మీరు జీవితంలో విజయం సాధించడానికి భగవత్ చైతన్యం మీలో ప్రకాశించాలని ఈ సేవకుని ప్రార్థన.

(పూజ్యశ్రీ చిదానంద స్వాములవారి శతజయన్తి సందర్భంగా)

జీవించటంలో ఆనందము

– శ్రీ స్వామి చిన్మయానంద

తెలుగు అనువాదం – శ్రీమతి లక్ష్మి

మానవుడు, చావుపుట్టుకల మధ్య విశ్రాంతి వంటి ఈ జీవితంలో ' దుఃఖ నివృత్తి, సుఖప్రాప్తి ' అనే రెండే రెండు కోరికలచేతనే నిరంతరం ప్రేరేపించబడుతున్నాడు. అతడు తనకు అయిష్టమైన వస్తువుల నుండి, అననుకూలమైన పరిసరాల నుండి తప్పించుకొని పారిపోయి. అనుకూలమైన, ఇష్టమైన పరిస్థితుల వైపు పరుగెడతాడు. అంటే, స్థూల ప్రపంచంలో వస్తువులూ, పరిసరాలూ, క్షణ క్షణానికి మారుతూ ఉంటే, వాటి వెనుకనే మానవుడు సుఖాన్ని, ఆనందాన్ని వెతుక్కుంటూ అంతులేని పరుగు సాగిస్తూ ఉంటాడు. ఈ అన్వేషణలో, వివిధ వ్యక్తులు అనుసరించే మార్గాలు వేరైనప్పటికీ, సాధించదలచే గమ్యం మాత్రం ఒకటే. అందుచేత నిజమైన ఆనందం లభించే స్థానం ఎక్కడ ఉన్నదో తెలుసుకోటానికి తప్పకుండా కుతూహలం ఉంటుంది.

మన ఇంద్రియాలద్వారా అనుభవించే ఆనందం, ఆ ఇంద్రియాలకు సంబంధించిన బాహ్య ప్రపంచంలోని ఆయా వస్తు సముదాయంలోనే ఉన్నదని మన దృఢ విశ్వాసం. ఈ నమ్మికకు అనుగుణంగా మనం ఇంకా ఇంకా ఐశ్వర్యాన్ని సంపాదించటానికి, పెంపొందించుకోటానికి, అనుభవించటానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాం. ఐతే మనం ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఈ ఐశ్వర్యం సంపాదించటం, అనుభవించటం అన్నవి ఆనందానికి కొలత బద్ధులుకావని స్పష్టంగా తెలుస్తుంది. ఇంద్రభవనం వంటి గృహాలలో, మెత్తని దిండ్ల మధ్య దుఃఖంతో సదా మూల్గుతూ ఉండే లక్షాధికారి జీవితంలోనూ,

ఒంటినిండా బట్టకు కూడా నోచుకోకపోయినా ఆ పేద పరిసరాల మధ్య చిద్విలాసంగా కాలం గడిపే పేదవాని జీవితంలోనూగల అసామంజస్యం మనకు సుపరిచితమే.

అంతేకాదు, ఆనందం అన్నది స్వాభావికంగా బయటి ప్రపంచంలోనే ఉన్నట్లయితే ఒక వస్తువును అనుభవించిన వారందరికీ, దానివల్ల లభించే ఆనందం ఒకే పరిమాణంలో ఉండాలి. జీవితంలో మనం చూసే దాన్నిబట్టి ఇది నిజానికి చాలా దూరమనే చెప్పాలి. ఒకనికి ఒక సిగరెట్టు ఎంతో ఆనందాన్ని తృప్తినీ ఇస్తే మరి యొకనికి ఆ పొగ పిచ్చెక్కిస్తుంది. మరి ఒకరికి తృప్తి నివ్వటానికి మరి ఒకరికి కోపం తెప్పించటానికిగల కారణం ఎందులో ఉంది ? ఈ ప్రశ్న ' ఆనందం అంటే ఏమిటి ? ' అనే మరొక ప్రశ్నకు దారితీస్తుంది.

జాగ్రత్తగా పరిశీలించి చూస్తే మానవునియొక్క ఆనందం అన్నది పూర్తిగా అంతఃకరణకు సంబంధించినదిగా గోచర మౌతున్నది. మన శాంతికి తపనకు మన మనః ప్రవృత్తే కారణం ఎందువల్లనంటే, ఒక వ్యక్తి యొక్క మానసిక స్థితికి, అతడు అనుభవించే సుఖదుఃఖాలకు, పొందే అనుభూతులకు చాలా దగ్గర సంబంధం ఉన్నట్లు సుస్పష్టంగా కనిపిస్తుంది. మనసు కలత జెంది ఉన్నప్పుడు దుఃఖం, ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆనందం అనుభవించటం మనం చూస్తున్నదే. అంటే బలిష్ఠమైన గుండె, దిట్టమైన మనసూ మనిషిని ఆనందానికి చేరువగా తీసుకు వస్తాయి. అందువల్ల మనసుయొక్క ప్రశాంతతయే ఆనందానికి కొలతబద్ధ అని తెలుస్తున్నది. అటువంటప్పుడు మన బలహీనతలు పరిసరాల మీదకు నెట్టటం కేవలం సాకు అవుతుంది.

ఈ సర్వసృష్టికి తలమానిక వంటి వాడైన మానవుడు తన పరిసరాల మీద ఆధారపడకుండా, తన మనసును ప్రశాంతంగా ఉంచుకొనేందుకు తగిన సాటిలేని శక్తికలిగే ఉన్నాడు. ఐతే, మానవుడు తనలోని ఈ శక్తి అంతర్గతంగానూ, అవ్యక్తంగానూ ఉండిపోయిందన్న సత్యం తెలుసుకోలేక

ఈనాడు బూటకపు మెరుపులను సృష్టించే లౌకిక విషయాల ద్వారా ఆనందాన్ని పొందటానికి తెలివి తక్కువగా ప్రయత్నిస్తున్నాడు. ఈవిధంగా లభించే ఆనందం క్షణికమేకాని ఎన్నటికి మానవునికి స్థిరమై శాశ్వతమైన తృప్తిని ఇయ్యలేదు.

మన మతగ్రంథాలు మానవునిలో నిద్రాణమై ఉన్న ఈ శక్తిని తట్టిలేపి, వృద్ధి పొందించటానికి సహాయం చేస్తాయి. అందుచేత అనిత్యమైన కొద్దిపాటి ఆనందాన్ని విషయ భోగాలనుండి యాచించ నక్కరలేదు. తనకు అనుకూలమైన పరిసరాల మీద, విషయాలమీద ఎంతమాత్రం ఆధారపడకుండానే అతడు సంపూర్ణమైన, శాశ్వతమైన ఆనందాన్ని పొందగలడు. అట్టి వ్యక్తి దీపస్తంభంవలె మహోన్నతంగా నిలబడి, కల్లోలితమైన సంసార సాగరంలో దారితెలియక కొట్టుమిట్టాడే ప్రజానీకానికి కాంతినిచ్చే మార్గదర్శకుడై శాశ్వతానందం అనే 'రేవు' లోకానికి దారి చూపుతాడు. (**పూజ్యశ్రీ చిన్మయానంద స్వామి శతజయన్తి సందర్భంగా**)

సుబోధ

– పద్మనాభుని సాంబశివరావు

తరిగిపోతోంది కాలం	తరిగిపోతోంది వయసు
జీవన యానం ముగియునెప్పుడో	జీవిత లక్ష్యం జేరనేర్చుకో
పరమాత్మ జేరుటకు	పలుదారులున్నాయి
పరమాత్మ గొలుచుటకు	పలువిధములున్నాయి
నీ కనువైన సులువైన	నీ దారి ఎంచుకో
హృదయ కమలంలోన	కమల నాభుని నింపు
శ్వాస నిశ్వాసలో	విశ్వనాథుని నిలుపు
ప్రతి క్షణము ప్రతి పలుకు	పరంధాముని కొలువు

ఆచార్యదేవోభవ

– ఆచార్య డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

ఔపదేశిక గురువులు :

లోకసంక్షేమం ప్రధానంగా, తమకాలం నాటి రాజన్యుల ప్రతిష్ఠలను పెంచే వారుగా, స్వార్థదృష్టి అణువయినా లేనివారుగా అంతఃకరణశుద్ధితో ఇతరులకు 'ఉపదేశం ' చేసినవారు ఔపదేశిక గురువులు. ఈ కోవలో అత్రి, విశ్వామిత్ర, వ్యాసాదులను చేర్చవచ్చును.

'అత్రి ' ఋషులలో ప్రథమతః స్మరింపబడేవాడు ' అత్ర్యాది సప్తఋషయః సముపాస్య సంధ్యామ్ ' అని శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం ఆ ఋషి ప్రాధాన్యతను స్పష్టంచేసింది. ఇతడు బ్రహ్మమానసపుత్రుడు. సర్వలోకహితుడు, సకల ధర్మవిదుడు. పరోపకార పారీణుడు. ఇతని భార్య 'అనసూయ '.

శ్రీరామచంద్రుడు లక్ష్మణసమేతుడై అరణ్యవాస సందర్భంలో ఈ ఋషి ఆశ్రమం చేరుకోగా అత్రి రాముని సత్కరించినాడు. సీతాదేవిని లోపలికి వెళ్ళమని ఆదేశించాడు. అనసూయ సీతమ్మకు వాడని పూలను, సర్వమంగళ కారకమయిన మైపూతను చీరను ప్రసాదించినది. ఏ ముత్తయిదువ ఇంట అడుగుపెట్టినా ఆదరించి మంగళకరమయిన వస్తువులనిచ్చి పంపే సంప్రదాయానికి అనసూయ నాందీ పలికిందనవచ్చు.

ఉత్తమదాంపత్యానికి, అత్రి, అనసూయలు ఒక ఉదాహరణం కూడా. ఆమె పతివ్రత. ఆమె ఉన్నచోట ఆకాశమార్గంలోనయినా దేవతల వాహనాలు ఆగిపోవలసినవే. ఒకసారి త్రిమూర్తుల వాహనాలు ఆగిపోయాయి. వారు అనసూయను పరీక్షించాలని ఆశ్రమం చేరి ఆమెను దిగంబరిగా వడ్డించమని కోరితే అనసూయ భర్తకేసి చూసిందట. భర్త అలాగే కానిమ్మన్నాడు. బ్రాహ్మణా కారులయిన త్రిమూర్తులు పవిత్రస్నానం చేసి పీటలపై కూర్చొన్నారు. అనసూయ వారి మీద మంత్రాక్షతలు, జలసంప్రోక్షణాదులు చేసింది. వారందరు శిశువులయ్యారు. త్రిమూర్తుల భార్యలు వచ్చి వేడగా అనసూయ అనుగ్రహించింది. స్త్రీలపట్ల మగవారు నడచుకోవలసిన తీరుకు ఈ వృత్తాంతం ఒక ఉదాహరణ. ఒక హెచ్చరిక కూడా.

అత్రి వృత్తాంతంలో మరొక విశేషముంది. అత్రి సంతానార్థం తపం చేసే వేళ త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారట. నేనొక్కరినే ప్రార్థిస్తే ముగ్గురు వచ్చారెందుకని అత్రి ప్రశ్నించాడట. మా ముగ్గురకు తేడా లేదని త్రిమూర్తులు బదులిచ్చారట. మా కళలతో మీకు సంతానం కలుగుతుందని అన్నారట. బ్రహ్మాంశతో చంద్రుడు, విష్ణ్వంశతో దత్తాత్రేయుడు, శివాంశతో దుర్వాసుడు అత్రిదంపతులకు జన్మించారని కథ. ఏ మహర్షి కథలోనూ ఈ త్రిమూర్త్యాత్మకం లేదు. భేదభావం త్రిమూర్తులయెడ చూడరాదనే సందేశం లోకానికి ఈ కథ వల్ల విశదమవుతుంది.

ఒకసారి రాహువు సూర్యుని కబళించబోయాడు. సూర్యుడు భయంతో ఆకాశం నుండి కిందపడుతుంటే భయపడకుమని భరోసా ఇచ్చినవాడు అత్రిమహర్షి. కుటుంబ వ్యవస్థను చక్కబరచకుండా సన్న్యసించరాదనే నియమానికి కూడా అత్రి మార్గదర్శకుడు.

ఒకానొక సంవత్సరం కరువు కాటకాలేర్పడగా వృక్షసంతతి నశించగా గంగాతీరంలో తపస్సుచేసి సస్యరాశిని పెంచిన ఘనత అనసూయదే. లోకహితార్థం కొన్ని సంప్రదాయాలను సూచించిన ఆదర్శదంపతులు వీరే. భారతయుద్ధంలో ద్రోణుడు పోరాడుతుంటే 'నీవు బ్రాహ్మణుడివి. ఆచార్యుడివి. హింస బ్రాహ్మణధర్మం కాదు. సమరం చాలించ'మని హితం చెప్పిన వారిలో అత్రి కూడా ఒకడు.

విశ్వామిత్రుడు జగమెరిగిన బ్రహ్మర్షి. సూర్యవంశజుడు, సంకల్ప బలుడు. తాను సంకల్పించిన యజ్ఞానికి రాక్షసులు అడ్డు తగులుతున్నారని

‘ శ్రీరామచంద్రుని’ తనతో పంపమని దశరథుని కోరినవాడు. దశరథుడు తటపటాయిస్తుంటే వశిష్ఠుడు ‘ విశ్వామిత్రుని’ వల్ల శ్రీరామచంద్రుల ప్రఖ్యాతి పెరుగుతుందని అనునయించాడు. చివరకు ఆ బ్రహ్మర్షి వెంట రామలక్ష్మణులు కదిలారు. విశ్వామిత్రుని గురువుగానే ఆ సోదరులు భావించారు.

విశ్వామిత్రుడు గురువై రామలక్ష్మణులకు బల, అతిబల విద్యలు ప్రసాదించాడు. శ్రమరాహిత్యమని, జ్వరాదిభయాదులుండవని విశదం చేశాడు. అంతేకాదు ఈ విద్యలవల్ల సుప్తప్రమత్తాలుండవని ఉపదేశించి అసంఖ్యాక అస్త్రాలను ప్రసాదించాడు.

పరితుష్టోస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః

ప్రీత్యా వరమయం యుక్తో దదామ్యస్త్రాణి సర్వశః

అన్నాడు. శ్రీమద్రామాయణం విశ్వామిత్రుడు రామునికిచ్చిన అస్త్రశస్త్రాదులను విస్తారంగా వర్ణించింది.

చక్రాయుధాలలో దండ, ధర్మ, కాల, విష్ణు చక్రాలు, అస్త్రాలలో ఇంద్ర, వజ్ర, బ్రహ్మశిరోనామక, ఐషీక, బ్రహ్మాస్త్ర, శివాస్త్ర, నారాయణాస్త్ర, శిఖరనామక ఆగ్నేయాస్త్ర, ప్రథననామక వ్యాయవ్యాస్త్రం, హయశిరస్సునామ కాస్త్రం, క్రౌంచనామకాస్త్రం, సౌరాస్త్రం, రాక్షసులు ధరించే కంకాళాస్త్రం, కాపాలాస్త్రం, ముసలాస్త్రం, ఆలాగే రాక్షసులు ప్రయోగించే తామస, మోహన, సంవర్త, మౌసలాస్త్రాలు, తేజఃప్రభానామకాస్త్రం, శిశిరనామకాస్త్రం, విశ్వకర్మ సుదారుణాస్త్రం, వారుణాస్త్రం, శీతేషునామకాస్త్రాలు. గదలలో మోదక, శిఖరి గదలు, శక్త్యాయుధాలలో విష్ణుభక్తి, శివశక్తులు, పాశాలలో కాల, వరుణపాశాలు అనుగ్రహించాడు. ఆ మంత్రాధిదేవతలు శ్రీరామునితో ‘ మేము మీ సేవకులము ’ అని అంజలి ఘటియించినారట.

తల్లిదండ్రులు దగ్గర లేనప్పుడు గురువే సర్వస్వం. అందుకే శిష్యకీర్తిని ప్రకాశించేలా విశ్వామిత్రుడు ప్రవర్తించాడు. ఆయనే శ్రీరాములవారి పాదస్పర్శచే ‘ అహల్యాశాపవిమోచనం ’ గావించాడు. శివధనుర్భంగం

చేయించి తన శిష్యుని ఉత్తమదాంపత్య ధర్మానుష్ఠితునిగా తీర్చిదిద్దాడు.

మహర్షులలో లోకాతీతమయిన అనేక కార్యాలను సమర్థవంతంగా చేబట్టి కృతకృత్యుడయినవాడు అగస్త్యుడు. విశ్వామిత్రునిలాగే శ్రీరామునికి అగస్త్యుడు తారసిల్లిన మరో గురువు. అరణ్యవాస సమయంలో రాముడు అగస్త్యాశ్రమం సందర్శించిన వేళ ఆ మహర్షి ఒక దివ్యఖడ్గాన్ని, శరాసనాన్ని ప్రదానం చేశాడు. మణిమయమయిన దివ్యాభరణం ఇచ్చాడు. అంతేకాదు లంకలో రాముడు రావణుని అస్త్రశస్త్రాదుల ధాటికి తట్టుకోలేక దిగులు పడుతుంటే అగస్త్యుడు ఆ రణరంగానికి వచ్చాడు. రామునిలోని దైవత్వాన్ని గుర్తు చేశాడు. అంతేకాదు జయసిద్ధికోసం ‘ ఆదిత్య హృదయం ’ ఉపదేశించాడు. ఈ స్తోత్రం సూర్యపరం. అలాగే ఆదిత్య మండలమధ్యవర్తి అయిన శ్రీమన్నారాయణపరం కూడా. మహిమోపేత మయిన ఈ స్తోత్రాన్ని ఈనాటికి పారాయణం చేసేవారెందరో.

ఆదిత్య హృదయంలో 31 శ్లోకాలున్నాయి. మొదటి ఐదు శ్లోకాలు శ్రీరామునిలో సమరోత్సాహం కలిగించేవి. ఆరవశ్లోకం.

“ రశ్మిమంతం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్

పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్ ”

అనేది ఆదేశాత్మకం. 25 నుండి 28వ శ్లోకాలలో అగస్త్యుడు శ్రీరాముని సమరసన్నద్ధునిగా చేసే ప్రయత్నం వర్ణితం. ఈ ఆదిత్య హృదయం విన్నాక, పఠించాక ‘ నష్టశోకుడయ్యాడట రాముడు ’ హర్షుడయ్యాడట. భారతంలో శ్రీకృష్ణపరమాత్మ గీతను బోధించినది రణరంగంలోనే. రామాయణంలో అగస్త్యుడు ‘ ఆదిత్యహృదయం ’ అవగతం చేసింది సమరావనిలోనే. కాకుంటే భారతంలో యుద్ధం జరగడానికి ముందు ఉపదేశం. శ్రీమద్రామాయణంలో సమరం సాగుతున్న వేళ “ హృదయావిష్కరణ ”. భారతంలో గీత బోధించిన వాడు ‘ జగద్గురువు ’ రామాయణంలో ‘ ఆదిత్యహృదయం ’ ఎరుకపరచినవాడు అగస్త్య గురువు.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి

(గవి మఠం)

జ్ఞానముతో శివున్ని తెలుసుకోవడానికి సాధ్యమౌతూంది. ఆ జ్ఞానము ఆవు, దూడకు పాలు ఇచ్చునట్లు శిష్యునికి శివునిపట్ల భక్తి కలిగిస్తుంది. ఈవిధంగా భక్తి జ్ఞాన సంగమముతో ముక్తి లభిస్తుంది. దానికోసం సాధకుడు భక్తి, జ్ఞానములను సంపాదించుకోవాలి.

74. లింగము పూజకు యోగ్యమైనది. లింగానికి నైవేద్యము పెట్టినా తినరు. ఆ లింగము నైవేద్యము కావాలని అనదు, వద్దని అనదు. లింగార్చన చేసిన చాలదు. శివలింగమునకు ముఖము మరియు ప్రాణము జంగముడు, ఆయనకు నైవేద్యము సమర్పిస్తే స్వీకరించి సంతృప్తి చెంది అనుగ్రహిస్తాడు. దానికోసము జంగముడే లింగమని ఆయన పాదములను నమ్మి పట్టుకొని బ్రతుకుచున్నాను.

75. లౌకిక ప్రేమికులు పరస్పరం ప్రేమించుకొనునపుడు కుల, మత భేదములను గమనించరు, వారికి ప్రేమయే ముఖ్యమైనది. లౌకిక జనులు వారికి ప్రేమ పిచ్చి పట్టిందని అంటుంటారు. వారి మాటలను వారు లెక్కింపరు. ఆ విధంగా పరమశివునిలో ప్రేమయే భక్తి. భక్తితో శివున్ని పూజించే వారు తమను సంపూర్ణంగా సమర్పించినవారు కుల, మతాలను లెక్కింపరు. శివుని భక్తికి జాతి, కుల, మతములు ముఖ్యము కాదని భక్తియే ముఖ్యమని దైవ పిచ్చి పట్టిందని జనులు మాట్లాడుకున్నా వారు భక్తి మార్గములో ముందుకు పోవుదురు.

76. సేవకుడైన తరువాత యజమానికి ఉత్తమ సేవను, వస్తువులను సమకూర్చాలి. “ దాసోహం ” భావముతో వుండాలి. ఇష్ట లింగమును పూజించాలి. జంగముని పాదోదక ప్రసాదాన్ని, లింగానికి అభిషేక నైవేద్యము చేసి ఆ ప్రసాదాన్ని స్వీకరించాలి. ఇదియే శివభక్తులు ఆచరించే

ధర్మము మరియు మర్మము. కేవలం ఇష్టలింగమును పూజిస్తే చాలదు. జంగమునికి తృప్తిపరచి, సేవకభావముతో పాదోదక ప్రసాదాన్ని స్వీకరించాలి. “ దాసోహం ” భావాన్ని పెంచుకోవాలి.

77. సృష్టి రెండు విధములుగా వున్నది. ఒకటి బ్రహ్మ సృష్టి, ఇంకొకటి శివ సృష్టి. బ్రహ్మ సృష్టియైన జీవులకు మరణమున్నది. శివ సృష్టియైన జీవులను (శివ శరణులు) రుద్రగణములందురు. వారు శివ జీవ సామరస్యమనే శివయోగము సాధించి,శివయోగ సిద్ధితో పునర్జన్మ లేకుండా మరణాన్ని జయిస్తారు. వారే నిజమైన బంధువులు.

78. (మానవులకు మాత్రమే పంచజ్ఞానేంద్రియములు)

కొన్ని ప్రాణులు ఇంద్రియ సుఖానికి మోహము చెంది ప్రాణాన్ని పోగొట్టుకొనును. ఉదాహరణంగా గంధసుఖానికి భ్రమరము, నాలుక రస విషయానికి చేప, నేత్రము యొక్క రూప సుఖానికి అగ్ని పురుగు, చర్మ సుఖానికి ఏనుగు, చెవుల నాద సుఖానికి (చిపురె) నాగుపాము, ఈవిధంగా ఒక్కొక్క ప్రాణి ఒక్కొక్క ఇంద్రియ సుఖానికి మోహితమై బంధనానికి చిక్కును. మందమారుతము సుగంధ పుష్పముల సువానను వెదజల్లుతూ అందరికి ఆనందము కలిగించును. అలాగే శివభక్తియనే సుగంధమును నింపుకొని చెన్నమల్లికార్జునునిలో భక్తియుక్తమైన జీవనం గడుపుతూ జీవనం పావనం చేసుకోవాలి.

79. రోజు రోజుకు ఆయుస్సు తగ్గుచున్నది. భవిష్యత్తు కాలము గతిస్తున్నది. జీవనములో భార్య, బిడ్డలు విధికి అనుగుణంగా వచ్చెదరు పోయెదరు. ఎవ్వరూ స్థిరము కాదు. ఓ మనసా ఒంటరిగా వుండవద్దు. మహాదేవుడైన చెన్నమల్లికార్జునుని శరణు పొందిన శివశరణుల సత్సంఘములో వారి సహవాసములోనే వుంటానని ప్రతిజ్ఞ చేయుము. దేవుని తెలుసుకోవాలంటే శివభక్తుల సత్సంగము ఆవస్యకము.

80. మానవులందరు సహజంగా రోజంతా కడుపునింపుకోవడానికి ప్రయత్నము చేస్తారు. రాత్రంతా వ్యసనాలకు వాటిని తీర్చుకుంటారు. వారు దేవుణ్ణి తెలిసికోవడానికి ప్రయత్నించరు.

శ్రీరామకృష్ణానందస్వామి శతజయంతి

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

పరివర్తిని సంసారే మృతః కోవా న జాయతే ।
స జాతో యేన జాతేన యాతి వంశస్సమున్నతిమ్ ॥

ఇది భర్తృహరి వచనం. ఈ సంసారం పరివర్తన శీలమయింది అనగా అనుక్షణమూ మార్పు జెందుతూ వుంటుంది. అందుచేత జగత్తులో జన్మించిన జీవకోటి గూడా శాశ్వతంగా ఇక్కడ నిలబడదు. మరణించినవాడు జన్మించడం, జన్మించిన వాడు మరణించడం నిశ్చయం. అందుకే భగవంతుడు గీతలో ‘ జాతస్య మరణం ధ్రువమ్, అని చెప్పాడు

పుట్టలో చెదపురుగుల్లాగా పుట్టి గిట్టేవారు అసలు పుట్టిన వారి క్రింద లెక్కకు రారు అని భర్తృహరి ఆశయం. ఎవడు జన్మించిన వంశము యొక్క సమున్నతికి పాటుపడతాడో, వాడే నిజంగా పుట్టినవాడు.

ఇక్కడ వంశమంటే కులమనో, వర్గమనో, జాతి అనో అర్థం చెప్పరాదు. సంపూర్ణ మానవాళిని ఒకవంశంగా భావించాలి. తరతమ భేదాలు వర్జించి, జాతిమత లింగ ప్రాంతాది వ్యత్యాసాలు విడనాడి సర్వత్రా సమబుద్ధి కల్గి సమస్త మానవకోటి పురోగతికి పాటుబడేవాడే మహాత్ముడు. అట్టి మహనీయుడే నిజంగా ఈ లోకంలో జన్మించి తన జన్మను సార్థకం చేసుకొన్నవాడు.

అలాంటి మహాత్ముల కోవకు చెందిన మహనీయమూర్తి శ్రీ సద్గురు రామకృష్ణానందస్వాములవారు. గండిక్షేత్రం చెంతనున్న శ్రీ భూమానందాశ్రమంలో ఉంటూ భక్తుల ప్రార్థనల మేరకు పలుప్రాంతాలు పర్యటించి వారికి తత్త్వబోధ గావించిన పరివ్రాజక సార్వభౌములు వీరు.

మనసా, వాచా, కర్మణా – త్రికరణ శుద్ధిగా లోకోద్ధరణకు తన జీవితాన్ని వినియోగించిన ఈ మహాపురుషుడు ప్రబోధాలతోనే కాక, గ్రంథరచనలతో, పత్రికా నిర్వహణతో వివిధ ప్రచార కార్యక్రమాలతో, సాధు పరిషత్తుల నేతృత్వంతో – పరిపరి విధాల లోకోన్నతి సాధించారు.

వారి ప్రసంగాలు, వారి రచనల మధ్య పోలిక ఆశ్చర్యావహంగా వుంటుంది. వ్యావహారిక భాషావాదులు వ్యవహార భాషను ఎలా గ్రంథస్థం చేయాలో వీరిని చూచి నేర్చుకోవాలి. ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి శ్రీ ఆచార్య పి.వి.అరుణాచలం గారు వీరి భాషా విన్యాసాన్ని గురించి చెబుతూ ఇలా అన్నారు.

“ రాయలసీమ యాసకు గుడిగట్టి నడివీధిలో నిలిపిన మహానుభావులు శ్రీరామకృష్ణానందస్వాములు ”.

ఈ రీతిగా వీరి ప్రవచనలనూ, రచనలనూ పలువురు ప్రశంసించి వున్నారు.

శ్రీ రామకృష్ణానందస్వాములవారు బహుభాషాకోవిదులు. క్షుణ్ణంగా అనేక తాత్త్విక గ్రంథాలను పలు భాషలలో అధ్యయనం కావించిన వారు. అంచేత ఇతరత్రా లభించని రుచి వారి వాఙ్మయంలో సమగ్రంగా మనకు లభిస్తుంది.

గీతకూ, భాగవతానికీ తమ జీవితాన్ని అంకితం చేసిన పవిత్రచరిత్రులు వీరు.

గీత భాగవతము చేతికిచ్చి కపీంద్రు
సేవయందు నిలువ జేసినావు
కడమ జీవితంబు కాపాడి రక్షించు
వాసుదేవ ! కృష్ణ ! వందనంబు 2

అని తమకు గల గీతాభాగ వతాభిరుచిని వారే వ్యక్తం చేసియున్నారు. గీత లక్షణగ్రంథం కాగా, భాగవతం లక్ష్యగ్రంథమని వివరిస్తూ ఆ రెండు మహోన్నత గ్రంథాలకూ సమన్వయం చేస్తూ వారు పలు ప్రాంతాలలో కావించిన ప్రబోధాలు సర్వదా స్మరణీయాలు.

గండిక్షేత్రంలో ఆంజనేయస్వామి ఆరాధ్యదైవం. అంజనా తనయుణ్ణి స్మరిస్తే బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, అజాడ్యం, వాక్పటుత్వం – లభిస్తాయంటారు. శ్రీ స్వాములవారు గండివీరాంజనేయుణ్ణి మనసారా అభినుతించి, ఆరాధించి ఆశ్రయించి పై గుణాలన్నింటినీ పుణికి పుచ్చుకున్నారు.

రామాయణంలో హనుమంతుని పాత్ర ఎంత విశిష్టమైనదో లోక విదితమే. అందులో ఆయనది ఆచార్య స్థానమని రామాయణ వ్యాఖ్యాతలు వివరించి యున్నారు.

సీత జీవుడు, రాముడు దేవుడు . జీవుడు మాయామృగం వంటి సంసారం పై వ్యామోహంతో దేవునికి దూరమై పోతాడు. మరల జీవుణ్ణి, దేవుణ్ణీ కలపడానికి ఒక ఆచార్యుడు అవసరం. ‘ ఆచార్యవాన్ పురుషోవేద ’ అని శ్రుతివచనం. ఆంజనేయుడు ఆచార్యుడై సీతారాములను అంటే జీవుణ్ణీ, దేవుణ్ణీ కలపడానికి చేసిన కృషి రామాయణంలో అభివర్ణింపబడింది.

గండిక్షేత్రంలో ఆంజనేయుడొక్కడే కాక, మన శ్రీరామకృష్ణానంద స్వామీజీ గూడా ఆచార్య పురుషుడై వుంటూ ఎందరో జీవులను దైవాభిముఖులుగా చేశారు. ఆంజనేయుడు ఒక్క సీతనే రామునితో కలిపాడు. మన స్వాములవారు అనేక జీవులను (శిష్యపరంపరను) దైవమార్గగాములను చేయడం విశేషం.

శ్రీ స్వాములవారికి కవిత్వం వెన్నతో బెట్టిన విద్య వారు రచించిన పద్యాలు ఎంతో హృద్యంగా ఉన్నాయి. ఆ కవితాచ్ఛాయలు వారి గద్య రచనల్లో కూడా స్పష్టంగా స్ఫుర్తిస్తాయి.

గీతపై వారు గావించిన జనప్రియ గీతోపన్యాస్యాలు, అట్లే ‘ భాగవతసుధ’ వంటి గ్రంథాలు అజరామరంగా వుండి ఆంధ్రవాఙ్మయ సరస్వతికి అపూర్వాలంకారాలుగా అలరారుతున్నాయి.

శ్రీ రామకృష్ణానందస్వాములవారి సమకాలికులలో శ్రీ సద్గురు మలయాళస్వాములవారు ముఖ్యాతిముఖ్యులు. శ్రీ మలయాళ సద్గురువులపై వారికున్న ఆదరం అనన్య సామాన్యమైనది. తమ గ్రంథాలలో ఎడనెడా శ్రీ మలయాళ సద్గురువుల ప్రస్తావన తెచ్చేవారు, వారి సూక్తులను ఉదాహరించే వారు. ప్రత్యక్షంగా వారితోపాటు వీరూ వేదాంత సభల్లో పాల్గొని ప్రవచనాలు చేసేవారు.

శ్రీ మలయాళస్వాములవారు సూచనను శిరసావహించి వీరు‘ బుద్ధ చర్య అనే శ్రీరాహుల సాంకృత్యాయనుల హిందీ రచనను కమనీయంగా తెలుగు లోకి అనువదించారు. శ్రీ వ్యాసాశ్రమం ప్రకటించిన గ్రంథాలలో తలమానికమైన గ్రంథమది. **(సశేషం)**

భాగవత కృష్ణుని చేతి వెన్న ముద్దలు

సంకలన - జోశ్యం శ్రీనివాస్ (గుంటూరు)

123. ఎవరు హృదయము నుండి పొంగివచ్చుచున్న భయంకరమగుక్రోధమును ఆత్మవిచారణ ద్వారా శరీరమందే శమింపచేయుదురో బయటకు రానీయకుందురో వారు కాలక్రమమున మూడు గుణములపై (సత్వ, రజో, తమో గుణములపై) విజయమును పొందగలరు.

124. ఈ సృష్టి లేనపుడు కేవలము నేనే నిష్క్రియారూపమున ఉంటిని. నేను కేవలము జ్ఞానస్వరూపుడను, అవ్యక్తుడను. అపుడు అంతట ప్రశాంతత వ్యాపించి యుండెను.

125. ఎవరు తమ్ము తాము గొప్ప బుద్ధిమంతులుగ తలచుకొని కర్మయొక్క జంజాటమున పడియున్నారో, వారికి విపరీత ఫలము లభించుచున్నదని యెఱుగవలెను.

126. ఆత్మయొక్క స్వరూపము మహాసూక్ష్మమనియు, జాగ్రత్, స్వప్న, సుషుప్తులను మూడవస్థలకంటెను వేఱుగనున్న దనియు తెలిసికొనవలెను.

127. విషయ భోగముల నుండి తన మనస్సును వివేక బుద్ధి ద్వారా మఱలించి, జ్ఞాన విజ్ఞానములందే సంతుష్టిని బడసి నా భక్తుడు కావలెను.

128. బ్రహ్మ, ఆత్మల ఏకత్వమును అనుభవించుటయే జీవుని గొప్ప స్వార్థము, పరమార్థము అని బాగుగ యెఱుంగవలయును.

129. సుఖమును గాని, దుఃఖమును గాని ఒసంగునది తన ఆత్మ కాదు.

130. ఈ ప్రపంచము సత్వ రజ స్తమో గుణముల స్వాభావిక ప్రవాహమై యున్నది.

131. మనుజుడు అజ్ఞానవశమున ఆత్మయందు దేవత, మనుష్యుడు ఇత్యాది భేదమును, గుణదోషాదుల కల్పనను గావించుచున్నాడు.

132. తమ తమ కర్మానుసారము దైవవశమున జీవులు కలిసికొనుచు మరల విడిపోవుచు నుందురు.

133. శరీరరహితమగు ఆత్మను శరీరమని భావించుటయే అజ్ఞానము.

శివా! మానవులేపాటి

రచన : చాగంటి సీతాలక్ష్మీదేవి

సెగలుక్రక్కెడి ప్రళయ భీకర జ్వాల
నీ ఫాలనేత్రమును మండించుచుండ
చలువలు వెదజల్లు చందమామను
నీ సిగపూవుగజేసి కొనగలేదె
గళమున నిండిమండించు
హలాహల బాధనడగింపగ
శ్రీహరి పదసంజాత శీతనగోద్భవ
విమలమందాకినీ స్రవంతులను
నీ జటల యందు బంధించలేదె
బుసలు కొట్టెడి విసనాగులే
నీ యొడలెల్ల నాభరణములు కాగ
గజచర్మాంబరధారివై మసలుట
విసపుకోరల నుండి రక్షించుకొనగగాదె
పరమేశ్వరుడవైన నీవె యిటుల
వెతల నడగింప మార్గంబువెదకి కొనగ
అల్పులగు మానవులే రీతి
వక్రమార్గంబులు త్రొక్కకుండ
బాధలు బాపుకొనగలరు జగతి
కలియుగంబున నెట్లు బ్రతుకగలరు.

పసుపు, మెంతులు, శొంఠి ఒక్కొక్కటి నూరు నూరు గ్రాములు తీసుకొని 50 గ్రాములు అశ్వగ్రంధ చూర్ణంతోటి కలిపి గోరు వెచ్చటి నీటితో ఉదయం ఒకచెంచా, సాయంత్రం ఒక చెంచా భోజనం తరువాత ప్రతిరోజు తీసుకొంటే కీళ్ళనొప్పులు, నడుం నొప్పి పోతుంది.

వార్తలు

(01). 27-07-2015వ తేది సోమవారం కర్నాటక రాష్ట్రం, బళ్లారి పట్టణం " పాపయ్య " హాలు కళ్యాణ మండపంలో శ్రీ మలయాళస్వామి గీతాప్రచార సమితి, కర్ణాటక (రిజిష్టర్డ్) వారిచే దాని సంస్థాపకులు మాతృశ్రీ దుగ్గిన అనసూయమ్మ గారి నేతృత్వంలో జరిపిన శ్రీ సద్గురు మలయాళస్వాములవారి ఆరాధనోత్సవాలలో శ్రీ శుకబ్రహ్మాశ్రమాధిపతులు పూజ్యశ్రీ స్వాములవారు పాల్గొని శ్రీ సద్గురు స్వాములవారి ఆదర్శ జీవితాన్ని గురించి ఉపన్యసించారు. అట్లే మహామహోపాధ్యాయ డా ॥ సముద్రాల లక్ష్మణయ్య గారు (తిరుపతి) కూడ ఇందు పాల్గొని ఉపన్యసించారు.

అదేరోజు సాయంకాలం 6 గంటల నుండి 8 గంటల వరకు బళ్లారి అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రక్కన గల పద్మసాలి భవనం హాలులో బళ్లారి కల్చరల్ అసోసియేషన్ వారిచే ఏర్పాటు చేయబడిన పబ్లిక్ సమావేశంలో **" అన్నమయ్య సాహిత్యం "** గురించి శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్వాములవారు అనుగ్రహభాషణం చేశారు. డా ॥ సముద్రాల లక్ష్మణయ్య గారు ముఖ్యవక్తగా ఉపన్యసించారు.

(02). తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలోని శ్రీరామకృష్ణ సేవా సమాజ 61వ వార్షికోత్సవము ఆగష్టు 16 తేది జరిగినది. అందు శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(03). 31-7-2015 తేది గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వారి అధిష్ఠాన మందిరంలో శ్రీ వారిమూర్తికి అభిషేకం, అర్చన జరిగినవి. వివిధ ప్రాంతాల నుండి భక్తులు పాల్గొనినారు.

(04). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జూలై నెలలో **ఓ.పి.విభాగంలో 1157 గురికి** వివిధ కంటి పరీక్షలు జరిపి తగు చికిత్సలు చేశారు. **163 మందికి పొరలు** తీసి కండ్లలో లెన్సు అమర్చినారు. **ఎనిమిది మందికి లేజర్ ట్రీట్‌మెంట్** చేశారు.

దేశ నిర్మాతలకు పిలుపు

దేశభక్తులుగా ఉండండి. గతకాలంలో మన నిమిత్తం మహత్కార్యాలు సాధించిన మన జాతిని ప్రేమించండి.

సాహసికులైన యువకులారా!... మనకు ఏవీ అవసరం లేదు. ఈ మూడు తప్ప. అవి : ప్రేమ, నిజాయితీ, సహనం. జీవితం అంటే ఏమిటి? అభివృద్ధి, లేక వికాసం, లేక ప్రేమ. కనుక ప్రేమమయమే జీవితం, ఇదే జీవిత సూత్రం. స్వార్థపరత్వమే మరణం. ఇది ఇప్పటికే కాదు. ఎప్పటికీ సత్యమే. మనకు భవిత లేకున్నా, ఇతరులకు మంచి చేయడమే జీవితం, హాని వాటిల్లజేయడమే మరణం. నీకు కనిపించే పశుప్రవృత్తిగల మనుష్యుల్లో నూటికి తొంభైమంది మృతులే. ప్రేమించలేని మనిషి జీవన్మృతుని క్రిందే లెక్క. నిరుపేదల కోసం, పీడిత తాడిత జనుల నిమిత్తం వేదన చెందండి, పరితపించండి. భగవంతుని పాదపద్మాల వద్ద మీ అంతరాంతరాళలోని ఈ ఆవేదనను గుమ్మరించండి. అప్పుడు మీకు అజేయమైన శక్తి సామర్థ్యాలు, సహకారం సమకూరుతాయి.

– స్వామి వివేకానంద

Regd.No. TRP / 123 / 2015-17 August 2015 Rs.6/- R.No.8139/63

Date of Publication 26-07-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

______	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టై ఫెండ్	: నెలకు రూ. 1,000/-
______	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టై ఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

______	(సామవేదము/అథర్వవేదము–వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
______	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020

Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,

E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

అక్టోబర్ 2015 రూ. 6/-

సత్సాంగత్యము

"అనన్యభక్తి కలిగియున్నట్టి మహనీయులయొక్క సాంగత్యమును నాకు కలుగజేయుము" అని ధ్రువుడు విష్ణుభగవానుని ప్రార్థించెను. ఆధ్యాత్మ పథమున పురోగమించ దలచు మానవునకు సత్సాంగత్యము అత్యంతావశ్యకమై యున్నది. దుర్మార్గుల సహవాసము జీవుని అధోగతికి త్రోసివేయును.

ఎందరో ముముక్షువులు పరమార్థరంగమున ఒకింత అభివృద్ధిని బడసియు ప్రాపంచిక జనుల సహవాసముచే విషయగర్తమున కూలిపోయిన ఉదంతములు కలవు. కావున "దుస్సాంగత్యము సర్వదా త్యాజ్యము" అని నారదులు నుడివిరి. శ్రీరామకృష్ణపరమహంస సాంగత్య ప్రభావంచేతనే వివేకానందునకు పరమార్థానుభవం కలిగినది.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

౪ వేదాంతభేరి ౪

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48　　అక్టోబర్ 2015　　సంచిక : 10

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 70/-లు , విడి సంచిక రూ. 6/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

౪ వేదాంతభేరి ౪

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48　　అక్టోబర్ 2015　　సంచిక : 10

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఆదికవి వాల్మీకి - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 06
03. ధ్యానము -శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -08
04. భగవంతుడొక్కడే కర్త - శ్రీ రామకృష్ణ పరమహంస - 11
05. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి -12
06. భాగవత సుధ - శ్రీరామకృష్ణానందగిరి స్వాములవారు - 13
07. దుర్గుణ జయోపాయములు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 19
08. శ్రీరామకృష్ణానందస్వామి శతజయన్తి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 23
09. ధార్మిక జీవనము - శ్రీ స్వామి చిదానంద - 25
10. బ్రహ్మనిష్ఠాయ విద్మహే సంయమీంద్రాయ ధీమహీ తన్నో సద్గురుః ప్రచోదయాత్ - ఎస్.వి.భారతీలక్ష్మి - 28
11. ఆచార్యదేవోభవ - డా॥ కె.సర్వోత్తమరావు - 32
12. జ్ఞానసుధ - శ్రీ శంకరానందగిరి స్వాములవారు - 36
13. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 38
14. గురుపౌర్ణమి - హే శివా! కలలో నీ దర్శనము కావాలి -మిట్టపల్లి శంకరయ్య- 41
15. వార్తలు - 42

ముఖచిత్రం : పవిత్ర రామాయణ రచయిత

శ్రీ వాల్మీకి మహర్షి

27-10- 2015 తేది పౌర్ణమి

మంగళవారం వాల్మీకి మహర్షి జయన్తి

ప్రార్థన

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్ ।
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్ ॥

కవిత్వమను కొమ్మపై నెక్కి రామ రామ యను మధురాక్షరములను సుమధురముగ గానముచేయు వాల్మీకి యను కోయిలకు నమస్కారము.

యః పిబన్ సతతం రామ చరితామృత సాగరమ్ ।
అతృప్త స్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్ ॥

సదా రామచరిత్ర యను అమృత సాగరమును త్రాగుచు తనివి తీరక యుండువారును, నిర్మల హృదయులు నగు వాల్మీకి మునీంద్రునకు నమస్కారము.

సీతారామ గుణగ్రామ పుణ్యారణ్య విహారిణౌ ।
వన్దే విశుద్ధ విజ్ఞానౌ కవీశ్వర కపీశ్వరౌ ॥

సీతారాముల సద్గుణ సమూహమను పుణ్యవనమున విహరించు వారును, పరిశుద్ధ విజ్ఞానమూర్తులును అగు కవీశ్వరుడైన వాల్మీకి మహర్షికి, కపీశ్వరుడగు హనుమంతునకు నమస్కరించుచున్నాను.

ఆత్మసాక్షాత్కారం కలుగువఱకు ఉపాసన, నిదిధ్యాసనములను కొనసాగించుచుండవలయును. బియ్యము లభించు వఱకు ధాన్యమును దంచవలయును గదా !

వాసనాక్షయము, తత్త్వజ్ఞానము, మనోనాశము వీనిని సాధించుట కొఱకు సక్రమాభ్యాసము కర్తవ్యము.

" అద్వైతం త్రిషులోకేషు నాద్వైతం గురుసన్నిధౌ "ముల్లోకాలలో అద్వైత ప్రవృత్తి వుండాలి. కాని గురు సన్నిధియందు మాత్రము అద్వైతము పనికిరాదు.

' జ్ఞాని 'యొక్క కర్మఫలితమగు పుణ్యము ఆ జ్ఞానిని సేవించు వారికి, పూజించు వారికి చేరును. జ్ఞాని కర్మ ఫలమగు పాపము జ్ఞానిని నిందించువారికి చేరును. **– జగద్గురు శంకరాచార్యులవారు**



ఆదికవి వాల్మీకి

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

పవిత్రమగు రామాయణ మహాగ్రంథమును రచించిన కవీశ్వరుడు వాల్మీకి ఆదికవి అతడు మహాతపస్సంపన్నుడు, చిత్రకూటమున ఈ మునీశ్వరుని ఆశ్రమము కలదు. వనవాససమయమున సీతారామ లక్ష్మణులు వీరి ఆశ్రమమునకు వచ్చిరి. ఆ పరిసరము అత్యంత రమణీయముగను, ఫలవృక్షములచే సుశోభితముగను ఉండెను. ఆ ప్రదేశమును గూర్చి శ్రీరాము డిట్లు వచించెను.

మునయశ్చ మహాత్మానో వసన్త్యస్మిన్ శిలోచ్చయే
అయం వాసో భవేత్తాత వయమత్ర వసేమహి

' ఈ పర్వతముపై మహాత్ములగు మునులు అనేకమంది నివసించు చున్నారు. ఇది మనకు యోగ్యమైన నివాసస్థానముగనున్నది. మన మిచటనే నివసించెదము. '

యుద్ధానంతరము శ్రీరాముని ఆదేశము ననుసరించి లక్ష్మణుడు సీతాదేవిని వాల్మీకి మహర్షి ఆశ్రమ సమీపముననే వదిలి వెళ్ళెను. వాల్మీకి సీతను ఓదార్చి చెంతనేకల తాపస స్త్రీల నివాసమునందు గర్భిణియగు ఆమెను చేర్చెను. కొంత కాలమునకు సీతాదేవికి కుశలవులు జన్మించిరి. వాల్మీకి ఆ రామకుమారులిరువురికిని తాను రచించిన రామాయణమును బాగుగ నేర్పెను. శ్రీరాముడు అశ్వమేధయాగమును సలుపుచున్న సందర్భమున, వాల్మీకి ఈ యిరువురు బాలురను అచటికి తీసికొనివెళ్ళి వారిచే రామాయణమును సుశ్రావ్యముగ గాన మొనర్పింపజేసెను. సుస్పష్టస్వరముతో వారు గానము చేసిన రామాయణమును విని శ్రీరాముడు,

యజ్ఞమునకు విచ్చేసిన తదితరులు అచ్చెరువొందిరి. తచ్ఛ్రవణముచే వారు పరమానందమును బొందిరి.

శ్రీరాముని అభీష్టప్రకారము వాల్మీకి అశ్వమేధ యాగశాలయందు సభాసదుల సమక్షమున సీతచే ‘ శుద్ధత్వము’ను గూర్చిన శపథము గావింపజేసెను. వాల్మీకియు ఆ మహాసభయందు ‘సీత పరమశుద్ధురాలు’ అని ప్రకటించెను.

వాల్మీకి యొక్క కవిత్వము చాల సొంపుగా నుండును. వారు వ్రాసిన రామాయణ, యోగవాసిష్ఠ మహాగ్రంథములే అందులకు నిదర్శనములు కనుకనే వారు ఆదికవియని లోకమున ప్రఖ్యాతిని గాంచిరి.

సాధన శిబిరము

22-11-2015 కార్తీక శుద్ధ ఏకాదశి ఆదివారం నుండి 25-11-2015 కార్తీక పౌర్ణమి బుధవారం వరకు నాలుగు రోజులు సాధన శిబిరం నిర్వహించబడును. అందు జప, ధ్యాన, స్వాధ్యాయాదులు, మహాత్ముల ప్రవచనలు వుండును. ఇందులో పాల్గొను సాధకునికి ఉచిత (ఫ్రీ) భోజన నివాస వసతులు కల్పించబడును. పరిమిత సంఖ్య ప్రవేశము. అందుచేత ఇందులో పాల్గొనువారు తమ పేర్లను, వయసు వగైరా పూర్తి వివరాలతోటి అభ్యర్థనా పత్రాన్ని మీ చిరునామా (అడ్రసు) గల స్టాంపు అంటించిన కవరును జతచేసి ఆశ్రమానికి **సంచాలకులు శ్రీ శుకబ్రహ్మాశ్రమం, శ్రీ శుకబ్రహ్మాశ్రమం (పోస్టు), శ్రీకాళహస్తి, విన్ : 517640 ” అను చిరునామాకు పంపాలి. 30- 10-2015 లోపల మీ పత్రము మాకు చేరాలి.**

ఇట్లు

01-10-2015 ఆశ్రమ పరిపాలనాసంఘం

ధ్యానము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

సూర్యకాంత అద్దమును మీలో కొందరు చూచియుందురు. ఆ దర్పణము సూర్యుని కభిముఖముగా చలింపక నిలిపినచో దాని ద్వారా అగ్ని ప్రజ్వలించి క్రిందిభాగములో గల వస్తువులను దహింపచేయురీతిగా మీ మనోదర్పణమును పరమాత్మ ధ్యానాభిముఖముగా నిశ్చలముగా నిలిపితిరేని, జ్ఞానాగ్ని ప్రజ్వలించి కర్మకట్టెలను భస్మము చేయుటయే గాక అజ్ఞానమను తమస్సును సమూలముగా నాశనమొనర్చును. ఆ దర్పణము కదలుచుండినను లేక మలినపడియుండినను భాస్కర కిరణము దానిద్వారా ప్రకాశింపదుగదా ! ఇదే మహాత్ముల యొక్కయు, సామాన్యజనులయొక్కయు అంతఃకరణ వృత్తికి మార్పని మీరు గ్రహించవలయును. కనుకనే “ క్షీణదోషాః ప్రపశ్యంతి ” అని ఉపనిషత్తు లుద్ఘోషించు రహస్యము.

ధ్యానములు అనేక విధములు. అవి పరంపరాప్రకారము ననుసరించియు, పరిపక్వస్థితిని బట్టియు నుండును. ఇచ్చట నుండువారందరును వారి వారి మతానుసారముగా ధ్యానము చేయవచ్చును. సర్వేశ్వరుడొక్కడే. మార్పులన్నియు భాషలను బట్టియుండును. జల మనియు, నీళ్లు అనియు, తణ్ణి అనియు, వాటర్ అనియు, పాని యనియు ఒక్కొక్క భాషలో నుచ్చరించినను ఉదక మొకటియేగదా ? అట్లే మతమతాంతరములోగల నామములను మనము గ్రహించవలెను. ఇదే శ్రుతి “ ఏకం సత్ విప్రా బహుధా వదంతి ” అని చెప్పురహస్యము. కాబట్టి మీమీ మామూలు ప్రకారము సగుణధ్యానముగాని, నిర్గుణ ధ్యానముగాని లేక స్వరూప ధ్యానముగాని చేయవచ్చును. ప్రత్యేకమూర్తిని ధ్యానించువారు

రెండు పాదకమలములనుండి శిరస్సు వరకును, స్పష్టముగా గోచరించు వరకును, ఏక భావన చేయవలయును. లేక ముఖమండలమును, తరువాత వక్షఃస్థలమును, కటి ప్రదేశమును, జానుస్థలమును, చరణసరోజము వరకు ఒక్కొక్క అంగము హృదయములో గోచరించువరకు ధ్యానించవలయును. ఆ మూర్తికి అనుగుణములగు రూపములును సాలంకృతములుగా భావన చేయవచ్చును. ఇదియే స్థూల సగుణ ధ్యానమగును. రెండవ సగుణధ్యానము ఒకటి గలదు. అది సర్వేశ్వరుడు, సర్వచరాచరములలో వ్యాపించి యుండు వాడనియు, సత్యము, జ్ఞానము పూర్ణకరుణ, శాంతము మొదలగు గుణములు గలవాడని ధ్యానించుటయు, సగుణధ్యానమని చెప్పవచ్చును. గుణములతో గూడిన వాడగుటచేతనే సగుణుడని పేరు గలిగినది. ఇచ్చట పైజెప్పిన ద్వివిధగుణములను సగుణధ్యానమని చెప్పుదురు. వీరి అభిప్రాయ ప్రకారము సత్త్వరజస్తమోగుణములైన ప్రాకృతగుణములులేని కారణములచే సర్వేశ్వరునికి నిర్గుణుడని పేరేగాని పైనుదాహరించిన గుణములు గలవనియు, అవి అప్రాకృతములగుటచే నిర్గుణుడనియు చెప్పుదురు. మరికొందరు ప్రకాశస్వరూపుడై, కృపాసాగరుడై, వ్యాపకముగలవాడై యుండువాడే భగవంతుడని ధ్యానము చేయుదురు. నిర్గుణధ్యానములో స్వస్వరూపధ్యానమొకటి. అది తాను సత్త్వరజస్తమో గుణములు లేనివాడనియును, పంచకోశములకు సాక్షి యనియును, సాక్షి దేహత్రయమునకు విలక్షణుడనియు, ప్రపంచ సంబంధములయిన ఏలాటి గుణములు లేనివాడనియు, నిత్య, శుద్ధ, స్వయంప్రకాశుడనియు ధ్యానించుటయే. ఈ ధ్యానముచేత జీవునియొక్క అవిద్యోపాధియు, ఈశ్వరునియొక్క మాయోపాధియు వేదాంత విచారణచేత తొలగించినపుడు అఖండబోధ గలుగును. దీనికే అజపమంత్రమనియు, సోऽహంభావన యనియు, శివోऽహం అనియు పేర్లు. ఇది మహానందమును కలుగజేయును.

ఇక యోగశాస్త్రము రీతిగా మూలాధారము నుండి సహస్రార

పర్యంతముగల ఒక్కొక ఆధారచక్రముల ననుసరించిన అధిదేవతలను తత్తద్ వర్ణబీజాక్షరములతో జపపూర్వకముగ అంతర్ దృష్టిలో ధ్యానించుటయు ఒక విధమగు ధ్యానమే యగును. పూర్వము చెప్పిన సగుణ ధ్యానము చేయునపుడు మనస్సు తదనుకూల జపమును చేయుటయు, అర్చించుటయు, ఆరాధించుట గూడ గలదు. ఆ ధ్యానము లన్నిటిలోను, మనోలయము గలుగువరకు తారకాదిమూలమంత్రములను జపింపవచ్చును. ప్రాణనిరోధముగూడ చేయుట మంచిది. ఇంతవరకు చెప్పినదంతయు ఖండజ్ఞాన మనియు, అపరిపూర్ణస్థితి యనియు గ్రహించవలెను. పై జెప్పిన విషయము లేవియు పరమాత్మునికి లేనప్పటికిని, సాధకుల పరిపక్వస్థితి కొఱకు చెప్పబడినవి. ఇవి యన్నియు సాధనయే గాని సాధ్యస్థితిగాదు. అనగా అభ్యాసమేగాని, ఆరూఢావస్థగాదని తెలియదగినది. అయినను సామాన్యమని తలంపరాదు. గొప్ప మహిమ దీనిలో గలదు. సాధన సరిగా సాధింపని కారణముచే గదా ప్రస్తుత జనులు శక్తివిహీనులైరి. ఋషులు సాధనయందు పటుత్వము గలవారగుటచే అధ్యాత్మ విద్యయందు పట్టభద్రులైరి.

ఫలస్య కారణం పుష్పం ఫలం పుష్ప వివర్జితమ్ ।
జ్ఞానస్య కారణం కర్మ జ్ఞానం కర్మ వివర్జితమ్ ॥

మనకు ఫలమే గావలసియుండినను ఫలమునకు పుష్పము ఆధారముగాను, పుష్పమునకు వృక్షము ఆధారముగాను ఏలాగున నుండునో, అదేరీతిగా జ్ఞాన ఫలమే కావలసియుండినను అనుష్ఠానమను వృక్షము నుండియే భక్తి, అనగా కరుణ లేక, ప్రశాంతమను పుష్ప ముద్భవించును. దాని అంతరాళము నుండియే జ్ఞాన ఫలము గలుగుచుండును. అనుష్ఠాన వృక్షము శమదమాది పల్లవములు గల్గి సాధనచతుష్టయసంపత్తి యనెడు పత్రములచేత నలరారుచుండును. కనుక వృక్షమును చక్కగా పోషించినచో పుష్పమును, పుష్పమునుండి ఫలమును గలిగి పండు పండి, స్వయముగా క్రిందికి రాలుచున్నట్లు మంచినిష్ఠగలవారికి నైష్ఠికసిద్ధి స్వయముగా గల్గును.

శ్రీరామకృష్ణ ఉవాచ

భగవంతుడొక్కడే కర్త

– శ్రీ రామకృష్ణ పరమహంస

భగవంతుడే సమస్తం చేస్తున్నాడు. ఆయన యంత్రాన్ని నడిపేవాడు. నేను యన్త్రాన్ని అనే ఈ విశ్వాసం ఎవరికైనా కలిగినట్లైతే అతడు జీవన్ముక్తుడే సుమా ! ‘ నీ పనులను నీ వొనరుప తాజేసితిమని తలతురు ! ’ ఇది ఎలాంటిదో తెలుసా ! వేదాంతంలో ఒక చక్కటి దృష్టాంతం ఉంది. కుండలో అన్నం వండుతున్నావనుకో కాసేపట్లోనే అన్నం, బంగాళ దుంపలు, వంకాయలు అన్నీ కుండలో గెంతులు వేయడం మొదలు పెడుతాయి. అవి “ మేము కదలాడుతున్నాం, మేము గెంతులు వేస్తున్నాం ’ అని అహంకరించినట్లు తోస్తుంది. చిన్న పిల్లలు వాటిని చూసి బంగాళా దుంపలు, వంకాయలు, అన్నం నిజంగానే జీవంతోనే ఉన్నాయని, అందుకనే అవి అలా గెంతులు వేస్తున్నాయని తలుస్తారు. కానీ వాటి సంగతి తెలిసివున్న పెద్దవాళ్లు చిన్న పిల్లలకు ‘ ఆ బంగాళాదుంపలు, వంకాయలు సజీవమైనవి కావనీ, అవి తమంతట తాము గెంతులు వేయడం లేదనీ, క్రింద వున్న మంట కారణంగానే అవి అలా వున్నాయని, పొయ్యిలో నుండి మండుతున్న కట్టెను గనుక తీసేస్తే అవి ఇక ఎంతమాత్రం కదలాడవు అని వివరిస్తారు. అదేవిధంగా జీవుడికి నేను కర్తను, అనే అహంకారం అజ్ఞానం నుండి జనిస్తుంది. భగవంతుని శక్తి మూలంగానే అందరూ శక్తిమంతులు. తీగ ద్వారా లాగబడినప్పుడు తోలుబొమ్మలు రంగస్థలం మీద చక్కగా నాట్యం చేస్తాయి. కానీ తీగ తెగిపోయినపుడు అవి ఇక కదలవు, మెదలవు.

భగవద్దర్శనం కానంత వఱకు, పరసవేది స్పృశించనంతవఱకు “ నేను కర్తను అన్న భ్రమ ఉంటుంది. నేను మంచి పనులు చేస్తున్నాను. చెడ్డపనులు చేస్తున్నాను. ” అన్న ఎరుక ఉంటుంది. ఆ విధంగా అవి వేర్వేరు అన్న ఎరుక భగవంతుని మాయవలననే కలుగుతుంది. తన మాయా సంసారాన్ని నడపించడానికి భగవంతుడు ఈ విధమైన ఏర్పాట్లు చేశాడు. విద్యా మాయను ఆశ్రయించడం ద్వారా సన్మార్గాన్ని అనుసరించడం వల్ల ఆయన్ను పొందవచ్చు. భగవంతుణ్ణి పొందినవాడు, ఆయనను దర్శించుకొన్నవాడు మాత్రమే మాయను దాటి పోగలడు. “ భగవంతుడొక్కడే కర్త, నేను అకర్తను ” అన్న విశ్వాసం ఎవరికైతే వుంటుందో అతడే జీవన్ముక్తుడు.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత – డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వామి
(గవి మఠం)

నీటిలో నిలబడి వున్నా బట్టను ఉతికే చాకలివాడు నీటి దప్పిక వలన ప్రజ్ఞాహీనుడై చచ్చిపోతున్నాడు. అలాగే తమలో వున్న మహాచైతన్య స్వరూపుడైన చెన్న మల్లికార్జునుని తెలుసుకోలేక జీవనము సార్థకము చేసుకోలేకపోతున్నారు.

81. మానవునకు చింతలు అనంతమైనవి. ఈ లోక చింత విడిచిపెట్టి శివ చింత చేయాలి. నాకు శివుడు అనుగ్రహిస్తాడో లేదో అనే చింత, శివ భక్తుల ఆదరణ చెందుతానో లేదో అనే చింత, శివశరణులు అనుగ్రహిస్తారో లేదో అనే చింత ఈ విధంగా చెన్నమల్లికార్జునదేవుని చింత తప్ప వేరే వ్యవహార చింత లేదు. ఎల్లప్పుడు ఆధ్యాత్మిక చింతనము చేస్తేనే ఆత్మోద్ధరణము సాధ్యమౌతుంది.

82. శివ భక్తులకు కాశి, కేదార శ్రీశైలములు దివ్య క్షేత్రములు. అక్కడ జ్యోతిర్లింగములు వుండును. నిజంగా శివశరణుల నివాసమే కాశిక్షేత్రము. పురాతనములైన శివభక్తుల ‘ నివాస’ములో (68) అరవై ఎనిమిది తీర్థములు వుండునని శివభక్తుల సద్భావన. దీనికి ఆగమ ప్రమాణమున్నది. శివశరణుల ఇంటిని చుట్టివచ్చిన శ్రీశైలగిరి దర్శనమైనట్లు. ఆ శివశరణుల ఇంటికి కుడి, ఎడమ ప్రక్కన కేదార క్షేత్రముంటుంది. శివశరణుల ఇంటిలో చూస్తే కాశీ విశ్వేశ్వరుడే కనబడుతాడు. వైరాగ్యమే బీజమై, భక్తి చిగురించిన విరక్తియే ఫలమై చెన్నమల్లికార్జున శివభక్తుల ఇల్లు త్రివేణి సంగమమై ముక్తికి మార్గమై వెలుగును.

87. శివశరణుల సత్సంగము పెరుగునుచిలికి వెన్నతీయునట్లు. అజ్ఞానుల సంఘ సహవాసము రాయికి రాయి తగిలి అగ్ని పుట్టినట్లు, శివశరణుల సహవాసము కర్పూర పర్వతానికి అగ్నితాకితే ఆ అగ్ని కర్పూరము ఒకటై పోవును. ఆ విధంగా శివశరణుల సహవాసముతో భక్తుడు శివుడై వెలుగును.

భాగవత సుధ

– శ్రీ రామకృష్ణానందగిరి స్వాములవారు,
(గండిక్షేత్రము)

క. “ గోవింద నామకీర్తన
గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి
త్రీ విభుడు సూఱగొనియెను
గైవల్యము దొల్లి రెండు గడియల లోనన్. ”

భాగవత సుధాపానకుతూహల చిత్తులారా ! భక్తులారా !
“ పరీక్షిచ్ఛుకసంవాదం – శృణు భాగవతం హి తత్ ”

అధికారి శిష్యుడు, అనుభవ గురుడు. ముత్తెపు చిప్పలో స్వాతి చినుకు పడడం తరువాయి, ముత్తెమై కూర్చుంది.

క్రొత్త బ్లాటింగ్ పేపరు : అంటించడం తరువాయి : అమాంతం చప్పున లాగేస్తుంది. చిత్తము శుద్ధమైందా. తత్త్వము స్వయంసిద్ధము, “ చిత్” అనగా చైతన్యము, అదే తత్త్వము. అదే ఆత్మ. “ చిత్తము ” అనగా సంచిత సంస్కారాలు, వాసనా సముదాయం. వీటి అనిర్వచనీయ సంబంధమే చిత్తము. చిత్తములోని వాసనలు నిర్మూలనమైతే చాలు, అదే “ చిత్ ”.

విరాగమే చిత్తశుద్ధి “ వైరాగ్యం బంతటి కిని కారణము, వైరాగ్యము లేని వాచాజ్ఞానము నాటకం లోని కత్తి. ఆ కత్తి నాటకంలోకి పనికివస్తుంది. కాని, యుద్ధానికి పనికిరాదు. “ వాచా బ్రహ్మంబు పల్క వద్దుర వేమా ! ”

శివుడు శ్మశానంలో నివసిస్తాడు. ఆయన స్వచ్ఛుడు, స్ఫటికమణి విభుడు, నిరావరణుడు, జ్ఞానము స్వచ్ఛము, నిరావరణము. జ్ఞానానికి ఆధారభూమి వైరాగ్యము. నీవు శ్మశానానికి పోనక్కరలేదు. నీ మనస్సును శ్మశానం చెయ్. అందులో శివుడు నివసిస్తాడు.

శివుడొక్కడే నిజం, ఈ భూత ప్రపంచము మొత్తం మహాశ్మశానము. చైతన్యమొక్కటే నిజం ? ఈ దృశ్యజాల మంతా మిథ్య. జ్ఞాననేత్రంలో ద్వైత పటలాన్ని భస్మం చేసి మహాశ్మశానంలో పరమశివుడవై విరాజిల్లు. “ తత్త్వమసి.”

“ పరీక్షిన్మహారాజా ! ‘ యేడు దినంబుల ముక్తింగూడగ నేరీతి వచ్చు’నని ప్రశ్నించావు. పూర్వ కాలంలోని ఒక యితివృత్తాన్ని వివరిస్తాను విను.

“ ఖట్వాంగో నామ రాజర్షిః
జ్ఞాత్వేయత్తామిహాయుషః !
ముహూర్తాత్సర్వ ముత్సృజ్య
గతవానభయం హరిమ్ !! ” (2 – 1–13)

సీ. “ కౌరవేశ్వర ! తొల్లి ఖట్వాంగుడను విభుం
డిలనేడు దీవులనేలుచుండి
శక్రాది దివిజులు సంగ్రామ భూముల
నుగ్ర దానవులకు నోడివచ్చి
తమకు దోడడగిన ధర నుండి దివికేగి
దానవ విభులనందఱ వధింప
వరమిత్తు మనుచు దేవతలు సంభాషింప
జీవిత కాలంబు సెప్పుడిదియు

ఆ. వరము నాకు నొండు వరమొల్ల ననుపుడు
‘ నాయువొక ముహూర్తమంత దడవు !
గలదటంచు బలుక గగన యానమున న
మ్మాన వేశ్వరుండు మహికి వచ్చి.

క. గిరులంబోలెడి కరులను
హరులం దనప్రాణదయితలై మనియెడి సుం

దరులను హితవరులను బుధ
వరులను వర్జించి గాఢ వైరాగ్యమునన్.

క. గోవింద నామ కీర్తన
గావించి భయము దక్కి ఖట్వాంగధరి
త్రీవిభుడు సూరగొనియెను
గైవల్యము దొల్లి రెండు గడియల లోనన్. "

వైరాగ్యం మాట ఎత్తుకోరాదు, బ్రహ్మజ్ఞానం కావాలె. ఆసక్తి అల్ప స్వల్ప వస్తువుల మీద, జ్ఞానము బ్రహ్మజ్ఞానము కావాలె. ఇదీ యిప్పటికి మన తీరు.

వేదాంత విచారాలు యేండ్లు. పూండ్లు చేస్తున్నాము. బ్రహ్మానుభూతి సున్న, ఎందుకో ! మసి గుడ్డకు రంగు అంటుతుందా ? ధ్యానాలు, యోగాలు చేస్తున్నాం. జపాలు, తపాలు చేస్తున్నాం. చిత్త ప్రశాంతత లేదు. ఆత్మ సంతృప్తి లేదు. ఎందుకో ! వైరాగ్యం లేదు. " రాగోలింగ మబోధస్య " రాగము అజ్ఞానానికి చిహ్నం. ప్రేమ అన్నం మీద, జ్ఞానం ఆత్మ జ్ఞానం కావాలె. ఆరే, ఎంత కపట నాటకం !

' ముక్తి ' అంటే వదలుట. తెలుపు గుడ్డలోనే వుంది. క్రొత్తగా తెచ్చుకునేది కాదు. సబ్బు మురికిని వదిలిస్తుంది. కాని తెలుపును తెచ్చి పెట్టదు. ఇంటిని శుభ్రం చేయుమని అంటాం. శుభ్రం చేసేదేమీ కాదు. అశుభ్రాన్ని తీసేస్తే శుభ్రం వుండనే వుంది. సాధనలు ప్రతిబంధనివృత్తి చేస్తాయి. తాను నిత్యముక్తుడు. " విముక్తశ్చ విముచ్యతే."

జనక చక్రవర్తి తనకు ముక్తి కావాలని అపేక్షించాడు. " ఒక రికాబులో నుండి మరో రికాబులో కాలు మార్చే లోపల ముక్తి రావాలె" ఇది ఆయన కండిషన్. ఏ గురువులకు, ఏ పండితులకు యీ సమస్యకు పరిహారం అంతు పట్టలేదు. ముక్తి కావాలంటే, పండ్రెండేండ్లు తపస్సు చేయాలె. మదతన పండ్రెండేండ్లు గురుసేవ చేయాలె. ఎంతో కష్టపడాలె. అంత తేలికగా ముక్తి

వస్తుందా ? " ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యై ర్వినాలభ్యతే. "

ఏమేమో మథనపడ్తున్నారు. అష్టావక్ర మహర్షి విచ్చేశాడు. " మహారాజా! ముక్తి యిప్పుడు నీకు లేదా ! ఎక్కడినుంచో వస్తుందా ? భూతాన్ని మరచిపో ! భవిష్యత్తును చింతించకు. నిత్య వర్తమానమైన ఆత్మలో నిలకడ బొందు ! ' తత్త్వమసి '. ' అది నీవు అయి వున్నా 'వని వేదం చెప్పింది. ఎప్పుడో అవుతావని చెప్పలేదు. ' భ్రాంతులుడిగిన బ్రహ్మంబు బట్ట బయలు. " చైతన్యాన్ని బంధించే త్రాళ్ళుంటాయా ? సంకల్పమే బంధం. నిస్సంకల్పమే మోక్షం. తను, మన, ధనాలను గురువుకు అర్పణం చెయ్. అసలుకు మాట్లాడ్తే అవి నీవై వుంటే కదా, అర్పణం చేయడమనే ఈ మాట కూడ. అనాత్మాకార వృత్తిని తిరస్కారం చెయ్. అన్య భావనను నీలోకి రానీయాకు. అదే మౌనం. అదే ముక్తి.

శ్రీ రమణ మహర్షుల వారి వద్దకు ఒక భక్తుడు వచ్చాడు. " స్వామీ! నాకు ఉపదేశం కావాలె. ఎప్పుడిస్తారండీ ? " అని అడిగాడు. " ఎవరూ లేనప్పుడు " అని జవాబు వచ్చింది. వాడు ఎవ్వడూ లేని సమయం చూచి వచ్చి " స్వామి ! నేను వచ్చినాను. ఎవ్వరూ లేరండీ " అని అన్నాడు. " నేనును వెంట తీసుకొని వచ్చావే " అని మహర్షుల వారు అన్నారు.

" అపదేశ ముడిగితే అదే ఉపదేశం "–తాను తన స్థానంలో వుండక పరస్థానంలో చేరుటే అపదేశం. తన స్థానంలో వుండుటే ఉపదేశం.

సీ. కమనీయ భూమి భాగములు లేకున్నవే
పడి యుండుటకు దూది పఱుపులేల ?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే
భోజన భాజన పుకంజమేల ?
వల్కలాజిన కుశావళులు లేకున్నవే
కట్టదుకూల సంఘంబులేల ?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే

ప్రాసాదసౌధాది పటలమేల ?

తే.గీ. ఫల రసాదులు గురియవే పాదపములు ?
స్వాదు జలముల నుండవే సకల నదులు
బొసక భిక్షంబు వెట్టరే పుణ్యసతులు
ధనమదాంధుల కొలువేల తాపసులకు ?

క. రక్షకులు లేనివారల రక్షించెద ననుచు చక్రి రాజై యుండన్
రక్షింపు మనుచు నొకనరునక్షము బ్రార్థింపనేల యాత్మజ్ఞులకున్.

" పరీక్షిత్తూ ! ముక్తి యేడు దినాలు ప్రయాణం చేసి రావలసినంత దూరంలో లేదు. వచ్చిన లోపమంతా వైరాగ్యం లేకపోవడమే. ' బ్రహ్మ సత్యం- జగన్మిథ్యా ' ఉపన్యాసవేదికల మీద ఎవడైన తనకు నమస్కారం చేయలేదే - చేయలేదే. ఒకటే తనకులాటం. " ఎట్లు కనపడు బ్రహ్మ మిట్టి జీవులకు " - అని ఒక దాసరయ్య పాడనే పాడాడు.

హృదయంలో వుండే పరమాత్ముని నిర్లక్ష్యం చేసి ధన దుర్మదాంధుల పంచల పడి కాయవలసిన పని వివేకవంతునికి యేముంది. ' కస్మాత్ భజంతి కవయో ధనదుర్మదాంధాన్ ? నీతి తప్పి న్యాయం తప్పి పైపెచ్చు ప్రగల్భాలను బజాయిస్తూ పటాటోపం వొలకబోసే వందల నేస్తంతో పరమార్ధ సాధకునికి పని యేముంది ? కాయను కాయ పోషిస్తుందా ? అన్ని కాయలను పోషించేది చెట్టు సుమా ? సర్వదాత, ప్రాణ వల్లభుడు ప్రభువు తన వద్దనే వున్నాడు.

లగేజీ పెరిగేకొద్దీ ప్రయాణం కష్టమైపోతుంది. ఇంటిలో సరుకులు సామగ్రులు ఎక్కువ భర్తీ అయితే, మంచి గాలి రాదు.

నేల మీదనే నిద్రపట్టేటట్లయితే పరుపులు వగైరా బాదరబందీ ఎందుకు? శీలరక్షణానికి, శీతల రక్షణానికి సరిపోయే బట్టలు లభిస్తుండగా విలువైన దుస్తులతో, వస్త్రాలతో ఏమి పని ? పరమార్ధ సాధకునికి ' లగ్జరీ ' జీవితం పనికి రాదు. అవసరాలు పెంచుకునే కొద్దీ, పరాధీన జీవితం పాలిట పడక తప్పదు. ఇది సామాన్య సంసారుల మాట కాదు సుమా ! సాధకుల గురించిన మాట. పరీక్షిత్తూ ! పరమాత్మ మీద, ప్రాప్తం మీద, ప్రారబ్ధం మీద విశ్వాసం పెట్టుకొని పరమార్ధజీవి పయనం సాగిస్తాడు. ఆత్మవిశ్వాసంతో ఆత్మానుగ్రహాన్ని సంపాదించు, దైవానుగ్రహం లభిస్తుంది. గురు అనుగ్రహం,శాస్త్రానుగ్రహం నీకు కలిసి వస్తాయి. అన్ని అనుగ్రహాలకు మూలం ఆత్మానుగ్రహమని గుర్తించు. ' మానవనాధా ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్. మహారాజా ! నీవు ముక్తి సామ్రాజ్య పట్టభద్రుడవయ్యా ! ' అభయం వై జనకః ప్రాప్తో 2 సి. !

1). ఆశ్రమ శివాలయానికి

(1). శ్రీమతి పాకనాటి ప్రమీలాదేవి గారు రూ. 1,00,000/-
(హైద్రాబాద్) పూజనిధికి ఇచ్చినారు.

2). ఆశ్రమ కంటి ఆసుపత్రికి

(1). అన్నైనవమణి ట్రస్టువారు ప్రతినెల రూ. 10,000/-
(గుఱ్ఱంగూడ, ఇంజాపూర్) పంపుతున్నారు.

(2). కొడాలి సుభద్రమ్మ ట్రస్టు వారు రూ. 80,000/-
(గుంటూరు) స్లిట్ లాంపు ఇచ్చినారు

3). ఆశ్రమ భోజనశాల నిధికి

1). పి.వి. బ్రహ్మం గారు (హైద్రాబాద్) రూ. 50,1116/-
తల్లిదండ్రుల పేరిట అన్నదాన నిధికి ఇచ్చినారు.

2). కె.ప్రమీలారాణి గారు రూ. 10,000/-
(గాజువాక, విశాఖపట్నం) ఇచ్చినారు.

3). సీతంరాజు వెంకట శ్రీధర్ గారు రూ.11169/-
(పాతగాజువాక, విశాఖపట్నం) ఇచ్చినారు.

వీరందరిని శ్రీకాళహస్తీశ్వరుడు అనుగ్రహించు గాక !



దుర్గుణ జయోపాయాలు - 4

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

రజోగుణ తమోగుణములు పరమార్థ లక్ష్యసాధనయందు గొప్ప ప్రతిబంధకములై యున్నవి. వానిని ముముక్షువు దూరీకరించవలెను. వానిని తొలగించివేయు మార్గమిచట తెలుపబడినది. సత్త్వగుణ సంపాదనమే ఆ మార్గము. ఋణము పోవలెననిన ధనము నెట్లు సంపాదించవలెనో. అంధకారము తొలగవలెననిన ప్రకాశావిర్భావ మెట్లేర్పడవలెనో, అట్లే రజోగుణ, తమోగుణరూప దుష్టద్వయ మంతరించవలెననిన, సత్త్వగుణరూప సల్లక్షణమునే జీవుడాశ్రయించ వలెను.

అధిక నిద్ర, మత్తు, సోమరితనము (అలసత్వము) మున్నగునవి తమోగుణ లక్షణములు. కామక్రోధాది దుర్గుణములు రజోగుణములు కరుణ, దయ, ప్రేమ, పరోపకారము మున్నగునవి సత్త్వగుణలక్షణములు. కావున సత్త్వగుణ లక్షణములైన దైవీక గుణములను జీవుడాశ్రయించి రజోగుణ తమోగుణ లక్షణములను హృదయము నుండి పారద్రోలవలెను. పాపమును గెంటివేయగల స్తోమత పుణ్యమునకు గలదు. కావున జీవుడు మొట్టమొదట పుణ్యసంపత్తి నాశ్రయించవలెను. “ రజస్తమశ్చ సత్త్వేన ” అను భాగవత వాక్యముయొక్క భావమిదియే అయియున్నది.

అయితే కేవలాత్మస్థితియందు, అనగా నిర్వికల్ప సమాధియందు జీవుడు సత్త్వగుణమును గూడ దాటివైచి గుణాతీతస్థితిని, లేక నిర్గుణస్థితిని బడయును. అత్తఱి శుభాశుభ సంకల్పములెవ్వియు లేక, కేవలము నిస్సంకల్పస్థితి, ఆత్మస్థితియే జీవున కుండును. అది సర్వోత్తమ దశయని యెరుగవలెను. సత్త్వగుణము పవిత్రవంతమైనను అదియు దృశ్యవర్గమున

జేరినదగుటచే ప్రకృతి స్వరూపమే యగును. కావున ఏనాటికైనను మనుజుడు దానిని గూడ దాటివైచి దృక్స్వరూపమగు కేవలాత్మస్థితిని గ్రహింపవలెను. అయితే సత్త్వగుణము నిర్మలమైనదియు, ప్రకృతియొక్క శుద్ధాంశమును అయియుండుటవలన జీవన్ముక్తులగు మహనీయులు తమ వ్యుత్థానదశయందు ఆ సత్త్వగుణము నాశ్రయించి దైవీసంపత్తిని జేబూని లోకోపకారకార్యముల నొనర్చుచుందురు. కావున సాధకుడగువాడు మొట్టమొదట రజస్తమోగుణములను, వాని కార్యములను త్యజించి వైచి సత్త్వగుణమువరకు వచ్చి, దానిని లెస్సగ పదిలపఱచుకొనవలెను. ఆ పిమ్మట క్రమముగ అభ్యాసవశమున దానినిగూడ దాటివైచి నిర్గుణ కేవలాత్మస్థితిని బొందవలెను. ఇదియే జీవితలక్ష్యము.

ఇదివఱలో చెప్పిన కామాదిదుర్గుణములన్నిటిని మనుజుడు గురుభక్తిచే బాగుగ జయించివేయగలడని “ రజస్తమశ్చ సత్త్వేన ..... ఏతత్సర్వం గురౌ భక్త్యా ” అను భాగవతశ్లోకము విశదీకరించుచున్నది. ఏలయనగా, గురుభక్తి పరిపూర్ణముగ గలవాడు గురువాక్యములను కార్యాన్విత మొనర్చుటకై బద్ధకంకణుడై యుండును. గురువు నడచిన పంథాను తానున్ను చక్కగ అనుసరించును. గురువు యొక్క ఆచరణయే తానున్ను గలిగియుండులాగున యత్నించును. కాబట్టి గురుభక్తికలవాడు దుర్గుణములన్నిటిని అవలీలగ దాటివేయగల్గును. మఱియు గురుభక్తి వలన మనుజుడు గురుకృపకు పాత్రుడు కాగల్గును. సర్వేశ్వరుని యొక్కయు కృపావిశేషము కలవాడు, వారలయనుగ్రహమును జూరగొనినవాడు మాయాబంధమును, ప్రకృతి దాస్యశృంఖలమును సులభముగ ఛేదించి వేయగలడు. కావున మోక్షకాంక్షి యగు మానవునకు గురుభక్తి, దైవభక్తి అత్యంతావశ్యకములై యున్నవి. దుర్గుణ జాలమును విచ్ఛిన్న మొనర్చుటయం దియ్యవి ప్రముఖపాత్రను వహించుచున్నవి. కావున ముముక్షువు వీని నేకాలమందును వదలరాదు. ఈ ప్రకారముగ పెక్కు ఉపాయములచే జీవుడు తన యందున్న కామాది దుర్వాసనలను పారద్రోలి, దుర్గుణములను రహితమొనర్చుకొని, విశుద్ధ హృదయుడై బ్రహ్మానుభూతిని

బడయవలయును. దుర్గుణములకు, దుర్వాసనలకు, దుస్సంకల్పములకు తన హృదయమందు ఏమాత్రము చోటీయరాదు. అవి అగ్ని వంటివి. హృదయమును తాపముతో, దుఃఖముతో, అశాంతితో అవి నింపివేయును. కావున శీఘ్రమే ఆ అగ్నులను తొలగించుకొని సంతాపరహితుడై పఱగ వలయును.

సామాన్యముగ తాటియాకుమంట త్వరలో చల్లారిపోవును. చింతకట్టెలమంట కొంతసేపుండి మఱల చల్లారి పోవును. భోగిమంట ఒక రాత్రియంతయు మండి తదుపరి ఉపశమించిపోవును. ఏ అగ్నియైనను రగుల్కొల్పిన కొంతసేపటికి దానంతట నదియే శాంతించిపోవును. కాని రావణకాష్ఠము మాత్రము ఇంతవరకు చల్లారలేదట. ఇవ్విషయమున ఆశ్చర్యపడవలసిన పని లేదు. ఎందుకనగా దానిని మించిన అగ్నులు కొందఱి జనుల హృదయసీమలందు ప్రచండవేగముతో జ్వలించుచున్నవి. అవియే కామాగ్ని, క్రోధాగ్ని, అసూయాగ్ని, ద్వేషాగ్ని మున్నగునవి. వానిని చల్లార్చవలెనను సంకల్పముగాని, చల్లార్చినచో అనంతానందము తమకు కలుగునను భావముగాని జనులయందుదయించుట లేదు. ఉదయించెనా కడతేరినట్లే యగుదురు.

దూరముగ అగ్ని ఉన్నపుడు కూడ ప్రమాదమునకు అవకాశ ముండగా, ఇక దగ్గఱగా, అతి సమీపమున నున్నచో వేఱుగ చెప్పవలెనా? తన యంతః కరణముననే అగ్ని యున్నచో ఇక శాంతికి ఆస్కార మెచట? దుష్టగుణములను సామాన్యముగ అగ్నితో పోల్చుదురు. అగ్నికి దహించివేయు గుణము కలదు. అట్లే దుర్గుణములు జీవుని చిత్తమును దహించివేసి నరకకూపమున నాతనిని బడద్రోయును. గీత 3వ అధ్యాయమున కామక్రోధములను గూర్చి చెప్పు ప్రసంగమున భగవానుడు వానిని 'అనలమ్ ' అని పేర్కొనెను. ' అనలమ్ ' అనగా అగ్నియని అర్థము. " కామాగ్నిని, క్రోధాగ్నిని ముందు చల్లార్చి వేయుడు ! అపుడు ఆత్మజ్ఞానము మీకు చక్కగ లభించగలదు. "– అని శ్రీ కృష్ణమూర్తి జనులను హెచ్చరించెను. కాబట్టి హృదయమున అట్టి అగ్నులు రగుల్కొనకుండ చూచుట, ఒకవేళ

రగుల్కొనినచో జాగరూకతతో వానిని చల్లార్చి వేయుట, నశింపజేయుట విజ్ఞుల పరమకర్తవ్యమై యున్నది.

కొందఱు తమ హృదయమును అతి నిర్మలముగ గావించుకొని మహా జాగరూకులై కామమునకు గాని, క్రోధమునకు గాని తదితర వికారములకు గాని ఒకింతైనను అవకాశ మివ్వకుందురు. వీరు ఉత్తమోత్తములు, మఱికొందఱు క్రోధాదివికారములు తమయం దుదయించిన వెంటనే జాగ్రతపడి వానిని తరిమి వేయుదురు. వీరు ఉత్తములు. ఇక కొందఱు ఆయా వికారములు జనించి కొంత దుష్పరిణామము కలిగిన వెనుక తెప్పరించుకొని తదుపరి వానిని ప్రయత్నపూర్వకముగ సాగనంపుదురు. వీరు మధ్యములు. కొందఱు కామక్రోధాదు లుత్పన్నమైనపుడు, అజాగ్రతవహించి, ప్రమత్తులై ఆ దుష్ట వికారములనుపారద్రోలక, వానికి ఆశ్రయ మొసంగి ఆ దుష్టరాక్షసులను యావజ్జీవితము చక్కగ మేపుచుందురు. అట్టివారు అధములు జనులలోని ఈ వివిధ సంస్కారములను శాస్త్రకారు డెంత చక్కగ వర్ణించెనో చూడుడు.

ఉత్తమే క్షణకోపం స్యాన్మధ్యమే ఘటికాద్వయమ్
అధమే తు అహోరాత్రం నీచే తు మరణాన్తికమ్.

" ఉత్తములకు ఎపుడైన కోపము వచ్చిన క్షణకాలము మాత్రమే ఉండును. తదుపరి సమసిపోవును. మధ్యములకు రెండుఘడియల సేపుండును. అధములకు ఇరువది నాలుగు గంటల కాలముండును. నీచులకు యావజ్జీవితము ఉండి వేధించుచుండును. " ఉత్తములకు వచ్చు కోపము నీటిపై వ్రాతవంటిది. నీటిపై అక్షరము వ్రాసినచో వ్రాసిన మరుక్షణమే అంతమైపోవును. మధ్యములకు వచ్చు కోపము ఇసుకపై వ్రాతవంటిది. ఇసుకపై అక్షరము వ్రాసినచో కొంతసేపుండి మరల గాలికి తుడుచుకొనిపోవును. అధములకు వచ్చు కోపము నల్లరాతిపై చెక్కిన అక్షరము వంటిది. అది చాలకాలముండును. కాబట్టి విజ్ఞులగువారు జాగరూకులై ఆ కామక్రోధాది అసురసంపత్తిని దరికి జేరనీయక చూడవలయును.

శ్రీరామకృష్ణానందస్వామి శతజయన్తి

- మహామహోపాధ్యాయ

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

ఈ కాలంలో సమకాలీయులైన ఇట్టి మహా పురుషులను దర్శించ గలిగిన భక్తకోటి గూడా అదృష్టవంతమైనదే.

శ్రీ రామకృష్ణానందస్వామివారిలో నిరాడంబరత ఒక మహోన్నత గుణం. వారెప్పుడూ ఆర్భాటాలకూ, అనవసర ప్రచారాలకూ ఆస్కారమిచ్చే వారు కారు. చిన్న చిన్న జనపదాలకు గూడ నడుచుకొంటూ వెళ్ళి భక్తులననుగ్రహించిన సాధుశీలురు వీరు.

ఇక తమ వద్దకు వచ్చే వివిధ భక్తులకు ప్రేమతో, ఆప్యాయతతో వీరు పలకరించి ఆదరించిన విధానం ప్రశంసనీయం. సముద్రంలో కలిసే ఒక నది, తన్నే ఆ సముద్రం ప్రేమతో చేరదీస్తున్నదని భావిస్తుందట ! కాని దానికి మరొకచోట ఇంకొక నదిని గూడా ఆ సముద్రం అలాగే చేరదీస్తున్నదని తెలియదు. అట్లే స్వామి భక్తులు ఈ స్వామి తమనే అత్యధిక ప్రేమతో అనుగ్రహిస్తున్నారని భావించేవారు. కాని స్వాములవారు అందరినీ సమదృష్టితో చూచి అనుగ్రహించేవారు.

" సమబుద్ధే యిందరికీ సర్వ వేదసారము
సముడిందరికీ హరి సాధనమో యయ్యా !

అన్న అన్నమయ్య సూక్తి శ్రీ రామకృష్ణానందస్వాములవారిలో అక్షరశః గోచరించేది.

నేను రచించిన ' శ్రీ మలయాళస్వామి జీవితచరిత్ర ' " యోగవాసిష్ఠానువాదం ", అన్నమాచార్య సంకీర్తనామృతం ' అన్న మూడు గ్రంథాలకు ముందుమాట వ్రాసి శ్రీ స్వాములవారు నన్ను ఎంతో ఆదరంతో అనుగ్రహించారు. వారి అవ్యాజ ప్రేమను నేను ఎన్నటికీ మరువలేను.

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార కార్యక్రమంలో ఆరునెలల కాలం పుత్తూరు ప్రాంతంలో శ్రీ స్వాములవారు కార్యకర్తృత్వం వహించి అచ్చటి భక్తులలో ఎంతో ఆధ్యాత్మిక చైతన్యం కల్గించారు. నాటి ధర్మప్రచారపరిషత్తుకు కార్యదర్శిగా ఉండిన నేనూ ఆ కార్యక్రమంలో పాలుపంచుకొని ధన్యుడనయ్యాను.

తీవ్రమైన అనారోగ్య స్థితిలో ఉండి కూడా శ్రీ మాతా ప్రతిభా నందగిరి వారు ఐదు రోజులు (13 - 07-2015 నుండి 17-07-2015 వరకూ) శ్రీ స్వాములవారి శతజయంతీ మహోత్సవాలను శ్రద్ధాభక్తులతో నిర్వహించి స్వామి అనుగ్రహానికీ, భక్తుల కృతజ్ఞతకూ పాత్రులయ్యారు. ఎందరో ఆశ్రమాధిపతులు, పీఠాధిపతులు, సాధుపుంగవులు, సాధ్వీమణులు ఈ ఉత్సవాలలో పాల్గొని ప్రబోధాలు గావించారు. మంగళప్రదంగా కార్యక్రమాలు సమాప్తమయ్యాయి.

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

1.	పరుచూరి రంగారావు (హైద్రాబాద్)	రూ. 1200/-
2.	ఆదూరు రాఘవరావు (నెల్లూరు)	రూ. 1500/-
3.	జె. మల్లిక (గుంటూరు)	రూ. 1200/-
4.	అల్లూరి రత్నాజిరావు (జి.ఎస్.పురం,జె.ఆర్.గూడెం)	రూ. 1200/-
5.	పొన్నం లక్ష్మీపార్వతి (మర్లపాళెం, గన్నవరం మండలం)	రూ. 1200/-
6.	వి. శ్రీనివాస్ (పూనె, మహారాష్ట్ర)	రూ. 2100/-



ధార్మిక జీవనము

ఆంగ్లమూలం : స్వామి చిదానంద సరస్వతి
(దివ్యజీవన సంఘం, ఋషీకేశ్)

అనువాదం : ఎ.తారాలక్ష్మి, ఎం.ఎ,ఎ.ఇ.డి, ఎం.ఫిల్.

ప్రస్తుతం మనం జీవిస్తూన్న ఆధునిక సమాజం పూర్తిగా సమస్యల మయం. దుఃఖం, అశాంతి, అభద్రతా భావాలు సర్వత్రా వ్యాపించి యున్నాయి. సంసారఘోరారణ్యములో జనులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుచున్నారు. సామాన్య మానవునకు సుఖసంతోషాలు, శాంతి సామరస్యాలు గగన కుసుమాలుగా తోస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా ప్రాచ్య మరియు పాశ్చాత్య దేశాలవారంతా శాంతియుత జీవనానికి మార్గాలు అన్వేషిస్తున్నారు. మేధావులెందరో వైయక్తికంగానూ మరియు సామూహికం గానూ మానవత్వానికి పట్టిన జాడ్యానికి పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నారు. ప్రభుత్వాలు వివిధ కమిటీలను నియమించి రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో నెలకొని ఉన్న జటిల సమస్యలను నిర్మూలించేందుకు నడుంకట్టాయి.

అయితే ఈ సృష్టిలో ప్రతి విషయము ఒకనియతి ప్రకారమే జరుగుతుంది. అదియే కార్యకారణ సంబంధము. జీవునికి తెలిసి చేసినా, తెలియక చేసినా, లేక తెలిసికూడా ఉపేక్షా భావంలో చేసినా సరే సృష్టిలో జరిగే ప్రతికార్యానికి తత్ సంబంధమైన కారణం ఉండియే తీరుతుంది. ప్రతి ఒక చర్యకూ అంతే సమానమైన ప్రతిచర్య తప్పక ఉంటుంది. దేనినైతే విత్తుతామో అదే ఫలిస్తుంది. కనుక మానవజీవితం ఎదుర్కొనే అశాంతి, దుఃఖం మొదలైన సమస్యలకు కారణమైన ఏదో ఒక అదృశ్యకారణం ఉండియే ఉంటుంది. అందుకే సమస్యలను తొలగించాలంటే వాటికి మూల

కారణాన్ని కనుగొని దానిని తొలగించాలి. ఒక వ్యాధిని నయం చేయాలంటే వ్యాధి కారకములైన కారకాలను నశింపజేస్తేనే ఆ వ్యాధి నయమవుతుంది. అలాకాక ఎన్ని భౌతికమైన ఉపాయాలను ప్రయోగించినా ఫలితం కేవలం తాత్కాలికమే. ఎంతవరకు మూలకారణాన్ని నశింపజేయలేదో అంతవరకు మరల మరల ఆ రుగ్మతలు వెలుగులోకి వస్తూనే ఉంటాయి. అసంతృప్తి, అసంపూర్ణత్వం మానవులలో సర్వత్రా అంటువ్యాధిలా వ్యాపిస్తూంది. జనసామాన్యంలో రోజు రోజుకూ ధర్మం నశించి అధర్మం హెచ్చు మీరుతూందని విజ్ఞుల అభిప్రాయము. లంచగొండితనం, అవినీతి, చీకటి వ్యాపారాలు, ఆహార పదార్థాల కల్తీ, అక్రమ లావాదేవీలు, ఆశ్రిత జనపక్షపాతం మొదలైనవి సమాజంలో రాజ్యమేలుతున్నాయి. ఈ రుగ్మతలను తొలగించడానికి కేవలం చట్టాలు చేసినంత మాత్రాన సరిపోదు. మానవ స్వభావంలో మార్పు తేవల్సిన అవసరం ఎంతైనా ఉంది. మౌలిక స్వభావంలో మార్పు తేకుండా భౌతిక ప్రవర్తనను సంస్కరించాలనుకోవడం సరికాదు. ఎందువలననంటే అత్యద్భుతమైన తెలివితేటలు కలిగిన సదరు వ్యక్తులు సరికొత్త అధర్మ మార్గాలను అన్వేషించి అమలుపరుస్తూనే ఉంటారు. జనుల అధర్మ వర్తనం వలన మానవ సమాజం అతలాకుతల మవుతుంది. సత్కర్మలను అనుష్ఠించి తత్ ఫలాలను సాటి సమాజానికి అందజేయడం మానవుని సామాజిక బాధ్యత.

కనుక ఒక వ్యక్తిని సంస్కరించాలంటే అతనిలో ధార్మిక ప్రవృత్తిని మేల్కొలపాలి. విలువలతో కూడిన విద్యను అతనికి అందించాలి. మానవుడు తన జీవితంలో సాధించవలసిన పురుషార్థాలను చతుర్విధ పురుషార్థాలుగా ఋషులు మనకు సూచించియున్నారు. అవే ధర్మ, అర్థ, కామ మరియు మోక్షములు. చతుర్విధ పురుషార్థాలతో మూలమైనది ధర్మము. ఇదియే మానవ జీవితాన్ని ప్రభావితం చేసే పురుషార్థం. ధర్మాన్ని అనుసరించడం ద్వారానే మానవకళ్యాణం సాధ్యమవుతుంది. ధర్మాన్ని ఆశ్రయించి

ధర్మబద్ధమైన జీవితాన్ని గడుపుతూ, ధర్మబద్ధంగా అర్థాన్ని గడించి, ధర్మబద్ధమైన కోర్కెలను తీర్చుకుంటూ చివరగా మోక్షానికై ప్రయత్నించవలెనని ధర్మాశాస్త్రాలు బోధిస్తున్నాయి.

చతుర్విధ పురుషార్థాలలో ధర్మానికి ప్రముఖ స్థానముంది. ధర్మానుష్ఠానం వలన ఇహలోకంలో శ్రేయస్సు పరలోకంలో సాక్షాత్తు అభ్యుదయాన్ని ప్రసాదిస్తుందని శాస్త్ర ఉవాచ. ధర్మం అనే పదం 'ధృ' అనే ధాతువు నుండి ఏర్పడింది. ధర్మాన్నే దైవంగా భావించాలి. ధర్మాన్ని ఆచరించే వ్యక్తి తప్పక ఉన్నతస్థాయికి చేరుకుంటాడు. ధర్మాచరణవలన మానవ సమాజంలో శాంతి సౌఖ్యాలు నెలకొంటాయి. ఒక వ్యక్తియొక్క ఆచరణ ఆధారంగా ఆతని శ్రేష్ఠత్వాన్ని మరియు ధార్మికత్వాన్ని అంచనా వేయవచ్చు. మానవుని శీలనిర్మాణం యొక్క ప్రాధాన్యతను సకల శాస్త్రాలు నొక్కి చెప్తున్నాయి. శీల సంపదే మానవునకు అత్యుత్తమ సంపద. కనుక మానవుడు ధర్మాచరణ యొక్క విలువను గుర్తెరిగి జీవితంలో తాను చేపట్టే అన్ని పాత్రలలోనూ ధర్మబద్ధమైన జీవితాన్ని సాగించాలి. ఇతరులు నీ పట్ల ఎలా ప్రవర్తిస్తే నీవు సంతోషపడతావో అలాంటి ప్రవర్తనే నీవు ఇతరుల పట్ల ప్రదర్శించాలి. అదేవిధంగా ఇతరులు నీకు ఏమి చేస్తే నీవు దుఃఖపడతావో దానిని నీవు ఇతరులకు చేయకుండా ఉండడమే నిజమైన ధర్మం. అన్ని ధర్మబోధల సారాంశము ఇదియే. వ్యక్తి స్వార్థాన్ని విడనాడి సర్వులలో వ్యాపించి ఉన్న ఆత్మతత్వాన్ని గుర్తించి అది తన స్వరూపంగానే భావించాలి. పరోపరాకానికి పెద్ద పీట వేయాలి. పరహితాన్ని కాంక్షిస్తూ మనోవాక్కాయ కర్మల ద్వారా ఇతరులకు ఎటువంటి హానీ తలపెట్టక " పరోపకారాయ ఇదం శరీరం " అను ఆర్యోక్తిని సర్వకాల సర్వావస్థల యందును పాటించాలి. సాటి మనుష్యులను ప్రేమిస్తూ చేతనైనంత మంచిని పంచిపెట్టాలి. ప్రతివ్యక్తీ ధర్మవర్తనుడై, ధార్మిక జీవనాన్ని అవలంబించి తన పట్ల, తన కుటుంబం పట్ల, తాను నివసించే సమాజం పట్ల తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించవలెనని ఆకాంక్షిస్తున్నాము.

బ్రహ్మనిష్ఠాయ విద్మహే, సంయమీంద్రాయ ధీమహీ

తన్నో సద్గురుః ప్రచోదయాత్

ప్రణవోపాసన

– ఎన్.వి. భారతీలక్ష్మి (బలుసుమూడి, భీమవరం)

ఓంకారం బిందుసంయుక్తం నిత్యం ధ్యాయంతి యోగినః ।
కామదం మోక్షదం చైవ ఓంకారాయ నమో నమః ॥

అనగా, అర్ధమాత్రాసహితమైన అకార, ఉకార, మకారాత్మకమగు ఓంకారమును యోగులు (సాధకులు) యెల్లవేళల ధ్యానించుచుందురు. ఐహికాముష్మిక కోరికలనే గాక మోక్షమును కూడ ప్రసాదించు ఓంకార స్వరూపమగు పరబ్రహ్మమునకు మరల, మరల నమస్కరించుచున్నాను.

నిర్విశేషమైన ఇంద్రియ మనోబుద్ధులకు గోచరం కాని పరతత్త్వమును దర్శింపజేయు అక్షరం ఓంకారం. నిత్య సత్య శుద్ధ బుద్ధ ముక్తమగు పరతత్త్వమునకు ప్రతీక ఓంకారము. ఓం మంత్రార్థము పరబ్రహ్మమే.

అ – ఉ – మ అను మూడక్షరముల సంపుటీకరణమే ఓంకారము, జగత్తును, జగత్తు యొక్క అధిష్ఠానమగు పరతత్త్వాన్ని అనగా, భౌతికమైన సాకార రూపాన్ని, అభౌతిక నిరాకారాన్ని వ్యక్తపరచేది ఓంకారమే. అనగా, సగుణ బ్రహ్మము, నిర్గుణ బ్రహ్మము ఓంకారము చేతనే తెలియబడుచున్నది.

అకారము శివుడు, ఉకారము శక్తి, మకారము శివభక్తుల ఐక్యము. శివభక్తుల సమాగమమే పరమాత్మ. ఓంకారము యొక్క శబ్దతరంగముల ప్రభావం ఓంకారము నుచ్చరించే వాని శరీరముపైన, మనస్సుపైన మాత్రమే గాక వాతావరణముపైన కూడ వ్యాపిస్తుంది.

పరబ్రహ్మము యొక్క సార్వభౌమ నామము ఓంకారము. అనగా, పరబ్రహ్మమును స్తుతించే చిహ్నము. సర్వవేదముల సారము ఓంకారము నందు ప్రతిష్ఠింపబడియున్నది. మానవుని జీవిత లక్ష్యాన్ని, ఆ లక్ష్యానికి

చేరుకొనే సాధనా మార్గాన్ని నిర్దేశించేది ఓంకారమే. మానవుడు చేరుకోవలసిన గమ్యము ఓంకారము ద్వారా మాత్రమే సాధ్యమగునని మహాత్ముల సందేశం.

సృష్టికి పూర్వము అవ్యక్తము నుండి శబ్దము ఆవిర్భవించినది. సమస్త బ్రహ్మాండములకు ఆధారమైనది ఆ శబ్దమే. అదియే మూలశక్తి స్వరూపము. సూక్ష్మ రూపముననున్న ఆ శక్తియొక్క ప్రథమ రూపమైన శబ్దము విశ్వమంతటా వ్యాపించి యున్నది. అదియే ఓంకారము. ' ఇదం విశ్వం సర్వం ఓంకారమేవ ' జగద్రూపాలన్నీ ఓంకారం నుండియే వెలువడ్డాయి. ఓంకారంలోనే ఉన్నాయి. ఓంకారంలోనే లయమైపోవు చున్నవి. గుడిలోని గంటానాదంవలె భూతభవిష్యద్వర్తమాన కాలములలో ఉన్నది ఓంకారమే. కాలాతీతమైనది కూడ ఓంకారమే. అనగా, అకారము భూత కాలము, ఉకారము భవిష్యత్కాలము, మకారము వర్తమాన కాలము. అవ్యక్తమగు అమాత్ర కాలాతీతం. దృశ్యప్రపంచం ఓంకార స్వరూపం. శబ్దప్రపంచం ఓంకారం మీద ఆధారపడియున్నది. అన్ని శబ్దములకు ఆధారం ఓంకారమే. ఆలోచనలన్నీ ఓంకార రూపములే. ఆలోచనలే శబ్దాలుగా బయటికి వచ్చి జగత్తును చూపుచున్నవి. సృష్టిలోని ధ్వనులన్నీ ఓంకారంనుండే పుట్టాయి. మానవులు మాట్లాడే భాషలు, పక్షుల కిలకిలారవములు, పశువుల అంబారవములు ఓంకారము యొక్క వికార రూపములే. నక్షత్రమండలమంతా ఓంకారము నిండియున్నది. పంచభూతములలో ఓంకారము వ్యాపించి యున్నది. పృథ్వియందలి కట్ కట్ శబ్దము, జలంలోని బుడబుడధ్వని, అగ్ని నుండి వెడలుచున్న భుగ్ భుగ్ ధ్వని, వాయువులోని విస్ విస్ ధ్వని, ఆకాశమునందలి ప్రతిధ్వని ఓంకారము నుండి వెలువడినవే. సృష్టిలోని అణువణువులోను ఓంకారము నినదించుచున్నది. మనం రెండు చెవులు గట్టిగా మూసికొని ఏకాగ్రతతో గమనిస్తే ఓంకార నాదం వినబడుతుంది. అదియే నాదబ్రహ్మము. అంతఃకరణం ఉపశమించినంతనే నాదబ్రహ్మము దర్శనమిస్తుంది. నాదమే నాదాతీత స్థితికి సాధకుని చేరుస్తుంది. అన్నింటినీ వదల గలిగి

ఆకాశానికవతల ఉన్న నిశ్శబ్దంలో ఓంకార నాదాన్ని గుర్తించాలని చెప్పబడింది.

ఉపాసనా మంత్రములకు, వైదిక ప్రార్థనలకు ప్రారంభంలో ఓంకారము నుచ్చరించడం పరిపాటి. మంత్ర స్వరూపంగా కూడ ఓంకార జపం చేస్తారు. భగవంతుని ప్రార్థనకు విగ్రహము ఆలంబనమైనట్లే పరబ్రహ్మ ప్రాప్తికి ఓంకారము ఆలంబనము. ఓంకారము నందు మనస్సును లయం చేసి ధ్యానం చేసిన సాధకుడు బ్రహ్మైక్యస్థితిని పొంది స్వస్వరూపానందంలో ఓలలాడుచుండునని శ్రుతిమాత చెప్పుచున్నది.

ఆత్మకు నాలుగు పాదములు జాగ్రత్ – స్వప్న – సుషుప్తి, తురీయము. ఆత్మ యొక్క ఆ నాలుగు పాదములే ఓంకారము యొక్క అ. ఉ, మ – అర్ధమాత్రలు. అకారము జాగ్రదవస్థకు, ఉకారము స్వప్నావస్థకు, మకారము సుషుప్త్యవస్థకు, అర్ధమాత్ర తురీయమునకు ప్రతీకలు. అకారము స్థూల శరీరమునకు, ఉకారము సూక్ష్మ శరీరమునకు, మకారము కారణ శరీరమునకు, అర్ధమాత్ర సమాధి స్థితికి ప్రతీకలు. పాదములకు, మాత్రలకు భేదం లేదు.

విశ్వతైజసప్రాజ్ఞులు జీవునికి సంకేతం, వ్యష్టిరూపులు. విరాట్టు, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు సమష్టిరూపులు, పరమాత్మకు సంకేతం. విశ్వుడు జాగ్రదవస్థను, తైజసుడు స్వప్నావస్థను, ప్రాజ్ఞుడు సుషుప్త్యవస్థను అభిమానించిచుచుండును. అ, ఉ, మ లు శరీరత్రయమునకు, అవస్థాత్రయ మునకు ప్రతీకలు. అర్ధమాత్ర చతుర్థపాదమగు తురీయము. అదియే అద్వితీయమగు పరబ్రహ్మస్వరూపము. అవస్థాత్రయం దాటిన తరువాత గలిగే సమాధి స్థితియే తురీయస్థితియనియు, అదియే అవస్థాత్రయ సాక్షియనియు మాండూక్యంలో చెప్పబడింది.

' అ ' మాత్రపై దృష్టిపెట్టి ఉపాసన చేసిన సాధకుడు విరాట్ పురుషుని చేరగలడు. ' ఉ ' మాత్రపై దృష్టి పెట్టి ఉపాసన చేసినచో హిరణ్యగర్భుని చేరగలడు. ' మ ' మాత్రపై దృష్టిపెట్టి ఉపాసన చేసిన యెడల ఈశ్వరుని

చేరగలడు. త్రిమాత్ర నుపాసించినచో బ్రహ్మలోకమునకేగి అచ్చట హిరణ్యగర్భునికన్న మిన్నయగు నిర్విశేష పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొనగలడని విద్యారణ్యులవారు శలవిచ్చారు.

య ఉపాస్తే త్రిమాత్రేణ బ్రహ్మలోకే సః నీయతే,
స ఏతస్మాజ్జీవమనాత్పరం పురుషమీ క్షతే ॥ (వే. పం. 9 – 144)

అర్ధమాత్ర నాదస్వరూపం, అఖండము, సర్వవ్యాపకము, నిత్య సత్య స్వరూపము, శుద్ధ చైతన్య స్వరూపము, కేవల సుఖస్వరూపము. జ్ఞానేంద్రియముల కతీతమగు అర్ధమాత్రను ఆత్మయని ఉపాసించు సాధకునికి తాను పరమాత్మనేనను ఏకాత్మభావం అనుభూతమై, బ్రహ్మనిష్ఠ గలిగి, బ్రహ్మాత్మనా సంస్థితియందుండగలడనియు, అట్టివాడే జీవన్ముక్తుడనియు శ్రుతివాక్కు.

బ్రహ్మము జీవులందరియందు ఆత్మగా, జాగ్రత్స్వప్న సుషుప్తుల యందు సాక్షిగా, అన్నింటిని ప్రకాశింపజేయుచున్నది. అట్టి బ్రహ్మమును అతి సమీపంగా అనుభవానికి తెచ్చి చూపగల శబ్దము ఓంకారము. బ్రహ్మము వాచ్యము. ఓంకారము వాచకము. వాచ్యవాచకములకు భేదము లేదు. ఓంకారము అభిధానము. బ్రహ్మము అభిధేయము. అభిధాన అభిధేయములకు భేదము లేదు. ఓంకారము శబ్దము, బ్రహ్మము అర్థము. శబ్దార్థములకు భేదం లేదు. సర్వవేదములు. సకల శాస్త్రములు ఓంకారము నందిమిడియున్నవి. జనన మరణాత్మకమగు భవసాగరము నుండి విముక్తిని గలుగజేయు తారకమంత్రము ఓంకారము. ఓంకారంలో దివ్యత్వం ఉంది. ఓంకారం పుట్టేది కాదు. మార్పు చెందునది కాదు. నశించునది కాదు. అన్నిటి యందు అంతటా ఉంటూనే దేనికీ అంటక, దేనితోను సంబంధం లేక ఉండు బ్రహ్మ స్వరూపము ఓంకారమేననియు, ఓంకార ఉపాసనలో తాదాత్మ్యం చెందిన సాధకుడు పునీతుడై పరమపదాన్ని చేరగలడనియు ఉపనిషద్వాణి చెప్పుచున్నది. (**సశేషం**)

ఆచార్యదేవోభవ

– ఆచార్య డా॥ కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

ఔపదేశికుడయిన వ్యాసునిలో అనేక ధర్మాలు కనిపిస్తాయి. కుల పెద్దగా కౌరవపాండవులకు తగిన సందర్భాలలో ఉపదేశాలివ్వడం ఒక వంక, సర్వలోక సంక్షేమం కోసం అపారమయిన వాఙ్మయసృష్టి చేయడం మరోవంక. ఈ రెండూ పడుగూ, పేకలాంటివి.

కులపెద్దగా తల్లితో ‘ అమ్మా ! నీవెపుడు స్మరిస్తే అపుడు ప్రత్యక్ష మవుతాను ’ అన్నవాడు. తన మన భేదంలేక కౌరవపాండవులకు హితం గరపి ‘గురుధర్మం నెరవేర్చినవాడు, లాక్షాగృహదహనానంతరం ఎటు వెళ్ళాలో తెలియక పాండవులు దిక్కులు చూస్తుంటే ద్రుపదుని నగరం వైపు వెళ్ళవలసిందిగా ‘ సలహా ’ సూచించినవాడు, ద్రౌపదిని ఐదుగురు వివాహ మాడడమా అని సందేహిస్తుంటే పూర్వ కథలను చెప్పి సంశయం తీర్చినవాడు, జూదంలో సర్వస్వం పోగొట్టుకొని బాధపడుతుంటే ధర్మరాజుకు ధైర్యం చెప్పినవాడు, కౌరవపాండవుల మధ్య సంధి అవసరమని ధృతరాష్ట్రునికి బోధ చేసినవాడు, గాంధారీ ధృతరాష్ట్రులకు దివ్యదృష్టిని ప్రసాదించి మరణించిన వారిని దర్శింపచేసినవాడు, అభిమన్యుడు మరణించిన వేళ, అలాగే కృష్ణ నిర్యాణానంతరం సామాన్యునిలా సవ్యసాచి పలవరిస్తుంటే ఆశ్వాసించిన వాడు.

వ్యాసనామం గురించి అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. వ్యాస శబ్దం ‘ ఒక నిర్వహణకార్యనిష్ణాతుని ’ సూచించేదని కొందరంటారు. వ్యాసనామ ధేయులెందరో అని కొందరి అభిప్రాయం.

వేదవిభాగం చేసిన ఋషి వ్యాసుడే. ప్రతి ద్వాపరంలోనూ ఆర్ష

విద్యలో ఈ వేదవిభాగం ఒక్కొక్కరిచే విస్తరింపబడుతుందని, ప్రథమ ద్వాపరంలో స్వయంభువు, ద్వితీయ ద్వాపరంలో ప్రజాపతి, తృతీయ ద్వాపరంలో శుక్రుడు తరువాత బృహస్పతి, వసిష్ఠుడు, త్రివర్షుడు, సనద్వాజుడు వ్యాసులయ్యారని కథనం. ఏది ఏమయినా సామాన్య జనులకు వ్యాసుడంటే వేదవ్యాసుడే సత్యవతీ తనయుడే. 18 పురాణాల రచయిత, జయనామక మహాభారత గ్రంథకర్త అతడే. అతడే గురువులకు గురువు. విద్య అంటే ఆధ్యాత్మిక విద్య మాత్రమే. ఆ విద్యాప్రబోధకుడే వేదవ్యాసుడు. ‘ ఆషాఢ పూర్ణిమ ’ నాడు స్మరింపబడే ఆదర్శగురువు వ్యాసుడే. సార్వకాలీనమయిన సర్వలోక హిత ప్రదాయక మయిన అంశాలను గ్రంథస్థం చేసి అందించిన ఉత్తమ ఉపదేశికుడు వ్యాసుడే.

ఎవరి కెఱుక ?

...వుల ‘ పురోహితుడు ’ ధౌమ్యుడు. ఇతని ...ష్ణుడు ’ కారకుడు. పాండవులతో మీకొక పురోహితు... ఉపసంపాదన బోధించినవాడు కూడా ఇతడే. అంతేకాదు

– ఆచార్య కె. పురుషోత్తమరావు (తిరుపతి)

ఉత్కోచ అనే తీర్థదేశంలో ధౌమ్యుడున్నాడని తెలిపినవాడు కూడా ఇతడే. అంగారపర్ణుని ఆదేశం ప్రకారం పాండవులు జగత్పూతచరిత్రుని, సాధుజనపూజితుని, ధార్మికుని, హితభాషణుని, భూసురవంశభూషణుని తమకు పురోహితుడుగా ఉండవలసిందని ప్రార్థించారు. ధౌమ్యుడు సమ్మతించాడు. ఆ ధౌమ్యునితోనే పాండవులు ద్రుపదమహారాజు నగరానికి వెళ్ళారు.

మహాభారతంలో పాండవుల వివాహపు వేడుకలలో వైదిక క్రియలు నిర్వహించినవాడు ధౌమ్యుడు. రాజసూయయాగనిర్వహణలో భాగం పంచుకొన్నవాడు ధౌమ్యుడు. అభిమన్యునికి వేదవేదాంగాలు నేర్పినవాడు కూడా ధౌమ్యుడే. జూదంలో ఓడిపోయి పాండవులు అరణ్యాలకు కదలి వెళ్ళే వేళ శత్రువినాశ సూచకమయిన రౌద్రయామ సామోద్గీతలు పఠించిన వాడు కూడా ధౌమ్యుడే. అరణ్యవాసంలో తనతో వచ్చిన వారికి అతిథ్యమేలాగ అని చింతిస్తుంటే సూర్యోపాసన చేయుమని సూచించిన వాడు ధౌమ్యుడే. అరణ్యవాసానంతరం అజ్ఞాతవాసంలో తమ ఉనికి కౌరవులకు తెలిస్తే ఏలాగ అని ధర్మరాజు బాధపడుతుంటే ధౌమ్యుడు యక్షుడయిన యమధర్మరాజు ఇచ్చిన వరాన్ని గుర్తుకు తెచ్చినవాడు ధౌమ్యుడే. అంతేగాదు పాండవులు సామాన్యులై ఒకరి కొలువులో సేవకులుగా వెళ్ళే సమయంలో ‘ మనవలసిన విధానాన్ని ’ మనోహరంగా చెప్పినవాడు ధౌమ్యుడు. ఈ బోధ విరాటపర్వంలో సుమారు 25 పద్యాలలో తిక్కన వర్ణించాడు. ధౌమ్యుని ఉపదేశవిధానమే విశిష్టం.

‘ లోకంలో తెలిసిన వారెందరో అయినా శ్రేయోభిలాషులు అటువంటి విజ్ఞులకు బుద్ధి చెప్పకుండా ఉండలేరు. అదనెరిగి చెప్పడం విధి. సామాన్య మానవుని సేవిస్తూ మానావమానాలు సహిస్తూ అణిగి మణిగి వుండడం వీలుకానిపని. వివిధాస్త్రాలు మంటలలాంటివి. వీటిని ధరించే పాండవులు అగ్నులవంటివారు. బాహాటంగా పరాక్రమాదులు ప్రదర్శిస్తే ప్రమాదం. తగిన పద్ధతిలో సభలో అడుగుపెట్టాలి. తన రూపంగాని వేషం గాని వికృతంగా ఉండకుండ జాగ్రత్తపడాలి. చనువు పనికిరాదు. రాజును అనుకరించరాదు. రాజుతో అతి సాన్నిహిత్యం ప్రమాదకరమే. అంతఃపుర సంగతులు బయట పెట్టరాదు. అంతఃపుర వాసులతో స్నేహము పనికిరాదు. రాజు మనోగతాభిప్రాయం తెలిసినా బయట పెట్టరాదు. రాజధనాన్ని పాములా భావించాలి. రాజవిరోధులతో దూరంగా ఉండాలి. చివరకు చిరు విషయాలను కూడా ప్రస్తావించాడు ధౌమ్యుడు.

ఆవులింత తుమ్ము హాసంబు నిష్ఠీవ
నంబు గుప్తవర్తనములు గాఁగాఁ

జలుపవలయు నృపతి కొలువున్న యెడల బా

హిరములైన ౘెలని కెగ్గులగుట – అన్నాడు. ఆలాగే

ధౌమ్యుడు పాండవులు బయలుదేరే వేళ కామ్యపూజలు చేశాడు. శుభకరమయిన ప్రయాణానికి మంత్రాలు చదివాడు. ఇంతగా పట్టించుకొన్న ధౌమ్యునితో ధర్మరాజు చివర

తల్లియు ౘదండ్రియు దైవము

నెల్ల సుహృజ్జనము మీర యిట్ల గొలిచి వ

ర్తిల్లెడు తెఱంగు లెంతయుఁ

దెల్లము సేసితిరి బ్రతికితిమి మీకరుణన్

అని మొకరిల్లినాడు. మహాప్రస్థానం వెళ్ళేదాక పాండవులను కనిపెట్టుకొని హితం గరపినవాడు ధౌమ్యుడు.

ఔపదేశిక గురువులలో సంశయ నివృత్తి చేసే వారు కూడా భాగస్థులే. ఉపనిషత్తులలోను, ఇతిహాసాదులలోను, ‘ ప్రశ్నోత్తర పద్ధతి సుస్పష్టం. ప్రేక్షకుడో, లేక శ్రోత, లేదా కుతూహలం కలవాడో, సంశయం తీర్చుకోవాలని ఉబలాటపడేవాడో, జిజ్ఞాసకలవాడో, మరింత సమాచారం రాబట్టాలని భావించేవాడో ప్రశ్నించడం సహజం. ‘ జనమేజయునితో వైశంపాయను డిట్లనియె ’ అని మొదలయినా కథలలో అనేక ఉపాఖ్యానాలు, అనేక ధార్మిక ప్రసంగాలు ఒక ప్రవాహంలో చేరే కాలువలుగా అమరుతాయి. ఆలాగే భాగవతంలో శుకమహర్షి పరీక్షిత్తుకు భాగవత కథలు వివరించే వేళ అనేకాంశాలు చోటు చేసుకోవడం గుర్తించవచ్చు. ప్రధానంగా ధార్మికాంశాల వివరణలో లోకాంతర వాసులు, దేవర్షులు, దేవతలు భాగం పంచుకోవడం భారతంలో కనిపించే సామాన్యాంశం. ఇటువంటి వారిని సంశయ నివారక గురువులుగా భావించవచ్చు. ఈ కారణం వల్లనే ‘భారతంలో లేనిది మరో చోట లేదు ’ అనే ఖ్యాతి నిలిచింది.

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్పభూషణ వారు శివయోగి

అనువాదం :
పూజశ్రీ శంకరానందగిరి స్వాములవారు,
ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : మోక్షవిచార విషయమునందు అధమ మధ్యమ ఉత్తమ అధికారులైన కర్మి ఉపాసకుడు జ్ఞాని యనెడి వీరి భిన్న భిన్నాభిప్రాయములను విశదపఱచుచు ఈ ప్రకరణమును ఉపసంహరించుచున్నారు.

జగత్క్షతిం జగన్మనః క్షతిం మనోభ్రమక్షతిమ్,

జడా జడాబుధా బుధాః శశంకిరే 2 మృతం క్రమాత్.

జడాః = కర్మఠులు, జగత్క్షతిం = ప్రపంచముయొక్క నాశమును (అనగా మహాప్రళయ పర్యంతము తమకు వచ్చు ఎల్ల శరీరములచే నిత్య నైమిత్తికాది కర్మములను చేయుచుపోగా బ్రహ్మణా సహముక్తి యనియు), జడాఃబుధాః = (మతి) ఉపాసకులు, జగన్మ నఃక్షతిం = ప్రపంచాకారమగు మనోనాశమును (ముక్తి యనియు), బుధాః = జ్ఞానులు, మనోభ్రమక్షతిం = మనోభ్రాంతి నాశమును, అమృతం = మోక్షమనియు, క్రమాత్ = క్రమముగా, శశంకిరే = ఊహించిరి.

మోక్షమును గుఱించన విచారణ చేయుచు ఒకానొకడు జగత్తు నాశమైనప్పుడు బ్రహ్మతో సహ ముక్తి యని, మఱొకడు మనోమయ జగన్నాశమే మోక్షమని, ఇంకొకడు మనోభ్రమ నాశమే మోక్షమని తలంచిరి. వీరు ఇట్లు చెప్పుకొనుటకు కారణమేమనిన తమ తమ సంస్కారానుసారము భిన్న భిన్నమగు జ్ఞానముగలవారై యున్నారని తెలియవలెను.

ఈ శ్లోకమునకు అర్థాంతరము.

జడాః = జడులు, జడమైన దేహమునే ఆత్మగా భావించెడి వారు,

లోకాయతిక (చార్వాక)మతానుయాయులు, జగత్‌క్షతిం = వాయువు యొక్క నాశమును, ఊపిరిపోవుటను, అనగా మరణమునే (ముక్తియని): జడాః బుధా ః = జడులును విద్వాంసులును ఐన తార్కికులు మఱియు పతంజలి మతానుయాయులును ఐనవారు, జగన్మనః క్షతిం = వాయువు మనస్సు ఈ రెంటి యొక్క నాశమునే (ముక్తియని) శశంకిరే = ఊహించిరి. బుధాః = బ్రహ్మ వేత్తలు, మనోభ్రమక్షతిం = మనస్సులోగల భ్రాంతి (దేహమును ఆత్మగా తలంచుటయనెడి దేహాత్మ బుద్ధి) నశించుటయే, అమృతం = మోక్షము (అని), క్రమాత్ = శాస్త్ర విధానమును బట్టి, (విదుః = ఎఱిగిరి).

(1). ఈ జడమైన దేహమే ఆత్మయని చార్వాకమతానుయాయులు వచింతురు. కావున వీరు జడులనబడిరి. ఇట్టి యా మతస్థులు ఇహమున సుఖము అనుభవించుటయే స్వర్గమని, దుఃఖ మనుభవించుటయే నరకమని, చచ్చుటయే మోక్షమని వచింతురు. (2) తార్కికులు (గౌతమమతానుయాయులు) ఆత్మను జడము, అజడముగూడ అని వచింతురు. సుషుప్తి మూర్ఛాదులలో ఆత్మ జడము, జాగ్రత్స్వప్నములలో అజడము అని ఊహించిరి. కావున వీరు జడాఃబుధాః ' అనబడిరి. ఇట్టి వీరు ప్రాణము, ఆత్మ – ఈ రెంటినాశమును మోక్షమని ఊహించిరి. పాతంజలులు (పతంజలి మతానుయాయులు) గూడ యమనియమాదుల ద్వారా ధ్యానధారణ సమాధుల ద్వారా ప్రాణనిరోధమును మనోనాశమును ఈ రెంటిని మోక్షమని (తదా ద్రష్టుః స్వరూపే అవస్థానమ్ – అపుడు మాత్రమే ద్రష్టయైన ఆత్మ స్వస్వరూపముతో నిలిచిపోవును అని) వచింతురు. (3) బ్రహ్మవిదులో దేహాత్మ భ్రాంతి నశించిన చాలును. ఆత్మ మోక్ష స్వరూపమేయై యున్నదని శాస్త్ర క్రమమునుబట్టి వచించిరి.

ఇది జగదధ్యారోప అపవాదములు నిరూపించెడి రెండవ అధ్యాయము.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

– శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

(ఆగష్టు సంచిక తరువాయి)

శ్లో ॥విప్రమధ్వపరిశ్రాంతం – బాలం వృద్ధమథాపి వా ।
అర్చయేద్గురువత్ప్రీతో గృహస్థో గృహ మాగతమ్ ॥ (పృష్ఠము. 6355)

అర్థము : బ్రాహ్మణ బాలకుడు గాని, వృద్ధుడు గాని, లేదా త్రోవలో యలసిపోయిన బాటసారియైనను గాని సమయమునకు యింటికి వచ్చినచో, గృహస్థ పురుషుడు ప్రసన్నతా పూర్వకముగా గురువునకు వలె అతనిని సత్కరించవలెను.

శ్లో ॥ సాంగోపాంగాంస్తు యో వేదాన్ పఠతీహ దినే దినే ।
నచాతిథిం పూజయతి వృథా భవతి స ద్విజః ॥ (పృష్ఠము. 6329)

అర్థము : ఎవరు ప్రతి దినము సాంగోపాంగముగ వేదాధ్యయనము చేయునో, కాని, అతిథి పూజ చేయడో, అటువంటి ద్విజునియొక్క జీవనము వ్యర్థము.

శ్లో ॥దేశం కాలం చ పాత్రంచ స్వశక్తించ నిరీక్ష్య చ ।
అల్పంసమం మహద్వాపి కుర్యాదతిథి మాప్తవాన్ ॥ (పృ. 6330)

అర్థము : శ్రద్ధాళువైన గృహస్థుడు దేశము, కాలము మరియు పాత్రతను గుర్తించి స్వశక్త్యనుసారము, అల్పముగా గాని, మధ్యమముగా గాని, లేక ఘనంగా కాని అతిథి – సత్కారము చేయవలెను.

శ్లో ॥ సుముఖః సుప్రసన్నాత్మా ధీమానతిథి మాగతమ్ ।
స్వాగతేనాసనేనాద్భిరన్నాద్యేన చ పూజయేత్ ॥ (పృ. 6330)

అర్థము : అతిథి యెప్పుడు గృహస్థుని ద్వారమున కెతెంచునో, అప్పుడు

బుద్ధిమంతుడైన పురుషుడు ప్రసన్న చిత్తుడై, హాస్యవదనుడై అతిథికి స్వాగతము పలుకవలెను. కాళ్ళు కడుగుకొనుటకు నీళ్ళు ఇచ్చి, కూర్చొనుటకు యథోచితమైన ఆసనమును ఇచ్చి, అన్నపానాదుల ద్వారా అతనిని పూజించవలెను.

శ్లో ॥ హితః ప్రియో వా ద్వేష్యోవా మూర్ఖః పండిత ఏవ వా ।
ప్రాప్తోః యో వైశ్వదేవాంతే సో 2 తిథిఃస్వర్గ సంక్రమః ॥ (పృ.6330)

అర్థము : (గృహస్థులైన ద్విజులు భోజనము చేయుటకు పూర్వము వైశ్వదేవ యజ్ఞము చేయుదురు.) ఈ యజ్ఞాంతమునకు తన హితమును కోరువాడు గాని, ప్రేమ పాత్రుడుగాని, ద్వేషించు శత్రువుగాని, మూర్ఖుడు గాని లేక పండితుడు గాని ఎవరైనను సరే విచ్చేసినచో అతడు ఈ గృహస్థుని స్వర్గము వరకు తీసికెళ్ళు నటువంటి అతిథి యగును.

శ్లో ॥ అన్నదః ప్రాణదో లోకే ప్రాణదః సర్వదో భవేత్ ।
తస్మాదన్నం విశేషేణ దాతవ్యం భూతిమిచ్ఛతా ॥ (పృ. 6355)

అర్థము : ప్రపంచములో అన్నదానము చేయువాడు ప్రాణదానము చేయువాడగును. మరియు ఎవరు ప్రాణదాతయగునో నతడు సర్వదాత యగును. అందువలన తన కళ్యాణమును గోరువాడు విశేష రూపముచే అన్నదానము చేయవలయును.

శ్లో ॥ అన్నం హ్యమృతమిత్యాహురన్నం ప్రజననం స్మృతమ్ ।
అన్న ప్రణాశే సీదన్తి శరీరే పంచధాతవః ॥ (పృ. 6355)

అర్థము : అన్నము అమృతమనబడుచున్నది. అన్నము ప్రజలకు జన్మనిచ్చునదైయున్నది. అన్న నాశనమయినచో శరీరములోని పంచధాతువులు నశించును.

శ్లో ॥ పితౄన్ దేవాన్ ఋషీన్ విప్రానతిథీంశ్చ నిరాశ్రయాన్ ।
యో నరః ప్రీణయత్యన్నైస్తస్య పుణ్యఫలం మహత్ ॥ (పృ.6355)

అర్థము : ఎవడు దేవతలకు, పితరులకు, ఋషులకు, బ్రాహ్మణులకు, అతిథులకు మరియు నిరాశ్రయులగు మనుష్యులకు అన్నము నిడి తృప్తిపరచునో, అతనికి చాలా గొప్ప పుణ్యము లభించును.

శ్లో ॥ అన్నదః సర్వ కామైస్తు సుతృప్తః సుష్ఠలంకృతః ।
పూర్ణ చంద్ర ప్రకాశేన విమానేన విరాజతా ॥
సేవ్యమానో వరస్త్రీభిర్దేవలోకం స గచ్ఛతి ॥ (పృ. 6330)

అర్థము : అన్న ప్రదానము చేయు మనుష్యుడు సమస్త భోగములచే తృప్తుడై, చక్కని ఆభూషణములచే నలంకృతుడై, పూర్ణచంద్ర ప్రకాశముచే ప్రకాశితమైన విమానము ద్వారా దేవలోకమున కేగును. అక్కడ దివ్యమైన స్త్రీలచే నతడు సేవింపబడును.

కావున అతిథి సత్కారమును గృహస్థులైనవారు తప్పకుండా శ్రద్ధాభక్తి పురఃసరులై తమ కర్తవ్యముగా నెంచి యనుష్ఠించుచుండవలయును.

ఎవడు తోటి ప్రాణుల పట్ల దయను జూపడో, సత్పురుషులను యథాశక్తిగా సేవించడో మరియు జీవితములో ఎప్పుడును తీర్థక్షేత్ర సంచారముంజేయుడో వాడు యమునికి కానుకగా సమర్పించబడిన వాడుగా నెఱుంగవలయునని వ్యతిరేకముఖముగా బోధిస్తూ, దయ యనునది మానవుల యొక్క ముఖ్య ధర్మముగా గుర్తుజేయుచున్నాడు.

దుఃఖితేష్వనుకంపా – దయా. దుఃఖితులైన ప్రాణుల పట్ల అనుకంపా అనగా రక్షాభిముఖీ బుద్ధి, లేదా అనుగ్రహమును జూపుట యేదిగలదో దానిని " దయ " యందురు.

శ్లో ॥ పరే వా బంధు వర్గే వా మిత్రే ద్వేష్యే రిపౌ తథా ।
ఆపన్నే రక్షితవ్యం హి దయైషా పరికీర్తితా ॥ (అత్రిస్మృతి – 41)

అర్థము : ఇతరుల యందుగాని, బంధువర్గము నందు గాని, మిత్రులయందు గాని, తనను ద్వేషించువారియందు గాని లేదా శత్రువుల యందుగాని ఎవరినైనను ఆపత్తులో చిక్కుకొనుటం గాంచి వారిని రక్షించుట యేదిగలదో దానినే " దయ " యందురు.

గురుపౌర్ణమి

హే శివా ! కలలో నీ దర్శనము కావాలి
జీవితములో ఈ కల సాకారము కావాలి
చెట్టు పూజ (హరిత హారము)

రచన : శ్రీ గురుదాసు మిట్టపల్లి శంకరయ్య, ఇచ్చోడ

పల్లవి : చెట్లు నాటండి ! ఓ మానవులారా ! చెట్లు నాటండి!!
చెట్టు పూజే శివుడి పూజ ! పుట్ట పూజే అంబపూజ
చెట్లు నాటండి ! ఓ జనులారా ! చెట్లు నాటండి !

చరణము : ఇల్లు కట్టి ఏ.సి. పెట్టి కులుకుతాను అనుకొంటివి
ఒక్క చెట్టు పెట్టకుండ వేల చెట్లను నరికితివి
ప్రాణ వాయువు అందక రోగాల పాలయితివి
మందు మాకు తినుకుంటా మంచాన పడిపోతివి॥ **చెట్లు నాటండి**

చరణము : రోగమొచ్చేనని నీవు అభిషేకము చేసినావు
అసలు సిసలు శివుడి రూపము చెట్టుగానే పుట్టినది
చెట్టు పెట్టి నీరు పోస్తే శివుడి పూజ చెల్లుతుంది
చెట్టు పెట్టమంటే నీవు నీరు, జాగ లేదంటివి ॥ **చెట్లు నాటండి**

చరణము : విషము త్రాగి శివుడు నాడు అమృతము ఇచ్చినాడు
చెట్టు రూపములో నేడు శివుడు అవతరించినాడు
కాలుష్యము తాను త్రాగి ప్రాణ వాయువునిచ్చినాడు
వానదేవుడు కరుణించి వర్షాలు కురిపించినాడు॥ **చెట్లు నాటండి**

చరణము :చెరువుకుంట నిండుతుంది దుక్కి బాగా సాగుతుంది
వానపాము పుట్టుతుంది ఎరువునిచ్చి పోషించుతుంది
చీడ పురుగును రూపు మాప పురుగు బూసి పుట్టుతుంది
చీడ పురుగును చంపివేసి పంటలను రక్షించుతుంది ॥ **చెట్లు నాటండి**

చరణము : చెట్టు పుట్ట చల్లగుంటే వాగు వంక పొర్లుతుంది
చేను చెలుక బీడు భూమి సమృద్ధిగా పండుతుంది
దన ధాన్యము చేతికంది రైతు కష్టము తీరుతుంది
అన్నపూర్ణగ భరతభూమి విశ్వఖ్యాతి పొందుతుంది ॥ **చెట్లు నాటండి**

వార్తలు

(01). 29-08-2015 తేది శనివారం శ్రావణ పౌర్ణమినాడు ఆశ్రమంలో గురుపాదుకలకు అభిషేకం, షోడశోపచారపూజ జరిగినది. భక్తులందరికి భిక్ష చేయడమైనది.

(02). 3-09-2015 తేది పంచమి గురువారం నాడు రేణిగుంట మండలం, వెదుళ్ల చెరువు గ్రామంలోని శ్రీరామకృష్ణసేవాశ్రమంలో మాతృశ్రీ చిన్నమ్మ ట్రస్టు వారిచే శ్రీ చిన్నమ్మ గారి ఆరాధన చేయబడినది. సమాధి పూజానంతరం నారాయణ సేవ - అన్నదానం బీదలకు వస్త్రదానం ట్రస్టుచే చేయబడినది.

(03). 5-09-2015 తేది శ్రావణ బహుళ అష్టమి శనివారం రోహిణి నక్షత్రంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో కృష్ణాష్టమి పూజ చేయబడినది. శ్రీ కృష్ణపరమాత్మకు లక్ష తులసి అర్చన చేయబడినది. భక్తులకు భిక్ష - అన్నదానం చేయబడినది.

(04). 7-09-2015 తేది సోమవారం నాడు శ్రీశుకబ్రహ్మాశ్రమ పరిపాలనా సంఘ సమావేశం జరిగినది. అందు 2014 -15 జమ ఖర్చులు ఆడిట్ రిపోర్టు పరిశీలించి ఆమోదించబడినది. 2015-16 బడ్జెట్ చర్చించి ఆమోదించబడినది.

(05). 17-09-2015 తేది భాద్రపద శుద్ధ చవితినాడు ఆశ్రమంలో వినాయక పూజ జరిగినది. సిద్ధి వినాయకునికి పత్రిపూజ చేయబడినది.

(06). 20-10-2015 తేది సరస్వతి పూజ, 21వ తేది దుర్గాపూజ, 22వ తేది మహర్నవమి లక్ష్మీపూజ ఆశ్రమంలో జరుగును. భక్తులందరు పాల్గొనవచ్చును.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో ఆగష్టు నెలలో **ఓ.పి.విభాగంలో 1327 గురికి** వివిధ కంటి పరీక్షలు జరిపి తగు చికిత్సలు చేశారు. **133 మందికి పొరలు** తీసి కండ్లలో లెన్సు అమర్చినారు. ఆరుమందికి లేజర్ చికిత్స చేశారు.

దివ్యమగు మానస సరోవరము కామక్రోధాదులనే పెనుగాడ్పులచే అల్లకల్లోలమై యున్నంతవరకు అందు పరంజ్యోతియొక్క ప్రతిబింబము గోచరించజాలదు. నిర్మలమై ప్రశాంతమై భగవచ్చిన్తనమున నిమగ్నమై యుండు మానసమున మాత్రమే దైవ దర్శనము లభించును.

మనస్సున కామమనే కళంకము అణుమాత్రమున్ననుగూడ భగవంతుని గనజాలవు. కావున నీ చిల్లరకోరికలను తీర్చుకొని పెద్దకోరికలను వివేక వైరాగ్యములచే విడనాడుము.

పువ్వులోని పిందె పెద్దదయినప్పుడు పూరేకులు వానియంతట నవియే రాలిపోవును. అటులనే నీయందలి దివ్యత్వము వికసించినంతనే మానస దౌర్బల్యము దానియంత నదియే తొలగిపోవును.

– శ్రీ రామకృష్ణపరమహంస

Regd.No. TRP / 123 / 2015-17 August 2015 Rs.6/- R.No.8139/63
Date of Publication 26-07-2015, Permitted to post : 29th, 30th every month.

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

______	: ఋగ్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క అధ్యయనము
యోగ్యతలు	: మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
వయస్సు	: 8 నుంచి 10 సం. మధ్య.
స్టైఫెండ్	: నెలకు రూ. 1,000/-
______	: ఋగ్వేదము/యజుర్వేదము/సామవేదము/అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
యోగ్యతలు	: సంస్కృత పరిజ్ఞానముతోబాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
వయస్సు	: 15 సం॥ ఆపైన
స్టైఫెండ్	: నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగములకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

______	(సామవేదము/అథర్వవేదము–వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
కావలసిన అర్హతలు	: క్రమాంతము లేక పదాంతము
అదనపు అర్హతలు	: ఏదైన మఱియొక వేదము /వేదభాష్యము/శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవము	: 2 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 8,000/- మొత్తము, సౌకర్యములతో.
______	: (ఒక్కొక్క వేదాకి ఒక్కరు చొప్పున 4 ఖాళీలు)
విద్యార్హత	: ఏదైన వేదభాష్యంలో ఉత్తీర్ణత
అదనపు అర్హత	: మరొక వేదభాష్యము / శాస్త్రము యొక్క పరిజ్ఞానము
అనుభవార్హత	: 5 సంవత్సరములు
సంభావన	: నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన ధరఖాస్తు ఫారములను

(ఫోను : 040-27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టుద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయుబడిన ముద్రించిన దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్నిబట్టి ఖాళీలను పూరించుటలోను, అర్హతల సవరణలోను మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

Sponsored by :

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1-10-140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad-500 020
Ph : 27637717, 27633627, Fax No. 040-27630172,
E-mail : info@kakatiyacement.com

వేదాంతభేరి

నవంబర్ 2015 రూ. 6/-

సమాజాన్ని ప్రేమించు సర్వేశ్వరుడు నిన్ను ప్రేమిస్తాడు

'ఫలానా వ్యక్తి నా తల్లి' అనే నమ్మకముంటే కదా నీవు ఆమెను ప్రేమించగలవు. 'ఆమె నా తల్లి అవునో కాదో' అని సందేహిస్తే నీకు ప్రేమ ఎలా కల్గుతుంది? నమ్మకమున్నచోట ప్రేమ ఉంటుంది. ప్రేమ ఉన్నచోట శాంతి ఉంటుంది. శాంతి ఉన్నచోట సత్యముంటుంది. సత్యమున్నచోట ఆనందముంటుంది. ఆనందమున్నచోట భగవంతుడుంటాడు. మొట్టమొదట నమ్మకమే లేకపోతే దివ్యత్వమంటే ఏమిటో అర్థం కాదు. తనను తాను నమ్మలేనివాడు సమాజాన్ని ఏ రీతిగా ప్రేమించగలడు? ఆత్మవిశ్వాసం గలవాడే సమాజాన్ని ప్రేమిస్తాడు. సమాజాన్ని ప్రేమించేవానిని సర్వేశ్వరుడు ప్రేమిస్తాడు.

– శ్రీసత్యసాయిబాబా

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 నవంబరు 2015 సంచిక : 11

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 నవంబరు 2015 సంచిక : 11

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. దుర్గుణ జయోపాయములు - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురూపదేశాలు-శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -08
04. శ్రీరామకృష్ణ కథామృతము - శ్రీ రామకృష్ణ పరమహంస - 10
05. ఉన్నది ఒకే దేవుడు - స్వామి దీప్తానంద సరస్వతి - 12
06. ప్రణవోపాసన - ఎస్.వి.భారతీలక్ష్మి - 17
07. పాపపరిహారం - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 21
08. ఆచార్యదేవోభవ - డా॥ కె.సర్వోత్తమరావు - 26
09. జ్ఞానసుధ - శ్రీ శంకరానందగిరి స్వాములవారు - 29
10. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు -31
11. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేంద్ర మహాస్వామి -35
12. ఇలా వుంటే ఎంత బాగుండును - కె. ఈశ్వర్ - 37
13. గ్రంథ సమీక్ష - 39
14. గ్రంథావిష్కరణ - 41
15. వార్తలు - 42

ముఖచిత్రం : దీపావళి

11-11- 2015 తేది దీపావళి

ప్రార్థన

మూలం : శ్రీ నారాయణ గురు (వర్కల)

1. కాపాడు మో దేవ ! కరుణించు మమ్ము
నీ పాద యుగళమ్ము నిక్కంపు నావ ।
నీ వెపో భవవారిధిని దాటింప
నావికుండవు మాకు దేవాది దేవ !

2. నా మది నీ యందు నయమార నిలుప
ప్రేమతో బ్రోవరావే మహాదేవ !
అన్నవస్త్రాల మాకున్నదే కొరత !
అన్నియు నీవిచ్చి ఆదుకోలేద

3. నీవె మా జీవిత నిఖిలేశ్వరుడవు
నీవెపో సౌభాగ్యనిధికారకుడవు
కడలిలో తరంగాలు గాలిచే కదలు
జడులమౌ మాకు నీ విడలేవె సిరులు

4. నీ మాయ నీలీల నీ మహిమమ్ము
ప్రేమ నా కర్థమై విలసిల్ల నిమ్ము
సృష్టికర్తవు నీవ, సృష్టివి నీవ
పుష్టికర్తవు నీవ, పొలియింతు లీవ.

5. సృష్టిజాలము నీవ స్రష్టయు నీవ
పుష్టి సామగ్రి సమష్టివి నీవ
మాయా వినోదివి మాయవు నీవ
మాయగాడవు మాయ మాపంగ లేవె

6. సాయుజ్యమిడి మమ్ము సాకు మోదేవ
వేయేల నిను సదా వినుతింతు మయ్య
జయ ! దయారససింధు ! జయ చిదానంద !
జయ ! శిష్టజన వంద్య ! జయ ! దీనరక్ష !
నీ కృపామృతరస స్నిగ్ధ వీక్షణము
మాకు సర్వస్వము మహి శరణ్యమ్ము.



దుర్గుణ జయోపాయములు – 4

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జీవుడు అజాగ్రతగానున్నపుడు దుష్టగుణము ఒక చిన్న మిణుగురువలె అంతఃకరణమున ప్రవేశించును. అది క్రమముగ పెద్దదై, పెద్దదై జ్వాలారూపమును ధరించి తన ప్రచండ తీక్ష్ణత్వముచే ఆ జీవుని, అతని చెంతనుండు తదితరులను గూడ బాధించును. అపుడు దానిని చల్లార్చుటయు చాల ప్రయాసగా నుండును. కాబట్టి మిణుగురుగ నున్నపుడే దానిని అంతమొందించి వేయవలెను.

మాయ మహాప్రమాదకరమైనది. అది నెమ్మదిగా జీవుని దగ్గఱకు వచ్చి కొద్దిచోటు మాత్రమే ఇమ్మని అడుగును. ' Give me room to sit down, and I can make room to lie down " "నాకు కూర్చొనుటకు చోటివ్వండి, పండుకొనుటకు చోటు నేనే చేసికొనగలను " అని మాయ మనుజుని అర్థించును. అట్లు అర్థించి ఒకింత నెలవు సంపాదించి, పెరిగి పెరిగి, తుదకు తనకు చోటిచ్చినవానినే అధోగతికి త్రోసివేయును. కావున కామముగాని, క్రోధముగాని, అసూయగాని హృదయములో ప్రవేశించిన వెంటనే కనిపెట్టి, విచారణా బలముచే వానిని సమూలముగ తొలగించి వేయువాడు ధన్యుడు. అట్టివాని హృదయము నిష్కంటకమై, నిరావరణమై, నిర్మలమై ప్రకాశించును. అట్లుకాక రావణకాష్ఠమువలె వానిని చల్లారకుండ చేయువాడు ఘోరమగు ఆపత్తును బొందగలడు.

ఆరోగ్యము చక్కగనున్నపుడే, ఈ శరీరము పతనమైపోవుటకు పూర్వమే, ఇంద్రియ పటుత్వము బాగుగ నున్నపుడే, జీవుడు తనయందలి ఈ విషాగ్నులను రహితమొనర్చు యత్నముల దత్తచిత్తుడు కావలెను. " ప్రాక్శరీరవిమోక్షణాత్ " అనగా శరీరము వీడిపోవుటకు ముందుగానే

కామక్రోధాదుల వేగమును అరికట్టగలుగువాడే పరమసుఖమును బొందగలడని గీతాచార్యులానతిచ్చిరి. ఈ విషాగ్నులు హృదయమున తిష్ఠవేసికొని యున్నంతకాలము జీవుడు గుహా గహ్వరములందు కాపురము చేసినను, తీర్థస్థానములందు కాలము గడపినను, పరమైకాంతస్థలముల నాశ్రయించినను, పుణ్యక్షేత్రములందు వర్తించినను శాంతిని నోచుకొన లేకయే యుండును. కాబట్టి ఎక్కడో ఒకచోట కూర్చొని, ఆత్మపరిశోధన చేసికొనుచు, తనలో ఏయే రాక్షసులు ప్రవేశించుచున్నారో బాగుగ కనిపెట్టి వివేకదండముచే వారిని తరుమగొట్టుటయే మనుజుడు చేయవలసిన పని. ' గమనార్థంతు రక్షసామ్ ' అను వాక్యమును స్మృతిపథమున నుంచుకొని ఆ దుష్టదానవసంఘమునకు తనలో ఏమాత్రము నెలవొసంగక, ' ఆగమార్థం తు దేవానామ్ ' అను పూజవాక్యమును సదా స్మరించుచు తదనుసారముగ అమానిత్వాది సుగుణరాశిని, దైవసంపత్తును, సురసంఘమును తనలోనికి ఆహ్వానించి, సన్మానించి, సత్కరించి హృదయ క్షేత్రమును దివ్యదేవాగారముగ రూపొందించుకొనవలెను. దుర్గుణములకు వీడ్కోలు (Send - Off) సద్గుణములకు సత్కారము (Welcome) ఏక కాలమున గావించవలెను.

ప్రేమయను జలముచే ద్వేషమను అగ్నిని చల్లార్చి వేయవలెను. వైరాగ్యమను శీతల వర్షధారలచే కామమను భీషణ దావాగ్నిని ఉపశమింప జేయవలెను. దయ, కరుణ, సర్వభూతసమత్వము అను తోయముచే అసూయాగ్నిని, ఈర్ష్యాగ్నిని అంతమొందింప జేయవలెను. ఈ ప్రకారముగ ఏదియో యొక ఉపాయముచే, మార్గముచే హృదయస్థ భీకర విషాగ్నులను చల్లార్చి వేయవలెనేకాని రావణ కాష్ఠము వలె వానిని ఇంకను ప్రజ్వలించులాగున చేయరాదు. ముముక్షువు లివ్విషయమును సదాజ్ఞప్తియందుంచుకొని ప్రయత్న పూర్వకముగ అసురసంపత్తును తెగటార్చి తమ హృదయసీమలను దైవసంపద్విలసితములుగ గావించుకొని, సుగుణాన్వితులై పఱగవలయును.

సద్గురూపదేశాలు

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

నీళ్లచే నిప్పును చల్లార్చునట్లు శాంతముచే కోపమును, సత్యముచే అసత్యమును, ధర్మముచే అధర్మమును, శ్రద్ధచే ఆలస్యమునున్ను జయించవలెను.

ప్రకాశముచే తమస్సును జయించునట్లు, కరుణచే కాఠిన్యమును, త్యాగముచే లోభమును, విరాగముచే రాగమును, దయచే భేదబుద్ధినిన్ని జయించవలెను.

నావచే సముద్రమును దాటునట్లు విచారణ జ్ఞానంచే సంసారమును, ధ్యానంచే మాయను, యోగంచే మనస్సును, ధైర్యంచే లోకమునున్ను దాటవచ్చును.

వర్షంచే దావాగ్ని శమించునట్లు, భక్తిచే తాపత్రయాగ్ని, ప్రేమచే ద్వేషబుద్ధి, అమృతత్వంచే మృత్యువున్ను శమించును.

ఎంతకెంతకు మనస్సు దైవవిషయమై తీవ్రనిష్ఠ, ఏకాగ్రత గలిగియుండునో అంతకంతకు దైవప్రాప్తిలోగల విఘ్నములన్నియు తొలగుటయే గాక దైవప్రాప్తియు శీఘ్రముగనే గలుగును.

వర్షములేని కాలములో గల జీవితమేటువంటిదో, చంద్రుడు లేని రాత్రిలో సంచారమెటువంటిదో, రోగముతో గూడిన బ్రతుకు ఎటువంటిదో శాంతి లేని జీవితమున్నూ అటువంటిదే.

సోమరితనము గల జీవితము, పరిశ్రమ చేయని బ్రతుకు మొదట సుఖకరంగా కనిపించినా, ఏలాంటి ఉన్నత స్థితిని పొందకపోవుటే గాక జీవితాంతము వఱకు పరుల నాశ్రయించియే జీవించవలసి యుండును.

ఎంతకెంతకు మనస్సు దైవవిషయంలో తీవ్రనిష్ఠ, ఏకాగ్రత గలిగియుండునో అంతకంతకు దైవప్రాప్తిలో గల విఘ్నములన్నియు

తొలగిపోవుటే గాక దైవప్రాప్తియు శీఘ్రముగనే గలుగును.

ఈశ్వరుడు సకల పరమాణువులలో కూడ వెలుగుచున్నను అప్రాకృత దివ్యచక్షుస్సు గలుగువఅకు ఎవరికిని కనుపించడు.

దృశ్య విషయసుఖమునకై పరుగిడు మనస్సు దృక్కగు ఆత్మలో లయించి శాశ్వత బ్రహ్మ సుఖము నొంది సుఖింపజాలదు.

ప్రపంచములో గల దేనికిని లొంగకుము. అట్లు లొంగనివానికి ఈ లోకము లొంగిపోవును. అట్లుగాక ఏ విషయమునకైనను లొంగినచో లోకమున చిన్న స్థితిలో నుండు వానికి గూడ లొంగిపోవలసి యుండును.

తన ఆచరణలో లేని గొప్ప భావములను లోకమునకు చెప్పిన లోకము అనుష్ఠించునని భ్రమించకుము. అది లోపల గింజ (అంకురశక్తి) లేని విత్తనములను విత్తినట్లు ఉండునని మరువకుము.

సత్య జీవితముయొక్క పరిణామము అమృతమయమై పరిణమించును. అసత్య జీవితముయొక్క పరిణామము విషభూయిష్ఠమై పరిణమించునని మరువకుడు.

ఈక్రింది వారు ఆశ్రమానికి పైకం పంపినారు

01. డి.సుదర్శనమ్మ (చెన్నై) భోజనశాలకు రూ. 10,000/-
02. గంగు ఆదినారాయణ, భోజనశాలకు రూ. 10,000/-
(నందబలగ, శ్రీకాకుళం),
03. కె.ఆశీష్ (హైద్రాబాద్) శివాలయపూజానిధికి రూ. 25,000/-
04. డి.వి.ఎస్.వి.సుందరావు (సౌదీఅరేబియా) రూ. 10,000/-
(శివాలయ నిర్మాణానికి)
05. శివరాం ప్రతాప్ (యు.ఎస్.ఎ.) రూ. 10,000/-
06. బి.సుజనమతి, మూలనిధికి రూ. 10,000/-
07. డి.వి.ఎస్.వి. సుందరరావు (సౌదీఅరేబియా). రూ. 10,000/-
08. డి.రామమూర్తి శెట్టి (పుత్తూరు) రూ. 10,116/-
09. వి.జయశ్రీ (హైద్రాబాద్) గో సేవకు రూ. 10,000/-

వీరందరిని భగవంతుడు అనుగ్రహించుగాక !

సంసార తరణోపాయం

- శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణులు:" భగవానుని ఐశ్వర్యము చూచియే లోకులు ముగ్ధులగుదురు. కాని భగవానుని వెదుకరు. కామినీ, కాంచనముల వెనుకనే తిరుగుదురు. పరిణామము దుఃఖము, అశాంతియే ఎక్కువ పాళ్ళు. అడుసులో ఒకసారి కాలు పెట్టినచో ఇక లేవనెత్త లేవు. ముళ్ళకంపలో దూరినపుడు ఒక ముల్లు పట్టుకుంటే వదలదు. సంసార దావాగ్నిలో దగ్ధులగుదురు.

ఒక భక్తుడు : ఇక ఉపాయమేమి ?

శ్రీరామకృష్ణులు : సాధు సాంగత్యము, ప్రార్థనయు. వైద్యుని కడకు పోనిచో రోగము నయంకాదు. ఒకరోజు సాధుసంగమము చేసిన చాలదు. సర్వదా వైద్యుడు అవసరము, సర్వదా ఏదో ఒక రోగము అంటుకొనియే ఉన్నది. నాడిని తెలుసుకొనవలెనన్నచో (నాడీ శాస్త్రము) సర్వదా వైద్యుని వెంటనేయుండి నేర్చుకొనవలెను. అప్పుడే వాత, పిత్త, కఫ నాడుల అనుభవ జ్ఞానము కలుగును.

భక్తుడు : సాధు సాంగత్యము వలన ఉపకారమేమి ?

శ్రీరామకృష్ణులు : ఈశ్వరుని పట్ల ప్రేమ కలుగును. అనురాగ మేర్పడును. వ్యాకులత కలుగనిచో ఏమియు లాభము లేదు. సాధుసాంగత్యము చేయుచుండినచో ఈశ్వరునికై వ్యాకులత ఏర్పడును. అదెట్లన గృహములో ఎవరైన వ్యాధితో బాధపడుచున్న, ఆ వ్యక్తికి ఆరోగ్యమెప్పుడు కుదుటపడునా యని ఆందోళన చెందు విధమున. ఇంకొక ఉదాహరణము - తన ఉద్యోగము పోగొట్టుకొన్న వ్యక్తి మరల ఉద్యోగమునకై ప్రతిదినము ఎన్నియో ఆఫీసులు తిరుగును. అత్యంత వ్యాకుల మనుస్కుడై ఒక ఆఫీసులో ' నేడు ఉద్యోగము ఖాళీ లేదు ' అని చెప్పిన, మరుసటి రోజు మరల అచటికి వెళ్ళి

‘ ఈ దినము ఖాళీ ఉన్నదా !’ అని అడుగును.

ఇంకొక ఉపాయము కలదు. కడు వ్యాకులతతో ప్రార్థించుట. అతడు మన స్వంతము – అతనికి విన్నవించుకోవలెను. నీ వెట్టి వాడవు ? నాకు దర్శనమిమ్ము – దర్శనిమిచ్చి తీరవలసినదే. నీవు నన్నెందులకు సృష్టించితివి? సిక్కులు – ‘ ఈశ్వరుడు దయామయుడు ’ అని నాతో చెప్పిరి. నేను వెంటనే ఇట్లు బదులు చెప్పితిని – ‘ దయామయుడని మీరెందులకు చెప్పెదరు ? అతడు మనలను సృష్టించి,మన క్షేమమునకై ఏర్పాట్లు చేసెను. దానిలో విశేషమేమి ? ఆశ్చర్యమైన విషయమేమి కలదు? తల్లిదండ్రులు తమ బిడ్డలను పెంచుట సహజము. దానిని దయ అందురా? అందులో దయ అనునది ఏమిటి ? అది వారి కర్తవ్యమే ? అందుచే ఆయన వద్ద గట్టిగా ప్రార్థన చేయవలయును. అతడు మన స్వంత తల్లి, తండ్రి. కొడుకు బలవంతము చేసినచో తల్లి, తండ్రి వాని భాగము పంచి పెట్టుదురు. పిల్లవాడు బలవంతము చేయుచూ “ అమ్మా ! నీ కాళ్ళు పట్టుకొందును, నాకు రెండు పైసలు ఇమ్ము ’ అనిన, తల్లి వెంటనే రెండు పైసలు ఇచ్చును.

సాధు సాంగత్యము చేసినచో ఇంకొక ఉపకారము కూడ కలదు. సదసద్ విచారము కలుగును. సత్ – నిత్య పదార్థము – అనగా ఈశ్వరుడు . అసత్ అనగా నిత్యము కానిది. అసత్ మార్గమున మనసు పోయినచో వెంటనే విచారము చేయవలెను.

చందాదారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరి ముద్రణ వ్యయం చాలా పెరిగినది. గావున తప్పనిసరి పరిస్థితులలో **వేదాన్తభేరి సంవత్సర చందా రూ. 100లకు** విధిలేక పెంచడమైనది. అందుచే సంవత్సర చందాదారులు సంవత్సర చందా రూ.100/–లు పంపగోరుచున్నాము.

ఉన్నది ఒకే దేవుడు

– స్వామి దీప్తానంద సరస్వతి

ప్రతి మనిషీ భగవదంశకు చెందినవాడే. అతడి జీవితం దానిని ఆశ్రయించి జరిగేదే. అలా ఆశ్రయింపబడి బ్రతికేవాడు అతడు. ఆవిధంగా ప్రతి మనిషీ భక్తుడే. జన్మతః అతడి మౌలిక సంబంధం భగవంతునితో. జన్మించిన తరువాత అతడు మరి అనేకులతో రకరకముల సంబంధాలను పెంచుకొనవచ్చు గాక. కాని ముఖ్యమయిన సంబంధం భగవంతునితో ననేది వాస్తవం. దానిని కొందరు గుర్తించినా కొందరు గుర్తించకపోయినా నిజం మాత్రం అదే. గుర్తించని వారిని నాస్తిక భక్తులందాం. గుర్తించిన వారిని ఆస్తిక భక్తులందాం. అందరు మౌలికంగా భక్తులే. దైవమును చూడనంత మాత్రాన లేడనేందుకు వీలులేదు. మనం చూడనివన్నీ లేనట్లు కాదు. దానికి శాస్త్రం ఒప్పుకోదు. చూచినవా రుండవచ్చు. చూడని వారుండవచ్చు. గాని అది లేనిది కాజాలదు. మనమీ సృష్టిని చూస్తున్నాం. దీనిని సృష్టించింది మరి ఎవరో. ఇది సృష్టింపబడింది గనుక దీనికొక స్రష్ట ఉన్నాడు. నీవు దానిని కాదనలేవు.

ఆ ఉన్నవాని మీద భక్తి, మన మౌలిక సంబంధం. అతడిని అర్థం చేసుకుంటే ప్రేమించగలం. తెలియని దానిని ప్రేమించలేం కదా ! ఉన్నాడని తెలును. ఆయనను ప్రేమించడం ద్వారా, ఆయనతో సరిగా వ్యవహరించగల్గుతాం. అంటే సరిగా జీవించగల్గుతాం. అంటే ఆనందం పొందగల్గుతాం. **అలా అర్థం చేసుకోడానికి పొందే తపన, చేసే సాధన, భక్తి యోగ సాధన. ఆ సాధన మనకు ఋషులు ప్రసాదించారు.**

ఉన్న దేవుణ్ణి మనం పలువిధాలుగా పిలుస్తుంటాం. ఉన్నది ఒక్క దేవుడయితే పలువురుగా వ్యవహరించడ మేమిటి ? పలువురు దేవుళ్ళనే విషయంలో ఆక్షేపించవలసిందేమీ లేదు. ఉన్నది ఒకే దేవుడు. ఎవరి ప్రవృత్తిని బట్టి వారు ఆరాధించుకుంటారు. ఈవిషయంలో మనం దృఢమైన ఆత్మవిశ్వాసంతో మన ధర్మాన్ని అర్థం చేసుకుని వ్యవహరించాలి.

ఈ సనాతన ధర్మం ఒక మతం కాదు. క్రైస్తవాదికములు మతములు. ఇష్ట దేవతారాధనల వంటివి. ఇష్టదైవారాధనను అనుమతిస్తూనే సనాతన ధర్మం ఆ పరిస్థితి నుండి బయటపడడం నేర్పుతుంది. సత్యాన్ని, బ్రహ్మన్ని, దైవ స్వరూపాన్ని గుర్తించమంటుంది. ఆత్మ సాక్షాత్కారాన్ని పొందమంటుంది.

అందుచేత నిజమైన విలువలను గుర్తించి జీవించడం నేర్పుతుంది మన ధర్మం. మనకు జీవితంలో సంక్రమించిన లేదా తెచ్చిపెట్టుకున్న అవగుణాలను వదలమంటుంది. అలా వదిలితే మనస్సు శాంతిని పొందుతుంది. బుద్ధి సునిశితమౌతుంది. అంతరంగం జ్ఞానయోగ్య మౌతుంది. అందుకు ప్రయత్నించడమే **సాధన.** అలా క్షణ క్షణము మెలకువతో, పదును తేరిన బుద్ధితో జీవించాలి. అదే ఆధ్యాత్మికత అంటే. అదీ **ఆధ్యాత్మిక జీవితమంటే.**

జీవితం అనేది అవిభాజ్యం. అందు అనేక రంగాలు ఉంటాయి. మనం జీవించే రంగం ఏదయినా అందులో ఎలా జీవిస్తున్నామనేది ముఖ్యం. భగవంతుని యెడ గుర్తింపుతో జీవిస్తున్నామా లేదా అనేదే. ఇలా ' మనం ' అనేదాన్ని అంటే **అహం అనేదాన్ని క్షణక్షణం భగవదంకితం చేసి జీవించడం ముఖ్యం. దానినే శరణాగతి అంటారు**, ఇది మొదటి మెట్టు.

ఇక రెండవది. ఆయన ఉన్నాడని తెలుసు గనక ఆయనను గురించి సరిగా మరింతగా తెలుసుకోడానికి జిజ్ఞాస (జ్ఞాతుం ఇచ్ఛా) చేయడం

రెండవ మెట్టు. అందుకుగాను సత్సంగానికి వెళ్ళాలి. అధ్యయనం చేయాలి. అలా చేసి, ఆయనను తెలుసుకొనని పక్షంలో ఆయనను పరిపూర్ణంగా ప్రేమిచలేం. ఉన్నాడని తెలిస్తే చాలదు. స్వరూప, స్వభావాలతో ఆయన తత్త్వం స్పష్టంగా తెలియాలి. కొంతకాలం దానికై వినియోగించాలి.

కాలమంతటిని దానికై వినియోగిస్తే మనం యోగుల మయిపోయినట్లే. సామాన్యులం కదా మనం. మనకు అవసరాలుంటాయి. తీర్చుకొనదగినవి ఉంటాయి. దానికై కొంత సమయం వినియోగపరుస్తూ, ఆయనను ఇంకా తెలుసుకోవడానికి సమయాన్ని, కాలాన్ని కేటాయించాలి.

అయితే కోరికలనబడే వాటికి బానిసలం కారాదు. సామాన్యస్థితిలో మనిషికి కోరికలుండడం సాధారణమైన విషయమే. వానిని తీర్చుకోవడంలో మనకు పాపపుణ్యాలు సంక్రమిస్తుంటాయి. ఇలా కామనలు తీర్చుకోడానికి మనం జరిపే కార్యకలాపాలన్నీ కర్మయోగ భావనతో చేయాలి. **కర్మ ప్రారంభించే ముందు భగవంతుని వలన కర్మ చేయడానికి కావలసిన శక్తి, యుక్తులను పొంది ఉన్నామన్న గుర్తింపు అవసరం.** అంటే కర్మాధ్యక్షునిగా భగవంతుని గుర్తించి నట్లయింది. కర్మఫలం సుఖ, దుఃఖరూపాల్లో అనుభవానికి వచ్చినపుడు ఆయనను కర్మఫలదాతగా గుర్తించినపుడు కర్మఫలం ప్రసాదమవుతుంది. ఇదే కర్మయోగం. అలాకాక, అహంతో కోరిక తీర్చుకొనడానికే కర్మ చేసినట్లయితే, పాపపుణ్యములు సంక్రమిస్తవి. ఎవరు చేసిన పాపపుణ్య కర్మఫలములు ఏదో జన్మలో వారే అనుభవించవలసి ఉంటుంది. ఇది మనుషులకు ప్రత్యేకం. దేవతలకు ఈ స్థితి లేదు. పూర్వ పాపఫలితంగా పశువై జన్మించి, ఆ పాపపు అనుభవములు తీరి బయటపడడం జరుగుతుంది. దేవతలు పూర్వ పుణ్య ఫలితంగా ఉత్తమ సుఖాలు అనుభవించి మరియొక జన్మపొందుతారు. మానవ జన్మలో పాపపుణ్య అనుభవములు రెండూ ఉంటవి. అందుచేత

వేదాన్తభేరి ... మురళీధర కృష్ణుడు

సుఖ దుఃఖ అనుభవములు రెండూ ఉంటవి. అసంఖ్యాకంగా జనన మరణములు పొందుతూ ఉంటాం. వీటినుండి బయటపడటమే లక్ష్యం. అదే శాశ్వతానందం, మోక్షం.

జీవితాన్ని అర్థం చేసుకుని, ప్రేమించి, సరిగా జీవించి, జన్మ పరంపరల నుండి బయటపడి ఆనందించదలిచాం. కాబట్టి మనలను తిరిగి తిరిగి జన్మ పరంపరలో పడవేసే కోరికలను జయించాల్సి వుంది. అందుకుగాను మునుముందుగ ఆ కోరికల స్వరూప స్వభావాలను తెలుసుకోవాలి. అవి ఎక్కడి నుండి వస్తున్నాయో తెలుసుకోవాలి.

వాసనలు అనే శబ్దం మనం వింటుంటాం. గత జన్మలలో మనచే చేయబడిన పాపపుణ్యములు మన అంతరంగమునందు సూక్ష్మరూపములో ఉంటాయి. అవే వాసనలు. అవి మనసులో కోరికల రూపంలో వ్యక్తమవుతుంటాయి. అంటే కోరికలు వాసనలనుండి జన్మిస్తాయి. గత జన్మల్లోని పాపపుణ్యములేకాక ఈ జన్మలోని అనుభవాలు కూడ వాసనల రూపంలో అంతరంగంలో నిక్షిప్తమవుతాయి. అవికూడ కోరికల రూపంలో వ్యక్తమవుతాయి. ఇవన్నీ తీర్చుకొనవలసి వుంది. అయితే ధర్మానికి అడ్డురాకుండా, వాటిని తీర్చుకోవాలి. ఆయా బాధ్యతలు నిర్వహించుకోవాలి. అలా చేస్తూనే భగవత్తత్త్వం తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తుండాలి.

మన కర్మ నిర్వహణకు, భగవంతునకు చాల దగ్గర సంబంధం వుంది. జీవితంలో మనం అనేక పనులు, అనేక ఉద్దేశాలతో చేస్తూంటాం. ఒక పదునైన కత్తితో ఒక వైద్యుడు శస్త్ర చికిత్స చేస్తూ ఒకరిని కోస్తాడు. అలాంటి కత్తితోనే ఒక హంతకుడు మరొకరిని కోసి ప్రాణమును బలిగొంటాడు. జరిగిన బాహ్యకర్మ ఒకటే. కాని వైద్యునకు ‘ ఫీజు ’ చెల్లించి, కృతజ్ఞతలు చెల్లిస్తారు, రోగి మరణించినాసరే. హంతకునికి ప్రభుత్వం శిక్ష విధిస్తుంది. అంతటితో సాధారణంగా మనం అనుకున్నట్లు అయిపోలేదు. రోగి స్వస్థత భావించే

వైద్యుడు బాహ్యకర్మఫలం పొందేడు గాని, ఆ భావానికి ఫలం ఎవ్వరిస్తారు? అలాగే ప్రభుత్వం హంతకునికి బాహ్యకర్మకు ప్రతిఫలం అందించిందే కాని కర్మ చేసే సమయంలో అతడి దుష్ట భావనను శిక్షించదు. దానికి భగవంతుడు పాపాన్ని కలుగచేసి ఏదో జన్మలో శిక్షిస్తాడు. ఆ విధంగా భగవంతుడు కర్మ ఫలదాత. కర్మ శక్తిదాత కూడ భగవంతుడే. కర్మాధ్యక్షుడే ఆయన.

ఈ విషయములను గుర్తించి, ఆయనను తలచుకుంటూ కర్మలయందు నిమగ్నమవుతాం. ఉద్యోగం చేసే పురుషుడు కాని, గృహకృత్యములందు నిమగ్నమయ్యే స్త్రీ గాని తమ తమ కర్మలన్నిటి విషయంలో అదే దృష్టిని అవలంబిస్తారు. అలా భక్తి, కర్మయోగ నిష్ఠలో జీవించమని శాస్త్రాలు చెపుతాయి.

ఇలాంటి దృష్టితో బ్రతకడానికి వ్యక్తి రాగద్వేషాల నుండి బయటపడాలి. సాత్వికుడు కావాల్సి వుంది. రాగం రజోగుణజనితం. ద్వేషం తమోగుణజనితం. రజస్తమోగుణ ప్రభావాల నుండి బయటపడినవాడు బ్రాహ్మణుడు. అతడు ఉన్నదున్నట్లు చూడగలుగుతాడు. అలా వ్యక్తి బ్రాహ్మణుడు కాగలిగినపుడు ఉత్కృష్టమైన సుఖం లభిస్తుంది. అయితే అది పూర్ణానందం కాదు. అతడి బుద్ధి సునిశితం కావాలి. బుద్ధితో జీవించాలి. అంటే అతడు సంన్యాసి కావాలి. సంన్యాసం అంటే కాషాయవస్త్రాలు ధరించడం కాదు. అహాన్ని – సాత్విక అహంకారాన్ని – ఆత్మజ్ఞానంలో – స్వరూపంలో లయం చేయాలి. అలా సంన్యాసి కావడంలోనే మోక్షం ఉంది. పూర్ణానందం ఉంది. ఇదంతా క్రమేణ జరగడానికి మనం కర్మలన్నిటి నిర్వహణలో అత్యంత జాగరూకతతో, మెలకువతో వ్యవహరించాలి.

ప్రణవోపాసన

- ఎస్.వి. భారతీలక్ష్మి (బలుసుమూడి, భీమవరం)

అద్వైత మహామంత్రం (గత సంచిక తరువాయి)

ఓంకారము ప్రాణుల హృదయముల నుండి సహస్రారం వఱకు 'సోహం ' భావనతో నిండియున్నది. సః + అహం = సోహం. 'సః' అనగా పరమాత్మ. 'అహం ' అనగా జీవాత్మ. సో2హం అనగా పరమాత్మయే జీవాత్మ అనియు, జీవాత్మకు పరమాత్మకు భేదం లేదనియు, జీవాత్మ పరమాత్మలో ఐక్యమగుటయే 'సో2హం' మంత్రం యొుక్క పరమార్థ మనియు చెప్పబడుచున్నది. సః అహం, అహం సః.అహం బ్రహ్మాస్మి. బ్రహ్మోహమస్మి. ఇదే అద్వైత మహామంత్రం. ఉపనిషత్తులో చెప్పబడిన మహావాక్యం ఇదేనని గురువుల బోధ.

సోహంలోని స-హ అక్షరాలను తొలగించగా ఓం అనే అక్షరం శేషిస్తుంది. అదియే ఏకాక్షరీ మంత్రం. ఏకాక్షరియగు ఓంకారము తానేనని శ్రీకృష్ణపరమాత్మ బోధించాడు - 'గిరామస్మ్యేకమక్షరమ్ ' (భ.గీ. 10-25) ' ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' (భ.గీ.8-13) ఓం అను ఏకాక్షరం బ్రహ్మస్వరూప మనియు, ఓంకారమునకు అర్థస్వరూపమగు నిర్గుణబ్రహ్మము తానేననియు పరమాత్మ స్వయంగా చెప్పాడు. ' ఓమిత్యేతదక్షర మిదగ్ం సర్వం ' సర్వము ఓంకారాత్మకమేనని ఉపనిషద్వాణి. బ్రహ్మాత్మైక్యత్వ దర్శనమోంకారం. బ్రహ్మము నందు ఏకత్వాన్ని పొందు స్థితియే ఓంకారమని శ్రుతివాక్కు. కార్యకారణ సంఘాతమునకు సాక్షియగు అపరోక్ష కూటస్థ చైతన్యము ఓంకారము,

ఏతద్యేవాక్షరం బ్రహ్మ ఏతద్యేవాక్షరం పరమ్ ।
ఏతద్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్ ॥

ఏకాక్షరియగు ఓంకారమును ఆలంబనగా గైకొని సగుణముగానైనను, నిర్గుణముగానైనను ఉపాసించినచో కోరిన కోర్కెలు నెరవేరునని కఠోపనిషత్తులో చెప్పబడినది. ఓంకారమునుచ్చరించిన తరువాత నున్న విరామసమయం నిర్గుణ నిరాకార పరబ్రహ్మమును వ్యక్తపరచుననియు, ఆ విరామ సమయాన్ని గుర్తించి అందుండడమే సిద్ధియనియు వేదాంత పంచదశిలో శ్రీ విద్యారణ్యులు చెప్పారు.

ఓంకారమునుచ్చరించునపుడు అకారమును ఉకారములోను, ఉకారమును మకారములోను - మకారమును అమాత్రలోను లయం చెయ్యాలి. అలాగే అకారమునకు ప్రతీకయగు జాగ్రదవస్థను ఉకారమునకు ప్రతీకయగు స్వప్నావస్థ యందును. స్వప్నావస్థను మకారమునకు ప్రతీకయగు సుషుప్త్యవస్థ యందును, సుషుప్త్యవస్థను అమాత్రకు ప్రతీకయగు అవ్యక్తంలో లయం చెయ్యగా సమాధిస్థితి గలుగుతుంది. అదియే బ్రహ్మాత్మనా సంస్థితియని శ్రుతిమాత చెప్పుచున్నది.

ప్రణవోపాసన :

పరమాత్మ ప్రణవస్వరూపం. అదియే అన్నింటికి పరమైనది. ప్రణవము సత్యం జ్ఞానమనంతం బ్రహ్మాయని తెలిసి సాధన చెయ్యాలనియు, అదియే ప్రణవోపాన అనియు, పరబ్రహ్మప్రాప్తికి ప్రణవోపాసన సర్వోత్కృష్ట సాధన అనియు శ్రుతివాక్కు. ' మంత్రాణాం ప్రణవః శిరః '. మంత్రములన్నింటికి ప్రణవము శిరస్సు వంటిదని సూతసంహితలో చెప్పబడినది. మనస్సును ఓంకారనాదంలో లయం చేయగా ఆనాదం యెక్కడ ఆగిపోవునో, అక్కడ నిలచు మనస్సు యెుక్క స్థితియే బ్రహ్మమని తెలిసికొని అందు లీనమగుటయే ప్రణవోపాసనయని వేదాంత పంచదశిలో చెప్పబడింది.

' ప్రణవ స్వరూపుడ నేనటంచు తెలిసి భావింపవలయు '. (సీ.రా.సం 2-64) ప్రణవ స్వరూపము నేనేనని భావించి ప్రణవోపాసన ద్వారా అపరోక్ష బ్రహ్మానుభూతిని పొంది కృతార్థుడవగుమని శ్రీరాముడు హనుమకు బోధించాడు.

ప్రణవో ధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే ।
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్ ॥

ముండకోపనిషత్తులో ప్రణవమును ధనుస్సుతోను, జీవుని బాణముతో పోల్చారు. బలంగా గురిచూసి వదలిన బాణము లక్ష్యాన్ని భేదించినట్లే, అలసత్వం లేకుండా ప్రణవోపాసన చేసిన సాధకుడు బ్రహ్మమనే లక్ష్యాన్ని చేరి బ్రహ్మభావనలో నుండు ననియు, బ్రహ్మ స్వరూపమై శేషించుననియు చెప్పబడింది.

ఆత్మానమరణింకృత్వా ప్రణవం చోత్తరారణిమ్ 7
జ్ఞానానిర్మథనాభ్యాసాత్పాశం దహతి పండితః ॥

మనస్సును క్రింది కొయ్యగాను, ప్రణవమును పైకొయ్యగాను చేసి నిరంతరం ఆత్మానుసంధానమనే మథనం చేయగా జీవబ్రహ్మైక్యమనే అగ్ని రగుల్కొంటుంది. అనగా మనస్సు, ప్రణవము రెండింటి అనుసంధానమనే సంఘర్షణచేత అద్వైత జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లి అవిద్యారణ్యం – అజ్ఞానమనే పాశం దహించబడుతుంది. అవిద్యా ప్రతిబంధం తొలగినంతనే బ్రహ్మము తానేనను అద్వైతాభవమును పొందును. అనగా, సాధకుడు జీవబ్రహ్మైక్యజ్ఞానము గలిగి అపరోక్షానుభూతిని పొందునని శ్రుతి బోధించు చున్నది. ‘ పరాపరబ్రహ్మవోంకార ఉపవర్ణితః’ ఓంకారమును (ప్రణవమును) సగుణమనిగాని, నిర్గుణమని గాని భావించి ఉపాసింపవలయునని ప్రశ్నోపనిషత్తులో చెప్పబడింది.

ఓంకారం ప్రణవస్వరూపం సర్వపాప ప్రశమనం
సర్వవేద స్వరూపాయ ఓంకారాయ నమో నమః ॥

ప్రణవ స్వరూపమైన ఓంకారము సమస్త పాపములను హరింప జేయును. సర్వవేదముల స్వరూపము ఓంకారమే. అట్టి ఓంకార స్వరూపమైన పరమాత్మకు మరల మరల నమస్కరించు చున్నాను.

భక్తులకు హెచ్చరిక

శ్రీ శుకబ్రహ్మాశ్రమము నుండి ఆశ్రమం కోసరం చందాలకు వచ్చామని కొందరు సన్న్యాస వేషంతో, ముగ్గురు, నల్గురు ఒక్కొక్క గ్రూపుగా వచ్చి చందాలు వసూలు చేస్తున్నట్లు భక్తుల నుండి మాకు ఫిర్యాదులు అందినవి.

కొన్ని రోజుల ముందు బెంగుళూరులో ఇలాంటి నల్గురు సాధువులు ఆశ్రమం పేరు చెప్పి పదేసి వేలు ఒక్కొక్కరి వద్ద వసూలు చేసినట్లు వారు పైకమిచ్చినట్లు మాకు తెలిపినారు.

కాని శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారు ఆశ్రమానికి చందాలకు ఎవరినీ ఎచటికి వసూళ్లకు పంపరు. కాబట్టి ఎవరైనా అలా ఆశ్రమం పేరు చెప్పి చందాలకు వస్తే వెంటనే వారిని పోలీసులకు పట్టివ్వండి. అది మీ ధర్మం కూడ. ఈ విషయంలో భక్తులు మోసపోవద్దని భక్తులకు ఆశ్రమము హెచ్చరిస్తున్నది. **ఇట్లు**

తేది : 10 – 10 – 2015 శ్రీ శుకబ్రహ్మాశ్రమము కమిటీ

వేదాన్తభేరికి ఈక్రింది వారు పోషక చందా పంపినారు

01. ఎ.మనోహరరావు (సైదాబాద్, హైద్రాబాద్)రూ. 1500/–
02. కె. విశ్వనాథ కిరణ్ (హైద్రాబాద్) రూ. 1200/–
03. సి. హెచ్. రామకృష్ణ శాస్త్రి (హైద్రాబాద్) రూ. 2400/–
04. వి. విజయప్రసాద్ (తెనాలి) రూ. 1200/–
05. పి.టి. కృష్ణ (సికింద్రాబాద్) రూ. 2500/–
06. కె.స్వర్ణలత (సికింద్రాబాద్) రూ. 1200/–

పాపపరిహారం

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

ఇటీవల గోదావరీ పుష్కరోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూడా ఎంతగానో సహకరించింది. ప్రజలు తండోపతండాలుగా గోదావరికి వెళ్ళి ‘ కోటి జన్మాఘనాశనమ్ ’ అంటూ అందులో స్నానాలు చేశారు.

కోటి జన్మలలో చేసి లెక్కకు మించిన పాపాలు పుష్కర స్నానంతో తొలగిపోతాయని పురాణాలు ఘోషించాయి. రానున్న సంవత్సరంలో (2016) కృష్ణా పుష్కరాలు వస్తాయి. కాబట్టి గోదావరీ పుష్కరాల తరువాత మనం చేసే పాపాలు కృష్ణా పుష్కరాలలో పటాపంచలైపోతాయని అనేకులు భావిస్తున్నారు. ఆ విధంగా వారు పాపపరిహారం కొరకై ప్రతీక్షిస్తున్నారు.

పుష్కరాలలోనే కాక ప్రతి దినమూ చేసే పూజలలో గూడా ప్రదక్షిణాలు చేస్తూ

యాని కాని చ పాపాని పూర్వ జన్మకృతాని చ ।
తాని తాని ప్రణశ్యన్తి ప్రదక్షిణ పదే పదే ॥

“ పాపోఽహం పాపకర్మాఽహం పాపాత్మాపాపసంభవః పాహి మాం కృపయా దేవ ! శరణాగతవత్సల” అని చెప్పడం కద్దు. దీని భావమిది “ పూర్వ జన్మలలో చేసిన యేయే పాపాలు కలవో, అవన్నీ ప్రదక్షిణకాలంలో నశిస్తాయి. నేను పాపిని, పాపకర్ములు చేసేవాణ్ణి, పాపం నుండి పుట్టిన పాపాత్ముడను. దేవా ! శరణాగతవత్సలా ! నన్ను దయతో కాపాడు ” – అని.

ఇక్కడ ఒక విషయం జిజ్ఞాసగలవారు గమనించాలి. నేను చేసిన

పాపాలు తొలగించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము. కాని నాకు పాపబుద్ధి, పాపస్వభావం లేకుండా చేయమని దేవుణ్ణి ప్రార్థించడం లేదు. నేను పాపాలు చేస్తూ వుంటాను, వాటిని పరిహరించే బాధ్యత నీది, అని ప్రార్థించడం కంటే నా చిత్తంలో పాపభావన ప్రవేశించకుండా, నేను పాపకర్మలు చేయకుండా ఉండేటట్లు అనుగ్రహించుమని దేవుణ్ణి ప్రార్థించడం ఎంత సమంజసంగా ఉంటుందో ఆలోచించండి !

ఇక ఈ విషయంలో వేదముయొక్క అనుశాసన మెట్టిదో చూద్దాం–

‘ యాన్యనవద్యాని కర్మాణి, తాని సేవితవ్యాని, నో ఇతరాణి ’

“ ఏవి పవిత్రమైన కర్మలో అవే చేయదగినవి. తదితరమైన కర్మలు (పాపకర్మలు) చేయదగదు ” అని.

ఈ మాటలో ఎంత ఔచిత్యమున్నదో పరిశీలించండి. యోగవాసిష్ఠంలో వసిష్ఠమహర్షి “ అత్రాహారార్థం కర్మ కుర్యాదనింద్యం” అని ప్రబోధించాడు. ఆహారం కొరకు నింద్యం కాని, కర్మ చేయాలి అని భావం. పాపకర్మలు నిందింపదగినవి. అవి సర్వాత్మనా పరిహరింపదగినవని తత్త్వజ్ఞులు ఉపదేశిస్తున్నారు. అలా ఉండగా “ నేను పాపాలు చేసేవాణ్ణి, నా పాపాలు పోగొట్టు ” అని మన పాపపరిహారంకొరకు దేవుణ్ణి బాధ్యత వహించమనడం ఎంతవరకు సముచితమో గమనించాలి.

‘ నాభుక్తం క్షీయతే కర్మ జన్మకోటి శతైరపి ’“ కోటి జన్మలు గడచినా చేసిన కర్మ అనుభవించక తీరదు ” అన్న పురాణవచనం కూడా మనకు తెలిసినదే. ఈ మాట చెప్పిన పురాణకర్తకు ఒక్కస్నానంతో, ఒక్క ప్రదక్షిణంతో పాపాలన్నీ తొలగిపోతాయి అన్న మాట గుర్తుకు రాలేదా ?

దుష్కర్మలు దుష్ఫలితాలిస్తాయి. అందువల్ల సత్కర్మలు చేయండి, దుష్కర్మల జోలికి పోకండి అని కర్మ సిద్ధాంత సారాంశం. ఈ సిద్ధాంతాన్ని

ప్రక్కకు నెట్టి కేవలం మూఢ విశ్వాసాలకు గురికావడం యుక్తమా ?

' రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్ ' రామాదులవలె ప్రవర్తించండి, రావణాదులు వలె ప్రవర్తించకండి ! అని రామాయణాది పురాణాల నుండి మనం కర్తవ్య ధర్మాన్ని గ్రహించాలి. రావణుడు ఎంత గొప్పవాడైనా అతడు చేసిన తప్పులకు శిక్షననుభవించక తప్పలేదు. చివరికి వానికి మరణమే శరణమయింది.

తెలిసి చేసే పాపాలు, తెలియిక చేసే పాపాలు అని రెండు రకాల పాపాలుంటాయి. తెలియకుండా చేసే వాటికన్నా తెలిసి చేసే పాపకర్మల ఫలితం ఘోరంగా ఉంటుంది. దుర్యోధనుడు ' జానామిధర్మం నచమే ప్రవృత్తిః ' ' నాకు ధర్మం తెలుసు కాని అందులో ప్రవృత్తి కల్గడం లేదు ' అంటూ తెలిసి తెలిసి అధర్మ కార్యాలు చేసి వాటి ఫలితం అనుభవించాడని మహాభారతం బోధిస్తున్నది.

పైగా ఎన్ని పాపాలు చేసినా, ఒక్క స్నానంతోనో, ఒక్క ప్రదక్షిణంతోనో అవన్నీ తొలగిపోతాయని చెప్పడం వల్ల పరోక్షంగా పాపకార్యాలకు ప్రోత్సహించినట్లు కావడం లేదా ! బహుశః ఇట్టి ప్రోత్సాహమే ఈ కాలంలో బహుళ ప్రజానీకాన్ని ధర్మం నుండి దూరం చేస్తున్నదని చెప్పవచ్చు. లేకపోతే ఈ దేశంలో అడుగడుగునా ఇంత అవినీతి ఎందుకు తాండవిస్తుంది ?

ఈ సందర్భంలో భగవద్గీతలో రెండు శ్లోకాలను గమనించాలి.

అపిచేత్సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ సమన్తవ్యస్సమ్యగ్వ్య వసితో హి సః ॥ (9-30)

' మిక్కిలి దురాచార పరుడైనా అనన్యగతికుడై నన్ను సేవించేవాడు సాధువే. వాడు సమీచీనమైన నిశ్చయం కలవాడు గదా 'అని భావం.

' ఇక్కడ దురాచారాలు కొనసాగిస్తూనే ఉన్నా భగవద్భజనం చేసిన వ్యక్తి సాధువే ' అని చెప్పడం తగదు. ఈ సందర్భంలో ఈ శ్లోకానికి వివరణ వ్రాసిన శ్రీ మలయాళస్వాములవారు తమ గీతార్థ ప్రకాశికా వ్యాఖ్యలో " మిగుల నిందితములగు దురాచారములు గలవాడైనను, పాప సంకల్పములు మాని ఆత్మస్వరూపుడనగు నన్ను సేవించినయెడల " అని వివరించారు. దుష్టకృత్యములు మాని శిష్టాచారులైనవారే భగవదనుగ్రహం పొందగలరు. ' నేను పాపకర్మలు చేస్తూనే వుంటాను' నన్ను కాపాడు, అని చేసే ప్రార్థనను భగవంతుడెన్నటికీ అంగీకరించడు.

క్షిప్రంభవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి (9-31), అన్న తరువాతి శ్లోకం అట్టి భక్తుడు త్వరలో ధర్మాత్ముడవుతాడని ఘోషిస్తున్నది. ధర్మాత్ముడు దురాచారం కొనసాగిస్తాడా ?

వాల్మీకి పూర్వం పాపకార్యాలు చేసి వుండవచ్చు. కాని రామభక్తుడై రామనామోచ్చారణ చేసిన తరువాత దుష్కృత్యం చేయలేదు. గదా ! అంచేత ఒకవైపు భగవద్భక్తి, మరొకవైపు పాపకర్మలు అనేవి సహజీవనం కొనసాగించలేవు అని దృఢంగా విశ్వసించాలి. కొందరు " జ్ఞానానికి పాపము లేదు. వారేమి చేసినా వారికి దోషమంటదు " అని అంటారు. ఇలా చెప్పే వారినే శుష్కవేదాంతులంటారు.

' జ్ఞానికి పాపమంటదు ' అన్న మాట నిజమే కాని ' పాపికి జ్ఞానం కల్గదు ' అని కూడా తెలుసుకోవాలి అని శ్రీ మలయాళస్వామీజీ చెప్పారు. పాపకార్యాలు చేసినంత కాలం మనిషి జ్ఞాని కాలేడు, జ్ఞానం కలగాలంటే పాపం చేయరాదు. ఆ తరువాత జ్ఞాని వద్ద పాపం ఎలా సంభవిస్తుంది ?

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ గూడా ఇట్టి భావాన్నే వ్యక్తపరచి యున్నారు. శిష్యుడు గురువును ఆశ్రయిస్తాడు. అంతకు ముందు ఎన్నో దుష్కర్మలు అతడు చేసి యుండవచ్చు. కాని గురువు సన్నిధికి చేరి శరణన్న తరువాత, పాపకార్యాలు చేయరాదు.

ఎన్ని పాపములొనరించి యున్న గాని
సద్గురుని జేరి శరణన్న సమయమందె
భూరి దురితము నశియించి పోవు, గురుని
శిష్యుడై పాప మావలఁ జేయరాదు

(శ్రీ వెంకటాచల మహాత్మ్యం 3-71)

గురువుచెంత పాటించదగిన ఈ ధర్మం భగవంతుని చెంత గూడా అనుసరణీయమే. భగవంతుణ్ణి ఆశ్రయించినపిదప మనసా, వాచా, కర్మణా - పాపసంబంధం ఏ మాత్రం తగదు. " తెలియక చేసిన పాపాలను గురుడు పరిహరిస్తాడు. తెలిసి చేసిన పాపాలను గురువు నిగ్రహింపలేడు. ఆ పాపాలు గురువుకే చెందుతాయి " అని గూడా శ్రీ వెంగమాంబ చెప్పింది. (చూడు 3- 72) బుద్ధిమంతులైనవారు పాపభీతులుగా ఉండాలని గూడా ఆ తల్లి నిర్దేశించింది.

ఒక వ్యక్తి గాని, ఒక జాతి గాని ఆత్మోన్నతి పొందే విధంగా ప్రబోధకులు ప్రవచనాలు చేయాలి గాని, వారిని దిగజార్చేవిధంగా ప్రవచించరాదు. గుళ్ళూ, గోపురాలూ, యాత్రలు మనిషిని 'అసతో మా సద్గమయ ' అన్నట్లు కుమార్గం నుండి సుమార్గంలోకి నడిపించడానికి ఏర్పడ్డాయని విస్మరించరాదు. అందువల్ల ఎన్ని పాపాలు చేసినా ఒక్క దర్శనంతో, ఒక స్నానంతోనో వాటికి పరిహారం లభిస్తుందని చెప్పడం ఒక విధంగా పాపాలను ప్రోత్సహించడమే అవుతుంది. దేవుణ్ణి దర్శించడంతోపాటు పాపచింతకు దూరంగా ఉండండి అని బోధించడం అవసరం. పాపపరిహార మార్గం నిజంగా అదే.

మంచి ఎంత చేయగలవో అంత చేయుము. మంచి ఎన్ని విధముల చేయగలవో అన్ని విధముల చేయుము. ఎంతమందికి చేయగలవో అంత మందికి చేయుము.

ఆచార్య దేవో భవ

-ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

కులగురువులు :

కులగురువులలో బృహస్పతి, శుక్రాచార్యులు, వశిష్ఠాదులు ప్రముఖులు. దేవతల గురువు బృహస్పతి కాగా, రాక్షసకుల గురువు శుక్రాచార్యులు. సూర్య వంశజుల గురువు వశిష్ఠుడు. ఈ గురువులందరు ఆయా కులాల రక్షణకు, ఆయా కులాలవారి సంక్షేమాలకు నలహాలిచ్చేవారు కావడం విశేషం. ప్రత్యేకించి వీరందరు తపస్సంపన్నులు. ధార్మిక వర్తనులు. విధ్యుక్త ధర్మాలపట్ల వెనుకడుగు వేయనివారు కావడం విశేషం.

బృహస్పతి అంగిరసుని పుత్రుడు. ఒకసారి బృహస్పతి ఇంద్రునితో కలిసి కైలాసానికి వెళ్ళాడు. స్వస్వరూపంతో గాక ముని వేషంతో వెళ్ళారు. శివుడు వీరిని పరీక్షించాలనుకొన్నాడు. ఉగ్రరూపంతో దిగంబరుడయ్యాడు. ఆ దిగంబరుని చూచి దేవేంద్రుడు ' ఎవరో అనుకొని' వజ్రాయుధం ప్రయోగించాడు. కోపగించిన శివుడు తీక్ష్ణంగా చూడడంతో ఇంద్రుడు బూడిదయ్యాడు. అపుడు బృహస్పతి శివుని ప్రార్థించి ఇంద్రుని బ్రతికించుకొన్నాడు. ఈ కారణం వల్ల బృహస్పతికి జీవుడనే పేరు. ఎపుడూ దేవతల సంక్షేమం కోరేవాడు బృహస్పతి.

బృహస్పతి కుమారుడు 'కచుడు'. అతడు బ్రహ్మచారి. విద్యాగ్రహణంలో చతురుడు. సమస్తవిద్యలు నేర్చినవాడు. సమహితచిత్తుడు. బృహస్పతి సర్వవిద్యాపారంగతుడయినా ' సంజీవని విద్య ' తెలియనివాడు. ఈ విద్య తెలిసినవాడు రాక్షసకులగురువు శుక్రాచార్యులు మాత్రమే. అతడు రాక్షసకులం నశిస్తే వారిని తనకున్న విద్యాబలంతో బతికించేవాడు. అందువల్ల రాక్షసపక్షంలో వినాశనం లేదు కదా బతకగలమనే భరోసా. కాని దేవతలకేమో వినాశనమయితే

అంతే సంగతులు. ఈ విషయంలో బృహస్పతి అశక్తుడు. అయినా అతడు తెలివయినవాడు. తన కుమారుని రాక్షసకుల గురువు శుక్రాచార్యుల దగ్గరికి విద్యార్థిగా పంపించాడు. సాహచర్యం వల్ల, సాన్నిహిత్యం వల్ల, గురువులకు సహజంగా శిష్యులపై ఏర్పడే అభిమానం వల్ల 'సంజీవని' బోధిస్తాడేమో అని మినుకు మినుకు లాంటి ఆశ. తండ్రి ఆనతి మేరకు 'కచుడు '. శుక్రాచార్యుల దగ్గరికి వెళ్ళాడు. రాక్షసగురువు కచుని శిష్యునిగా చేర్చుకొన్నాడు. ఈ చేరిక రాక్షసులకు సుతరామూ ఇష్టం లేదు. కాని గురువును ఏమీ అనలేకపోయారు.

శుక్రాచార్యుల కుమార్తె దేవయాని. ఆమె అందగత్తె. కచుని చూచి మరులు గొన్నది. కాని కచుడు ఆమెను గురుపుత్రిగానే భావించాడు. రోజులు దొరలుతున్నాయి. కచుడు అడవులలో గురువుల గోవులను మేతకు అనుదినం తోలుకొని పోతున్నాడు. రాక్షసులు ఆలోచించారు. కచుని మట్టుపెట్టాలనుకొన్నారు. చంపేశారు. బూడిదపాలు చేశారు. అడవికి మేతకు వెళ్ళిన ఆవులన్నీ చేరాయి. కచుడు రాలేదు. దేవయాని కలవరపడింది. తన తండ్రితో " మీ శిష్యుడు రాలేదని " చెప్పింది. రాక్షస గురువు దివ్యదృష్టితో 'సర్వం అవగతం 'చేసుకొన్నాడు. తన కూతురితో బూడిద పాలయిన కచుని గురించి చెప్పాడు. కాని ఆమె శాంతించలేదు. 'శిష్యరికం చేయడానికి వచ్చినవాడు కనబడకపోతే కలవరం లేదా ' అన్నది. ' అతని బాగోగులు గురువు పట్టించుకోవాలి కదా ' అని ప్రశ్నించింది. శుక్రుడు కుమార్తె కోసం కచుని బతికించాడు. కాని రాక్షసుల పగ చల్లారలేదు. రెండవసారి కచుని చంపి బూడిదచేసి ఆ బూడిదను సురలో కలిపి గురువుకే సమర్పించారు. ఎప్పటిలాగ శుక్రాచార్యులు సేవించారు. సాయంకాలమయినా కచుడు రాకపోవడంతో దేవయాని మరల తండ్రిని ఆశ్రయించింది. సుత పట్ల వ్యామోహం గల తండ్రి దివ్యదృష్టితో తన పొట్టలో బూడిదగా ఉండడం గుర్తించి కుమార్తెను ' ఊరుకోమన్నాడు'. కాని దేవయాని మారాం పడితే సంజీవనితో బ్రతికించి పొట్ట చీల్చుకొని రమ్మని ఆపై తన్ను బతికించమని చెప్పాడు. ఈవిధంగా

కచుడు ' సంజీవిని' నేర్చుకొని చక్కా దేవతల దగ్గరికి వెళ్ళిపోయాడు. అసురుల వధకం బెడిసి కొట్టడవే 'సంజీవని' విద్యకు సహకరించడమయింది. శుక్రాచార్యులు నిమిత్తమాత్రుడు.

బలి చక్రవర్తిని కాపాడడంలోనూ రాక్షసగురువు శ్రద్ధ వహించాడు. యాగశాలకు వచ్చినవాడు వటువు కాదు. మాయావి అయిన వెన్నుడన్నాడు. రాక్షసకులవైరికి రాచమర్యాదలేమిటన్నాడు. మూడడుగుల దానంలో మోసముందని అన్నాడు. ఆపత్కాలంలో అబద్ధమాడడం తప్పుకాదని శుక్రనీతి చెప్పాడు. చివరకు బలి దానంచేయడానికి సంసిద్ధుడయితే కమండలోదక ప్రవాహానికి అడ్డుపడ్డాడు. ఒక కులగురువుగా శుక్రుడు తన ధర్మం నెరవేర్చాడనడంలో సందేహం లేదు.

కులగురువులలో వశిష్ఠుడు సూర్యవంశజుల సంక్షేమం ఆకాంక్షించిన అనుపమశీలి. సూర్యవంశంలో భగవంతుడు అవతరించబోతున్నాడని తెలిసి అంతకుముందే సూర్యకులజులకు సన్నిహితుడయినవాడు. కాళిదాసు రఘువంశంలో దిలీపచక్రవర్తి కథాసన్నివేశంలో వశిష్ఠుల తపశ్శక్తిని,తన్ను ఆశ్రయించిన వారికి తరణోపాయం చెప్పే వ్యక్తిగా చిత్రీకరించాడు. కామధేనువును అర్చించని కారణం వల్ల సంతానం కలగలేదని చెబుతూ 'నందినిని' సేవించమని ఆదేశించిన ఔపదేశికుడు వశిష్ఠుడు. దిలీపుడు సుదక్షిణాసహితుడయి నందినిని సేవించి పుత్రవంతుడయ్యాడు. రఘుమహారాజు జన్మకు వశిష్ఠానుగ్రహం కారణమయింది.

ఆలాగే దశరథునికి **వశిష్ఠుడు** ఎన్నో ఉపదేశాలిచ్చినవాడు. విశ్వామిత్రుని వెంట రాములవారిని పంపడానికి వెనకాడుతుంటే కులగురువుగా రాగల సౌభాగ్యాలను రాజుకు వివరించాడు. అందుకే సీతారాముల కల్యాణ శుభసందర్భంలో దశరథుడు జనకునితో

విదితం తే మహారాజ ! ఇక్ష్వాకు కులదైవతమ్ ।
వక్తా సర్వేషు కృత్యేషు వసిష్ఠో భగవాన్ ఋషిః ॥ అన్నాడు

జ్ఞాన సుధ

మూలం శ్రీ సర్పభూషణ శివయోగి వారు

అనువాదం : పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు

ఉమామహేశ్వర పీఠాధిపతులు

అవ : ఇంతవఱకు (కడచిన రెండవ అధ్యాయమున) ఆత్మాభిన్నమగు (ఆత్మకు అభిన్నమగు) బ్రహ్మమందు జగత్తు అధ్యస్తమై యున్నదని చెప్పి ఇప్పుడు ఈ మూడవ అధ్యాయమున జీవేశ్వర భేదము, జీవజీవుల భేదము కేవలము ఉపాధి మూలమున కల్పితమై అగపడుచున్నదే కాని వాస్తవముగ లేదని తెల్పుచు జీవేశ్వరుల అభేదమును ప్రతిపాదించుచున్నారు –

వపుషామయుతోపాధేః బహుజీవా ఇవ చకాస్తి శివ ఏకః,
భిత్త్యాదికృతోపాధేః గృహవాట్యాద్యాహ్వయాక్ష్మేవ. 21

భిత్తి ఆది ఉపాధేః = గోడ మొదలైన వానిచే కల్పితమైన ఉపాధిని బట్టి, గృహ వాటీ ఆది ఆహ్వాయా = గృహము, కుటీరము అను మొదలగుపేర్లు గలదియైన, క్ష్మా ఇవ = భూమి వలెనే , వపుషాం = శరీరములకు సంబంధించిన, అయుత = వేఱు వేఱగు, ఉపాధేః = ఉపాధిని (విశేషణమును) బట్టి, ఏకః = ఒక్కడైన, శివః = పరమాత్మ, బహు జీవాః ఇవ = అనేక జీవులవలె, చకాస్తి = ప్రకాసించుచున్నాడు.

“ ఏకమేవాద్వితీయ ” మ్మనబడిన బ్రహ్మమునందు ఈ భేదము ఎట్లు సంభవించెను ? అనిన సమాధానము. ఈ భేదము ఉపాధిమూలమున అగపడునే కాని స్వరూపతః లేదు. ఒకటైన భూమి గోడ మొదలైన వానిచే ఏర్పడిన ఉపాధిని బట్టి కుటీరము. భవనము, పొలము, దారి, ఉద్యానవనము, ప్రాంగణము అను మొదలైన పేర్లు

గలదియై నానావిధముగా కనబడునట్లు ఒకే ఆకాశమునందు ఘటమఠాద్యుపాధిని బట్టి ఘటాకాశము మఠాకాశము ఇత్యాది నామములు బొంది పెక్కురూపములు గలదిగా తోచినట్లు బ్రహ్మ మొక్కటే మాయాతత్కార్యములైన ఉపాధులనుబట్టి దేవమనుష్యపశుపక్ష్యాది శరీరములు గలదియై నానాజీవులుగా తోచుచున్నది. మాయోపాధి ఒకటైనందున పరమాత్మ ఈశ్వరరూపేణ ఏకమై యున్నాడు. అన్యోపాధియగు అవిద్య నానాత్వముగలదియై యుండినందువలన జీవులనేకులై ఉన్నట్లు కనబడుచుండెనని అభిప్రాయము.

అవ : ఒక్క పరిపూర్ణ ప్రత్యగాత్మయే అవస్థా భేదము వలన విశ్వాది జీవరూపములచే ప్రతీతమగుచున్నదని దృష్టాంతపూర్వకముగా తెలుపుచున్నారు.

జాగ్రా ద్యుపాధే ర్విశ్వాది త్రైవిధ్యం చాత్మనో విభోః,
అంగణాగారకోణానాం వ్యాపారా న్నభసో యథా 22

నభసః =(ఒకే) ఆకాశమునకు, అంగణాగారకోణానాం=22 ప్రాంగణమనియు, ఇల్లనియు, గది యనియు నిట్టి వీని, వ్యాపారాత్ = క్రియను బట్టి, నిర్మాణమునుబట్టి, త్రైవిధ్యం = మూడు విధములుగా ఉండునట్టి స్థితి, యథా = ఎట్లు (కల్పింపబడినదో), (తథా = అటువలె), విభోః = పూర్ణుడైన, ఆత్మనః = ప్రత్యగాత్మకు, జాగ్రాది ఉపాధేః = జాగ్రత్ స్వప్న సుషుప్తులనెడి మూడు అవస్థలను బట్టి, విశ్వాది = విశ్వ తైజస ప్రాజ్ఞులని, త్రైవిధ్యం = త్రివిధముగా ఉండు స్థితి (కల్పింపబడెను).

ఒకే ఆకాశమునకు గృహావయవ నిర్మాణ భేదమును బట్టి ఆయా పేర్లు వచ్చినట్లు, ఒక్కనికే క్రియాభేదము చేత పాఠకుడని, యాచకుడని, పాచకుడని నామములు కలిగినట్లు, ఏకమైన వ్యాపకమైన ప్రత్యగాత్మకు జాగ్రదాది అవస్థాభేదమువలన విశ్వాది నామములు కలిగినవని భావము.



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ ఆత్మవత్సర్వ భూతేషు కాయేన మనసా గిరా।
అనుకంపా దయా సైషా ప్రోక్తా వేదాన్త వేదిభిః॥
(సూతసంహితా - జ్ఞాన యోగఖండము. 13-11 1/2, 12 1/2)

అర్థము : ఏ విధముగా తనను రక్షించు కొనుటకు ఎల్లప్పుడు యత్న శీలుడైయుండునో, అట్లే శరీరము, మనస్సు మరియు వాణి ద్వారా సకల ప్రాణులను రక్షించుటకు తత్పరత యేది గలదో, దానిని‘ దయ’ యందురు. అన్యత్రాగమ శాస్త్రములో గూడ

శ్లో ॥ రోగార్తస్య రిపోర్వా2పి మిత్రస్యాన్యస్య వా పునః।
తద్రక్షాభిముఖీ బుద్ధి ర్దయైషా భాషితా బుధైః॥

అర్థము : రోగముచే సంతప్తుడు, శుత్రువు, మిత్రుడు మరెవరైనా యుండుగాక - వారిని విపత్తులనుండి రక్షించుట కభిముఖమైన యే బుద్ధి గలదో దానిని “ దయ ” యందురు.

శ్లో ॥ సుహృన్మిత్రార్యు దాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే ॥ (గీత - 6-9)

అర్థము : పూర్వస్నేహము కాని, యే సంబంధముగాని లేకయే ప్రత్యుపకారమునపేక్షింపకుండా నుపకారము చేయు -సుహృత్ యందు, స్నేహముచే నుపకారము చేయు మిత్రునియందు, తాను చేసిన యపకారమును లెక్క చేయక స్వాభావిక క్రౌర్యము. (క్రూర స్వభావము)చే నపకారము చేయు శత్రువుయందు, పరస్పరము వాదించుకొను నిరువురినిగూడ నుపేక్షించు ఉదాసీనునియందు, పరస్పరము వాదించుకొనునిరువురి యొక్క హితమును గోరు మధ్యస్థుని యందును, తనకు జేసిన యపకారమునకు తిరిగి యపకారము జేయు

ద్వేషియందును, సంబంధ వశముచే నుపకారము జేయు బంధువులయందును శాస్త్రవిహిత కర్మలు జేయు సాధువుల యందును, శాస్త్ర నిషిద్ధ కర్మలు జేయు పాపులయందును మరియు సమస్త ప్రాణుల యందును సమాన బుద్ధిగల యోగి యెవరు గలరో, నాతడందఱిలో శ్రేష్టుడనంబడును.

శ్లో ॥ నహి ప్రాణైః ప్రియతమం లోకే కించన విద్యతే।
తస్మాత్ప్రాణి దయా కార్యా యథా2త్మని తథా పరే॥
(మ. భార.అ ను ప. 145 అధ్యా. పృ. 5990)

అర్థము : ప్రపంచములో ప్రాణములకు సమమైన ప్రియతమ వస్తువు మరొకటి లేదు. అందువలన సమస్త ప్రాణికోటులందు దయగలిగి యుండవలెను. తనపై యేవిధముగా దయ యభీష్టమున్నదో, అట్లే యితరులపై గూడ యుండవలెను.

శ్రీ ధర్మరాజు ఇలా అంటున్నారు ఎవరు ఆపదలో చిక్కుకున్న ప్రాణుల దుఃఖమును నాశనము చేయకుండా, కేవలము తన సుఖమును మాత్రమే యిచ్ఛగించుటయేది గలదో దానికంటే మరణించుట లేదా నరకములో పడుట యుచితము. ఎవరి మనస్సు సంకటములో నున్న ప్రాణులను రక్షించుట యందు సంలగ్నముగాదో వారి యజ్ఞము, దానము మరియు తపము యిహలోకము మరియు పరలోకము నందు గూడ కళ్యాణమునకు సాధనములు గానేరవు.

నరకము గుండా గొనిపోబడుచున్న ధర్మరాజు దేవదూతతో యిట్లనెను. ఈ నరకములో వేలాది ప్రాణులు కష్టమునను భవించుచున్నారు. నన్ను చూసి ఆర్తభావముతో రక్షించు ! రక్షించు యని దీనస్వరముతో నఱచుచున్నారు. ఇటువంటి దుఃఖములో నున్న వారిని వదలి నేను స్వర్గమునకు రాలేను.

శ్లో ॥ తస్మాద్యత్సుకృతం కించిన్మమాస్తి త్రిదశాధిప।
తేన ముచ్యంతు నరకాత్ పాపినో యాతనాం గతాః॥

(మార్కండేయ పురాణము 15-76)

అర్థము : ఓ దేవతాధిప ! ఒకవేళ మీరు నా యందధిక పుణ్యమున్నదని దలంచినచో నది యీ నరక యాతనలననుభవించుచున్న పాపులు - వారి దుఃఖములనుండి విముక్తులగుటకుపకరించు గాక !

అప్పుడు దేవరాజైన ఇంద్రుడు ధర్మరాజుతో యిట్లనెను. ఓ రాజా ! నీ యొక్క ఈపుణ్యదానరూప ఉదార కర్మచే నీ పుణ్యము యింకను ద్విగుణీకృతమాయెను. నీవు యింకా ఉచ్ఛస్థానము నలంకరించితివి. చూడుము ఈ పాపిజీవులు నరకము నుండి ముక్తులు గావింపబడిరి.

కావున దుఃఖితుని యందు దయగలిగి యుండవలయును. “ దయ” యొక్క ప్రాశస్త్యమును పురాణము ఈక్రింది విధముగా వర్ణించు

ఎవరి కెఱుక ?

ర్మో న దయా సదృశం తపః ।

ానం న దయా సదృశః సఖా ॥

శ్లో ॥ దుఃఖితానాం హి భూతానాం దుఃఖోద్ధర్తా హి యో నరః ।

– ఆచార్య కె. సర్వోత్తమరావు (తిరుపతి)

స ఏవ సుకృతి ర్లోకే జ్ఞేయో నారాయణాంశజః ॥

శ్లో ॥ న స్వర్గే నాపవర్గే 2 పి తత్సుఖం లభతే నరః ।
యదార్తజంతు నిర్వాణదానోత్థమితి నో మతిః ।

(పద్మ పురాణము - పాతాళఖండము. 98-15, 17,23).

అర్థము : దయతో సమానమైన ధర్మము లేదు. దయతో సమానమగు తపస్సు లేదు. దయతో తులతూగు దానము లేదు. దయతో సరియగు యే మిత్రుడునులేడు. ఏ మనుష్యుడు దుఃఖితుడైన జీవులనుద్ధరించునో నతడే ఈ సంసారములో పుణ్యాత్ముడు. అతనిని నారాయణుని అంశము నుండి ఉత్పన్నమైన వానినిగా నెఱుంగవలయును. ఏ మనుష్యుడు ఆర్త (దుఃఖసంతప్త) ప్రాణులయొక్క దుఃఖమును దూరము జేయునో నతడు యే సుఖమునకు స్వర్గము మరియు మోక్షసంబంధసుఖము గూడ సమానముగాదో, నటువంటి సుఖమును, బొందగలడు అని

మా నిశ్చితాభిప్రాయము. ఉత్తమ పురుషులలో దయ స్వాభావికముగా నుండుననుటలో శాస్త్ర వచనము.

శ్లో ॥ న త్వహం కామయే రాజ్యం న స్వర్గం నాపునర్భవమ్ ।
కామయే దుఃఖతప్తానాం ప్రాణినా మార్తి నాశనమ్ ॥

అర్థము : నేను రాజ్యమును గోరను, స్వర్గమును వాంఛింపను మరియు మోక్షము గూడ నాకు వలదు. నానాప్రకార దుఃఖములచే సంతప్తులగు చున్న ప్రాణుల యొక్క ఆర్తి (పీడ) నాశనము గావాలని మాత్రము నేను గోరుచున్నాను.

కావున సకల ప్రాణుల పట్ల దయ (రక్షాభిముఖీ బుద్ధి) గలిగి యుండుట మానవ మాత్రులయొక్క ముఖ్య ధర్మముగానున్నదని శ్రీ తుకారాం మహారాజు గారు వ్యతిరేక ముఖముగా అభంగము ద్వారా తెలియజేసి యున్నారు. ఇంతేగాక సత్పురుషుల సేవ మరియు తీర్థ యాత్రలు గూడ మనుష్యులకు పురుషార్థసాధనములని తెలిపి యున్నారు.

శ్లో ॥ యస్య హస్తౌ చ పాదౌచ మనశ్చైవ సుసంయతమ్ ।
విద్యా తపశ్చ కీర్తిశ్చ స తీర్థఫలమశ్నుతే ॥

(పద్మ పురాణము - పాతాల ఖండము - 19-24)

అర్థము : ఎవరియొక్క చేతులు, పాదములు మరియు మనస్సు సుసంయతమైయుండునో అనగా ! యెవరి చేతులు భగవదారాధన యందు, సత్పురుషులసేవ మరియు తల్లిదండ్రుల సేవ యందు సంలగ్నమై యుండునో, యెవరి పాదములు తీర్థాది భగవత్స్థానములందు తిరుగాడునో మరియు నెవరి మనస్సు భగవంతుని చింతనయందు తత్పరమై యుండునో, యెవరికి ఆధ్యాత్మ విద్య ప్రాప్తమున్నదో, యెవరు ధర్మపాలన కొఱకు కష్టమును సహించెదరో వారు తీర్థయాత్ర ఫలమును పొందుతున్నారు.

ప్రపంచమే నీ ఇల్లు - ఇతరులకు మేలు చేయడమే - నీ మతము.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు

91. రత్నముతో తయారు చేసిన బేడీలు అయినా బంధనమునే కలుగజేస్తాయి. ముత్యాల సరముతో నిర్మించిన వలలైనా బంధానికి కారణములవుతాయి. బంగారుతో చేసిన కత్తితో కొట్టినా చావు నిశ్చయము. అలాగే లౌకిక జనులు భజించే భజన భక్తియైన దానితో జనన మరణములు తప్పవు. ఆడంబర భక్తిలో భవబంధనము తప్పదు.

92. శివశరణులు తమ ఇంటికి రావాలని ఎప్పుడూ కోరుకుంటాను. శివశరణులు వస్తారంటే పచ్చతోరణములతో అలంకరించి, ఇంటిని పరిశుభ్రముగా చేసి, నిత్యోత్సవము చేస్తాను. శివశరణుల శ్రీ పాదములు నాతలపైన పెట్టుకుంటాను.

మహేశ్వర స్థలం : భక్త స్థలములో శ్రద్ధాభక్తితో శివున్ని పూజించాలి. ఈ మహేశ్వర స్థలములో నిష్ఠాభక్తితో అష్టావరణ వ్రతాన్ని పాటించాలి. గురులింగ జంగము ఏకత్వభావనకలిగి వుండాలి. ఇవన్నీ సకార ఆత్మకమైనవైతే, పర ద్రవ్య అపేక్ష, పరనింద, పరస్త్రీ ఆకాంక్ష, హింస, వీటినన్నిటిని, చేయకుండా నిష్ఠతో వుండాలి. ఈ నియమాలు మహేశ్వర స్థలములో వున్నాయి. శివశరణుల సత్సంగ మహాసద్గుణాలను పెంచుకుంటూ, శుభ సందేశాలను వింటూ, వారిని ఆదర్శంగా తీసుకుంటూ ఆచరించి మాట ప్రకారం నడుచుకోవాలి. చెన్నమల్లికార్జున దేవా ! ఆయస్సు వున్నంత వరకు సజ్జన సాంగత్యములో మరియు పై నియమ నిష్ఠలతో గడుపునట్లు అనుగ్రహించమని ప్రార్థించాలి.

96. శివ భక్తులను నొప్పించిన శివునికి బాధ కలుగుతుంది. శివ

భక్తులను సంతోషింపజేసిన శివునికి సంతోషము కలుగుతుంది. శివుడు భక్తుల హృదయములో నివసించి వుండునని స్మృతులు ఘోషించుచున్నవి. తల్లికి నొప్పి కలిగితే కడుపులో వున్న శిశువుకు కూడా బాధ కలుగుతుంది. ఏ ప్రాణిని నొప్పించినా శివునికి బాధకలుగుతుంది.

98. జీవనము సద్గుణాలనే సుగంధమయంగా మారినపుడు పుష్పములు కావాలనే అవసరముండదు. ఆధ్యాత్మిక జీవనంలో కూడా క్షమ, దమము, శాంతి, సహనము మొదలైన గుణములు అలవరచుకొన్నపుడు, సమాధి యొక్క స్థితి అవసరముండదు. ఎందుకనగా ఈ గుణములను పొందడానికే కఠిన సాధ్యమైన సమాధిస్థితి కొరకు ప్రయత్నిస్తున్నారు. లోక కళ్యాణమే తన గమ్యమైన తరువాత ఏకాంతముయొక్క ఆవశ్యకత వుండదు.

99. శివనిష్ఠాపరులైన మహేశ్వర స్థలములో వున్నవారు చేసే ప్రతిక్రియ కూడా శివార్పణంగా వుంటుంది. వారు వస్త్రములు, ఆభరణాలు ధరించినా శివుని కోసమని, కాయకం (కర్తవ్యం) చేసినా శివుని కోసమే. అంతరంగ, బహిరంగములలో చూసినా శివుణ్ణే దర్శించెదరు. ఏ సత్ క్రియలను చేసినా అభిమాన, అహంకారములు లేకుండా నేను ఏది చేసినా చెన్నమల్లికార్జునుని కొరకే. పదిమంది చేసినట్లు చేయకుండా విశేష నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో భగవంతుని పూజా, ధ్యాన తపాదులను చేస్తాను.

100. పాములను ఆడించేవాడు పాముయొక్క విషకోరలను తీసివేసి పాముతో ఆటలాడుతూ ధనాన్ని సంపాదించి బ్రతుకుతాడు. అలాగే జీవాత్మునికి ఈ శరీరమే ఆధారము. ఈ శరీరము యొక్క వికారములు నశించినపుడు శివజీవైక్య ఫలము లభించును. తల్లి రాక్షసియై తన పిల్లలను పీడించి తినేటట్లు ఈ దేహము ఇంద్రియ వికారములలో చిక్కి బాధపడును. చెన్నమల్లికార్జున దేవా ! నీ అనుగ్రహము పొందినవారు నీవై యుందురు. వారు మరణాన్ని జయించిన మహాత్ములు. భౌతికమైన కాయం నశించినా వారు కీర్తి శరీరరూపంగా ఎప్పుడూ అమరులై వుందురు.



ఇలా వుంటే ఎంత బాగుండును

– కె. ఈశ్వర్

పోలీసులతో న్యాయవాదులతో కోర్టులతో పనిలేని వ్యవస్థ ఒకటి అమలులోకి వస్తే ఇక న్యాయవాదులు పోలీసులు, అందరూ వారి జీవనోపాధికి ఇతర ఉద్యోగాలలో ప్రవేశించవలసిందే. ఎక్కడో నరకం వుంది. ఇక్కడ పాపం చేస్తే అక్కడ శిక్ష అనుభవించవలసి వచ్చునంటే ఎవరు అంత భయపడుట లేదు. అప్పటి సంగతి ఎవరు చూచారులే అని పాపాలు చేయుట మానుట లేదు.(Instant Coffee, Instant Food) ఇన్‌స్టెంటు కాఫీ, ఇన్‌స్టెంటు ఫుడ్ వలె (Instant punishment) ఇన్‌స్టెంటు శిక్ష తక్షణం, మరుక్షణం, పాపానికి ప్రతిఫలం అమలులో వస్తే ఎవడు పాపకార్యాలకు సాహసించడు. అప్పుడు పోలీసులతో పని ఉండదు.

ఉదాహరణ : ఒక వ్యక్తి దొంగతనానికి బయలుదేరినాడు. వాడికి కండ్లు కనుపించకుండ వెనువెంటనే ఆటోమ్యాటిక్ (Automatic) శిక్ష అమలు అయినచో ఎవరైనా దొంగతనానికి సాహసిస్తారా ! ప్రపంచములో దొంగతనాలు. దోపిడీలు చేయమని ప్రోత్సహించినా చేయరు గదా ! జీవితమంతా గ్రుడ్డితనము అనుభవించవలసి వచ్చునని భయపడుదురు గదా !

(Paralasis) (పెరాల్సిస్) పక్షవాతము వచ్చి చేయి సచ్చుబడిపోవునట్లు శిక్ష ఏర్పాటు చేస్తే ఎవడైనా మరొకరిని కొట్టుటకు సాహసిస్తాడా !

ఒకడు మరొకరిని అన్యాయంగా తలనరుకుటకు కత్తి పైకెత్తినా వెంటనే వాని చేయి, పని చేయకుండా చేస్తే ఏ తప్పు చేయని వానిని అన్యాయంగా నోటితో దుర్భాషలాడి తిట్టినవాడి నోరు పనిచేయకుండా చేస్తే అందరికి గుణపాఠం గదా ! విశ్వ ప్రభుత్వాధినేతయగు భగవంతుడు న్యాయ వ్యవస్థలో ఆటోమ్యాటిక్ శిక్ష

అమలు చేసినచో ఇక పోలీసు వ్యవస్థే అవసరము లేదు గదా !

భగవంతుడే ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు జడ్జి వారే. వారి తీర్పుకు తిరుగు లేదు గదా ! దొంగతనాలు లేని ఊరును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన భగవంతుడు మన ఇండియాలో ఒకచోట ఏర్పాటు చేశారు. అచట దొంగతనానికి ఎవరు సాహసించుట లేదు. మహారాష్ట్రలోని షిర్డిసాయి సమీపమున శనిశింగణాపురం వుంది. శనేశ్వర భగవానుని నిలయం అది. తలుపులు లేని ఊరు. అచట తలుపులే వుండవు. అయినా దొంగతనాలు దోపిడీలు లేని భీతిరహిత క్షేత్రము. నేడు పూరిగుడిసె మొదలుకొని అమెరికాలోని అధ్యక్షుని శ్వేతభవనం వరకు తలుపులు తాళం మీదనే ఆధాపడి యున్నవి. తాళం మీద తాళం బిగించినా దొంగతనము, దోపిడీలు జరుగు నేటి సమాజములో మహారాష్ట్రలోని " శింగణాపురం " క్షేత్రములో ఇండ్లకు అసలు ద్వారబందరాలు. తలుపులు, వుండనే వుండవు. ఇచట శనేశ్వర భగవానుల ప్రభావమున్నది. ఘరానా బందిపోటు అయిన " భిల్లా " అను పేరు గల దొంగ శనిశింగాణాపురం (గ్రామాన్ని) దోచుకొనుటకు తన ముఠాతో వచ్చెను. ఆ వూరి పెద్దలు భోజనాలు కూడా సమకూర్చి భోం చేయండి, అన్ని ఇండ్లు తెరవబడే వుంటాయి. ఎవరు మీకు అవరోధం కల్గించరు, మీశక్తి కొలది దోచుకోమన్నారు. భిల్లా వారి మాటలు హేళనగా తీసుకొని ఒక ఇంటిలో ప్రవేశించెను. వెంటనే మతిచెడి పోయింది. తన ముఠా నాయకులు అతనిని జాగ్రత్తగా తీసుకొని తిరుగు ప్రయాణమై పోయిరి. ఇది కల్పితము కాదు. ఇప్పటికి ఈనాటికి ఆ గ్రామములో తలుపులు, లేవు, తాళాలు లేవు. దొంగతనానికి వెళ్ళిన వారు పిల్లిలా తలవంచి శనేశ్వరుని ముందు జడమై పోవలసిందే. ఈ విధానము దేశమంతా అమలు చేయమని మనమంతా విశ్వప్రభుత్వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అగు భగవానునికి అప్లికేషన్ పంపుకొనవలసి యున్నది. వారు ఓకే చేస్తే ఇక పోలీసులు, న్యాయవాదులు అందరూ వేరే పనిలో ప్రవేశించవలసిందే.

గ్రంథ సమీక్ష

1. **షాణ్మాతురస్తవము** : రచయిత – అగస్త్యరెడ్డి వెంకురెడ్డి, ఎం.ఎ. ఎల్.ఎల్.బి. 1/8 డెమ్మీ 63 పేజీలు. వెలవేయలేదు. ఇది శ్రీ సుబ్రహ్మణ్యస్వామిపై వ్రాసిన శతకము. ప్రతిపదార్థం, తాత్పర్య సహితము. టీకా తాత్పర్యములు వ్రాసిన వారు మోపూరు వేణుగోపాలయ్య గారు. స్తవ రచయిత శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర ఉపాసకుడు. ఆత్మీయంలో వారే " నేను బి.ఏ. చదువున్న రోజులలో కొన్ని రోగములు కబళించి వేయుచున్న సమయమున ఒకనాడు అప్రయత్నముగా ఆశువుగా ఒక పద్యం స్ఫురించినది..... ఒక నెల రోజులలో మున్నూటికి పైగా పద్యాలు పూర్తిగావింపగలిగాను " అని వ్రాసినారు. షాణ్మాతురా ! అనే మకుటంతో ఈ పద్యాలు గలవు. బాలసుబ్రహ్మణేశ్వరుడే ఆవేశించి ఈ పద్యాలను వ్రాయించాడని రచయిత విశ్వాసము. నెల్లూరు సీమలో కవిశ్రేష్ఠులుగా పేరుగన్న రచయితయొక్క ఈస్తవం రమణీయమైన కృతి. అందరిచే చదివి ఆనందించదగినది. ప్రతులకు " బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 301, సాహితీ రెసిడెన్సి, త్యాగరాజనగర్, వేదాయపాళెం, నెల్లూరు – 4, ఫోన్ : 0861 2347585 "

2. **శ్రీ ఆంజనేయ సుధ** : సంకలన కర్త, రచయిత వెల్దండ పూరి బాలస్వామి గుప్త, 1/8 డెమ్మీ, 159 పేజీల గ్రంథం ఆంజనేయుల త్రివర్ణ ముఖచిత్రం ఇంపుగా వున్నది. వెల రూ.60/-లు. ప్రతులకు " వెల్దండ పూరి బాలస్వామి గుప్త, మండల పరిషత్ కార్యాలయం ముందు, వివేకానంద నగర్, కల్వకుర్తి – 509324"

గ్రంథరచయిత గుప్త గారు విశ్రాన్త హిందీ పండితులు. శ్రీహనుమాన్ జ్ఞానయజ్ఞ సమితి సంస్థాపకులు. ఇందు హనుమాన్ పూజావిధానం, శ్రీరామరక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా, శ్రీరామ, ఆంజనేయ, అష్టోత్తర శతనామావళులు వగైరా గలవు.

3. **తత్త్వబోధః** : వ్యాఖ్యానము పూజ్యశ్రీ స్వామి దయానంద సరస్వతి. అనువాదం అంగరాకల ప్రహ్లాదరావు. 1/4 క్రౌన్‌సైజు 368 పేజీల గ్రంథము. ముచ్చటైన త్రివర్ణ ముఖచిత్రము. మంచి పేపరు, శుద్ధమైన ముద్రణ, వెల : రూ. 500/-లు దొరుకుచోటు డా॥ ఎ.ప్రహ్లాదరావు, ' ఓం శరణం ' 1-7-100/8, రెడ్డి ఎన్‌క్లోవ్, టెంపుల్ అల్వాల్, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రము. పిన్ : 500010.

" తత్త్వబోధః" అను ఈ గ్రంథం శ్రీ ఆదిశంకరాచార్యుల వారి రచన అని అనబడుతూంది. అనువాదకుని ప్రస్తావనలో తెలిపినట్లు వేదాన్తశాస్త్రంలో బహుళంగా చెప్పబడే వివిధ అంశాలకు ఇదమిత్థమైన నిర్వచనాలు, వివరణలు ఈ గ్రంథంలో వున్నాయి. ఇది వేదాన్తానికి సంబంధించిన ఒక పరిచయ గ్రంథము అని భావించడం చాలా సమంజసంగా వుంటుంది.

తత్త్వబోధకు " ఆర్షవిద్యాగురుకులం " ఆనైకట్టి" స్థాపకులు పూజ్యశ్రీ దయానందసరస్వతి స్వాములవారు బోధించిన విపులమైన సుస్పష్టమైన సవివరణాత్మక వ్యాఖ్యయే ఈ గ్రంథము. వేదాన్త తత్త్వాన్ని విపులంగా, హృద్యంగా వివరించడంలో శ్రీ స్వాములవారు వారికి వారే సాటి. అట్టివారి ఆంగ్ల వ్యాఖ్యను తెలుగు ప్రజలకు వెలుగుపరచిన గ్రంథం ఇది. తెలుగు అనువాదకులు డా॥ ప్రహ్లాదరావు గారు కూడా ప్రవృత్తిలో వేదాన్తి. సదా వేదాన్త చిన్తనాపరులు. సూక్ష్మగ్రాహి. ఇట్టి అనువాదకుని అనువాదం మూలవ్యాఖ్యాత భావాన్ని మనముందు ఒలిచి పెట్టినది. వేదాన్త తత్త్వ జిజ్ఞాసువులెల్లరు తప్పనిసరిగా చదువవలసిన గ్రంథమిది. ఇట్టి అనువాద గ్రంథం అందించిన ప్రహ్లాదరావు గారు అభినందనీయులు.

గ్రంథావిష్కరణ

మహారాష్ట్ర మహాభక్తుడు శ్రీ భక్తతుకారాంబాబా గారిచే రచింపబడిన " గాథ"లోని కొన్ని అభంగముల తెలుగు అనువాదం వ్యాఖ్యతో గూడిన **" శ్రీ భక్తతుకారాం అభంగవాణి "** అనే గ్రంథము (తెలుగు) 20-09-2015 తేది ఆదివారం సాయంకాలం 5-30 గంటలకు తిరుపతి శ్రీపురం కాలనీలోని శ్రీ మలయాళ సద్గురు సేవా సమాజ భవనంలో ఆవిష్కరింపబడినది. తెలుగు అనువాదం విశేష వ్యాఖ్య పూజ్య శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు రచించారు. శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు ఈ గ్రంథాన్ని శ్రోతల జయ జయ ధ్వనుల మధ్య ఆవిష్కరించారు. ఈ సభకు మహామహోపాధ్యాయ డా ॥ సముద్రాల లక్ష్మణయ్య గారు అధ్యక్షత వహించారు. ఈ గ్రంథ కీనోట్సు ఆచార్య డా ॥ బ్రహ్మానందం గారు చెప్పారు. గ్రంథ విశిష్టతను గురించి అభంగాలను గురించి వివరిస్తూ మరాటీలోనే సంగీతపురస్సరంగా ఈ అనువాద గ్రంథంలోని అభంగాలను పాడి శ్రోతలను తన్మయం చేశారు. అంతేగాక తెలుగు అనువాద, వ్యాఖ్యానకౌశలాన్ని బహుధా కొనియాడారు. ఆచార్య డా॥ కె.సర్వోత్తమరావు గారు గూడా తెలుగు వ్యాఖ్యానకర్త శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారి కృషి చాలా ప్రశంసనీయమని శ్రీ స్వామివారి వ్యాఖ్యాన కౌశలాన్ని విశదపరచారు.

ఆచార్య డా ॥ మునిరత్నం గారు గ్రంథంలోని ముఖ్య విషయాలపై మాట్లాడారు. అధ్యక్షులు శ్రీ సముద్రాల లక్ష్మణ్యయ్య గారు గ్రంథ విశిష్టతను, దాని విశేష వ్యాఖ్యను చాలా కొనియాడారు. విద్యావంతులైన తిరుపతి ప్రముఖులు చాలామంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం రెండు గంటలసేపు జరిగినది. శాన్తి పాఠంతో ఆవిష్కరణోత్సవం ముగిసినది.

వార్తలు

(01). 27-09-2015 తేది భాద్రపద పౌర్ణమి ఆదివారం నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగుచున్న అర్ధచాతుర్మాస్య వ్రతం పూర్తి అయినది. గురుపాదుకలకు అభిషేకం, అర్చనాదులు జరిగినవి.

(02). 29-09-2015 తేది మంగళవారం నాడు తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలోని యోగా థెరపీ కళాశాల ప్రథమవార్షికోత్సవం జరిగినది. ఆ సందర్భంలో కళాశాల యాజమాన్యం వారిచే ఆహ్వానింపబడి పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(03). గుంటూరు సమీపం నంబూరు కాశీవనాశ్రమంలో అక్టోబర్ 25,26,27 తేదీలలో జరిగిన కార్యక్రమంలో శ్రీ స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(04). శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అక్టోబరు 20వ తేదీ శ్రీ సరస్వతి దేవికి, 21వ తేదీ దుర్గాదేవికి, 22వ తేదీకి గురువారం నాడు లక్ష్మీదేవికి షోడశోపచారాలతో పూజలు జరిగాయి.పూజానంతరం భక్తులందరికి ప్రసాద వినియోగం జరిగినది. మహిళామాతలకు చీరలు ఇవ్వబడినవి.

(05). అక్టోబర్ 2వ తేది శుక్రవారం నాడు, 29వ తేది గురువారం నాడు కృత్తిక సందర్భంగా ఆశ్రమంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి అర్చన జరిగినది. అక్టోబరు 11వ తేదీ ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ఆశ్రమంలో ప్రదోషకాలంలో శివునికి రుద్రాభిషేకం, బిల్వార్చన జరిగినది.

(06). 11-11-2015వ తేది బుధవారం దీపావళి సందర్భంగా ఆశ్రమంలో దీపాలతో ఓంకారము చేసి దానికి ప్రణవార్చన చేయబడును.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో సెప్టెంబరు నెలలో **ఓ.పి.విభాగంలో 1044 మందికి** చికిత్సలు జరిగాయి. **93 మందికి కంటి పొరలు** తీసి లెన్సు అమర్చబడినవి. **8 మందికి లేజర్ చికిత్స** జరిగినది. గ్రామీణ కంటి వైద్య శిబిరాలు మూడు జరిగినవి.

సమాజాన్ని ప్రేమించు సర్వేశ్వరుడు నిన్ను ప్రేమిస్తాడు

'ఫలానా వ్యక్తి నా తల్లి' అనే నమ్మకముంటే కదా నీవు ఆమెను ప్రేమించగలవు. 'ఆమె నా తల్లి అవునో కాదో' అని సందేహిస్తే నీకు ప్రేమ ఎలా కల్గుతుంది? నమ్మకమున్నచోట ప్రేమ ఉంటుంది. ప్రేమ ఉన్నచోట శాంతి ఉంటుంది. శాంతి ఉన్నచోట సత్యముంటుంది. సత్యమున్నచోట ఆనందముంటుంది. ఆనందమున్నచోట భగవంతుడుంటాడు. మొట్టమొదట నమ్మకమే లేకపోతే దివ్యత్వమంటే ఏమిటో అర్థం కాదు. తనను తాను నమ్మలేనివాడు సమాజాన్ని ఏ రీతిగా ప్రేమించగలడు? ఆత్మవిశ్వాసం గలవాడే సమాజాన్ని ప్రేమిస్తాడు. సమాజాన్ని ప్రేమించేవానిని సర్వేశ్వరుడు ప్రేమిస్తాడు.

– శ్రీసత్యసాయిబాబా

వేదాంతభేరి

డిసెంబర్ 2015 రూ. 6/-



గీతాసందేశము

కర్మసన్న్యాసంకంటే కర్మయోగమే చాల శ్రేష్ఠతరమైనది. వాస్తవంగా ఆ రెండు మార్గాలమధ్య భేదం కనుపించదు. రెండు మార్గాలలోను సాధకుడు కామము, ద్వేషము వంటి ద్వంద్వాల బానిసత్వం నుండి ముక్తుడగుట అత్యావశ్యకము. రెండు మార్గాల ద్వారా లభించే అనుభవములు సమానమైనవి. అది ఆత్మాసాక్షాత్కారము. కర్మయోగికి, సన్న్యాసికి ఉత్కృష్టమగు అమరత్వ సిద్ధిలో లభించే స్థితి యథాతథంగా ఒక్కటే.ఎందుకనగా ఒకదానికి లభించే ఫలమే రెండవ దానికి కూడా లభిస్తుంది. కావున జ్ఞానసిద్ధుని దృష్టిలో లోకసంగ్రహార్థమై కర్మలోయున్న యోగికి, కర్మను త్యజించిన త్యాగికి మధ్య ఏలాంటి భేదము కనుపించదు.

– శ్రీ స్వామి రామదాసు

(ఆనందాశ్రమం, కనహన్‌గడ్)

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 డిశంబర్ 2015 సంచిక : 12

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 48 డిశంబర్ 2015 సంచిక : 12

విషయ సూచిక

01. ప్రార్థన - 05

02. భగవద్గీత ఒక విజ్ఞాన భాస్కరుడు-
శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు - 06

03. భగవద్గీతలోని దైవ సంపద - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 08

04. గీతయొక్క మహిమ - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు -15

05. మహాపాపినైనా మహాత్ముణ్ణి చేస్తాడు మాధవుడు -శ్రీ త్రిదండి చిన్న
శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వాములవారు - 17

06. పరిపూర్ణతకు మార్గం - శ్రీ స్వామి చిన్మయానంద - 23

07. కథాత్మక గీతాసూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 27

08. శ్రీ భక్త తుకారాం అభంగవాణి - శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు - 33

09. అక్కమహాదేవి అనుభవామృతం-శ్రీడా॥కరిబసవరాజేన్ద్ర మహాస్వామి- 35

10. శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యం - డా ॥ జక్కంపూడి మునిరత్నం - 37

11. గీతాగానం - సి.కె.గోపాల్ - 41

12. వార్తలు - 42

ముఖచిత్రం : గీతోపదేశము

21-12- 2015 వైకుంఠ ఏకాదశి మరియు గీతాజయన్తి

ప్రార్థన

జయ భగవద్గీతే !

(బేహాగ్ - ఆదితాళము)

రచయిత : శ్రీ నోముల అప్పారావు గారు

జయ జయ జయ జయ భగవద్గీతే !
జయ భవబన్ధన శమన సుచరితే !

1. కాండత్రయ సంశోభితరూపే !
ఖండిత త్రిభువన ఘనసన్తాపే ! ॥ జయ ॥

2. సాంఖ్యకర్మ యోగాది విలసితే !
సంశ్రిత సాధక జన కల్పలతే ! ॥ జయ ॥

3. పద్మసప్తశత భవ్యతరాజ్ఞే !
పాప విభఞ్జన ! పావనగఙ్గే ! ॥ జయ ॥

4. భక్తి జ్ఞాన సోపాన శోభితే !
పరమయోగి హృత్పద్మభావితే ! ॥ జయ ॥

5. భగవత్ శ్రీముఖ పద్మమరన్దే !
పార్థహృత్సదన భరితానన్దే ! ॥ జయ ॥

6. సకలోపనిషత్ సాగర జాతే !
సన్మునిమథనాచల పరిపూతే ! ॥ జయ ॥

7. శాంతి సుఖప్రద సదమృతకిరణే !
జనన మరణ భవసాగరతరణే ! ॥ జయ ॥

8. భజన సమాజ సుభక్త హృదబ్జే !
పరిపూజిత పావన పాదాబ్జే ! ॥ జయ ॥

భగవద్గీత ఒక విజ్ఞాన భాస్కరుడు

- శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

శ్రీ మద్భగవద్గీత ఒక అద్భుతమైన, పవిత్రమైన, అద్వితీయ గ్రంథం. మానవునికి ఆధ్యాత్మిక జీవితం గడపడానికి ఏ ఆధ్యాత్మిక సత్యంయొక్క ఆవశ్యకత వుందో అది ఈ భగవద్గీతలో వుంది. అంతేగాక వ్యావహారిక జీవితం గడపడానికి కూడా భగవద్గీత చాల ఉపయోగపడుతుంది.

ఇది సాక్షాత్ భగవంతునిచేత చెప్పబడిన ఒక అతి ముఖ్య శాస్త్రం. అందుచేతనే వల్లభాచార్యులవారు “ ఏకం శాస్త్రం దేవకీపుత్ర గీతం ” అన్నారు. ఇది అన్ని వేదాల స్వరూపము – “ సర్వవేదమయీ గీతా ” అని స్కాందపురాణం అంటూంది.

పైకి భిన్న భిన్నాలుగా కనిపించే వేదాన్తాల (ఉపనిషత్తుల) సిద్ధాన్తాలను తఱచి తఱచి సమన్వయం చేసినది భగవద్గీత. అంచేతనే “ సర్వోపనిషదో గావో .... దుగ్ధం గీతామృతం మహత్ ” అన్నారు. కాబట్టే “ సర్వశాస్త్రమయీ గీతా ” అన్నారు. భారతీయ వాఙ్మయంలో కాదు కాదు విశ్వవాఙ్మయంలో **భగవద్గీత ఒక విజ్ఞాన భాస్కరుడు.**

“భగవద్గీతా కించిదధీతా గంగా జలలవ కణికా పీతా ! సకృదపి యేన మురారి సమర్చా తస్య కరోతి యమో2పి న చర్చా ” అని శంకరాచార్యులవారన్నట్లు ఈ గీతాధర్మాన్ని కొద్దిగా అభ్యాసంలో పెట్టినా, అమలు పఱచినా మానవుని జన్మ సార్థకమవుతుంది. కొందరు భగవద్గీత ప్రపంచాన్ని వదలిన సాధు సన్న్యాసులకే, ఈ చిన్న వయసులో నీకు గీత ఎందుకు ? అని ఆక్షేపిస్తూంటారు. భగవద్గీత చెప్పినది అర్జునునకు, ఆయన గృహస్థుడు. అంతేగాదు రాజ్యపరిపాలకుడు. గీతను విన్న తరువాత ఆయన

ప్రపంచాన్ని వదలి పెట్టి అడవులకు పారిపోలేదు. కాబట్టి గీత సన్న్యాసులకేనన్న తప్పు అభిప్రాయాన్ని వదలిపెట్టాలి. గీత నిత్య జీవితానికొక కరదీపిక. గీతను చదివి, అందులో చెప్పిన విధంగా నిత్యజీవితంలో జీవన విధానాన్ని ఆచరిస్తే అది యోగమై బంధరాహిత్యాన్ని, దుఃఖరాహిత్యాన్ని, ఆనంద ప్రాప్తిని కలుగజేస్తుంది.

అందుకే శ్రీకృష్ణుడు “ గీతాజ్ఞానముపాశ్రిత్య త్రీన్లోకాన్పాలయామ్యహమ్ ” గీతాజ్ఞానాన్ని ఆధారంగా ముల్లోకాలను నేను పాలిస్తున్నాను” అన్నాడు.

ఈ భగవద్గీత ప్రస్థానత్రయంలో ఒకటి. కాబట్టే దీనికి జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు భాష్యం వ్రాశారు. ఆ తరువాత శ్రీరామానుజాచార్యులవారు, శ్రీమధ్వాచార్యులవారు, శ్రీనింబార్కాచార్యులవారు, శ్రీవల్లభాచార్యులవారు వగైరా భాష్యాలు వ్రాశారు. “ ఉపనిషత్తులనే తోట నుండి ఆధ్యాత్మిక సత్యాలనే పుష్పాలను యేరి కూర్చిన మాలయే భగవద్గీత” అని స్వామి వివేకానన్దవాణి. ఇట్టి భగవద్గీత మార్గనిర్దేశంలో జీవించి ధన్యులమగుదము గాక !

గీతాజయన్తి

21-12-2015వ తేదీ మార్గశిర శుద్ధ ఏకాదశి సోమవారం నాడు గీతాజయన్తి. శ్రీ కృష్ణపరమాత్మ అర్జునునకు భగవద్గీతను యుపదేశించిన దినము. ఈరోజు శ్రీ శుకబ్రహ్మాశ్రమములో భగవద్గీతకు పూజ జరుగును. సాయంకాలం శ్రీ విజయానందబ్రహ్మచారి నేతృత్వంలో భగవద్గీతను గురించి ప్రవచనలుండును.

ఈ గీతాజయన్తి మఱియు శ్రీ మలయాళ సద్గురు సేవాసమాజ వార్షికోత్సవము **డిశంబరు 20,21, 22వ తేదీలలో తిరుపతి సమాజ భవనంలో కూడ జరుగును.**



భగవద్గీతలోని దైవ సంపద

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

గీతా గ్రంథమున ‘సాధన’కు విశేష ప్రాముఖ్యత నొసంగబడినది. చిత్తము నిర్మలముగానున్నచో, అత్తఱి పారమార్థికలక్ష్యము చేరువనేయుండును. కావున అట్టి చిత్తశుద్ధి పరికరము లనేకములు గీతయందొసంగబడినది. 16వ ఆధ్యాయ ప్రారంభమున గల దైవీసంపద్వివరణము వానిలో చేరినదే అయి యున్నది. ఇఱువదియాఱు సుగుణములను భగవానుడిచట తెలియజేసిరి. వానినన్నింటిని ముముక్షువు - విద్యార్థి పాఠముల వలె - క్షుణ్ణముగ నభ్యసించి హృదయమును పరిశుద్ధ మొనర్చుకొనినచో ఇక మోక్ష లక్ష్యము సన్నిహితమైనట్లే యగును. కావున సాధకులీసద్గుణరాశిని ప్రయత్నపూర్వకముగ నవలంబించి కడుజాగరూకతతో వానిని కాపాడుకొనుచుండవలెను.

సంపద యనగా ధనము, ఐశ్వర్యము. దైవసంపదయనగా దైవ ధనము. శ్రీ కృష్ణపరమాత్మ దైవధనము నిపుడు లోకులముందు వైదజల్లుచు ‘ ఓ జీవులారా ! నశ్వర ప్రాపంచిక ధనములతో క్రీడించుచు, వానియందే అమూల్యకాలమంతయు వినియోగించుచు దుఃఖపరంపరలను, జన్మపరంపరలను బొందకుడు ! ఇవిగో ! తీసికొనుడు. దైవసంపద్రాసులను, పారమార్థిక రత్నచయములను ’ అని వచించుచున్నారు. ఈ దైవధనము ముందు ప్రాపంచిక సంపదలు, వజ్రవైడూర్యాదులు ఏపాటి విలువగలవి ? కావున వివేకవంతులీ దైవసంపదను శీఘ్రముగ హస్తగతమొనర్చుకొని జ్ఞానధనులై బ్రహ్మసాయుజ్యము నొందెదరుగాక !

‘ అభయమ్ ’ – శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునకు అనేక సుగుణములను చెప్పదలంచిన వారై మొట్టమొదట ‘ సుగుణరాట్ ’ అనదగు, ‘సుగుణసింహ’ మనదుగు ‘ అభయము’ ను పేర్కొనెను. ఇది గమనింపదగిన విషయమైయున్నది. ఏలయనిన, ఎన్నియో ఇతర సుగుణములుండ ఈ ‘ భయరాహిత్యము’ నే తొలుదొల్త చెప్పనేల ? దీనికి కారణములు కలవు – (1) అన్ని దుర్గుణములకును భయమే పునాది. భయమునుండియే తక్కిన అవగుణములన్నియు నంకురించును. కావున విజ్ఞులద్దానిని మొట్టమొదట పారద్రోలినచో, అనగా నిర్భయత్వము నవలంబించినచో ఇక తక్కిన సుగుణము లన్నియు అవలీలగా వచ్చి చేరగలవు. ఇక్కారణమున నయ్యది మొదట చేర్చబడి యుండవచ్చును. మఱియు (2) త్రాడులాగు పందెము **(Tug of war)** లో మొదటి వానిని చివఱివానిని మహాబలశాలులుగ నుండునట్లుచూచి పెట్టుదురు. అట్లే అసురగుణములు గావింపబడుచున్న పందెమున దైవగుణములపక్షమున ‘ అభయం’ –అను సుగుణరాజమును ఏరి భగవాను డద్దానిని నాయకునిగ **(Captain)** జేసి రణరంగమున నిలబెట్టెను. దీనిని బట్టి అది యెంతటి మహత్తర సుగుణమో వ్యక్తము కాగలదు. (3), ‘అభయం’ జనక ప్రాప్తో 2సి’ అని ఉపనిషత్తులా యభయమును సాక్షాత్ బ్రహ్మపదముగనే వర్ణించి చెప్పినవి. కాబట్టి గీతయందు భగవానునిచే నెంతయో ప్రముఖముగ నెంచబడినట్టి ఈ నిర్భయత్వమను గుణరత్నమును సర్వులును లెస్సగ నభ్యసించి దైవసంపత్తిని బాగుగ కూడ బెట్టుకొనవలెను.

‘ సత్త్వసంశుద్ధిః’ –‘ శుద్ధిః’ అని చెప్పక ‘ సంశుద్ధిః’ అని చెప్పుటవలన చిత్తము అత్యంత నిర్మలముగా నుండవలెనని భావము. మనస్సునం దేలాటి ప్రాపంచిక సంకల్పములకు, మలిన సంస్కారములకు, పాపములకు చోటీయరాదు. నిర్మలదర్పణమందే ప్రతిబింబము స్పష్టముగ గోచరించునట్లు

నిర్మల చిత్తముననే ఆత్మ చక్కగ స్ఫురించగలదు.

‘ జ్ఞానయోగ వ్యవస్థితిః’ భగవానుడు గీతలో అనేక యోగములను గూర్చి బోధించినను, అచటచట జ్ఞానయోగాధిక్యతను వెల్లడించుచునే యున్నారు. (ఆత్మ జ్ఞానానుభూతియే అన్నిటియొక్క పరమావధి గనుక). కనుకనే దైవసంపదలో ప్రారంభములోనే దానిని గూర్చిన ప్రస్తావనను లేవనెత్తిరి. ‘ సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ’ అనునట్లు అన్ని కర్మలు, అన్ని యోగములును తుదకు జ్ఞానమందే పర్యవసించుచున్నవి. కాబట్టి అట్టి జ్ఞానయోగమందు దృఢస్థితిని సంపాదించవలసినదిగా భగవాను డిచట నాదేశించుచున్నారు.

‘ దానం’ – భూదానము, సంపద్దానము, అన్నదానము, జలదానము, శ్రమదానము, విద్యాదానము, జ్ఞానదానము, – ఇవియన్నియు దానములలో జేరినవే.

‘దమశ్చ’ – ‘శమ’ మను అంతరేంద్రియ నిగ్రహము ‘సత్త్వసంశుద్ధిః’ అను పదము ద్వారా ఇదివఱకే పేర్కొనబడియుండుట వలన ఇచట ‘ దమ’ మను బాహ్యేంద్రియ నిగ్రహము మాత్ర మిపుడు చెప్పబడినది. ఇంద్రియనిగ్రహము లేనిదే పరమార్థ రంగమున ఎవరును ముందునకు పోజాలరని ఘంటాపథముగ చెప్పవచ్చును. కనుకనే గీతలో శమ, దమములకు సముచిత స్థాన మొసంగబడుచునున్నది.

‘ యజ్ఞశ్చ’ ఇచట యజ్ఞమనగా తపోయజ్ఞము, యోగయజ్ఞము, స్వాధ్యాయయజ్ఞము, జ్ఞానయజ్ఞము మున్నగునవి మాత్రమేయని గ్రహించవలెను.

‘ స్వాధ్యాయః ’ గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, యోగవాసిష్ఠము, భారత, బాగవత, రామాయణములు – ఇత్యాది ఆధ్యాత్మిక ఉద్గ్రంథములను పఠించి అందలి సారమును మననము చేయుట స్వాధ్యాయ

మనబడును.

'తపః' – తపస్సనగా తల క్రిందబెట్టి కాళ్లు పైన బెట్టుకొనియుండుట కాదు. గీత 17వ అధ్యాయమున చెప్పబడిన శారీరక, వాచిక, మానసిక తపస్సులని భావము.

'ఆర్జవమ్ ' – శరీరము, వాక్కు, మనస్సు – అను మూడింటితోను ఏకరీతిగా వర్తించుట – అనగా త్రికరణశుద్ధి గలిగియుండుటయని అర్థము. విషజంతువులగు సర్పాదులు వక్రగతి గలిగియుండును. కావున వక్రస్వభావము గలిగియుండు మానవులున్ను విషజంతువులతో సమానులే యగుదురు.

' అహింసా ' – శరీరముతో, వాక్కుతో, మనస్సుతో, ఏ ప్రాణికి హింసచేయకుండుట, ఏ ప్రాణిని బాధింపకుండుట.

'సత్యం' – (1) శరీర వాఙ్మనంబులతో అసత్యమాడకుండుట.

(2). సత్యవస్తువగు పరమాత్మయందు నిలుకడ గలిగియుండుట.

' అక్రోధః' – క్రోధము చాల చెడ్డగుణము. పరమార్థసాధకునకే కాదు, ప్రతి మానవునికిని అది యెంతయో కీడొనర్చగలదు. అది ఆవహించినపుడు మనుజుడు కల్లు త్రాగినవాని చందమున నుండును. ఆ 'కైపు'లో యుక్తాయుక్తములను విస్మరించి యతడు అధఃపతనమునొందును. కాబట్టియే ' క్రోధాద్భవతి సమ్మోహః...ప్రణశ్యతి' – అని దీని ఆగడమును గూర్చి భగవాను డిదివఱకే విపులముగ తెలిపియుండెను. క్రోధము రజోగుణసంబంధమగు దుర్గుణము. కావున అది మనుజుని యావేశించునపుడతని కండ్లెఱ్ఱబడును. దేహమంతయు చెమటబట్టును. తుదకు వికృతరూపుడై, దాదాపు రాక్షసునివలె మారిపోవును. ఇక్కారణమున పరమార్థోన్నతికి క్రోధరాహిత్యము (అక్రోధము) ఒక గొప్ప అవశ్యకతయైయున్నది. కనుకనే యది దైవసంపదయందు పేర్కొనబడినది.

'త్యాగః' – 'త్యాగేనైకే అమృతత్వమానశుః' – త్యాగము వలననే మోక్షము సిద్ధించును అని ఉపనిషత్తు లుద్ఘోషించుచున్నవి. దృక్ – స్వరూపమగు ఆత్మను, భగవంతుని అవలంబించి, దృశ్యవస్తువులగు విషయ సమూహములయం దాసక్తిని త్యజించుటయే త్యాగము. దుర్గుణములను, దుస్సంస్కారములను, దుష్టసంకల్పములను, విషయ వ్యామోహమును, కర్మఫలమును త్యజించుటయే వాస్తవమగు త్యాగము. ఇదియే అంతరత్యాగము. బాహ్యత్యాగముకంటె అంతరత్యాగము శ్రేష్ఠమైనది.

' శాంతి' – చిత్తము శాంతియుతముగ నుండవలెను. కల్లోలసముద్రమువలె నుండరాదు. సంకల్పములచే కొట్టుకొనుచుండరాదు. చిత్తము పరమాత్మయందు లయించినపుడే పూర్ణశాంతి సంభవించును. శాంతిలేనివారికి సుఖముండదు. (అశాంతస్య కుతస్సుఖమ్) . భగవదాశ్రయము, దృశ్యవిషయసంకల్ప వివర్జనము శాంతికి ఉపాయములు.

' అపైశునమ్ ' – ఇతరుల దోషములను లెక్కింపకుండుట, చాడీలు చెప్పకుండుట. పరులగుణములతో మనకు పనియేకాని పరుల దోషములతో గాదు. జనులు తమ తమ హృదయములందు దాగియున్న కోటానుకోట్ల దోషములను ముందు నిర్మూలించుకొనిన చాలును. ఇతరుల దోషములను లెక్కింపవలసిన పనిలేదు.

' దయా భూతేషు ' సమస్త ప్రాణికోట్ల యెడల దయగలిగియుండుట' సాధకునకొక అత్యవసరమైన సుగుణము. గనుక దానిని గూర్చి గీతయం దనేకచోట్ల ప్రస్తావించబడెను. బ్రహ్మజ్ఞానమను మందుకు భూతదయయను పథ్యము ఉండియే తీరవలెను. అపుడే ఆ మందు చక్కగ పనిచేయును.

కాబట్టి భక్తి, జ్ఞాన వైరాగ్యాదులతోబాటు భూతదయను గూడ సాధకులు బాగుగ నభ్యసించవలయును.

'అలోలత్వమ్' – ఇంద్రియలోలత్వము లేకుండుట, విషయ చాపల్యము వదలి యుండుట. ఇంద్రియములయొక్క శక్తియంతయు విషయ భోగములందు వ్యర్థమైపోయినచో ఆత్మచింతనాదులం దది సమర్థమై యుండజాలదు. కావున ప్రత్యాహారముచే ఆయా యింద్రియములను విషయములనుండి మఱలించి, ఆత్మయందు స్థాపించవలెను. మనస్సు చపలత్వము లేకయుండవలెను.

'మార్దవమ్' – మాటయందు, చేష్టయందు కాఠిన్యము చూపక మృదుత్వము గలిగి యుండవలెను. పరుషత్వమును వీడవలెను. ఇది సాత్త్వికగుణసంపన్నుని లక్షణము.

'హ్రీః' – (సిగ్గు) (1) పాపకార్యములు చేయుటయందు సిగ్గు గలిగి యుండవలెను. (అనగా వానిని చేయరాదు)

(2). 'నేనింతవఱకు పరమార్థక్షేత్రమున ఏమియున్నతిని బొందితిని ? అని ప్రశ్నించుకొని, ఉన్నతినిబొందనిచో సిగ్గుపడవలెను.

(3). మహనీయులను, అనుభవజ్ఞులను సాధుమహాత్ములను, భక్తులనుగాంచి, తన సాంసారిక – అవనతిని తలంచుకొని సిగ్గునొందవలెను. మఱియు వారివలె ఉన్నత పారమార్థిక శిఖరము నధిరోహించుటకు పట్టుదలతో ప్రయత్నించవలెను.

'అచాపలమ్' – చంచలత్వము రజోగుణస్వబావము – అట్టిది లేకుండవలెను. మనస్సును ఆత్మనుండి (దైవమునుండి) చలింపజేయరాదు.

'తేజః' – బ్రహ్మతేజస్సు గలిగి యుండవలెను.

'క్షమా' – ఓర్పు, సహనము, ద్వంద్వములందు నిర్వికారుడై పృథివివలె, ఫలవృక్షమువలె క్షమాశీలుడై యుండవలెను. శుకుడు, మున్నగువారి

వేదాన్తభేరి ... మురళీధర కృష్ణుడు

క్షమాశీలత్వమును,సహనత్వమును అపుడపుడు తలంచుకొను చుండవలెను.

'ధృతిః' ధైర్యము గలిగి యుండవలెను. నిజరూపమగు ఆత్మను గూర్చి చింతించుచుండినచో, మఱియు ప్రపంచమిథ్యాత్వమును గూర్చి మననము చేయుచుండినచో మనుజునకు గొప్పధైర్యము చేకూరుచుండగలదు. ఎన్ని విపత్తులు తటస్థించినను మేరుసమానముగ గంభీరుడై యుండవలెను.

'శౌచమ్' – (1) బాహ్యాశౌచము (శరీర, గృహాదుల శుద్ధి) (2) అభ్యంతర శౌచము (ఇంద్రియ మనంబుల శుద్ధి, అపవిత్ర సంకల్పములు లేకుండుట).

'అద్రోహః' – ఎవరికిని ద్రోహము, బాధ కలుగజేయకుండుట. మనస్సు నందును ద్రోహచింతన లేకుండుట.

'నాతిమానితా' – తాను గొప్ప పూజ్యుడనని ఎన్నడును విఱ్ఱవీగరాదు. తనను పరులు గౌరవించవలెనను అభిమానమున్ను గలిగియుండరాదు. ఇది సాధకులకు అత్యంతావశ్యకమగు సుగుణము. ఇది లేనికారణమున అనేకులు దంభ, అభిమానాదులచే పతనమొందిపోయిరి.

ఆంజనేయునకు గల్గియున్నటువంటి వినయ విధేయతలు, నిరభిమానము, దైవభక్తి కలవాడే పరమార్థ మార్గమున సముత్తీర్ణుడు కాగలడు.

ఈ యిరువదియాఱు సుగుణములు దైవసంపత్తియందు జన్మించినవారికి కలుగుచుండును. ఇవిలేనివారు అట్టి దైవసంపదకై యత్నించి అద్దానిని పొందవలెను. మోక్షమున కీ సద్గుణములన్నియు అత్యావశ్యకములు.

నైతిక సిద్ధాన్తములేని రాజకీయము, దానధర్మములు లేని దనము, సద్గుణములు లేని విద్య, మానవత్వములేని విజ్ఞానము వ్యర్థము.

గీతయొక్క మహిమ

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

గీత యొక్క మహిమ యంతయు అధ్యాయాంతమున గల సమాప్తి వాక్యము వల్లనే గనదగును. **" ఇతి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మ విద్యాయాం యోగశాస్త్రే శ్రీ కృష్ణార్జున సంవాదే అముక యోగో నామ "** అని ప్రతి అధ్యాయాన్తమున గలదు గదా. దీనిలో గీతార్థము పూర్ణముగా నిమిడియున్నది. ఇచట " శ్రీమద్భగవద్గీతాసు ఉపనిషత్సు " అని చెప్పుటలో భగవద్గీతలు ఉపనిషత్తులే కాని, సామాన్యమైనవి కావని అర్థమగుచుండును.

గీతాధ్యాన శ్లోకములలో " సర్వోపనిషదో గావః " అని ప్రయోగించుటకు గూడా అదియే కారణము, మఱియు ' బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే ' బ్రహ్మవిద్య యనియు, యోగశాస్త్రమనియు ప్రయోగించుట వల్ల ఇది బ్రహ్మవిద్యాస్వరూపమనియు, యోగశాస్త్రమనియు తెలియదగును. ఇట్టి మహోన్నత గ్రంథమగుటచేతనే గీతకు ఇంతవ్యాప్తి గలిగినది. ఇంత విశాలార్థము, అగాధ భావము, సమత్వమున్ను గల గ్రంథము మఱియొకటి లేదని చెప్పుట అతిశయోక్తి కానేరదు. కనుకనే శ్రీ ఆదిశంకరాచార్యులు మొదలుకొని సామాన్యజనులగూడ గీతాపఠనమునం దాసక్తి గలిగి యుండుటకు కారణమైనది. మతత్రయాచార్యులు ద్వైతాద్వైత విశిష్టాద్వైత రూపములుగా దీనికి అర్థమును (భాష్యములను) వ్రాసి యుండుటయే గాక అనేకులు కర్మయోగ పరముగాను, భక్తియోగ పరముగాను, దీనికి

అర్థమును వ్రాసి యున్నారు. శ్రీ కంఠశివాచార్యులు శివపరముగా భాష్యమును రచించియున్నారు.

గీతాబోధ గొప్ప వెల్లువ వంటిది. నూయి, గుంట, చెఱువు మొదలగువాటి విస్తీర్ణము ననుసరించి జలము వాటిలో నిలిచి మిగిలిన జలమంతయు సముద్రములోనికి వెళ్ళునట్లు ఎవరెవరి హృదయము ఎంత విశాలముగా నుంటున్నదో అంత అర్థమును వారు గ్రహించగలరు. మిగిలిన దంతయు అనంతములోనికి పోయి చేరుచుండును. స్వల్పాహారముచే చీమ తృప్తి నొందునట్లును, గొప్ప ఆహారముచే ఏనుగు సంతుష్టి నొందునట్లున్ను, ఎవరెవరి హృదయ భావము ఎంత విశాలముగా నుండునో దాని ననుసరించి గీతాపఠనము చేయువారందఱున్ను అంతంత మాత్రము సంతృప్తులగు చున్నారు. కడుపు నిండినచో గజమున కెట్లు సుఖముండునో అదేవిధముగా పిపీలికకున్ను తృప్తియుండును. ఏలాటి మార్పున్ను లేదు.

కొన్ని గ్రంథములు కొందఱికి మాత్రమే పఠించుటకు అధికారము గలిగియున్నట్లు ఆయా గ్రంథములలోనే నిరూపించియున్నారు. గీతలో అట్టి సంకుచితభావ మేమియు లేదు. భూపాలురనుండి గోపాలుర వఱకున్ను, పండితులనుండి పామరుల వఱకున్ను, ఉన్నతజాతులనుండి నిమ్నజాతుల వఱకున్ను, సన్న్యాసులనుండి గృహస్థుల వఱకున్ను, వెయ్యేల? ఆబాలవృద్ధ స్త్రీపురుషులందఱున్ను కట్టకడకు మనుష్య మాత్రులెవరైనను, ఏ మతస్థులైనను పఠించి అనుష్ఠించి తరించుట కవకాశము గలదు. కావుననే అనేక భాషలలోనికిన్ని అనేక మతములలోనికిన్ని యీ గ్రంథము ఇంతగా ప్రవర్తితమైనది.

మహాపాపినైనా మహాత్ముణ్ణి చేస్తాడు మాధవుడు

- శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారు

అపి చేత్ సుదురాచారో భజతే మా మనన్యభాక్ ।
సాధురేవ స మంతవ్యః సమ్యగ్ వ్యవసితో హి సః ॥
9 అ ॥ 30 శ్లో ॥

ప్రతిపదార్థము :- సుదురాచారః అపి = మిక్కిలి దురాచారములు కలవాడైనను, మాం = నన్ను, అనన్యభాక్ = ఇతరులనందరిని వదలి భజించుటయే ఫలముగా కలవాడై, భజతేచేత్ = భజించినచో, సః =అట్టివాడు, సాధుః ఏవ = సజ్జనుడనియే, మంతవ్యః = ఆదరించదగినవాడు హి= ఎందువల్లననగా, సః = వాడు, సమ్యక్ = లెస్సగా, వ్యవసితః = నిశ్చయించు కొనినవాడు.

మహాపాపినైనా మహాత్ముడిగా తీర్చిదిద్దగలిగినవాడు భగవానుడు మాధవుడొక్కడే. మేం భగవత్ స్వరూపులం అనే వారెందరో ఉన్నారు. ఎందరో ఎన్నో రకాల సాధనలు చేసినా, మాధవుడి అనుగ్రహం లేనిదే వారు లోకాన్ని తరింపచేయలేరు. వారికి ఒక ఉన్నత స్థానాన్ని ప్రసాదించదగలిగినవాడు భగవంతుడొక్కడే అని మనకి భగవద్గీత స్పష్టం చేస్తోంది. దేవతలైనా, నరులైనా, తిర్యక్ యోనులైనా, స్థావరాలైనా సమానంగానే ఆదరణని పొందగలవని భగవానుడు చెప్పాడు. దేవతలలో ఇంద్రాదులు, రాక్షసులలో విభీషణ, ప్రహ్లాదాదులు భగవంతుని అనుగ్రహం పొందినవారిలో ఉన్నారు. జంతువులలో గజేంద్రాదులున్నారు. స్థావరాలను ఎన్నిటినో తన అవతారాలుగా ధరించి వాటిని తరింప చేసిన సన్నివేశాలు అనంతాలు. తనకి ఎవరియందూ ద్వేషం లేదని, ఎవరియందూ విపరీత అభిమానం లేదని, అన్నిటినీ, అందరినీ సమానంగా అనుగ్రహిస్తానని, ఆదరిస్తానని భగవంతుడు చెప్పాడు. అయితే, లోకంలో కొందరు కర్మ ప్రభావం చేతనో, పరిసరాల ప్రభావం చేతనో లేదా తమలో ఉండే బలహీనత, దౌర్బల్యాల చేతనో దురాచారులుగా మారిన వారుంటారు. అలా ఒకనాడు పతనమైనా తిరిగి పైకి రావాలని కోరుకొంటే భగవంతుడు అంగీకరిస్తాడా ? అని సందేహం రావచ్చు.

చాలామందికి దేవుని గురించి తెలియక మీ భగవంతుడు పాపులని శిక్షిస్తాడు. మా ప్రభువు పాపులని రక్షిస్తాడు అని అమాయకులను ప్రలోభ పెడుతున్నారు. తప్పుదారి పట్టిస్తున్నారు.

పతనమైన వ్యక్తిని శిక్షిస్తాడా ? దండిస్తాడా ? వదిలేస్తాడా ? హింసిస్తాడా? గత చరిత్రని మనం ఒకసారి తిరగవేస్తే ఒకనాడు పతనమైన ఎందరో పాపులు కూడా భగవంతుని పట్ల కాస్త అనుకూల బుద్ధిని కలిగించుకొని తిరిగి పావనులుగా, పవిత్రమూర్తులుగా ఎదిగిన సన్నివేశాలు కోకొల్లలుగా ఉన్నాయి. “ **పావిష్టః క్షత్రబంధుశ్చ పుండరీకాక్షశ్చ పుణ్యకృత్ ’ ఆచార్యవత్తయా ముక్తాః** ” వారికుండే ఒకే విశ్వాసంచేత, ఆచార్యానుగ్రహంచేత ఒకనాడు పాపులైనా, వారు తిరిగి భగవదనుగ్రహం పొందారని పురాణాలు చెప్తున్నాయి. భగవంతుడు ఆ రకంగా తీర్చిదిద్దిన సన్నివేశాలు ఎన్నో మనం గమనించవచ్చు.

అయినా మనిషన్నాక ఏదో ఒక కారణం చేత పడుతూ ఉంటాడు. లేస్తూ ఉంటాడు. అసలు ఈ ప్రకృతి స్వభావమే జార్చేది కదా ! నూనెలో నిల్చున్న వాడికి జిడ్డు ఎలా అంటుకోక తప్పదో అలా ఈ ప్రకృతిలో ఉన్న వ్యక్తికి పాపములు అంటక తప్పవు. దోషములు చేయక మానడు. అయితే

మంచి, చెడుల్లో ఏది ఎంత శాతం చేస్తాడు అన్నదాన్ని బట్టి ఆ వ్యక్తిని మనం మంచిగానో, చెడుగానో నిర్ణయం చేస్తాం. ఈ విషయాన్నే చెప్పింది సీతమ్మ శ్రీరామాయణంలో.

యుద్ధంలో శ్రీరామచంద్రుని విజయవార్త సీతమ్మతో చెపుదామని వచ్చాడు హనుమ. అక్కడ ఆమెని ఏడిపించిన రాక్షస స్త్రీలను చూడగానే కోపంతో ఓ పట్టు పట్టాలనిపించింది. అమ్మని అనుజ్ఞ అడిగాడు. వాళ్ళు వాళ్ళ రాజాజ్ఞ పాటించారే తప్ప, తనపై ప్రత్యేక శతృత్వంతో దోషం చేయలేదు కదా వదిలిపెట్టేయ్, అంటుందమ్మ.

అయినా హనుమ సీతమ్మపట్ల వాళ్ళ అనుచిత ప్రవర్తనకి శిక్షించాల్సిందేనన్నాడు. దానితో హనుమని శాంతింప చేయడానికని సీతమ్మ, " హనుమా ! ఈ భూమ్మీద పుట్టి అపరాధం చెయ్యనివారుంటారా ? **' న కశ్చిత్ న అపరాధ్యతి '** అని అడిగింది.

వెంటనే నేను తప్పు చేశానా ? అన్నాడు హనుమ.

" ఆనాడు రాముడు చూసి రమ్మంటే రావణుని పుత్రుల్ని, లంకను కాల్చడం, ఇతర రాక్షస వీరులను చంపడం ప్రభువాజ్ఞను అతిక్రమించినట్లు కాదా ? ఇప్పుడు నిరపరాధులైన రాక్షసస్త్రీలను శిక్షించాలనుకోవడం నీవు చేస్తున్న దోషమే కదా ! "అంది సీతమ్మ. ' మరి నువ్వు తప్పు చేశావామ్మా!' అడిగాడు హనుమ. నేనూ తప్పు చెయ్యబట్టే కదా శిక్ష అనుభవిస్తున్నది. నేను చేసిన చిన్న, పెద్ద తప్పులు ఉన్నాయి.

నన్ను అడవికి తీసుకొని వెళ్ళనన్నాడని " పురుషరూపంలో ఉన్న స్త్రీ మూర్తివి నువ్వు " అంటూ ఒకనాడు నేను సాక్షాత్ రాముడినే నిందించానయ్యా ! ఇది ఒక తప్పు. మరొకనాడు అడవిలో నాకు రక్షణగా నిలిచిన భాగవతోత్తముడైన లక్ష్మణుని నిందించాను. అది మరీ పెద్ద తప్పు అన్నది సీతమ్మ. ' మరి రామయ్య కూడా తప్పుచేశాడామ్మా ?' అడిగాడు హనుమ. అసలు ఇదంతా జరిగింది ఆయన వల్లనే కదా ! మాయావి అయిన శూర్పణఖ వచ్చి ' వరించాను ' అంటే, అవుననో కాదనో చెప్పక నా తమ్ముడు నాకంటే అందగాడు, పైగా ప్రస్తుతం భార్య దగ్గరలేదు అతనిని అడుగు " అంటూ పరిహాసమాడాడు. ఆ పరిహాస ఫలితమే కదా నా ఈ "చెర " అంటూ చెప్పింది. ఇక వారు, వీరు అని లేదు హనుమా ! ఈ భూమి మీద పుట్టిన ప్రతివ్యక్తి, ప్రకృతి ప్రభావానికి లోనై ఏదో ఒక దోషం చేస్తూనే ఉంటాడు. మరి రామచంద్రుడు మర్యాదా పురుషోత్తముడు కదా ! అంటే, అవును. **' ఏకో హి దోషః గుణ సన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః'** చంద్రుడు చాలా ఆహ్లాదకరుడు, లోకానికికంతటికి చల్లని కాంతిని అందించేవాడు. ఆయనలో కొన్ని మచ్చలున్నాయి. అయినా ఆయనలో ఉండే కాంతి ఆధిక్యంచేత ఆ మచ్చలు పెద్దగా పట్టించు కోదగినవిగా అన్పించవు. అలాగే మానవులలో అసలు దోషం లేకపోవడమన్నది లేదు. ఎక్కువ శాతం సుగుణాలుంటే కొద్దిగా దోషాలున్నా అలాంటివారిని మంచివారుగానే వ్యవహరించడం జరుగుతుంది. రామునిలో మంచిగుణాలు చాలా ఎక్కువశాతం ఉన్నాయి. కాబట్టి ఒక చిన్న దోషమున్నా పట్టించుకోక పురుషోత్తముడన్నారు.

సరే ! దోషాలు చేయడం మనిషికి సహజమే అంగీకరించవచ్చు కానీ, దోషాలు చేసినవారు క్షమించమని ప్రార్థిస్తే భగవంతుడు అంగీకరించి క్షమించగలుగుతాడా ? పైగా క్రితం వారం శ్లోకంలోనే " సమో2హం సర్వబూతేషు న మే ద్వేష్యో2 స్తి న ప్రియః " అంటూ నేను అన్ని ప్రాణుల విషయంలోనూ సమానంగానే ఉంటానని, తనకిష్టులు కాని, ద్వేషింపదగినవారుగానీ ప్రత్యేకించి ఉండరని చెప్పాడు కదా ! అయితే

తప్పు చేసిన వారి పట్లా, చేయని వారి పట్లా ఒకలానే ఉండగలడా ?

' సమో 2 హం " అంటూ తాను " సమవర్తిని " అని చెప్పుకున్నాడు. 'సమవర్తి' అని యమధర్మ రాజుకి పేరు. ఆయన జీవుల కర్మలననుసరించి వారిని స్వర్గనరకాది లోకాలలో పడవేస్తూంటాడు. అంటే పరమాత్మ కూడా యమునిలాగే దోషుల్ని శిక్షించి, మంచివారిని మాత్రమే రక్షిస్తాడా ? అన్న సందేహాలు వస్తాయి. వాటికి సమాధానం ఈ శ్లోకంలో చెప్తున్నారు. తెలిసో తెలియకో దోషాలు చేసినా అవి చిన్నవైనా, ఘోరమైనవైనా, పశ్చాత్తప్తుడై భగవద్విషయంలో కాస్త అనుకూలత కలిగియుండి ప్రార్ధిస్తే రక్షిస్తానని చెపుతున్నాడీ శ్లోకంలో.

సదాచారుడు అంటే చెయ్యాల్సినవి చేసేవాడు, చేయకూడనివి మానేవాడు అని అర్థం. దురాచారుడు అంటే చేయాల్సినవి చేస్తూనే ఉంటూ వాటితోపాటు చేయకూడనివి కూడా చేస్తూ ఉండేవాడు.

ఇక " సుదురాచారుడు " అంటే కల్తీ లేని (మంచి ఏమాత్రం కలవని) దురాచారుడు అన్నమాట. అంటే చేయకూడనివి చేస్తూ ఉంటాడు. నిజంగా తను చేయాల్సినవి ప్రక్కన పెట్టేస్తుంటాడు. కొంతమంది చేయాల్సినవి మానేసినా, చేయ కూడనివి చేసినా, పాపం ! మనసులోనైనా కొంచెం సంకోచపడుతూ, బాధపడుతుంటారు. కానీ, సుదురాచారుడికి అలాంటి బెంగ, సంకోచం, పాపభీతి ఆలోచనలో నైనా కలగవన్నమాట.

అలాంటి వారికి ఉదాహరణ శిశుపాలుడు. నిండు సభలో అగ్రపూజ నందుకుంటున్న కృష్ణతత్వానికి తలవంచలేదు సరికదా ! తిట్టిన తిట్టు తిట్టకుండా 100సార్లు తిట్టాడు. దురాచారం చేసాడు, తూలనాడాడు.

అయితేనేమి కోపంతోనో, ద్వేషంతోనో తిట్టినా " భజతే మాం అనన్యభాక్ " ఇంకే ఇతరధ్యాస లేకుండా నన్నే తలిచాడు కదా ! అనుకున్నాడు స్వామి ! ముక్తిని ప్రసాదించాడు. త్రికరణ శుద్ధిగా ఇతర చింతలు మనసులో

లేక తిట్టినవానికే ముక్తినిస్తే, ఇక నిజంగా పశ్చాత్తాపంతో స్వామిని ఆశ్రయించిన వారిని ఉద్ధరించకుండా ఉండగలడా?

అలాంటి వారికి మరోమంచి ఉదాహరణగా మన చరిత్రలో దక్షిణ భారతావనికి చెందిన ఆళ్వారు ఒకరున్నారు. ఆయన పేరే తొండరడిప్పొడి ఆళ్వారు. అంటే " భక్త అంఘ్రి రేణు ", అంటే " భాగవతుల పాదధూళిని" నేను అనే భావన కలిగి అదే తమ నామధేయంగా ధరించారాయన.

అంతటి భగవత్ జ్ఞానం, వినయసంపద కలగడానికి ముందు ఒక సన్నివేశం ఉంది. ఆయన శ్రీరంగక్షేత్రంలో ఉండే విప్రోత్తముడు. స్వామికి మాలలల్లి సమర్పించుకుంటూ జీవించేవారట. విధివశమో, కర్మవశమో ఒకనాడాయన స్త్రీలోలుడిగా మారిపోయారు. చేయవలసిన భగవంతుని కైంకర్యం మానివేసారు.సరికదా ! భగవంతునికి సంబంధించిన వస్తువులనే ఒక స్త్రీ కోసం అర్పించే స్థితికి కూడని పనులు చేస్తూ దిగజారారు.

అయితే, ఒకనాడు ఆ స్థితినుండి తెలివి తెచ్చుకుని తాను చేసిన తప్పుకి, పశ్చాత్తాపపడి పరమాత్మని ప్రార్థించారు. భగవంతుడు పతనమైన ఆయనని, దోషాలు కడిగి పరమపావనుడిగా మార్చాడు. లోకారాధ్యునిగా, ఆళ్వార్లలో ఒకరిగా తీర్చిదిద్దాడు. ఒకనాడు పతితుడే, కానీ పశ్చాత్తప్తుడై పరమపావనుడిగా మార్చబడ్డాడు. ఆయనే మనకందరికీ తెలిసిన విప్రనారాయణులు. ఇలా తాను పశ్చాత్తప్తుల్ని ఉద్ధరిస్తానని స్వామి ప్రతిజ్ఞ చేస్తున్నాడు. ఈ 9 అధ్యాయం 30వ శ్లోకం దాన్ని మనకి నిరూపిస్తోంది.

ఒకవేళ మనలో దోషాలుండవచ్చు. అలా అని మనం భగవంతుని చేరడానికి వెనుకంజవేయక్కరలేదు. మనం శ్రీ కృష్ణుని శ్రీ పాదాన్ని సేవిద్దాం. వాని అనుగ్రహంతో మనలోని దోషాలు తొలగించుకుందాం !! మంచి సంస్కారాలు పెంచుకుందాం !! **(గీతా జ్యోతి నుండి)**



పరిపూర్ణతకు మార్గం

- ఆంగ్లమూలం స్వామి చిన్మయానంద
- తెలుగునేత శ్రీమతి లక్ష్మి

మానవుని వ్యక్తిత్వంలో మనస్సు, బుద్ధి అనునవి సారం వంటివి. ఈ భౌతిక శరీరం, అవి పైన ధరించిన వస్త్రం వంటిది మాత్రమే. మనలోని మనోబుద్ధి ఉపకరణంయొక్క స్వభావ లక్షణాలు మనయొక్క సహజ సిద్ధములైన స్వభావాల మీద, చిత్తవృత్తుల మీద ఆధారపడి ఉంటాయి. ఇవే 'వాసనలు'. మతము, తత్త్వశాస్త్రము మానవుని వాసనల రూపురేఖలను సరిదిద్ధి, రూపుమార్చి తద్వారా అతడి వ్యక్తిత్వాన్ని సంస్కరించి, పునర్నిర్మించే శిల్పులవంటివి.

మానవ శరీర నిర్మాణంలో పంచ జ్ఞానేంద్రియాలు గవాక్షాల వంటివి. విషయమయమైన బాహ్య ప్రపంచపు ప్రేరేపణలు వీనిద్వారానే మనలో ప్రవేశిస్తాయి. కళ్లు రూపురేఖలను చూస్తే, చెవులు శబ్దాలను వింటాయి. నాసిక వాసనలను చూస్తే, నాలుక రుచులను ఆస్వాదిస్తుంది. చర్మం స్పర్శను గ్రహిస్తుంది. మనో బుద్ధులు ఈ ప్రేరేపణలకు స్పందించి కార్యరూపంలో వానికి జవాబులనిస్తాయి. ఈ కార్యాలు భౌతిక శరీరంలోని పంచ కర్మేంద్రియాలద్వారా అమలు పరచబడతాయి. ఈ విధంగా నిరంతరం మానవ శరీరంలో ప్రవాహంలాగ ప్రేరేపణలను గ్రహించటం, వానికి సరిపడు ప్రత్యుత్తరాలను అందించటం అనే వ్యవహారాలను "జీవన వ్యాపారం" అంటారు. ఈ వ్యవహారాలు అంతమై పోయినప్పుడు జీవం నశిస్తుంది.

మతం మానవునికి ఈ జీవన వ్యాపారంలో పరిపూర్ణము, ఆనందకరము, విజయవంతము అయిన జీవితం అనే గమ్యం చేరుకునే మార్గాన్ని చూపి, మనలను నడిపించే స్నేహితుడైన రక్షకభటుడి వంటిది. బాహ్యమైన విషయప్రపంచం ప్రకృతిపై ఆధారపడుతూ నిరంతరం మార్పు అనే ప్రవాహంలో కొట్టుమిట్టాడుతూ ఉంది. పరిసరాలలోను, పరిస్థితులలోను సంభవిస్తూ ఉన్న ఈ మార్పులయొక్క ప్రభావం సర్వజీవరాసులపైనా ప్రసరిస్తూ ఉంటుంది. సర్వజీవరాసులూ తమ పరిసరాలలోనూ, పరిస్థితులలోనూ సంభవిస్తూ ఉన్న ఈ మార్పులయొక్క ప్రభావానికి లోనౌతూ ఉంటాయి. తనను చేరుకునే ప్రతికూల ప్రేరేపణలకు, ప్రతిహతిచేసి, వానినుండి తన ఉనికిలో సౌమ్యత, శ్రావ్యత వెలికి తీయగల ప్రత్యేక సామర్థ్యం మానవుని కొక్కనికే ఉన్నది. ఈ పరిపూర్ణత అద్భుతమైన మనోబుద్ధి ఉపకరణం వల్లనే సాధించ వీలవుతుంది. జీవితంలోని సామాన్యావసరాల ప్రాభవానికి లొంగిపోకుండా ప్రపంచంతో ఆరోగ్యకరమైన సంబంధ బాంధవ్యాలు నిలుపుకోటానికి మనోబుద్ధి ఉపకరణాన్ని ఆరోగ్యకరంగాను, శక్తివంతంగాను ఉంచుకోవటం అత్యావశ్యకం. అంటే మన ఉద్వేగాలు పవిత్రంగాను, విచక్షణాజ్ఞానం సూక్ష్మంగాను, నిర్మలంగాను ఉండాలి.

మన జీవితానుభవాలను బట్టి చూస్తే, మనలోని మనోబుద్ధి ఉపకరణంయొక్క ప్రవృత్తిని అనుసరించే మనం, మనంగా ఆ ప్రత్యేక తీరులోనే ఉన్నామని తెలుస్తుంది. మన భావాలు దయ, జాలి, ప్రేమ, సౌకుమార్యాలతో నిండివుంటే మనం కూడా సహజంగా ప్రేమగా, దయామయులుగా ఉంటాము. మన విచక్షణాజ్ఞానం పదునుగాను ప్రకాశవంతంగాను ఉంటే మనం కూడా తప్పక తేజోవంతంగా ఉంటాము. మన పరిసరాలు, పరిస్థితులు మనకు ప్రతికూలంగా ఉండి మనసు చికాకుపరుస్తూ ఉన్నప్పటికి మనలోని ఉపకరణం ఆరోగ్యంగాను,

శక్తివంతంగాను ఉంటే బాహ్యశక్తులేవీ మనపై తమ ప్రభావం చూపి మనశ్శాంతిని, స్థిరత్వాన్ని, ప్రశాంతతను చెదరగొట్టలేవు. అటువంటి వ్యక్తి, తనను తాకి వెనుకకు పోయే ఉత్తుంగ తరంగాల తాకిడికి తట్టుకొని స్థిరంగా నిలిచే ఉన్నత దీపస్థంభంవలె నిశ్చలంగా నిలువగలడు. కాని ఈ సూక్ష్మోపకరణం సరిగా ఉపయోగింపబడక నిర్లక్ష్యంగా వదలి వేయబడినప్పుడు ఆ వ్యక్తి కూడా అపేక్షగా విడిచి వేయబడిన నావవలె జీవనసాగరంలోని సవాలులనే విపత్కర తరంగాల మధ్య ఇటు నటు విసరి వేయబడుతూ ఉంటాడు.

ఒక వ్యక్తియొక్క మనోబుద్ధి ఉపకరణ నిర్మాణ, కూర్పు అతడి వాసనలపైనే ఆధారపడి ఉంటాయి. ఈ వాసనలే ప్రధానంగా అతడి నుండి స్పందించే భావాలను ప్రతిచర్యల విధానాలను నిర్ణయిస్తాయి. అందువల్ల మన వాసనలు లేక ప్రవృత్తులు తేజోవంతంగాను, చురుకుగాను ఉన్నప్పుడు మన ఆలోచనలు కార్యాలు కూడా తేజోవంతంగాను, సృజనాత్మకంగాను ఉంటాయి. ఆ వాసనలే జడముగాను, అచేతనంగాను ఉన్నట్లయితే మన ఆలోచనలు, కార్యాలు కూడా ఎటువంటి ఫలాన్ని ఈయలేక నిర్జీవంగా ఉంటాయి. అందువల్ల మానవుని పురోభివృద్ధికి, విజయానికి, శాంతికి పరిష్కారం చూపే వ్యక్తిత్వ పునర్నిర్మాణం యావత్తు మన సహజ ప్రవృత్తులను వికసింపజేసికో గలగటంపైనే ఆధారపడి ఉంది. మన ప్రకృతిని అద్దంలో వలె ప్రతిబింబింపజేసి, బాహ్య విషయాల స్వభావాలను తెలుసుకునే విద్య నేర్పి, మనసును మనం వికసింపజేసుకునే విధానాన్ని మతం తెలుపుతుంది. ఆవిధంగా వాసనలను పరిశుద్ధపరచి, సంస్కరించటం ద్వారా మనోబుద్ధి ఉపకరణం సమశృతితో పరిపూర్ణతను సంతరించుకుటుంది. అటువంటి ఉపకరణాన్ని కలిగివున్న వ్యక్తి బాహ్య ప్రపంచంలోని సవాళ్లను ఎదుర్కొని వానిని విజయవంతంగా పరిష్కరించుకోగల శక్తిని కలిగి వుంటాడు.

అటువంటి వ్యక్తుల కలయికవల్లనే ఒక జాతి నిర్మించబడుతుంది. ఆ సంఘంలోని ప్రతివ్యక్తి మతప్రమాణగ్రంథాలు సూచించిన దారిలో నడచుటకు యావచ్ఛక్తినీ వినియోగిస్తూ తన వ్యక్తిత్వాన్ని పునర్నిర్మించుకున్నట్లయితే ఆ జాతి లేక సంఘం తేజోవంతమై తన ప్రభావాన్ని ప్రతి ఒక్కరిపైనా ప్రసరింపజేస్తుంది. అందువల్ల మనను మనం మేల్కొలుపుకొని, మన జాతిని పునరుద్ధరించుకుందాము.

(జీవజ్యోతి KINDLE - LIFE నుండి)

అపూర్వావకాశము

మహారాష్ట్ర అతిముఖ్య భక్తులలో అగ్రగణ్యుడైన **శ్రీ భక్త తుకారాం గారు** “ కొన్ని వేల అభంగాలను **“గాథ”** అనుపేర రచించారు. ఇవి మహారాష్ట్ర సాహిత్యంలో సుప్రసిద్ధము.

అట్టి అభంగములలో కొన్నింటిని తీసుకుని పూజ్యశ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు మూలము, ప్రతిపదార్థం, తాత్పర్యం, విపుల స్వకీయ వ్యాఖ్యతో **“ శ్రీ భక్త తుకారాం అభంగవాణి ”** అను పేరిట అనువదించారు. వారి వ్యాఖ్య చాల విపులంగా బహు పరిశ్రమతో కూడుకొనియుంది. పేజీల ఇట్టి గ్రంథం 1 /8 డెమ్మీ సైజులో శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారిచే ప్రచురించబడినది. చాల విశేష వ్యాఖ్యతో గూడిన గ్రంథాన్ని ప్రతివారు చదివి శ్రీ తుకారాం బాబాగారి హృదయాన్ని అర్థం చేసుకొని నిజ జీవితంలో ఆచరించాలి. వెల రూ. 200/–లు మాత్రమే.

ప్రతులకు : శ్రీ శుకబ్రహ్మాశ్రమం, స్వామి విద్యా ప్రకాశానందనగర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమం, (పోస్టు), శ్రీకాళహస్తి – 517640, ఆంధ్రప్రదేశ్, అను చిరునామాకు పైకం పంపండి.

కథాత్మక గీతాసూక్తులు

– ఆచార్య డా ॥ కె. సర్వోత్తమరావు, తిరుపతి

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతోభయాత్

ఈ గీతావాక్యం సాంఖ్యయోగమనే రెండవ అధ్యాయంలోని నలభైయవ శ్లోక ఉత్తరార్థం.

" ధర్మము ఒకెంతయైనను గొప్ప భయము నుండి కాపాడును." అని వాక్యసారము.

హైందవమతంలో ధర్మశబ్దానికి వ్యాప్తి ఎక్కువ. " ధారణాత్ ధర్మ మిత్యాహుః " – సర్వాన్ని భరిస్తుంది కనుక ధర్మం. " ధరతి విశ్వమితి ధర్మః" ప్రపంచాన్ని ధరించేది కనుక ధర్మం, " ధర్మం చర " అని వేదం. " ధర్మమేవ జయతే ", " ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా ". " ధర్మస్య తత్త్వం నిహితం గుహాయామ్ ", " ధర్మేణ హీనాః పశుభిః సమానాః" " గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్ ", " ఆచారః పరమోధర్మః", "ధర్మో ధారయతి ప్రజాః", " రామో విగ్రహవాన్ ధర్మః", " అహింసా పరమోధర్మః" " ఆచార ప్రభవో ధర్మః" – మొదలయినవి.

గీత తొలి శ్లోకం ' ధర్మ' శబ్దంతో మొదలవుతుంది. ధృతి, క్షమ, దయ , శమ, శౌచ, ఆస్తేయం, ప్రజ్ఞ, జ్ఞానం, సత్యం, అక్రోధం అనేవి ధర్మ లక్షణాలు.

ధర్మాలు అనేకరకాలు. వాటిలో సర్వశ్రేష్ఠం సత్యధర్మం. ఈ ధర్మాన్ని ఉపనిషత్కాలంలో పాటించినవాడు జాబాల సత్యకాముడు. జాబాల ఒక పరిచారిక. ఆమె ఒక బ్రాహ్మణునిపట్ల ఆకర్షితురాలయింది. వారెన్నో

మాట్లాడుకొన్నారు గాని జాబాల ఆ బ్రాహ్మణుని కులగోత్రాదులడుగలేదు. అయినా కొంత కాలానికి కుమారుని ప్రసవించింది. పెంచి పెద్ద చేసింది. తగిన గురువు దగ్గరికి పంపాలనుకొంది. ఆ రోజులలో గౌతముడు మేటి గురువు. తన కుమారుని గౌతముని దగ్గరికి వెళ్ళమంది. తండ్రి ఎవరు అని అడిగితే జాబాల అనమన్నది. సత్యకాముడు వెళ్లాడు. గురువుకు నమస్కరించాడు. గురువు గోత్రాదులు అడిగితే ' జాబాల ' అని మాత్రమే అన్నాడు. శిష్యులు గుసగుసలు పోయారు. తనకు తెలియదన్నాడు. తన తల్లి చెప్పమన్నదానినే మాటి మాటికి చెప్పాడు. గౌతముడు సత్యకాముని శిష్యునిగా చేర్చుకొన్నాడు. శిష్యులు గురువును ప్రశ్నిస్తే బ్రాహ్మణేతరుడు సత్యాన్ని పలుకలేడు. నిజాన్ని పలకడం బ్రాహ్మణనైజమన్నాడు. సత్యకామునికి గౌతముడు అన్ని విద్యలు నేర్పాడని ఛాందోగ్యోపనిషత్తు కథ.

సత్యం నిత్యం. సత్యం ఏనాడయినా బయటపడుతుంది. సత్యాన్ని సత్యంగా చెప్పడమే ధర్మం. ఈ ధర్మాన్ని సత్యకాముడు పాటించాడు. గురువు దగ్గర అబద్ధం చెప్పలేదు. అబద్ధం చెప్పడం వల్ల ప్రాప్తించే నరకభయం నుండి కాపాడబడ్డాడు. ఆలాగే ఎన్ని ఇబ్బందులు వచ్చినా హరిశ్చంద్రుడు సత్యనిష్ఠ వీడలేదు.

రంతిదేవుడు దానశీలుడు. సమస్తం దానం చేశాడు. చివరకు తినడానికి ఏమీ లేకపోయింది. నలభై రోజులపాటు ఉపవాసమున్నాడు. చివరకు కెంచెం అన్నం సమకూడింది. రంతిదేవుడు ఆరగించడానికి సిద్ధమయిన వేళ ఒక అతిథి వచ్చాడు. ఆ అతిథిని సంతృప్తిపరచాడు. తదనంతరం నాల్గవ జాతివాడు వచ్చాడు. ఆపై చండాలుడు. తదనంతరం కుక్క అందరిని సంతృప్తిపరచాడు. బ్రహ్మాది దేవతలు సాక్షాత్కరించారు. రంతిదేవుడు తన మనసెపుడూ విష్ణుభక్తి పూర్ణమై ఉండాలని

కోరుకొన్నాడు.

ఈ కథలో రంతిదేవుడు చేసింది దానకర్మ. ఈ దానం స్వల్పం కావచ్చు. కాని ఆకలిని, దాహార్తిని అణచే దానం సర్వశ్రేష్ఠం. విష్ణు చింతన ఉండగా నరకాది భయాలు లేవు.

' శిబి' ఒక చక్రవర్తి. ఆర్తత్రాణపరాయణత్వానికి పేరు పోయినవాడు. ఒకసారి ఇంద్రాగ్నులు శిబిని పరీక్షించాలనుకొన్నారు. ఇంద్రుడు డేగ అయ్యాడు. అగ్ని పావురమయ్యాడు. పావురాన్ని తరుముకొని వచ్చే డేగలాగా వచ్చారు. పావురం శిబిని ఆశ్రయించింది. శిబి అభయమిచ్చాడు. డేగ ' పావురం నా ఆహారం. ఇది భగవదాదేశం. పావురాన్ని వదలిపెట్ట'మంది. శిబి వీల్లేదన్నాడు. అలాగయితే నాకు ఆహార మేలాగ అని డేగ ప్రశ్నించింది. తన దేహంలోని మాంసాన్ని పావురం బరువంత కోసి యిస్తానన్నాడు శిబి.

ఏమయితేనేం ? ఒప్పందం కుదిరింది. సేవకులు త్రాసు తెచ్చారు. ఒక వైపు పావురం. శిబి తన ఊరువు మాంసం కోసి వేశాడు. తూగలేదు. ఇంకా కోసి వేశాడు. అయినా లాభం లేకపోయింది. చివరకు తానే కూర్చోన్నాడు. శిబి చక్రవర్తి ఆర్తత్రణ పరాయణత్వానికి దేవతలు జేజేలు పలికారు.

ఈ కథలో పావురాన్ని కాపాడడం ఆర్తజనరక్షణ ధర్మం. ఈ ధర్మం చిన్నదిగా కనిపించవచ్చు. కాని పక్ష్యాదులకు సంబంధించింది కావడంవల్ల విశిష్టం. ఈ సందర్భంలో రాజధర్మం, మానవత్వం పాటించకపోతే ' రాజ్యాంతే నరకం ధ్రువమ్ " అనడం సార్థకమయ్యేది.

బౌద్ధంలోనూ 'శిబి' నాయకుడున్నాడు. అతడు గణతంత్రానికి అధిపతి. దానశూరుడు. ఎందరో వచ్చి శిబిని అర్థించి వెళుతున్నా

శిబికి మాత్రం ఒక కొరత వుంది. పెద్ద దానాన్ని అడిగి తన్ను సంతృప్తిపరచడం లేదని శిబి చింత. అతని చింతేమిటో శక్రునికి తెలిసింది. అంతే ఆ శక్రుడు వృద్ధుడయ్యాడు. శిబి దగ్గరికి వెళ్లి తనకు ఒక నేత్రం కావాలన్నాడు.

శిబి వచ్చిన వానిని తేరిపార చూచాడు. 'నిన్నెవ్వరు ఇక్కడికి పంపారని' ప్రశ్నించాడు. ఇంద్రుడే పంపించాడని బదులిచ్చాడు వృద్ధుడు. శిబి దానానికి సిద్ధమయితే కొందరు వారించారు. కార్పణ్యదోషం వస్తుందని శిబి రెండు నేత్రాలు ఇచ్చాడు. వృద్ధుడు వెళ్లిపోయాడు.ః

శిబికి నేత్రస్థానంలో వ్రణాలు ఏర్పడ్డాయి. క్రమంగా ఆ వ్రణాలు నయమవుతుంటే ఇంద్రుడే వచ్చాడు. శిబిని చూచి వరం కోరుకోమన్నాడు ఇంద్రుడు. అపుడు శిబి ' నాకు ధనసంపత్తి ఉంది. బలమైన సైన్యం ఉంది. అంధత్వం వల్ల మరణం కోరుకొంటున్నాను. వచ్చినవారు అడిగితే ఇచ్చేవాణ్ణి. కాని వారి కన్నులలో ప్రకాశించే ప్రీతిని చూడలేకపోతున్నా. అందుకే మరణం కోరుకొంటున్నా, అన్నాడు శిబి. 'యాచకులవల్ల కదా ఈ దురవస్థ' అని అంటే, వారి ఆశీర్వాదం నిజమయితే ఒక కన్ను వచ్చుగాక ! అన్నాడు.

శిబి ఒక కంటికి చూపు వచ్చింది. వెన్వెంటనే నన్ను యాచించినవాడు ఒక కన్ను కోరితే, రెండు నేత్రాలు ఇవ్వడమే నిజమయితే, రెండవ కన్ను కూడా వచ్చుగాక ! అన్నాడు. అలాగే రెండవ కంటికి చూపు రానే వచ్చింది. ఈ పరిణామానికి ప్రకృతి పులకించింది. ఇంద్రుడు 'సాధు సాధు ' అంటూ కదిలాడు.

ఈ కథలో 'దాన ధర్మం ' ప్రధానం. సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్'. కనుక నయనప్రదానం ఉత్కృష్టం. ఇచ్చినందుకు

బాధపడకుండా సంతసించడం మరో వింత. ఇది సత్యక్రియ. ధర్మమాహాత్మ్యానికి భారతీయ హృదయం ఇచ్చిన మహోన్నతస్థానం. అసత్యవాదిత్వం వల్ల కలిగే భయాన్ని దూరంచేసి స్వస్థుడు కావడం విశేషం.

భారతంలోని కౌశికుని కథలో రెండు రకాలయిన ధర్మాల సంఘర్షణలున్నాయి. మొదటిది అతిథి సేవ. రెండవది పతి సేవ. రెండూ పతివ్రతకు భిన్న సమయాలలో ఒకే పరీక్ష పెట్టిన సన్నివేశాలు. పతిసేవ చేసి అతిథి సేవకు సిద్ధమయిన వేళ కౌశికుడు కోపగించాడు.

'నేనేమీ నీ కోపానికి కొమ్మనుండి కిందపడే కొంగను కానులే' అనగానే కౌశికుడు అదరిపోయాడు. ఒక ధర్మానికి ప్రాధాన్యమిచ్చి రెండవ దానిపట్ల ఉపేక్ష ప్రదర్శిస్తే స్త్రీధర్మ వ్యతిరేకమవుతుంది. కౌశికుని పట్టించుకోకపోతే బ్రాహ్మణుని, అతిథిని తృణీకరించినట్లవుతుంది. ఈ రెండు భయాలనుండి కాపాడుకొన్న శ్రేష్ఠ పతివ్రత.

మహాభారతంలో లిఖితుని కథ శాంతిపర్వంలో ఉంది. శంఖుడు, లిఖితుడూ ఇద్దరు సోదరులు. విప్రవరులు, బాహుదా నదీతీరవాసులు. ఒకరోజు లిఖితుడు అన్న లేని సమయంలో అన్న ఆశ్రమానికి వచ్చాడు. ఆ ఆశ్రమంలోని పళ్ళను ఆరగించాడు. శంఖుడు రానే వచ్చాడు. ఎవరూ లేని వేళ రావడం, అడగకుండా పళ్ళు తినడం నేరమన్నాడు. ఈ ఆశ్రమం నదీతీరమయినా ప్రభువే పాలకుడు. ప్రభువు శిక్షకుడు. అందువలన రాజు దగ్గర తాను చేసిన తప్పు చెప్పి శిక్ష స్వీకరించమని శంఖుడు చెప్పాడు. లిఖితుడు రాజు దగ్గరికి వెళ్ళాడు. దొంగతనానికి శిక్ష ఏమిటని అడిగాడు. చేతులు నరకడమని రాజు సెలవిచ్చాడు. ఆలాగయితే తన చేతులు నరకమన్నాడు. రాజు తగదన్నాడు. అయినా బలవంతంగా చేతులు నరికించుకొన్నాడు. శిక్షను అనుభవించి అన్న

దగ్గరకు వచ్చాడు. అపుడు అన్న బాహుదా నదిలో స్నానం చేసి రమ్మన్నాడు. లిఖితుడు స్నానం చేస్తే తిరిగి చేతులు వచ్చాయి.

ఈ కథలో' ' శిక్షాధర్మం ' ప్రధానం. ఈ ధర్మపాలనలో అన్న, తమ్ముడనే తేడా లేదు. ఆలాగే రాజు ప్రత్యేకంగా రాయితీలు ఇవ్వరాదు. తాను శిక్ష అనుభవించక పోతే నరకంలో శిక్ష తప్పదని లిఖితుడు భావించాడు. రాజ్యపాలనంలో ప్రజలు అర్థం చేసుకొని సహకరించడమవసరం.

మాధవవర్మ ఒకరాజు. ధర్మాత్ముడు. ధర్మపాలన పట్ల స్వపరభేదం లేదు. ఒకసారి రాజకుమారుడు రథమెక్కి వేగంగా వెళుతుంటే ఆ రథంకిందపడి ఒక బాలుడు చనిపోయాడు. రాజకుమారుడు పట్టించుకోలేదు. ఆ పిల్లవాని తల్లి రాజుకు ఫిర్యాదు చేసింది. రాజు ఆలోచించాడు. చింతచిగురు అమ్ముకొంటూ ఒక్కగా నొక్క కొడుకును గారాబంగా చూసుకుంటూ జీవితం వెళ్ళబుచ్చుకొనే తనకు తగిన న్యాయం సమకూర్చమని ప్రాధేయపడింది.

రాజు ఫిర్యాదును, ఫిర్యాదులోని న్యాయం ఆలోచించాడు. చివరకు కొడుకుదే తప్పని గ్రహించాడు. ' ప్రాణానికి ప్రాణమే ' అని భావించాడు. రాజుగా శిక్ష అమలు చేయదలచుకొన్నాడు. తానే రథం ఎక్కాడు. పిల్లవాని ప్రాణం పోయినచోట కుమారుని పడుకోబెట్టాడు. తానే రథం తోలాడు. ప్రజలు కన్నీళ్ళెట్టుకొన్నారు. అపుడు దేవతలు ధార్మిక దృష్టికి సంతసించి సువర్ణవృష్టి కురిపించారట. (ఈ కథ లేపాక్షి దేవాలయం ముఖమండప వర్ణ చిత్రాలలో చిత్రితం) ఈ కథలో ధార్మిక భీతితో కర్తవ్యం నెరపిన రాజు మహోన్నతుడు.

నేహాభిక్రమనాశో2 స్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్



శ్రీ భక్త తుకారాం అభంగవాణి

- శ్రీ బ్రహ్మవిద్యానందగిరిస్వాములవారు

శ్లో ॥ తీర్థాన్యనుసరన్ధీరః శ్రద్ధధానః సమాహితః ।
కృతపాపో విశుద్ధ్యేత కిం పునః శుద్ధ కర్మకృత్ ॥

అర్థము : ఎవడు ఏకాగ్రచిత్తుడై, శ్రద్ధాయుక్తుడై, తీర్థయాత్రలు చేయగల ధైర్యవంతుడై తీర్థములను సేవించునో - అతడు పూర్వము పాపాచారియైనను తీర్థ సేవనముచే పునీతుడగుచున్నాడు. ఇక శాస్త్ర విహిత శుద్ధకర్మలు చేయువాడు పునీతుడు కాగలడని వేఱుగ చెప్పవలెనా? (కైముతికన్యాయము).

శ్లో ॥ కామం, క్రోధం చ లోభం చ యో జిత్వా తీర్థమావిశేత్ ।
న తేన కించిదప్రాప్తం తీర్థాభిగమనాద్భవేత్ ॥

అర్థము : ఎవడు కామమును, క్రోధమును మరియు లోభమును జయించి తీర్థమును ప్రవేశించునో నతనికి తీర్థయాత్రచే నేవస్తువు గూడ యలభ్యముండదు. (అన్నియు లభించునని భావము).

శ్లో ॥ అన్యత్ర హి కృతం పాపం తీర్థమాసాద్య నశ్యతి ।
తీర్థేషు యత్కృతం పాపం వజ్రలేపో భవిష్యతి ॥
(స్కంద పురాణము - వైష్ణవ ఖండము, మార్గశీర్ష మాహాత్మ్యము 17-17)

అర్థము : అన్య స్థలములలో జేసిన పాపము తీర్థ స్థానమున నశించును. కాని తీర్థ స్థానములో జేసిన పాపము వజ్రలేపమగును. అనగా ప్రాయశ్చిత్తము లేనిదగును.

శ్లో ॥ గంగాది తీర్థేషు వసన్తి మత్స్యాః
దేవాలయే పక్షిగణాశ్చసన్తి ॥

భావోజ్ఝితాస్తే న ఫలం లభన్తే ।
తీర్థాచ్చ దేవాయతనాచ్చ ముఖ్యాత్ ॥
భావం తతో హృత్కమలే నిధాయ
తీర్థాని సేవేత సమాహితాత్మా ॥ (నారద పురాణము)

అర్థము : గంగాది నదులలో చేపలు నివసిస్తాయి. దేవ మందిరములలో పక్షిగణము నివసించును. అనునిటువంటి భక్తిభావ చిత్తరహితునకు తీర్థసేవనముచేతగాని, దేవమందిర నివాసముచేగాని యే విధమైన ఫలము లభించదు. అందువలన హృదయకమలమునందు భక్తి భావమును సంగ్రహించి, యేకాగ్రచిత్తుడై తీర్థ సేవనము జేయవలయును.

శ్లో ॥ తీర్థాని చ యథోక్తేన విధినా సంచరన్తియే ।
సర్వ ద్వంద్వ సహాధీరాః తే నరా స్వర్గగామినః ॥

అర్థము : ఎవడు యథోక్త శాస్త్రవిధిచే సంయమితుడై తీర్థయాత్రలు జేయునో, సంపూర్ణ ద్వంద్వమును సహించునాధీర పురుషుడు స్వర్గమునకు వెళ్ళును.

Sow an action reap a tendency
Sow a tendency reap a habit
Sow a habit reap a character
Sow a character reap a destiny
So destiny is in your own hands

ఒక కార్యము చేసినచో దానిచే సంస్కారమేర్పడును. సంస్కారముచే అలవాటుపడును, అలవాటుచే చరిత్ర ఏర్పడును, చరిత్రచే గమ్యము నిర్ణయింపబడును, కాబట్టి నీ గమ్యమునకు నీవే కారకుడవు.

Removing of immorality is the only way to immortality.

దుర్గుణములను పారద్రోలుటయే మోక్షమునకు సూటిబాట.



అక్క మహాదేవి అనుభవామృతం

తెలుగు సేత - డా ॥ శ్రీ కరిబసవరాజేన్ద్ర మహాస్వాములవారు

103. సద్గురునాథుడు శిష్యుని హితాన్ని కోరుతాడు. శిష్యునికి నియమ, నిష్ఠలనే చేతులలో ఇష్టలింగమనే ఆయుధమును ఇచ్చి కామ క్రోధాదులనే శత్రువులను జయింప చేస్తాడు. ఆవిధంగా నేను అక్కమహాదేవిని కామక్రోధాదులను జయించినాను. ఆ లింగమనే ఆయుధము నాలో వున్న అహకాంరాన్ని కూడా నాశనము చేసినది.

104. శరీరముయొక్క కష్ట, నష్టములను లింగధారణమూలకంగా గెలిచినాను. మనోచాంచల్యమును జ్ఞానముతో జయించాలి. జీవాత్మని జీవగుణములను శివానుభవముతో జయించాలి. అంతఃకరణము యొక్క అజ్ఞానమును సుజ్ఞానముతో గెలవాలి. యవ్వనములో స్వాభావికముగా అంగాంగములు పుష్టియై ఆకర్షణీయమై యుండును. ఇవి శరీర ఆకర్షణకు కారణమౌతాయి. శివుడు కామున్ని కాల్చి భస్మము చేసినట్లు నేను కూడా శివజ్ఞాన, శివధ్యానమనే అగ్నిలో కాముని కాల్చి ఆభస్మాన్ని నొసటలో ధరించితిని. ఆ భస్మము కాముని తలరాత మార్చింది. అయ్యా చెన్నమల్లికార్జున దేవా ! నా విన్నపాన్ని వింటావో, లేదో నేను మాత్రము నిన్నే స్తుతిస్తూంటాను. అయ్యా నీవు కరుణతో చూసినా, చూడకపోయినా నేను మాత్రము నీ రూపాన్ని నా కండ్లలో నింపుకుంటాను. అయ్యా నీవు అనుగ్రహించినా, అనుగ్రహించకపోయినా సదా నీ స్మరణలో ఆనందిస్తాను. నీవు మెచ్చు, మెచ్చకపో నిన్నే పూజిస్తాను. నిన్ను ఆరాధించిన సంతోషములో వుంటాను.

110. శివశరణులు జ్ఞాన క్రియలను సమన్వయంగా ఆచరిస్తారు.

జ్ఞానము పొందినామని గురు, లింగ జంగములను విడవక పూజించాలి. సంశయము తొలగి అఖండ జ్ఞానము కలిగినా అన్నీ బ్రహ్మ స్వరూపమని భావించినా, అన్యస్త్రీలను ముట్టకూడదు. మానవుడైనా, జ్ఞానియైనా లౌకిక నీతి నియమాలను పాటించాలి. " యత్రజీవః తత్రశివః " ఎక్కడ జీవుడు వున్నాడో అక్కడు శివుడున్నాడనే అద్వైత జ్ఞానము కలిగిందని కుక్క, పంది, పిల్లితో ఏకమై తినుటకు రాదు. అంతరంగ భావములో తన నిజస్వరూపమైన అద్వైత భావము కలిగినా బాహ్యములో అద్వైతమును ఆచరించకూడదు. సుజ్ఞాన, సత్ క్రియ, సునీతి మార్గములో నడిచేది. ప్రతి యొక్కరి కర్తవ్యము. జ్ఞానియైనా సన్మార్గములోనే నడవాలి. ప్రపంచము యొక్క నీతిని అనుసరించాలి.

115. సన్యాసి అంటే ప్రపంచముయొక్క అన్ని విషయాలను త్యజించిన వాడే సంన్యాసి. ఆ త్యాగమే సన్యాసదీక్ష. కేవలం కాషాయం ధరించి పేరు కొరకు సన్యాసి అయితే, సాధన లేకుంటే అది ప్రయోజనము లేదు. నాలుక రుచిని విడిచి సన్యాసి అయినానంటే చాలదు. నాలుకపైన తీపి వస్తువులను పెట్టినా మధురమని తెలియకుండా వుండాలి. స్త్రీని వ్యావహారికముగా విడిచిపెట్టడం సన్యాసికి ప్రథమ సోపానము. జాగ్రత్, స్వప్న, సుషుప్తులలో స్త్రీని స్మరించకుండా వుండడమే అంతిమ సన్యాసము. బట్టలను విడిచి దిగంబరుడైతేచాలదు. మనస్సు ఏ విషయముతోను ఆలోచించకూడదు. ఇటువంటి అర్థపూర్ణమైన సంన్యాసాన్ని పొందితే జీవనము పావనమౌతుంది.

116. వీరునకు ఎక్కడకుపోయినా భయముండదు. అతడు ఎవరికి భయపడడు. భీరువునకు ఎక్కడికి పోయినా భయమే. దాతకు అవగుణా లుండవు. ఎందుకనగా అందరి మంచిని కోరుతాడు. దయగల హృదయములో పాపముండదు. చెన్నమల్లికార్జునా ! నిన్ను నమ్మి ఇష్టలింగాన్ని ధరించి పరధనాన్ని, పర స్త్రీని విడిచిన వానికి భయము వుండదు. జనన మరణములు వుండవు.

శ్రీమద్భగవద్గీతా వైశిష్ట్యం

– ఆచార్య డా ॥ జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

భారత భాగవత రామాయణాలు భారతీయులకు అందునా హిందువులకు అత్యంత పవిత్ర గ్రంథాలు. భారతాంతర్భాగాలుగా రెండు పవిత్ర గ్రంథాలు భాసిస్తున్నాయి. అవి 1. భగవద్గీత, (2). విష్ణుసహస్రనామం. భగవద్గీత భారత భీష్మపర్వంలో 24వ అధ్యాయం నుంచి 42వ అధ్యాయం దాకా వ్యాపించి ఉంది. ఇది పద్దెనిమిది అధ్యాయాలతో కూడిన ఒక ప్రత్యేక గ్రంథంగా కూడా ప్రచారంలో ఉంది. దీనిలో 700 శ్లోకాలు ఉన్నాయి.

ధృతరాష్ట్రుడు, సంజయుడు, అర్జునుడు చెప్పిన శ్లోకాలు కూడా వీటిలో ఉన్నప్పటికీ శ్రీకృష్ణుడు చెప్పిన శ్లోకాలే ఎక్కువ. ధృతరాష్టుడు ఒకే ప్రశ్న వేశాడు. అర్జునుడు పలు ప్రశ్నలు వేశాడు. వ్యాసానుగ్రహం వల్ల సంజయుడు ధృతరాష్ట్రుడి ప్రశ్నకు సమాధానంగా కురుక్షేత్ర యుద్ధ రంగంలో జరిగే విషయాలన్నింటినీ చెప్పాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి ఆవేదనకు స్పందిస్తూ ఆయన ప్రశ్నలకు ప్రత్యుత్తరాలిస్తూ ప్రసంగించాడు. పార్థసారధి ప్రసంగంలో జ్ఞాన విజ్ఞానాలు ప్రభాసిస్తున్నాయి. ముముక్షువులకు కావలసిన అన్ని అంశాలు అందులో గోచరిస్తున్నాయి. కాబట్టి భగవద్గీతలోని తక్కిన ముగ్గురి పలుకుల కంటే కృష్ణుడి ప్రసంగమే ఆధిక్యత వహిస్తుంది. కృష్ణుడు తక్కిన అవతారాల్లో లాగా గాక విష్ణుమూర్తిగానే విరాజిల్లాడు.. భగవద్గీతలో కూడా భగవానుడుగానే ప్రసంగించాడు. అందువల్ల వ్యాసుడు, కృష్ణుడి ప్రసంగం వచ్చినప్పుడల్లా ‘ శ్రీ భగవానువాచ ’ అని రాశాడు. ఈ అంశాలన్నీ భగవద్గీత అనే

నామ సార్థక్యానికి దోహదం చేశాయి.

ఉపదేశ ధోరణిలో సాగిన ఇతర రచనలు కూడా అనేకం ఉన్నాయి. వీటిని గీతలని వ్యవహరిస్తారు. ఉత్తరగీత, ఉద్ధవగీత, అష్టావక్రగీత, అవధూత గీత, బుభుగీత, బ్రహ్మగీత, వసిష్ఠగీత, గణేశ గీత, హనుమద్గీత, పరాశరగీత, హారీతగీత, శివగీత, హంసగీత, భిక్షుగీత, కపిలగీత, దేవీగీత మొదలైనవి వాటిలో కొన్ని. ఎన్ని గీతలున్నప్పటికీ అనేక కారణాల వల్ల భగవద్గీత వాటిలో ఆధిక్యత వహించింది. ప్రాధాన్యత సంతరించుకొంది.

ఆశ్రమాల్లో భగవద్గీతను పారాయణం చేస్తారు. పారమార్థిక పథంలో పయనించే గృహస్థులు కూడా తమ ఇండ్లలో భగవద్గీతను పారాయణం చేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ముముక్షువులెవరైనా భగవద్గీతను పారాయణం చేసే పద్ధతి వాడుకలో ఉంది. ఇంతమాత్రం చేతనే మనం కూడా భగవద్గీతను అభిమానించాలా ? పారాయణం చేయాలా ? పూజించాలా ? వేరే కారణమేదైనా ఉందా ? ఒక్కసారి ఆలోచించుకోవడం సమంజసం. భగవద్గీతకు ఉన్న విశిష్టత ఏమిటి ? భగవద్గీతను పారాయణం చేయడానికే పరిమితం కావాలా ? ఇంతకంటే ముందుకు వెళ్ళేందుకు అవకాశమేదైనా ఉందా ? భగవద్గీత ఏమి చెబుతుంది ? భగవద్గీత చెప్పేదాన్ని మనం ఆచరణలో పెట్టాలా ? అలా ఆచరణలో పెడితే వచ్చే ఫలితమేమిటి ? ఆచరించకపోతే కలిగే నష్టమేమిటి ? ఇలాంటివన్నీ ఒక్కసారి ఆలోచించుకుంటే భగవద్గీత మీద ఒక మంచి అవగాహన ఏర్పడేందుకు వీలుంటుంది. ఆ అవగాహన వెలుగులో పురోగమిస్తే మనకు ఉన్నత స్థితి లభిస్తుంది.

మొదట భగవద్గీత మీద ఆసక్తిని, అభిమానాన్ని పెంచుకోవాలి. దానికి భగవద్గీత గొప్పతనాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించడం ఎంతైనా

అవసరం. భగవద్గీత గొప్పతనం గురించి తెలుసుకోవడానికి ప్రధానంగా నాలుగు ఆధారాలు కనిపిస్తాయి. వాటిలో మొదటిది శ్రీ మద్భగవద్గీతే. రెండవది గీతామాహాత్మ్యం వంటి పౌరాణికాంశాలు. మూడవది ప్రాచీనుల అభిప్రాయాలు. నాల్గవది ఆధునికుల అభిప్రాయాలు.

1. భగవద్గీత వెల్లడి చేసే అంశాలు :

గీత గొప్పతనానికి సంబంధించి భగవద్గీత వెల్లడి చేసే అంశాలను నాలుగు రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

(అ). శ్రీకృష్ణుడు చెప్పినవి (ఆ). అర్జునుడు చెప్పినవి (ఇ). సంజయుడు చెప్పినవి (ఈ). అధ్యాయాంత గద్య ద్వారా అభివ్యక్తమయ్యేవి. ఈ నాల్గింటిని గురించి తెలుసుకుంటే భగవద్గీత భగవద్గీతను గురించి ఏం చెబుతుందో మనకు చక్కగా బోధపడుతుంది.

(అ). శ్రీకృష్ణుడు చెప్పినవి : కృష్ణుడు అర్జునుడికి బోధించిన జ్ఞానం భగవద్గీత అంతా వ్యాపించి ఉంది. ఈ జ్ఞానమెంత గొప్పదో శ్రీ కృష్ణుడు అప్పుడప్పుడు అక్కడక్కడ తెలియజేశాడు. తాను ' నిష్కామ కర్మయోగ' పరిజ్ఞానాన్ని మొదట సూర్యుడికి తెలియజేశానన్నాడు. అతడు దాన్ని వైవస్వత మనువుకు బోధించాడన్నాడు. మనువు ఇక్ష్వాకు మహారాజుకు తెలియజేశాడన్నాడు. ఈ జ్ఞానం ఎన్నటికీ నశించేది కాదన్నాడు.

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ మవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవే2బ్రవీత్ ॥
(భగవద్గీత - 4-1)

అర్జునుడు తనకు భక్తుడు, స్నేహితుడు. కాబట్టి అత్యంత ప్రాచీనము, రహస్యము, ఉత్తమము అయిన ఈ యోగాన్ని అర్జునుడికి బోధించినట్టు కృష్ణుడు చెప్పాడు.

స ఏవాయం మయాతేద్య యోగః ప్రోక్తః పురాతనః ।

భక్తో 2 సి మే సఖాచేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ (4 - 3)

ఎటువంటి సందేహానికి ఆస్కారం లేకుండా భగవంతుని గురించి సంపూర్ణంగా తెలుసుకోవచ్చు. దానికి కావలసిన జ్ఞానాన్ని అర్జునుడికి తాను బోధించబోతున్నట్టు కృష్ణుడు చెప్పాడు.

అసంశయం సమగ్రం మాం యథాజ్ఞాస్యసి తచ్ఛృణు ॥ (7-1)

దేన్ని తెలుసుకుంటే మరేదీ తెలుసుకోవలసిన అవసరం ఉండదో అటువంటి అనుభవసహిత జ్ఞానాన్ని అందిస్తానన్నాడు.

జ్ఞానం తే2హం సవిజ్ఞాన మిదం వక్ష్యామ్యశేషతః ।
యద్జ్ఞాత్వానేహ భూయోన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥ (7-2)

దేనిని తెలుసుకుంటే అశుభాల నుంచి విడుదల పొందవచ్చో అటువంటి అనుభవ జ్ఞానంతో కూడిన అతి రహస్యమైన విజ్ఞానాన్ని బోధిస్తున్నానని కృష్ణుడు అర్జునుడితో మరొకచోట చెప్పాడు.

ఇదంతుతే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।
జ్ఞానం విజ్ఞాన సహితం యత్జ్ఞాత్వా మోక్ష్యసే2శుభాత్ (9-1)

ఈ బ్రహ్మజ్ఞానము విద్యలన్నింటిలోనూ శ్రేష్ఠమైంది. రాహస్యాల్లోకెల్లా పరమ రహస్యమైంది. అన్నిటికంటే గొప్పది. పవిత్రమైంది. ప్రత్యక్షంగా తెలుసుకోదగింది. ధర్మయుక్తమైంది. అనుష్ఠించడం చాలా సులభం. దీనికి నాశనం లేదు. ఇదే తాను బోధిస్తున్న గీతాజ్ఞానమని కృష్ణుడు తెలియజేశాడు. **(ఇంకా వుంది)**

చందాదారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరి పత్రిక సంవత్సర చందా రూ. 100/-లుగా (తప్పని పరిస్థితులలో) పెంచడమైనది. కాబట్టి సంవత్సర చందా నూరు రూపాయలు పంపవలెను.

గీతాగానం

- సి.కె.గోపాల్ (బళ్లారి)

1. తల్లీ భగవద్గీత ! మా యుల్లంములం దున నుండుము మాత ॥త॥
2. తెలివిమాలినీదెస జూడని మము, తులువల మనుచును దూరము సేయకు ॥ త ॥
3. మదమత్సరములు మదిలో, నిడుకొని, వదలితిమమ్మ నీ పద యుగళమును ॥ త ॥
4. నిన్ను భజించకయే కద మేమిటులెన్నో జన్మము లెత్తుచు నుంటిమి ॥త॥
5. జనన మరణముల చక్రము లోబడు, తనయుల నిపుడొక దారిని చేర్చుము ॥ త ॥
6. భ్రమకూపంబున బడినిను గాంచని మముగని తప్పులు మన్నింపగదే మాత ॥ త ॥
7. చేయూత నొసగి శిశువులమగు మము చేరదీసి నీ చెంతనే నిలుపుము మాత ॥ త ॥
8. అన్ని భూతముల యందు వెలింగెడి హరి గను నటుల మముదీవింపుము మాత ॥ త ॥
9. గీతా భక్తుల గీతము విని సంప్రీతిని శాంతిని నీవే దయచేయుము మాత ॥ త ॥

త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుకు వీరు పైకం పంపినారు

(1).	టి.లక్ష్మీ నర్సయ్య (నెల్లూరు)	రూ. 10,000/-
(2).	అన్నై నవమణి ట్రస్టు (గుట్టింగూడ) రంగారెడి జిల్లా	రూ. 20,000/-

వార్తలు

(01). 11-10-2015వ తేదీ ఆదివారం సద్గురు సర్వసేవా ట్రస్టు బోర్డు సమావేశం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది.

(02). నవంబరు నెల 22, 23, 24 తేదీలలో మూడు రోజులు శ్రీ శుకబ్రహ్మాశ్రమములో జప, ధ్యాన సాధన శిబిరము నిర్వహింపబడినది. ప్రతి రోజు మూడు గంటల సేపు సాధకులచే జపధ్యానాలు చేయబడినవి. జప ధ్యానాల గురించి పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారిచే మరియు పూజ్యశ్రీ ప్రణవాత్మా నందస్వాములవారిచే (శ్రీ ప్రమోద చైతన్య స్వాములవారిచే) ప్రతిరోజు రెండు పూటల ప్రవచనలు చేయబడినవి.

25- 11-2015 బుధవారం కార్తీక పౌర్ణమి నాడు గురుపాదుకలకు పూజ, నెల్లి (ఉసిరిక - ఆమలకం) చెట్టు క్రింద భోజనాలు ఏర్పాటు చేయబడినవి. వనభోజనాలలో సాధకులు, పుర ప్రముఖులు పాల్గొనినారు. నారాయణ సేవ జరిగినది.

(03). 28-11-2015 తేది శనివారంనాడు కృష్ణాజిల్లా మర్లపాలెంగ్రామంలో చాతుర్మాస్యవ్రత సమాప్తి సందర్భంగా పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, పూజ్యశ్రీ శివానందస్వాములవారు పాల్గొని అనుగ్రహభాషణ చేశారు.

(04). డిశంబరు 3, 4, 5 తేదీలలో గుంటూరు సమీపం నంబూరులోని శ్రీకాశీవనాశ్రమంలో జరుగు ఆశ్రమ స్థాపకులు పూజ్యశ్రీ హనుమత్ కాళీవర ప్రసాదబాబు గారి ఆరాధనోత్సవాలలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచనలు చేస్తారు.

(05). డిశంబరు 20,21,22 తేదీలలో తిరుపతిలో శ్రీ మలయాళ సద్గురు సేవా సమాజ వార్షికోత్సవంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు పాల్గొని ప్రవచనాలు చేస్తారు.

(06). 9-11-2015వ తేది మాసశివరాత్రి నాడు ప్రదోషకాలంలో ఆశ్రమ నర్మదేశ్వర మహాదేవునకు రుద్రాభిషేకం జరిగినది. 25-11-2015 తేది కృత్తిక సందర్భంగా ప్రదోషకాలంలో ఆశ్రమంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి షోడశోపచార అర్చన జరిగినది.

(07). 14-11-2015 తేది శనివారం త్రినేత్ర వైద్యాలయ ట్రస్టుబోర్డు సమావేశం జరిగినది.

(08). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో అక్టోబరు నెలలో **ఓ.పి.విభాగంలో 752 మందికి** కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **93 మందికి కంటి పొరలు** తీసి లెన్సు అమర్చబడినవి. **16 మందికి లేజర్ చికిత్స (కంటికి)** చేయబడినది. **2** గ్రామాలలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించబడినవి.

ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 48 డిశంబర్ 2015 సంచిక : 12

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1200/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

మానవుడు దివ్యుడు

"అమృతస్య పుత్రాః" అంటూంది వేదము. "అమృత పుత్రులు" ఆహా! ఏం మధుర వాక్కు. ఏం ఆశాజనక దివ్యనామం! సోదరులారా! యీ పేరులో - అమృత పుత్రులనే పేరులో మిమ్మల్ని పిలువనివ్వండి. నిజంగా హైందవులు మిమ్మల్ని పాపులనటానికి నిరాకరిస్తారు. మీరు భగవంతుని బిడ్డలు, అమృత సంతానం, శాశ్వతానంద భాగస్వాములు, పావనులు, పరిపూర్ణులు.

మీరు భూదేవతలు, మానవుణ్ణి పాపి అనటమే పాపము. అట్లా అనడం మానవస్వభావానికి అపకీర్తి, దూషణం, ఓ సింహాల్లారా! బయలుదేరండి. గొఱ్ఱెలమనే భ్రాన్తిని వదలండి. మీరు అమృతపుత్రులు. అమృత జీవులు. ముక్తాత్ములు. శాశ్వతానందమయులు. మీరు జడప్రకృతికాదు. శరీరాలు కారు. ప్రకృతి మీ దాసురాలు. అంతేగాని ప్రకృతికి మీరు దాసులు కారు.

– స్వామి వివేకానంద